దైవకార్యములను పోషించు వాడును, రాక్షసుల మాయను అంతమొందించు వాడును, సాగరమును గోష్పాద మంతటి జలముగ భావించి దాటినవాడును, అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

ఆదివిష్ణు సేవకాయ గూఢకార్య సాధకాయ సర్వలోక ప్రాణపుత్ర ॥వీర॥ 9

ఆద్యపురుషుడైన నారాయణుని దాసుడును, నిగూఢములైన కార్యములను సాధించిన వాడును, సమస్తలోకమునకు ప్రాణదాత యగు వాయుదేవుని కుమారుడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!35

సర్వరోగ నాశకాయ సర్వబంధ మోచకాయ వీతరాగ రూపకాయ ॥వీర॥ 10

సమస్త రోగములను పోగొట్టు వాడును, సమస్త బంధములను తొలగించు వాడును, అనురాగము నుండి విడిపడిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

రామభక్త వత్సలాయ భీమగర్వ భంజనాయ సర్వ దుఃఖ నాశకాయ ॥వీర॥ 11

శ్రీరామునకు ప్రియభక్తుడును, భీముని గర్వము నణచిన వాడును, సమస్త దుఃఖములను పోగొట్టు వాడును అగు వీరుడైన ఆంజనేయునకు శుభమగు గాక!

నిత్యశుద్ధ మానసాయ సత్యబద్ధ కర్మణాయ కామరూప ధారణాయ ॥వీర॥ 12

సదా పరిశుద్ధాంతఃకరణ గలవాడును, సత్యమార్గములో సదా చరించు వాడును, కామరూపవిద్య నెరిగిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

దాస తాప నాశకాయ దేవలోక వందితాయ రక్తమాల భూషణాయ ॥వీర॥ 13

దాసులైనవారి తాపములను పోగొట్టు వాడును, దేవలోక వాసులకు స్తవనీయుడును, ఎఱ్ఱని పూలమాలను ధరించిన వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగుగాక!

శాకినీ పిశాచ నాశ ఢాకినీ గ్రహాది నాశ క్షుద్ర దేవతా వినాశ ॥వీర॥ 14

శాకినీ మున్నగు పిశాచములను నశింపజేయు వాడును, ఢాకినీ మున్నగు గ్రహములను అంతమొందించు వాడును, క్షుద్ర దేవతలను మట్టుపెట్టు వాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

సీత దుఃఖ నాశకాయ పాపకర్మ భంజకాయ మాయ యంత్ర ఛేదకాయ ॥వీర॥ 15

సీతాదేవి యొక్క శోకమును పోగొట్టిన వాడును, పాపకర్మములను తొలగించు వాడును, మాయాయంత్రమును ఛేదించినవాడును అగు వీరుడైన ఆంజనేయునకు జయమగు గాక!

రామరూప పూజకాయ రామనామ కీర్తనాయ రామ సత్కథా ప్రసంగ ॥వీర॥ 16

రామరూపమును అర్చించువాడును, రామనామమునే కీర్తించువాడును, రామకథా ప్రసంగములను చేయువాడును అగు వీరుడైన ఆంజనేయునకు శుభమగు గాక!

యుద్ధకాండము





శ్రీరామ
జయరామ
జయ జయ రామ....



తొలకరి

జీవిత మొక పోరాటం
జీవన మొక ఆరాటం
పోరాటం లోనే ఆరాటం తీరుతుంది
ఆరాటాన్ని తీర్చేందుకే పోరాటముంది

అంతా పోరాటమే.
బ్రతుకంతా పోరాటమే.

యుద్ధం బ్రతుకుకు అద్దం లాంటిది.

ఇది యుద్ధకాండము

కదనరంగానికి చేరింది ఈ కాండములో కవికోకిల

యోధులు కాలేని వారు
యోగులు కాలేరని

పోరాటపటిమ లేని వారికి
ఇహపరాలు మిగలవని

కదన కాహళులను మ్రోగించింది
సమర సంగీతాన్ని మొరయించింది
పోరాటమే జీవికి ఊపిరి
పోరాడితేనే చిక్కింది ఊపిరి
పోరాటంలో దొరికిన ఊపిరి
ఉన్నంతవరకు
పోరాటంలోనే ఊగుతుంది. పోరాటంలోనే ఊరేగుతుంది.
తల్లి కొరకు విలపించడం పసిపాపలో పోరాటం
కాళ్ళుచేతులు కొట్టుకోవడం ఆ దశలో బ్రహ్మాస్త్రం

పోరాటంలో కదుల్తాయి కరచరణాలు
పోరాటాన్ని కదిలిస్తాయి అంతఃకరణాలు

బాహ్యంలో పోరాటాలకు
ఆంతర్యపు ఆరాటాలే కారణాలు
నిజానికి, అవియే నిత్యపోరాటాలు. సమర కవాటాలు.

ధర్మాధర్మాలకు
న్యాయాన్యాయాలకు
మంచిచెడులకు
సత్యాసత్యాలకు
నిరంతర సంఘర్షణయే సమరం.

ఇది విరమించను వీలుకాని యుద్ధం
సావధానంతో సాగాల్సిన సమరం

రామునికి దూరమై ఉంది సీత లంకలో
జీవికి దూరమై ఉంది శాంతి లోకంలో
సీత లేని రాముడు
శాంతి లేని జీవుడు

రాముడు దాటాడు సాగరం
మనం దాటాలి మోహసాగరం
అంతమయ్యారు రావణ కుంభకర్ణులు రాముని చేత
అంతం కావాలి రాగద్వేషాలు నీచేత, నాచేత

రాముని చేరిన సీతకు కాంతి
ఆత్మను చేరిన మనసుకు శాంతి

తీర్త్వా మోహార్ణవం హత్వా
రాగద్వేషాది రాక్షసాన్
యోగీ శాంతి సమాయుక్తః
ఆత్మారామో విరాజతే

మోహసాగరాన్ని దాటి
రాగద్వేషాది రాక్షసుల్ని మొట్టి
శాంతితో స్నేహం కట్టి
వెల్గొందాలి జీవుడు. అతడే ఆత్మారాముడు అని ఆదిశంకరులు.

దూరమైన దయిత
దగ్గరైతే సమత-రామునికి,
దూరమైన మమత
చేరువైతే సమత-జీవునికి,

మహినుండి పుట్టింది మైథిలి
మాయనుండి పుట్టింది మనోచెలి

ఆద్యంతాలు అర్థంగాని అయోనిజ
అయోమయంలో అల్లాడే మనసు మజా
మైథిలికి కష్టాలే నేస్తాలు
మనసుకి కన్నీళ్ళే రాస్తాలు.

దశకంఠుడు దూరమైతే సీతకు శాంతి
దశేంద్రియాలు దగ్గమైతే చిత్తానికి కాంతి

జయాపజయాల వింత మెలిక
రామరావణుల సంగ్రామమే ఇక

కొయ్యకు నిప్పు పెట్టేదేముంది?
కామికి ముప్పు నిలిపేదేముంది?

నిప్పు దహించేది కఱ్ఱనే
కామం దహించేది కామినే.

లంకలో అయినా
లోకంలో అయినా
కామికి మిగిలేవి కష్టాలే. కడగండ్లే.

పోవాలి కామం
రావాలి రామం

పట్టాభిషిక్తుడైతే రాముడు అయోధ్యారాముడు
సాక్షాత్కారమైతే జీవుడు ఆత్మారాముడు.

సర్వేషు రమన్తే ఇతి రామః
అందరిలో రమించే ఆత్మచైతన్యమే శ్రీరాముడు.
అందరూ రాముళ్ళు కావాలి

ఇదే వాల్మీకి ఆశయం
రామాయణ ఆదర్శం

ఆత్మ యనే రామునితో
మనసైన మైథిలి
హృదయమనే అయోధ్యలో కలిసిపోవడం
కలిసి ఉండడం
పట్టాభిషేకం. జీవికి వీడిన శోకం.
అదియే సాక్షాత్కారం
ఆత్మసాక్షాత్కారం.
ఇదే ఆదికవి అందించే అమరసందేశం. అమృతసందేశం.
సందేశాలు ప్రేరణ నిస్తాయి. ప్రేరేపిస్తాయి.
కాని ప్రవర్తించేది మనిషి. ప్రవర్తించాలి అది తెలిసి
ఉన్నదానిని ఆవిష్కరించేదే కావ్యం
లేనిదానిని అందించేది కాల్పనికం.
Religion awakens the Divinity already in man
మనిషిలో నిగూఢంగా ఉన్న దివ్యత్వాన్ని వెలికి తీసేదే మతం
అంటారు స్వామి వివేకానంద
అది ఎలాగో తెలిపేదే రామాయణం.
అదిగో రణం
ఇదిగో మరణం....జీవికి ఇవి తప్పవు.
అవి ఉండనీ అలా
స్మరణం సాగనీ ఇలా......
ఎలా! అలా....అలా.....కాదు.
ఇలా......ఇలా...... పదండి రంగానికి
జీవన రణరంగానికి

నామకవచంతో, రామఖడ్గంతో
జీవనపోరాటంలో
మీకు తోడుగా
మీవాడుగా
స్వామి సుందర చైతన్యానంద

చైతన్య రామాయణము

యుద్ధకాండము

అసమాన బహుమానం

సీతమ్మ రామునికి పంపిన సందేశమును వినిపించే ముందు, వాక్యజ్ఞుడైన వాయుపుత్రుడు సీతమ్మ ఉండే దక్షిణదిక్కు వైపు తిరిగి, శిరమోడ్చి, భక్తితో నమస్కరించాడు. ఎంత కోమలమైన భక్తి! ఎంతటి ధర్మనిరతి! మాటకు ముందే మనసును శుద్ధి చేసుకునే వృత్తి. సహజంగా జీవితంలో లభించిన ప్రవృత్తి. ప్రవర్తనలో ప్రవర్ధమానమైన ప్రపత్తి.

సీతమ్మను తాను ఎలా దర్శించింది, ఎలా భాషించింది, ఎలా ఓదార్చింది చెబుతూ తన ప్రియమైన వాక్కుల ద్వారా రాముని కూడా ఓదార్చాడు హనుమంతుడు. హనుమంతుని ద్వారా సీతమ్మ ప్రియవచనాలను ఆలకించిన రాముడు ఇలా పలికాడు.

"హనుమంతుడు నెరవేర్చిన ఈ కార్యాన్ని ఈ భూప్రపంచంలో అన్యులెవ్వరూ ఆచరించలేరు. కనీసం మనసులో కూడా ఊహించలేరు. గరుత్మంతుడు, వాయుదేవుడు, హనుమంతుడు తప్ప దుర్లభమైన ఈ కార్యాన్ని మరెవ్వరూ చేయలేరు.

"రావణుని లంకలో ప్రవేశించి ప్రాణాలతో తిరిగి రావడము అనితర సాధ్యము. రాక్షసులతో రక్షింపబడుతూ, ఎదిరించుటకు సాధ్యపడని లంకలో హనుమంతుడు తప్ప మరొకరు ప్రవేశించలేరు. భృత్యుడు చేయవలసిన రీతిలో హనుమంతుడు తన ప్రభువైన సుగ్రీవుడు అప్పగించిన కార్యమును సాధించాడు.

"ప్రభువు కష్టమైన కార్యభారమును అప్పగించినా, శక్తియుక్తులతో నిర్వహించి, ప్రభుకార్యమును అధికంగా సాధించువాడు ఉత్తముడు. సమర్థుడై ఉండి కూడా, ప్రభువు చెప్పిన దానిని మాత్రమే నిర్వహించి, అధికంగా సాధించుటకు ఎవడు ఉత్సాహమును చూపడో అతడు మధ్యముడు. సమర్థుడై ఉండి కూడా ప్రభువు చెప్పిన దానిని సరిగ ఆచరించకుండా కార్యమును పాడుచేయువాడు అధముడు.

"హనుమంతుడు ఉత్తముల కోవలోనివాడు. ఘనమైన కార్యాన్ని సాధించి సుగ్రీవుని సంతోష పరచాడు. నన్ను కాపాడాడు. ఎంతో ప్రియమైన, ప్రాణతుల్యమైన వార్తను తెచ్చి నాకు ఆనందాన్ని కల్గించాడు. ప్రియమైన వార్తను చెప్పి, నాకు సంతోషాన్ని కలిగించిన ఈ హనుమంతునికి తిరిగి ఎలా ప్రియం చేయాలో నాకు తెలియడం లేదు. ఇదే నాకు దుఃఖాన్ని కల్పిస్తోంది.

"నేను దీనుణ్ణి. ఇచ్చుకోవడానికి ఏమీ లేనివాణ్ణి. ఆలింగనమే నేను ఇవ్వగలిగిన బహుమానం;" అంటూ పులకరిస్తున్న మేనుతో హనుమంతుని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు రాముడు. గమ్యాన్ని సాధించిన పూర్ణ సంతృప్తితో నది సముద్రంలో సంగమించునట్లు రాముని బాహువుల్లో ప్రవేశించి, గాలి తాకిడికి చలించిన మేఘంలా ద్రవించిపోయాడు హనుమంతుడు.

ఏమి బహుమానం! ఎవరికి లభించి ఉంటుంది ఘనమైన ఈ సన్మానం? ఇంతకన్నా, ప్రయత్నించి పొందదగిన పురుషార్థం ఏముంటుంది? తన జీవితం చరితార్థ మైందని భావించాడు హనుమంతుడు.

"మీరు చేయతగిన కార్యాన్ని చక్కగా నిర్వహించారు. సీతను అన్వేషించి కనిపెట్టారు. కానీ సముద్రము అనే మాట నా మనసులో కదలగానే నా హృదయం పాతాళానికి కూరుకుపోతోంది. అగాధమైన సాగరాన్ని దాటేది ఎలా? సీత విషయం తెలిసినందుకు నా మనసెంతగానో తృప్తి చెందింది. వానరులందరు సముద్రాన్ని దాటేదెలాగో అర్థంకాక నా చిత్తము వ్యాకులమై ఉంది;" అని పలికి రాముడు దుఃఖంతో క్రుంగిపోయాడు.

"మహావీరా! శ్రీరామా! సీతమ్మ వార్త తెలిసింది. అంతేకాదు. శత్రువు ఎక్కడున్నాడో కూడా అర్థమైంది. సామాన్య మానవుని లాగా నువ్వు ఇంకా ఎందుకు విచారిస్తున్నావో నాకు అర్థం కావడంలేదు.

"నువ్వు బుద్ధిమంతుడివి. శాస్త్రము తెలిసిన ప్రాజ్ఞుడివి. మేధాసంపత్తి కలవాడివి. కార్య నిర్ణయం చేయగల సమర్థుడివి. సామాన్యుని లాగా నీవు చింతించకూడదు.

నిరుత్సాహస్య దీనస్య శోకపర్యాకులాత్మనః
సర్వార్థా వ్యవసీదన్తి వ్యసనం చాధిగచ్ఛతి ॥

"ఎవడు నిరుత్సాహవంతుడో, దీనుడో, దుఃఖముచేత కలత చెందిన బుద్ధి కలవాడో అట్టివాని కార్యములన్నీ భగ్నమౌతాయి. అతడు ఆపదలకు గురి అవుతాడు.

"ఈ వానరవీరు లందరూ సామాన్యులు కారు. వీరులు. శూరులు. సమర్థులు. నీయందు భక్తి కలవారు. ప్రీతి కలవారు. నీకొరకు అగ్నిలో దూకడానికి కూడా వెనుకాడరు. ఈ విషయంలో నాకు సందేహము లేదు.

"మనం దైన్యాన్ని కాకుండా పరాక్రమాన్ని ప్రదర్శించాల్సిన సమయం ఇది. పాపకర్ముడైన రావణుని పరాక్రమంతో వధించి సీతను తీసికొని రావడానికి తీవ్రంగా ఆలోచించవలసిన కాలమిది. రామా! చక్కని ఉపాయాన్ని ఆలోచించి చెప్పు. సాగరముపై సేతువును నిర్మించక తప్పదు. అప్పుడే మనమందరము లంకకు చేరగలము. ముందు ఆ విషయాన్ని ఆలోచించు.

"రామా! మనం లంకలో కాలుపెడితే చాలు. మనల్ని చూచిన మరుక్షణంలోనే రావణుడు యముణ్ణి చూస్తాడు. సాగరాన్ని మన సైన్యము దాటింది అంటే విజయము మనల్ని వరించింది అని అర్థము. కామరూపులైన వానరులు గొప్ప యుద్ధనైపుణ్యం గల వీరులు.

తదలం విక్లబాం బుద్ధిం రాజన్ సర్వార్థ నాశనీమ్
పురుషస్య హి లోకేఽస్మిన్ శోకః శౌర్యాపకర్షణః

"రామా! కలత చెందిన బుద్ధి సమస్త కార్యాలను పాడు చేస్తుంది. శోక మనేది మనిషి శౌర్యాన్ని బలహీనం చేస్తుంది.

"శూరునికి అపజయం లేదు. వీరునికి ఓటమి ఉండదు. రామా! ధనుర్ధారివై నీవు సమరంలో నిలబడితే, నిన్ను జయించగలవాడు ఎవడో నాకు ముల్లోకాలలో కనిపించడం లేదు. మనం సముద్రాన్ని దాటేది సత్యం. నీవు సీతమ్మను చూచేది తథ్యం. విజయం నీది. మరణం రావణునిది. ఆనందం మా అందరిది. నాకు మంచి శకునాలు కనిపిస్తున్నాయి. నా మనసు ఉత్సాహంతో ఉరకలు వేయడమే దానికి శుభ నిదర్శనం;" అన్నాడు సాధుబుద్ధిగల సుగ్రీవుడు.

లంక విషయంలో శంక తీరాలి

సుగ్రీవుడు చెప్పిన ధైర్యవచనాలు రామునికి ఎంతో ఉత్సాహాన్నిచ్చాయి. లంకాధీశుడైన రావణుణ్ణి ఎలాగైనా సంహరించాలి అనే స్ఫూర్తిని కలిగించాయి. లంకయొక్క కట్టుదిట్టాలు ఎలా ఉంటాయో! రావణుని శక్తిసామర్థ్యాలు ఏపాటివో, రావణుని సైన్యం ఏవిధంగా ఉందో- ఈ విషయాలన్నీ ఆలోచించుకొని, బేరీజు వేసుకుని కార్యరంగంలో దిగడానికి సిద్ధపడ్డాడు రాముడు. లంకను ప్రత్యక్షంగా చూచి వచ్చినవాడు హనుమంతుడు. హనుమంతుని ద్వారా ఉన్నదున్నట్లు గ్రహించాలని అభిప్రాయపడి, విషయసేకరణకై ఇలా పలికాడు రాముడు.

"హనుమా! నా సామర్థ్యం ముందు సాగరం సామాన్య మైంది. తపోశక్తి చేత సముద్రాన్ని దాటగలను. లేదా సముద్రునిపై సేతువును నిర్మించి దాటగలను. లేదా, సముద్రజలాన్ని శుష్కింపచేసి వెళ్ళగలను.

"హనుమంతా! చెప్పు, చూసిందంతా! లంకలో ఎన్ని కోట లున్నాయి? రక్షణ సౌకర్యాలు ఎలా ఉంటాయి? రాక్షసుల గృహాలు ఎలా ఉంటాయి? చూసింది చూసినట్లు చెప్పు. ఆ తరువాత చూపిస్తాను నా పరాక్రమము నంతా!" అన్నాడు రాముడు.

"ప్రభూ! చెప్తాను. అన్నీ చెప్తాను. చూసినవన్నీ చెప్తాను. లంకానగరానికి నాలుగు ద్వారాలు. దృఢమైన తలుపులు, వాటికి గట్టివి, పెద్దవి అయిన గడియ లుంటాయి. తలుపులు ఎప్పుడూ మూసే ఉంటాయి.

"సైనికులు ఉపయోగించే పెద్దపెద్ద యంత్రాలు కూడా అక్కడ ఉన్నాయి. వాటి ద్వారా బాణాల్ని, రాళ్ళను ప్రయోగిస్తారు. వందలాది శతఘ్ను లున్నాయి. అవన్నీ ఇనుముతో

తయారు చేయబడ్డాయి. ఏకకాలంలో వాటిని ప్రయోగించి శత్రుసైన్యాన్ని విశేషంగా నశింప చేయవచ్చు. వాటిని ప్రయోగించే రాక్షసవీరులు ఆ యంత్రాలవద్దే ఉంటారు.

"చాలా పెద్ద పట్టణము లంక. దానికి ఎత్తైన ప్రహరీగోడ ఉంది. అది బంగారుతో చేయబడింది. అంతేకాదు. ఆ ప్రాకారానికి ముత్యాలు, పగడాలు, వైడూర్యాలు పొదిగి ఉన్నారు.

"ఆ ప్రహరీగోడను ఎక్కడం ఎవ్వరికీ సాధ్యం కాదు. దాని చుట్టూ లోతైన అగడ్త ఉంది. అందులో భయంకరమైన మీనమకరా లున్నాయి. ప్రహరీద్వారాలకు ఎదురుగా, ఆ అగడ్త మీద నాలుగు వంతెనలు ఉన్నాయి. చాలా పొడవైనవి. వాటిమీద యంత్రాలు కూడా ఉన్నాయి. వాటిని పరిరక్షించే రాక్షసుల గృహాలు కూడా వాటిమీదే ఉన్నాయి. వాటిలో ఒక వంతెన చాలా బలమైంది. దుర్భరమైంది. దానికున్న స్తంభాలన్నీ బంగారువే.

"రామా! ఇక రావణుడి విషయం. అతనిలో భయమనేదే కనిపించలేదు. సమరోత్సాహంతో ఉన్నట్లు అగుపించాడు. సైన్యం విషయంలో ఏమరిపాటు లేకుండా ఉన్నాడు.

"ఎత్తైన కొండమీద ఉండడం వల్ల ఆ లంకలో ప్రవేశించడం చాలా కష్టం. చుట్టూ అది నాలుగు దుర్గాల చేత రక్షింపబడుతూ ఉంది. 1. **నదీదుర్గము:** చుట్టూ నది ప్రవహిస్తూ ఉంది. 2. **వనదుర్గము:** అరణ్యములు కలది. 3. **పర్వతదుర్గము:** కొండలు గలది. 4. **కృత్రిమ దుర్గము:** నిర్మించిన ప్రహరీ గలది.

"లంక సముద్రమునకు దక్షిణ తీరాన చాలా దూరంలో ఉంది. అక్కడికి నావలు కూడా వెళ్ళవు. వార్తలు అక్కడికి చేరే అవకాశమే లేదు. ఎటూ అర్థంకాని విధంగా ఉంటుంది. రథ గజ తురగాదులు అక్కడ లెక్కకు అందవు.

"రామా! లంకాపట్టణం తూర్పుద్వారంలో పదివేలమంది రాక్షసులు కాపలా ఉన్నారు. వాళ్ళందరూ శూలాలు పట్టుకొని, ఖడ్గాలు ధరించి చాలా భయంకరంగా ఉంటారు.

"దక్షిణద్వారంలో పదిలక్షలమంది రాక్షసులు కాపలా ఉన్నారు. అక్కడే చతురంగసేన కూడా సిద్ధంగా ఉంటుంది. సమరవీరు లైనవారే వాళ్ళందరూ.

"పడమటిద్వారంలో కూడా పదిలక్షలమంది రాక్షసులు కాపలా ఉన్నారు. కత్తులు, డాళ్ళు ధరించి డాబుగా ఉంటారు. అస్త్రనైపుణ్య ముంది వారందరికీ.

"రామా! ఉత్తరద్వారంలో మాత్రం కోటిమంది రాక్షసులు కాపలా ఉన్నారు. వాళ్ళందరూ అసాధ్యులు. రథికు లున్నారు. రౌతు లున్నారు. మాననీయు లున్నారు. కులీనులూ ఉన్నారు.

"వీళ్ళు కాకుండా, అక్కడ ఇక్కడ, ఇక్కడ అక్కడ, అక్కడక్కడ ఉన్నవారందరూ కోటికి మించే ఉంటారు.

"నేను వెళ్ళేసరికి లంక పరిస్థితి అలా ఉంది. నేనేమో, వంతెనలని చెప్పాను కదా! వాటిని అప్పటంగా పడగొట్టేశాను. అగడ్త లన్నాను కదా! వాటినంతా పూర్తిగా పూడ్చేశాను. ఆ బంగారు ప్రాకారాలన్నీ తోసేశాను. సైనికులలో చాలామందిని పైకి పంపేశాను.

"ఇప్పటి పరిస్థితి ఇది. ఏమీలేదు. సముద్రాన్ని దాటేస్తే చాలు. ఇక మనవాళ్ళు వానరులు. ఊరుకోరు. లంకనంతా నేలతల్లికి నైవేద్యం పెట్టేస్తారు. ముఖ్యంగా, అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, పనసుడు, అనలుడు, నీలుడు వీళ్ళు చాలు లంకను నాశనం చేయడానికి. మిగిలిన వానరులు రాలేకపోయినా నష్టం లేదు.

"రామా! ఇక ఆలస్యం చేయవద్దు. శుభముహూర్తాన్ని నిర్ణయించు. ప్రయాణానికి సిద్ధపడదాం;" అన్నాడు హనుమంతుడు.

కదం త్రొక్కిన కపిసేన

హనుమంతుని మాటలను ఆలకించి రాముడు నిశ్చయాత్మకంగా ఇలా పలికాడు. "హనుమా! నీకు నిజం చెప్తున్నాను. విను. నువ్వు చెప్పిన రావణుని లంకను క్షణంలో తుడిచేస్తాను.

"సుగ్రీవా! ఇది విజయముహూర్తము. సూర్యుడు కూడా ఆకాశమధ్యగతుడై ఉన్నాడు. ఇదే శుభసమయం. రావణుడు సీతను అపహరించి తీసికొని వెళ్ళాడు. లంకలో దాచాడు. ఇప్పుడు తన ప్రాణాల్ని ఎక్కడ దాచుకుంటాడో చూడాలి.

"నేను బయలుదేరినట్లు సీతకు తెలిస్తే చాలు. విషపానం చేసి మృత్యుముఖంలో ప్రవేశించే వానికి అమృతం లభించగానే ఎలా బ్రతుకుతాడో, సీత అలా స్వస్థతను పొందుతుంది.

"సుగ్రీవా! ఈరోజే బాగుంది. ఉత్తర ఫల్గునీ నక్షత్రము. శుభశకునాలు కనిపిస్తున్నాయి. రావణవధ జరిగి తీరుతుందని, సీతను నేను తిరిగి తీసికొని రాగలనని నమ్ముతున్నాను." అని రాముడు పలకగానే సుగ్రీవుడు, లక్ష్మణుడు "అలాగే" అని పలికి రాముని పూజించారు. రాముని ఆజ్ఞల ప్రకారం వానరసేన బయలుదేరింది.

మార్గాన్ని సుగమం చేసేందుకు నీలుని నాయకత్వంలో లక్షమంది వానరులు ముందు వెళ్ళారు. ఫలాలు, దుంపలు, చల్లని నీరు, దట్టమైన అడవులు గల మార్గంలో ప్రయాణం చేశారు. మార్గమధ్యంలో జలఫలాదులను రాక్షసులు విషతుల్యం చేయకుండా అప్రమత్తంగా ఉండమని కూడా హెచ్చరించాడు రాముడు. శత్రువుల్ని కనిపెడుతూ ముందు వెళ్ళమని చెప్పాడు.

యత్తు ఫల్గు బలం కించిత్తదత్రై వోప పద్యతామ్
ఏ తద్ధి కృత్యం ఘోరం నో విక్రమేణ ప్రయుజ్యతామ్ ॥

"సుగ్రీవా! బలము లేని వారి నందరినీ ఇక్కడే కిష్కింధలోనే ఉండనీ, ఎందుకంటే, మనం చేయబోయే కార్యము భయంకర మైనది. పరాక్రమంతో సాధించదగింది" అన్నాడు రాముడు.

రావణుని వధించి, సీతమ్మను దర్శించే కార్యానికి బలహీనులు అనర్హులు అంటున్నాడు రాముడు. ఈ సత్యము రామునికి ముందు ప్రభవించిన ఉపనిషత్తులూ ప్రవచించాయి. రాముని తరువాత కూడా, శాస్త్రాలు, మహాత్ములు బలహీనతను గర్హిస్తూనే ఉండడం మనం చూశాము.

సత్యమార్గంలో బలహీనులు, సోమరులు చరించలేరు. ధీరపురుషులు, ధీపురుషులే నడక సాగించగలరు. ఉపనిషత్తుల నుండి వివేకానందస్వామి వరకు ఈ సత్యమే ప్రతిధ్వనిస్తూ ఉంది.

నాయమాత్మా బలహీనేన లభ్యః *

"ఆత్మ బలహీనుని చేత పొందబడదు" అని ముండకోపనిషత్తు.

సమస్త దుఃఖాలకు దుర్బలత్వమే కారణము. దుర్బలత్వ మనేది దేహధర్మమే గాని ఆత్మధర్మము కాదు. దుర్బల దేహాలు తామని భావించేవారు దుర్బలులు కాకుండా ఎలా ఉంటారు? సర్వశక్తివంతమైన ఆత్మను ఎలా పొందగలుగుతారు? జీవనసమరంలో ఎలా విజయాన్ని సాధిస్తారు? అజ్ఞానాన్ని ఎలా అంతమొందిస్తారు?

The greatest error, says the Upanishads, is to say that you are weak, that you are a sinner, a miserable creature, and that you have no power and you cannot do this and that.

Strength is life, weakness is death; strength is felicity, life eternal, immortal. Weakness is constant strain and misery. Weakness is death.

"నీవు బలహీనుడవు, పాపివి, నీచుడవు, శక్తిహీనుడవు, ఇది చెయ్యలేవు, అది చెయ్యలేవు" అని పలకడమే పెద్ద దోషము అని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

"బలమే జీవనము. దుర్బలత్వమే మరణము. బలమే ఆనందము, నిత్యము, అమర జీవనము. దుర్బలత్వమే నిరంతర శ్రమ మరియు శోకము. దుర్బలత్వమే మరణము" అంటారు స్వామి వివేకానంద.

రాముడు చెప్పినట్లుగా వానరసేన బయలుదేరింది. వాళ్ళందరూ వందలకొలది, వేలకొలది ప్రత్యేక సమూహాలుగా బయలుదేరారు. పర్వతరూపులైన గజుడు, గవయుడు, గవాక్షుడు సైన్యానికి ముందు నడుస్తున్నారు.

సేనకు కుడివైపు వానరముఖ్యుడైన ఋషభుడు, ఎడమవైపు బలవంతుడైన గంధమాదనుడు నడుస్తూ సైన్యాన్ని రక్షిస్తున్నారు. జాంబవంతుడు, సుషేణుడు, వేగవంతుడు మధ్యలో పయనిస్తూ సేనను రక్షిస్తున్నారు.

దేవేంద్రుడు ఐరావతాన్ని ఎక్కినట్లు రాముడు హనుమంతుని మీద ఎక్కాడు. రాముడు అలాగే కోరుకున్నాడు కూడా.

యాస్యామి బలమధ్యేఽహం బలౌఘ మభి హర్షయన్
అధిరుహ్య హనూమన్త మైరావత మివేశ్వరః

"దేవేంద్రుడు ఐరావతము నెక్కినట్లు నేను హనుమంతుని మీద ఎక్కి, సేననంతా ఉత్సాహపరుస్తూ మధ్యలో ఉంటాను" అన్నాడు రాముడు. ఆంజనేయునిపై అధిరోహించాడు. రామదూత తన అదృష్టానికి పొంగిపోయాడు. వానరమూర్తి వాహనమూర్తి అయ్యాడు. రామవాహనమూర్తి అయ్యాడు.

ఈ శ్లోకం చాలా అందమైంది. అద్భుతమైంది. అందరు కపివీరు లుండగా తనకు వాహనంగా హనుమంతునే ఎందుకు ఎన్నుకున్నాడు రాముడు. కపివరుడు కోరితే ఈ

*ఆశ్రమప్రచురణ "ముండకోపనిషత్తు" (3-2-4) స్వామీజీ వ్యాఖ్య చూడగలరు.

అవకాశం లభించలేదు. దాశరథి దయచూపితే ప్రాప్తించింది. హనుమంతునిపై ఎక్కాలని రాముడే నిర్ణయించుకున్నాడు.

రామకార్యంలో భయంకరమైన సముద్రాన్ని దాటాడు హనుమంతుడు. ఒంటరిగా అన్వేషించాడు. రాక్షసులు పెట్టిన బాధల్ని అనుభవించాడు. అందరూ నిద్రిస్తున్న సమయంలో సీతమ్మ కొరకు అన్వేషించాడు. నిద్రాహారాలు మాని కలత చెందాడు. సీతమ్మను ఎలాగో దర్శించాడు. తోకకు నిప్పంటించి, వీధుల్లో త్రిప్పుతూ నానా దుర్భాషలాడారు రాక్షసులు. అన్నిటినీ సహించాడు. రామనామాంకిత ముద్రను సీతమ్మకు అందించాడు. రాముడికి ప్రియమైన కార్యాన్ని సాధించాడు. అందుకే హనుమంతుని వాహనమూర్తిగా స్వీకరించాడు రాముడు.

హనుమంతునిపై ఎక్కి పయనించడమే గాకుండా, సేన మధ్య నిలిచి, సేనను ఉత్సాహపరుస్తానని చెప్తున్నాడు రాముడు.

రాముడెప్పుడూ భక్తుల మీదే ఎక్కి ఉంటాడు. భక్తుల మనసులలోనే ఉంటాడు అని అర్థము. భక్తుల బుద్ధి సదా భగవంతునే మోస్తూ ఉంటుంది. అట్టి భక్తులపై ఎక్కి చుట్టూ ఉన్న సేనను ఉత్సాహ పరుస్తాడట రాముడు. చూశారా, రాముని వైభవం ఎలాంటిదో!

ఎవరి బుద్ధి సదా రాముని మోస్తూ ఉంటుందో అట్టివారి బుద్ధిలో తాను నిలిచి భక్తసేనను ఉత్సాహ పరుస్తాడు. సంకీర్తనల ద్వారా, సత్కథాశ్రవణం ద్వారా భక్తుల్ని రాముడే ఉత్తేజపరుస్తాడు. సాధువులలో నిలిచి భక్తప్రపంచాన్ని ప్రభావితం చేస్తాడు.

రాముడు ఉత్సాహ పరుస్తుంటే అంతకన్నా కావలసిం దేముంటుంది? రాముడు ఉత్తేజపరచే సేన కనుకనే కపివరుల సంఖ్య లెక్కకు అందకుండా ఉంది. రాముని సారథ్యంలో నడిచే కార్యక్రమాలన్నీ అలాగే ఉంటాయి. హనుమంతునిపై ఎక్కి, సేనకు మధ్యలో ఉంటానన్నాడు రాముడు. భగవంతుడు భక్తుల మధ్యే ఉంటాడు.

నాహం వసామి వైకుంఠే యోగినాం హృదయేన చ
మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద

"నేను వైకుంఠములో వసించను. యోగుల హృదయాలలో నివసించను. నా భక్తులు ఎక్కడైతే నన్ను గానం చేస్తూ ఉంటారో నేను అక్కడే ఉంటాను నారదా!" అన్నాడు భగవంతుడు పద్మపురాణంలో.

కనుకనే రామకార్యాదురంధరుడైన ఆంజనేయునిపై ఆసీనుడై, సేననంతా ఉత్సాహపరుస్తూ సాగాలని రాముడు నిర్ణయించుకున్నాడు.

కొందరు మహాత్ములు ప్రవచనం చేస్తూ వుంటే సభాస్థలము వైకుంఠంగా మారిపోతుంది. జనసాగరం కళ్ళముందు ప్రత్యక్ష మవుతుంది. ఆ మహాత్ములు రామకార్యంలో ఆంజనేయునిలాగా శ్రమించి ఉంటారు. నిద్రాహారాలు మాని రామకార్యంలో పరిశ్రమించి ఉంటారు. రామానుగ్రహానికి పాత్రులై ఉంటారు.

కనుకనే వారి కార్యక్రమాలు భగవంతుని కార్యాలైపోయాయి. రాముని వైభవంతో నిండిపోయాయి. రామకృపకు పాత్రులైనవారు ఏది చేపట్టినా అది రమణీయంగానే ఉంటుంది.

వాతలు వేసుకున్నంత మాత్రాన నక్క పులిగా మారుతుందా! భగవత్కృపకు పాత్రులైన వారి సభల్ని చూసి, ఏం చేస్తాం? పాపం, కొందరు తాము కూడా జనుల్ని ఆకర్షించాలని నానా తంటాలు పడుతుంటారు. ఎన్నెన్ని హంగామాలో!

తోక ఉన్నంత మాత్రాన హనుమంతు లవుతారా! తాహత్తు ఉండాలి కాని. హృదయ నైర్మల్యం, పవిత్రమైన భక్తి, నిస్వార్థ సేవాజీవనము అలవడితే అయోధ్యారాముడు హృదయం లోనే వసిస్తాడు.

రాముడు హనుమంతునిపై ఎక్కాడు. సార్వభౌమ అనే ఏనుగును కుబేరుడు ఎక్కినట్లు లక్ష్మణుడు అంగదునిపై ఎక్కాడు. సుగ్రీవుడు కూడా బయలుదేరుతూ రాముని ఆజ్ఞ మేరకు చరించమని కపివీరులను హెచ్చరించాడు. అందరూ బయలుదేరారు. దక్షిణ దిక్కుగా ప్రయాణమయ్యారు.

వానరసేనంతా ఒక సముద్రం లాగా కన్పించింది. కొందరు వానరులు ఎగురుతూ వెళ్తున్నారు. కొందరు సింహనాదాలు చేస్తున్నారు. కొందరు నాట్యం చేస్తూ నడుస్తున్నారు. కొందరు వానరులు ఒకరిపైకి మరొకరు దుముకుతూ ఉంటే, కొందరు ఒకరిపై ఒకరు స్వారి చేసినట్లు ఎక్కుతున్నారు.

రామునికి సమీపంలో వున్న వానరసైన్యము "రావణుణ్ణి చంపేస్తాం. ముక్కలు ముక్కలుగా నరికేస్తాం. పాతేస్తాం;" అంటూ గర్జించి పలుకుతున్నారు.

కొందరు వానరులు మధ్యలో ఆగి చెట్లెక్కి ఫలాలను ఆరగిస్తున్నారు. తేనెలు త్రాగుతున్నారు. కొందరు అంతటితో తృప్తి చెందక, మంచి పండ్లగుత్తులున్న చెట్లను విరిచి భుజాన వేసుకొని కేరింతలు కొడుతూ నడుస్తున్నారు. కొందరు వానరులు క్రింద నడవకుండా చెట్ల మీదనే దుముకుతూ సాగిపోతున్నారు.

ఒక వానరసమూహానికి శతబలి నాయకత్వం వహించాడు. ఆ మూకలో పదికోట్ల వానరు లున్నారు. కేసరి, పనసుడు, గజుడు, అర్కుడు కలిసి వందకోట్లు వానరులు గల సమూహానికి నాయకత్వం వహించారు.

భల్లూకసైన్య మంతా సుగ్రీవ రామలక్ష్మణుల వెనుక పయనిస్తోంది. సుషేణ జాంబవంతులు ఆ సేనకు నాయకత్వం వహించారు. సేనాపతి యైన నీలుడా సంపూర్ణ సేనను పర్యవేక్షిస్తూ పయనిస్తున్నాడు.

వానరసేన పయనిస్తుంటే గుట్టాలు పరుగెత్తినట్లే ఉండింది. హనుమదంగదుల భుజాల నెక్కి పయనిస్తున్న రామలక్ష్మణులు రెండు పెద్ద గ్రహాలతో కలిసి వెళ్తున్న సూర్యచంద్రుల లాగా కనిపించారు. లక్ష్మణుడు రాముని జూచి ఇలా పలికాడు.

"అన్నా! నీవు రావణుణ్ణి వధించే సమయం సమీపించింది. పతీసమేతుడవై అయోధ్యలో ప్రకాశించే తరుణం ఆసన్నమైంది. అన్నీ శుభశకునాలే కనిపిస్తున్నాయి.

"ఆర్యా! వ్యూహాలుగా తీర్చబడి శోభాయమానంగా ఉద్యమిస్తున్న ఈ వానరసైన్యం తారకాసురుని వధించుటకు వెళ్ళిన దేవతల సైన్యము లాగా కనిపిస్తోంది;" అన్నాడు లక్ష్మణుడు.

భల్లూక కపిసైన్యాలు నడచి వెళ్తూవుంటే అరణ్యమధ్యంలో నేల కనిపించడమే లేదు. భల్లూక వానర బొమ్మలతో నేసిన తివాసీ పరచినట్లే ఉంది. వారి గమనం వల్ల లేచిన దుమ్ము గగనాన్నంతా ఆవరించింది. ఆకాశమే అగుపించకుండా చేసింది.

వానరు లందరూ రణోత్సాహంతో ముందుకు సాగిపోతున్నారు. కొందరు వానరులు కొంత దూరము వెళ్ళిన తరువాత, ఆగి వెనక్కి వచ్చి, మళ్ళీ గంతులేస్తూ ముందుకు పోతున్నారు. కొందరు కిచకిచ-కిచకిచ మంటూ ఎగురుతున్నారు.

కొందరు తోకల్ని రకరకాలుగా త్రిప్పుతూ పోతున్నారు. విశాలమైన వానర భల్లూక సైన్యము ఎక్కడా విశ్రాంతి తీసికోలేదు. రాత్రింబవళ్ళు ప్రయాణం చేస్తూనే ముందుకు సాగారు. భగవత్కార్యంలో నిమగ్నులైన వారు సమయాల్ని, విరామాల్ని పట్టించుకోరు.

మహేంద్రపర్వతాన్ని సమీపించారు. అందమైన వృక్షాలతో అలంకరించబడి ఉన్న మహేంద్రపర్వతాన్ని ఎక్కాడు రాముడు. అక్కడ నుండి కల్లోల కెరటాలతో నిండిన కడలిని చూశాడు.

మహేంద్రపర్వతాన్ని దిగి, సాగరతీరము నందున్న వనంలో ప్రవేశించారు.

"సుగ్రీవా! మనం సముద్రాన్ని సమీపించాము. ఈ సాగరాన్ని ఎలా దాటాలో మనం ఆలోచించాలి. సైన్యాన్నంతా ఇక్కడ ఆపుదాం. సేనలు చెల్లాచెదరు కాకుండా చూడాలి. వీరులైన వానరులు, శూరులైన భల్లూకాలు వారి వారి సేనలను రక్షించుకొంటూ ఉండాలి" అన్నాడు రాముడు.

వానరసేన సముద్రతీరంలో నిలబడింది. అదొక పచ్చని రంగుగల సముద్రంలా గోచరించింది. వానరుల శబ్దముల ముందు వారిధిఘోష వినిపించలేదు.

అది సాయంసంధ్యా సమయం. భయంకరమైన మొసళ్ళతో నిండియున్న సముద్రం కెరటాలతో నృత్యం చేస్తున్నట్లుంది. నురుగులతో నవ్వుతున్నట్లుంది. చంద్రోదయ మైంది. కడలి కెరటాలు మరీ లేచి పడుతున్నాయి. లేచిపడే అలలలో చంద్రబింబం ప్రతిబింబిస్తూ, అనేకమంది చంద్రులు ఒకేసారి సముద్రంలో విడిది చేసినట్లుంది.

ప్రచండ వాయుచలనానికి సాగరజలాలలో మునిగి వున్న మొసళ్ళు, సర్పాలు పైకి వచ్చి ఎగిరెగిరి పడుతున్నాయి. సముద్రాన్ని చూస్తే ఆకాశంలా వుంది. ఆకాశం వైపు చూస్తే సముద్రంలా గోచరిస్తూ వుంది.

ఆకాశము నీలము, విశాలము. సముద్రమూ నీలము, విశాలము. ఆకాశంలో నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. సముద్రంలో రత్నాలు శోభిస్తున్నాయి. ఆకాశంలో మేఘసరాలు కదుల్తుంటే, సముద్రంలో కెరటాలు కదుల్తున్నాయి. ఆకాశంలో మేఘగర్జనము, సముద్రంలో తరంగఘోష కలిసి యుద్ధభేరిని మ్రోగిస్తున్నట్లుంది. వాయుచలనానికి పైకిలేచిన కెరటాలు ఆకాశంతో ఏవేవో మాట్లాడినట్లుంది. వానరులందరూ విస్మయులై సముద్రాన్ని వీక్షిస్తున్నారు.

చల్లని వేళ వెచ్చని జ్ఞాపకాలు

ఉత్తరతీరము నందు చేయవలసిన కట్టుదిట్టాలన్నీ చేసి, సేనను నిలిపాడు నీలుడు. మైందుడు, ద్వివిదుడు సేనలను కాస్తూ తిరుగుతున్నారు. సముద్రతీరంలో సైన్యము

నిలిచింది. రాముడు లక్ష్మణుని చూశాడు. ఏదో బాధతో వ్యథ చెందుతున్నట్లు కన్పిస్తున్నాడు రాముడు.

"తమ్ముడూ! లక్ష్మణా! దినాలు గడుస్తూవుంటే దుఃఖము తగ్గుతుందని అంటారు. కానీ సీత లేని నాకు రోజులు గడిచేకొద్దీ రాజుకున్న దుఃఖాగ్ని మంటలై లేస్తోంది. చూడు. ఆమెకు వయస్సు కూడా దాటిపోతోంది కదూ!

"దుష్టుడైన రావణుడు ఆమెను అపహరించేటప్పుడు "హా నాథా!" అని నన్నే పిలిచిందని జటాయువు చెప్పింది. వానరులూ చెప్పారు. ఆ విషయం జ్ఞాపకం వస్తే విషం త్రాగిన వాని శరీరం లాగా నా దేహమంతా చుట్టుకుపోతోంది.

"లక్ష్మణా! ఆమె విరహాగ్ని నన్ను దహించి వేస్తోంది. ఆ మదనాగ్నికి వియోగమే కట్టెలు. ఆవేదనే అగ్ని. నాయనా! నువ్వు ఇక్కడే ఉంటావా! నేను వెళ్ళి సముద్రంలో పడుకుంటాను. దాని వల్ల నా వియోగాగ్ని చల్లారుతుం దంటావా!

"నాయనా! ఇంత ఘోరమైన చింతలో కూడా నాకేదో ఆనందం ఉంది. అదేమిటో చెప్పనా! సీతా, నేనూ ఇద్దరము ఒకే నేలపై పడుకుంటున్నాము. ఒకే గాలిని పీల్చి వదులుతున్నాం. ఒకే చాపపై పరుండినట్లు ఒకే నేలపై నిద్రిస్తున్నాము. అలా భావించినపుడు నాకు బ్రతకాలనిపిస్తోంది.

"లక్ష్మణా! నీళ్ళు నిండిన వరిచేను ప్రక్కనే నీళ్ళు లేని వరిచేను వుందనుకో. మొదటి దాని తేమ వల్ల రెండవది కూడా నశించకుండా ఉంటుంది కదూ! నేనూ అంతే. సీత జీవించి యున్నందున నేను కూడా జీవిస్తున్నాను.

"సీత జనకుని కుమార్తె. దశరథుని కోడలు. నా భార్య. రాక్షసుల మధ్య ఎలా నిద్రిస్తోందో! ఎంతగా దుఃఖిస్తోందో! లక్ష్మణా! శరత్కాలంలో నల్లని మేఘాలను విడిపించుకొని చంద్రరేఖ ముందుకు వస్తుంది. కదూ! అయితే నా సీత కూడా రాక్షసుల్ని వదిలించుకొని నాకు కనిపిస్తుందంటావా!

"అసలే సన్నగా ఉంటుంది సీత. దుఃఖం వల్ల, భోజనం లేకపోవడం వల్ల మరీ చిక్కిపోయి వుంటుందేమో! అందులోనూ దేశంకాని దేశం. కాలంకాని కాలం. ఘోరమైన పర్యావరణం.

వా హి వాత యతః కాన్తా తాం స్పృష్ట్వా మామపి స్పృశ
త్వయి మే గాత్ర సంస్పర్శ శ్చన్ద్రే దృష్టి సమాగమః

"ఓ గాలీ! నాసీత దగ్గరికి వెళ్ళవా! ఆమెను తాకివచ్చి నన్ను తాకవా! నీ ద్వారా ఆమెను నేను తాకినట్లే అవుతుంది.

"ఓ చంద్రుడా! నిన్ను నా సీత చూస్తూ ఉందా! అయితే, నిన్ను నేను చూస్తే ఆమెను చూపినట్లే అవుతుంది కదూ!"

"ఓ వాయువా! నీకు తెలియదా! క్షీణిస్తోంది కదా మా ఆయువు. ఓ గాలీ! నీవైనా చూపవా మాకొక దారి! గాలీ! కలగడంలేదా మామీద నీకు జాలి!

"వాయువా! సాగరజలాలపై తేలియాడే నీకు దుఃఖసాగరంలో మునిగిపోతున్న మమ్మల్ని కాపాడా లనిపించడం లేదా! నీవేమో చెట్లెక్కి ఊగుతావు. మమ్మల్నేమో చెట్లక్రింద పడి ఉండమంటావు.

"గాలిపటంతో ఎగురుతూ నువ్వు ఆడుకుంటావు. శోకతటంలో మమ్మల్ని పడేసి నవ్వుతుంటావు. పువ్వుల గుండెల్ని ఒలిచి, మంచి మంచి వాసనల్ని దోచేసి, వాడవాడలా పంచే నీ మంచితనం ఏమైంది?

"గాలీ! కనిపించకుండానే కౌగలించుకొనే నేర్పు నీ కొక్కదానికే ఉంది. నీ నేర్పేమిటో నాకు నేర్పవా! ఈ శోకాగ్నిజ్వాలల్ని ఆర్పవా! వెదురుపొదల్లో దూరి ఈలవేసే నీకు మా గోల వినిపించ దెందుకని? నా సీత పలుకు నా చెవి కందిస్తే నీదేమి పోతుందని?

"గాలీ! ఓడలకు తోడుగా నడుస్తావే! మా జీవనమేడల్ని కూల్చేస్తున్నా వెందుకని? వాయువా! ఇంతగా పాడైపోయావా! వరిచేలపై హాయిగా ఊగడమేనా! మా బ్రతుకుల్ని సరిచేసే బాధ్యత నీకు లేదా! నువ్వు ప్రాణాల్ని నిలిపే దానివట! కాదు. కాదు. నీలో ప్రాణాలు తోడేసే గుణం కూడా ఉంది. నువ్వు మనసు తల్లివి కదూ! అయితే నీకూ మనసుంది. మనోగతులింతే నని నిరూపించుకున్నావా! అంతేనా వాయువా!" అని మండిస్తున్న మన్మథాగ్నితో మదనపడుతున్నాడు రాముడు.

జీవబ్రహ్మల మధ్య నడిచే ఉత్తర ప్రత్యుత్తరాలే పవనసందేశాలు. జీవుని ప్రార్థన శబ్దయుతము. శబ్దాన్ని మోసుకొని పోతుంది వాయుతరంగము. ఆ వాయువే ఇక్కడ గురువు. ఆయనే వాయుపుత్రుడు. వినిపించేవాడు. మనసుకు విందు చేసేవాడు.

భక్తుని హృదయం భగంతుని నిరీక్షణలో నిలుపుతుంది. తన భక్తి పారవశ్యంలో పరమాత్మని ఉన్మాదిగా మార్చేస్తాడు భక్తుడు. ఈ శక్తి ఒక్క భక్తికే ఉంది. భక్తుని కొరకు భగవంతుడు పరితపించేలా చేసేదే భక్తి. భక్తుడైన వాని ప్రార్థనల్ని వినేందుకు పరమాత్మ ఆసక్తితో ఉంటాడు. అనురక్తితో ఉంటాడు. అందుచేతనే భక్తుని మాటల్ని వినిపించే వాయువుతో కూడా భాషిస్తూ ఉంటాడు. వాయువు నాశ్రయించే ఉంటాడు. రాముడు వాయుపుత్రుని వీడకుండా ఉండడానికి కారణంకూడా అదే.

-బహుమనుతే నను తే తను సంగత పవన చలిత మపిరేణుం ॥
-ధీర సమీరే యమునా తీరే వసతి వనే వనమాలీ ॥

"అమ్మా! రాధా! నీ శరీరాన్ని తాకివచ్చిన వాయువు వల్ల రేగిందని, దుమ్మును కూడా గౌరవిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

"పిల్లగాలులు వీచే యమునాతీరవనములో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు" అంటాడు గీతగోవిందకావ్యంలో జయదేవుడు.

వాక్కులతో వాయువును పలకరిస్తూ, చూపులతో చంద్రుని పిలుస్తూ సీతావియోగ దుఃఖంలో కుమిలిపోతున్నాడు రాముడు.

"లక్ష్మణా! సీత పరుగులెత్తుతూ వచ్చి, తన చేతులతో నా కంఠాన్ని చుట్టేసి, ఆనందంతో పరవశించి బాష్పాలు రాల్చేదెప్పుడో! మాసిన బట్టను విడిచినట్లు ఈ శోకాన్ని నేను విడిచేదెప్పుడో!

"నాయనా! దుష్టుడు, నీచుడు అయిన ఆ రావణుని వక్షఃస్థలముపై నా బాణాలు వాలుతాయి. రావణుడి ప్రాణాలు ఎగిరిపోతాయి. వాటి ననుసరించే మా దుఃఖాలు కూడా పోతాయి. వ్యథ దూరం కాగానే వైదేహి నాకు చేరువైపోతుంది;" అన్నాడు రాముడు.

రాముడు దు:ఖిస్తూనే ఉన్నాడు. సూర్యుడు అస్తమించాడు. వగలమారి పగలు పరారైంది. విలపిస్తున్న రాముణ్ణి లక్ష్మణుడు ఓదార్చాడు. రాముడు సంధ్యోపాసన గావించాడు.

రమణీయ హృదయాలు ఎంత అంపపుకోతకు గురయ్యాయో! కమనీయ జీవితాలు కలతలకు, కన్నీళ్ళకు ఆలవాలమై పోయాయి. పచ్చని జీవితాలలో చిచ్చుపెట్టాడు రావణుడు. చేసిన దౌష్ట్యానికి ఎలాంటి దుర్మరణాన్ని పొందుతాడో? ఇంతకీ, ఇప్పుడెలా ఉన్నాడో?

రావణసభలో రణచర్చ

రావణుడు కొలువులో తలవంచుకొని కూర్చుని యున్నాడు. దేవేంద్రుని లాగా విజృంభించి, లంకలో హనుమంతుడు చేసిన భయంకర కృత్యాలు రావణుడు సిగ్గుతో తలవంచుకొనేలా చేశాయి. రావణుడు మంత్రులతో ఇలా మాట్లాడాడు.

"మన లంకాపట్టణము ప్రవేశించుటకు సాధ్యము కానిది. ఇంతవరకు ఎవ్వరూ సాహసించి ఎదిరించలేక పోయారు. ఒక కోతిగాడు నిరాటంకంగా ఈరోజు ప్రవేశించ గలిగాడు. సీతను చూశాడు. చైత్యప్రాసాదాన్ని నాశనం చేశాడు. వీరులైన రాక్షసుల్ని వధించాడు. లంకనంతా కలత పెట్టేశాడు.

"మన మిప్పుడు ఏం చెయ్యాలి? ఏది మంచో, ఏది చెడో ఆలోచించి చెప్పండి. లోకంలో మూడు రకాలైన మనుష్య లుంటారు. ఒక పనిని ప్రారంభించేముందు ఆలోచించగలిగే మంత్రులతో సంప్రదించి, తమ సుఖాన్ని ఆశించే మిత్రులతో మాట్లాడి, తన అభివృద్ధిని కాంక్షించే బంధువులతో కూడా కలిసి ఆలోచించి, కర్తృత్వభావన లేకుండా, బాధ్యతనంతా దైవం మీదే ఉంచి, తన శక్తి ననుసరించి కార్యమును ఆచరించేవాడు ఉత్తముడు.

"తానే ఆలోచించి, తానే నిర్ణయించుకొని, తానే ఆచరించునో అట్టివాడు మధ్యముడు. మంచిచెడులు ఆలోచించకుండా, దైవాన్ని కూడా విస్మరించి కాలయాపన చేయువాడు అధముడు. పురుషులు ఎలా మూడు రకాలుగా తెలుస్తున్నారో వారు చేసే ఆలోచనలు కూడా మూడు రకాలుగా ఉన్నాయి.

శాస్త్రనిర్ణయాన్ని అనుసరిస్తూ, మంత్రు లందరు ఐకమత్యముతో ఉండి చేయు స్థిరమైన ఆలోచన ఉత్తమమైంది. ప్రారంభములో అభిప్రాయభేదము లున్నా, చివరికి అందరూ కలిసి ఏకాభిప్రాయానికి వస్తే అట్టి ఆలోచన మధ్యమ మైనది. ఎవరికి వారుగా ఆలోచిస్తూ భిన్నాభిప్రాయాలతో ఐకమత్యము లేక, ఆసక్తి లేక చేసే ఆలోచన అధమమైంది.

"మీకు అర్థమైందని భావిస్తాను. మీరందరూ ఉత్తమమైన ఆలోచన చేసి చెప్పండి. నేను దానిని అమలు పరుస్తాను. రాముడు వానరులను వెంటబెట్టుకొని మన మీదికి వస్తాడు. సముద్రాన్ని ఏదో ఉపాయంతో దాటి, తమ్ముణ్ణి, వానరుల్ని వెంటబెట్టుకొని లంకను ముట్టడిస్తాడు. వానరులతో కూడా మనకు వైరం ఏర్పడింది. బాగా ఆలోచించి మీ నిర్ణయమేదో చెప్పండి" అన్నాడు రావణుడు.

సలహాలు పుచ్చుకొనేవారు కూడా మూడు రకాలుగా ఉంటారు. పని ప్రారంభించే ముందే హితులతో సంప్రదించి, చక్కని నిర్ణయాలతో కార్యారంభము చేయువాడు

ఉత్తముడు. ఎవరితోనూ సంప్రదించకుండా ప్రారంభించినా, కార్యాభివృద్ధికి మధ్యలో హితులను సంప్రదించి, తదనుగుణంగా ఆచరించేవాడు మధ్యముడు. అహంకారంతో తానే సర్వమని భావించి, కార్యనాశము జరిగిన తరువాత, చేతులు కాలిన పిమ్మట ఆకులను స్పృశించునట్లు, సలహాలు కోరేవాడు అధముడు.

రావణుడు ఈ మూడవ కోవకు చెందిన వ్యక్తి. శూర్పణఖ రెచ్చగొట్టినపుడు, మారీచుని వద్దకు వెళ్ళాలని నిర్ణయించుకోక ముందే ఈ సలహా సంప్రదింపుల కార్యం పూర్ణత్వానికి వచ్చుండాలి. అంతా పాడైపోయిన తరువాత ఈ దశలో మంత్రిమండలి సలహాలు అనవసరం.

రావణుని మాటలను ఆలకించారు రాక్షసులు. వాళ్ళందరూ బలవంతులే. కానీ బుద్ధిమంతులు కారు. శత్రుబలాన్ని అంచనా వేయకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడేశారు.

"రాజా! మనకు అపారమైన సైన్యం ఉంది. మీరు దిగులు చెందనవసరం లేదు. మనకు ఆయుధాలు, శస్త్రాస్త్రాలు కోకొల్లలు. భయపడ నవసరమే లేదు మనకు.

"లంకేశ్వరా! భోగవతీనగరంపై దండెత్తి పన్నగులను జయించింది నీవు కావా! కుబేరుని గెలిచింది ఎవరు? యక్షుల్ని పీడించిం దెవరు? పుష్పకవిమానం సాధించిం దెవరు? నీకు భయపడి కాదా తన కూతురైన మండోదరిని మయుడు నీకిచ్చింది?

"రసాతలంలో నాగుల్ని గడగడ లాడించావే! అదంతా మరచిపోయావా! యముణ్ణి తరిమి కొట్టావే! అది జ్ఞాపకం రావడం లేదా! అవన్నీ తిరిగి చూసుకుంటే, ఈ రాముడెంత! ఇతని పరాక్రమ మెంత?

"దానవేశ్వరా! రాముని విషయంలో నీ అవసరం మాత్రం ఏముంది? నీవు శ్రమించాల్సిన అగత్య మేమొచ్చింది? ఒక్క ఇంద్రజిత్తు చాలడా! వాళ్ళందరిని కూల్చేయడానికి. దేవతల సేనాసముద్రంలో ప్రవేశించి, దేవేంద్రుని బంధించి, లంకకు ఈడ్చుకొని వచ్చిన ఇంద్రజిత్తు పరాక్రమం ఇంకా మా కళ్ళముందు ప్రకాశిస్తూనే ఉంది.

"రామునే కాదు. రామునితో పాటు అతని సోదరుని, వానరుల్ని అందరిని ఒక్క ఇంద్రజిత్తే వధించగలడు. రాజా! నీకు ప్రత్యర్థి సామాన్యుడు. పైగా మానవుడు. దాన్ని నీవు మరచిపో. మేమే రాముణ్ణి చంపేస్తాము" అన్నారు రాక్షసులు.

"రాజా! దేవ, దానవ, పిశాచ, గంధర్వ, పక్షి, సర్పాదులను యుద్ధములో ఓడించిన నీకు ఇద్దరు మానవులా ఎదురు నిలిచేది? మనము ఆదమరిచి ఉన్నప్పుడు వానరుడైన హనుమంతుడు మనల్ని మోసం చేశాడు. లేకుంటే, నా బొందెలో ప్రాణం వుండగా వాడు తిరిగి వెళ్ళగలడా?

"నీవు ఒక్కమాట చెప్పు. చాలు. ఈ ప్రపంచంలో అసలు వానరు డనేవాడే లేకుండా ఊడ్చేస్తాను. నీకు ఏ ఆపద రాకుండా చూసే బాధ్యత మాది. నువ్వు నిశ్చింతగా ఉండు" అన్నాడు ప్రహస్తుడు.

"హనుమంతుడు లంకలో చేసిన ఘోరం అంతా ఇంతా అనేందుకు లేకుండా ఉంది. దానికి తోడు సుగ్రీవుడు లంకేశ్వరుని పైకి ఎదిరించి రావడము ఏ మాత్రము సహించరానిది. నేను ఇప్పుడే వెళ్ళి ఆ వానరులు పాతాళంలో దాగినా, ఆకాశంలో ఎగిరినా, వాళ్ళందరిని వధించి వస్తాను" అన్నాడు దుర్ముఖుడనే రాక్షసుడు.

"మహారాజా! నాదొక మనవి. మనవారిలో కొందరు తమ కామరూప ప్రభావంతో మానవరూపమును ధరించి, భరతుని భృత్యులు లాగా రాముని వద్దకెళ్ళి, భరతుడు పంపిన సైన్యము వెనుక వస్తూ ఉంది అని చెప్పాలి. ఆ తరువాత మేము శూలాలు, ఖడ్గాలు, ధనుర్బాణాలు ధరించి అక్కడికి వెళ్తాం. ఆకాశంలో నిలబడి రామ, లక్ష్మణ, సుగ్రీవ, వానరుల నందరిని నేలకూల్చేస్తాము" అన్నాడు భయంకరుడైన వజ్రదంష్ట్రుడు.

కుంభకర్ణుని కుమారుడగు నికుంభుడు, పర్వతాకారము గల వజ్రహనువు "నేనంటే నేను" అని ముందు కురికారు రామలక్ష్మణులను వధించుటకు. రభసుడు, సూర్యశత్రువు, సప్తఘ్నుడు, దుర్ధర్షుడు, రశ్మికేతువు, ఇంద్రజిత్తు, విరూపాక్షుడు, ధూమ్రాక్షుడు మొదలైన రాక్షసవీరు లందరు ఆయుధాల్ని ధరించి నిలబడ్డారు. రామలక్ష్మణ సుగ్రీవ హనుమదాదులను తక్షణమే వధించాలని సంకల్పించారు.

రావణుని తమ్ముడైన విభీషణుడు వారిని శాంతింప చేశాడు. వారి ప్రయత్నాన్ని నివారించి కూర్చోబెట్టాడు. ఆప్తవాక్యాన్ని వినిపించాడు.

ఈ సందర్భమున సంత్ తులసీదాస్ ఒక సత్యవచనాన్ని చెబుతాడు.

సచివ వైద గురు తీన్ జౌ ప్రియ బోలహిఁ భయ ఆ స
రాజధర్మ తన తీన్ కర హోఇ బేగిహిఁ నాస

"మంత్రులు, వైద్యులు, గురువులు భయము చేత గాని, లాభమును ఆశించి గాని ముఖప్రీతిగా మాట్లాడినచో, అట్టివారి వలన క్రమంగా రాజ్యము, శరీరము, ధర్మము నాశన మౌతాయి"

రాజు క్షేమాన్ని కాంక్షించే సచివుడు ప్రియం కాకపోయినా ఉన్నదున్నట్లు రాజుకు చెప్పాలి. అలా చెప్పకుండా, రాజు మన్ననలు పొందడానికి ముఖస్తుతి చేసి సత్యాన్ని మరుగు పరిస్తే దానివల్ల రాజ్యమే బీభత్స మవుతుంది. ముఖప్రీతిగా మాట్లాడి రాజుగారి కార్యాల్ని పాడు చేయు సచివుడు రాజు పాలిటి గ్రహణము వంటివాడు అని చెప్పాలి.

రోగి ముఖప్రీతికి వైద్యుడు రోగికి తాళం వేస్తూ కూర్చుంటే రోగం ముదిరి ఆరోగ్యం చెడిపోతుంది. చికిత్స విషయంలో రోగి ప్రతికూలంగా ఉన్నా, అతనికి నచ్చచెప్పి చికిత్స చేయాలే గాని, రోగిని తృప్తిపరచేందుకు వైద్యుడు యత్నించ కూడదు. అలా చేయడం వల్ల రోగి పరిస్థితి విషమిస్తుంది. రోగాన్ని దాచి, రోగికి ముఖప్రీతిగా మాట్లాడి, ఆరోగ్యాన్ని పాడుచేసే వైద్యుడు రోగి పాలిటి శని వంటివాడు.

శిష్యుని విషయంలో గురువు ముఖప్రీతిగా మాట్లాడకూడదు. అజ్ఞానంలో అలమటించే వాడు శిష్యుడు. జ్ఞానంలో రాణించేవాడు, రమించేవాడు గురువు. శిష్యునిలోని లోపాల్ని ఎత్తి చూపి మందలించేవాడే గురువు. అంతే గాని, లోపాలు చెబితే, లేదా మందలిస్తే గురువుని వదలిపెట్టి వెళ్తాడేమో నని శిష్యునికి ముఖప్రీతిగా మాట్లాడి భుజం తట్టే గురువులు శిష్యుని పాలిటి దురదృష్టాలే అని చెప్పాలి. ఈవిధమైన గురువులు శిష్యుని బుద్ధిని పాడుచేయడమే గాక ధర్మము యొక్క భుజాల్ని కూడా ఖండిస్తారు.

విభీషణుని విమలనీతి

"సామ దాన భేదోపాయాల చేత కార్యాన్ని సాధించలేనపుడే దండోపాయాన్ని ఉపయోగించాలని పెద్దలు చెబుతారు. దండోపాయ మనేది అందరి విషయంలోనూ వర్తించదు. ఆదమరచి ఉన్న వారిమీద, శత్రువుచే ఎదిరింపబడిన వారిమీద, దైవ వంచితుల మీద మాత్రమే దండోపాయం పని చేస్తుంది.

"రాముడు సహజంగా వీరుడు. ఏమరుపాటు లేకుండా ఉన్నాడు. జయము మీద ఆసక్తి కలిగి ఉన్నాడు. బలవంతుడు, నిగ్రహవంతుడు అయిన రాముణ్ణి మీరు ఆగ్రహంతో ఏమి చేయగలరు?

"నదీనదాలకు ప్రభువైన సముద్రుణ్ణి దాటివచ్చి హనుమంతుడు లంకను కాల్చి వెళ్ళాడే! మీరు అది ఆలోచిస్తున్నారా! శత్రువు యొక్క పరాక్రమాన్ని ఎందుకని అంచనా వేయలేక పోతున్నారు. ఆవేశాన్ని కక్కే మీకు ఆలోచన మ్రింగుడు పడడం లేదు. అవగాహన జీర్ణం కావడంలేదు.

"సరే. అదలా ఉంచండి. మన లంకాధీశుడు రాముని భార్య యైన సీతను జనస్థానం నుండి అపహరించాడు కదా! అలా ఎందుకు చేయవలసి వచ్చింది? దానికి పూర్వం రాముడు మనకేమన్నా అపకారం చేశాడా!

"ఖరుణ్ణి వధించాడు రాముడు. అదేనా రామునిపై మనం మోపే అభియోగం! హద్దు తప్పి ప్రవర్తించిన ఖరునికి బుద్ధి చెప్పడం తప్పా! ప్రాణరక్షణ మనేది ఎవరికైనా ధర్మమే కదా!

"ఏది ఉన్నా, ఏది లేకున్నా సీత వల్ల మనకు భయముంది అనేది సత్యం. తెచ్చిన సీతను ఇచ్చెయ్యడమే మనకు శ్రేయం. కలహానికి కాలుదువ్వడం వల్ల ఏమి లాభం? రాముడు పరాక్రమవంతుడు. ధర్మమూర్తి. రామునితో వైరము మనకు మంచిది కాదు. సీతను రామునికి ఇవ్వడమే ఉత్తమము. అది కూడా త్వరగా జరిగితే మంచిది. రాముడు తన బాణాలతో లంకను ఆకుదొప్పలా చీల్చకముందే సీతను రామునికి అప్పగించడం మంచిది. వానరసేన లంకలో ప్రవేశించక ముందే సీతమ్మ రామునివద్ద ఉండాలి. స్వయంగా వెళ్ళి సీతను రామునికి అప్పగిస్తే రాక్షసు లందరూ క్షేమంగా ఉంటారు. లంక సురక్షితంగా ఉంటుంది.

"మేలుకూర్చే మంచిమాటను నేను మనసుతో చెపుతున్నాను. నా మాట వినండి. నేను మీ బంధువుని. మీ హితం కోరేవాణ్ణి. రామునికి సీతను ఇచ్చివేయడమే సముచితమైన నిర్ణయం.

"కోపం మనకు చెలికాడా! దానివల్ల మనకేమి ప్రయోజనం? సుఖాన్ని పాడుచేస్తుంది. ధర్మాన్ని హింసిస్తుంది. కోపాన్ని విడిచి పెట్టండి. సీతను రామునికిచ్చి, మనం మన భార్యాబిడ్డలతో హాయిగా జీవిస్తాం." అన్నాడు విభీషణుడు. విభీషణుని మాటలు వినిన రావణుడు తీవ్రంగా ఆలోచించాడు. సభను సమాప్తం చేసి, ఆలోచించుకుంటూ ఒంటరిగా అంతఃపురంలోకి వెళ్ళాడు.

రాత్రంతా రావణునికి నిద్ర పట్టలేదు. ఆలోచనా సుడులు హృదయాన్ని కల్లోలపరచాయి. తెల్లవారింది. ప్రాతఃకాలములో స్తవనీయుడైన విభీషణుడు రావణుని స్మరిస్తూ వచ్చాడు.

రావణుని గృహంలో వేదనాదాలు వినిపిస్తున్నాయి. పండితులు పారాయణాలు చేస్తున్నారు. రాక్షసులు భవనాన్ని రక్షిస్తున్నారు. శంఖధ్వనులు మారుమ్రోగుతున్నాయి. తూర్యధ్వనులు వినిపిస్తున్నాయి. అందమైన స్త్రీలు భవనంలో హడావుడిగా అటూ, ఇటూ తిరుగుతున్నారు. చూడడానికి అది ఇంద్రభవనంలా ఉంది. సూర్యుడు ఆకాశమున ప్రవేశించినట్లు విభీషణుడు రావణుని గృహంలో ప్రవేశించాడు.

వేదవిదు లైనవారు పుణ్యాహవచనాలు పఠిస్తున్నారు. బ్రాహ్మణులు అందించే గౌరవాలను అందుకొంటూ విభీషణుడు వెళ్ళి రావణునికి భక్తితో నమస్కరించాడు. ఎవ్వరూ లేని ఆ రహస్యమందిరములో విభీషణుడు హితవచనములు పలికాడు.

"అన్నా! ఎందుకో గాని, లంకలో ఎక్కడ చూచినా దుశ్శకునాలు దర్శన మిస్తున్నాయి. హోమగుండాలలో అగ్ని చక్కగా ప్రజ్వలించడం లేదు. ఒకవేళ జ్వలించినా, అంతా ధూమ మయంగా ఉంది. జ్వాలలు ప్రకాశవంతంగా లేవు.

"పాకశాలల్లో, యాగశాలల్లో, యోగశాలల్లో సర్పాలు కనిపిస్తున్నాయి. హోమద్రవ్యాలలో చీమలు ప్రాకుతున్నాయి. ఆవులిచ్చే పాలు ఉపయోగపడకుండా విరిగిపోతున్నాయి. గుఱ్ఱాలు పచ్చిగడ్డి నచ్చడం లేదు. ఏనుగులు ఏదోలా ఉన్నాయి. గాడిదలకు, ఒంటెలకు రోమాలు ఊడిపోతున్నాయి. కంచరగాడిదలు కన్నీళ్ళతో కనిపిస్తున్నాయి.

"కాకులు ఒకటే గోల, అదీ గుంపులుగా చేరి. గ్రద్దలు ఆకాశంలో గుండ్రంగా తిరుగుతూ వచ్చి నగరం మీద వాలుతున్నాయి. సంధ్యాసమయంలో నక్కలు అమంగళంగా అరుస్తున్నాయి. నగరద్వారాల వద్ద కుక్కలు ఏడుస్తున్నాయి.

"ఎందుకో నా మనసు ఏదో ప్రమాదాన్ని ఊహిస్తోంది. సీతను తిరిగి రామునికి ఇచ్చివేయడమే మంచిదనిపిస్తోంది. కోప్పడకు. నా మాటల్లో అజ్ఞానమే ఉండొచ్చు. లేదా ప్రాణభయం ఉండొచ్చు. నువ్వు మరొక్కసారి ఆలోచించు.

"ఈ దుశ్శకునాలు నాకే కాదు. రాక్షసు లందరికీ కనిపిస్తున్నాయి. వాటిని చూచి రాక్షసస్త్రీలు భీతి చెందుతున్నారు. నీతో చెప్పాలని అందరూ అంటున్నారు. ధైర్యం చాలక చెప్పలేక పోతున్నారు. నేను చూచింది చెప్పాను. వినింది విన్నవించుకున్నాను. నిర్ణయం నీదే;" అన్నాడు విభీషణుడు.

విభీషణుడు మితంగా మాట్లాడినా హితమే పలికాడు. అది కూడా అర్థవంతంగా పలికాడు. మెత్తగా మాట్లాడాడు. సహేతుకంగా వివరించాడు. ముందుచూపుతో చెప్పాడు. రావణుడు విన్నాడు. కానీ నచ్చలేదు.

"విభీషణా! భయపడవలసింది నాకేదీ కనిపించడం లేదు. రాముడు సీతను తిరిగి పొందడం కల్ల. అది నువ్వు మరచిపో. ఇంద్రాది దేవతలు తోడు నిలిచినా రాముడు నన్ను గెలవడం కూడా కల్లే. ఇది జ్ఞాపకం పెట్టుకో. సరేనా! ఇక నువ్వు వెళ్ళొచ్చు" అని విభీషణుని పంపేశాడు రావణుడు.

రాక్షసకొలువులో రావణుడు

భయం లేదని రావణుడు విభీషణునితో పలికిన మాటల్లో నిజమెంతో గాని, రావణునికి శాంతి దూరమైందని చెప్పడంలో రెండో ఆలోచన అవసరం లేదు. వరించిన వనితను వశం చేసుకోలేక పోయాడు. హనుమంతుడు సాగించిన నిర్వాకం వల్ల ప్రథమంగా నిర్విణ్ణుడయ్యాడు. దుశ్శకునాలు కనిపించడం ప్రారంభించాయి. తన బంధువులు కూడా కొందరు తను చేసిన పనిని అనుచితంగా ఆలోచిస్తున్నారు.

మనసు వ్యాకులమైంది. వెంటనే కొలువుకూటానికి కబురంపాడు. తాను బయలుదేరాడు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని భావించి కొలువుకూటానికి వస్తున్నాడు దశకంఠుడు.

మణులతో, వైడూర్యాలతో పొదగబడిన బంగారు రథాన్ని అధిరోహించాడు. శ్రేష్ఠములైన గుఱ్ఱాలు రథాన్ని లాగుతున్నాయి. ఖడ్గాలు, డాలులు ధరించిన రాక్షసవీరులు రథానికి ముందు, వెనుక నడుస్తున్నారు. వివిధ వేషాలతో, అలంకరణలతో దండాలు చేతుల్లో ధరించిన రాక్షస యువకులు రథానికి ఇరువైపుల నడుస్తున్నారు.

బలవంతులు, గొప్ప వీరులైన రాక్షసులు శ్రేష్ఠములైన అశ్వముల నధిరోహించి అనుసరిస్తున్నారు. రాక్షసు లందరూ శూలపాణులై, ఖడ్గపాణులై, పరశుపాణులై ఉన్నారు.

రావణుడు రథారూఢుడై వెళ్తున్నాడు. శంఖధ్వనులు, వేలాది వాద్యముల శబ్దాలు మిన్నుముట్టుతున్నాయి. రథంలో అందమైన స్త్రీలు ఇరుప్రక్కల నిలబడి చామరములు వీస్తున్నారు. రావణుని దర్శించిన వారంతా నేలమీద దణ్ణం పెడుతూ కదలకుండా నిలబడి యున్నారు.

సభాప్రాంగణంలో రావణుడు కాలు మోపగానే విజయఘోషలతో కొలువుకూటం దద్దరిల్లింది. వెండి, బంగారు స్తంభాలతో నిర్మించబడిన ఆ భవనంలో స్ఫటికశిలలు పరచి ఉన్నారు. వైడూర్యమణితో విశ్వకర్మ నిర్మించిన సింహాసనంపై ఆసీనుడయ్యాడు రావణుడు.

మంచి మంచి వస్త్రాలు ధరించి, అగరు చందనాది లేపాల సువాసనలతో ప్రకాశిస్తూ, అందమైన పుష్పమాలలను ధరించి ఉన్నారు అక్కడ ఆసీనులైన రాక్షసవీరులు, మంత్రులూను. దివ్యమైన పరిమళాలతో సభాభవనం గుబాళిస్తోంది.

సభ అంతా నిశ్శబ్దంగా ఉంది. ఒక్కరు కూడా నోరు విప్పడం లేదు. అంతకు ముందే విప్పి ఉంటే మూయడానికి సందేహిస్తున్నారు. కళ్ళు ఆర్పకుండా అందరూ ఒకే వ్యక్తిని వీక్షిస్తున్నారు. అతడే లంకాధీశుడైన రావణుడు. రావణుడు ప్రసంగం ప్రారంభించాడు.

"రాక్షసవీరులారా! మీ ఆలోచనలు గతంలో నాకు ఎంతగానో ఉపకరించాయి. మీరు ఆలోచించి ఆచరించిన పనులకు ఇంతవరకు విఘ్నం రాలేదు.

"రాముని భార్య యైన సీతను జనస్థానం నుండి అపహరించి తెచ్చాను. నాకు ప్రియురాలు కమ్మని చెప్పాను. అందమైన, అద్భుతమైన నా శయ్య నెక్కుటకు అదృష్టం లేక సీత నిరాకరిస్తోంది.

"సీత అందం నన్ను మందమతిగా మార్చేస్తోంది. ఆమెను మించిన అందగత్తెలు ముల్లోకాలలో వెదికినా లభ్యం కారు. స్వర్ణలతలా శోభించే ఆ సీతని పొందకుండా నేనెందుకు ఉన్నట్లు? నేనెక్కడి కెళ్ళినా, ఏం చేస్తున్నా, అగ్నిశిఖ లాంటి ఆమె శరీరం , ఎత్తైన ముక్కు, సుందరమైన నేత్రాలు, నిర్మలమైన ఆ ముఖం నన్ను వెంబడించి వస్తూనే ఉంటాయి. ఆమె అందమంతా కలిసి ఈ ప్రపంచంలో సాధించింది ఏమీ లేదు, నన్ను పిచ్చివాణ్ణి చేయడం తప్ప.

"ఈ విషయంలో నాకు మీ సలహా కావాలి. మీ నిర్ణయం కావాలి. ఆమె నా కోర్కెను ఇంకా మన్నించలేదు. ఆమెను తిరిగి అప్పచెప్పడం నేను ఊహించలేను. రాముడు వచ్చి తనను రక్షిస్తాడనే నమ్ముతోంది, నన్ను వెర్రివాణ్ణి చేసిన ఆ పిచ్చిది.

"ఇంతవరకు మనకు అపజయ మనేది తెలియదు. ఇటీవలే ఒక వానరుడు మనం తలవంచుకొనేలా ప్రవర్తించి వెళ్ళాడు. అంతమాత్రాన రామలక్ష్మణులు ఇక్కడికి రాగలరని నేను భావించడం లేదు. ఒకవేళ వస్తే ఏం చేయాలి?

సముద్రానికి ఆవలి తీరాన కపిసైన్యంతో రాముడు చేరివున్నాడు. రామలక్ష్మణుల్ని ఎలా వధించాలో చెప్పండి;" అన్నాడు దశకంఠుడైన రావణుడు.

గొప్ప బలవంతుడు, వీరుడు అయిన మహాపార్శ్వుడు అనే రాక్షసుడు రావణునితో ఇలా పలికాడు.

"రాజా! భయంకరమైన మృగాలు, విషసర్పాలు నిండియున్న అరణ్యంలోకి తేనె త్రాగాలని వెళ్ళి, చేతికందిన సమయంలో త్రాగకుండా తిరిగి వచ్చేవాణ్ణి మూఢుడు అంటాన్నేను.

"శత్రుసూదనా! నువ్వు సర్వసమర్థుడివి. నీకు ప్రభు వెవ్వరు? సీతను నీ సొంతం చేసుకో. రాజా! కోడిపుంజు కోడిపెట్టను తరిమి తరిమి భోగించునట్లు, నీవు సీతను బలవంతంగా నైనా అనుభవించు. దానికి ఆలోచన ఎందుకు? ముందు నీ కోర్కె తీరిపోనీ. ఆ తరువాత ఏది జరగాలో అదే జరుగుతుంది;" అని పలుకుతూ వాత్స్యాయనుడు కామసూత్రాలలో తెలిపిన "కుక్కుటవృత్తి" పద్ధతిని సూచించాడు మహాపార్శ్వుడు. (కృద్ధాం ఆక్రమ్య భోగస్తు కౌక్కుట స్యోపి సౌఖ్యద: - వాత్స్యాయన కామసూత్రాలు).

మహాపార్శ్వుని మాటలను ఆలకించిన రావణుడు తన జీవితంలోని ఒక రహస్యాన్ని వెల్లడి చేశాడు.

"మహాపార్శ్వుడా! నా జీవితంలో ఒక రహస్యం ఉంది. చెబుతున్నా. శ్రద్ధగా విను. ఇది చాలాకాలం క్రితం జరిగిన విషయం.

ఒకనాడు పుంజకస్థల అనే అప్సరస్త్రీ నా కంటబడింది. అంతటితో ఆగలేదు. సరాసరి వెళ్ళి నా మనసులో నిలిచిపోయింది. అగ్నిశిఖలా ప్రకాశించే ఆ పుంజకస్థలను నా హృదయం ఆశించింది. అది గ్రహించిన ఆ అప్సర దాగి దాగి వెళ్తోంది బ్రహ్మలోకానికి.

"నేను వెంబడించి పట్టుకున్నాను. ఆమెను వివస్త్రను చేసి అనుభవించాను. ఆమె నా చేతిలో తామరతూడులా నలిగిపోయి, ఏడుస్తూ బ్రహ్మలోకం వెళ్ళింది. జరిగిందంతా చెప్పింది బ్రహ్మకు.

"బ్రహ్మదేవుడు క్రుద్ధుడయ్యాడు. "రావణా! ఈ నాటినుండి ఏ స్త్రీనైనా బలాత్కరించి అనుభవించావా! ఆ మరుక్షణమే నీ తల నూరు ముక్కలై పోతుంది. జాగ్రత్త!" అన్నాడు.

"ఇదయ్యా అసలు విషయం. సీత తప్పించుకోవడానికి కారణం. ఆ శాపానికి భయపడి వెనుకాడుతున్నాను. లేకపోతే, నువ్వు చెప్పకముందే ముందుండేవాణ్ణి.

"మహాపార్శ్వుడా! ఆ రాముడికి నా విషయం తెలిసినట్టే లేదు. నా వేగము సముద్రం లాంటిదని, నా గమనము వాయుగతి వంటిదని పాపం అతడికి తెలిసినట్లు లేదు. లేకుంటే నాతో పోరాడటానికి సిద్ధపడతాడా! పర్వతగుహలో నిద్రించే సింహాన్ని లేపుతున్నాడు. ప్రాత:కాలంలో సూర్యుడు నక్షత్రాల్ని మాయం చేసినట్లు రాముణ్ణి, అతని సైన్యాన్ని అదృశ్యం చేసేస్తాను.

అనుజుని ఆప్తవాక్యం

రావణ మహాపార్శ్వుల మధ్య సాగిన సంభాషణమును ఆలకించిన సాధుసత్తముడగు విభీషణుడు ఇలా పలికాడు.

"రాజా! నాకు తెలియక అడుగుతున్నాను. క్షమించు. అసలు నువ్వు సీత నెందుకు కాంక్షిస్తున్నావు? ఆమె సుందరాంగి అని ఎందుకు భ్రమిస్తున్నావు? నిజమేదో నేను చెప్తున్నాను. విను.

"ఆమె స్త్రీ కాదు. ఒక మహాసర్పం. ఆమె వక్షస్థలమే పాముపడగ. ఆమె చిరునవ్వే విషకోఱలు. ఆమె చింతే విషం. ఆమె అయిదు వ్రేళ్ళు ఐదు తలలు. తెలిసిందా! ఇంతకీ, ఈ మహాసర్పాన్ని నీ మెడకు తగిలించింది ఎవరు?

"కోఱలు, గోళ్ళు ఆయుధాలుగా కలిగిన వానరవీరులు లంకను చుట్టుముట్టక ముందే సీతను రాముని కిచ్చెయ్యి. రామబాణాలు కదిల్తే రాక్షసుల తలలు రాలిపోతాయి. మహా పార్శ్వుడు, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, నికుంభుడు, అతికాయుడు- వీరెవ్వరూ రాముని ఎదు ర్కోలేరు. రాముడు బాణాన్ని ప్రయోగిస్తే దానిని నివారించే శక్తి దేవతలకు కూడా లేదు;" అని విభీషణుడు పలకగానే ప్రహస్తుడు లేచి విభీషణుని వాదాన్ని ఖండించాడు.

"రావణరాజ్యంలోని వీరులకు భయ మనేది అర్థంకాని విషయం. దేవ, దానవ, గంధర్వ, యక్ష, పన్నగాదులు మా ముందు నిలువలేరు. మానవుడైన రాముణ్ణి చూచి భయపడడ మనేది మాకు మ్రింగుడు పడని విషయం;" అన్నాడు ప్రహస్తుడు.

"ప్రహస్తా! రాముని విషయంలో నువ్వు, మహాపార్శ్వుడు, మన రాజైన రావణుడు చేసివ ఆలోచనలు ఫలించవు. అధర్మపరుడు స్వర్గం చేరడం ఎలా ఉంటుందో, నావ లేకుండా సాగరాన్ని దాటడం ఎలాంటిదో, మీరంతా రాముణ్ణి జయించడం అలా ఉంటుంది.

"రాముడు ధర్మమూర్తి. కార్యదక్షాపరుడు. ప్రహస్తా! పిడుగుల్లాంటి రామబాణాల్ని మీరింకా చూడలేదు. అందుకే ఇలా ఇష్టమొచ్చినట్లు వాగేస్తున్నారు. రామబాణాలు ప్రాణాంతకాలని మరువకు.

"మన రాజు వ్యసనలోలుడు. తీక్ష్ణస్వభావం కలవాడు. తొందరపాటు మనిషి. ఇతడు చెప్పిందానికి, చేసిందానికి తలలు ఊపడమే మీ కర్తవ్యమని మీరు భావిస్తున్నారు. మీరు హితులో అహితులో, మిత్రులో శత్రువులో నాకు తెలియడం లేదు. బాగా ఆలోచించండి. ఈ పద్ధతి రాక్షసనాశనానికే దారితీస్తుంది.

"కాలసర్పం రాజును చుట్టుకోనుంది. పొగడ్తలు, ప్రగల్భాలు ప్రక్కన బెట్టి ఆయనను రక్షించే దెలాగో ఆలోచించండి. నిజంగా మీరు రాజుగారి మేలు కోరేవారైతే అతనికి హితవు చెప్పండి. వినకపోతే జుట్టుపట్టి లాగి అయినా రక్షించండి (కేశగ్రహణాత్). బలవంతంగా నైనా ఒప్పించండి. అది హితులు, మిత్రులు చేయవలసిన పని. రాజుకు, మీకు, నాకు, మన పౌరులందరి మేలుకోరి చివరగా చెప్తున్నాను.

నరేంద్ర పుత్రాయ దదాతు మైథిలీమ్

"సీత రామునికి ఇవ్వబడు గాక!" అన్నాడు విభీషణుడు.

విభీషణుడు బుద్ధిశాలి. బృహస్పతి వంటివాడు. అందుచేత అతని మాటల్ని శ్రద్ధగా ఆలకించాడు రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు. విభీషణుని మాటలు ఇంద్రజిత్తుకు రుచించలేదు.

"చిన్నాన్నా! ఇదేమిటి? నువ్వేనా మాట్లాడేది? అర్థంలేని మాటలన్నీ పనిగట్టుకొని చెబుతున్నా వెందుకని? అందరికీ పిరికితనాన్ని ప్రయత్నించి పట్టిస్తున్నా వేమిటి? ఇలాంటి మాటలు ఇంత వరకు మన వంశీయులు ఎవరూ పలకలేదు. వినలేదు కూడా. సామాన్యులు కూడా ఇలా మాట్లాడరు. నీలాగా ప్రవర్తించరు.

"బలము, వీర్యము, పరాక్రమము, ధైర్యము, శౌర్యము గల మా కుటుంబములో నువ్వు ఒక్కడివే అవన్నీ లేకుండా మా నాన్నకు తమ్ముడుగా పుట్టావు. ఆపు నీ పిరికితనం! లంకలో దేనికీ కొరగాని వాడు కూడా రాముణ్ణి ఇటు, లక్ష్మణుని అటు చంపేస్తాడు. ఎందుకు వీరులందరినీ అదేపనిగా భయపెడ్తున్నావు?

"ముల్లోకాలకు ప్రభువట. సమర్థుడట. ఏమయ్యాడు పూర్వం ఆ దేవేంద్రుడు? మరచి పోయావా, అతణ్ణి నేలతోసి ఈడ్చిన విషయం. అది చూసి దేవత లందరూ దిక్కులు తెలియకుండా పారిపోలేదా! కూలిపోయిన ఐరావతం దంతాల్ని నేను ఊడబెరుకుతుంటే చలికి వణికినట్లు దేవతలు చలించిపోవడం నువ్వు చూడలేదా! దేవతల్నే తన్ని తగలేసిన నేను ఈ మానవమాత్రుల్ని ఎదుర్కోలేనా!" అని హుంకరించాడు ఇంద్రునితో సమానుడు, అసమాన పరాక్రమవంతుడు అయిన ఇంద్రజిత్తు. ఇంద్రజిత్తుకు అర్థయుక్తమైన సమాధానం చెప్పాడు విభీషణుడు.

"నాయనా! నీవు బాలుడివి. వివేకం లేనివాడివి. ఏది ఎలా ఆలోచించాలో తెలియని వాడివి. నువ్వు మాట్లాడే మాటలు నీకే వినాశకరములని గ్రహించ లేకున్నావు. అర్థం లేని మాటలన్నీ పేల్తున్నావు.

"ఇంద్రజిత్తూ! నువ్వు మా అన్నకు పుత్రుడివా! లేక పుత్రుని రూపంలో కనిపించే శత్రుడవా! లేకపోతే రాముని చేతిలో రావణునికి వినాశం తప్పదని చెప్తున్నా వినవెందుకని?

"నిన్ను చంపినా తప్పులేదు. నిన్నే కాదు. పిల్లకాయవు, ఆవేశపరుడవు అయిన నిన్ను క్లిష్ట సమస్యల్ని చర్చించే ఈ సభలోకి తీసికొని వచ్చి కూర్చోబెట్టింది ఎవరు? వాడు ఎవడైనా సరే. వాడుకూడా వధ్యుడే.

"ఇంద్రజిత్తూ! మూఢుడా! బుద్ధిహీనుడా! వినయవిధేయతలు లోపించిన అల్పుడా! దురాత్మా! దుష్టుడా! అజ్ఞానంతో నీ ఇష్టమొచ్చినట్లు పేల్తున్నావు.

"రాముని బాణాలంటే ఏమనుకున్నావోయ్. అవి బ్రహ్మదండము తేజస్సుతో శోభిస్తుంటాయి. యముణ్ణి మరపిస్తూ ఉంటాయి. రణరంగంలో అట్టి బాణాల్ని రాముడు ప్రయోగిస్తుంటే ఎవరు ఎదురు నిలిచేది? నువ్వా!

"లంకాధీశ్వరా! జ్యేష్ఠభ్రాతా! ఈ ఆవేశపరుల మాటలు వినవద్దు. అవి వినాశకారకాలు. నా మాట విను. ధనము, రత్నాలు, శ్రేష్ఠమైన వస్త్రాలు, మణులతో పాటు సీతమ్మను మర్యాదగా రామునికి అప్పగించు. మనము హాయిగా, సుఖంగా జీవిస్తాము;" అన్నాడు విభీషణుడు.

విమలమతులైన ధర్మాత్ములు పలికిన ఆప్తవాక్యాల్ని చెడుకాలం దాపురించిన వాళ్ళు వినరు. రావణునికి ఎంతో హితకరమైన విషయాన్ని చెప్పాడు విభీషణుడు. దుర్బుద్ధి యైన రావణుడు దానిని అంగీకరించలేక పోయాడు. రావణుని బుద్ధియొక్క ఈ దౌర్భాగ్యస్థితిని చక్కగా వ్యాఖ్యానించింది అధ్యాత్మరామాయణము.

శుభం హితం పవిత్రంచ విభీషణ వచః ఖలః
ప్రతి జగ్రాహ నైవాఽసౌ మ్రియమాణ ఇవౌషధం

"మంగళకరమైన, మేలైన ధర్మాన్ని చెప్పాడు విభీషణుడు. కానీ చావు మూడినవాడు ఔషధాన్ని నిరాకరించినట్లు విభీషణుని సలహాను కాలదన్నాడు రావణుడు".

తెగిన తీగలు

విభీషణుడు హితవు చెప్పాడు. హితం పలికాడు. అర్థయుక్తంగా మాట్లాడాడు. రావణుడు అవధానంతో ఆలకించాడు తమ్ముడు చెప్పిందంతా. కానీ ఏమి లాభం? కాలం కాటెయ్యడానికి సిద్ధంగా వుంది. అలాంటప్పుడు విభీషణుని విమలవాక్కులు ఎలా రుచిస్తాయి? తమ్ముడిపై మండిపడ్డాడు రావణుడు.

వసే త్సహ సపత్నేన క్రుద్ధే నాశీవిషేణ చ
న తు మిత్ర ప్రవాదేన సంవసే చ్ఛత్రుణా సహ ॥

"శత్రువుతో కలిసి బ్రతకవచ్చు. పగబట్టిన కాలసర్పంతో కలిసి నివసించవచ్చు. కానీ మిత్రుడిలా నటించే శత్రువుతో మాత్రం స్నేహం చేయకూడదు.

"ఓరీ! రాక్షసాధమా! విభీషణా! దాయాదుల స్వభావం ఇక్కడే కాదు. ఏ లోకానికి వెళ్ళి చూసినా ఇదే వరుస. అది నాకు తెలుసురా! ఎప్పుడు ఆపదలొస్తాయా! చూసి సంతోషిస్తామా! అని ఎదురు చూచే వారేరా జ్ఞాతులంటే!

"తమ కులంలో ముఖ్యుణ్ణి, కార్యసాధకుణ్ణి, విద్వాంసుణ్ణి, ధర్మశీలుణ్ణి, శూరుణ్ణి చూచి జ్ఞాతి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడు. జ్ఞాతులు క్రూరులు. మనసులోని భావాన్ని వెల్లడి చేయకుండా, ద్రోహబుద్ధితో ప్రవర్తిస్తూ, ఆపద లొచ్చినపుడు చంకలు ఎగరేస్తూ ఉంటారు.

"పూర్వం పద్మవనంలో ఏనుగులు కొన్ని శ్లోకాలు చెప్పాయి. అవి చెప్తాను. విను. ఏనుగుల్ని పట్టాలని కొందరు మనుషులు త్రాళ్ళు పట్టుకొని వచ్చారు. వాళ్ళను చూచి ఏనుగు లేమన్నాయో తెలుసా!

నాగ్ని ర్నాన్యాని శస్త్రాణి న నః పాశా భయావహాః
ఘోరాః స్వార్థ ప్రయుక్తాస్తు జ్ఞాతయో నో భయావహాః

"మాకు అగ్ని వల్ల భయం లేదు. ఇతర శస్త్రముల వలన కూడా భయం లేదు. పాశముల వల్ల కూడా భయం లేదు. స్వార్థపరులు, క్రూరాత్ములు అయిన జ్ఞాతుల వల్లనే మాకు భయం.

"మనల్ని ఎలా పట్టుకోవాలో దాయాదులే చెప్తారు. జ్ఞాతి భయానికి మించిన భయం మరొకటుండదు అన్నాయి ఆ ఏనుగులు.

"విభీషణా! లోకాలన్నీ నన్ను పూజించడం, గొప్ప ఐశ్వర్యంతో నేను తులతూగడము, శత్రువుల్ని త్రొక్కి ఉంచడము చూచి నీ కళ్ళు భగ్గుమన్నాయి. తామరాకు మీద పడిన నీటి బిందువులు ఒకదానితో మరొకటి ఎలా కలసి ఉండవో దాయాదులు కూడా అంతే.

"శరదృతువులో మేఘాలు ఉరుముతాయే కాని వర్షించి నేలను తడపవు. జ్ఞాతి కూడా అంతే. ప్రేమతో కూడిన మాటలే గాని మేలు చేసేదంటూ ఉండదు.

"తేనెను పానం చేసిన తరువాత తుమ్మెద మరొక పువ్వును అన్వేషించి చేరుతుంది. నీవూ అంతే. నా దగ్గర లాభాన్నంతా పొందావు. ఇక లాభం లేదని నన్ను నీ మనసు నుండి తీసేశావు. జ్ఞాతుల స్నేహం అలాంటిదే నని నాకు తెలుసు.

"ఏనుగు చాలా సేపు జలకాలాడుతుంది. స్నానం చేసి గట్టు మీదికి వచ్చిన తరువాత తొండముతో దుమ్మెత్తి పోసుకుంటుంది. చేసిన స్నానమంతా మట్టిగొట్టుక పోయినట్లే. అనార్యులతో స్నేహం కూడా గజస్నానం లాంటిదే. ఎంత చేసినా ఫలముండదు.

"ఓరీ రాక్షసుడా! ఆశతో వెళ్ళవచ్చుగాని రెల్లుపువ్వులో తుమ్మెదకు మకరందము దొరుకుతుందా! నాకు చాదస్తం గాని, జ్ఞాతి వైన నీలో ప్రేమ లభిస్తుందా! ఒరే కులపాంసకా! నీవు అన్నమాటలు మరొకడు అనివుంటే, ఈపాటికి తల నేలరాలి వుండేది, తాటిపండు లాగా;" అని విభీషణుని పరుషంగా నిందించాడు రావణుడు.

రావణుని దుర్వచనాలు విభీషణుని హృదయాన్ని తీవ్రంగా గాయపరచాయి. ధర్మానికి, న్యాయానికి చోటులేని రాజు దగ్గర మనుగడ మరణసదృశమని భావించాడు. గదను చేతియందు ధరించి ఆకాశానికి ఎగిరాడు విభీషణుడు. విభీషణునితో పాటు నలుగురు రాక్షసులు కూడా ఎగిరారు. ఆకాశంలో నిలిచి విభీషణుడు రావణునితో ఇలా పలికాడు.

"లంకేశ్వరా! నువ్వు పెద్దవాడివి. నీ ఇష్టమొచ్చినట్లు అను. అన్న తండ్రిలాంటి వాడు. గుణం లేకపోయినా గౌరవించదగిన వాడివే. కానీ నువ్వు మాట్లాడే మాటలు వినలేకపోతున్నాను.

"నేను నీ మంచి కోరి చెప్పాను. మృత్యువు వెంటాడే వారికి మంచి ఎక్కదు. గృహ దహనం జరుగుతూ వుంటే ఎలా చూస్తూ ఉండలేమో, నీవు నశించి పోవడం ఇష్టం లేక

చెప్పాను. రాముని పిడుగుల్లాంటి బాణాలు నిన్ను నేల రాల్చేస్తుంటే చూడలేని అశక్తతతో ఇదంతా చెప్పాను.

సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః

"తియ్యగా మాట్లాడేవారు తేలికగా దొరుకుతారు. ప్రియము కాకపోయినా మంచి చెప్పేవారు అరుదుగా ఉంటారు. అలాంటివారు ఒకవేళ ఉన్నా వినేవాళ్ళు అరుదు.

"నువ్వు నా అన్నవని ఇంతవరకు ప్రాకులాడాను. నాది తప్పయితే క్షమించు. నిన్ను నీవు రక్షించుకో. నిన్ను నమ్ముకున్న రాక్షసుల్ని రక్షించుకో. నువ్వు కట్టుకున్న భార్యల్ని కాపాడుకో. లంక గుల్ల కాకుండా చూసుకో. నీ మేలు కోరి నేను వెళ్తున్నా. నేనెలాగూ ఉండను. నువ్వు సుఖంగా ఉండు. చాలు;" అని పలికి ఆకాశమార్గంలో రామలక్ష్మణు లున్నచోటికి బయలు దేరి వెళ్ళాడు విభీషణుడు.

విభీషణుడు ఒంటరిగా వెళ్ళలేదు. రావణుని అదృష్టాన్ని కూడా వెంట తీసికొని వెళ్ళాడు. సాధుసంతాపము మంచిది కాదు. సాధుహింస వలన ఏర్పడే పాపము జన్మజన్మలకు వెంటాడుతూనే ఉంటుంది. మహాత్ముడైన విభీషణుని మాట వినక, అతడిని అవమానించి నందుకు రావణునికి దుర్గతి వాటిల్లింది. అలాగే వినీతుడైన విదురుని అవమానించి నందుకు కౌరవులకు దుర్గతి ప్రాప్తించింది భారతంలో.

రావన జబహి విభీషను త్యాగా భయేఉ విభవ బిను తబహి అభాగా
చలేఉ హరషి రఘునాయక పాహీం కరత్ మనోరథ బహు మన మాహి ॥

"పార్వతీ! సాధువులను తిరస్కరించువానికి వెంటనే సర్వశుభములు నశిస్తాయి. రావణుడు ఎప్పుడైతే విభీషణుని త్యజించాడో అప్పుడే అతని భాగ్యాలన్నీ నశించాయి" అని రామచరితమానసంలో శివుడు పార్వతీదేవితో చెబుతాడు.

సాధకుడు కేవలం జపధ్యానాదులు ఆచరించడం, పూజ సంకీర్తనాదులు చేయడం మాత్రమే కాకుండా కామమోహాదుల ఇనుపసంకెళ్ళ నుండి కూడా బయటపడాలి.

జ్ఞానమార్గంలో చరించు ముముక్షువు దృఢదీక్షాపరుడై, ప్రయత్నశీలుడై సంకెళ్ళను తనకు తానే విడగొట్టుకోవాలి. భక్తుని విషయం వేరు. కేవలం భగవదనుగ్రహం చేతనే తాను శృంఖలాలను వదిలించుకుంటాడు.

నిత్యము తాను ఆచరించే భక్తిసాధన ద్వారా భగవంతుని కృపావిశేషానికి భక్తుడు పాత్రుడవుతాడు. భగవంతుని అనుగ్రహము అద్భుతముగా పనిచేస్తుంది. తనకు దూరంగా వెళ్ళమని కామమే చెబుతుంది. ఇది సాధనలో చక్కని ఉచ్ఛదశ. భక్తుడు వదలక పోయినా కామమోహాదులు భక్తుడు తమను విడిచిపెట్టి వెళ్ళేలా చేస్తాయి. రావణుడు విభీషణుని విషయంలో అదే చేశాడు. అయితే విభీషణునికి అది వరమైంది. రావణునికి శాపమైంది.

స బభూవ కృశో రాజా మైథిలీ కామమోహితః
అసన్మానాచ్చ సుహృదాం పాపః పాపేన కర్మణా ॥

"సాధ్వి యైన సీతమ్మపై కామము, సాధువైన విభీషణునిపై క్రోధము- ఈ రెండు పాపకార్యాల వల్లనే రావణుడు నశించిపోయాడు" అంటాడు వాల్మీకిమహర్షి.

విభీషణ శరణాగతి

తనకు నచ్చినవి, రావణుడు మెచ్చనివి అయిన మంచిమాటలు చెప్పి, రాముడున్న చోటికి వచ్చాడు విభీషణుడు. మేరుశిఖరం లాగా, జ్వలించే మెరుపు లాగా నిముషంలో వెలిగిపోతూ ఆకాశంలో నిలబడియున్న విభీషణుని వానరులు చూశారు.

విభీషణుని చుట్టూ పరాక్రమవంతులైన నలుగురు అనుచరులు ఆయుధాలు, కవచాలు ధరించి నిలబడ్డారు. మేఘం లాగా, కొండ లాగా కనిపిస్తున్న విభీషణుడు వజ్రాయుధము వంటి కాంతితో వెలిగి పోతున్నాడు.



నలుగురు అనుచరులతో కూడి ఆకాశంలో శోభిస్తున్న విభీషణుని సుగ్రీవుడు చూశాడు. కొన్ని క్షణాలు దీర్ఘంగా ఆలోచించి వానర వీరులతో ఇలా పలికాడు.

"వీడెవడో రాక్షసుడిలా వున్నాడు. ఆయుధాలు ధరించి అనుచరులతో కూడి వస్తున్నాడు. మనల్ని చంపేందుకే వీడు వస్తున్నాడు. ఈ విషయంలో సందేహం అవసరం లేదు".

సుగ్రీవుని మాటలను ఆలకించిన వానరనాయకులు ఆవేశంతో ఊగిపోతూ, మద్దిచెట్లను పెకలించి కొందరు, పెద్ద బండలు ఎత్తుకొని కొందరు నిలబడి, "రాజా! అనుమతివ్వండి మాకు. చాలు. మరుక్షణంలో ఆ అల్పులు చచ్చి నేల మీద పడి ఉంటారు" అన్నారు.

వానరులు ఇలా మాట్లాడుకోవడం విభీషణుడు చూశాడు. కాని కంగారు పడలేదు. ఆకాశము నందే నిలబడి కంఠస్వరాన్ని పెంచి ఇలా పలికాడు.

"రాక్షసులకు ప్రభువు దుష్టుడైన రావణుడు. నేను అతడి తమ్ముణ్ణి. నన్ను విభీషణుడు అంటారు.

"జనస్థానం నుండి రావణుడు సీతను అపహరించాడు. మార్గమధ్యంలో నివారించిన జటాయువును విలువునా కూల్చేశాడు. దీనురాలైన సీతను బంధించాడు. రాక్షసస్త్రీలను ఆమెకు కాపలా పెట్టాడు.

"ఇది తగని పని అని నేను ఎన్నో విధాలుగా చెప్పాను. సీతను రామునికి తిరిగి ఇచ్చేయమని యుక్తియుక్తంగా చెప్పాను. రావణుడు నన్ను కోపగించుకున్నాడే కాని నా మాటను మన్నించలేదు. చావు మూడినవాడు మందును పారబోసుకున్నట్లు నా సలహాను

తిరస్కరించాడు. నన్ను అనరాని మాటలు అన్నాడు. బానిసను అవమానించినట్లు నన్ను అవమానించాడు. అది భరించలేక రాముని ఆశ్రయిస్తున్నాను.

త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః ॥

నివేదయత మాం క్షిప్రం రాఘవాయ మహాత్మనే

సర్వలోక శరణ్యాయ విభీషణ ముపస్థితమ్

"భార్యాబిడ్డల్ని విడిచి రాముణ్ణి శరణు బొందుచున్నాను. సర్వలోకశరణ్యుడు, మహాత్ముడు అయిన రామునికి విభీషణుడు అనే పేరుగల నేను వచ్చియున్నట్లు చెప్పండి".

విభీషణుని మాటలను ఆలకించిన సుగ్రీవుడు లక్ష్మణుని సమక్షములో రామునితో ఇలా పలికాడు.

"రామా! ఊహించకుండా వచ్చి శత్రుసైన్యంలో కలిసిన విరోధి అవకాశం చిక్కగానే గుడ్లగూబ కాకుల్ని వధించినట్లు చంపేస్తాడు. మనం చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. వ్యూహరచన చేయాలి. సావధానంతో వర్తించాలి. గూఢచారుల విషయంలో కూడా జాగరూకులమై ఉండాలి.

"రాక్షసులు మాయావులు. కామరూపులు. శూరులు. మోసాలు నేర్చినవారు. వాళ్ళనెప్పుడూ విశ్వసించ కూడదు. వీడు రావణుడు పంపగా వచ్చిన గూఢచారి. ఈ విషయంలో సందేహము అనవసరం. మనలో మనకు భేదాలు సృష్టించడానికి వచ్చాడు. మన లోపాల్ని పసిగట్టాలని అరుదెంచాడు.

"ప్రభూ! మిత్రుల సైన్యాన్ని తీసుకోవచ్చు. అడవి మనుషుల బలాన్ని అంగీకరించవచ్చు. కూలికి పనిచేసే వారి బలగాన్ని పుచ్చుకోవచ్చు. అంతేగాని శత్రుసైన్యాన్ని ఎప్పుడూ నమ్మకూడదు.

"వీడు రావణుని తమ్ముడు. కపటోపాయంతో మనల్ని మోసం చేయడానికే వచ్చాడు. వీణ్ణి అనుచరులతో కలిపి కడ చూపిస్తేనే మంచిది."

సుగ్రీవుని మాటలను ఆలకించిన రాముడు, "వానరవీరులారా! విభీషణుని విషయంలో సుగ్రీవుని అభిప్రాయాన్ని మీరంతా విన్నారు. మీ అభిప్రాయాలను కూడా చెప్పండి. కష్ట సమయాల్లో మిత్రుల సలహాలే కదా అవశ్యములు;". రాముడు అలా పలకగానే వానర వీరులు తమ తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా చెప్పారు.

"రామా! నీకు తెలియనిది ఏముందని? స్నేహపాత్రుడివి కనుక మమ్మల్ని అడిగి నీ గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నావు. నీవు సత్యవ్రతుడివి. ధర్మమూర్తివి. పరాక్రమవంతుడివి. ముందు వెనుక లాలోచించి కార్యమును నిర్వహించే సమర్థుడివి. నీ ఆజ్ఞమేరకు మేము ఒకొక్కరుగా మా అభిప్రాయాలు తెలుపుతాము" అని పలికి వారివారి భావాలను రాముని ముందు ఉంచారు కపివరులు.

అంగదుడు ఇలా అన్నాడు: "విభీషణుడు పరీక్షార్హుడు. శత్రువు నుండి వచ్చిన వాణ్ణి సందేహించాల్సిందే. వెంటనే నమ్మకూడదు. బుద్ధిని గమనించాలి. ఏమో! సమయం చూచి దెబ్బ తీయవచ్చు. మనం పరిశీలించాలి ముందు. గుణాలుంటే ఉంచుకుందాం. దోషాలు వుంటే తరిమి కొట్టేద్దాం. ఒకవేళ గుణాలే అధికంగా కనిపిస్తే అంగీకరిస్తాం. ఇది నా ఉద్దేశ్యం"

శరభుడు గొంతు విప్పాడు: "ఇతని విషయంలో ఒక గూఢచారిని నియమిస్తే మంచిదని నా సలహా. ఇతని ద్వారా అతనేమిటో తెలుసుకుందాం. ఆ తరువాత స్వీకరిద్దాం. లేదా, తరిమేద్దాం.

జాంబవంతుడు మనసులోని మాటను జార్చేశాడు: "ఎందుకో ఇతని విషయంలో నాకు అంతా అనుమానంగానే ఉంది. వచ్చిందేమో పాపాత్ముడు, మనకు శత్రువు అయిన రావణుని నుండి. అది కూడా రాకూడని కాలంలో. పైగా కాలుపెట్టకూడని చోటికి. అందరమూ కలిపి శంకించేద్దాం. అదే మంచిదని నా మనసు చెప్పిన మాట."

మైందుని నీతిస్వయంపాకం అందింది మెత్తగా: "రామా! ఇతడు రావణుని తమ్ము డంటున్నాడు కదా! మెల్లగా, మెత్తగా, తియ్యగా, తిన్నగా ఇతణ్ణి ప్రశ్నిస్తే రావణుడి గుట్టంతా బట్టబయలు కావచ్చు. ఈలోగా వీడి బండారం కూడా బయటపడి పోతుంది. ఆ తరువాత ఎలా తోస్తే అలా చెయ్యొచ్చు."

అనువైన మాటను అతుక్కునేలా చెప్పాడు హనుమంతుడు: "ప్రభూ! నీవు బుద్ధిశాలివి. వాగ్విదుడవు. నిన్ను మించి బృహస్పతి బుద్ధికూడా పనిచేయదు. నాదొక్క మాట. ఇది వాదించాలని నేను చెప్పడం కాదు. ఇతరులు చెప్పింది తప్పు అనే భావం అసలే లేదు. వారికంటే నేను అధికుడనని చెప్పడం కాదు. నీవు అడిగావు కనుక నాకు తోచింది విన్నవిస్తున్నాను. యుక్తాయుక్తము లైన కొన్ని కారణాలను కూడా వివరించ దలచుకున్నాను.

1. విభీషణుని పరిశీలించాలి అన్నారు అంగదుడు, ఇంకా కొంతమంది. అదెందుకో నాకు నచ్చడం లేదు. ఎందుకంటే, అది చెప్పడం వరకు బాగుంది కాని చెయ్యడం వచ్చేసరికి చెడి కూర్చుంటుంది. ఆచరణలో సాధ్యపడేలా లేదు.

విభీషణుణ్ణి పరీక్షించాలి. ఎలా? అతణ్ణి మనం పరీక్షించడానికి ఏదో ఒక కార్యంలో అతణ్ణి నియమించాలా, లేదా! కొత్తవ్యక్తికి వెంటనే కార్యం అప్పచెప్పడం మంచిది కాదని నా అభిప్రాయం.

2. గూఢచారిని నియమించాలని శరభుడు చెప్పాడు. వ్యక్తి అందుబాటులో లేనపుడు, దూరంగా ఉన్నపుడు, రహస్యంగా చరించినపుడు గూఢచారుల్ని పంపాలి. గూఢంగా ఉంటే కదా చారుల అవసరం! కళ్ళముందే చాప పరచుకొని కూర్చొనుండే వాడి విషయంలో చారలు వేసుకొని చారులు ఎక్కడికి వెళ్ళాలి? ఏమి చెయ్యాలి?

3. కాలం కాని కాలంలో, దేశం కాని దేశంలో అడుగుపెట్టాడు కనుక అతడు సంశయార్హుడు అన్నాడు జాంబవంతుడు.

దేశకాలాలు వ్యవహారిక సత్యాలు. వాటిల్ని ఎలాగైనా మలచుకోవచ్చు. మంచిచెడులు దేశకాలాలను బట్టి మారుతూ ఉంటాయి. ఒక కాలంలో తగని ప్రదేశము మరొక కాలంలో అదే తగిన ప్రదేశము అనిపించుకుంటుంది. ఒక దేశంలో ప్రతికూలమైన కాలము మరొక ప్రదేశంలో అనుకూలంగా ఉంటుంది.

దేశకాలాదుల్ని బట్టి చూసినా అతనిలో దోషము ఎలా గోచరిస్తుంది? అతడు సకాలానికే వచ్చాడు. రావలసిన చోటికే వచ్చాడు. రావణునిలోని దుర్గుణాలు చూశాడు. నీలోని సుగుణాలు తెలుసుకున్నాడు. రావణుణ్ణి అక్కడే, అప్పుడే వదిలాడు. నిన్ను ఇక్కడే, ఇప్పుడే ఆశ్రయించాడు. ఏముంది అందులో తప్పు?

4. ఇక మైందుడు అందించిన స్వయంపాకం మెత్తగా ఉన్నా, చిత్తపరిపాకం కొరవడినట్లు నా కనిపిస్తోంది. మనుషుల్ని మెల్లగా పంపి మెత్తగా ప్రశ్నించడమైతే మైందుడు చెప్పినట్లు బాగానే ఉంది. వచ్చినవాడు బుద్ధిశాలి అయినపుడు తనను శంకిస్తున్నట్లు గ్రహించడా? స్నేహం కోరి వచ్చినవాణ్ణి వంచించినట్లు అతడు భావిస్తే, పాకం చెడిపోదా! దగ్గర కావలసినవాడు దూరమౌతాడు కదా! ఏమో, ఇది అడుగంటే పాకమని నా కనిపిస్తోంది. మాటను పట్టుకొని మనసును చేరాలంటే ఎంతో నేర్పు కావాలి.

నత్వస్య బ్రువతో జాతు లక్ష్యతే దుష్టభావతా
ప్రసన్నం వదనం చాపి తస్మాన్మే నాస్తి సంశయః

"ఇతని మాటల్లో నాకు ఏ దోషమూ కనిపించడం లేదు. ప్రసన్నమైన అతని ముఖాన్ని చూస్తే సందేహం రావడం లేదు. అతడు సంశయించ దగినవాడు కాదని నా కనిపిస్తోంది.

"కుటిలుడు స్వచ్ఛంగా, ప్రసన్నంగా ఉండలేడు. ఆపుకుంటే ఆగేది కాదు స్వభావము. మనసులోని మర్మాలు తెలియకుండానే బయటపడుతాయి.

"రామా! రావణుడు దుష్టుడని గ్రహించాడు విభీషణుడు. నీవు ఉద్యమిస్తున్నావని కూడా తెలుసుకున్నాడు. వాలిని నువ్వు వధించావని, వాలి తమ్ముడైన సుగ్రీవునికి రాజ్యాభిషేకం చేశావని కూడా అతనికి తెలిసియే ఉంటుంది. ధర్మాత్ముడవైన నిన్ను ఆశ్రయించినట్లు ఉంటుందని, రాక్షసరాజ్యాన్ని పొందే అవకాశమూ ఉందని భావించి, బుద్ధిపూర్వకంగానే వచ్చివుంటాడని నా నమ్మకం. కనుక విభీషణుని స్వీకరించడం సమంజసమే నని నా అభిప్రాయం. రామా! నీ నిర్ణయమే మాకందరికీ శిరోధార్యము;" అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని వచనాలు రామునికి ఎంతో ప్రీతిని చేకూర్చాయి. తన మనసులోని అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని భావించి రాముడు ఇలా పలికాడు.

"విభీషణుని గూర్చి నేను కూడా చెబుతాను. వినండి. ఎవడైతే మిత్రుడని చెప్పుకుంటూ నన్ను సమీపిస్తాడో అట్టివానిని నేను విడువను. దోషముండినా విడవను. అప్పుడే మనల్ని సత్పురుషులు అంగీకరిస్తారు" అని రాముడు పలుకగానే సుగ్రీవుడు అడ్డు తగిలి మాట్లాడాడు.

"రామా! అతడు మంచివాడా! లేక చెడ్డవాడా! అనేది కాదు మనకు ప్రధానం. అన్నను ఆపదల్లో విడిచి వచ్చినవాడు అవసర మనుకుంటే ఎవర్నైనా ఎందుకు వదలడు?"

సుగ్రీవుని మాటలు రామునికి నవ్వు పుట్టించాయి. రాముడు ఆనందంతో అందరిని వీక్షిస్తూ "సుగ్రీవుడు చాలా చక్కగా చెప్పాడు. ఇలా అందరూ మాట్లాడలేరు. శాస్త్రములు చదివిన వారు, పెద్దల సేవ చేసినవారు మాత్రమే మాట్లాడగలరు.

"ఇక్కడ మనం చాలా సూక్ష్మంగా గ్రహించవలసిన విషయా లున్నట్లు నాకు తోస్తోంది. రాజులకు ఇది తెలిసిందే. లోకప్రసిద్ధం కూడా. జ్ఞాతులనే వారు సమయం వచ్చినపుడు వెన్నుపోటు పొడుస్తుంటారని పెద్దలు చెబుతుంటారు. ఇతడూ అలాగే వచ్చి ఉండవచ్చు.

"ఇతడు శత్రువు కూటమి నుండి వచ్చాడు. కనుక స్వీకరించకూడదు అని మీరు చెబుతున్నారు. బాగానే ఉంది. దీనిని మనం శాస్త్రీయంగా అర్థం చేసుకుందాం.

"ఇతడు మన జ్ఞాతి కాదు. కనుక ఇతనికి మనపై సహజమైన ద్వేషం ఉండేందుకు వీలులేదు. పైగా రాజ్యకాంక్ష ఉండనే ఉంది. రాక్షసుడు కనుక బుద్ధిహీనుడని తోసెయ్యడానికి వీలులేదు. రాక్షసుల్లో కూడా గొప్ప పండితు లున్నారు.

"దాయాదు లెవ్వరూ కలిసి ఉండరు. ఎప్పుడూ కలిసి ఉండరు. అందుచేత వాళ్ళు విడిపోతూ ఉంటారు. ఇతడూ రావణుని విషయంలో అలాగే ఉంటాడు.

న సర్వే భ్రాతర స్తాత భవన్తి భరతోపమాః
మద్విధా వా పితుః పుత్రాః సుహృదో వా భవద్విధాః

"సుగ్రీవా! సోదరు లందరూ భరతుడిలాగా ఉండరు. తండ్రుల కుమారు లందరూ నాలాంటి వాళ్ళే ఉండరు. స్నేహితు లందరూ నీలాంటి వాళ్ళే ఉండరు" అన్నాడు రాముడు బరువుగా.

అందరూ నీలాంటి స్నేహితులుగా ఉండరు అని రామునిచేత యోగ్యతాపత్రాన్ని పుచ్చుకున్న సుగ్రీవుడు ధన్యజీవి. రామసుగ్రీవుల మైత్రి ఆదర్శమైనది. అందరూ అనుకరించలేనిది.

స్నేహం పవిత్రమైందని తెలుసు. గాథలకు, గాయాలకు నిలయమైన ఈ ప్రపంచంలో స్నేహానికి గాథలు ఉన్నాయి. అలాగే గాయాలూ ఉన్నాయి. కలిసి ఉత్సాహపరచే స్నేహమే విడిపోయి నిరుత్సాహాన్ని, నిరాశను తోడు చేస్తుంది.

విడిపోయేవి స్నేహాలు కావు. ఊడిపోయేవారు స్నేహితులూ కారు. ఆడినా, మాడినా ఊడనిదే స్నేహం. వాడనిదే స్నేహం. స్నేహం పర్వతమార్గము. దిగుతూ ఎక్కడం లోనే దాని వైభవం.

స్నేహంలో ఒడుదుడుకులు సహజంగా ఉంటాయి. ఉండాలి కూడా. అప్పుడే నిజమైన స్నేహసుమాలు విరబూస్తాయి. సౌహార్ద పరిమళాలను వెదజల్లుతాయి.

స్నేహజీవనము అవగాహనతో కూడింది. రెక్కలాడిస్తూ ఎగిరే పక్షి లాంటిది కాదు. పచ్చగా నిలిచే చెట్టు లాంటిది. పసిడిపంజరంలో ఉంచినా ఎప్పుడు ఎగురుదామా! అని పక్షి ఆలోచిస్తుంది. గొడ్డళ్ళతో నరికినా ఎప్పుడు చిగురిద్దామా! అని వృక్షం ఉబలాట పడుతుంది. స్నేహంలో ఉబలాటమే గాని ఆరాటం లేదు.

విడిపోయి కూడినప్పుడే నిజమైన వేడుక. దాని వాడుకంతా స్నేహం లోనే ఉంది. కత్తిరించినప్పుడల్లా మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కలత లొచ్చినపుడల్లా స్నేహం ఏపారుతుంది. ఏరై పారుతుంది.

కొందరి స్నేహాలు కలతలు రాగానే కనుమరు గవుతాయి. కాదు. కాలిపోతాయి. కొందరి స్నేహాలు కలతల్లోనే కమనీయంగా కళకళ లాడుతాయి. అవే నిజమైన స్నేహాలు. అట్టి స్నేహశీలురే, స్నేహపాత్రులే మిత్రత్వ మనే పదానికి భాష్యకారులు.

"వర్షాకాలం ముగిసింది. ఇచ్చిన మాటను సుగ్రీవుడు మరచిపోయాడు. వాలికి తెరిచిన ద్వారం ఇంకా మూత పడలేదు. స్నేహంలో ద్రోహం సహింపరానిది. హెచ్చరించు నా మాటగా సుగ్రీవుని" అని రాముడు లక్ష్మణునితో ప్రస్రవణపర్వతం మీద పలికిన పలుకులు రాముని స్మృతిలో ఈనాడు మెదులుతున్నాయి.

నిందించినా, దూషించినా, దోష మాపాదించినా, కలత చెందకుండా స్నేహాన్ని ఐదు పది చేసి *పోషించిన సుగ్రీవుడు ఎంత సౌజన్యమూర్తి! ఇలాంటి స్నేహితులు ఎక్కడ లభిస్తారు?

* నమస్కరించి

అని తనలో తాను మూగమనసుతో మెలికలు తిరుగుతూ, "సుగ్రీవా! అందరూ నీలాంటి స్నేహితులే ఉండరు" అని గుండెల్లో నుండి పలుకుతాడు రాముడు. ఆ మాటలకు సూర్యరశ్మి సోకిన మంచుకొండలా కరిగిపోతున్నాడు సుగ్రీవుడు. స్నేహితులంటే ఇలా ఉండాలి. స్నేహానికి నిలువుటద్దాలై నిలవాలి.

సుగ్రీవుని లాంటి స్నేహితు లుండరు అని పలికిన రాముడు తండ్రులకు అందరూ తనలాంటి కుమారులే ఉండరు అంటున్నాడు. ఆదర్శపుత్రుడుగా రాముడికి రాముడే కనిపించడం విశేషం. ఈ మాటలో ఆత్మస్తుతి ఇసుమంతైనా లేదు. ఆత్మవిశ్వాసమే ప్రధానంగా తెలుస్తూ ఉంది.

పితృవాక్పరిపాలనలో రామునికి రాముడే సాటి. తండ్రి అసత్యపరుడుగా మిగలకూడదని తాను అడవుల్లో ప్రవేశించాడు. తండ్రి మరణించినా, తండ్రి కీర్తి బ్రతికే ఉండాలని భరతుడు సమర్పించిన రాజ్యాన్ని నిరాకరించి కానల్లో కష్టాలు పడడానికే నిర్ణయించుకొనిన కుమారుడు. ఆదర్శ స్నేహితుడుగా సుగ్రీవుడు, ఆదర్శపుత్రుడుగా రాముడు ఎలా గోచరిస్తున్నారో ఆదర్శ సోదరుడుగా భరతుని చూపిస్తున్నాడు.

ఆశించకుండా భరతునికి రాజ్యం సంక్రమించింది. తండ్రి ఇచ్చిన వరాల కారణంగా లభించిందే గాని తాను కోరింది కాదు. తన ప్రయత్నమే లేకుండా భరతునికి రాజ్యం సిద్ధం చేయబడింది. వసిష్ఠాది మహర్షులు కూడా ఆమోదముద్ర వేశారు. అయినా భరతుడు అంగీకరించలేదు. రాముడు రాజు కావాలే కాని తాను కాదని పట్టుపట్టి మునివేషం ధరించి, అడవికి వెళ్ళి, అన్న పాదాలను కన్నీటితో అభిషేకించి, రాజ్యాన్ని స్వీకరించమని ప్రాధేయపడ్డాడు. ఇలాంటి ఆదర్శసోదరులు ఎందరుంటారు? ఎక్కడుంటారు?

ఇక్కడ మీకు ఒక సందేహం రావచ్చు. ఆదర్శసోదరుడుగా రాముడు భరతుణ్ణే ఎందుకు చెప్పాడు? శత్రుఘ్నుణ్ణి అలా ప్రక్కన ఉంచినా, లక్ష్మణుని ఎందుకు విస్మరించాడు? ఎలా విస్మరించ గలిగాడు? అని.

రాముని సోదరులు అందరూ ఆదర్శవంతులే. కానీ భరతుడు, ఒక విధంగా చెప్పాలంటే అదృష్టవంతుడు. అందుచేతనే రాముని ప్రశంస నందుకున్నాడు. ఆదర్శమే ప్రధానమైతే అందరూ సమానులే. శత్రుఘ్నుని కూడా ప్రక్కన ఉంచేందుకు లేదు.

సింహాసనాన్ని నిరాకరించే అవకాశం భరతుడి కొక్కడికే లభించింది. రాజ్యాన్ని అన్న కొరకు తృణప్రాయంగా త్యజించి ఆదర్శసోదరుడు అనిపించుకున్నాడు. అదే అవకాశము లక్ష్మణునికి వచ్చినా, శత్రుఘ్నునికి వచ్చినా, భరతుడు ఏమి చేశాడో వాళ్ళూ అదే చేసుండేవారు. ఆదర్శానికి ప్రతీకాలుగా నిలిచేవారు. కనుక అందరూ ఆదర్శవంతులుగా నిలబడ్డ వేళ అదృష్టము ప్రధానపాత్ర వహించి అవకాశాన్ని అందిస్తుంది. అలాంటి అదృష్టవంతులు ముందువరుసలో నిలుస్తారు. అంతమాత్రాన వెనుక వరుసలోని వారు తక్కువని కాదు. ఒకే చెట్టులో మాగిన మధురఫలాలను కోసి గంపలో వేసినపుడు పైనున్నవి ముందుగా చేతికి అందుతాయి. అంతమాత్రాన క్రిందున్న ఫలాల రుచి తక్కువ కాదు.

"సుగ్రీవా! రాక్షసుడైన విభీషణుడు మంచివాడా? చెడ్డవాడా! అనే సందేహం అవసరం లేదు. అతడు మనకు ఏవిధంగాను చెడు చేయలేడు. నేను సంకల్పిస్తే ఈ ప్రపంచంలో వున్న పిశాచ, దానవ, యక్ష, రాక్షసాదులను కొనవేలితో కూల్చేస్తాను.

"నాయనా! శరణాగతుల్ని రక్షించడము ఉత్తమమైన ధర్మము. తన భార్యను చంపిన వానికి తన దేహాన్ని కోసి ఇచ్చింది కదా ఒకప్పుడు పక్షియైన పావురము!

"శరణాగతులైన వారి విషయంలో ఎలా ప్రవర్తించాలో పూర్వము కండుమహర్షి చెప్పియే యున్నాడు. కండుముని కణ్వమహర్షి కుమారుడు. సత్యభాషి.

"క్రూరుడు అనే అపకీర్తి రాకూడదని భావించువాడు, శరణని వచ్చినవాడు శత్రువైనా అతనిని వధించకూడదు. శరణు జొచ్చినవాడు, అర్హుడైనా, అహంకారి అయినా, అట్టి వానిని భయం చేత గాని, అజ్ఞానము వలన గాని, కోరిక వలన గాని రక్షింపకపోతే శరణు పొందబడిన వాడు పాపము చేసినవాడు అవుతాడు. శరణుజొచ్చిన వానిని కనికరించకపోతే చాలా పాపాలు చుట్టుకుంటాయి. స్వర్గద్వారాలు మూసుకుంటాయి.

"కండుముని మాటను మనం ఆచరిద్దాం. అది మన కీర్తిని పెంచుతుంది. ధర్మ సమ్మతము గానూ ఉంటుంది.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ.

"ఎవ్వడైనా సరే, నా వద్దకు వచ్చి "నేను నీవాడను" అని పలికి శరణు పొందితే చాలు. అతడికి ఏ ప్రాణివల్లా భయం లేకుండా నేను రక్షిస్తాను. ఇది నా వ్రతము". అన్నాడు రాముడు.

ఆత్మబంధువులారా! రాముడు పలికిన ఈ మాటను పదేపదే మననం చేయండి. ఇది కేవలం సుగ్రీవుని ఉద్దేశించి పలికింది కాదు. మనందరికీ చేసిన ఉపదేశం.

రాముడు కఠోర నియమవంతుడు. వ్రతస్వరూపుడు. శరణాగతులను రక్షించడం తన వ్రతమని చెప్తున్నాడు. ఇంతకన్నా మనకేమి కావాలి? లోకానికి శరణాగతులమై ఇంతవరకూ జీవించాము. ఏమి సాధించాము? ఇకనైనా మనసును సంస్కరించుకుందాం. శోకాన్ని పంచే లోకాన్ని మరచి, సౌఖ్యాన్ని ప్రసాదించే లోకాభిరాముని శరణువేడి తరిద్దాము.

"నేను నీవాణ్ణి" అని ఒక్కసారి అంటే చాలు అంటున్నాడు రాముడు. ఇది మన అనుభవంలో ఉన్నట్లే మనకు అనిపిస్తుంది. ఆలయానికి వెళ్ళినప్పుడల్లా "రామా! నీవే నాకు దిక్కు. నేను నీవాణ్ణి"-"కృష్ణా! నీవు తొలగించాలి చిక్కు. నేను నీవాణ్ణి",- "బాలాజీ! నీకే నా మొక్కు. నేను నీవాణ్ణి," - "శివా! నీ చూపు నాపై వేయవా! నేను నీవాణ్ణి."

అలా మాట్లాడేస్తారు ఆలయాల్లో గుక్క తిప్పుకోకుండా. ఇంటికి రాగానే అర్ధాంగితో "నేను నీవాణ్ణి" అంటారు. అందుచేత రోజూ వెళ్ళి భగవంతుని ఆలయంలో "నేను నీవాణ్ణి" అని తిరిగి చెప్పుకోవలసి వస్తోంది.

భగవంతునికి ఒకేసారి శరణాగతులం కావాలి. రెన్యూవల్ చేసుకొనే పద్ధతిని రాముడు హర్షించడు. ఒక్క పెళ్ళిరోజే పీటలమీద కూర్చోవడం జరుగుతుంది. రోజూ పీట లెక్కుతారా! ఎక్కవచ్చు. అయితే అది పెళ్ళి చేసుకొనేందుకు కాదు. తిండి తినేందుకు.

"సుగ్రీవా! వచ్చినవాడు శరణంటున్నాడు. వాడు విభీషణుడే కాదు. రావణుడైనా నష్టం లేదు. తీసికొనిరా. అతనికి అభయ మిస్తాను;" అని శరణాగతవత్సలుడైన రాముడు ముల్లోకాలు ముక్కుమీద వేలు ఉంచుకొనేలా ధర్మవ్యాఘ్రుమై గర్జించాడు.

శరణుజొచ్చిన వారిని రక్షించుటలో రామునికి మరొకరు సాటిలేరు, సాటి రారంటూ ఒక కీర్తనలో గానం చేశారు త్యాగరాజస్వామి.

ఎవ్వరే రామయ్య నీ సరి ॥ఎవ్వరే॥
రవ్వకు తావులేక సుజనులను, రాజిగ రక్షించే వా ॥రెవ్వరే॥
పగవానికి సోదరుడని యెంచక
భక్తి నెరిగి లంకాపట్టణ మొసగగా
నగధర సుర భూసుర పూజిత వర
నాగశయన త్యాగరాజ వినుత సరి ॥ ॥ఎవ్వరే॥

రవ్వంత సందేహానికి కూడా తావివ్వకుండా ఎందరు చెప్పినా వినక, శరణాగతుడైన విభీషణుడు శత్రువు అయిన రావణుని సోదరుడని కూడా తలచకుండా ఉద్ధరించిన రామునికి ఎవ్వరు సరిపోతారు అని ప్రశ్నించి పరవశించాడు త్యాగరాజస్వామి.

ఈ సందర్భమున ఆంధ్రదేశంలో గొప్ప ప్రాచుర్యము నొందిన ఒక విశేషాంశమును ప్రస్తావించుట అవశ్యమని భావిస్తున్నాను.

"రామా! విభీషణుడు శరణు అనగానే అతనిని అంగీకరిస్తున్నావు. అతడు రాజ్యకాంక్షతో వచ్చాడని తెలిసినా. రేపు రావణుడే వచ్చి "శరణు" అంటే అప్పుడేమి చేస్తావు?" అని ప్రశ్నిస్తే,

"ఏముంది? విభీషణునికి మాట ఇచ్చాను కనుక విభీషణుని లంకాధిపతిని చేస్తాను. రావణుని అయోధ్యాధిపతిని చేసి నా తమ్ముళ్ళతో కలిసి మళ్ళీ కానలకు వెళ్ళి జీవిస్తాను" అని రాముడన్నట్లు మనం వింటూ ఉంటాం.

ఈ ప్రస్తావన వాల్మీకి రామాయణంలో లేదు. అధ్యాత్మ, కంబ, తులసీ రామాయణాల్లో కూడా లేదు. ఈ విషయాన్ని త్యాగరాజస్వామి కృతినుండి గ్రహించామని కొందరు చెబుతారు. దాని భావ మది కాదని కొందరు పూర్వపక్షులౌతూ ఉంటారు.

హితవు మాట లెంతో బాగ బల్కితివి
సతముగా నయోధ్య నిత్తునంటివి
నత సహోదరుని రాజుజేసి రాక
హతము చేసితివి త్యాగరాజనుత ॥

అని "సరస సామ దాన భేద దండ చతుర" అనే కీర్తనలో రాముని అసమాన దైవంగా కీర్తించారు త్యాగరాజస్వామి.

"అయోధ్యను ఇస్తాను" అని రాముడన్నట్లు పై చరణము చెబుతోంది. అయితే ఎవరికి? ఎందుకు? అనే ప్రశ్న లుదయిస్తే మాత్రము ప్రామాణిక సమాధానం లభించదు.

అసలు అయోధ్య నివ్వడమనే ఈ విషయం ఎక్కడిది? త్యాగరాజస్వామి ఎలా ఉదహరించ గలిగారు? అని ఆలోచించినపుడు, దీనికి భాస్కర రామాయణం ఆధారమని తేలుతుంది. అందుచేత ఈ విషయం తెలుగుసీమలోనే ఎక్కువగా వినిపిస్తుంది.

అనఘ చరిత్ర మీకు శరణాగత రక్ష కులవ్రతంబు మీ
సునిశిత బాణజాలముల చోకున కోర్వక వచ్చి తా దశా
నను డభయంబు వేడికొని నందగ వెట్లగు నన్న న వ్విభుం
డిన సుతుజూచి యట్లయిన నిచ్చెద వాని కయోధ్య నావుడన్ ॥

ఇది భాస్కర రామాయణాంతర్గతము.

ప్రామాణికమా! కాదా! అనే విషయం రానపుడు మాత్రం పై విషయం ముచ్చటగానే ఉంది. భాస్కర రామాయణం ప్రస్తావించిన విషయము రాముని కళ్యాణగుణాలకు, వ్రత నియమాలకు అనుకూల మైనదియే గాని విరుద్ధమైనది కాదు. శరణాగత వత్సలుడైన రాముడు, శరణనిన రావణుని అనుగ్రహించడంలో అతిశయోక్తి ఏమీ లేదు. అవసరమైతే అయోధ్యను తృణప్రాయంగా త్యజించే త్యాగగుణం రామునికి లేనిదీ కాదు.

రాముని మాటలు ఆలకించిన సుగ్రీవుడు స్నేహపూర్ణ హృదయుడై, "ధర్మాత్మా! రామా! లోకనాథ శిఖామణీ! నువ్వు ఇలా పలకడంలో ఆశ్చర్య మేముంది? విభీషణుడు సాధు పురుషుడే అంటుంది నా అంతరాత్మ కూడా. ఏ కోణం నుండి చూచినా అతనిలో దోషం కనిపించడం లేదు. రామా! మంచివాడైన విభీషణుని మనలో కలుపుకుందాం. మాతో సమానుడుగా, స్నేహితుడుగా ఉంటాడు;" అని పలికాడు ధర్మాత్ముడైన సుగ్రీవుడు.

విభీషణుని అంగీకరించడానికి వీలులేదని అంతవరకు వాదించిన సుగ్రీవుడు, రాముని విమలవచనములను ఆలకించి వెంటనే తన అభిప్రాయాన్ని పసిబిడ్డలా మార్చేసుకున్నాడు. అదే సుగ్రీవునిలోని సౌజన్యం. అదే మరొక రెవరైనా సుగ్రీవుని స్థితిలో ఉంటే ఎలా బిగుసుకు పోయేవారో, రాముడు తన మాటకు విలువివ్వలేదని.

రాముడు అభయ మిచ్చాడు. తన అనుచరులతో కూడి ఆకాశం నుండి భూమి మీదికి దిగాడు విభీషణుడు. దిగి వెంటనే భూమిని చూశాడు **(భూమిమ్ సమవలోకయత్).**

1. భూమి ధర్మస్వరూపము. రాముడు ధర్మాత్ముడు. ధర్మాత్ముడైన రాముని యెదుట ధర్మబద్ధుడనై నిలబడి యున్నానని తెలుపుటకే విభీషణుడు భూమిని చూశాడు.*

2. సీతమ్మ అయోనిజ. భూమి నుండి పుట్టింది. పరమపవిత్రురాలు. ఆమె ఉన్న చోటునుండి వచ్చినట్లు, ఆమె వలె పవిత్రభావంతో నిష్కల్మషంగా ఉన్నట్లు గుర్తుచేస్తూ దృష్టిని భూమిపై సారించాడు విభీషణుడు.

---

*విభీషణుడు నేలపై దృష్టిని నిలపడంలో అంతర్భావాన్ని తెలుపుతూ ఐదు విధాలుగా నేను వ్యాఖ్యానించాను. ఈ వ్యాఖ్యలకు ఆధార మేమిటి? అని విజ్ఞులు ప్రశ్నించవచ్చు. వీటికి ఆధారా లేమీ లేవు. ధారలా సాగిన వ్యాఖ్యానాలే గాని ఆధారాలనే దారాల్ని పట్టుకొని వ్రేలాడలేదు అని సవినయంగా విన్నవించుకుంటున్నా.

"విభీషణుడు దిగగానే ఎందుకు నేలను చూడడం? అని నాలో ప్రశ్న ఉదయించింది. రెండు నిముషాలు కళ్ళుమూసి రాముణ్ణే ధ్యానించాను. ఏ ఉద్దేశంతో చూశాడో తెలుపమని విభీషణునికి శ్రీరామునికి నమస్కరించాను. వెంటనే చకచకమని మొదటి రెండు భావాలూ మనసులో మెదిలాయి. విభీషణుడు అనే పేరులో ఐదు అక్షరాలున్నాయి కదా! ఐదు భావాల్ని వ్రాయాలి అనిపించింది. వ్రాశాను. అంతా రామానుగ్రహంగా, రామప్రసాదంగా భావిస్తున్నా. నడిచిన కథంతా ఎక్కువగా ఇలాగే సాగింది...............రచయిత.

3. "రామా! ఇంతవరకు ఆకాశంలో నిరీక్షిస్తూ నిలబడ్డాను. నీవు క్రింద ఉండగా నేను పైన నిలబడి అపచారం చేశాను. నీ ఆజ్ఞకొరకు ఆకాశంలో నిలబడ్డానే కానీ అహంకారినై మాత్రము కాదు. నేను ఎప్పుడూ నీ చరణధూళినే" అనే భావంతో విభీషణుడు భూమిని చూశాడు.

4. "తండ్రీ! దుష్టుడైన నా అన్న రావణుడు చేయకూడని పని చేసి తలవంపులు తెచ్చాడు. అన్న చేసిన అపచారానికి నీ ముందు తలఎత్తుకొని నిలబడలేక పోతున్నాను" అనే భావంతో అవనిని అవలోకించాడు విభీషణుడు.

5. "రామా! నీ చరణకమలములను అర్చించే భాగ్యం నాకు ఈనాడు లభించింది. ఈ భాగ్యాన్ని అందరికన్నా ముందుగా పొందిన భాగ్యశాలి భూదేవి. ప్రథమంగా నీవు పాదం మోపింది భూమి మీదే కదా! పురాతనుడు, పురాణపురుషుడైన పరమాత్మను అర్చించే ముందు పూర్వాచార్యులను స్మరించడం సంప్రదాయం నేర్పిన సదాచారం కదా! నీ పాదాలను స్పృశించే ముందు భూదేవికి గురుభావంతో నమస్కరిస్తున్నాను" అని భూమిని చూశాడు.

ఇది యుద్ధకాండములో పందొమ్మిదవ సర్గ. ప్రథమ శ్లోకంలో నింగినుండి దిగుతాడు. రెండవ శ్లోకంలో విభీషణుడు నేలను చూస్తాడు. స్పృశిస్తాడు. మూడవ శ్లోకంలో రాముని పాదాలపై పడతాడు.

"ప్రభూ! నేను రావణుని తమ్ముణ్ణి. అన్న చేత అవమానింపబడి నిన్ను శరణుజొచ్చాను. లంకను విడిచిపెట్టాను. భార్యాపిల్లల్ని త్యజించాను. భోగాలను పరిత్యజించాను. మిత్రుల్ని మరచాను. నా సర్వస్వమూ నీవే. నా జీవితమంతా నీ పాదాల దగ్గరకే చేరింది;" అన్నాడు విభీషణుడు.

విభీషణుని మాటలను ఆలకించి రాముడు ప్రేమపూర్వకంగా చూశాడు. ఆ చూపు లోకోత్తరమైన, మహత్తరమైన చూపుగా వర్ణించాడు వాల్మీకి. కళ్ళతో త్రాగేస్తున్నట్లు చూశాడట విభీషణుని **(లోచనాభ్యాం పిబన్నివ).**

ఆ తరువాత రాక్షసుల శక్తిసామర్థ్యములను వివరించమని అడిగాడు విభీషణుని రాముడు. విభీషణుడు సంపూర్ణంగా వివరించి చెప్పాడు.

"రామా! బ్రహ్మదేవుడు పూర్వము వరాలిచ్చి యున్నాడు రావణునికి. అందుచేత గంధర్వులు గాని, పన్నగులు గాని, పక్షులు గాని, ఎవ్వరూ అతణ్ణి చంపలేరు.

"రావణుని క్రిందివాడు, నా పైవాడు ఒకడున్నాడు కుంభకర్ణుడని. గొప్ప పరాక్రమవంతుడు. యుద్ధంలో ఇంద్రుణ్ణి ఎదుర్కొనే సామర్థ్య ముంది వాడికి.

"రామా! ప్రహస్తుడని, నీవు వినే ఉంటావు. అతడు రావణుని సేనాధిపతి. పూర్వము కైలాసపర్వతము మీద జరిగిన యుద్ధంలో మణిభద్రుణ్ణి వధించింది ఇతడే.

"ఇక ఇంద్రజిత్తు. రావణుని కొడుకు. ఉడుముతోలు చేతికి తొడుక్కొని, అభేద్యమైన కవచాన్ని ధరించి కనబడకుండా యుద్ధం చేస్తాడు. యుద్ధం జరిగే సమయంలో హోమం చేస్తాడు. అగ్నిదేవుని తృప్తిపరచి, అగుపించకుండా రణరంగంలో ప్రవేశించి శత్రువుల్ని జయిస్తాడు.

"మహోదరుడని, మహాపార్శ్వుడని, అకంపనుడని ఉన్నారు. వీళ్ళు ముగ్గురూ ఇంద్రజిత్తుకు సేనాధిపతులు. లంకలో, చెప్పాలంటే పదికోట్లమంది రాక్షసు లున్నారు. అందరూ మాంసము తిని, రక్తం త్రాగుతారు. వీళ్ల అండతోనే రావణుడు దిక్పాలకుల్ని, దేవతల్ని జయించాడు. అన్నాడు విభీషణుడు.

"విభీషణా! రావణుని శౌర్యకార్యాలు చెప్పావు. బావుంది. ఇక నేను చెప్పేది విను. రావణుణ్ణి, ప్రహస్తుణ్ణి, ఇంద్రజిత్తుని సంహరించి నిన్ను రాజును చేస్తాను. ఇది సత్యం.

"రావణుడు రసాతలంలో దాగినా, పాతాళంలో దూరినా, బ్రహ్మలోకానికి పరుగులెత్తినా, ప్రాణాల్ని మాత్రం నానుండి రక్షించుకోలేడు. యుద్ధంలో రావణుణ్ణే కాదు, అతడి పుత్రుల్ని, పరివారాన్ని, బంధువులతో సహా వధించకుండా అయోధ్యలో కాలుపెట్టనని నా ముగ్గురు సోదరుల మీద ప్రమాణం చేసి చెబుతున్నా." అన్నాడు రాముడు.

రాముని మాటలను ఆలకించిన విభీషణుడు రామునికి నమస్కరించి, "ప్రభూ! యుద్ధంలో నేను నీ వైపు నిలుస్తాను. రాక్షసులతో యుద్ధం కూడా చేస్తాను;" అని పలుకుతున్న విభీషణుని అమాంతం కౌగలించుకున్నాడు రాముడు.

రాముడు విభీషణుని తన బాహువుల్లో బంధించాడు. వానరశ్రేష్ఠులు చాలామంది విభీషణుని బంధించమని సలహా ఇచ్చారు. రాముడు విభీషణుని బంధించాడు. సంకెళ్ళతో బంధించలేదు. బాహువుల్లో బంధించాడు.

భక్తుడైన వానిని తెలిసో, తెలియకో శిక్షించాలని ఎందరు ప్రయత్నించినా, రక్షించే ప్రయత్నంలో భగవంతుడు సదా సిద్ధంగా ఉంటాడు. శిక్షించే వానికి రెండు చేతులైతే రక్షించేవానికి వెయ్యి చేతులు.

విభీషణుడు సమస్తాన్ని త్యజించాడు. రాముణ్ణి శరణుజొచ్చాడు. రామానుగ్రహానికి పాత్రుడయ్యాడు. రావణుడు చేసే పాపంలో పాలులేకుండా చేసుకున్నాడు. గీతాచార్యుడు కూడా అదే బోధిస్తాడు.

సర్వధర్మా న్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః

"అర్జునా! సర్వధర్మములను విడిచిపెట్టు. నన్నొక్కడినే శరణుబొందు. సకల పాపముల నుండి నిన్ను నేను విడిపిస్తాను. దుఃఖించకు;" అన్నాడు భగవద్గీత-మోక్షసన్యాసయోగంలో శ్రీకృష్ణపరమాత్మ.

"లక్ష్మణా! సాగరము నుండి ఉదకాన్ని తీసికొనిరా! ఇప్పుడే, ఇక్కడే విభీషణుని లంకాధిపతిగా అభిషేకించు నాయనా!" అన్నాడు రాముడు. లక్ష్మణుడు రాముని ఆజ్ఞానుసారము విభీషణుని అభిషేకించి, రాక్షసరాజ్యానికి రాజుగా ప్రకటించాడు. వానరు లందరూ తోకలను క్రిందికి, పైకి, ప్రక్కకి త్రిప్పుతూ "బాగు-బాగు" అని మెచ్చుకున్నారు.

హనుమంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు ఒకచోట కూర్చున్నారు ముచ్చటించుకుంటూ. సముద్రాన్ని ఎలా దాటాలి? అని విభీషణుని అడిగారు. రాముడు సాగరుని శరణు పొందుట మంచిదని చెప్పాడు విభీషణుడు.

విభీషణుడు చెప్పిన విషయాన్ని సుగ్రీవుడు రామునికి తెలిపాడు. రాముడు కూడా సమ్మతించాడు. ఆలస్యము మంచిది కాదన్నారు సుగ్రీవలక్ష్మణులు.

సముద్రం మీద సేతువును నిర్మించకుండా లంకకు చేరడం దేవదానవులకు కూడా సాధ్యం కాని పని. వీలు కల్పించమని సాగరుని ఆశ్రయించడమే మంచిదని అందరూ భావించారు.

రాముడు లక్ష్మణసుగ్రీవుల మాటలకు సంతసించాడు. సముద్రతీరాన దర్భలు పరచుకున్నాడు రాముడు. వేదిలో ప్రకాశించు అగ్నిహోత్రుని లాగా దర్భశయనముపై పవ్వళించాడు.

దిక్కుతోచని దశాననుడు

లంక నుండి శార్దూలుడనే రాక్షసుడు వచ్చాడు. సాగరతీరంలో నిలిచియున్న రామ దండును చూశాడు. గూఢచారి అయిన శార్దూలుడు తిరిగి లంకకు వెళ్ళి వ్యూహములుగా ఏర్పడియున్న భల్లూక కపి సైన్యాల్ని గూర్చి రావణునికి తెలిపాడు. ఆ సేన మరొక సముద్రంలా కన్పిస్తోంది అన్నాడు.

"రాజా! రామలక్ష్మణులు లంకను చేరే ప్రయత్నములో ఉన్నారు. సాగరతీరమున పది యోజనముల ప్రదేశాన్ని వానరసేన ఆక్రమించి ఉంది. మీరు త్వరపడాలి. దూరంగా నిలబడి నేను ఇదంతా చూసి వచ్చాను. మరికొందరు దూతల్ని పంపడం కూడా మంచిదే. సామ, దాన, భేదోపాయాలలో ఏదో ఒకటి ఎన్నుకోక తప్పదు" అన్నాడు శార్దూలుడు.

సామదానభేదాలను గూర్చి మాత్రమే శార్దూలుడు తెలిపాడు. దండోపాయాన్ని ప్రస్తావించలేదు. దండోపాయానికి అవకాశం లేని విధంగా ఉంది వానరసైన్యం అనే అర్థాన్ని సూచిస్తూ మాట్లాడాడు.

రావణునికి కంగారు ఏర్పడింది. దిక్కు తోచలేదు. ఇంద్రజిత్తు బంధించి తెచ్చినపుడు రావణుని కొలువులో వానరుల శక్తిసామర్థ్యాలను గూర్చి హనుమంతుడు పలికిన మాటలు వీనులలో ప్రతిధ్వనిస్తున్నాయి. వెంటనే శుకుడనే రాక్షసుణ్ణి పిలిచి ఇలా పలికాడు రావణుడు.

"నువ్వు ఇప్పుడే సుగ్రీవుని వద్దకు వెళ్ళు. నేను పంపించాను అని చెప్పు. భయపడకుండా నా మాటల్ని తియ్యగా వినిపించు. తెలిసిందా!

"మహారాజా! సుగ్రీవా! నువ్వు ఉత్తమకుల సంజాతుడవు. బలశాలివి. ఋక్షరజస్సు కుమారుడివి. ఈ యుద్ధములో నువ్వు తల ఎందుకు దూర్చుతున్నావు. నీకు ఏమి ప్రయోజనం దీనివల్ల? ఈ యుద్ధములో నీకు వచ్చేదేమిటి? పొయ్యే దేమిటి? సుగ్రీవా! నువ్వు నాకు తమ్మునివంటి వాడవు. రాముడి భార్యను నేను అపహరించాను. మధ్యలో నీకేమి సంబంధము? నా మాట విను. తిరిగి కిష్కింధకు వెళ్ళిపో.

"వానరులు లంకలో ప్రవేశించడం కల్ల. దేవగంధర్వాదులే కాలు పెట్టలేక పోయారే! నరులు, వానరులా ఇక ప్రవేశించేది? నేనిలా చెప్పానని సుగ్రీవునికి చెప్పు" అన్నాడు రావణుడు. శుకుడు పక్షి రూపాన్ని ధరించి ఆకాశంలోకి ఎగిరాడు. సముద్రాన్ని దాటాడు. ఆకాశంలో నిలబడి రావణుడు చెప్పిన విషయాన్ని సుగ్రీవునికి తెలిపాడు.

శుకుడు మాట్లాడుతూనే ఉన్నాడు. ఈలోగా వానరులు అతని రెక్కలు ఊడబెరకాలని, పిడికిళ్ళతో కొట్టాలని చివుక్కున పైగి ఎగిరారు. శుకుణ్ణి పట్టేశారు. కదలకుండా రెక్కలు కట్టేశారు. ఇష్ట మొచ్చినట్లు కొట్టేశారు.

భూమిపై పడిన శుకుడు రోదిస్తూ, "రామా! దూత నెవరైనా చంపుతారా! ఈ కపులు చూడు. నన్ను కుమ్మేస్తున్నారు. రక్షించు రామా! రాజు చెప్పిన దానికి వ్యతిరేకంగా చెప్పే దూత వధార్హుడు. లేదా, రాజు చెప్పని విషయాల్ని కనుక దూత చెప్పి ఉంటే అప్పుడు కూడా వధార్హుడే. నేను ఈ రెండూ చెయ్యలేదు. నన్ను పీడించడం న్యాయమా?" అన్నాడు శుకుడు.

"అతణ్ణి విడిచిపెట్టండి" అన్నాడు రాముడు. వానరులు విడిచిపెట్టారు. శుకుడు రెక్కలతో ఎగిరి ఆకాశాన నిలబడ్డాడు.

"సుగ్రీవా! ఇంతకీ, రావణప్రభువుకి ఏం చెప్పమంటావు?" అని అడిగాడు శుకుడు. సుగ్రీవుడు ఇలా చెప్పాడు సమాధానం.

"రావణా! వధార్హుడా! నువ్వు నా మిత్రుడివి కావు. నీ మీద జాలి చూపాల్సిన అవసరం నాకు లేదు. పైగా నీవు ఏదైనా ఉపకారం చేసిన వాడివీ కావు. పోనీ ఇష్టుడివా! అంటే, అదీ లేదు. రాముడితో వైరం పెట్టుకున్నావు. వాలి లాగా రాలిపోతావు.

"వాలి ఒంటరిగా వెళ్ళాడు. నీకు ఆ బాధ ఉండదు. నీ కొడుకులు, బంధువులు, జ్ఞాతులు-అందరితో కలిసి నువ్వు వెళ్ళవచ్చు. నిన్ను, నీవాళ్ళ నందరినీ నేను కూల్చేస్తాను. లంకనంతా బూడిదగా మార్చేస్తాను.

"ఓరీ మూఢుడా! నిన్ను దేవతలు కూడా రక్షించలేరు. ముల్లోకాలలో ఎక్కడికి నీవు పారిపోయినా రామబాణం నిన్ను వెంబడించే ఉంటుంది.

"మహా చంపావు లేవోయ్, ముసలి జటాయువుని. రామలక్ష్మణులు దగ్గర ఉన్నప్పుడు సీతను అపహరించలేక పోయావేమి? వీరుడివి కదా! దొంగలా దోచుకున్నావేమి?

"రావణా! రాముణ్ణి గూర్చి నీకు తెలీదు. రాముడు ధర్మాత్ముడు. మహాత్ముడు. బలశాలి. నీ ప్రాణాలు తోడేస్తాడు-చెప్పు వెళ్ళి రావణుడికి ఇది నా మాటని." అన్నాడు సుగ్రీవుడు.

"చిన్నాన్నా! ఎందుకో నా మనసు శంకిస్తోంది. వీడు దూత కాదు. గూఢచారియే అనిపిస్తోంది. వీడు మన సైన్యాన్నంతా అంచనా వేశాడు. లంకకు పోనివ్వకుండా వీడ్ని బంధించడమే మంచిది. ఇది నా అభిప్రాయం" అన్నాడు అంగదుడు.

అంగదుడు చెప్పింది వినగానే సుగ్రీవుడు శుకుణ్ణి బంధించమన్నాడు. మాట నోట్లో మిగిలి ఉండగానే ఎగిరి పట్టేసుకున్నారు వానరులు. అంతటితో ఆగలేదు. తోకలతో, పిడికిళ్ళతో లాగించేస్తున్నారు. వాయించేస్తున్నారు.

"రామా! రామా! మళ్ళీ కథ అడ్డం తిరిగింది తండ్రీ! నా కళ్ళు పొడిచేస్తున్నారు కపులు. నా రెక్కలు విరిచేస్తున్నారు భల్లూకాలు" అంటూ గోలపెట్టేశాడు.

"ఆగండి. దూతను వధించడం ధర్మం కాదు." అన్నాడు రాముడు. ఆ మాటతో వానరులు శుకుణ్ణి కొట్టడం మానేసి వదలకుండా బంధించారు.

సాగర శరణాగతి

రాముడు సముద్రునికి నమస్కరించాడు. కుశలు పరచుకొని, సర్పదేహంలా మెత్తని తన భుజాన్నే తలగడగా పెట్టుకొని సాగరతీరాన రాముడు శయనించాడు. ధగధగమని మెరిసే సువర్ణ పడకలపై పవ్వళించే దశరథరాముడు దర్భశయను డయ్యాడు.

ఏ భుజాలకు పూర్వము మణులు పొదిగిన సువర్ణ దండకడియాలు శోభించేవో, ఆ భుజాలు ఈనాడు తలగడాలుగా ఉపకరిస్తున్నాయి. అగరు చందనాది లేపనములతో శోభించే భుజాలు దర్భలను అంటిపెట్టుకొని ఉన్నాయి. రణరంగములో శత్రువులకు దుఃఖాన్ని, మిత్రులకు సుఖాన్ని పెంపొందించే భుజాలు, ఎన్నో దానాలు చేసిన భుజాలు, పొడవైన భుజాలు ఈనాడు ముడుచుకొని తలగడా లయ్యాయి. "మరణమో-సముద్ర తరణమో" ఏదో ఒకటి జరగాలి అని భీష్మించుకొని పడుకున్నాడు దాశరథి.

మూడు రోజులు గడిచిపోయాయి. మూఢునిలాగా మారుపలకలేదు సముద్రుడు. ధర్మాత్ముడైన రాముడు నదీనదాలకు ప్రభువైన సాగరుని ప్రార్థిస్తూనే ఉన్నాడు. సాగరుడు ప్రత్యక్షం కాలేదు.

"లక్ష్మణా! ఎంత గర్వం పట్టుకొంది ఈ సాగరుడికి. ఈ లోకం పోకడే అంత. మెత్తని వానిని అందరూ మొత్తుతారు. మెత్తదనము మంచిది కాదు. దానివల్ల కీర్తి రాదు. యశస్సు రాదు. విజయమూ లభించదు.

"తన్ను తాను పొగుడుకొనే వాణ్ణి, దుష్టుణ్ణీ, మొసగాణ్ణి, భయపెట్టేవాణ్ణి, పట్టికొట్టేవాణ్ణి పూజించడానికి అలవాటు పడింది ఈ ప్రపంచం.

ప్రశమశ్చ క్షమా చైవ ఆర్జవం ప్రియవాదితా
అసామర్థ్య ఫలాహ్యేతే నిర్గుణేషు సతాం గుణాః

"లక్ష్మణా! శాంతము, సహనము, ఋజుత్వము, ప్రేమభాషణము గల సత్పురుషుల సుగుణాలను చూచి వారిని గుణహీనులుగా, బలహీనులుగా భావిస్తుంటారు లోకులు.

"లక్ష్మణా! నా శక్తి ఏమిటో చూపిస్తాను. నా బాణాలతో, దేహాలు తెగిపోయిన మొసళ్ళతో కల్లోలమైన సముద్రాన్ని నీవు చూస్తువుగాని. పెద్ద చేపల తెగిన దేహాలతో, ఖండింపబడిన జలకుంజరాల తొండములతో, ముక్కలుగా తెగిపోయిన నాగుల శరీరాలతో, శంఖాలతో, ముత్యపు చిప్పలతో అల్లకల్లోల మయ్యే ఈ అంభోధిపై మరికొన్ని పిడుగుల్లాంటి బాణాల్ని కుప్పించి సముద్రుణ్ణి ఎండకట్టేస్తాను.

"నా ఓర్పును పరీక్షిస్తున్నాడు. నా మంచితనాన్ని బలహీనతగా భావిస్తున్నాడు. ఇలాంటి మూఢుని విషయంలో సహనం పనిచేయదు. లక్ష్మణా! తీసికొనిరా! ధనుర్బాణాలను ఇవ్వు. నామరూపాలు లేకుండా చేసేస్తాను. వానరులు హాయిగా నడిచి వెళ్తారు.

"చెలియలికట్టను దాటని సముద్రుడు ఇప్పుడు దాటుతాడు. గట్టునే కొట్టేస్తాను. తీరాన్నే తీసిపారేస్తాను;" అని పలికి ధనుర్బాణాలను చేత పట్టుకున్నాడు దాశరథి.

మనసులో క్రోధం జ్వలిస్తోంది. చేతిలో కోదండం జమాయిస్తోంది. ప్రళయకాలాగ్నిలా ప్రచండరూపు డయ్యాడు రాముడు. చూస్తుండగనే ధనుస్సును ఎక్కుపెట్టాడు. బాణాన్ని సంధించాడు.

నిప్పులు కక్కుతూ సాగరంలో ప్రవేశించాయి నారాచబాణాలు. వాటి తాకిడికి సముద్రము కల్లోలమై పోయింది. భుజంగాలు భయంతో గడగడ వణికాయి. మొసళ్ళు భయంకరంగా అరిచాయి. చాలా చేపలు చచ్చి తేలాయి. కెరటాలు దారుణంగా లేచి పడుతున్నాయి. పెద్దగా పొగ లేచింది.

పాతాళంలో రాక్షసులు భీతి చెందారు. కల్లోలమైన కడలిలో లేచి పడే కెరటాలు కొండల్లా కనిపిస్తున్నాయి.

రాముడు మళ్ళీ బాణాన్ని చేత బూనాడు. లక్ష్మణుడు వెళ్ళి, "అన్నా! ఆగు! బాణాన్ని లాగకు!" అని ధనుస్సును గట్టిగా పట్టుకొని వారించాడు.

"సముద్రుడా! పాతాళం దాకా నిన్ను ఇప్పుడు ఎండింపచేస్తాను. నీ జలమంతా కాలి ఇంకిపోతుంది. నీలోని ప్రాణులన్నీ నశించిపోతాయి. నీ నుండి దుమ్ము పైకి లేస్తుంది. నా పరాక్రమాన్ని చూస్తూ కూడా నువ్వు గ్రహింపలేకున్నావు. ఇక దుఃఖిస్తావు" అంటూనే బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు.

రాముడు బ్రహ్మాస్త్రాన్ని సంధించగానే భూమ్యాకాశాలు పగిలి ముక్కలైనట్లైంది. పర్వతాలన్నీ కంపించాయి. దిక్కులన్నీ చీకట్లతో నిండిపోయాయి. నదీనదాలు క్షోభించాయి. సూర్యచంద్రుల గతులు మారాయి. ఆకాశం నుండి పిడుగులు పడ్డాయి. ఆకాశంలో భయంకరమైన సుడిగాలి వ్యాపించింది. భూమిపై చెట్లు కూలిపోయాయి. సాగరం ఒక యోజనము దూరము చెలియలికట్టను దాటి దక్షిణంగా వెళ్ళింది. రాముడున్న వైపు ఒక యోజనము దూరము లోని కెళ్ళింది.



మేరుపర్వతం నుండి సూర్యుడు పైకి లేచినట్లు సాగరకెరటాల మధ్యనుండి సముద్రుడు పైకి లేచాడు. మంటలు గ్రక్కుతున్న సర్పాలతో, దివ్యమైన అలంకారాలను ధరించి, వైడూర్య మణి లాంటి దేహంతో సము వ్యక్తమయ్యాడు సముద్రుడు. ఆయన వెనుక గంగా యమునాది పవిత్ర నదీమతల్లులు కూడా వచ్చారు.

రామునికి నమస్కరించి, "పంచభూతాలు వాటివాటి స్వభావానికి, స్వరూపానికి కట్టుబడి ప్రవర్తిస్తూ ఉంటాయి. అగాధమై దాటశక్యము గాకుండా ఉండడము నా స్వభావము. అగాధం కానిచో అది సముద్రమెలా అవుతుంది?

"రామా! మొసళ్ళతో, తిమింగలాలతో వ్యాకులమైన జలాన్ని నేను స్తంభింప చేయలేను. నీవు దాటుటకు వీలు కల్పిస్తాను. వానరులు దాటుటకు సహకరిస్తాను. జలజంతువుల వల్ల ఆటంకం రాకుండా చూస్తాను.

"రామా! ఈ నలుడు తండ్రియైన విశ్వకర్మతో సమానుడు. తండ్రి నుండి వరాలను పొంది యున్నాడు. నలుడు చాలా ఉత్సాహవంతుడు. అతడు నామీద సేతువును నిర్మిస్తాడు. దానిని నేను భరిస్తాను;" అని పలికి సాగరడు అంతర్హితు డయ్యాడు.

సంసారమే భయంకర సాగరము. దానిని దాటడం ఎవ్వరికీ శక్యము కాదు. రామబాణము ముందు సాగరుడు తలవంచి మోకరిల్లాడు. దాటే అవకాశాన్ని కల్పించాడు.

రామనామమే రామబాణము. ఒకే బాణము రామునికి. ఒకే నామము భక్తునికి. అదే రామనామము. రామబాణానికి సాగరుడు నిస్తేజు డైనట్లు, రామనామానికి భవసాగరం ఇంకిపోతుంది.

నామయోగి నారాయణునికి ప్రియుడవుతాడు. నామము బ్రతుకును నాణ్యంగా తీర్చిదిద్దుతుంది. నామస్మరణమే నాలుకకు ప్రధాన ధర్మము. పరుషవాక్కులకు, పరస్తుతులకు అలవాటుపడిన నాలుకను పరమాత్మ సంకీర్తనము ద్వారా పవిత్రం చేసుకోవాలి.

భ్రమపడి మాయపు పడతుల తమ్మల
నమలి చవులుగొనె నా జిహ్వ
అమర వంద్యుడగు హరిని నుతించగ
ప్రమదము చలిగొని పావన మాయె
నగుబాట్ల బడే నా జిహ్వ
పగటున నిదివో పావనమాయె-

అని నవ్వులపాలైన నాలుకను నామస్మరణము ద్వారా తానెలా పవిత్ర మొనర్చుకొనివది గానం చేశారు అన్నమాచార్యులు.

సముద్రుడు వెళ్ళగానే నలుడు లేచి రామునికి నమస్కరించాడు. "రామా! సముద్రుడు చెప్పింది నిజమే. నా తండ్రి అనుగ్రహం చేత ఈ విశాలమైన సాగరముపై సేతువును నిర్మిస్తాను. నాకు ఆ శక్తి ఉంది.

న చాప్యహ మనుక్తో వః ప్రబ్రూయా మాత్మనో గుణాన్

"మీరు అడగనిదే చెప్పడం హద్దు మీరినట్లు అవుతుందని నేను నా శక్తిని వెల్లడించలేదు.

"సేతువును నిర్మించుటకు ఇప్పుడే ప్రయత్నిస్తాము;" అని నలుడు పలికాడు. రాముడు అంగీకరించి అనుజ్ఞ ఇచ్చాడు. వానరు లందరు వేల సంఖ్యలో కదలివెళ్ళి అరణ్యాలమీద, పర్వతాల మీద పడ్డారు. పెద్దపెద్ద వృక్షాల్ని తెచ్చి సముద్రంలో పడేశారు. ఏనుగు దేహమంత రాళ్ళను తీసికొని వచ్చి వేశారు. అలా పెద్దపెద్ద బండల్ని విసిరి సాగరంలో వేస్తూవుంటే, దానివల్ల లేచిన కెరటాలు మిన్ను తాకినట్లు లేచాయి.

నలుడు సముద్రము నడుమ గొప్ప సేతువును నిర్మించాడు. ఆ మహాకార్యంలో వానర వీరులందరూ శ్రమించారు. ఉత్సాహవంతులైన ఈ వానరవీరు లందరూ కలిసి మొదటిరోజే పదునాలుగు యోజనముల దూరము సేతువును నిర్మించారు. రెండవరోజు ఇరవై యోజనాల దూరము నిర్మించారు. మూడవరోజు ఇరవై ఒక్క యోజనములు కట్టారు.

నాల్గవరోజు ఇరవైరెండు యోజనాల దూరము నిర్మించారు. ఐదవరోజు ఇరవైమూడు యోజనముల దూరము సేతువును నిర్మించారు. ఐదురోజుల్లో నలుడు వానరుల సహాయంతో సముద్రముపై సేతువును నిర్మించాడు. తన తండ్రి విశ్వకర్మ లాగే సేతువును బంధించాడు. ఆకాశంలో నక్షత్రమార్గం లాగా అందంగా శోభించింది ఆ సేతువు. దేవ, గంధర్వ, సిద్ధ, మహర్షాదులు ఆ సేతువును ఆశ్చర్యంతో తిలకించారు.

కపివరులు సేతువును నిర్మించునపుడు ఉడుత ఒకటి వచ్చి భక్తితో రామకార్యంలో పాలు పంచుకొని ధన్యత బొందింది అనే ఉపాఖ్యానము కూడా ఒకటి ప్రాచుర్యంలో ఉంది. ఈ ఉడుత తెలుగు ఉడుత.

ఈ చిక్రోడము చరిత్ర వాల్మీకంలో లేదు. తెలుగులో వెలువడిన రంగనాథ రామాయణము నందే ఈ వృత్తాంతము ఉంది. కపివీరు లందరూ రాళ్ళను, చెట్లను సముద్రములో పడవేసే సమయాన, నాతటి యొక్క యుడుత,

గొబ్బున సేతువు గొనసాగ వలయు నిబ్బలియులకు దో దేను గావింతు

ననుచు శ్రీరాముని యడుగు దామరలు మనమున జేర్చి యమ్మను జేసు నెదుర

నచ్చపు భక్తితో నలవార్ధి మునిగి, వచ్చి తానిసుకలో వడి బొరలాడి

తడయక చనుదెంచి తన మేని యిసుక, వడిగట్టపై రాల్చి వనధిలో మునిగి

తేలిగట్టున కేగి తిరుగంగ బొరలి, వాలిన భక్తితో వచ్చి విదుల్చు

అని రంగనాథ రామాయణము ఉడుతను ప్రవేశపెట్టింది. “ఉడుతాభక్తి” అనేది లోకోక్తిగా మారి, ఈనాటికీ తెలుగు పలుకుబళ్ళతో పాటు వినిపిస్తోంది దివ్యంగా.

మొనదేలిన బుద్ధి కుంచెతో జనావళి హృదయ ఫలకములపై గోన బుద్ధారెడ్డి చిత్రించిన ఉడుత చిత్రము కాలవర్షానికి కరిగిపోలేదు. దేశ గాలికి ఎగిరిపోలేదు. తెలుగు వెలుగుల్లో ఉడుత ఎగురుతూనే ఉంది. ఇక ముందు ఎగురుతూ ఉంటుంది కూడాను.

బుద్ధారెడ్డి రంగనాథ రామాయణంలో బుద్ధిపూర్వకంగా సృష్టించిన ఈ ఉడుతను భద్రాచల రామదాసు అన్నంపెట్టి, త్యాగరాజస్వామి నీళ్ళిచ్చి పోషించారు.

తిరవుగ ఇసుక లోన పొరలిన యుడుత భక్తిని
కరుణించి బ్రోచితివని నెర నెమ్మితి నిన్నే తండ్రి
వలుకే బంగార మాయెనా, కోదండపాణి ॥వలుకే॥

అంటూ భద్రాచల రామదాసు రాముని నిష్ఠూర మాడితే,

ఎందుకు నిర్దయ ఎవరున్నారురా
ఇందు నిభానన ఇనకుల చందన ॥ఎందుకు॥
నే పరదేశి బాపవే గాసి
ఉడుత భక్తిగని ఉప్పతిల్లగ లేదా ॥ఎందుకు॥

రాముని పాదాలే స్వస్థలముగాని అన్యమైనదంతా పరదేశమే. పరుల కోసమే. ఉడుత భక్తిని గాంచి ఉద్ధరించిన రామా! నన్నెందుకు ఉపేక్షిస్తున్నావు? నా మీద ఎందుకు ఇంత నిర్దయ నీకు! అని త్యాగరాజస్వామి ప్రశ్నిస్తూ ప్రాధేయపడతాడు.

వెయ్యికోట్ల వానరసమూహము సేతువును నిర్మిస్తూనే సముద్రము యొక్క దక్షిణ తీరాన్ని చేరారు. నలుడు సముద్రముపై నిర్మించిన సేతువు పాపటలా ఉంది.

విభీషణుడు గదాధరుడై శత్రువులను ఎదుర్కొనుటకు అవతలి ఒడ్డుపై నిలబడ్డాడు. సుగ్రీవుడు రాముని సమీపించి ఇలా పలికాడు.

“రామా! సముద్రము చాలా విశాలంగా ఉంది కదా! నువ్వు హనుమంతునిపై ఎక్కు. లక్ష్మణుడు అంగదునిపై ఎక్కుతాడు. మిమ్మల్ని ఆకాశమార్గాన వాళ్ళు తీసికొని పోతారు” అన్నాడు.

ధనుర్బాణాలు ధరించి, లక్ష్మణసమేతుడై సైన్యానికి ముందు రాముడు నడిచాడు. రామదండు చేయు శబ్దముల ముందు సాగరఘోష వినిపించలేదు.

వానరులు కొందరు సేతువు మధ్య నడుస్తుంటే, కొందరు వానరులు కావాలనే అంచులలో జాగ్రత్తగా అడుగులు వేస్తూ నడిచారు. కొందరు వానరులు జలములో దూకి కొంతదూరము ఈది మళ్ళీ సేతువు పైకి వచ్చేవారు. కొందరు కొంతదూరము ఆకాశంలో ప్రయాణం చేసి మళ్ళీ సేతువు మీదికి వచ్చేవారు. కొందరు సేతువు అంచుల్లో నడిచేవారిని కావాలనే నీళ్ళల్లో తోసేసేవారు. ఇలా కదలింది రామసేన.

రాముడు చేసిన ఈ ఘనకార్యాన్ని చూసి దేవగంధర్వాదులు ఆకాశంలో నిలబడి పుష్పవర్షం కురిపించారు. రాముణ్ణి స్తుతించారు.

నావ లేకనే వానరు లందరూ సాగరాన్ని దాటారు. అది కపుల వైభవమూ కాదు. రాళ్ళ వైభవమూ కాదు. అదంతా రామవైభవము. రామనామ వైభవము. రామగుణ వైభవము. రామకథా వైభవము. దివ్యమైన రామకథను పఠించువారు, రామనామమును కీర్తించువారు కూడా కపులు సాగరాన్ని దాటి తీరమును చేరినట్లు, భవసాగరాన్ని దాటి శాంతితీరాన్ని చేరుతారు.

సకల సుమంగల దాయక రఘునాయక గునగాన
సాదర సునహి తే తరహి భవ సింధు బినా జలజానా ॥

“రామకథను పఠించువారు నావ లేకనే భవసాగరాన్ని దాటి తరిస్తారు. రామకథా గానము సర్వ ఐశ్వర్యాలకు మూలము” అంటాడు సంత్ తులసీదాస్ రామచరితమానసంలో.

నామమే నావ. భగవన్నామమే భవసాగరాన్ని దాటించు నావ.

రాక్షసగడ్డపై రామలక్ష్మణులు

లంకకు ఉత్తరముగా ఉన్న సముద్రతీరాన్ని చేరింది రామదండు. లంకానగర గడ్డపై రామలక్ష్మణ సుగ్రీవ హనుమదాదులు కాలుపెట్టారు. చల్లని, తియ్యని ఉదకము, మధుర ఫలములున్న వనములలో సేనలను వ్యూహాలుగా నిలపాలని ఆలోచించారు.

శకునశాస్త్రము నందు ప్రవీణుడైన రాముడు గొప్ప భయంకర సంగ్రామము జరుగుతుందని లక్ష్మణునితో పలికాడు. లంకను తక్షణమే ముట్టడించడం మంచిదని భావించాడు. ధనుర్బాణములు ధరించి రాముడు ముందు నడువగా, సింహనాదాలు చేస్తూ వానరులు రాముని వెంబడించారు. వానరుల ఉత్సాహాన్ని చూచి రాముడు ఆనందంతో పొంగిపోయాడు.

శరత్కాల పౌర్ణమి నాడు చందమామ చుట్టూ చక్కని నక్షత్రాలున్నట్లు, రాముని చుట్టూ వానరసేన శోభించింది. గొప్ప సముద్రం లాగా తెలుస్తున్న ఆ వానరసేనా విహారమునకు భూమి కంపించింది.

లంకనుండి సైన్యము యొక్క పెద్ద కలకలము, రణభేరీధ్వని దిక్కులు పిక్కటిల్లేలా విన్పించింది. అది విని అధికోత్సాహంతో వానరులు అంతకంటే ఎక్కువగా సింహనాదాలు చేశారు. కపివీరుల సింహనాదాలు మేఘగర్జనల లాగా వినిపించాయి లంకలోని రాక్షసులకి.

విచిత్రమైన పతాకాలతో ప్రకాశిస్తూ, త్రికూటపర్వతముపై దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న లంకను చూచి రాముడు ఆశ్చర్యపడ్డాడు. సీతమ్మ మనసులో మెదిలింది. "ఇక్కడే నా సీత బంధించబడి వుంది" అని దుఃఖించాడు.

శాస్త్రోక్తముగా సేనా నివేశము చేశాడు రాముడు. సేనానాయకులను పిలిచి వారిని ఈ విధంగా శాసించాడు.

"దుర్జయుడైన అంగదుడు నీలునితో కలిసి గరుడాకారముగా ఉన్న ఈ వ్యూహములో వక్షస్థలము నందు నిలబడాలి. కుడి పార్శ్వమున ఋషభుని నాయకత్వంలోని వానరసేన ఉండాలి. ఎడమ పార్శ్వము నందు గంధమాదనుని సేన ఉండాలి.

"నేను లక్ష్మణసమేతుడనై శిరఃస్థానమున, ముందుగా ఉంటాను. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి - ఈ ముగ్గురు భల్లూకశ్రేష్ఠులు కుక్షి భాగాన్ని రక్షిస్తూ ఉంటారు. సుగ్రీవుడు పుచ్ఛభాగమును రక్షిస్తాడు. ఈవిధంగా రాముని శాసనము మేరకు వ్యూహాకారముగా నిర్మించబడిన వానరసేన మేఘావృతమైన ఆకాశంలా కనిపించింది.

పెద్దపెద్ద వృక్షాలు, పర్వతశిఖరాలను పెకలించి చేతపట్టుకొని యుద్ధానికి ఆయత్త మయ్యారు వానరులు. ఈ లంకానగరమును బ్రద్దలు కొట్టేస్తాము" అని పరస్పరము ముచ్చటించు కుంటున్నారు.

"సుగ్రీవా! మన సేనంతా సిద్ధంగా ఉంది. ఇక శుకుణ్ణి విడిచిపెట్టండి" అన్నాడు రాముడు. వెంటనే రావణుని దూత యైన శుకుణ్ణి విడిచిపెట్టాడు సుగ్రీవుడు. వానరులచే అనేక విధాల పీడించబడిన శుకుడు భయకంపితుడై రావణుని వద్దకు వెళ్ళాడు.

రావణుడు శుకుణ్ణి చూచి నవ్వుతూ, "ఏమి! నీ రెక్కలు విరిచేశారా! వాళ్ళకి దొరికిపోయావా!" అన్నాడు.

"ప్రభూ! నేను సముద్రము అవతలి తీరాన్ని చేరాను. మీరు చెప్పిన మాటల్ని సుగ్రీవునికి వినిపించాను. ఈలోగా వానరులు ఎగిరి నన్ను పట్టుకున్నారు. పిడికిళ్ళతో పొడుస్తూ, గోళ్ళతో గీకుతూ బేజారెత్తించేశారు. అబ్బబ్బ! వాళ్ళతో మాట్లాడడం సాధ్యం కాదు. అందరూ కోపిష్ఠులే.

"విరాధుణ్ణి, కబంధుణ్ణి, ఖరుణ్ణి ఈ లోకం నుండే తరిమివేసిన రాముడు సుగ్రీవునితో కలిసి సీత వున్న ఈ ప్రదేశానికి వచ్చేశాడు. పర్వతరూపులైన వానర భల్లూక వీరులచే ఏర్పడిన సేనలు భూమినంతా కప్పేసి వున్నాయి.

"రాజా! మనకు, వాళ్ళకీ సంధి కుదిరేలా లేదు. శరణంటూ సీతను రామునికి అప్పగించడమో, లేదా రణమున నిలిచి పోరాడడమో, ఏదో ఒకటి వెంటనే నిర్ణయించుకోవాలి. వానరసమూహము మన ప్రాకారాన్ని సమీపిస్తూ ఉంది;" అన్నాడు శుకుడు.

శుకుని మాటలు విని రావణుడు తన చూపుల్తో శుకుణ్ణి కాల్చేస్తున్నట్లు చూచి "ముల్లోకాలు నాకు ఎదురు నిలిచి పోరాడినా సీతను రాముడికి తిరిగి ఇవ్వడం కల్ల.

కదా సమభి ధావన్తి మామకా రాఘవం శరాః
వసన్తే పుష్పితం మత్తా భ్రమరా ఇవ పాదపమ్ ॥

"వసంతంలో విరబూసిన చెట్ల మీదికి తుమ్మెదలు పరిగెత్తునట్లు, నా బాణాలు రాముని శరీరం మీదికి దూకుతాయి;" అన్నాడు రావణుడు.

ఇదొక అందమైన శ్లోకం. ఇందులో వాల్మీకిమహర్షి కవితావైశిష్ట్యం వైభవోపేతంగా ప్రకాశించింది.

రామాయణంలో కథానాయకుడు రాముడు. ప్రతినాయకుడు రావణుడు. ప్రధానమైంది రాముని పాత్ర. ఎలా చూసినా రావణుని పాత్ర అప్రధానమని మాత్రం చెప్పలేము. చెప్పడానికి వీల్లేదు కూడా. ఉత్తర దక్షిణ ధ్రువాల్లా నిలిచిన ఈ రెండు పాత్రల ఔచిత్యాన్ని, ఔన్నత్యాన్ని, గమన గమ్యాలను సూక్ష్మంగా అందిస్తూ, ఒక ఒరలో రెండు కత్తులను ఇమిడ్చినట్లు భిన్న ప్రకృతులతో శోభించే రెండు పాత్రల్ని ఒక్క శ్లోకంలో ఇమిడ్చి ఇనుమడింప చేశాడు వాల్మీకి.

ముఖ్యంగా ఈ శ్లోకంలో తుమ్మెదలకు, రావణుని బాణాలకే ఉపమానాన్ని ఉల్లేఖించడం జరిగింది. పుష్పించిన చెట్టులా రాముణ్ణి చూపిస్తూ, తానే అంధకారంలో ఉండిపోయాడు రావణుడు.

వసంతంలో విరబూసిన చెట్టు లాంటివాడు రాముడు. రాముడు ధర్మవృక్షము వంటివాడు. చెట్టు తనలో పూసిన పువ్వులను, కాసిన ఫలాలను ఇతరుల కొరకే వినియోగించు నట్లు రాముడు కూడా పరోపకారపారీణుడు. ధర్మవృక్షము వంటివాడు.

వసంతంలో చెట్లు విరబూస్తాయి. మహాత్ములు కూడా వసంతఋతువు లాంటివారే. చెట్లు లోకానికి హితము చేయునట్లు మహాత్ములు కూడా లోకకళ్యాణమే ప్రధానధర్మంగా కలిగి యుంటారు.

శాన్తా మహాన్తో నివసన్తి సన్తో
వసన్త వల్లోక హితం చరన్తః
తీర్ణాః స్వయం భీమ భవార్ణవం జనా
న హేతు నాన్యా నపి తారయన్తః

"వసంతఋతువు వలె లోకమునకు సౌఖ్యాన్ని సమకూర్చుతూ జీవించే శాంతులు, మహాత్ములు అగు సాధుపురుషులు లోకంలో చరిస్తూ ఉంటారు. భయంకరమైన భవసాగరాన్ని వారు స్వయంగా దాటినవారు గాన పరులను కూడా నిర్హేతుకంగా దయతో దాటిస్తారు" అని మహితాత్ములను వసంతఋతువుతో పోల్చి వర్ణించారు "వివేక చూడామణి" అనే ప్రకరణ గ్రంథంలో శ్రీ ఆదిశంకరాచార్యుల వారు.

ఋతువు లెన్నో ఉన్నాయి. కానీ హృదయాలకు సౌఖ్యాన్నిచ్చే ఋతువు వసంత ఋతువు. పురుషులందు పుణ్యపురుషు లన్నట్లు, పరులకు సుఖాన్ని ప్రసాదించేవారు మహాత్ములు.

ఆకాశం నిర్మలంగా ఉంది. చంద్రుడు ప్రకాశవంతంగా ఉన్నాడు. చెట్లన్నీ పుష్పించి ఉన్నాయి. వసంతం రాగానే ఇవన్నీ మనకు గోచరిస్తాయి. మహాత్ముల సన్నిధిలో హృదయాలు నిర్మలంగా ఉంటాయి. మనసు చక్కగా ప్రకాశిస్తుంది. దివ్యమైన సుగుణసుమాలు విర బూస్తాయి. కనుకనే, వసంతం ఆహ్లాదాన్ని అందిస్తుంది. మహాత్ములు ప్రహ్లాదాన్ని ప్రసా దిస్తారు.

వసంతంలో విరబూసిన చెట్టు లాగా మహాత్ముడైన రాముడు ధర్మవృక్షమై శోభిస్తున్నాడు. ఈ మాట ఎవరో చెప్పివుంటే ఇంత ఆలోచన అవసర ముండేది కాదు. ప్రతినాయకుడు నాయకుణ్ణి గురించి పలికే వాక్య మైనందున అవధానంతో ఆలోచించాల్సిన విషయమై కూర్చుంది.

రాముడు వసంతంలో పూసిన చెట్టులా ప్రకాశిస్తున్నాడు. బాగుంది. మరి తానెవరు? తనెక్కడ? ఆ విషయాన్ని ఈ ఉపమానంలో రావణుడు ప్రస్తావించలేదు. తనను తానే చీకట్లోకి నెట్టేసుకున్నాడు. పాపిని పాపమే నరకంలోకి నెడుతుంది. ఇదీ అంతే.

వసంతంలో పూసిన చెట్టుపై తుమ్మెదలు విశేషసంఖ్యలో వాలినట్లు, తాను వదిలే బాణాలు రామునిపై వాలుతాయి అనేదే రావణుడు ప్రధానంగా ప్రస్తావించ దలచుకొన్న విషయం. ఇలా ప్రస్తావించడంలో ఊహించకుండా రాముణ్ణి పుష్పించిన వృక్షంలా శోభతో నింపి, అనాలోచితంగా తాను అజ్ఞాన చీకట్లలోకి జారిపోయాడు.

ఇకపోతే, రావణుడిచ్చిన ఉపమానంలో తన బాణాలు తుమ్మెదలతో పోల్చబడ్డాయి. ఆ బాణాలు ఎవరిమీదైతే వాలుతాయో ఆ రాముడు పుష్పించిన వృక్షంతో పోల్చబడ్డాడు.

పుష్పాలు స్వచ్ఛంగా, సుగంధభరితంగా ప్రకాశిస్తాయి. రాముడు కూడా స్వచ్ఛమైన పవిత్రతతో, జ్ఞానసౌరభంతో శోభిస్తుంటాడు.

ఇక, రావణుడు తాను విడిచే బాణాలను తుమ్మెదలతో పోల్చాడు. తుమ్మెదల యొక్క నల్లదనం బాణాలకి అన్వయించబడింది. నలుపు అజ్ఞానానికి, పాపానికి సంకేతము. రావణుని శరములు పాపపు మూటలుగా స్పష్ట మౌతున్నాయి.

రావణుడు బాణాలు విడిచేది ఎందుకు? రాముని వధించడానికి. కానీ అది జరుగదు. ఈ సత్యం కూడా తన మాటల్లోనే వ్యక్తమౌతోంది. తుమ్మెదలు సూటిగా వెళ్ళి వాలవు. అటూ ఇటూ చంచలంగా చలిస్తూ చరిస్తూ పోయి వాలుతాయి. తుమ్మెదల్లాంటి రావణుని బాణాలు రాముని ఏమీ చేయలేవు అని తెలిసిపోతోంది.

రాముడు వసంతంలో పూసిన చెట్టు లాంటివాడుగా వర్ణించబడ్డాడు. చెట్టు లాగా రాముడు స్థిరుడు. కనుక తుమ్మెదల్లాంటి బాణాలతో రావణుడు సాధించేది ఏమీ ఉండదు.

రాముడు సాధారణవృక్షం కాదు. పూసిన వృక్షం. పువ్వులతో చెట్టు శోభించునట్లు, రాముడు నవ్వులతో గోచరిస్తాడని భావం. పైగా వసంతకాలంలో పూసిన చెట్టయ్యాడు రాముడు. అంటే, కాలం కూడా రామునికి అనుకూలంగా ఉందే గాని రావణునికి కాదు; అని తేటతెల్ల మవుతోంది. అందుకే పరుల ప్రయత్నం లేకుండా తానే చీకట్లలో చేరిపోయాడు రావణుడు.

రాముని మీద ద్వేషంతో రావణుడు మాట్లాడినా అది రాముని పొగిడినట్లే అయింది. అదే కవికోకిల కలంలోని కవనవైశిష్ట్యం.

తన జీవనజ్యోతి ఆరిపోతోందని తెలియక రాముణ్ణి ఏదో చేసేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడు రావణుడు.

"నక్షత్రాల ప్రకాశాన్ని సూర్యుడు హరించునట్లు నేను ప్రవేశించి వానరసైన్యాన్ని హరించి వేస్తాను. నా వేగాన్ని, బలాన్ని తెలియక రాముడు నాతో పోరాడడానికి ఉబలాట పడుతున్నాడు. క్రూరసర్పాలవంటి నా బాణాల వైభవాన్ని రాముడు ఎప్పుడూ చూడలేదు. నేను రణరంగంలో మ్రోగించే ధనుర్వీణ శత్రువుల పాలిటి శ్మశానసంగీత మౌతుంది. ఇంద్ర, వరుణ, కుబేరాదులే నా బాణాగ్నిని తట్టుకోలేక పోయారు. ఈ రాముడెంత?" అని పలికి శుకసారణులను పిలిచాడు రావణుడు.

"శుకసారణులారా! మునుపెన్నడూ జరుగని కార్యము ఈనాడు జరిగింది. సముద్రంపై వానరవీరులు సేతువును నిర్మించి లంకలో కాలు పెట్టారు. నిజమే అయినా నమ్మలేని విధంగా ఉంది.

"మీరిద్దరూ రహస్యంగా వానరసేనలో ప్రవేశించండి. ఆ సైన్యము బలమెంతో, వారిలో ముఖ్యులెవరో, వారి ఉద్యమము యొక్క స్థితి ఏమిటో వాస్తవంగా తెలుసుకొని రండి. వారి సేనాధిపతి ఎవరో కూడా తెలిసికొని రండి" అన్నాడు రావణుడు.

ఈ శుకసారణులలో శుకుడెవరు? రావణదూతగా సాగరతీరానికి వెళ్ళి వానరులకు చిక్కిన శుకుడేనా? లేక మరొక డెవరైనానా? అవునని, కాదని వాదాలు బలంగా ఉన్నాయి. సాగరతీరానికి శుకుడు వెళ్ళడమే ప్రక్షిప్తం అనే వాదమూ ఉంది. దూతగా శుకుడు వెళ్ళినట్లు అధ్యాత్మరామాయణం కూడా ధ్రువపరుస్తోంది. ఒక చిన్న వింత కథ కూడా దీనితో ముడిపడి ఉంది. అది శుకుని పూర్వవృత్తాంతము.

శుకుడు పూర్వజన్మలో ఒక బ్రాహ్మణోత్తముడు. బ్రహ్మిష్ఠుడు. సతీసమేతుడై వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి జీవించేవాడు. దేవతల్ని తృప్తిపరుస్తూ అనేక యజ్ఞాలు చేశాడు శుకుడు. అది రాక్షసులకి బాధను కల్గించింది.

దేవతలకు హితము చేయడంవల్ల రాక్షసులకు పగయ్యాడు శుకుడు. వజ్రదంష్ట్రుడు అనే రాక్షసుడు శుకునిపై క్రుద్ధుడై పగబూనాడు. ఎలాగైనా శుకునికి అపకారం చేయాలని సంకల్పించి అవకాశం కొరకు ఎదురుచూస్తూ ఉండిపోయాడు వజ్రదంష్ట్రుడు.

ఒకనాడు శ్రేష్ఠుడైన అగస్త్యుడు శుకుని ఇంటిని పావనం చేశాడు. శుకుడు అగస్త్యుని పూజించి భోజనానికి ఆహ్వానించాడు. స్నానార్థమై అగస్త్యుడు నది కెళ్ళాడు. ఇదే అవకాశమని భావించి, అగస్త్యుని రూపంలో శుకుని వద్దకు వచ్చాడు వజ్రదంష్ట్రుడు.

"శుకుడా! నేను స్నానార్థమై నదికి వెళ్తున్నాను. నేను మేకమాంసం భుజించి చాలా రోజులైంది. నాకు ఆ మాంసమును వంట చేయించు" అన్నాడు. శుకుడు వెంటనే మేక మాంసాన్ని ఎక్కువగా వండించాడు.

అగస్త్యుడు భోజనానికి ఉపవిష్టు డయ్యాడు. శుకుని భార్య నిద్రపోయేలా చేసి, ఆమె రూపంతో తానే వడ్డించుటకు వచ్చాడు వజ్రదంష్ట్రుడు. అగస్త్యుని భోజన పళ్ళెరములో బాగా వండిన నరమాంసాన్ని వడ్డించాడు. ఆ తరువాత శుకుని అర్ధాంగిని జాగృతం చేసి తాను అంతర్ధాన మయ్యాడు.

తన పళ్ళెము లోని నరమాంసాన్ని చూచి అగస్త్యుడు క్రుద్ధుడయ్యాడు. "దుష్టుడా! నరమాంసమును నాకు వడ్డించి నన్ను అవమాన పరచావు. నీవు రాక్షసుడవై పుట్టి, నరమాంసభక్షకుడవై జీవించెదవుగాక!" అని శపించాడు అగస్త్యుడు.

"మహాత్మా! నదికి వెళ్తూ వెళ్తూ, మేక మాంసాన్ని వండించమని మీరే కదా చెప్పారు. ఇప్పుడు క్రుద్ధులౌతున్నారు ఏమిటి? పైగా మేకమాంసాన్ని నరమాంస మంటున్నారు. నన్ను శాపం కూడా పెట్టారు" అన్నాడు శుకుడు.

అగస్త్యుడు అంతర్ముఖు డయ్యాడు. జ్ఞాననేత్రంతో వాస్తవాన్ని గ్రహించాడు. "శుకుడా! నీ చిరకాల శత్రువు వజ్రదంష్ట్రుడు చేసిన పని ఇది. ఇందులో నీ తప్పు ఏమీలేదు. కానీ నా శాపము వృథా కాదు. నీవు రాక్షసుడవై లంకలో రావణునికి సేవచేస్తూ ఉంటావు. రావణుడు రాముని వద్దకు నిన్ను దూతగా పంపుతాడు. రామదర్శనం కాగానే నీకు శాపం తీరి పోతుంది;" అని పలుకుతాడు అగస్త్యుడు.

ఇత్యుక్తోఽగస్త్య మునినా శుకో బ్రాహ్మణ సత్తమః
బభూవ రాక్షసః సద్యో రావణం ప్రాప్య సంస్థితః ॥

"ఈవిధంగా అగస్త్య మహాముని శాపమును విధించగనే బ్రాహ్మణోత్తముడగు శుకుడు రాక్షసరూపాన్ని ధరించాడు. రావణుని చేరి, లంకాధీశుని సేవలో చాలా కాలము ఉండినాడు" అని అధ్యాత్మ రామాయణము.

రావణుడు ఆజ్ఞాపించగా శుకసారణులు వానరరూపం ధరించి వానరసైన్యంలో కలిసి పోయారు. అనూహ్యంగా నిలిచియున్న వానరసేనను అంచనా వేయలేకపోయారు. ఇంతలో విభీషణుడు శుకసారణులను గుర్తుపట్టేశాడు. వాళ్ళిద్దరినీ రాముని ఎదుట నిలబెట్టి, "రామా! ఇతడు శుకుడు. అతడు సారణుడు. వీళ్ళు రావణుని మంత్రులు. గూఢచారులుగా లంకనుండి వచ్చి మన సైన్యంలో ప్రవేశించారు" అన్నాడు.

శుకసారణులు భయవిహ్వాలు లయ్యారు. ప్రాణాలు గాలిలో తేలిపోతున్నట్లు భీతి చెందారు. జీవితముపై ఆశను విడిచిపెట్టారు. రామునికి నమస్కరిస్తూ, "రామా! మేము రావణుడు పంపగా వచ్చాము. మీ సైన్యమెంతో తెలుసుకోవాలని రూపాంతరములో వచ్చి వానరసైన్యంలో ప్రవేశించాము;" అన్నారు.

"మంచిది. మా సైన్యాన్నంతా బాగా చూశారా! మమ్మల్ని కూడా బాగా చూశారా! మీ రాజు చెప్పిన కార్యాన్ని పూర్తి చేసుకున్నారా! ఇక మీరు స్వేచ్ఛగా తిరిగి వెళ్ళవచ్చు లంకలోకి.

"చూడండి. మీరు చూడనిది ఇంకా మిగిలి ఉంటే చెప్పండి. విభీషణుడు వచ్చి మీకు చూపిస్తాడు. మాకు పట్టుబడినందుకు విచారించకండి. ఆయుధశూన్యులైన దూతలను వధించుట ధర్మం కాదు. విభీషణా! మారువేషంలో ఉన్న ఈ గూఢచారుల్ని విడిచిపెట్టు.

"మీరు లంకకు వెళ్ళి, ఇవి నా మాటలుగా రావణునితో చెప్పండి. రావణా! నీవు ఏ బలాన్ని చూసుకొని సీతను అపహరించావో ఆ బలమేమిటో నీ బంధువులతో, సైన్యంతో కలిసి వచ్చి ఇప్పుడు చూపించు.

"రేపు తెల్లవారగనే నీ లంకానగరాన్ని, రాక్షససైన్యాన్ని కూల్చేస్తాను. చూచుకో. కాచుకో," అని రాముడు పలకగానే ధర్మాత్ముడైన రామునికి "విజయీభవ" అని పలికి లంకకు వెళ్ళారు.

శుకసారణులు రావణుని సమీపించి, "మహారాజా! వానరరూపంలో ఉన్న మమ్మల్ని విభీషణుడు గుర్తించి చంపబోయాడు. ధర్మాత్ముడైన రాముడు కనికరించి విడిచిపెట్టాడు.

"రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు-ఈ నలుగురు పరాక్రమంలో ఇంద్రునితో సమానులు. అస్త్రనైపుణ్యము గలవారు. మరొకరి అవసరం లేకుండా వీళ్ళు నలుగురే లంకాపట్టణాన్ని నాశనం చేయగలరు. ఏమో! రాముణ్ణి చూస్తూ వుంటే అతడొక్కడే సరిపోతాడేమో అనిపిస్తోంది.

"రాజా! రాముని సైన్యములోని వీరులందరూ సమరోత్సాహంతో ఉన్నారు. రామునితో వైరమును విడిచిపెట్టి సంధి చేసుకోవడమే మంచిది. సీతను రామునికి ఇచ్చివెయ్యి" అన్నారు శుకసారణులు.

లంకలో రామదండు

"సారణా! నువ్వు సౌమ్యుడివి. వానరులు నిన్ను బంధించడంతో బేజారెత్తి సీతను రామునికి అందించ మంటున్నావు. దేవ, దానవ, గంధర్వాదులతో కూడి సమస్త లోకాలు నన్ను బెదిరించినా సీతను మాత్రం ఇవ్వను. నన్ను ఓడించేవాడు ఎవడు సారణా!" అని పలికి రామదండును చూడాలనే అభిలాషతో, ఏడు తాటిచెట్ల ఎత్తుగల ప్రాసాదాన్ని శుకసారణులతో కలిసి ఎక్కాడు రావణుడు.

రావణుడు ఎక్కిన మేడ మంచులాగా తెల్లగా ఉంది. రావణుడు ఆ మేడపై నిలబడి వనాలు, పర్వతాలు, సాగరతీరము, చుట్టూ ఉన్న భూప్రదేశమునంతా చూశాడు. ఎక్కడ చూచినా, ఆ ప్రదేశమంతా వానరసైన్యంతో నింపబడి ఉంది.

“సారణా! చెప్పు. ఈ వానరులలో ప్రధాను లెవరు? శూరు లెవరు? బలవంతు లెవరెవరు? వీళ్ళలో ఎవరి మాటను వింటాడు సుగ్రీవుడు? సేనాధిపతు లెవ్వరు? అంతా వివరించి చెప్పు.” అన్నాడు రావణుడు.

సారణుడు రావణునితో చెప్తున్నాడు. “రాజా! అడుగో. గొప్పదియైన వానరసేన మధ్యలో ఎత్తైన ప్రదేశము మీద నిలబడి ఉన్నాడు. భూమి దద్దరిల్లేలా లంకవైపు తిరిగి సింహనాదం చేస్తున్నాడే, అతడే నీలుడు. వానరసేనకు నాయకుడతను.

“ఇదిగో. ఈవైపు చూడు. చేతులు పైకెత్తి గర్జిస్తున్నాడు. పర్వతరూపుడైన అతడే అంగదుడు. అతణ్ణే యువరాజుగా చేశాడు సుగ్రీవుడు. ఆ అంగదుడు క్రుద్ధుడై పళ్ళు కొరుకుతూ నీమీదికి కాలుదువ్వుతున్నాడు.

“అంగదుని వెనుక సైన్యములో నాయకుని స్థానంలో ఉన్నాడు, చూశావా! అతడే నలుడు. సముద్రముపై సేతువును నిర్మించింది అతడే. నలుడు గొప్ప పరాక్రమవంతుడు.

“అతని ప్రక్కనున్నవాడు కుముదుడు అనే సేనానాయకుడు. అతనికి ఎడమ వైపున ఉన్నాడే అతడు రంభుడు. అతడు కూడా సేనానాయకుడే. ఆ ప్రక్కనే క్రుద్ధుడై సింహనాదము చేస్తున్నాడే అతడు శరభుడు. గొప్ప బలవంతుడు.

“రాజా! అల్లదిగో. అటుచూడు. ఆకాశంలో నిలిచిన పెద్ద మేఘంలాగా కనిపిస్తున్నాడే. అతడే పనసుడు. యాభై లక్షల వానరులకు ఇతడు సేనానాయకుడు.

“తీరము ఎడమవైపు చూడు. రెండవ సముద్రములాగా సేన నిలబడి ఉంది. వారి మధ్యలో ఎత్తైన ప్రదేశాన దర్దురపర్వతం లాగా కనిపిస్తున్నాడు. అతడే వినతుడు అనే సేనానాయకుడు.

“ఆ ప్రక్కనే విజృంభిస్తున్నాడు. అతడు గవయుడు. ఇతడు డెబ్బై లక్షలమంది వానరులకు సేనానాయకుడు.

“రాజా! నువ్వు ఇంతవరకు విన్నది, చూసింది సేనాధిపతుల్ని. యూథనాయకుల్ని గురించి ఇప్పుడు విను. పెద్ద తోకను నేలపై ఈడ్చుకుంటూ గర్జిస్తున్నాడే అతడు హరుడు. అతని ప్రక్కనున్నాడు చూడు. ధూమ్రుడని భల్లూక సేనానాయకుడు.

“ధూమ్రుని ప్రక్కన పర్వతం లాగా ఉన్నాడే. అతడు ధూమ్రుని తమ్ముడే. పరాక్రమంలో ధూమ్రుని కంటే గొప్పవాడు. అబ్బ! వాడి ప్రక్కనున్నాడు చూడు. అబ్బో! చాలా గొప్పవాడు వాళ్ళలో. పేరు జాంబవంతుడు. పెద్దలంటే మన్నన. యుద్ధంలో అతని ఎదుట నిలవడం చాలా కష్టం.

“ఒకతను ఎగురుతూ మాట్లాడుతున్నాడు. సేనలోని అందరూ అతణ్ణే చూస్తున్నారు. అతడు కూడా సేనానాయకుడే. పేరు దంభుడు. అతనికి ఎడమవైపు గోలాంగూలు డున్నాడు. వాడే గవాక్షుడు. వారి మధ్యలో ఎత్తైన ప్రదేశమున కనిపిస్తున్నాడే. అతడు కేసరి. మేరు పర్వతం మీద ఉంటూ ఉంటాడు.

“కేసరి తరువాత ఉన్నవాడు శతబలుడు. అతడు సూర్యోపాసి. రాముని విషయంలో ప్రాణాన్ని ఇవ్వడానికి కూడా వెనుకాడడు. ఇంకా చాలామంది ఉన్నారు. లెక్కపెట్టను

సాధ్యపడేలా లేదు ఆ వానరసైన్యం. ఈ వానరులందరూ కామరూపులు. సురాసురులతో సమాన పరాక్రమము కలవారు.

“అమ్మోయ్! అదిగో. వాడే. మదించిన ఏనుగులా ముందు నిలిచియున్నాడు. చేతిలో గద. వాడికి కోపమొస్తే తట్టుకోలేము. సముద్రాన్ని గుటగుట త్రాగేస్తాడు. వాడే పూర్వం లంకకు వచ్చి అశోకవనాన్ని నాశనం చేసింది. నువ్వు కూడా చూశావు వాడ్ని. ఇప్పుడు మళ్ళీ వచ్చాడు తగలెయ్యడానికి. పేరు హనుమంతుడు. కేసరీనందనుడు. వాయుదేవుని ఔరసపుత్రుడు. చిన్నవాడు కాదండోయ్. చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడే సూర్యుణ్ణి పండు అనుకొని మ్రింగాలని ఎగిరిన గడుగాయ. “ఆంజనేయా!” అనికూడా పిలుస్తారు అతణ్ణి.

“రాజా! వీణ్ణి నువ్వెలా మరచిపోతావులే! వాడు అంటించి వెళ్ళిన అగ్ని ఇంకా లంకలో అక్కడక్కడ మండుతూనే వుంది.

“రాజా! బాగా చూడు. హనుమంతునికి దగ్గరగా నీలిదేహంతో, కమలముల వంటి కన్నులతో శోభించేవాడే రాముడు. ధర్మాత్ముడు. వేదవిదుడు. బ్రహ్మాస్త్రవేత్త. అసమాన పరాక్రమవంతుడు. నువ్వు ఎత్తుకొని వచ్చింది ఆ రాముని భార్యనే.

“రామునికి ప్రక్కన నిలబడి యున్నాడే ఆ స్వర్ణవర్ణదేహుడు లక్ష్మణుడు. రాముని తమ్ముడు. గొప్ప యుద్ధవీరుడు. కోపిష్ఠికూడా. దుర్జయుడు. రామునికి కుడిభుజమనే చెప్పాలి. యుద్ధంలో రాక్షసవీరుల నందరినీ తానొక్కడే చంపాలని ఉరక లేస్తున్నాడు.

“రామలక్ష్మణులకు నలుగురి తరువాత నిలబడి ఉండేదెవరో బాగా చూడు. అది మన బంగారమే. బయటపడిన బండారము. మీ తమ్ముడు విభీషణుడు. నువ్వుండగానే లంకాధిపతిగా సాగరతీరంలో రాముడి చేత అభిషిక్తుడయ్యాడు. యుద్ధోన్ముఖుడై ఉన్నాడు.

“ఆ ప్రక్కనే వానరుల మధ్య పర్వతంలా కనిపిస్తున్నాడు చూడు. అతడే సుగ్రీవుడు. కిష్కింధకు రాజు. వాలిని రాముని ద్వారా వధించి, తారను, దేవేంద్రుడిచ్చిన మాలను పొందాడు. సుగ్రీవుడు కూడా నీతో యుద్ధం చేయాలని చాలా ఉబలాట పడుతున్నాడు.

“మహారాజా! క్లుప్తంగా చెప్పాను. చెయ్యదగిందేదో గుప్తంగా చెయ్యి. మొత్తానికి లంక ముక్కపోకుండా చూడు. శత్రువులకు పక్కలో బల్లెము కా! అంతే నే చెప్పేది” అని నోరు మూశాడు సారణుడు.

శుకసారణులు చూపెట్టిన రామదండు నంతా ఓపిగ్గా చూశాడు రావణుడు. చెప్పిందంతా విన్నాడు. మనసులో దిగులు మొలిచింది. కోపం కొండంతైంది. భయంకరమైన చూపులను శుకసారణులపై సారించాడు. భయాందోళనలతో వారు తలలు వంచారు. రావణుడు ఇలా పలికాడు.

“నిగ్రహానుగ్రహ సమర్థుడైన రాజును ఆశ్రయించుకొని జీవించేవారు రాజుకు అప్రియమైన మాటలు చెప్పకూడదు. యుద్ధానికి వచ్చిన శత్రువులను చూపమంటే, దాన్ని విడిచిపెట్టి అనవసరంగా, అసందర్భంగా శత్రువును స్తుతించడం పనిగా పెట్టుకున్నారు మీరు.

“దేనికి? మీరు చదివిందంతా తగలెయ్యండి. నేర్చిందంతా నీళ్ళలో పోయండి. రాజనీతిశాస్త్రము తెలియని మీరు రాక్షసులు కారు. రాళ్ళు. మూర్ఖులైన మీలాంటి మంత్రులున్నందుకు నేనెప్పుడో మరణించి ఉండాల్సింది. అది జరుగలేదు. చాలా సంతోషం. నా అదృష్టం.

"అయినా బరితెగించి ఇలా మాట్లాడారే! ఏమి? జీవితం మీద విరక్తి పుట్టిందా! చావు అంటే భయం తీరిపోయిందా! దుష్టులారా! పూర్వము మీరు నాకు చేసిన సేవలు స్మృతిలో మెదుల్తున్నాయి. లేకుంటే మీరు శ్మశానంలో కదలకుండా పడుండేవారు.

"ఛీ! నా ఎదుట నిలబడకండి. మీ ముఖాల్ని పట్టుకొని పారిపొండి;" అని రావణుడు క్రుద్ధుడై పలుకగానే శుకసారణులు సిగ్గుతో, భయంతో తలలు వంచుకొని, చేతులతో నమస్కరిస్తూ, "విజయీభవ" అని కీర్తిస్తూ నిష్క్రమించారు.

నిజాన్ని నిలకడగా వినలేని వాడే రావణుడు. వక్రబుద్ధి గలవాడు వాస్తవాల్ని వినలేడు. స్తవాలే గాని వాస్తవాలు పనికిరావు. దుష్టులవద్ద నిజాన్ని కూడా ముందువెనుక లాలోచించి నిలకడగా మాట్లాడాలి.

రావణుడు మహోదరుడనే వాణ్ణి పిలిచాడు. "మహోదరా! తొందరగా వెళ్ళి, గూఢచారుల్ని వెంటబెట్టుకొని రా. పో" అన్నాడు రావణుడు. మహోదరుడు వెళ్ళి దూతలను తీసికొని వచ్చాడు.

"దూతలారా! మీరు రూపాంతరాలతో రాముని వద్దకు వెళ్ళండి. అతడు ఏమి చేస్తున్నాడో పరిశీలించండి. వాళ్ళ పన్నాగా లేమిటో పరికించండి. ఇంకా, అక్కడ గమనించ దగినవి ఏవో పరీక్షించి వీక్షించండి. వచ్చి పూసగుచ్చినట్లు, మూసపోసినట్లు చెప్పండి. దూతల ప్రయత్నం వల్ల శత్రువుని వధించడం సులభ మవుతుంది ఎవరికైనా. వెళ్ళండి;" అన్నాడు రావణుడు.

శార్దూలుణ్ణి ముందు పెట్టుకొని, రావణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్ళారు గూఢచారులు. సువేలపర్వతము వద్ద సుగ్రీవ విభీషణులతో ముచ్చటిస్తున్న రామలక్ష్మణుల్ని చూశారు.

వానరసైన్యాన్ని చూడగానే దూతలు నిశ్చేష్టులయ్యారు. ఈలోగా విభీషణుడు దూతల్ని పసిగట్టాడు.

"వీడు శార్దూలుడు. పాపాత్ముడు. బంధించండి వీణ్ణి." అన్నాడు విభీషణుడు. వానరులు శార్దూలునితో పాటు మిగిలిన రాక్షసుల్ని కూడా పట్టి బంధించారు. వధించే ప్రయత్నంలో పిడికిళ్ళతో పొడుస్తున్నారు. రాముడు వాళ్ళని వధించకుండా అడ్డుపడ్డాడు. రాక్షస గూఢచారులను విడిపించాడు. దిగేసుకున్న ముఖాలతో దశకంఠుని సమీపించారు దూతలు. రాముని సైన్యము సువేలపర్వతము వద్ద ఉందని రావణునితో చెప్పారు.

"శార్దూలా! ఏమిటోయ్! జూదంలో ఓడిపోయిన వాడిలా కనిపిస్తున్నావు. ఏం జరిగింది? శత్రువులకు పట్టుబడ్డావా? శత్రుసైన్యం నిన్ను బాధించిందా?" అని ప్రశ్నించాడు రావణుడు.

"మహారాజా! రాముని సేన అపారమైంది. దానిలో ప్రవేశించడం ఎవ్వరికీ సాధ్యము కాదు. గొప్ప బలవంతులైన వానరులు దానిని కాపలా కాస్తున్నారు. అయినా, ఎలాగో మేము రాముని సైన్యంలో ప్రవేశించాము.

"విభీషణుడు మమ్మల్ని గుర్తుపట్టి బంధించమన్నాడు. వానరులు మమ్మల్ని కట్టేసి ఇష్టమొచ్చినట్లు కొట్టేశారు. కేరింతలు కొట్టుకుంటూ, మమ్మల్ని కుమ్ముతూ, మోకాళ్ళతో పొడుస్తూ వానరసైన్యం మధ్య మమ్మల్ని ఊరేగించారు.

"సువేలపర్వతం వద్ద నున్న రాముని వద్దకు మమ్మల్ని కొట్టుకుంటూ తీసికొని పోయారు. రాముడు ధర్మాత్ముడు. మమ్మల్ని క్షమించి విడిచిపెట్టాడు. మహారాజా! భయంకరమైన వానరసైన్యాన్ని సురాసురులు కూడా ఓడించలేరు అనిపిస్తోంది. ఉన్నది అన్నాం. మీరేదంటే అది వింటాం" అన్నాడు శార్దూలుడు.

మాయలు - మర్మాలు

దూతలు చెప్పిన మాటలు రావణునిలో దిగులు పుట్టించాయి. మంత్రిమండలితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాడు. వారితో తక్షణ కర్తవ్యాన్ని గూర్చి ముచ్చటించాడు. వారిని పంపివేసి, మాయలు తెలిసిన విద్యుజ్జిహ్వుడనే రాక్షసునితో కలిసి అశోకవనానికి బయలుదేరాడు.

"విద్యుజ్జిహ్వా! వైదేహి ఎలాగైనా ఈనాడు నాదైపోవాలి. ఇంతకాలం నేను చూపిన వలపులు, పిలిచిన పిలుపులు అన్నీ వృథా అయ్యాయి. ఈరోజు మాయ చేసి సీతను వలలో వేసుకోవాలి. ఆ వలను నువ్వు తెచ్చిపెట్టాలి.

"రాముడు ఈ భూమిమీద ఉన్నంతవరకు సీత నావైపు తిరగదు. రాముడు మరణించినట్లు తెలిస్తే, ఇక నేనే దిక్కు. రాముడి శిరస్సును, ధనుర్బాణాలను మాయతో నిర్మించి తీసుకురా;" అన్నాడు రావణుడు. వింతలు చూపే విద్యుజ్జిహ్వుడు క్షణంలో వాటిని రావణునకు చూపించాడు. రావణుని వద్దనుండి అమూల్యమైన ఆభరణాలను బహుమానంగా పొందాడు.

రావణుడు అశోకవనంలో ప్రవేశించాడు. సీతమ్మ దీనురాలై తలవంచుకొని, రామునే ధ్యానిస్తూ కూర్చోనుంది. రాక్షసాంగనలు రక్షిస్తున్న సీతమ్మను చూచి, శుభవార్తను తెచ్చినట్లు చెప్పసాగాడు.

"శుభప్రదా! సీతా! అయిపోయింది. అనుకున్నట్లు అంతా సవ్యంగా సాగిపోయింది. ఇక నీదే ఆలస్యం. రాముడు వీరుడు, శూరుడు అంటూ పలవరించావే! రాలిపోయాడు నీ రాముడు. ఇక ఈ రావణుడే నీకు.

"కల్యాణీ! ఖరుణ్ణి చంపిన రాముడికి ఖరీదు ముట్టింది. రాముణ్ణి ఖండించేది ఖాయం అంటూ నీతో అనేకసార్లు చెప్పాను. ఈరోజు ఖరారు అయింది నా మాట.

"రాముడు ఎలాగూ పోయాడు. మనం కూడా పోదాం పద. మూర్ఖురాలా! ఇప్పుడైనా బుద్ధి తెచ్చుకో. నీ మనసు నాకు ఇచ్చుకో. నా ప్రేమను పుచ్చుకో. నా రాణు లందరిపై హెచ్చుగా జీవించు. అహంకారాన్ని వదలిపెట్టి సుఖించు.

"నన్ను వధించాలని వానరసైన్యాన్ని వెంటబెట్టుకొని వచ్చాడు రాముడు. సముద్రతీరంలో మకాం పెట్టాడు. ప్రయాణ ప్రయాసలో రాత్రి అలసిపోయి నిద్రిస్తున్న రాముణ్ణి నా దూతలు గమనించారు.

"అదను చూచి నా సైన్యం కదం త్రొక్కింది. వేలాది మంది రాక్షసవీరులు సముద్ర తీరంలో విజృంభించారు. నిద్రిస్తున్న రాముని సైన్యాన్ని ఖడ్గాలతో జోకొట్టి శాశ్వతంగా నిద్రపుచ్చారు.

"రాక్షసవీరుడైన ప్రహస్తుడు నా హృదయం ఆనందంతో ఉప్పొంగేలా రాముని శిరస్సును ఖండించాడు. రాక్షసులు విభీషణుని, సుగ్రీవుని కూడా చంపేశారు. పిరికిపంద! ఆ లక్ష్మణుడున్నాడే! వాడే కొంతమంది వానరులతో కలిసి చిక్కకుండా పారిపోయాడు.

"ఈ వనంలో చెట్లు విరిచేసిన ఆ వానరుడు హనుమంతుడి గడ్డాన్ని ముక్కలు ముక్కలుగా నరికేశారు. దిక్కులేని చావు చచ్చాడు దుర్మార్గుడు. జాంబవంతుణ్ణి వధించారు. మైంద ద్వివిదుల్ని నరికేశారు. పనసుణ్ణి పనసపండును తరిగినట్లు తరిగేశారు. కుముదుడు కూలిపోయాడు. తెగిన అంగాల్ని విడిచిపెట్టి పారిపోయాడు అంగదుడు.

"సీతా! పోతేపోనీ! ఉన్నవాళ్ళం, మనసున్న వాళ్ళం మనం! ఇక రాముణ్ణి మరచిపో. చివరగా నువ్వు చూస్తావని ఖండించబడిన రాముడి శిరస్సును సాగరతీరము నుండి తెప్పించాను. చివరగా అతణ్ణి చూసేసి, ఇక నన్ను చూడడం ప్రారంభించు.

"ఎవరక్కడ! రాముడి శిరస్సును తెచ్చి సీతకు చూపండి;" అన్నాడు. రాముని మాయా శిరస్సును, ధనుర్బాణాలను తెచ్చి, రావణుని ఎదుట నమస్కరిస్తూ నిలబడ్డాడు విద్యుజ్జిహ్వుడు.

"అక్కడ పెట్టి వెళ్ళు. మొగుడు-మొగుడు అంటూ మొత్తుకొంటూ ఉండేది. మొగుడికి పట్టిన చివరిగతి చూడనీ మగువని;" అని రావణుడు పలుకగానే అందమైన మాయతలను, ధనుస్సును అక్కడ ఉంచి అంతర్ధాన మయ్యాడు విద్యుజ్జిహ్వుడు.

"అదిగో రాముడి ధనుస్సు. ఇదిగో రాముడి శిరస్సు. ఇక నువ్వు ఇచ్చేయాలి నాకు నీ మనస్సు;" అని పైత్యం పట్టిన వాడిలా పేలుతున్నాడు.

సీతమ్మ శిరస్సును చూచింది. అది రామునిదే అని నిశ్చయించుకుంది. భర్తను పోగొట్టుకున్న ఆడపక్షి లాగా విలపించింది. కన్నీరు మున్నీరుగా రోదించింది. ఖండించిన అరటి చెట్టులా నిలవలేక నేలపడింది. శిరస్సును సమీపించి వెక్కివెక్కి ఏడ్చింది.

"అయ్యో! రామా! ఎంతటి దీనావస్థ ప్రాప్తించింది? నన్ను కాపాడాలని వచ్చి నీవు లోకం నుండే కదలిపోయావా! నా ఒక్కదాని దుఃఖాన్ని పోగొట్టాలని ప్రయత్నించి నీ వారందరికీ దూరమైపోయావా!

ప్రథమం మరణం నార్యా భర్తు ర్వైగుణ్య ముచ్యతే
సువృత్తః సాధువృత్తాయాః సంవృత్తస్త్వం మమాగ్రతః

"రామా! నీవు సత్ప్రవర్తన కలవాడివి. నేను ఏమి పాపం చేశాను. నన్ను విడిచి నువ్వు ఎందుకు వెళ్ళావు? భార్య కన్నా ముందు భర్త చనిపోతే అది భార్య దోషమంటారు. నేను ఏ దోషం చేశాను?

"అయ్యో! లేగదూడను పోగొట్టుకున్న గోవులా విలపించే మా అత్తమ్మ కౌసల్య ఎలా జీవిస్తుంది? రామా! ఇలా ఎందుకైంది నాథా! నీవు దీర్ఘాయుష్మంతుడివని జ్యోతిష్కులు కూడా చెప్పారే! అందరి ఆశలు ఎందుకిలా అడియాస లయ్యాయి!

"సదా అవధానంతో చరించే నువ్వు ఆదమరచి ఎలా నిద్రపోయావు! కర్మఫలం నీ కళ్ళల్లో కాపురం పెట్టిందా! లేకపోతే, ఉపాయాలు తెలిసిన నీకు అపాయా లెలా వస్తాయి! కాళరాత్రి నిన్ను కబళిస్తుంటే కళ్ళు మూసుకొని ఎలా ఉండగలిగావు!

"నన్ను విడిచి అలా నేలపై పడి ఉన్నావేమి? నన్ను మరచి, భూమిని ప్రియురాలిగా వలచావా! నాతోనే కలిసి చరిస్తానని పెళ్ళిపీటల మీద పలికావే! చెప్పిన మాట తప్పావెందుకు?

"రామా! దాశరథీ! నా వల్లనే నీకు ఈ ఘోరమరణం ప్రాప్తించింది. నా కొరకే కదా నీవు ఇక్కడికి వచ్చావు. నన్ను తీసుకపోవాలని వచ్చిన వాడివి ఒంటరిగా ఎందుకు వెళ్ళిపోయావు?

ఆర్యపుత్రస్య రామస్య భార్యా మృత్యు రజాయత

"ఆర్యపుత్రుడైన రామునకు భార్యే మృత్యుదేవత అయింది.

"రామా! పూర్వజన్మలో ఎవరికో సంబంధించిన కన్యాదానమును పాడుచేసి ఉంటాను. లేకపోతే నాకు ఈ దుర్గతి ఎందుకు ప్రాప్తిస్తుంది?" అని పసిబిడ్డలా రోదిస్తోంది సీతమ్మ.

ఈలోగా "మహారాజా! జయము, జయము" అంటూ సాయుధభటుడు వచ్చి నమస్కరించాడు. మంత్రులందరితో ప్రహస్తుడు అత్యవసరమైన కార్యార్థము నిరీక్షిస్తున్నట్లు తెలిపాడు. రావణుడు అశోకవనము నుండి తిరిగి వెళ్ళాడు.

రావణుడు వెళ్ళగానే అక్కడున్న మాయతల, మాయాధనుస్సు కూడా అదృశ్య మయ్యాయి.

రావణుడు మంత్రులతో, సేనాధిపతులతో చర్చించాడు. సైన్యాన్నంతా తీసుకొని రమ్మన్నాడు. అయితే కారణాన్ని మాత్రం సైన్యానికి వివరించ వద్దని హెచ్చరించాడు **(వక్తవ్యంచ న కారణమ్).**

యుద్ధానికి బయలుదేరే ముందు ఎందుకు వెళ్తున్నారో, ఎక్కడికి వెళ్తున్నారో సైనికులకు తెలియకూడదు అంటాడు రావణుడు. తెలిస్తే, నిరాకరిస్తారేమో అనే భయం రావణునికి ఉండి ఉండాలి. లేకపోతే అలా ఎందుకు చెబుతాడు?

లంకలో ఉన్నవారంతా రాక్షసులే. రావణుని ఆశ్రయించుకొని ఉన్నవారే. అతని దుష్టకార్యాల్ని సమర్థించిన వాళ్ళే. ప్రోత్సహించిన వాళ్ళే. ఈనాడు వాళ్ళు రావణుని ఎదిరించడము అనే ప్రశ్న తలెత్తే అవకాశమే లేదు.


రావణుడి భయమంతా అసురులను గూర్చి కాదు. తనను బాధించేది తన మనస్సే. అక్రమాలకు అలవాటుపడిన మనసు అందరినీ అనుమానిస్తుంది. వంచకుడు నశించే ముందు నైతిక పతనానికి గురి అవుతాడు.

రావణుని ఆజ్ఞ ప్రకారము గొప్ప సైన్యము వచ్చి నిలిచింది.

కారుచీకట్లలో కాంతిరేఖ

లంకలోని రాక్షసాంగనలలో త్రిజట లాగా ఉత్తమురాలు సరమ. పాతివ్రత్యమహిమ వల్ల ప్రత్యేక శక్తులను కలిగియున్న పావనచరిత సరమ. లంకలో ఆమె సీతమ్మకు ఇష్టసఖి.

సీతమ్మ నేలపై బడి దుఃఖిస్తూ ఉండడం చూసి సరమ వచ్చింది. ఆమెపై ఉన్న గౌరవభావంతో రాక్షసాంగన లందరూ దూరంగా వెళ్ళారు. సీతమ్మను ప్రేమతో స్పృశించి ఓదార్చింది సరమ.



"సీతా! ఊరుకో. బాధపడకు. రావణుని మాటలు, నీ పలుకులు అన్నీ విన్నాను నేను. ఆకాశంలో అదృశ్యంగా ఉండి. రావణుడు ఇప్పుడు తొందరగా ఎందుకు వెళ్ళాడో, అదికూడా నేను తెలిసికొని వచ్చాను.

"సీతా! రాముడు ఎలాంటి వీరుడో నీకు తెలియదా! యుద్ధానికి వచ్చిన రాముడు నిద్రిస్తాడా? రాముని వదలి లక్ష్మణు డుంటాడా? వానరసైన్యం సామాన్యమైందా!

"ఇదంతా రాక్షసమాయ! నీకు తెలియదు. రాముడు మరణించలేదు. క్షేమంగానే ఉన్నాడు. నిన్ను వంచించడానికి పన్నిన పన్నాగమే ఇదంతా! విద్యుజ్జిహ్వుడు మాయల మారి. వాడు సృష్టించిందే ఆ మాయతల, మాయధనుస్సునూ.

శోకస్తే విగతః సర్వకల్యాణం త్వా ముపస్థితమ్
ధ్రువం త్వాం భజతే లక్ష్మీః ప్రియంతే భవతి శ్రుణు.

"నీ దుఃఖం పోయింది. నీకు శుభం కలుగబోతుంది. నీకు భాగ్యము లభిస్తుంది. నా మాటవిను. నీకు ప్రియం కలుగుతుంది.

"సీతా! రాముడు సైన్యంతో సముద్రతీరాన విడిది చేసి ఉన్నాడు. రామలక్ష్మణుల్ని నేను చూశాను. యుద్ధము అనివార్యమని రావణునికి తెలిసిపోయింది. మంత్రులతో రావణుడు మంతనాలు జరుపుతున్నాడు." అని సరమ చెప్తూ ఉండగా, దిక్కులు పిక్కటిల్లేలా రణభేరి మ్రోగింది.

"అదిగో! సీతా! విను! యుద్ధభేరి వినిపిస్తోంది. అదిగో. విను. అవి గజగంటలు. అదిగో. రథాల ధ్వనులు, అశ్వముల శబ్దాలు. విను. విను.

"రాక్షసులను ఆపద వెన్నంటి ఉంది. ఐశ్వర్యం నిన్ను వరించనుంది. దుష్టుడైన రావణుని రాముడు తప్పక వధిస్తాడు. నీకు దివ్యమైన ఆనందాన్ని ప్రసాదిస్తాడు. నీవు రాముని ప్రక్కన నిలబడి నవ్వుతూ ఉండడాన్ని నేను త్వరలో చూస్తాను. సీతా! ఆడసర్పము కుబుసాన్ని త్యజించునట్లు, నువ్వు దుఃఖాన్ని త్యజించే సమయం ఆసన్నమైంది;" అని ఊరడించింది సరమ.

ఎండకు బాగా కాలిఉన్న భూమి వర్షధారలతో తడిసి శాంతించినట్లు, సరమ సంభాషణము సీతమ్మను శాంతపరచింది. "సీతా! పోనీ, నన్ను రాముని దగ్గరకు వెళ్ళి రమ్మంటావా! నీవు అడిగినట్లు చెప్పి రమ్మంటావా! ఎవరికీ కనిపించకుండా వెళ్ళి రాగలను.

"ఆకాశంలో నా వేగాన్ని గరుత్మంతుడు, వాయుదేవుడు కూడా అనుసరించలేరు;" అన్నది సరమ.

"సరమా! నీ శక్తిసామర్థ్యాలు నాకు తెలుసు. అతి సునాయాసంగా నీవు సుతలానికి వెళ్ళగలవు. అనాయాసంగా ఆకాశంలో విహరించగలవు. నీకు నా మీదున్న ప్రేమ నాకు తెలియనిది కాదు. నా కొరకు నువ్వు ఏదైనా చేస్తావు.

"సరమా! దుష్టుడైన రావణుడు ఎప్పుడూ చెడుకార్యాల యందే మనసును లగ్నం చేసి ఉంటాడు. నువ్వు వెళ్ళి రావణుడు ఏమి చేస్తున్నాడో తెలిసికొనిరా!

"నా మనసు ఎందుకో కలత చెందుతూ వుంది. సంశయగ్రస్తమై ఉంది;" అని కన్నీరు కార్చుతూ దుఃఖించింది సీతమ్మ.

"జానకీ! ఏడవకు! నువ్వు చెప్పినట్లే నేను వెళ్ళి రావణుని ప్రవర్తనను తెలిసికొని వస్తాను;" అని ప్రేమతో సీతమ్మ కన్నీటిని తుడిచి రావణుని ప్రాసాదానికి వెళ్ళింది సరమ.

రావణుని చర్చలను, మంత్రుల సలహాలను అవధానంతో ఆలకించి, ఆ విషయాలను సీతమ్మకు చెప్పడానికి అశోకవనానికి వచ్చింది సరమ. ఆమె కొరకు సీతమ్మ వెయ్యికళ్ళతో నిరీక్షిస్తోంది.

"సీతా! నిన్ను విడిచిపెట్టమని రావణుని తల్లి కైకసి రావణునితో చెప్పింది. అవిద్ధుడు అనే వృద్ధమంత్రి కూడా అదే చెప్పాడు. రాముడు ఖరుణ్ణి వధించిన విషయము, హనుమంతుడు లంకాదహనం చేసిన విషయమూ ఉటంకిస్తూ కూడా చెప్పారు.

"వాళ్ళు ఎంత చెప్పినా, లోభి ధనం మీద నున్న ఆశను వదలలేనట్లు, నీ మీదున్న వాంఛను రావణుడు త్యజించ లేకున్నాడు. రాముడికి భయపడి, యుద్ధానికి భయపడి అతడు నిన్ను వదిలేలా లేడు. యుద్ధంలో మరణించిన తరువాతే అతడు నిన్ను విడుస్తాడు.

"సీతా! రాముడు రావణుణ్ణి వధించేది ఖాయం. నిన్ను అయోధ్యకు తీసికొని పోవడం తథ్యం;" అని నవ్వుతూ పలికింది సరమ. సీతమ్మ మనస్సు ఊరడిల్లింది.

ఇంతలో భూమ్యాకాశాలు ఏకమయ్యేలా పెద్దగా రణభేరి మ్రోగింది. వానరుల సేన సింహనాదాలు చేసింది. అవి రాక్షసుల హృదయాలకు పిడుగుపాట్లు అయ్యాయి. రాక్షసుల ముఖాలు వెలవెల పోయాయి. రాజు చేసిన అపరాధానికి ఫలాన్ని ప్రజలు అనుభవించడానికి సిద్ధపడ్డారు.

ఆపదలో ఆప్తవాక్యం

రావణుని కొలువుకూటమిలో మంత్రులందరూ సమావేశ మయ్యారు. రాముని సైన్యం మ్రోగించిన శంఖధ్వనులూ, రణభేరి వినిపించింది. అది చెవిని పడగానే కొన్ని క్షణాలు రావణుడు ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత మంత్రులను ఉద్దేశించి ఇలా పలికాడు.

"రాముడు సముద్రాన్ని దాటి వచ్చాడు. అతడు బలవంతుడు. వీరుడు. పౌరుషవంతుడు- ఇలా మీరు చెప్తే నేను విన్నాను. రాముణ్ణి గూర్చి నాకు అంతే తెలుసు.

"ఒకవైపు రాముడు యుద్ధానికి వచ్చివున్నా, అతని పరాక్రమము మీకు తెలిసి ఉన్నా, మీలో ఎవ్వరు కూడా దానిని పట్టించుకోకుండా ఒకరి ముఖాల్ని మరొకరు చూసుకుంటూ

ఉన్నారనేది కూడా నాకు తెలుసు;" అని రావణుడు పలుకగానే గొప్ప బుద్ధిమంతుడు, రావణునికి మాతామహుడు అయిన మాల్యవంతుడు ఇలా పలికాడు.

"రాజా! నాకు తోచిన ఒకమాట చెబుతాను. ప్రభువు విద్యావంతుడై, నైతికశిక్షణ కలిగిన వాడైతే ఆ రాజ్యము చాలా కాలము సిరిసంపదలతో తులతూగుతుంది. అట్టి ప్రభువును చూచి శత్రువులు కూడా భయపడతారు. సమయాలను తూచి మిత్రశత్రుత్వాలను కొనసాగించే రాజు సదా ఐశ్వర్యవంతుడై ఉంటాడు.

హీయమానేన కర్తవ్యో రాజ్ఞా సంధిః సమేన చ
న శత్రు మవ మన్యేత జ్యాయాన్ కుర్వీత విగ్రహమ్ ॥

"రాజా! శత్రువు సమాన బలవంతు డైనపుడు, అధికబలసంపన్ను డైనపుడు అతనితో సంధి చేసుకోవాలి. శత్రువు బలహీను డైనపుడు అతనితో విరోధము కొనసాగించాలి.

"రావణా! ఇది రాజనీతి. నా అభిప్రాయము కూడా. నువ్వు రామునితో సంధి చేసుకోవడం నాకు ఇష్టము. రాముడు నీ మీద ఎందుకు దండెత్తినాడు? సీత కోసం. అయితే, నా సలహా విను. సీతను రాముడికి ఇచ్చెయ్యి.

"రాముడితో యుద్ధము శ్రేయస్కరము కాదు. దేవ, గంధర్వ, ఋష్యాదు లందరూ రాముని విజయాన్నే కాంక్షిస్తున్నారు. రాముడితో విరోధము పెట్టుకోకు.

"బ్రహ్మదేవుడు ధర్మాధర్మములను సృష్టించాడు. దేవతలు ధర్మమును ఆశ్రయించి ఉంటారని, రాక్షసులు అధర్మమును ఆశ్రయించి ఉంటారని చెబుతారు. నీవు ధర్మాన్ని నశింపచేశావు. అధర్మాన్ని పాలుపోసి పెంచావు. ఈ కారణంగా శత్రువులు మనకన్నా బలవంతులై ఉన్నారు.

ధర్మో వైగ్రసతేఽధర్మం యదాకృత మభూద్యుగమ్
అధర్మో గ్రసతే ధర్మం తదా తిష్యః ప్రవర్తతే ॥

"అధర్మముపై ధర్మము ఆధిపత్యమును చెలాయించినపుడు కృతయుగము ఆవిర్భవిస్తుంది. ధర్మముపై అధర్మము అధిపత్యము సాగించినపుడు కలియుగము ఆవిర్భవిస్తుంది.

"రావణా! నీవు అధర్మాన్ని ఆశ్రయించి గొప్ప పొరపాటు చేశావు. ఆ అధర్మమే ఈ రోజు మనల్ని మ్రింగేస్తూ వుంది. ధర్మం దేవతల పక్షాన ఉండి వాళ్ళను వృద్ధి పరుస్తోంది.

"రావణా నువ్వు భోగాలకు వశుడైపోయావు. అగ్నితుల్యులైన తాపసుల్ని హింసించావు. ఋషులు తపస్సు అనే అగ్ని ద్వారా పవిత్రమైనవారు. ధర్మాసక్తులు. యజ్ఞాలు చేసుకుంటూ ఉంటారు. హోమాలు చేస్తుంటారు. వేదాన్ని పఠిస్తూ ఉంటారు. వాళ్ళనందరినీ నువ్వు బాధించావు.

"దేవ, దానవ, యక్షాదుల నుండి మరణం లేకుండా నువ్వు వరాలు పొందావు. ఎవరి మండైతే నీకు భయం ఉండదని భావించి, వరాలు కోరే సమయంలో విస్మరించావో, వచ్చి బలపరాక్రమములతో ఆ నరులు, వానరులు, భల్లూకములు, గోలాంగూలములు ఈనాడు నిన్ను పోరుకు పిలుస్తున్నారు.

"నాకు దుశ్శకునాలు కన్పిస్తున్నాయి. రాక్షసులకు కాలం మూడింది అనిపిస్తోంది. నక్కలు, గ్రద్దలు, క్రూరమృగాలు భయంకరంగా రోదిస్తున్నాయి. అరుస్తున్నాయి. పితృపిండాలు కాకులకు బదులుగా కుక్కలు తింటున్నాయి. మృగములు, పక్షులు సూర్యునికి అభిముఖంగా నిలిచి విలపిస్తున్నాయి;" అని చెబుతూ రావణుని ముఖాన్ని పరిశీలించి చూశాడు మాల్యవంతుడు. రావణునిలో మార్పు గోచరింపక పోగా, ఏదో అయిష్టత మనసులో నిండియున్నట్లు కన్పించింది. ఇక మాట్లాడలేదు మాల్యవంతుడు.

మాల్యవంతుని మాటలు రావణుని మనసుపై ఏవిధమైన ప్రభావాన్నీ చూపలేదు. ఎవరి విషయంలో ఆసక్తి కలిగి యముడు బయలుదేరుతాడో అట్టివాడు మాత్రం హితవు చెప్పినా వినడు. రావణుడికి మాల్యవంతునిపై కోపం వచ్చింది. కళ్ళు త్రిప్పుతూ, పళ్ళు కొరుకుతూ ఇలా మాట్లాడాడు రావణుడు.

"మంచి చెబుతానంటూ చెడు పలుకుతున్నావు. నావద్ద ఉన్నావు. మనసును శత్రువుకు తాకట్టుపెట్టావు. నీ మాటలు నా చెవికి ఎక్కవు.

"రాముడా! సామాన్యమానవుడు. దీనుడు. దిక్కులేని ఏకాకి. ఎంతటి దౌర్భాగ్యుడు కాకపోతే, తండ్రి అడవులకు తరుముతాడు. అక్కడ తెలిసిపోతోంది ఆయన సమర్థత. నీ స్తుతులకు సార్థకత.

"వ్యక్తుల మనస్తత్వాలకు అద్దం పడుతారు స్నేహితులు. ఆహా.....ఎలాంటి మిత్రులు. అన్నీ కోతులే. ఆయన మనసెలాంటిదో మిత్రుల్ని చూసి తెలుసుకోవచ్చు.

"ఇక, నా విషయం తెలియదా! నా పేరు చెబితే చాలు. ఆ క్షణం నుండి దేవతలు నిద్ర మానేస్తారు. రాక్షసులకు ప్రభువైన నన్ను ఎందుకని చులకన చేసి మాట్లాడుతున్నావు. నాకు తెలుసులే.

"నీ జాతివాణ్ణి కదూ! నామీద కాకపోతే ఎవరిమీద ఉంటుంది నీకు అసూయ! పైగా శత్రుపక్షపాతివి. దానికి తోడు నిన్ను ఏవిధంగానూ హింసించని నా మంచితనం ఉండనే ఉంది. ఇక నువ్వెందుకు మాట్లాడవు?

"అధికారంలో వున్న నాతో నువ్వు ఇలా మాట్లాడుతున్నావంటే వెనుక తప్పకుండా ఏదో గూడుపుఠానీ ఉండే ఉంటుంది. లక్ష్మీదేవిలా వెలిగిపోతున్న సీతను నేను రాముడికి ఎందుకు ఇస్తాను? చూస్తూ వుండు. అన్నీ రోజుల్లోనే జరిగిపోతాయి. వానరులు, సుగ్రీవ రామ లక్ష్మణులు అందరూ మట్టిలో కలిసిపోతారు.

"నాతో ముఖాముఖి పోట్లాడడానికి దేవతలు జడుస్తారు. నేను యుద్ధానికి జంకుతానా!

ద్విధా భజ్యేయ మప్యేవం న నమేయం తు కస్య చిత్
ఏషమే సహజో దోషః స్వభావో దురతి క్రమః

"నా శరీరం రెండు ముక్కలుగా తెగిపోయినా సరే, నేను ఎవ్వరికీ లొంగను. వంగను. అది నాలో పుట్టుకతో వచ్చిన దోషము. స్వభావాన్ని ఎవరు మార్చుకుంటారు?" అన్నాడు రావణుడు.

అనేక జన్మల సంస్కారాలు కలిసి మనిషి స్వభావాన్ని నిర్ణయిస్తాయి. మానవుడు ప్రయత్నపూర్వకముగా స్వభావాన్ని మార్చుకొని, తనను తాను సంస్కరించుకొని, ఉత్తీర్ణుడు

కావాలి. నాది చెడు స్వభావము కనుక నేను మారను, మార్చుకోను అని ఎవరైనా పలుకుతారా, రావణుడు తప్పు. అంతేకాదు. ఈవిధమైన అర్థరహిత పలుకులు పలుకుతూ వ్యర్థంగా జీవించేవారంతా రావణులే అని మరువకూడదు.

"మాల్యవంతా! మాతామహా! రాముడు సేతువును కట్టినంత మాత్రాన నేను భయపడవలసిన పనిలేదు. సముద్రమును దాటి రావడం గొప్ప అనుకుంటున్నావా! కానేకాదు. నా చేతినుండి తప్పించుకొని పోవడం గొప్పతనం. నీకు ప్రతిజ్ఞ చేసి చెప్తున్నాను. రాముడు ప్రాణాల్ని దక్కించుకోలేడు;" అంటూ క్రుద్ధుడై పలుకుతున్న రావణునితో మాల్యవంతుడు మారు పలకలేదు. రాజుకు జయం పలికి ఆజ్ఞ తీసికొని నిష్క్రమించాడు.

రావణుడు మంత్రులతో సంప్రదించి లంకను కట్టుదిట్టం చేశాడు. తూర్పు ద్వారమున ప్రహస్తుణ్ణి ఉంచాడు. దక్షిణ ద్వారమున మహోదర మహాపార్శ్వులను నిలిపాడు. పశ్చిమ ద్వారాన మాయల కుమారుడు ఇంద్రజిత్తును నియమించాడు. ఉత్తర ద్వారాన శుకసారణులతో కలసి తాను కూడా వెళ్ళుటకు నిర్ణయించుకున్నాడు.

సేనల మధ్య విరూపాక్షుడు మొదలైన వీరుల్ని ఉంచాడు. ఈవిధంగా సేనల్ని నియమించి, తాను జయించినట్లే భావించాడు. మంత్రులకు, సేనాధిపతులకు ఆశీర్వాదము లిచ్చి, వెనుదిరిగి అంతఃపురంలో ప్రవేశించాడు.

యుద్ధానికి సిద్ధం

రాముని పక్షంలో వ్యూహం సిద్ధమైంది. రామసుగ్రీవులు, హనుమంతుడు, జాంబవంతుడు, విభీషణుడు, అంగదుడు,లక్ష్మణుడు, శరభుడు, సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు, గజుడు, గవాక్షుడు, కుముదుడు, నలుడు, పనసుడు - అందరూ కలిసి ఊహలు అల్లుతున్నారు. విభీషణుడు వారితో ఇలా పలికాడు.

"నాతో పాటు రామునికి శరణాగతులైన నలుగురు రాక్షసులు నా మంత్రులు. వారే అనలుడు, పనసుడు, సంపాతి, ప్రమతి అను నలుగురు. వీరు నలుగురు పక్షిరూపములు ధరించి లంకలో ప్రవేశించి వచ్చారు. శత్రుసైన్యములో జరిగియున్న ఏర్పాట్లన్నీ తెలుసుకొని వచ్చారు;" అని పలికి నాలుగు ద్వారముల యందు నియమింపబడిన సేనలను, సేనా నాయకులను, సేనా నివేశములను వివరించాడు.

"ఏనుగుల మీద పదివేల మంది యోధులున్నారు. రథాలపై పదివేల మంది ఉన్నారు. అశ్వికులు రెండువేల మంది ఉన్నారు. పదాతులైన రాక్షసులు కోటికి మించి ఉన్నారు. వీరిలో ఒకొక్కరికి పదిలక్షల మంది పరివార ముంటారు.

"రామా! కుబేరునితో యుద్ధం చేసినపుడు రావణుని వెంట అరవైలక్షల మంది రాక్షసులు విలిచారు. వాళ్ళందరూ గొప్ప పరాక్రమవంతులే.

"రామా! శత్రువు యొక్క బలాన్ని నేను వర్ణించి నందుకు కోపమొచ్చిందా! నీకు కోపం తెప్పించాలని చెప్పానే గాని, భయపెట్టాలని కాదు. నీ పరాక్రమము ఎదుట సురులు కూడా తలవంచ వలసిందే. రావణుని, అతని చతురంగ బలాన్ని నీవు ఊడ్చేస్తావు;" అని పలికాడు విభీషణుడు.

విభీషణుడు చెప్పింది విన్న రాముడు శత్రువినాశనానికి పథకం సిద్ధం చేశాడు. ఈ విధంగా ఆజ్ఞ లిచ్చాడు.

వానర సమూహమును వెంటపెట్టుకొని కపిశ్రేష్ఠుడైన నీలుడు తూర్పుద్వారము నందు ప్రహస్తుణ్ణి ఎదుర్కొంటాడు.

వాలి కుమారుడు, యువరాజు అయిన అంగదుడు గొప్ప వానరసైన్యముతో దక్షిణ ద్వారమునందు మహోదర మహాపార్శ్వులను ఎదుర్కొంటాడు. పవనసుతుడైన హనుమంతుడు పశ్చిమద్వారమును ముట్టడిస్తాడు. ఇక ఉత్తరద్వారము మిగిలుంది. దేవ, దానవ, ఋషులను బాధించువాడు, దుర్మార్గుడు, వరాలున్నాయని మదించినవాడు అయిన రావణుని ఉత్తర ద్వారమున రాముడే ఎదుర్కొంటాడ లక్ష్మణుడు తోడుగా ఉంటాడు.

వానరరాజైన సుగ్రీవుడు, రాక్షసరాజైన విభీషణుడు, భల్లూకరాజైన జాంబవంతుడు సేనల మధ్య నిలిచి పోరాడుతారు.

యుద్ధంలో వానరులు మానవరూపాన్ని ధరించకూడదు. వానరరూపం లోనే ఉండాలి. అదే గుర్తు. రాముడు, లక్ష్మణుడు, విభీషణుడు, విభీషణుని నలుగురు మంత్రులు-కలిసి ఈ ఏడుగురు మాత్రమే మానవ రూపంలో ఉంటారు.

ఈవిధంగా వ్యూహరచన చేసిన తరువాత లంకను చూచుటకు సువేలపర్వతాన్ని ఎక్కాలని రాముడు నిర్ణయించుకున్నాడు. రామునితో కూడా లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు కూడా పర్వతము మీదికి వెళ్ళారు. ఆ తరువాత వానరసేన లోని నాయకు లందరూ ఎక్కారు.

పర్వతము మీద ఎక్కిన వానరులకు రాక్షసులు కనిపించగనే సమరోత్సాహంతో జబ్బలు చరచారు. అనేక విధములుగా శబ్దాలు చేశారు.

సూర్యుడు అస్తమించాడు. రాత్రి అయింది. పూర్ణచంద్రుడు ఆకాశాన్ని అలంకరించాడు.

ఈ సందర్భమున హాస్యరస ప్రధానమైన ఒక ఉపాఖ్యానము ప్రాచుర్యంలో ఉంది. ఇది వాల్మీకం కాదు. అయినా ఆనందిస్తారని వ్రాస్తున్నాను.

యుద్ధానికి ఇరుపక్షాలవారు సిద్ధపడి యున్నారు. యుద్ధమింకా ప్రారంభం కాలేదు. సువేలపర్వతము వెనుక వైపున గ్రద్దలన్నీ కలిసి ఒక రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయట.

ఒక వృద్ధ గ్రద్ద ఆ సభకు అధ్యక్షత వహించింది. ఆ గ్రద్ద తన అధ్యక్షోపన్యాసంలో ఇలా మాట్లాడిందట.

"మిత్రులారా! రేపు రామరావణ సంగ్రామము ప్రారంభం కాబోతోంది. రేపటి నుండి మనకు గొప్ప విందు జరుగబోతోంది. ఇక కొన్ని రోజులు రణరంగాన్ని విడిచి ఆహారనిమిత్తం మరొక చోటికి మనం వెళ్ళాల్సిన అవసరం ఉండదు.

"ఈ సందర్భములో మీకు నాయకుడుగా, జ్యేష్ఠుడుగా నా అభిప్రాయాన్ని మీముందు ఉంచుతున్నాను. బాగా ఆలోచించండి.

"పక్షులకైనా పాములకైనా, నరులకైనా వానరులకైనా, నక్కలకైనా కుక్కలకైనా, మందలకైనా పందులకైనా ఐకమత్యమే బలము. కలిసి ఉండడమే ధనం..... ఏమంటారు మీరంతా!"

"ఔను...ఔను..." అని అరిచాయి గ్రద్దలన్నీ. అంగీకారము అందగానే గృధ్రరాజు మళ్ళీ ప్రసంగాన్ని కొనసాగించాడు.

"అయితే వినండి. ఐకమత్యం లేకనే అందరూ ఆపదలకు గురౌతున్నారు. బలౌతున్నారు. ఏమంటారు మీరు" అని ప్రశ్నించాడు గృధ్రరాజు.

"ఔనంటాం.... ఓనౌనంటాం" అన్నాయి గ్రద్దలన్నీ. తాను అనదలచుకున్నది కూడా అనేయాలనుకున్నాడు గృధ్రరాజు.

"పౌరులారా! మాంసభక్షకులైన పక్షుల్లారా! రేపు యుద్ధం ప్రారంభ మవుతుంది. శవాలు పడుతూ ఉంటాయి. వాటిని మనము కడుపారా కమ్మగా ఆరగిస్తాము.

"అయితే అక్కడ మనం క్రమశిక్షణతో మెలగాలి. కుక్కల్లాగా కొట్లాడుకోకూడదు. ఎవరెవరికి ఎంత వాటా వస్తే దానితో తృప్తి చెందాలి. ఒకరి శవాల్ని మరొకరు ముట్టుకోకూడదు.

"లక్ష్మణుడు, అంగదుడు ఎవరినయితే చంపుతారో ఆ శవాల్ని యువక గ్రద్దలే తినాలి.

"విభీషణుడు, సుగ్రీవుడు ఎవరినయితే వధిస్తారో ఆ శవాల్ని మధ్యవయస్కులైన గృధ్రములే ఆరగించాలి.

"హనుమంతుడు ఎవరిని కొట్టి చంపుతాడో ఆ శవాల్ని నాలాంటి వృద్ధ గ్రద్దలే తినాలి. అపార్థం చేసుకోకండి. కారణం కూడా చెబుతున్నా. హనుమంతుడు కొట్టిన, చంపిన శవాల్ని నమిలి మ్రింగాల్సిన అవసర ముండదు. ఎముకలన్నీ నుగ్గునుగ్గై, మాంసమంతా గుజ్జుగుజ్జుగా తయారవుతుంది. ముసలి గ్రద్దలు కష్టం లేకుండా మ్రింగవచ్చు. అదీ నా భావం.

"ఇకపోతే, రాముడు ఎవరిని వధిస్తాడో ఆ శవాల్ని మాత్రం అందరము కలిసి తినాలి. ఎందుకంటే రామబాణంతో కూలింది కనుక అది ప్రసాదము.

"రావణుడి శవాన్ని మాత్రం మన మెవ్వరమూ ముట్టుకోకూడదు. ఆ దుష్టుడు మన రాజైన జటాయువును వధించాడు. కనుక వాడి శవాన్ని నక్కలకీ, కుక్కలకీ వదిలేద్దాం.

"చివరగా, నా ప్రసంగాన్ని ముగిస్తూ, ఒక్కమాట. అన్నదాత సుఖం కోరడం సంప్రదాయం."

"జటాయువు మరణించినపుడు మన రాజైన జటాయువుకు రాముడు అంత్యక్రియలు చేశాడు. కానీ ఉత్తరక్రియలు చేసి జటాయువు బంధువులకు విందు చేయలేక పోయాడు. వియోగబాధలో విందును చేయలేక, లంకలో యుద్ధం జరిగినపుడు పది రోజులు మనకు విందు చేస్తానని ప్రతిజ్ఞ పూనాడు.

"గృధ్రములారా! రాముడు రేపు ఆ కార్యాన్ని నిర్వర్తించ బోతున్నాడు. మనకు కమ్మని విందు వేర్పాటు చేస్తున్నాడు. అన్నదాతకు జయం పలుకుతాము.

"జై శ్రీరామచంద్ర భగవాన్ కీ జై." అని గ్రద్దలన్నీ విజయఘోషలు పలికాయట.

శుభారంభం

తెల్లవారింది. వానరనాయకులతో కలిసి రాముడు సువేలపర్వతము మీదనుండి లంకా పట్టణాన్ని చూశాడు. సమంగా, విశాలంగా, దీర్ఘంగా, అందంగా ఉన్న లంకను చూచి ఆశ్చర్యపడ్డాడు.

చంపక, అశోక, తమాల, పనస వృక్షాలతో, పుష్పించిన అరటిచెట్లతో, రంగురంగుల పుష్పాలతో, పుష్పించిన లతలతో లంకానగరము అమరావతిలా శోభిస్తోంది. నందన వనంలాగా మనోహరంగా ఉంది.

తెల్లని మేఘముల వలె ఎత్తైన గోపురాలతో, బంగారు ప్రాకారాలతో, వెండి ప్రాకారాలతో మెరిసిపోతోంది లంకాపట్టణము. వెయ్యి స్తంభాలతో అలంకరించబడిన రావణుని చైత్యప్రాసాదము కైలాసశిఖరం లాగా శోభిస్తోంది.

రాజప్రాసాదం గోపురాగ్రాన రావణాసురుడు కూర్చుని యుండడం చూశారు వానర శ్రేష్ఠులు. ఇరుప్రక్కల పరిచారికలు నిలబడి తెల్లని వింజామరలు వీస్తున్నారు. నీలిమేఘంలా శోభించే రావణుడు ఎఱ్ఱని చందనాన్ని పూసికొని, ఎఱ్ఱని అలంకారాలు ధరించి ఉన్నాడు. సాయంసంధ్యారుణ మేఘంలా ప్రకాశిస్తున్నాడు.

రావణుణ్ణి చూడగానే క్రుద్ధుడైన సుగ్రీవుడు రాముడు, వానరవీరులు చూస్తూ వుండగనే ఎగిరి రావణుని ప్రాసాదముపై దుమికాడు. ఒక్కక్షణం రావణుణ్ణి గడ్డిపోచలాగా పరిశీలించి చూచి, నిర్భయుడై తీవ్రంగా దూషించాడు.

"ఓరీ రాక్షసాధమా! రాముడు సర్వలోకములకు ప్రభువు. నేను రాముని మిత్రుణ్ణి. అతని దాసుణ్ణి. నిన్ను నేను విడువను," అంటూ ఎగిరి రావణుని మీద దుమికాడు. రావణుని విచిత్రవర్ణ కిరీటము నేలపై పడింది. రావణుడు క్రుద్ధుడై ఇలా పలికాడు.

సుగ్రీవ స్త్వం పరోక్షా మే హీనగ్రీవో భవిష్యసి

"సుగ్రీవా! నా ఎదుటికి రానంత కాలము నీవు సుగ్రీవుడివే (మంచి మెడగల వాడివి). నా ఎదుట నిలిచిన ఈ క్షణాన నువ్వు హీనగ్రీవుడవు (మెడ లేనివాడివి).

సుగ్రీవుణ్ణి చేతులతో పట్టి ఈడ్చి క్రిందపడేశాడు రావణుడు. సుగ్రీవుడు బంతిలాగా లేచి రావణుణ్ణి క్రింద పడదోశాడు. ఇద్దరూ తీవ్రంగా తలపడ్డారు. పోరాడారు. ఇద్దరి శరీరాలకు చెమటలు పోశాయి. పరస్పరం బాదుకున్నారు. తన్నుకున్నారు. కుమ్ముకున్నారు. గుద్దుకున్నారు. చరుచుకున్నారు. హోరాహోరీగా పోట్లాడుకున్నారు.

మల్లయుద్ధంలో సుగ్రీవరావణు లిద్దరూ ఆరితేరినవారే. మెలకువలు తెలిసినవారే. ఒకరి కొకరు ఏ మాత్రం తీసిపోకుండా పోరాడారు. రావణుడు చివరికి సుగ్రీవుని బంధించడానికి ఏదో మాయ చేయబోయాడు. అది గ్రహించిన సుగ్రీవుడు ఎగిరి రాముడుండే సువేల పర్వతము మీదికి వచ్చి వాలాడు. వానరు లందరూ సుగ్రీవునికి విజయఘోషలు పలికారు. సుగ్రీవుడు సురక్షితంగా తిరిగి వచ్చినందుకు రాముడు కూడా సంతోషించాడు.

సుగ్రీవుని శరీరంపై గాయాలు చూచి రాముడు చలించిపోయాడు. "సుగ్రీవా! ఎంతపని చేశావు? ఇలాంటి సాహసాలు ప్రభువులు చెయ్యవచ్చా? నన్ను, విభీషణుని, వానర వీరు లందరిని సంశయంలో పడేశావు. ఇక మీదట ఎప్పుడూ అలా చేయకు. నీకు ఏదైనా జరిగితే నాకు భరత లక్ష్మణ శత్రుఘ్నులతో అవసర మేముంది?

త్వయి కించి త్సమాపన్నే కిం కార్యం సీతయా మమ

"నీకు ఆపద సంభవిస్తే, ఆ తరువాత సీత వల్ల నాకు ఏమి ప్రయోజనం?

"సుగ్రీవా! ఒకవేళ నువ్వు కనుక తిరిగి రాకపోతే సపరివారంతో రావణుణ్ణి వధించి, విభీషణునికి పట్టాభిషేకం చేసి, అయోధ్యను భరతునికి అప్పగించి నేను ప్రాణత్యాగం చేయాలని అనుకున్నాను;" అన్నాడు రాముడు.

"రామా! సీతమ్మను అపహరించిన రావణుడు కంటబడిన తరువాత నన్ను నేను ఎలా నిగ్రహించుకోగలను?" అని పలకగానే రాముడు సుగ్రీవుని ప్రేమతో కౌగిలించుకున్నాడు.

రాముడు వానరవీరులతో కలిసి సువేలపర్వతాన్ని దిగాడు. సేననంతా పరికించి చూశాడు. సముచిత సలహాల నిచ్చాడు. సైన్యాన్ని లంకాపట్టణం వైపు నడిపించాడు. రాముని వెంట విభీషణ సుగ్రీవులు, హనుమంతుడు, జాంబవంతుడు, నలుడు, నీలుడు, లక్ష్మణుడు నడిచారు.

వానరసైన్యము లంక చుట్టూ చేరి ముట్టడించుటకు సిద్ధంగా ఉంది. రామాజ్ఞకై ఎదురు చూస్తూ వుంది. లక్ష్మణసమేతుడైన రాముడు ఉత్తరద్వారము వైపు నిలబడి లోనుండి ఎవ్వరినీ బైటకి రానివ్వకుండా నిరోధించాడు. రావణుడు స్వయంగా రక్షిస్తున్న ఆ ద్వారాన్ని రాముడు తప్ప మరొకరు నిరోధించలేరు.

ఒకొక్క ద్వారము వద్ద ఒకొక్క కోటి వానరులు నిలిచారు. వృక్షములు చేతిలో ధరించి లంక చుట్టూ కోట్లకొలది వానరులు ముట్టడించడం వల్ల గాలి కూడా సోకడం లేదు.

వానరవీరులు లంకలో ప్రవేశిస్తుంటే తీరాన్ని కొట్టేసి విజృంభిస్తున్న సముద్రజలమా అన్నట్లుంది. ఒకేసారి ఇన్నికోట్ల వానరులు లంకను ముట్టడించడం రాక్షసులకు దిగ్భ్రాంతిని కలిగించింది. వానరుల ధ్వనులు సాగరఘోషలా వినిపించాయి.

అన్నివైపుల సేనను క్రమపరచి, నాయకులతో సంప్రదించి, రాజనీతిని పాటిస్తూ విభీషణుని సలహాను తీసికొని వాలికుమారుడైన అంగదుణ్ణి పిలిచాడు రాముడు. "అంగదా! ఇలారా! నువ్వు రావణుని వద్దకు వెళ్ళి నా మాటగా ఇలా చెప్పు.

"రావణా! నీకు చెడిపోయే కాలం సమీపించింది. బ్రహ్మ ఇచ్చిన వరాల కారణంగా నీవు మదించి ప్రవర్తించావు. ఋషుల్ని, దేవతల్ని, గంధర్వుల్ని, అప్సరసల్ని, నాగుల్ని, యక్షుల్ని బాధించావు. దాని ఫలితాన్ని ఇప్పుడు అందుకో బోతున్నావు.

"నా భార్యను అపహరించిన నిన్ను దండించుటకు నీ ద్వారం వద్ద నిరీక్షించి వున్నాను. గతంలో నువ్వు వధించిన మహర్షులు, రాజర్షులు ఏ మార్గాన వెళ్ళారో ఆ మార్గాన్ని చూద్దువుగాని.

"నీచుడా! మాయ చేసి నన్ను దూరంగా తీసికెళ్ళి ఎవ్వరూ లేని సమయాన సీతను ఏ బలం చూసుకొని అపహరించావో ఆ బలాన్ని ఇప్పుడు చూపు. లేదా, సీతను నాకు అప్పగించి శరణాగతుడివి కా! అలా కానిచో నా బాణాలతో లంకలో రాక్షసులు మిగలకుండా చేస్తాను.

"రాక్షసశ్రేష్ఠుడు, ధర్మాత్ముడు అయిన విభీషణుడు నన్ను చేరినాడు. లంకకు రాజు కానున్నాడు. నీవు పాపాత్ముడివి. ఈ రాజ్యము ఇక నీకు దక్కదు. ధైర్యముంటే యుద్ధం చెయ్యి. లేదా, నా బాణాలతో కూలి శాంతించు. నా కంటపడిన తరువాత ముల్లోకాలలో నువ్వు ఎక్కడి కెళ్ళినా నన్ను తప్పించుకోలేవు.

"చివరగా ఒక్కమాట చెబుతున్నాను. పరలోకగమనానికి ముందే శ్రాద్ధం పెట్టుకో. లంకను కడచూపుగా చూసుకో. నీ ప్రాణాలు నా చేతిలో ఉన్నాయి. ఏ క్షణాన్నైనా ఎగిరిపోతాయి". రాముడు ఇలా పలుకగానే అంగదుడు వెంటనే బయలుదేరి ఆకాశమార్గాన వెళ్ళాడు.

అంగద రాయబారము

అంగదుడు ఒక్కక్షణంలో రావణుని భవనంలో చేరాడు. మంత్రులతో కలిసి కూర్చుని యున్న రావణుని నిర్భయంగా చూశాడు.

అంగదుడు రావణుని సమీపించి, "నేను వాలిపుత్రుణ్ణి. నన్ను అంగదుడు అంటారు. నేను రాముని దూతను. బహుశ నీకు తెలిసే ఉండొచ్చు. రాముడు నీతో ఇలా చెప్ప మన్నాడు" అని రాముడు పలికిన మాటల్ని ఉన్నదున్నట్లుగా వివరించాడు.

అంగదుని మాటలను ఆలకించి కోపావిష్టుడైన రావణుడు, "ఈ దుష్టుణ్ణి పట్టుకొని వధించండి" అని మంత్రులను ఆజ్ఞాపించాడు. వెంటనే భయంకరులైన నలుగురు రాక్షసులు వెళ్ళి అంగదుని పట్టుకున్నారు. తన బలాన్ని ప్రదర్శించాలని అంగదుడు భావించడం వలన శక్తి ఉండి కూడా రాక్షసులకు పట్టుబడ్డాడు.

అంగదుణ్ణి భుజాలు పట్టుకొని రాక్షసులు రావణుని సమీపానికి తీసికొని వస్తూ ఉండగా, అంగదుడు విజృంభించాడు. రాక్షసులను పక్షులలాగా విదిలించుకొని ఎగిరి ప్రాసాదముపై నిలిచాడు. అంగదునిచే విసిరివేయబడిన రాక్షసులు రావణుడు చూస్తుండగనే నేలమీద పడ్డారు.

అంగదుడు తన పాదాలతో త్రొక్కగానే ప్రాసాద శిఖరము బ్రద్దలైపోయింది. ఆవిధంగా ప్రాసాదాన్ని పాడుచేసి అంగదుడు ఎగిరి వెళ్ళిపోయాడు.

రావణుని దూతలు పట్టుబడినపుడు దూతను వధించరాదని విడిచిపెట్టాడు రాముడు. రాముని వద్దనుండి దూతగా వచ్చిన అంగదుని వధించమన్నాడు రావణుడు. ఇలాగే ఉంటాయి ధర్మాధర్మాలు.

అంగదుడు రాముని సమీపించాడు. వానరు లందరూ పెద్దగా ధ్వనులు చేశారు. రాముడు యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. రావణుని వధించుటకు నిశ్చయించుకున్నాడు. వానరుల అరుపులు విని లంకలో రాక్షసులు ఆయుధములను ధరించి యుద్ధోన్ముఖు లయ్యారు.

యుద్ధారంభం

వానరులతో కలిసి రాముడు లంకను ముట్టడించాడని రావణునితో చెప్పారు రాక్షసులు. రావణుడు ఏర్పాట్లను దృఢతరం చేసి ప్రాసాదమెక్కి చూశాడు. అన్నివైపుల నిండివున్న వానరసేనను చూశాడు. వానరులు కప్పేసి ఉండడం వల్ల భూమి పచ్చగా కన్పించింది. వీళ్ళని ఎలా వధించాలి? అనే శంక ప్రథమంగా కలిగింది రావణునికి.

సేనతో ముందుకు ఉద్యమిస్తున్న రాముణ్ణి కూడా చూశాడు రావణుడు. ఈలోగా శత్రు సంహారము చేయవలసిందిగా రాముడు తన సైన్యానికి ఆజ్ఞ లిచ్చాడు. వానరు లందరూ దిక్కులు పిక్కటిల్లేలా సింహనాదాలు చేశారు. బండలను, వృక్షాలను చేతుల్లో ధరించి నిలబడ్డారు వానరులు.

వానరసేనలు గుంపులు గుంపులుగా లంకను ఎక్కాయి. పెద్దగా సింహనాదములు చేస్తూ, రాముని కొరకు ప్రాణాలను త్యజించడానికి కూడా సిద్దంగా ఉన్నారు కపివీరులు.

ముందుగా ముఖద్వారాల్ని నేలమట్టం చేశారు. ప్రాకార తోరణాలు పడగొట్టారు. అగడ్తను కప్పేశారు. ఎగురుతూ కొందరు, గర్జిస్తూ కొందరు, దుముకుతూ కొందరు-ఇలా లంకను కప్పేశారు వానరులు.

ఇదంతా చూచి రావణుడు క్రుద్ధుడయ్యాడు. "వెళ్ళి చేతులు కలపండి" అని తన సైన్యానికి ఆజ్ఞలిచ్చాడు. వెంటనే రాక్షసులు భయంకరంగా అరుస్తూ ముందుకొచ్చారు. రణభేరి మ్రోగించారు.

పూర్వము దేవాసురసంగ్రామము జరిగినట్లు రాక్షస వానరుల మధ్య భయంకరంగా యుద్ధం జరిగింది. రాక్షసులు విజృంభించి గదలతో, శూలాలతో, ఖడ్గాలతో, గొడ్డళ్ళతో వానరులను కొట్టారు. వెంటనే వానరులు విజృంభించి వృక్షాలతో, పెద్దపెద్ద బండలతో రాక్షసుల్ని భయంకరంగా కొట్టారు.

కొందరు రాక్షసులు గోడలపై ఎక్కి వానరులను శూలాలతో పొడుస్తూ రావణునికి విజయఘోషలు వినిపిస్తున్నారు. నేలపై వున్న వానరులు పైకి ఎగిరి ప్రాకారం మీదున్న రాక్షసులను క్రిందికి లాగి వాళ్ళమీద రాళ్ళవర్షం కురిపించారు.

చచ్చిన దేహాలు కాళ్ళక్రింద పడి నలిగిపోగా, దానిపై ప్రవహించిన రక్తంతో నేల బురద బురదగా తయారైంది. వానరుల ప్రతాపప్రభావాలను చూచిన రాక్షసులలో పౌరుషం పెరిగింది. గుఱ్ఱాలమీద, పతాకాలు రెపరెప లాడుతున్న రథాలమీద రావణునికి జై కొడుతూ రాక్షస సైన్యం కదలివచ్చింది.

వానరులు కూడా వెనుకాడలేదు. ద్విగుణీకృతమైన సమరోత్సాహంతో రాక్షసుల మీద విరుచుకుపడ్డారు. వానర రాక్షసులకు మధ్య ద్వంద్వపోరాటము భయంకరంగా సాగుతోంది.

ఒకవైపు ఇంద్రజిత్తు, అంగదుడు పోరాడుతున్నారు. వారిరువురు అడవిఏనుగుల్లాగా పోరాడుతుంటే పూర్వము అంధకాసురునికి, శివునికి జరిగిన యుద్ధము స్మృతిలోకి వస్తోంది.

మరొకవైపు సంపాతి అనే వానరుడు ప్రజంఘునితో పోరాడుచుండగా, శత్రుఘ్నుడనే రాక్షసునితో విభీషణుడు పోటీపడ్డాడు. తపనుడనే రాక్షసుణ్ణి గజుడు పట్టుకున్నాడు. నీలుడు నికుంభుని ఎదుర్కొన్నాడు.

ప్రఘస సుగ్రీవులు భయంకరంగా కలియబడ్డారు. ఆ ప్రక్కనే లక్ష్మణుడు విరూపాక్షుని ఎదుర్కొన్నాడు. అగ్నికేతువు, రశ్మికేతువు, మిత్రఘ్నుడు, యజ్ఞకోపుడు రాముని చుట్టుముట్టారు.

మైందునితో వజ్రముష్టి అనే రాక్షసుడు, ద్వివిదునితో అశనిప్రభుడు తలపడ్డారు. ప్రతపనుడు అనే భయంకర రాక్షసుడు నలుని పైకి ఉరికాడు. విద్యున్మాలి అనే రాక్షసుణ్ణి సుషేణుడు పట్టుకున్నాడు. వానర రాక్షసుల మధ్య భయంకరంగా సాగే ఈ సమరము గగుర్పాటును కల్గిస్తోంది.

ఉభయసేనల లోని వీరుల దేహాల నుండి కారిన రక్తం కాలువలై ప్రవహించ సాగింది. ఆ రక్తప్రవాహంలో కొట్టుకొని పోతున్న వెంట్రుకలు గడ్డిమూటల్లా కనిపిస్తుంటే, కదలిపోతున్న మృతకళేబరాలు ప్రవాహంలో కొట్టుకొచ్చిన కట్టెల వలె కనిపిస్తున్నాయి.

అంగదుడు తీవ్రంగా విజృంభించి శత్రుసైన్యాన్ని చీల్చి చెండాడుతున్నాడు. అది చూచి ఇంద్రజిత్తు మండిపడ్డాడు. దేవేంద్రుడు వజ్రాయుధంతో కొట్టినట్లు తన గదతో అంగదుణ్ణి కొట్టాడు.

ఆ దెబ్బకు క్రుద్ధుడైన అంగదుడు వేగాన్ని పుంజుకున్నాడు. ఇంద్రజిత్తు అధిరోహించి యున్న సువర్ణచిత్రాంగమైన రథాన్ని విరుగకొట్టేశాడు. సారథిని సాగనంపేశాడు. గుఱ్ఱాల్ని కొట్టి చంపేశాడు.

ప్రజంఘుడు సంపాతిపై మూడు బాణాలు విడిచాడు. సంపాతి ఒక పెద్ద మద్దిచెట్టును పెకలించి ప్రజంఘుని కొట్టాడు. ఆ దెబ్బకు తూలి క్రిందపడి మరణించాడు ప్రజంఘుడు.

ప్రతపనుడు గర్జిస్తూ నలుని మీదికి ఉరికాడు. నలుడు వాడియైన గోళ్ళతో కళ్ళు పీకేశాడు. సుగ్రీవుడు విజృంభించి సప్తపర్ణవృక్షముతో ప్రఘసుని కొట్టి చంపాడు. భయంకరుడైన విరూపాక్షుని లక్ష్మణుడు కూల్చేశాడు.

అగ్నికేతువు, రశ్మికేతువు, మిత్రఘ్నుడు, యజ్ఞకోపుడు రాముణ్ణి బాణాలతో గాయాలు చేశారు. రాముడు కోపించి నాలుగు నారాచబాణాలను విడిచి నలుగురిని నేలరాల్చేశాడు.

పళ్ళు కొరుకుతూ, పిడికిలిని బిగించి మైందుడు వజ్రముష్టిని కొట్టాడు. వజ్రముష్టి తన రథంతో పాటు తెగిన మాకులాగా ఒరిగిపోయాడు.

నికుంభుడు ముందుకు దూకి వాడియైన బాణాలతో నీలుణ్ణి కొట్టాడు. నీలుడు క్రిందపడి మళ్ళీ చెండులాగా పైకి లేచాడు. ఈలోగా నీలునిపై వంద బాణాలను ప్రయోగించి, వికటాట్టహాసము చేశాడు నికుంభుడు.

నీలుడు ఉద్రేకంతో ఊగిపోతూ నికుంభుని రథచక్రాన్ని ఊడగొట్టి, ఆ రథచక్రముతో నికుంభుని, సారథిని నాశనం చేశాడు. ఆ ప్రక్కనే ద్వివిదుడు పర్వతశిఖరంతో కొట్టగా అశని ప్రభువు అంతరించాడు.

రథారూఢుడై ఉన్న విద్యున్మాలి బంగారు పొన్నులు గల బాణాలతో క్రిందవున్న సుషేణుణ్ణి అనేక పర్యాయాలు పీడించి సింహనాదం చేశాడు. సుషేణుడు కొండలా కనిపించే బండనెత్తి విద్యున్మాలి రథముపై విసిరాడు. విద్యున్మాలి రథమునుండి ఎగిరి దుమికి ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. చేతిలో గదను ధరించి సుషేణుని మీదికి ఉరికాడు.

సుషేణుని వక్షఃస్థలము మీద గదతో కొట్టాడు విద్యున్మాలి. సుషేణుడు దానికి చలించకుండా పెద్ద బండనెత్తి విద్యున్మాలి గుండెపై విసిరాడు. అంతే గుండె పగిలిపోయింది. విద్యున్మాలి వధించబడ్డాడు.

ఈవిధంగా భయంకరంగా సాగిన సమరంలో దేవతల చేతుల్లో దైత్యులు కూలినట్లు వానరవీరుల చేతుల్లో రాక్షసులు రాలిపోయారు.

పీనుగుల్ని తినడానికి వచ్చిన నక్కలతో, కుక్కలతో, పైనుండి వాలుతున్న కాకులతో, గ్రద్దలతో రణరంగము బీభత్సంగా గోచరించింది.

సూర్యుడు అస్తమించాడు. చీకటిపడింది. దాని కొరకే ఎదురుచూస్తున్న రాక్షసులు విజృంభించారు. పరస్పరం ఘోరంగా కలియబడ్డారు.

"రేయ్ వానరా! చచ్చావురా నా చేతిలో" అంటూ రాక్షసుడు రాక్షసుణ్ణే కొట్టి చంపాడు వానరు డనుకొని.

"ఒరేయ్ రాక్షసుడా! నీచుడా! ఈ దెబ్బతో ఎగిరిపోరా యమలోకానికి" అంటూ వానరుడు వానరుణ్ణే కొట్టి చంపేశాడు రాక్షసు డనుకొని.

తిమిరంలో సమరం

"కొట్టేయ్ ...చీల్చేయ్... రా.... ఆగు" అనే అరుపులే వినిపిస్తున్నాయి ఆ చీకట్లలో. రాత్రి సమయం కావడం వల్ల వానరులు కూడా పెద్ద సంఖ్యలో రాలిపోతున్నారు. రాక్షసులు వానరుల్ని చంపడమే గాక అక్కడ్నే తినేస్తున్నారు కూడా.

వానరులు వెనుకంజ వేయలేదు. కాలం రాక్షసులకు అనుకూలమైనా, పట్టుదలలో పోరాడి కాలానికి ఎదురీదారు కపివరులు. ఏనుగులను కొట్టి చంపారు. ఏనుగులపై ఉన్నవాళ్ళను క్రిందికి లాగి మరీ చంపారు. రథాల్ని విరిచేశారు.

ఆ చీకట్లలో మసక మసకగా కనిపిస్తూ ఉండిన రాక్షసుల్ని రామలక్ష్మణులు సర్పబాణాలతో కొట్టి చంపారు. రథచక్రాల ధ్వనులతో, శంఖధ్వనులతో, భేరీమృదంగ శబ్దాలతో రణరంగ మంతా ప్రతిధ్వనించింది. మరణించే వారి భయంకరమైన కేకలు, సకిలిస్తున్న అశ్వాల శబ్దాలలో కలిసిపోయాయి. రణరంగంలో ఆ రాత్రి వానర రాక్షసులకు మృత్యుదేవత అయింది.

కొందరు రాక్షసులు బాణాలు చేబూని ప్రళయపయోధి ఘోషలాగా గర్జిస్తూ రాముని అడ్డుకున్నారు. క్షణకాలంలో అగ్నితేజము వంటి ఆరు బాణాలను ప్రయోగించి రాముడు వారిని హతమార్చాడు. రామబాణాలకు తట్టుకోలేక, ప్రాణాలు నిలుపుకొనే ప్రయత్నంలో పరుగులు తీశారు యజ్ఞశత్రువు, మహాపార్శ్వుడు, మహోదరుడు, వజ్రదంష్ట్రుడు, శుక సారణులూను.

ఆ రాక్షసు లందరూ నేలరాలారు.
అగ్నిని చేరిన మిడతల లాగా రాముని ఎదిరించిన రాముని అగ్నిబాణాల నుండి ఎగిరిపడే అగ్నికణాలు శరద్రాత్రిలో ప్రకాశించే మిణుగురు పురుగుల్లాగా తెలుస్తున్నాయి. రామబాణాలు మెరుపుతీగల్లాగా దూసుకుపోతున్నాయి.

మహావీరుడైన అంగదుడు ఒకే దెబ్బతో ఇంద్రజిత్తును, సారథిని, గుఱ్ఱాలను తీవ్రంగా పీడించాడు. అంగదుడు కొట్టిన దెబ్బకు గుఱ్ఱాలు, సారథి కూలిపోయారు. వెంటనే ఇంద్రజిత్తు రథాన్ని త్యజించి అదృశ్య మయ్యాడు. అంగదుని రామలక్ష్మణులతో పాటు అందరూ అభినందించారు. మహావీరుడైన ఇంద్రజిత్తును పరాభవించడం ఘనకార్యంగా అంగదుని శ్లాఘించారు వానరవీరు లందరూ.

ఇంద్రజిత్తు ఆ పరాభవాన్ని సహించలేక పోయాడు. ఇంద్రజిత్తు వీరుడే కాదు. క్రూరుడు కూడా. తాను కనపడకుండా రణరంగంలో నిలిచి భయంకరమైన బాణాలను ప్రయోగించాడు. రామలక్ష్మణులపై కూడా వాడియైన బాణాల్ని విడిచాడు. వారి దేహాల్ని దారుణంగా గాయపరచాడు.

నాగపాశ బంధం

చాటున మాటేసి, బాణాలను సంధించి రామలక్ష్మణులను తీవ్రంగా గాయపరచిన ఇంద్రజిత్తు చివరగా వారిపై నాగాస్త్రాలను ప్రయోగించాడు. అవి సర్పాలవలె చుట్టుకొని బాధించసాగాయి. రామలక్ష్మణులు కదలలేక పోయారు. నాగాస్త్రాలతో బంధించబడ్డారు.

చాటున ఉండి శరాలను కుప్పించే ఆ రాక్షసుడి మార్గాన్ని అన్వేషించమని వీరులతో పలికాడు రాముడు. నీలుడు, హనుమంతుడు, అంగదుడు, ద్వివిదుడు మొదలైన వారంతా ఆ కార్యములోనే నిమగ్న మయ్యారు. వృక్షాలను చేతపట్టుకొని ఆకాశమార్గాన విహరించారు. వారిపై భయంకరంగా అస్త్రప్రయోగం చేశాడు ఇంద్రజిత్తు. దట్టమైన మేఘాల వెనుకకు వెళ్ళిన సూర్యుని చూడలేనట్లు మాయారూపం ధరించిన ఇంద్రజిత్తుని వానరులు కనిపెట్టలేక పోయారు.

ఇంద్రజిత్తు ప్రయోగించే శరాలు రామలక్ష్మణుల శరీరాల్లో గ్రుచ్చుకుంటున్నాయి. అన్నదమ్ముల దేహాంగాలలో ఖాళీప్రదేశము కనిపించకుండా భయంకరంగా బాణాలు దించాడు ఇంద్రజిత్తు. వాననీటి గొట్టం నుండి నీళ్ళు కారినట్లు వారి దేహాల నుండి రక్తం స్రవించింది. రుధిరమయమైన దేహాలతో ప్రకాశిస్తున్న రామలక్ష్మణులు పుష్పించిన మోదుగ వృక్షాలలాగా కనిపిస్తున్నారు.

అదృశ్యంగా ఉండి అస్త్రప్రయోగం చేస్తున్న ఇంద్రజిత్తు ఇలా పలికాడు. "అంతర్ధానమై యుద్ధం చేసే నన్ను దేవతలే కనిపెట్టలేరు. మీ వల్ల ఏమవుతుంది? రామా! లక్ష్మణా! సిద్ధంగా ఉండండి యమలోకానికి" అని పలికి, పెద్దగా సింహనాదం చేసి మళ్ళీ బాణాలతో కొట్టడం ప్రారంభించాడు. రామలక్ష్మణులు చూడలేక పోయారు. దేహాలను కదపలేక పోయారు. నిలవలేక క్రిందపడ్డారు. అయినా ఇంద్రజిత్తు బాణాలను సంధించడం ఆపలేదు.

రాముని చేతిలోని కోదండం దూరంగా పడిపోయింది. రాముడు కదలలేక పడిపోయాడు. అది చూచిన లక్ష్మణునికి జీవితంపై ఆశ సన్నగిల్లింది. రాముడు నాగపాశ బంధముతో

క్రిందపడి ఉండుటను చూచి లక్ష్మణుడు చాలా దుఃఖించాడు. రాముణ్ణి చూచి వానరులు రోదిస్తూ బిగ్గరగా అరచారు. హనుమంతుడు మొదలైన వీరులు కూడా చుట్టూ నిలబడి దుఃఖించారు.

బాణాలు ఎక్కడనుండి వచ్చి పడుతున్నాయో అర్థంకాక వానరులు క్రిందికి, పైకి చూశారు. మేఘం కురిసి కురిసి ఆగినట్లు ఇంద్రజిత్తు బాణవర్షాన్ని ఆపాడు. వెంటనే విభీషణ సుగ్రీవులు అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు.

రామలక్ష్మణులు చలనం లేకుండా పడి ఉన్నారు. శ్వాసలు మెల్లగా నడుస్తున్నాయి. వానరులు గగనవిహారం చేసి ఎంతగా శోధించినా ఇంద్రజిత్తు కనిపించలేదు. మాయతో చరిస్తున్న ఇంద్రజిత్తుని మాయాముసుగులో నుండే చూశాడు విభీషణుడు.

నేలమీద పడియున్న రామలక్ష్మణులను చూచి, పరమానందంతో ఉప్పొంగిపోతూ, నింగిలో నిలబడి రాక్షసులతో ఇలా పలికాడు ఇంద్రజిత్తు.

"ఖరదూషణులను వధించిన రామలక్ష్మణుల్ని చిత్రవధ చేసి చంపాను. చూడండి. సురాసుర ఋషిగణాలు వచ్చినా నేను చేసిన శరబంధము నుండి వారిని విడిపించలేరు.

"మన రాక్షసవంశాన్నే నిర్మూలించాలని చూశారు. నా తండ్రికి నిద్ర లేకుండా చేశారు. ఈ దురాత్ముల్ని నేను శాశ్వతంగా నిద్రపుచ్చేశాను. లంకను వర్షాకాల వరదలాగా వ్యాకులం చేసిన ఈ వానరసైన్యాన్ని శరత్కాల మేఘాలవలె నిర్వీర్యం చేశాను;" అని గొప్పలు చెప్పుకుంటూ మళ్ళీ ధనుర్బాణాలను చేతపట్టాడు. ఇక వానరనాయకులపై బాణాలు వేయడం ప్రారంభించాడు.

నీలుణ్ణి తొమ్మిది బాణాలతో కొట్టాడు. మైందద్వివిదుల్ని మూడు బాణాలతో, జాంబవంతుని ఒక్క బాణంతో, హనుమంతుని పది బాణాలతో, గవాక్ష శరభుల్ని రెండేసి బాణాలతో, అంగదుణ్ణి అనేక బాణాలతోను కొట్టి బాధించాడు. అదంతా చూసి రాక్షస వీరులు అధికోత్సాహంతో ఊగిపోయారు. రాముడు మరణించాడని భావించి పెద్ద ధ్వనులు చేశారు. ఇంద్రజిత్తు కూడా రామలక్ష్మణులు మరణించారనే భావించాడు.

తాను ఆనందంతో ఊగిపోతూ, ఆనందంతో ఉరకలు వేస్తున్న రాక్షసులతో కూడి లంకలోకి ప్రవేశించాడు.

రాముడి శరీరంలో విశేషంగా దిగబడియున్న బాణాల్ని చూచి సుగ్రీవుడు భయకంపితుడయ్యాడు. కన్నీళ్ళను కార్చుతూ నిలబడ్డాడు.

"సుగ్రీవా! భయపడకు. కన్నీళ్ళు తుడుచుకో. దుఃఖించకు. నీకు తెలియంది కాదు. యుద్ధాలు ఇలాగే ఉంటాయి. మన అదృష్టాన్ని బట్టి రామలక్ష్మణులు బంధవిముక్తు లవుతారు. నువ్వు ధైర్యంగా ఉండు.

సత్య ధర్మాభి రక్తానాం నాస్తి మృత్యుకృతం భయమ్

"సత్యమునందు, ధర్మమునందు ఆసక్తి కలవారికి మృత్యువు వలన భయము లేదు;" అని పలికి తన చేతితో సుగ్రీవుని కళ్ళు తుడిచాడు విభీషణుడు.

"సుగ్రీవా! ఇది దుఃఖిస్తూ కూర్చోవలసిన సమయం కాదు. ఆవేదన కార్యసాధనకు ఎప్పుడైనా అవరోధమే. రామునికి బాహ్యస్పృహ వచ్చేవరకు మనము రాముణ్ణి రక్షించాలి. ఆ తరువాత రామలక్ష్మణులు మనల్ని రక్షించగలరు.

"దీనివల్ల రామునికి అపాయము లేదు. రాముడు మరణించడు. చూడు. ఎలా ఉన్నాడో! ఆయుర్దాయము క్షీణించిన వారిలో ఈవిధమైన కాంతి ఉండదు. మనము సైన్యాన్ని ధైర్యంతో నిలపాలి. వానరులు భయాందోళనలకు గురైనట్లు కనిపిస్తున్నారు. ఒకరి చెవుల్లో ఒకరు ఏదో రహస్యంగా మాట్లాడుకొంటున్నారు. వారి మనస్సులో నుండి భయాన్ని తొలగించు" అన్నాడు విభీషణుడు.

రాక్షసవీరులతో కలిసి పరమోత్సాహంతో లంకలో ప్రవేశించాడు ఇంద్రజిత్తు. తండ్రియైన రావణుని సమీపించి, నమస్కరించి "రామలక్ష్మణుల్ని చంపేశాను" అన్నాడు.

ఆ మాట వినగానే రావణుడు ఆనందంతో పరవశించి పోయాడు. ఎగిరి గంతేశాడు. కొడుకుని అమాంతం కౌగలించుకున్నాడు. తలను పట్టుకొని ముద్దెట్టుకున్నాడు. సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వివరాలు అడిగాడు. జరిగిందంతా చెప్పాడు ఇంద్రజిత్తు. సోదరుల్ని శరబంధముతో కట్టేసింది కూడా చెప్పాడు.

రావణుడు చాలా సంతోషించాడు. రాముని వల్ల ఏర్పడిన భయాన్ని విడిచిపెట్టాడు. కుమారుణ్ణి పదేపదే అభినందించాడు. ఇంద్రజిత్తును పంపేసి, సీతమ్మ చుట్టూ వుండి కాపలా కాస్తున్న రాక్షసస్త్రీలను పిలిపించాడు.

రాక్షసాంగనలు వచ్చారు. వారిలో త్రిజట కూడా ఉంది. రామలక్ష్మణుల్ని ఇంద్రజిత్తు వధించిన విషయం సీతమ్మకు చెప్పమన్నాడు. ఆమెను పుష్పకవిమానంలో తీసికొని వెళ్ళి, చచ్చిపడి ఉన్న రామలక్ష్మణుల్ని చూపమని చెప్పాడు.

"రాక్షసాంగనలారా! ఎవరిని చూసుకొని సీత నన్ను తృణీకరిస్తూ వుందో ఆ రాముడు సోదరుడైన లక్ష్మణునితో కూడా మరణించాడు. ఇంకేముంది? అడ్డు తొలగిపోయింది. ఒడ్డుకు చేరిన కెరటంలాగా సీత నా ఒడిలో వాలిపోవచ్చు. ఆభరణాలు అలంకరించుకొని నిస్పందేహంగా నన్ను చేరవచ్చు.

"రామలక్ష్మణుల్ని యుద్ధభూమిలో శవాలుగా చూస్తుంది. తరువాత ఎలాగైనా నేనే దిక్కు ఆమెకు. తప్పక నన్ను సమీపిస్తుంది;" అన్నాడు రావణుడు.

"అలాగే" అని పలికి పుష్పకవిమానాన్ని తీసికొని అశోకవనంలోసీతమ్మ ఉండేప్రదేశానికి వెళ్ళారు రాక్షసాంగనలు. సీతమ్మను ఆ విమానంపై ఎక్కించి యుద్ధభూమికి తీసికొని పోయారు. త్రిజట కూడా ప్రక్కనే ఉంది.

"ఇంద్రజిత్తు యుద్ధంలో రామలక్ష్మణుల్ని వధించాడు" అని లంకలో చాటించాడు రావణుడు. యుద్ధరంగములో వధించబడి వున్న వానరసైన్యాన్ని చూపింది సీతమ్మ. అంతేకాదు. ఒకవైపు సంతోషంతో కేరింతలు కొడుతున్న రాక్షసమూకల్ని చూచింది. మరొకవైపు రాముని ప్రక్కనే చేరి విలపిస్తున్న వానరుల్ని చూసింది.

సీతమ్మ రామలక్ష్మణుల్ని చూచింది. వాళ్ళ కవచాలు విరిగి పడి ఉండడము, ధనుస్సు దూరంగా పడి ఉండడము కూడా చూసింది. రామలక్ష్మణుల దేహాలపై నాటుకొని యున్న

బాణ సముదాయాన్ని చూసింది. దీనులై పడివున్న రామలక్ష్మణులను చూచి సీతమ్మ పెద్దగా ఏడ్చింది. వారు మరణించారని భావించి వర్షధారలా కన్నీరు కార్చుతూ రోదించింది.

కన్నీటి కడలిలో ఆశానౌక

"పూర్వము సాముద్రికం తెలిసిన వాళ్ళు నేను సుమంగళిగానే ఉంటానని చెప్పారు. నాకు సంతానం కలుగుతుందని తెలిపారు. వాళ్ళందరూ నాకు అబద్ధాలే చెప్పారు. నన్ను సౌభాగ్యవతిగా ఎందరో ఆశీర్వదించారు. ఆ ఆశీస్సులన్నీ ఏమైనట్లు? నా నొసటిరాతను తుడిచేందుకు సరిపోలేదేమో, అవి.

"భర్తతో కలిసి నేను రాజ్యాభిషిక్తురాలిని అవుతానని దైవజ్ఞులు చెప్పారు. అదంతా కలగా మిగిలిపోయింది. నా కొరకు అన్వేషించి, అన్వేషించి, సముద్రాన్ని కూడా దాటి వచ్చిన రామలక్ష్మణులు ఆవు గోష్పద గుంటలో పడి మరణించినట్లు చనిపోయారు.

రామలక్ష్మణుల వద్ద వారుణ, ఆగ్నేయ, ఐన్ద్ర, వాయువ్య, బ్రహ్మాస్త్రాలు అనేకము లున్నాయి. అవేవీ వారిని రక్షించలేక పోయాయి. శక్తిసామర్థ్యాలుండి కూడా రామలక్ష్మణులు నన్ను రక్షించలేక పోయినట్లు, బలమైన అస్త్రాలు రామలక్ష్మణులను కాపాడలేక పోయాయి.

"దిక్కులేని నాకు వారిద్దరే దిక్కు. వారు కూడా నాకు దూరమైపోయారు. యుద్ధములో రాముని ఎదుట నిలిచినవాడు ఎంత గొప్పవాడైనా తిరిగి పోలేడు. ఆ రాక్షసుడు అదృశ్యంగా వుండి మాయచేసి చంపాడు.

న కాలస్యాతి భారోఽస్తి కృతాన్తశ్చ సుదుర్జయః

"కాలానికి అసాధ్య మనేది లేదనిపిస్తోంది. విధిని జయించడం ఎవరికీ సాధ్యం కాదేమో!" అంటూ విలపిస్తున్న సీతమ్మతో త్రిజట ఇలా పలికింది.

"అమ్మా! సీతాదేవీ! దుఃఖించకు. నీవు అంతగా బాధపడవలసిన పరిస్థితి ఏమీ రాలేదు. నీ భర్త రాముడు సజీవంగానే ఉన్నాడు. రామలక్ష్మణులు జీవించే వున్నారు అనడానికి కారణాలు చెప్తాను. విను.

"సీతా! నీవు ఎక్కింది దివ్యమైన పుష్పకవిమానము. రామలక్ష్మణులు గతించి ఉన్నట్లైతే శుభకరమైన పుష్పకవిమానము నిన్ను మోయదు. సరేనా!

"ప్రభువు మరణించి ఉన్నట్లైతే సైన్యము ఉత్సాహముతో ఉంటుందా? నైరాశ్యంతో ఉంటుందే కాని క్రోధంతో ఉంటుందా? చూడు. వానరవీరుల ముఖాలు ఎలా ఉన్నాయో!

"నేను వాస్తవమును చెప్తున్నాను. నా మాటను నమ్ము. రామలక్ష్మణులు మరణించలేదు. సీతా! ఇంతవరకు నేనెన్నడూ అసత్యమును పలుకలేదు. ఇక మీదట కూడా పలకను. నీవు పతివ్రతవు కనుక నా మనస్సు నీవైపు ఆకర్షింపబడింది.

"విచారించకు. సురాసురులు ఏకమై వచ్చినా రామలక్ష్మణులను యుద్ధంలో వధించలేరు. బాణాలతో తీవ్రంగా కొట్టబడినా వారిలో తేజస్సు నశించలేదు చూశావా! ఆయువు తీరిన వారి ముఖాలు వికృతంగా ఉంటాయే గాని ఈవిధంగా కళకళలాడుతూ ఉండవు;" అన్నది త్రిజట.

సీతమ్మ త్రిజటకు నమస్కరిస్తూ, "నీ మాట నిజమగు గాక!" అన్నది. వెంటనే త్రిజట పుష్పకవిమానాన్ని వెనక్కిత్రిప్పి సీతమ్మను అశోకవనానికి తీసికొని వచ్చింది.

రక్తసిక్తమైన దేహాలతో నేలపై పడుకొనియున్న రామలక్ష్మణుల చుట్టూ వానర వీరులందరూ చింతాక్రాంతులై చేరారు. స్థిరమైన పరాక్రమము కల రాముడు మెల్లగా కోలుకొని స్పృహలోకి వచ్చాడు.

రాముడు అలా ప్రక్కకి చూశాడు. రక్తసిక్తమైన దేహంతో నేలమీద పడివున్న లక్ష్మణుడు కనిపించాడు. రాముడు దీనుడయ్యాడు. దుఃఖార్తుడై రోదించాడు.

"నా తమ్ముడు లక్ష్మణుడు యుద్ధభూమిలో నిస్తేజుడై పడి ఉన్నాడు. నాకు ఇక సీత ఎందుకు? నేను జీవించడ మెందుకు?

శక్యా సీతా సమా నారీ మర్త్యలోకే విచిన్వతా
న లక్ష్మణ సమో భ్రాతా సచివః సాంపరాయికః

"మానవలోకంలో వెతకాలే గాని సీత లాంటి స్త్రీ దొరకకపోదు. కానీ స్నేహపాత్రుడు, యుద్ధవీరుడు అయిన లక్ష్మణుని వంటి సోదరుడు మాత్రం లభించడు.

"లక్ష్మణుడు ఉంటేనే నేను ఉంటాను. లక్ష్మణుడు మరణిస్తే నేను ఇప్పుడే ప్రాణాలు వదిలేస్తాను. నాకోసం, అరణ్యాలకి వచ్చిన తమ్ముణ్ణి వదలి నేను అయోధ్యకు ఏ ముఖం పెట్టుకొని పోగలను? నా తల్లులకు, సోదరులకు ఏమి సమాధానం చెప్పగలను? అందుకని, ఇక్కడే చచ్చిపోతాను.

"అయ్యో! నేనెంత పాపిని. ఎంత దుష్టుణ్ణి. నా వల్లనే లక్ష్మణునికి ఈ బాధలన్నీ వచ్చాయి. నాయనా! నేను ఎప్పుడు దుఃఖించినా, నీవు ఓదార్చేవాడివి. నీవు సజీవంగా ఉన్నావా! ఉంటే నన్ను ఎందుకు ఓదార్చవు? నాతో ఎందుకు మాట్లాడవు?

"లక్ష్మణా! ఈరోజు ఎందరో రాక్షసుల్ని చంపి నేలమీద పడేశావు. చివరికి నువ్వు కూడా నేలమీదే పడుకున్నావా! ఎందుకు అలా చేశావు.

శయానః శిరతల్పేఽస్మిన్ స శోణే పరిప్లుతః
శరజాలైశ్చితో భాసి భాస్కరోఽస్తమివ వ్రజన్

"బాణములతో నిండి, రక్తము చేత తడిసి శరతల్పం మీద శయనించి ఉన్న నీవు అస్తమించే సూర్యుడిలా ఉన్నావు" అని దుఃఖించాడు రాముడు.

లక్ష్మణుడు మరణించాడేమో నని భావించి, సత్యము తెలియక దుఃఖిస్తున్న రాముడు పలికిన మాటల్లో సత్యం దోబూచులాడే లాగా చక్కని ఉపమానాన్ని ఎన్నుకున్నాడు వాల్మీకి.

శోణ పరిప్లుతః=రక్తసిక్తమైనవాడు. బాణాల దెబ్బలచేత లక్ష్మణుని దేహము రక్తసిక్తమై ఎర్రగా ఉంది. అస్తాద్రిని చేరే సూర్యుడు కూడా రక్తవర్ణంతోనే శోభిస్తూ ఉంటాడు.

శరజాలైః చితః=బాణసముదాయంచే వ్యాపించి యున్నావు. లక్ష్మణునికి గుచ్చుకొనిన బాణసముదాయము సూర్యుని నుండి కదులుతున్న కిరణసముదాయంలా ఉంది.

అస్తాద్రిని చేరుతున్న సూర్యునివలె శోభిస్తున్నాడు లక్ష్మణుడని రాముడు దుఃఖిస్తున్నాడు. సూర్యుడు అస్తమించునట్లు లక్ష్మణుడు కూడా జీవితాన్ని సమాప్తి చేస్తున్నాడా! అనే భావం బాహ్యానికి గోచరిస్తుంది.

సూర్యుడు అస్తమించడం భ్రాంతి. ఒకవేళ అస్తమించాడు అని భావించినా, అస్తమించిన సూర్యుడు మళ్ళీ ఉదయిస్తాడు అనేది కూడా సత్యమే. అలాగే లక్ష్మణుడు అస్త్రాద్రిని చేరుతున్న సూర్యునిలా కనిపించినా, సూర్యుడు పునః ఉదయించినట్లే, లక్ష్మణుడు మళ్ళీ స్పృహను పొందుతాడు అని భావము.

రాముడు దుఃఖిస్తున్నాడు. "నాయనా! తమ్ముడూ! లక్ష్మణా! నేను అరణ్యాలకు వెళ్తూ ఉంటే, పట్టుపట్టి నువ్వు నన్ను ఎలా అనుసరించి వచ్చావో, నేను కూడా యమలోకానికి నిన్ను అనుసరించి వస్తాను. నిన్ను విడిచి నేను బ్రతకలేను.

"నా కొరకు అడవులపాలైన నా తమ్ముడు మరణించాడు. ఈ పాపమంతా నాదే. "విభీషణా! నిన్ను రాజును చేస్తాను" అని ప్రతిజ్ఞ చేశాను. కానీ మాట నిలుపుకోలేక పోయాను. ఆ అసత్యం నన్ను దహించి వేస్తుంది. ఇది యథార్థము.

"సుగ్రీవా! వానరవీరులను వెంటబెట్టుకొని నువ్వు త్వరగా కిష్కింధకు వెళ్ళిపో. నేను లేవని తెలిస్తే రావణుడు మిమ్మ ల్నందరినీ హింసిస్తాడు. వెళ్ళు. అంగదాదుల్ని వెంటబెట్టుకొని సముద్రాన్ని దాటి వెళ్ళిపో.

"జాంబవంతుడు యుద్ధంలో ఎంతో శ్రమపడ్డాడు. గొప్ప పరాక్రమం చూపాడు. అంగదుడు, మైందుడు, ద్వివిదుడు, కేసరి, సంపాతి గొప్పగా యుద్ధం చేశారు. శరభుడు, గజుడు, గవయుడు, గవాక్షుడు నా కొరకు ప్రాణాల్ని కూడా తెగించి పోరాడారు.

"సుగ్రీవా! మంచి మనసున్న మిత్రుడు చేయగలిగినంత చేశావు నువ్వు. విధిని ఎవరు దాటగలరు? వానరవీరులారా! మీరందరూ శక్తివంచన లేకుండా శ్రమపడ్డారు. తొందరగా వెళ్ళండి. మిమ్మల్ని మీరు రక్షించుకోండి;" అని రాముడు మాట్లాడడం విని వానరు లందరూ ఏకధారగా కన్నీటిని కార్చుతూ దుఃఖించారు.

సైన్యాని కంతా ధైర్యం చెప్పి నిలిపి, గదాధరుడై రాముని వద్దకు పరుగిడుతూ వస్తు న్నాడు విభీషణుడు. విభీషణుణ్ణి చూచి ఇంద్రజిత్తేమోనని భావించి, భ్రమించి, భయపడి వానరులు మరో మార్గంలో దౌడు తీశారు.

"సుడిగాలికి నావ కలత చెందినట్లు ఈ వానరసేన ఎందుకు అలా కలత చెందుతోంది? ఎటుపడితే అటుపోతున్నారు. దారీ లేదు. డొంకా లేదు. సిగ్గును కూడా ఇక్కడే విడిచేసి పోతున్నారు. ఒక్కడు కూడా వెనుదిరిగి చూడడం లేదు. అందరూ ముందు చూపులోనే ఉన్నారు.

"పైగా, క్రిందచూపు ఉన్నట్లే కనిపించడం లేదు. క్రింద పడ్డవాణ్ణి లేవదీయడం లేదు సరిగదా, వాడిమీదనే నడచి పరుగు లెత్తుతున్నారు;" అని సుగ్రీవుడు పలుకుతుండగా, గదాధరుడైన విభీషణుడు వచ్చి రామునికి నమస్కరించాడు.

"జాంబవంతా! విభీషణుణ్ణి చూచి ఇంద్రజిత్తని భ్రమించి మన వీరులు ఎటుపడితే అటు పోతున్నారు. వచ్చింది విభీషణుడని, ఇంద్రజిత్తు కాదని వాళ్ళకు చెప్పు, వెళ్ళు;" అన్నాడు సుగ్రీవుడు.

మహావేగంతో దూసుకుపోతున్న వానరశ్రేష్ఠులను అతి కష్టంమీద ఆపగలిగాడు జాంబవంతుడు. ఇంద్రజిత్తు లేడని, విభీషణు డున్నాడని చెప్పాడు. వెంటనే శాంతించారు. ఏ వేగంతోనైతే దౌడు తీశారో, ఇంద్రజిత్తు లేడు అనగానే అదేవేగంతో మళ్ళీ వెనుదిరిగి దూసుకుని వచ్చేశారు.

బాణసముదాయంతో కప్పబడి నేలపై పడియున్న రామలక్ష్మణులను చూచి విభీషణుడు తీవ్రంగా దుఃఖించాడు.

"రామలక్ష్మణులు ధర్మాత్ములు. రాక్షసులు కపటయుద్ధం చేసి ఈ మహాపురుషుల్ని వధించారు. కుటిలుడు, దుష్టుడు అయిన ఇంద్రజిత్తు మాయ చేశాడు. మోసం చేశాడు.


"నేను కూడా ఆపదల్లో చిక్కుకున్నాను. వారు మరణిస్తే నాకు జీవితముండదు" అన్నాడు విభీషణుడు.

"విభీషణా! దుఃఖించకు. నీవు లంకాధిపతివి అవుతావు. రావణుని కలలు ఫలించవు. రామలక్ష్మణులు స్పృహ తప్పి ఉన్నారు. అంతే. తెలివి రాగానే రావణుని వధిస్తారు" అని ఊరడించి, ఆ తరువాత మామగారైన సుషేణునితో సుగ్రీవుడు ఇలా పలికాడు.

"స్పృహ రాగానే రామలక్ష్మణులతో పాటు శూరులైన వానరులను వెంటబెట్టుకొని కిష్కింధకు వెళ్ళిపో. నేను రావణుణ్ణి, వాడి కుమారుల్ని, బంధువుల్ని వధించి, సీతమ్మను తీసికొని కిష్కింధకు వస్తాను;" అని చెప్పాడు. సుగ్రీవుని మాటలను విని సుషేణుడు రామలక్ష్మణులు స్పృహకు రావడానికి మార్గాన్ని సూచిస్తున్నాడు.

ఈలోగా మేఘాలు ఉరిమాయి. మెరిశాయి. సముద్రజలం చిమ్మబడుతోందా! పర్వతాలు కదలిపోతున్నాయా! అన్నట్లు గాలి ప్రచండంగా వీచింది. కొన్ని చెట్లు పడిపోయాయి. పెద్ద పెద్ద వృక్షాలు విరిగి, ఎగిరి సముద్రంలో పడ్డాయి. సర్పాలు, జలజంతువులు భీతి చెంది సముద్రంలోకి దూరిపోయాయి.

వినతాసుతుడు, గొప్ప బలవంతుడు అయిన గరుత్మంతుడు జ్వలితాగ్ని వలె ప్రకాశిస్తూ వానరులకు కనిపించాడు. గరుత్మంతుడు రావడం గ్రహించి, రామలక్ష్మణులను బంధించి యున్న భయంకరమైన నాగులు, విడిచిపెట్టి పారిపోయాయి.



గరుడుడు రామలక్ష్మణులను స్పృశించాడు. చంద్రబింబము వంటి వారి ముఖాలను చేతులతో నిమిరాడు. గరుత్మంతుని స్పర్శతో రామలక్ష్మణుల దేహాలపై ఉన్న గాయాలు మాయమయ్యాయి. దేహాలు తేజోవంతమై, కాంతిమంత మయ్యాయి.

తేజో వీర్యం బలం చౌజ ఉత్సాహశ్చ మహాగుణాః
ప్రదర్శనం చ బుద్ధిశ్చ స్మృతిశ్చ ద్విగుణం తయోః

"రామలక్ష్మణుల తేజస్సు, వీర్యము, బలము, ఉత్సాహము, సూక్ష్మబుద్ధి, స్మృతి రెండింతలుగా పెరిగిపోయాయి."

గరుత్మంతుడు వారిరువురిని లేవదీశాడు. వారిద్దరినీ ఆలింగనం చేసుకున్నాడు. గరుడుని చూచి రాముడు ఇలా పలికాడు.

"నీ దయవల్ల మేము పెద్ద గండము నుండి తప్పించుకున్నాము. ముందులాగా శక్తివంతుల మయ్యాము. గరుడుడా! నీ దర్శనము మంగళప్రదము. నిన్ను చూస్తూ ఉంటే మా తండ్రి దశరథుణ్ణి చూసినట్లుంది. మా తాతగారైన అజమహారాజును చూచిన ట్లుంది.

"రామా! నేను నీ మిత్రుణ్ణి. బహిఃప్రాణం వంటివాణ్ణి. మీకు సేవ చేసేందుకు వచ్చాను. దుష్టుడైన ఇంద్రజిత్తు వేసిన బాణబంధమును, ఇంద్రాది దేవతలు గాని, గంధర్వులు గాని విడిపించలేరు.

"విషపూరితమైన ఆ నాగులు తీక్షణమైన కోరలు గల సర్పాలు. ఆ సర్పాలు కద్రు పుత్రులు. తన మాయాప్రభావం చేత సర్పాల్ని బాణాలుగా మార్చి మీపై ప్రయోగించాడు ఇంద్రజిత్తు. ఈ విషయం తెలిసి మీ మీదున్న ప్రేమతో నేను పరుగెత్తుకుంటూ వచ్చాను. మీకు శుభం కలిగింది. చాలా సంతోషం. మీరు జాగ్రత్తగా ఉండండి.

"కపటయుక్తులతో యుద్ధం చేయడం రాక్షసుల స్వభావం. ధర్మబద్ధంగా, ఋజుత్వముతో పోరాడడము మీ స్వభావము. అదే మీకు బలం కూడా. అయినా రణరంగంలో రాక్షసుల్ని నమ్మకండి.

"రామా! ధర్మాత్ముడా! నేను వెళ్ళుటకు అనుమతి నివ్వు. మన ఇద్దరి మధ్య స్నేహం ఎలా కలిగింది? అని ప్రస్తుతం నువ్వు ఆలోచించకు. రణరంగంలో విజయభేరిని మ్రోగించిన తరువాత నీకే అర్థమవుతుంది. రామా! నీవు సీతమ్మను తప్పక పొందుతావు;" అని పలికి రామునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి ఎగిరిపోయాడు గరుత్మంతుడు.

వానరవీరు లందరూ ఆనందంతో పొంగిపోయారు. ముడుచుకున్న తోకలను తుడుచుకొని, ఝాడించి ఝుళిపించారు. మళ్ళీ యుద్ధభేరీలను మ్రోగించారు. శంఖాలు పూరించారు. మృదంగాలు బాదేశారు.

చెట్లను పెకలించి చేతుల్లో పట్టుకొని మళ్ళీ లంకను ముట్టడించారు. సింహనాదాలు చేస్తూ యుద్ధాసక్తితో లంకాపట్టణ ద్వారాలను సమీపించారు. వారి అరుపులు వర్షఋతువులో అర్ధరాత్రి సమయాన వినిపించే మేఘగర్జనంలా వినిపించాయి.

ధూమ్రాక్షుడు ధూళిపాలు

వానరుల భయంకర శబ్దాలు లంకలో ప్రతిధ్వనించాయి. రాక్షసులతో పాటు రావణుడు కూడా విన్నాడు. రావణునికి పరమాశ్చర్య మైంది. మంత్రులతో ఇలా పలికాడు.

"వానరులు ఎందుకు అలా అరుస్తున్నారు? మేఘాల్లా గర్జిస్తున్నా రెందుకని? వాళ్ళ సంతోషానికి కారణ మేమిటి? ఆనందం రానిదే అలాంటి అరుపులు కదలవు. నాకేదో సందేహంగా ఉంది.

"దుఃఖించవలసిన సమయాల్లో ఆనందంతో ఉరకలు వేయడానికి కారణ మేమిటో తెలిసికొని రండి" అని కొందరు రాక్షసుల్ని పంపాడు.

రాక్షసులు వెళ్ళి ప్రాకారము నెక్కి చూశారు. సుగ్రీవుడు నాయకత్వం వహిస్తున్న పెద్ద కపిసేన కంటబడింది. నాగపాశముతో బంధింపబడిన రామలక్ష్మణులు బంధవిముక్తులై

శోభిస్తూ ఉండడం కూడా చూశారు. వాళ్ళ ముఖాలు పాలిపోయాయి. ఇంద్రియాలు కలత చెందాయి. మనసు క్షోభించింది. వెంటనే రావణుని దగ్గరికి వచ్చి చూసిందంతా చెప్పేశారు. రామలక్ష్మణులు బంధవిముక్తులై మదగజాల్లా ఉన్నారని చెప్పారు.

రావణుని గుండె పగిలినట్లైంది. నాగసర్ప బాణాలు నిష్ఫల మయ్యాయా? ఇంద్రజిత్తు వరప్రసాదంగా పొందిన ఆ సర్పబాణాలు అడ్డు తెలియనివి. ఆదిత్యప్రకాశంతో శోభించేవి. భయంకరమైన నాగాస్త్రబంధము నుండి శత్రువులు విముక్తు లయ్యారంటే ఏదో ప్రమాదాన్ని ఊహిస్తోంది రావణుని మనస్సు.

సంశయస్థ మిదం సర్వం అనుపశ్యా మ్యహం బలం

"ఈ రాక్షససేనకు చేటు వచ్చిందని నాకు తోస్తూ ఉంది;" అని భావించాడు రావణుడు.

వెంటనే ధూమ్రాక్షుని పిలిచాడు. "భీమపరాక్రమా! ధూమ్రాక్షా! వెళ్ళు. నీ ప్రతాపం చూపు. రాముణ్ణి, వానరుల్ని వధించి, ఆ చల్లని వార్తని నా చెవి కందించు" అన్నాడు రావణుడు. ధూమ్రాక్షుడు ఆనందించి వెళ్ళాడు.

సేన సిద్ధమైంది. రాక్షసులు ఆనవాలు కోసం నడుముకు చిన్నచిన్న గంటలు కట్టుకున్నారు. శూలాలు, ముద్గరాలు, పట్టిసాలు, పరిఘులు, బల్లెములు, గొడ్డళ్ళూ పట్టుకొని ధూమ్రాక్షుని చుట్టూ నిలిచారు దారుణంగా రాక్షసులు. కొందరు రథాలపై అనుసరించారు. కొందరు గుర్రాలమీద, కొందరు ఏనుగులమీద గొప్పవిధ్యైన ఆయుధాల్ని ధరించి వచ్చారు.

ధూమ్రాక్షుడు రథారూఢు డయ్యాడు. కనకమయమైన ఆ దివ్యరథానికి గాడిదలను కట్టారు. వాటి ముఖాలు తోడేళ్ళ ముఖాలలాగా, సింహాలవంటి ముఖాలలాగా ఉన్నాయి. దానిపై నిలబడి వికటాట్టహాసం చేస్తూ పశ్చిమద్వారం వైపు సాగిపోయాడు ధూమ్రాక్షుడు. ఆ ద్వారము వద్దే హనుమంతు డున్నాడు.

పెద్ద శబ్దంతో కదిలే ధూమ్రాక్షుని రథం ముందుకు సాగుతూ వుండగా అశుభ శకునాలు అగుపించాయి. రథశిఖరంపై పెద్ద గ్రద్ద ఒకటి వాలింది. ధ్వజము యొక్క చివరిభాగాన శవాల్ని పీక్కుతినే పక్షులు వచ్చి చేరాయి. భూమి కొన్ని క్షణాలు కంపించినట్లు అనిపించింది. పిడుగులు పడ్డ శబ్దాలు వినిపించాయి. తీవ్రంగా ఎదురుగాలి వీచింది. దిక్కులు కాంతిహీనము లయ్యాయి. అవన్నీ చూడగా ధూమ్రాక్షునికి గుండె జారిపోయింది. అయినా ధైర్యాన్ని కూడగట్టుకొని రాక్షసవీరులు తన చుట్టూ ఉండగా ముందుకు సాగి, సముద్రంలా తెలుస్తున్న వానరసేనను చూశాడు.

ధూమ్రాక్షుడు రావడం చూచి మంచి అవకాశం దొరికింది అనే సంతోషంతో వానరు లందరూ అధికోత్సాహంతో తోకలన్నీ పైకెత్తారు. ఒక్కసారిగా అన్ని వాలములు పైకి లేచేసరికి అదొక పెద్ద తాటిచెట్ల వనంలా గోచరించింది.

వానర రాక్షసుల మధ్య ఘోరయుద్ధం జరిగింది. శూలాలతో, పరిఘులతో, ముద్గరాలతో చాలామంది వానరుల్ని పీడించారు. వానరులు రాక్షసుల్ని వృక్షాలతో కొట్టి బాధించారు. నేలకూల్చారు చాలామందిని.

మమంథూ రాక్షసాన్ భీమా న్నామాని చ బభాషిరే

"వీరులైన రాక్షసుల్ని వానరులు సంహరించారు. తమ తమ పేర్లను చెప్పుకొంటూ మరీ చంపారు.

తమదే పైచేయిగా కనిపించేసరికి విజయోత్సాహంతో వానరులు రాక్షసుల్ని తెగటార్చేశారు. కొందరు రాక్షసుల ముఖాలనుండి రక్తము సెలయేళ్ళలాగా ప్రవహించింది.

కొందరు రాక్షసుల్ని నిలువునా రెండుగా చీల్చేశారు. కొందరిని చెట్లతో కొట్టి పోగేశారు. కొందరిని రాళ్ళతో కొట్టి పొడిచేశారు.

కోరలతో కొందరిని చీల్చేశారు. రథాలపై పర్వతాల వంటి రాళ్ళు విసిరారు. రథాలు విరిగి ముక్క లయ్యాయి. రాక్షసులు చాలామంది నేలరాలారు. గుర్రాలు క్రిందపడగా గుర్తులు మాత్రం తెలుస్తున్నాయి. ఏనుగులు కూలిపోయాయి. వానరులు ఉరికురికి పడ్డారు రాక్షసుల మీద. కొరికి కొరికి చంపారు. దృఢమైన వాడి గోళ్ళతో చీల్చారు.

కొందరు రాక్షసులు జవసత్వా లుడిగి క్రిందపడ్డారు. కొందరు తీవ్రంగా కోపించి వానరులపైకి విజృంభించారు. వానరులు కేకలేస్తూ రెట్టింపు ఉత్సాహంతో రాక్షసులపై పడి కాళ్ళతో, పళ్ళతో, పిడికిళ్ళతో, తోకలతో, చెట్లతో తరిమి తరిమి కొట్టి చంపారు. కొందరు రాక్షసులు పలాయనమంత్రాన్ని నిర్దోషంగా పఠించారు.

రాక్షససేన పారిపోవడం చూచి ధూమ్రాక్షుడు దూకాడు వానరుల మీదికి. ప్రాసాలతో, ముద్గరాలతో కొట్టబడి కొందరు వానరులు నేలకూలారు. పరిఘలతో, గొడ్డళ్ళతో కొట్టబడి వానరులు కొందరు కన్నుమూశారు. శూలాలతో పొడవబడి కొందరు వానరులు రక్తసిక్త మయ్యారు. కొందరు వానరులు కూడా రాక్షసుల్లాగానే పలాయనమంత్రాన్ని తప్పు లేకుండా చదివారు. వానర రాక్షసుల మధ్య సాగిన ఈ యుద్ధము భయంకర శబ్దాలతో దారుణంగా సాగింది.

లాగిన అల్లెత్రాడుల వీణాధ్వనులు, ఆయాసంతో నిట్టూర్చే ఎక్కిళ్ళ తాళాలు, చేతులతో చరిచే దెబ్బల మృదంగశబ్దాలు, మూలుగుల ఆలాపనలతో సమరసంగీతం భయావకంగా వినిపిస్తోంది.

ధూమ్రాక్షుడు యుద్ధాగ్రమందు విల్లు చేతబట్టి నిలిచాడు. వికటాట్టహాసం చేస్తూ శరవర్షాన్ని కురిపించాడు. వానరసేనను చెదరగొట్టాడు. వానరులు కలతచెందారు.

అది చూసిన హనుమంతుడు ఒక పెద్ద బండను చేతపట్టుకొని ధూమ్రాక్షుని పైకి విసిరాడు. అది కనిపెట్టిన ధూమ్రాక్షుడు క్రిందికి దూకాడు. రథం విరిగిపోయింది. గాడిదలు చచ్చిపోయాయి. రథచక్రాలు ముక్కలయ్యాయి.

వెంటనే హనుమంతుడు పెద్దపెద్ద వృక్షాల్ని పెకలించి చాలామంది రాక్షసుల్ని కొట్టి చంపాడు. రాక్షసుల శిరస్సులు పగిలి, కొండపై నుండి వర్షపునీరు పడునట్లు రక్తం కారింది. ఈవిధంగా రాక్షససేనను పీడించిన హనుమంతుడు పెద్ద బండ నెత్తుకొని ధూమ్రాక్షుని పైకి ఉరికాడు.

ధూమ్రాక్షుడు హనుమంతుని చూచి, ఇనుపమేకులతో భయంకరంగా ఉన్న గదను హనుమంతుని తలపైకి విసిరాడు. హనుమంతుడు దానికి అడ్డు తొలిగాడు. వెంటనే పర్వతమువంటి బండనెత్తి ధూమ్రాక్షునిపై పడేశాడు హనుమంతుడు.

ఆ దెబ్బకు ధూమ్రాక్షుని దేహాంగాలు శిథిల మయ్యాయి. కీళ్ళు వీలునుబట్టి ఊడిపోయాయి. ఒక పెద్ద కొండలాగా నేలపై కూలిపోయాడు ధూమ్రాక్షుడు. ధూమ్రాక్షుడు ధూళిని కౌగలించుకోగానే రాక్షసు లందరూ తెగిపడిన చెట్టును పక్షులు విడిచి వెళ్ళిపోయినట్లు, ధూమ్రాక్షుని విడిచి లంకలోకి పారిపోయారు.

హనుమంతుడు ధూమ్రాక్షుని దారుణంగా వధించి రక్తపుటేరుల్ని రణరంగంలో పారించాడు. భూమ్యాకాశాలు ఒక్కటయ్యేలా సింహనాదం చేశాడు హనుమంతుడు. ఆనందాన్ని పట్టలేని కపివీరులు హనుమంతునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, ఆయన చుట్టూ నిలబడి, తోకలాడిస్తూ కొంతసేపు నాట్యం చేశారు.

ఇది ధూమ్రాక్షుని వధ. పవనసుతుడు సాధించిన ప్రథమ విజయము. జ్ఞానాజ్ఞానముల మధ్య సాగే సంకుల సమరమే రామరావణ సంగ్రామము.

ధూమ్రాక్షుని వధ ఈ సమరంలో ప్రథమంగా జరిగింది. ధూమ్రాక్షుడు మొదట వధించబడితే దశకంఠుడు చివరగా చస్తాడు. మనం కూడా జీవితసంగ్రామంలో రావణుడనే అజ్ఞానాన్ని సంహరించే ముందు ధూమ్రాక్షుడనే పాపాన్ని కడిగేసుకోవాలి.

సంస్కృతంలో "ధూమ్ర" అంటే నలుపుతో కలిసిన ఎరుపు అని అర్థము. ఉన్నది నలుపు. కలిసింది ఎరుపు.

నలుపు అజ్ఞానానికి సంకేతము. ఎరుపు క్రోధానికి సంకేతము. అజ్ఞానంతో కామం కదుల్తుంది. కామం వల్ల క్రోధం పుడుతుంది. అజ్ఞాన క్రోధాల కలపోతే ధూమ్రాక్షుడు. పాపాచరణము కలవాడు.

"ధూమ్రః" విసర్గము చేరితే, అది పాపము అనే అర్థము నిస్తుంది. దుష్టత్వము అనే భావాన్నికూడా ఇస్తుంది. ధూమ్రాక్షుడు పాపపు నేత్రాలు కలవాడని అర్థము. పాపపు చూపు కలవా రెవరైనా ధూమ్రాక్షులే.

అందరూ సృష్టిలో పాపాన్ని చూసేవారే కాని దృష్టిలోని పాపాన్ని చూసేవారు లేరు. ఉన్నా చాలా అరుదు. అలా చూసేవారిలో సరిచేసుకోవాలని చూసేవాళ్ళు అరుదు. సరిచేసుకునే వారిలో తిరిగి రాకుండా చూసుకొనే వాళ్ళు ఎక్కడో ఉంటారు.

దృష్టి పాపం కాకుండా ప్రతి సాధకుడు చూసుకోవాలి. అందమైన స్త్రీని దుష్టభావంతో చూస్తే అది పాప మవుతుంది. ఆనందంగా జీవించే వాళ్ళని చూసి అసూయ పెంచుకుంటే అది పాపం. ఉన్నవాళ్ళను చూసి సంతోషించే మనసున్న వాళ్ళం కాలేక, మిన్ను కెగిరిన వాళ్ళని మన్నుపై చూడాలని అభిలషించే ఈర్ష్య పాపంగా పరిణమిస్తుంది. దుఃఖభాగుల్ని చూసి, దయ చూపకపోగా, సంతసించే మనస్తత్వం పాపం. ఇదంతా దృష్టిదోషం. ఈ దృష్టిదోషమే ధూమ్రాక్షుడు.

ధూమ్రాక్షుని పవనసుతుడు వధించాడు. ధూమ్రాక్షుడు అంటే పాపదృష్టి కలవాడు అని గ్రహించాము. పాపాన్ని వధించాలంటే మనం కూడా పవనసుతులం కావాలి.

పునాతీతి పవనః పవిత్రము చేయువాడు కనుక పవనుడు. అట్టివాని కుమారుడే పవనసుతుడు. అనగా పవిత్రాత్ముడు. పవిత్రమైనది జ్ఞానమే నని గీత చెప్పింది. కనుక జ్ఞానముచే పవిత్రమైన దృష్టి గలవాడు పవనసుతుడు.

పాపదృష్టి ధూమ్రాక్షుడు. పవిత్రమైన దృష్టి హనుమంతుడు. హనుమంతుడు ధూమ్రాక్షుని వధించినట్లు పవిత్రత ద్వారా పాపాన్ని క్షాళనం చేసుకోవాలి.

అందమైన స్త్రీ కనిపించగానే ఆమెలో పరమాత్మ సౌందర్యాన్ని దర్శించాలి. అది పుణ్యదృష్టి. పవిత్రదృష్టి. ఆనందంగా జీవించే వాళ్ళని చూసినపుడు, వాళ్ళు గతంలో సత్కర్మలు ఆచరించిన వారు కనుకనే ఆనందంగా ఉన్నారు ఈనాడు అని భావించి, అలాంటి సత్కర్మల్ని మనం కూడా ఆచరించాలి అని చింతిస్తే అది పవిత్రదృష్టి అవుతుంది. ఉన్నతుల్ని చూచి ఊహలు మలినం కాకుండా చూసుకుంటే అది శుభదృష్టి. ఆర్తులను ప్రేమించగలిగితే అది పావనదృష్టి ప్రసాదించిన పవిత్రకార్య మవుతుంది.

జ్ఞానేంద్రియమైన నేత్రము ద్వారా పాపము చేయువాడు ధూమ్రాక్షుడు. క్రోధంలో కూడా కళ్ళే ఎరుపెక్కుతాయి. క్రోధము దృష్టిని పాడు చేస్తుంది. కనుక పవిత్రమైన జ్ఞానదృష్టి కలిగి ఇంద్రియాల్ని నియమించుకొని తరించాలి. ఇదే ధూమ్రాక్షవధలో మనము గ్రహించవలసిన గుణపాఠము.

ఇంద్రియాణాం ప్రసంగేన దోషమృచ్ఛ త్య సంశయః
సంనియమ్య తు తాన్యేవ తతః సిద్ధిం నిగచ్ఛతి ॥

"ఇంద్రియాలను విషయాలలో కలిపేస్తే దోషాలు ప్రాప్తిస్తాయి. ఇంద్రియాలను విషయాలనుండి నియమిస్తే సిద్ధి లభిస్తుంది;" అని నారద పరివ్రాజకోపనిషత్తు.

Religion does not consist in turning unceasingly toward the veiled stone, nor in approaching all the altars, nor in throwing oneself prostrate on the ground, nor in raising the hands before the habitations of Gods, nor in deluging the temples with the blood of beasts, nor in heaping vows upon vows; but in beholding all with a peaceful soul.

"మతమంటే కప్పబడిన శిలాప్రతిమను తదేకంగా చూస్తూ ఉండడం కాదు. దేవాలయాలను చేరుట కూడా కాదు. దేవతల రూపాల ముందు నేలపై సాగలబడడము కాదు. చేతులు పైకెత్తి అరవడమూ కాదు. భూతబలుల ద్వారా ఆలయాలను రక్తసిక్తం చేయడమూ కాదు. మొక్కులు మీద మొక్కుల్ని దొంతరలాగా పేర్చుకుంటూ పోవడమూ కాదు. ప్రశాంతమైన హృదయంతో సమస్త ప్రాణికోటిని చల్లగా చూడడమే" అనిన లుక్రేషియస్ విమలవచనాలు ధూమ్రాక్షుని వధ జరగాలని, హనుమంతుని పవిత్రదృష్టి కలగాలని పరోక్షంగా చెబుతున్నాయి.

అంగదుని అద్భుతాలు

ధూమ్రాక్షుని తగలేశారని తెలియగానే రావణుడు పగబట్టిన పాములాగా బుసకొట్టాడు. వెంటనే శూరుడైన వజ్రదంష్ట్రుని పిలిచాడు. "వజ్రదంష్ట్రా! వెళ్ళు. దాశరథిని దగ్ధం చేసేయ్.

సుగ్రీవుణ్ణి సంహరించేయ్. వానరుల్ని వల్లకాటిలో పెట్టేయ్. పట్టుకపో రాక్షసుల్ని. ఒక పట్టు గట్టిగా పట్టిరా!" అన్నాడు రావణుడు.

"చిత్తం" అంటూ ఆయత్తమయ్యాడు వజ్రదంష్ట్రుడు. మేలిమిబంగారుతో శోభించే రథాన్నెక్కాడు. ఏనుగులెక్కి, గుర్రాలెక్కి, గాడిదలెక్కి, ఒంటెలెక్కి, రథాలెక్కి అనేకమంది రాక్షసులు అనుసరించారు వజ్రదంష్ట్రుణ్ణి.

పెద్దసంఖ్యలో కాల్బలము కూడా కదంతొక్కింది. కత్తులు, తోమరాలు, శూలాలు, భిండివాలాలు, పాశాలు, పట్టిసాలు, కత్తులు, గదలు, చక్రాలు, గొడ్డళ్ళు ధరించి వెంట నడిచారు.

రాక్షసులందరూ విచిత్రమైన వస్త్రాలు ధరించారు. ఆయుధాలు చేతపట్టుకొని పెద్దపెద్ద ఏనుగుల మీద, రాక్షసులు నడిచి వెళ్తూ ఉంటే, పెద్ద పెద్ద పర్వతాలు నడిచి వెళ్ళినట్లే ఉంది. భయంకర శబ్దాలు చేస్తూ రాక్షసబలం కదలి వెళ్తూవుంటే, గర్జిస్తూ, మెరుస్తూ ఆకాశంలో మేఘాలు చరిస్తున్నట్లుంది.

మళ్ళీ దుశ్శకునాలే. నక్కలు భయంకరంగా అరచాయి. రాక్షసవీరులు నడుస్తూ విచిత్రంగా జారి క్రిందపడుతున్నారు. ఆకాశం నుండి ఉల్కలు రాలాయి. ఈ ఉత్పాతాల్ని చూసి వజ్రదంష్ట్రుడు కొన్ని క్షణాలు సందేహించాడు. అయినా వాటిని లెక్కచేయకుండా సమరోత్సాహంతో ముందుకు సాగిపోయాడు.

లంకనుండి కదలి వస్తున్న రాక్షససేనల్ని చూచి మళ్ళీ విందుభోజనం దొరికినట్లు, మేము ముందు-మేము ముందు అనుకుంటూ వానరులు ఉప్పొంగారు. సింహనాదాలు చేశారు. వానర రాక్షసుల మధ్య దారుణంగా రణం మొదలైంది. కొన్ని దేహాలు తెగి పడ్డాయి. కొన్ని తలలు ఎగిరెళ్ళాయి. రక్తం భూమిని తడిపేసింది.

పరిఘలతో, పట్టిసాలతో రాక్షసులు విజృంభిస్తుంటే, చెట్లను, రాళ్ళను ఎత్తుకొని వానరులు ఆడేస్తున్నారు. విసిరేస్తున్నారు. నడుములు విరిచేస్తున్నారు. అంతా భయంకరం. హృదయవిదారకం.

రథనేమి శబ్దం, ధనుష్టంకార ధ్వనులు, శంఖధ్వనులు, భేరీమృదంగ శబ్దాలు మిన్ను ముట్టాయి. అరచేతుల్తో చరచేవాళ్ళు, పాదాలతో త్రొక్కేవాళ్ళు, పిడికిళ్ళతో పొడిచేవాళ్ళు, దూరేసి, దూసేసే వాళ్ళు, రణకోలాహలం దేవదానవ సమరమా! అన్నట్లుంది.

వజ్రదంష్ట్రుడు క్రుద్ధుడై కపిసేనపై విరుచుక పడ్డాడు. యమునివలె భయంకరంగా వానరసేన మీదికి మరలాడు. చాలామంది వానరులు నేలకూలారు. అదిచూచి అంగదుడు మండిపడ్డాడు. ప్రళయాగ్ని లాగా విజృంభించాడు.

ఎర్రబడిన కళ్ళతో పెద్ద వృక్షాన్ని పెకలించాడు. మృగాలపై పడిన సింహం లాగా రాక్షసులపై పడ్డాడు. ఎదురొచ్చిన రాక్షసుల్ని చెదరగొట్టి చంపాడు. రణరంగమంతా తెగిన తలలతో, ముక్కలైన దేహాలతో, పారుతున్న రక్తంతో భయంకరంగా గోచరించింది.

భయంకరమైన గాలితాకిడికి మేఘాలు పరుగు లెత్తునట్లు అంగదుని పరాక్రమానికి నిలువలేక రాక్షసులు పరిగెత్తారు. విజృంభిస్తున్న అంగదుని, బెంబేలెత్తిన రాక్షసుల్ని చూసి

వజ్రదంష్ట్రుడు సహించలేక వింటిని సారించి, వానరులపై శరవర్షాన్ని కురిపించాడు. వానరవీరులు కూడా జడవకుండా, జంకకుండా జగడానికి దిగారు.

భయంకరమైన ఈ పోరులో ఉభయపక్షాలలోని సైనికులు చాలామంది హతులయ్యారు. గ్రద్దలు, కంకపక్షులు, నక్కలు, కుక్కలు, కాకులు అక్కడ శవాల చుట్టూ బంధువుల్లాగా మూగాయి.

వజ్రదంష్ట్రుడు పోరాడుతూనే ఉన్నాడు. ఈలోగా రాక్షససేన తరిగిపోతూనే ఉంది. ధనుర్బాణాలను చేతపట్టి వానరులను భయంకరంగా పీడించాడు. ఒకొక్క బాణానికి ఐదుగురు, ఏడుగురు, తొమ్మండుగురు ఇలా రాలిపోతున్నారు వానరులు. వజ్రదంష్ట్రుని బాణవర్షానికి భీతి చెందిన వానరులు అంగదుని వద్దకు పరుగులెత్తారు.

వానరుల బాధల్ని చూచిన అంగదుడు తట్టుకోలేక వజ్రదంష్ట్రునిపై పడ్డాడు. అంగద వజ్రదంష్ట్రులు సింహ మత్తేభాలవలె పోరాడారు. గొప్ప బలవంతుడైన వజ్రదంష్ట్రుడు అంగదునిపై వెయ్యి బాణాలు వదిలాడు. అంగదుడు ఒక పెద్ద వృక్షాన్ని పెకలించి వజ్రదంష్ట్రునిపై విసిరాడు. వజ్రదంష్ట్రుడు దానిని ముక్కలు ముక్కలుగా ఛేదించాడు. అంగదుడు చెట్లు నిండిన ఒక పర్వత శిఖరాగ్రమును విరిచి వజ్రదంష్ట్రునిపై విసిరాడు. మూర్ఛితుడై గదను కౌగలించుకొని క్రిందపడ్డాడు వజ్రదంష్ట్రుడు.

కొన్ని క్షణాలు అలా పడి ఉండడం చూసిన అంగదుడు వజ్రదంష్ట్రుడు మరణించాడని అభిప్రాయపడ్డాడు. మూర్ఛనుండి తేరుకొని గదను చేతపట్టుకొని అంగదుని గుండెపై కొట్టాడు వజ్రదంష్ట్రుడు. అంగదుడు చలించలేదు. ఇరువురు ముష్టియుద్ధానికి దిగారు.

ఒకర్ని ఒకరు చరచుకున్నారు. బాదుకున్నారు. కుమ్ముకున్నారు. ఇరువురికీ దేహాలనుండి రక్తం ప్రవహించసాగింది. ఇద్దరూ పుష్పించిన మోదుగచెట్లలాగా శోభిస్తున్నారు.

పరస్పరం కొట్టుకొని అలసిపోయిన అంగద వజ్రదంష్ట్రులు మోకాళ్ళమీద కూర్చున్నారు. అలా క్షణాలు గడిచాయో లేదో కట్టెచే కొట్టబడిన పాములాగా ఎగిరిపడ్డాడు అంగదుడు. ఖడ్గమును చేతపట్టుకొని వజ్రదంష్ట్రుని తలను నరికేశాడు. చెట్టునుండి తాటిపండు క్రింద పడ్డట్లు వజ్రదంష్ట్రుని తల నేలపడింది. అది చూచి రాక్షసులు భీతి చెందారు. వానరులు అధికోత్సాహంతో రాక్షసుల్ని కొట్టికొట్టి చంపారు. కొందరు రాక్షసులు రావణునికి చెప్పడానికి లంకకు లగెత్తారు.

అంగదుని ధైర్యసాహసాలను కపిశ్రేష్ఠు లందరూ శ్లాఘించారు. అందరూ చుట్టుముట్టగా ఇంద్రసభలో దేవతల మధ్య దేవేంద్రునిలా ప్రకాశించాడు అంగదుడు. ఆనందాన్ని ఆపుకోలేక కపివరు లందరూ అంగదుణ్ణి పట్టుకొని మళ్ళీ ఆడేశారు.

వజ్రదంతములు గలవాడు వజ్రదంష్ట్రుడు. పగవారిపై పటపట కొరికేందుకు పళ్ళు ఉపకరించినా, వాటి ముఖ్య ప్రయోజనం ఆహారాన్ని నమిలి తినడానికే. గట్టి వస్తువుల్ని కొరికి తినడానికి ఉపకరిస్తాయి. ఏఏ వస్తువుల్ని కొరికి తింటామా! అనే ఆలోచనతో ఉండే వాడే వజ్రదంష్ట్రుడు. అంటే తిండిమీద ఆసక్తి కలిగినవాడు. రుచిపై అభిరుచి గలవాడు. భోగాసక్తి పరుడు.

వజ్రదంష్ట్రుని అంగదుడు వధించాడు. "అం" అంటే భగవంతుని, "గద" అంటే కీర్తించువాడు అని భావము. భగవన్నామ సంకీర్తనము నందు నిత్యాసక్తి పరుడే అంగదుడు. వజ్రదంష్ట్రుని సంహరించిన అంగదాడు. భోగాసక్తిని త్యజించుటలో ముందువాడు.

రసనేంద్రియాన్ని నిగ్రహించుకోలేక భోగాసక్తిపరులైన వారందరూ వజ్రదంష్ట్రులే అని అర్థము. అంగదులైన వారే వజ్రదంష్ట్రుని సంహరించగలరు. ఎవరి నాలుక సదా భగవన్నామ మాధుర్యమును గ్రోలుటకు ఉత్సాహపడుతూ ఉంటుందో, అట్టి నాలుకే భోగాసక్తి యందు స్పృహ లేకుండా ఉంటుంది.

భగవంతుని నామపుష్పాలతో పూజించేవారే నిత్యభక్తులు. నామ సుమాలు వాడేవికావు. ఊడేవి కావు. నిత్యకాంతులతో శోభిల్లే భగవన్నామ కుసుమాలతో పరమాత్మను అర్చించినపుడు మనము కూడా అంగదుని వలె కీర్తనభక్తులమై రసనేంద్రియమనే వజ్రదంష్ట్రుని సంహరించగలం. అప్పుడు జన్మను సార్థకము చేసికొనిన వారము కాగలము.

నామ కుసుమములచే బూజించే
నర జన్మమే జన్మము మనసా............ నామ॥
శ్రీమన్మానస కనక పీఠమున
చెలగ జేసికొని వరశివ, రామ......నామ॥
నాద స్వరమనే నవరత్నపు, వేదికపై సకల లీలా
వినోదుని పరమాత్ముని శ్రీరాముని
పాదములను త్యాగరాజ హృద్భూషణుని......... నామ॥

అని త్యాగరాజస్వామి కీర్తించారు.

.........నే నీ లసన్నామ మేప్రొద్దు.భక్తితోఁ దడవిన బంధ సంతతులు వాయు" అని నామ వైభవాన్ని భాగవతం దశమస్కంధములో మధురభక్తి మానిని రుక్మిణి నోట పలికిస్తాడు పంచదారల పోతనామాత్యుడు.

"ధూమ్రాక్షుని వధ" అనే సంఘటనను అవగతం చేసికొని దాని ద్వారా మన దృష్టిలోని దోషాన్ని పోగొట్టుకొని పవిత్రులం కావాలి అని గ్రహించాలి. "వజ్రదంష్ట్రుని వధ"ను ఆధారంగా చేసికొని, జీవితంలో భోగాసక్తిని విడనాడాలని, రసనేంద్రియానికి భగవన్నామామృతాన్ని పట్టించాలని గ్రహించి తదనుగుణంగా జీవించాలి.

అకంపనుని అస్తమయం

వజ్రదంష్ట్రుని అంగదుడు రాలగొట్టేశాడని రావణునికి తెలిసింది. వెంటనే ప్రహస్తుని పిలిచి, వీరులైన రాక్షసులను తీసికొని యుద్ధానికి వెళ్ళమని అకంపనునికి చెప్పమన్నాడు.

"ప్రహస్తా! అకంపనుడు గొప్ప వీరుడు. శత్రువులను మట్టుపెట్టగలడు. స్వజనులపై పట్టును నిలుపుకోగలడు. శూరుడైన అకంపనుడు రామలక్ష్మణుల్ని, సుగ్రీవుణ్ణి, వానరసైన్యాన్ని వధించగలడు" అన్నాడు రావణుడు.

ఒక విషయాన్ని ఇక్కడ మనం పరిశీలించి అవగతం చేసుకోవాలి. ఇంతవరకు గతించిన ధూమ్రాక్ష వజ్రదంష్ట్రులను రావణుడే స్వయంగా మాట్లాడి యుద్ధానికి పంపించాడు. అకంపనుని విషయంలో అలా జరగలేదు. రావణుడు అకంపనునితో మాట్లాడకుండా ప్రహస్తుని ద్వారా అకంపనునికి ఆదేశాన్ని పంపించాడు. దీని ఉద్దేశ్యాన్ని మనం గ్రహించాలి.

రావణునిది సమరస్వభావమే కాని సరళస్వభావము కాదు. అదొక యుద్ధపక్షి. ఒక విధంగా చెప్పాలంటే రణ జూదగాడు. ఇప్పటికి ఇద్దరిని పంపాడు. ఇద్దరూ కూలిపోయారు. ఇప్పుడు మార్పును ప్రవేశపెట్టాడు. తాను పంపిస్తూ ఉంటే తిరిగి రావడం లేదు కనుక ప్రహస్తుని నోటిద్వారా పలికిస్తే కార్యం సిద్ధిస్తుందనే ఆశ. ఇది జూదగాడి లక్షణము.

జూదగాడు పాచిక లాడుతూ ఉంటాడు. రెండుసార్లు ఓడిపోగానే మూడోసారి పాచికల్ని ఎడమచేత్తో వేస్తుంటాడు. గెలిచా డనుకోండి. అదొక సెంటిమెంట్‌గా మారిపోతుంది. ఇక జూదంలోనే కాదు. ఎక్కడ ఓటమి ఎదురౌతున్నా, దాన్ని ఎదుర్కొనేది ఎడమచెయ్యే.

ఈ లెఫ్టిస్టును చూచి మిగిలిన జూదగాళ్ళందరూ జడిసిపోతారు. ఎడమచెయ్యి జమాయిస్తుంటే కుడిచేతి వాళ్ళందరూ మెల్లగా జారిపోతూ ఉంటారు. "ఎడమ చేత్తో పాచికలు వేయకూడదు" అని రూల్ పాస్ చేస్తారు. "కుడి ఎడమైతే పొరపాటే" అని అందరూ అంగీకరించి మరీ ఆడుతారు. ఇది అంటీ సెంటిమెంట్. ఇక్కడే వైరుధ్యాలు ఆవిష్కరింపబడుతాయి సమాజంలో.

పదితలల వాడ్ని కేవలం ఒక్కకోణంలో చూస్తే సరిపోదు. ప్రహస్తుని ద్వారా అకంపనునికి ఆదేశా న్నివ్వడంలో రావణునికి మరొక భావం కూడా ఉండి ఉంటుంది.

ముందు ధూమ్రాక్షుణ్ణి పంపాడు. వాడిక రాడని తెలిసి వజ్రదంష్ట్రుణ్ణి పంపాడు. వాడు కూడా ధూమ్రాక్షుని ప్రక్కవాటాలో చేరిపోయాడని తెలిసి ఇప్పుడు అకంపనుని పంపుతున్నాడు ప్రహస్తుని ద్వారా. ఇది కూడా జూదగాడి లక్షణమే.

ఒకణ్ణి, ఒకణ్ణి పంపితే వాళ్ళు తిరిగి రాలేదు. ఇప్పుడు రెండు పేర్లను ఆదేశించాడు. ప్రహస్తుని ద్వారా చెప్పి పంపడం లోని అంతరార్థం అదే. అకంపనుడు అగుపించకపోతే, ఆ తరువాత ప్రయాణం కావలసింది ప్రహస్తుడే అనేది రావణుని హృదయసందేశం. కనుక "అకంపనుని పంపించు" అని ప్రహస్తునికి చెప్తూ, "ఆ తరువాత, అవసరాన్ని బట్టి నీవే వెళ్ళాల్సి ఉంటుంది. సర్దుకో బట్టలు" అని పరోక్షంగా ప్రహస్తుని హెచ్చరించడమే.

ఇదికూడా జూదగాని స్వభావమే. మొదటి ఆటలో ఒక రూపాయ, రెండవ ఆటలో ఒక రూపాయ నష్టం రాగానే మూడవ ఆటలో రెండు రూపాయలు పందెం అంటాడు జూదగాడు. పోయేకొద్దీ సహనం కూడా తగ్గిపోతూ, ఆందోళనతో అపజయాల సంఖ్యను పెంచుకొంటూ పోవడం కూడా జూదగాని జైత్రయాత్రలో ఒక మలుపే.

భూతి కామశ్చ మే నిత్యం నిత్యం చ సమరప్రియః

"సదా యుద్ధము నందు ప్రీతిగల అకంపనుడు ఎల్లప్పుడూ నా శ్రేయస్సే కోరుతుంటాడు. అతణ్ణి వెళ్ళమను" అని పలికాడు.

చూశారా! రావణుడు ఎంత ఘోరమైన ప్రభువో. అకంపనుడు ఎప్పుడూ తన శ్రేయస్సే కోరుకుంటాడు కనుక అతణ్ణి యుద్ధానికి పంపాలట. ప్రజల సుఖాన్ని ప్రభువు కోరుకోవాలి

కాని, ప్రజలు తమ సుఖాల్ని వాంఛించాలని అభిలషించే ప్రబుద్ధుడు రావణుడు. నేటి ప్రజాస్వామ్య పరిపాలనను ప్రక్కకు పెడితే, ఇంతటి దౌర్భాగ్యుడు, దుష్టుడైన రాజు మరొకడు కనిపించడు చరిత్రలో. కంసుడు కూడా కనిష్ఠుడే.

పైగా అకంపనుడు యుద్ధోత్సాహంతో ఉంటాడట. బుద్ధిమంతుల్ని నచ్చని రావణుడు యుద్ధోన్మాదుల్ని చూసి సంతసిస్తున్నాడు. బుద్ధిగా బ్రతికితే, లంకపై దండెత్తే ధైర్యం ఎవ్వరికీ లేదు. దేవతలకు కూడా లేదు. అయినా యుద్ధోన్మాదుల్ని, అపారసైన్యాన్ని రావణుడు ఎందుకు వాంఛిస్తున్నట్లు? తన పాడుపనులు ఏనాడైనా గొప్ప కీడును తెచ్చిపెడతాయని భావించడమే. దురాత్ములలో కదిలేవన్నీ దుష్టభావాలే.

సైన్యం సిద్ధమైంది. భయంకరులైన రాక్షసు లందరూ యుద్ధానికి సన్నద్ధు లయ్యారు. మేఘకాయుడై, మేఘరూపుడై, మేఘధ్వనితో మెరిసే కుండలాలు ధరించి, రథమెక్కి రాక్షసులను ముందుంచుకొని కదలి పోయాడు అకంపనుడు. తప్పదు మరి. తనవంతు వచ్చిన తరువాత వెళ్ళకుండా ఎవరుండగలరు?

యః పుమానాద్య తేజస్వీ మండలాన్యధి తిష్ఠతి
స భస్మకూటతాం రాజన్దివసై రధి గచ్ఛతి ॥

"ఎవడైతే ఈనాడు గొప్ప తేజోవంతుడై, ప్రభువై రాజ్యమును పాలిస్తున్నాడో, వాడే రోజులు గడిస్తే బూడిదకుప్పగా మిగిలిపోతున్నాడు" అని శ్రీరాముడు విశ్వామిత్రునితో అన్నట్లు వాల్మీకి మహాముని యోగవాసిష్ఠంలో భరద్వాజునికి చెబుతాడు.

కంపన మెరుగని అకంపనుడు గజ్జకట్టి కజ్జాకి కాలుదువ్వాడు. రథం కదిలింది. కొద్దిదూరం పోయారు. ఎందుకో గుఱ్ఱాలు దైన్యమును పొంది రథాన్ని మెల్లగా లాగుతున్నాయి.

అకంపనుని ఎడమకన్ను అదిరింది. ముఖం పాలిపోయింది. కంఠము గద్గదమైంది. ఆకాశములో గాలులు భయంకరంగా వీచాయి. అయినా లెక్కచేయకుండా గర్జిస్తూ ముందుకు ఉరికాడు అకంపనుడు.

వానర రాక్షస సేనలు కలిశాయి. మళ్ళీ ఆరంభమైంది కల్లోలం. సేనల పాదతాకిడికి లేచిన ఎఱ్ఱని ధూళి ఆకాశాన్ని కమ్మేసింది. ఆ పరాగంలో ఒకరి కొకరు కనిపించలేదు. శబ్దాలు వినిపిస్తున్నాయే గాని రూపాలు కనిపించడం లేదు.

ఎవరు ఎవరికీ కనిపించక పోవడం వల్ల, "చావు" అంటూ వానరులు వానరుల్ని కొడుతూ వుంటే "చచ్చావులే" అంటూ రాక్షసులు రాక్షసుల్ని చంపేశారు. రణరంగమంతా రుధిర పంకం తో నిండిపోయింది. భూమి రక్తంతో తడిసిన తరువాత దుమ్ము లేవడం ఆగింది. యుద్ధభూమి శ్మశానభూమిగా మారిపోయింది.

అకంపనుడు విజృంభించి రాక్షసులను వధిస్తున్న వానరవీరుల్ని తీవ్రంగా హింసించాడు. అకంపనుని చేతిలో వానరులు చాలామంది చనిపోయారు. అది చూచి వానరులు పారిపోసాగారు. ఇంతలో కుముదుడు, మైందుడు, నలుడు, ద్వివిదుడు వచ్చి గొప్పగా సింహనాదం చేశారు. వాళ్ళను చూడగానే ధైర్యం ఉప్పొంగింది వానరులకి. మళ్ళీ సమరరంగంలో ప్రవేశించారు. భయంకరంగా పోరాడి రాక్షసుల్ని తుక్కుతుక్కుగా కొట్టి చంపేశారు.

అది చూచి అకంపనుడు కంపించాడు. వానరవీరులు ఎక్కువగా ఉన్న చోటికి రథంలో వచ్చాడు. వానరవీరులపై బాణవర్షాన్ని కురిపించాడు. వానరులు తట్టుకోలేక పోయారు. అది చూచిన హనుమంతుడు అకంపనుని ఢీకున్నాడు.

హనుమంతునిపై అకంపనుడు శరవృష్టిని కురిపించాడు. గొప్పగొప్ప బాణాలు తన దేహంలో నాటుకుంటున్నా పట్టించుకోకుండా అకంపనుని వధించడానికే నిర్ణయించుకున్నాడు.

హనుమంతుడు ఒక పర్వతశిఖరాన్ని పెకలించి, గిరగిర త్రిప్పుతూ అకంపనుని మీదికి వెళ్ళాడు. హనుమంతుడు విసిరిన పర్వతశిఖరాన్ని అకంపనుడు ఛేదించాడు బాణంతో.

సింహనాదం చేసి హనుమంతునిపై పద్నాలుగు బాణాలను సంధించాడు అకంపనుడు. హనుమంతుడు క్రుద్ధుడై మద్దిచెట్టు నొకదానిని పెకలించి, బలంగా అకంపనుని కొట్టాడు. అకంపనుడు క్రిందపడ్డాడు చివరగా. అది చూచి రాక్షసు లందరూ దుఃఖించారు. భయంతో లంకలోకి లగెత్తారు.

భయంతో బెంబేలెత్తిన రాక్షసులు ఏం మాట్లాడుతున్నారో, ఏం చేస్తున్నారో వాళ్ళకే అర్థం కాలేదు. వాళ్ళని వాళ్ళే పరుషంగా తిట్టుకుంటూ, పరస్పరము కొట్టుకొంటూ, జుట్టు ముడులు ఊడిపోగా, గుడ్డలూడేది కూడా తెలియక వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ లంకలోకి పరిగెత్తి వెళ్ళారు.

వానరులందరూ ఆంజనేయుని ప్రస్తుతించారు. రామ లక్ష్మణ సుగ్రీవ విభీషణాదులు కూడా హనుమను శ్లాఘించారు. "మీ సహకారంతోనే నేను ఈ కార్యాన్ని సాధించాను" అన్నాడు హనుమ.

కంపనుడు అంటే చలించువాడు అని అర్థము. అకంపనుడు అంటే చలించని వాడు. రాతిగుండె కలవాడని భావము. దయ లేనివాడు. జాలి లేనివాడు. మైత్రీభావము లేనివాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రేమ లేనివాడు. భక్తి కుదరని వాడు.

ఏ హృదయాలు భూతదయ లేకుండా, ప్రేమ లేకుండా, భక్తికి దూరమై ఉంటాయో అవన్నీ కాఠిన్యాలే. అట్టి అకంపన హృదయాల్ని కలిగినవారే అకంపనులు.

ఈవిధమైన బండరాతి బ్రతుకును నిండుపున్నమి వెన్నెలగా మార్చుకోవాలి. రాతిబండను శిల్పి అందమైన శిల్పంగా మార్చునట్లు కాఠిన్యహృదయాల్ని కరుణామయంగా తీర్చిదిద్దుకోవాలి. ఇదీ ఒక పోరాటమే. ఆ పోరాటమే హనుమ అకంపనుల మధ్య జరిగింది.

హనుమ అకంపనుని వధించడ మంటే చలనరహిత హృదయాల్ని నిర్మూలించడం అని భావము. హనుమ భక్తిస్వరూపము. నామభక్తికి నిదర్శనము. కథాభక్తికి ప్రతిరూపము. అదే ప్రారంభంలో శ్రవణంగాను, ఆ తరువాత కీర్తనంగాను వ్యక్తమౌతుంది.

రాముని అనంత కళ్యాణగుణాల్ని పరవశిస్తూ గానం చేశాడు అశోకవనంలో హనుమ. కథాశ్రవణము హృదయాల్ని చలింపచేస్తుంది. "కథా దిష్విితి గర్గః" కథాశ్రవణమే భక్తి అని గర్గ మహర్షి నారదభక్తి సూత్రాలలో తెలుపుతారు.

చలనరహిత హృదయాల్ని కథాశ్రవణం ద్వారా ప్రేమమయంగా మార్చాలి. అప్పుడు **కాఠిన్యం చస్తుంది. కారుణ్యం పుడుతుంది.**

ఎంత పుణ్యమో యిటు మాకు కలిగె
చెంతనే నీకృప సిద్ధించబోలు ॥ఎంత॥
శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపము లణగెను భయముడిగె

అని కథాశ్రవణ వైభవాన్ని దివ్యంగా కీర్తించారు అన్నమాచార్యులు.

ప్రహస్తుని ప్రయాణం

అకంపనుడు హతుడైనట్లు విని రావణుడు కుపితుడై ఊగిపోయాడు. ఆ తరువాత అతని హృదయంలో దిగులు మొలిచింది. కొంతసేపు ఆలోచించాడు. మంత్రులతో మంతనాలు నడిపాడు. పట్టణాన్ని వీక్షించాలని ఉదయాన్నే బయలుదేరాడు.

రాక్షసజనమంతా మెళుకువలో ఉన్నారు. సైన్యం సిద్ధంగా ఉంది. వ్యూహమంతా కట్టుదిట్టంగా ఉన్నట్లు కన్పించింది. అందుకు కొద్దిగా ఆనందించాడు రావణుడు. యుద్ధ విశారదుడు, సేనాధిపతి అయిన ప్రహస్తునితో ఇలా పలికాడు రావణుడు.

"ప్రహస్తా! సుందరమైన మన లంకాపట్టణాన్ని దుష్టులైన శత్రువులు ఎలా పీడిస్తున్నారో చూస్తున్నావు కదూ! ఈ దశలో మనకు మిగిలింది యుద్ధ మొక్కటే. ఈ కార్యభారాన్ని సమర్థవంతంగా నిర్వహించగలిగే శక్తి నాకు, కుంభకర్ణునికి, నా సేనాధిపతివైన నీకు, ఇంద్రజిత్తుకు, లేదా నికుంభునకు మాత్రమే ఉంది.

"మన సేనకు నీవు నాయకుడివి కా. రణరంగంలో ప్రవేశించు. దుష్టులైన ఆ వానరుల్ని సంహరించు. విజయాన్ని సాధించు. నిన్ను చూచిన తరువాత హీనులైన వానరులు యుద్ధభూమిలో క్షణం నిలువలేరు.

"వానరులు చపలచిత్తులు. యుద్ధనైపుణ్యము లేనివారు. సింహనాదాన్ని ఏనుగులు భరించలేనట్లు, నీ సింహగర్జనాన్ని విని వానరులు బ్రతికి బట్టకట్టలేరు. వానరసైన్యము పారిపోగానే దిక్కుతోచని రామలక్ష్మణులు నీకు వశమౌతారు.

"చూడు! ఇప్పుడు నీవు యుద్ధానికి వెళ్తే నీవు జయించవచ్చు. లేదా ఓడిపోవచ్చు. యుద్ధానికి వెళ్ళక పోతే మనకు ఆపద తప్పదు.

ఆపత్సంశయితా శ్రేయో నాత్ర నిస్సంశయీ కృతా

"నిశ్చయమైన ఆపదకంటే, సంశయమైన ఆపదే మేలుకదా!

"ప్రహస్తా! ఆలోచించు. ఏది అనుకూలమో, ఏది ప్రతికూలమో! ఎలా చేస్తే మనకు మంచిదో యోచించు. నీ అభిప్రాయ మేమిటో చెప్పు" అన్నాడు రావణుడు ప్రహస్తునితో.

రావణుడు నైతికంగా ఎంత పతన మయ్యాడో ఇక్కడ మనం చూడవచ్చు. ధూమ్రాక్ష, వజ్రదంష్ట్ర, అకంపనాదులు మరణించే సరికి, వాళ్ళకి చెప్పినట్లు "యుద్ధానికి వెళ్ళు" అని ప్రహస్తునికి చెప్పలేక పోతున్నాడు.

రావణునిలో ఏదో భయం చోటుచేసుకుంది. తనవారు కూడా తీపి ప్రాణాలను రక్షించుకొనుటకు తనకు ప్రతికూల మౌతారేమో అనే భయం అతనిలో ప్రారంభమైంది.

ఇప్పుడు ప్రహస్తునితో రావణుడు మాట్లాడిన మాటలు తన స్థాయికి తగినవి కావు. యుద్ధానికి వెళ్ళితే మంచిదా! వెళ్ళకపోతే మంచిదా! అనే ప్రశ్న ప్రారంభంలో పడవలసిందే గాని ఈ దశలో కాదు.

యుద్ధం విషయంలో సంప్రదించుకొని ఒక నిర్ణయానికి వచ్చి, యుద్ధం జరుగుతున్న తరుణంలో సంశయాలు తలెత్తాల్సిన అవసరం లేదు. తనది ధర్మమై ఉంటే రావణుడు ఇలా అడిగేవాడు కాడు. తనదంతా అధర్మమే నని రావణునికి తెలుసు. అధర్మాన్ని భయంతో కొందరు ఆమోదించవచ్చు. భయం తీరిపోతే ప్రతిఘటించరనే నమ్మకం లేదు. ఆ పరిస్థితిని కూడా రావణుని మనసు శంకిస్తోంది. ప్రహస్తుడు ప్రతికూల మౌతాడేమో అనే భయం, మన స్తత్వశాస్త్ర రీత్యా రావణునికి కలిగిందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

"మృదుర్హి పరిభూయతే" మెత్తని వానిని అందరూ మొత్తుతారు అనే వాక్యాన్ని చైతన్య రామాయణం ప్రథమ సంపుటంలో మనం చూశాం. మొత్తితే కాని కొందరు మెత్తబడరు అని ఇప్పుడు రావణుని మాటల్లో గ్రహిస్తున్నాం. లేకపోతే ప్రహస్తుని అభిప్రాయాన్ని ఈ దశలో రావణుడు కోరడం అర్థరహితం. హాస్యాస్పదం.

రావణుని మాటలు విన్న ప్రహస్తుడు ఇలా పలికాడు. "మహారాజా! ఈ విషయాన్ని మంత్రిమండలిలో మనం చర్చించాము. అభిప్రాయభేదాలు కూడా వినిపించాయి. నా మటుకు నేను సీతను రామునికి తిరిగి ఇచ్చివేయడమే మంచిదని కూడా చెప్పాను. ఒకవేళ అలా చెయ్యకపోతే. యుద్ధం అనివార్య మవుతుందని కూడా ఊహించాము. యుద్ధం రానే వచ్చింది. ముఖ్యులైన సేనానాయకులు కూడా ఇప్పటికే ముగ్గురు మన ముందు లేకుండా పోయారు.

"నువ్వు నన్ను ఎంతగానో ఆదరించావు. ప్రేమించావు. ఎంతో సత్కరించావు. అలాంటి నీకు నేను మేలు చేయకుండా ఉండగలనా? నాకు భార్యాపుత్రాదులు గాని, ధనధాన్యాదులు గాని, చివరికి నా ప్రాణం గాని నీకన్నా గొప్పవి కావు. నీ కొరకు సమర హోమాగ్నిలో నన్ను నేను హోమద్రవ్యంగా సమర్పించుకో దలచాను. చూస్తువు గాని. వానరుల మాంసాన్ని వనపక్షులు విందారగిస్తాయి;" అన్నాడు.

సైన్యము సిద్ధమైంది. ఏనుగుల వంటి రాక్షసవీరులు యుద్ధానికి సన్నద్ధులయ్యారు. ప్రహస్తుని చుట్టూ చేరారు. యుద్ధభేరిని భయంకరంగా మ్రోగించారు. ప్రహస్తుడు రథమెక్కాడు. రథము కదులుతుంటే మబ్బు ఉరిమినట్లుంది. ప్రహస్తుడు రణరంగానికి బయలుదేరాడు. వాద్యముల శబ్దాలు, రథముల ధ్వనులు, శంఖారావాలు, సింహనాదాలు ఆకాశాన్నంటాయి.

ప్రహస్తుని సచివులైన నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడు అను నలుగురు రాక్షసులు ప్రహస్తుని అనుసరించారు. ప్రహస్తుడు తూర్పుద్వారము నుండి బయలుదేరాడు. ప్రహస్తుడు కాలయముడిలా కనిపిస్తుంటే, అతని వెంట నడుస్తున్న సైన్యము సాగరరూపమై గోచరించింది.

రథము ముందుకు నడుస్తోంది. శ్మశానంలో సంచరించే పక్షులు ఆకాశంలో ఎగురుతూ వచ్చాయి. ప్రహస్తుని రథం చుట్టూ అపసవ్యంగా తిరిగాయి. ఆడనక్కలు విలపిస్తున్నాయి.

వాయువు బలంగా వీస్తోంది. ధ్వజశిఖరము మీద గ్రద్ద వాలి భయంకరంగా అరచింది. సారథి చేతి నుండి కొరడా జారి క్రింద పడింది. సమతలంపై అశ్వాలు విషమంగా నడుస్తున్నాయి.

రాక్షససైన్యము యుద్ధభూమిలో సింహనాదం చేసింది. వానరసైన్యము రెచ్చిపోయి మేఘగర్జనం చేసింది. ప్రహస్తుడు వానరసేనలోకి దూసుకొని పోయాడు. ప్రహస్తుడు దుడుకుగా దూకుతూ ఉంటే మిడుత అగ్ని వైపు పరుగులెత్తినట్లు ఉండింది.

ప్రహస్తుని చూచిన రాముడు విభీషణుని అడిగాడు. "విభీషణా! ఎవరతడు? కొండలా, పెద్ద బండలా ఉన్నాడు? చాలా పెద్ద సైన్యంతో వస్తున్నాడు. ఏమిటి ఇతని విషయం?" అని అడిగాడు.

"రామా! అతని పేరు ప్రహస్తుడు. రావణుని సేనాపతి. లంకలో ముప్పాతిక సైన్యము అతని చేతిలోనే ఉంటుంది. చాలా గొప్ప వీరుడు. పరాక్రమవంతుడు. శస్త్రాస్త్ర కోవిదుడు;" అన్నాడు విభీషణుడు.

ఈలోగా రాక్షససైన్యం ముందుకు దూసుకొచ్చేసింది. శరాలు, శూలాలు, శక్తులు, ఋష్టులు, ముసలాలు, గదలు, ప్రాసలు మొదలైన ఆయుధాలను పట్టుకొని రాక్షసులు సింహనాదం చేశారు.

పెద్దపెద్ద వృక్షాలను, పర్వతశిఖరాలను, పొడవైన పెద్ద బండలను పట్టుకొని మేఘగర్జనం చేస్తూ వానరులు రాక్షసుల మీది కురికారు. వానరులు శిలావర్షం కురిపిస్తుంటే, రాక్షసులు శరవర్షం కురిపించారు.

రాక్షసుల చేతిలో చాలా మంది వానరులు మరణించారు. వానరుల చేతిలో రాక్షసులు కూడా అలాగే పోయారు. ప్రచండమైన ప్రహస్తుని నాయకత్వంలో రాక్షసులు రెచ్చిపోయారు. వానరుల్ని తీవ్రంగా వధించారు.

వానరుల్ని శూలాలతో పొడిచారు. పరిఘలతో తలలు పగులగొట్టారు. గొడ్డళ్ళతో నరికేశారు. గుండెలు బ్రద్దలు కొట్టేశారు. ఖడ్గాలతో రెండు ముక్కలుగా చీల్చేస్తూ వుంటే గిలగిల తన్నుకుంటూ వానరులు ప్రాణాలు విడిచారు.

కోపించిన కపులు రాక్షసులపై తిరగబడ్డారు. రాక్షసుల్లో కొందర్ని కరిచారు. కొందర్ని చరిచారు. కొందర్ని బరికారు. కొందర్ని కొరికారు. పిడికిళ్ళతో గుద్దారు. మోకాళ్ళతో కుమ్మారు. తోకలతో జాడించేశారు. రాక్షసుల హారాలు తెగి పడ్డాయి. కేయూరాలు ఎగిరి పడ్డాయి. ఎముకలు విరిగిపోయాయి. కళ్ళు రాలిపోయాయి. రక్తం కారిపోయింది. చర్మం చితికిపోయింది. మేనులు నేలకు అతుక్కుపోయాయి.

ప్రహస్తుని మంత్రులైన నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడు, విజృంభించి వానరుల్ని తీవ్రంగా హింసించి చంపారు. అది చూచి వానర నాయకులు క్రుద్ధులై ప్రళయకాల రుద్రులవలె రణరంగంలో దూకారు.

ద్వివిదుడు పర్వతశిఖరాన్ని చేతపట్టుకొని నరాంతకునిపై విసిరాడు. నరాంతకుడు రాలిపోయాడు.

దుర్ముఖుడు పెద్ద వృక్షాన్ని పెకలించి, దానితో సమున్నతుడు అనే రాక్షసుని దారుణంగా కొట్టి చంపాడు.

జాంబవంతుడు కుపితుడై పెద్ద బండనెత్తి మహానాదుని గుండెపై వేశాడు. మహానాదుడు పగిలిన గుండెతో పరలోకం చేరాడు.

బలవంతుడైన తారుడు గొప్ప చెట్టును పెకలించి కుంభహనువును కొట్టాడు. ఆ దెబ్బకు కుంభహనువు కూలిపోయాడు.

నలుగురు సచివులు చావడం చూచి ప్రహస్తుడు రెచ్చిపోయాడు. ధనుస్సును చేత పట్టుకొని వానరుల్ని చిత్రవధ చేశాడు. రణభూమిలో పోగులు పడిన వానర రాక్షస సమూహాలు పర్వతశ్రేణుల్లా కనిపించాయి. రుధిరసిక్తమైన రణభూమి వైశాఖమాసము నందు మోదుగ పువ్వులు పరచిన భూమిలాగా కనిపించింది.

ప్రహస్తుడు వానరుల్ని నాశనం చేయడం నీలుడు చూశాడు. ఆకాశాన వీచే పెద్ద గాలి మేఘాలవైపు వెళ్ళినట్లు వానరశ్రేష్ఠుడైన నీలుని చూడగానే ప్రహస్తుడు నీలునిపైకి ఉరికాడు. నీలునిపై శరవర్షాన్ని కురిపించాడు. ప్రహస్తుడు ప్రయోగించిన సర్పబాణాలు నీలుని తీవ్రంగా గాయపరచాయి.

నీలుడు ఒక పెద్ద వృక్షాన్ని పెకలించి ప్రహస్తుని బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు ప్రహస్తుడు సింహనాదం చేస్తూ నీలునిపై బాణవర్షం కురిపించాడు. నీలుడు ఆ బాణాల్ని నివారించలేక పోయాడు. నేత్రాలు మూసి నిగ్రహించుకున్నాడు. శరత్కాలంలో అనుకోకుండా కురిసిన గొప్ప వర్షంలో ఆబోతు కళ్ళు మూసికొని తడిసినట్లు, ప్రహస్తుని బాణవర్షంలో తడిసిపోయాడు నీలుడు.

ప్రహస్తుడు కొట్టిన దెబ్బలకు కోపించిన నీలుడు పెద్ద సాలవృక్షాన్ని చేతపట్టుకొని గుఱ్ఱాల్ని కొట్టి చంపాడు. ప్రహస్తుని ధనుస్సును విరిచేశాడు. ప్రహస్తుడు గొప్పదైన ముసలాన్ని చేతపట్టుకొని రథము నుండి క్రిందికి దిగాడు.

ప్రహస్తుడు నీలుని తలపై రోకలితో కొట్టాడు. వెంటనే నీలుని తలనుండి సెలయేరులా రక్తం స్రవించింది. నీలుని దేహమంతా రక్తంతో తడిసిపోయింది. నీలుడు కోపించి పెద్ద వృక్షాన్ని పెకలించి ప్రహస్తుని వక్షఃస్థలముపై కొట్టాడు.

ప్రహస్తుడు దానిని లెక్క చేయకుండా పెద్ద రోకలిని పట్టుకొని నీలుని మీదికి దుమికాడు. నీలుడు గొప్ప శిలను ఎత్తి ప్రహస్తుని తలపై పడేశాడు. ప్రహస్తుని తల ముక్కలై పోయింది. నిలవలేక ప్రహస్తుడు నేలకొరిగాడు. కళ్ళను నింగి కెత్తాడు.

ప్రహస్తుని మరణాన్ని చూసి రాక్షసులు భయంతో కేకలు పెడుతూ లంకలోకి పరుగులెత్తారు. వంతెన కూలిపోగా జలప్రవాహము అడ్డులేనిదై తీవ్రంగా ప్రవహించునట్లు, ప్రహస్తుడు కూలిపోగా రాక్షసులు ప్రవాహంలా పారిపోయారు లంకలోకి.

ప్రహస్తుని సంహరించిన నీలుడు సంతోషంతో రామలక్ష్మణుల్ని సమీపించాడు. వానర వీరు లందరూ నీలుని ప్రశంసించారు.

హస్తా లందరికీ ఉంటాయి. కొన్ని అభయహస్తాలైతే, కొన్ని శూన్యహస్తాలు. కొన్ని అదృష్ట హస్తాలైతే కొన్ని దరిద్రహస్తాలు. కొన్ని అమృతహస్తాలైతే మరికొన్ని భస్మాసుర హస్తాలు.

అన్ని హస్తాలూ నేస్తాలు కావు. సాధకు డెప్పుడూ ప్రహస్తుడు కాకూడదు. ప్రహస్తుడైనవాడు ప్రహసితుడు కాలేడు.

ప్రహస్తుడు అంటే వ్రేళ్ళు చాపిన అరచేయి కలవాడు అని అర్థము. యాచకమనస్తత్వం కలవాడని భావము. ఆశల పల్లకీలో ఊరేగేవాడే ప్రహస్తుడు.

రావణునికి ప్రహస్తుడు సేనాపతి. అజ్ఞానప్రభువుకు ఆశారాక్షసియే సేనాధిపతి. ఆశల అంబారీలో ఊరేగే వానికి శాంతి ఉండదు. సుఖం మిగలదు.

ఆశ లోభము యొక్క సంతానమే. ఈ లోభగుణమే ప్రహస్తుడు. చాచిన చెయ్యి కలవాడు. లోభాన్ని ఎప్పుడూ త్యాగంతోనే జయించాలి. నీలుడు ప్రహస్తుణ్ణి సంహరించాడు. త్యాగం ప్రేమకు సంబంధించింది. నీలివర్ణము ప్రేమకు చిహ్నము. ప్రేమమయులైన వారు తమను సమీపించు వారిని కూడా ప్రేమరూపులుగా మార్చుతారు.

నీలతి వర్ణయతి వస్త్వంతర మితి నీలః "నీలవర్ణే!"

"మరొక వస్తువును కూడా నీలంగా మార్చునది నీల" మని చెప్పబడింది. అదియే ప్రేమ. అదియే త్యాగము. ఆ ప్రేమయే నీలుడు. కనుక లోభాన్ని ప్రేమతో జయించాలి. నీలుడు ప్రహస్తుని జయించుటలోని అంతర్భావ మిదియే.

ధూమ్రాక్షుని వధ ద్వారా పవిత్రత, వజ్రదంష్ట్రుని వధ ద్వారా నామసాధన, అకంపనుని వధ ద్వారా కోమలహృదయము, ప్రహస్తుని వధ ద్వారా త్యాగబుద్ధి- సాధకుడు ఈవిధంగా నాలుగు సాధనభూమికలను అధిరోహించాలని గ్రహించాము.

రామరావణ యుద్ధము

నీలుని చేతిలో ప్రహస్తుడు మరణించాడు. ఈ విషయాన్ని సైనికులు రావణునికి తెలియజేశారు. రావణుడు మరీ కోపంతో ఊగిపోయాడు. దుఃఖించాడు కూడా. రాక్షస వీరులతో ఇలా పలికాడు.

"ప్రహస్తుని చేతిలో దేవతల సైన్యమే నాశనమైంది. అట్టివాణ్ణి ఈ వానరులు వధించారు. శత్రువును తక్కువగా ఊహించడం మంచిది కాదు. ఇక ఆలస్యం చేయకూడదు. యుద్ధరంగానికి నేనే బయలుదేరుతాను. సమరభూమిలో ముందు నేను నిలుస్తాను. ఎండిపోయిన అరణ్యాన్ని అగ్నులు దగ్ధం చేయునట్లు, అగ్నుల వంటి బాణాలతో వానర సమూహాన్ని కాల్చేస్తాను. వానరుల రక్తంతో భూమికి అభిషేకం చేస్తాను." అని పలికి రథమెక్కాడు రావణుడు.

శంఖ భేరీ పణవాలను మ్రోగిస్తూ, సింహనాదాలు చేస్తూ విజయఘోషలు పలుకుతుండగా రావణుడు రథారూఢుడై బయలుదేరాడు. యుద్ధభూమిలో వృక్షాలు, పర్వతశిఖరాలు పట్టుకొని గర్జిస్తున్న సముద్రం లాంటి వానరసేనను చూశాడు.

భయంకరమై కదలివస్తున్న రాక్షససైన్యమును గూర్చి వివరించమని రాముడు అడిగాడు విభీషణుణ్ణి.

"రామా! ముందుగా ఏనుగుపై ఎక్కి వస్తున్నాడు చూడు. ఉదయభానుని వలె ఎఱ్ఱని ముఖంతో శోభిస్తున్నాడు. అతడే మహావీరుడైన ప్రవీరబాహువు.

"సింహధ్వజమున్న రథమెక్కి, ఇంద్రధనుస్సు లాంటి ధనుస్సును పట్టుకొని మత్తేభంలా వస్తున్నాడే, అతడే మా అన్న రావణుని కొడుకు. కనిపించకుండా మిమ్మల్ని నాగపాశంతో బంధించాడే వాడే. పేరు ఇంద్రజిత్తు. వరాల కారణంగా వాడు అసమాన పరాక్రమవంతుడు.

"ఆ ప్రక్కరథంలో ఉన్నాడే, వాడిపేరు అతికాయుడు. అస్త్రాద్రితో సమానుడు. గొప్ప వీరుడు. గంటలు కట్టిన ఏనుగు నెక్కి వస్తున్నాడు చూడు. వాడిపేరు మహోదరుడు.

"బంగారుతో అలంకరించిన అశ్వము నెక్కి సంధ్యాకాల మేఘంలా కనిపిస్తున్నవాడు పిశాచుడు. యుద్ధరంగంలో పిడుగు లాంటివాడు. తెల్లని వృషభముపై వచ్చువాడు త్రిశిరస్కుడు. ఆ ప్రక్కనే విశాలమైన వక్షస్థలముతో శోభిస్తూ, జీమూతవర్ణుడై తెలుస్తున్నాడే, వాడు కుంభుడు. వజ్రాలు పొదిగిన బంగారు పరిఘను ధరించి వస్తున్నాడు చూశావా! వాడు నికుంభుడు.

"రామా! అదిగో బాగా చూడు. చంద్రుని వంటి ప్రకాశంతో శోభిస్తున్న ధ్వజాన్ని కలిగి వస్తున్న ఆ కనకరథాన్ని చూడు. పెద్దపులుల, ఒంటెల, ఏనుగుల, గుఱ్ఱాల ముఖాలు కలిగిన భూతాలు సేవిస్తుండగా, ప్రకాశమానమైన కిరీటాన్ని ధరించి రుద్రునిలాగా దర్పంతో వస్తున్నాడే, వాడే రావణుడు. సూర్యునిలా వెలిగిపోతున్నాడే వాడే కుబేరుని జయించిన రావణుడు" అన్నాడు. ఆ మాటలను విని రాముడు విభీషణునితో ఇలా పలికాడు.

"ఆహా! ఏమి ప్రకాశము! విభీషణా! ఈ రాక్షసరాజు ఎంత తేజస్సు కలిగిఉన్నాడు? కిరణాలతో శోభించు సూర్యునిలా వెలిగి పోతున్నాడు. దేవతలకు కూడా ఇలాంటి వైభవము ఉండదు.

"ఇతని సేనానాయకులు కూడా శక్తిమంతులై కనిపిస్తున్నారు. పర్వతాలను ఢీకొనేటట్లు ఉన్నారు. వీరి మధ్యలో లంకాధిపతి యమధర్మరాజు లాగా శోభిస్తున్నాడు.

"పాపం పండి ఈ దుష్టుడు నా కంటికి కనిపించాడు. సీతాపహరణము వలన నాలో ఏర్పడిన కోపాన్నంతా ఇప్పుడు వీడిమీద కుమ్మరిస్తాను;" అని పలికి రాముడు ధనుస్సును చేతపట్టుకొని, శ్రేష్ఠమైన బాణాన్ని తీసుకున్నాడు.

రావణుడు రాక్షసుల వైపు తిరిగి, "మీరు ద్వారాల వద్ద కాపలా ఉండండి. మన మందరము ఇక్కడ ఉన్నామని తెలిసి, ఇదే అవకాశమని వానరులు లంకలో ప్రవేశించి, పట్ట ణాన్ని నాశనం చేయవచ్చు" అని పలికి, కొందరు రాక్షసుల్ని పంపేసి, పెద్దదైన తిమింగలము సముద్ర జలాలను చీల్చునట్లు వానరసైన్యాన్ని చెదరగొట్టాడు రావణుడు.

రావణుని చూడగానే పెద్ద పర్వతశిఖరాన్ని చేతపట్టుకొని రావణుని మీద కురికాడు సుగ్రీవుడు. ఆ పర్వతశిఖరాన్ని రావణునిపై విసిరాడు. రావణుడు దానిని ముక్కలుగా ఛేదించాడు. రావణుడు గొప్పదైన సర్పబాణాన్ని సంధించాడు. కుమారస్వామి భయంకరమైన శక్తి ఆయుధంతో క్రౌంచపర్వతాన్ని ఛేదించినట్లు, సుగ్రీవుణ్ణి పిడుగు లాంటి బాణంతో కొట్టాడు రావణుడు.

ఆ శరఘాతానికి పెద్దగా అరుస్తూ నేలపై పడ్డాడు సుగ్రీవుడు. సుగ్రీవుడు స్పృహతప్పి పడిపోగానే రాక్షసులు సంతోషంతో సింహనాదం చేశారు. అది చూచి గవయుడు, గవాక్షుడు,

సుషేణుడు, ఋషభుడు, జ్యోతిర్ముఖుడు, నలుడు దేహాలను పెంచారు. పర్వతాలను పెకలించారు. రావణుని మీదికి విజృంభించారు.

రావణుడు వాడియైన బాణాలతో ఆ పర్వతశిఖరాలను ముక్కలుగా ఛేదించాడు. బంగారు పొన్నులు తొడిగిన బాణాలతో వానరశ్రేష్ఠులను తీవ్రంగా కొట్టాడు. వానర వీరు లందరూ క్రిందపడి మూర్ఛిల్లారు. వెంటనే దారుణంగా శరపరంపరలను గుప్పిస్తూ భయంకరమైన వానరసైన్యాన్ని బాణాలతో కప్పేశాడు రావణుడు.

దిక్కుతోచని స్థితిలో వానరవీరులు పరిగెత్తి రాముణ్ణి శరణు జొచ్చారు. రాముడు ధనుర్ధారియై ముందుకు వచ్చాడు. లక్ష్మణుడు రామునికి అడ్డుగా నిలిచి, చేతులెత్తి నమస్కరిస్తూ ఇలా పలికాడు.

"అన్నా! ఆ దుష్టుణ్ణి వధించడం నీకు పెద్దపని కాదు. వాడ్ని నేను చంపుతాను. నాకు ఆజ్ఞ ఇవ్వు;" అన్నాడు .

"లక్ష్మణా! వెళ్ళు. జాగ్రత్తగా ఉండు. రావణుడు గొప్ప శక్తివంతుడు. యుద్ధనైపుణ్యము కలవాడు. ముల్లోకాలను కంపింపచేసే వీరుడు. ఆ విషయంలో సందేహము లేదు.

"అతనిలో ఏఏ లోపాలు ఉంటాయో గ్రహిస్తూ యుద్ధం చెయ్యి. నీలో పొరపాట్లు దొర్లకుండా చూసుకో. చూపులతో, చేతులతో నిన్ను నువ్వు రక్షించుకోవాలి;" అన్నాడు రాముడు.

రాముడు అలా చెప్పగానే రాముణ్ణి కౌగిలించుకొని, రామునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి బయలుదేరాడు లక్ష్మణుడు.

రావణుడు భయంకరములైన బాణాలతో వానరులను కూల్చేస్తున్నాడు. వానరసేనను కల్లోలం చేస్తున్నాడు. ఏనుగుతొండం వంటి బాహువులు గల అట్టి రావణుణ్ణి చూశాడు లక్ష్మణుడు.

రావణుని శరసముదాయాన్ని ఎదుర్కుంటూ హనుమంతుడు రావణుని మీదికి ఉరికాడు. రావణుని రథము ముందు నిలబడి, కుడిచెయ్యి పైకెత్తి, భయపెడుతూ ఇలా పలికాడు హనుమంతుడు.

"రావణా! నీకు గొప్ప వరాలున్నాయి. దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షసులు నిన్ను వధించుటకు వీలు లేకుండా నువ్వు వరాలు పొందావు. అలాగని బ్రతికిపోయాను అనుకోకు. వానరులు నీ వరజాబితాలో లేరు. వానరులు వధించా లనుకున్న వారి జాబితాలో నీవు చేరిపోయి ఉన్నావు.

"ఇది, ఐదువ్రేళ్ళు గల నా కుడిచెయ్యి. పైకి లేచింది. ఎందుకో తెలుసా! పంచ భూతాలతో తయారైన నీదేహం నుండి నిన్ను వేరు చేసేందుకే. అర్థమయిందా!" అన్నాడు హనుమంతుడు.

"ఓరేయ్ కోతీ! ఇంకా చూస్తావేం! కొట్టరా! రావణుణ్ణి కొట్టిన కీర్తిని పొందుతావు. ఆ తరువాత నా చేతిలో ఎలాగూ చచ్చిపోతావు. నీ కీర్తయినా బ్రతుకుతుంది;" అన్నాడు రావణుడు.

"మునుపు నీ కొడుకు అక్షుణ్ణి యమలోకానికి పంపాను. అది జ్ఞాపకం చేసుకో" అని హనుమంతుడు పలకగానే క్రుద్ధుడైన రావణుడు అరచేతితో హనుమంతుని కొట్టాడు. ఆ దెబ్బకు హనుమ తూలిపోయాడు. కొన్ని క్షణాలు అలా ఉండిపోయి, మళ్ళీ తేరుకొని రావణుని అరచేతితో కొట్టాడు. భూకంపం వచ్చినపుడు పర్వతం అదరినట్లు రావణుడు కంపించి పోయాడు. కొంతసేపు స్పృహను కోల్పోయాడు రావణుడు. స్పృహ రాగానే,

"కోతీ! మెచ్చితి నీ శక్తి! నీ పరాక్రమం చాలా గొప్పగా ఉంది. శత్రువు అయినా మన సారా మెచ్చుకుంటున్నా నిన్ను;" అన్నాడు రావణుడు. రావణుని మాటలు విని హనుమంతుడు ఇలా పలికాడు.

ధిగస్తు మమ వీర్యస్య యత్త్వం జీవసి రావణ

"ఛీ! నా పరాక్రమము కూడా ఒక పరాక్రమమేనా! నా దెబ్బతిని నువ్వింకా బ్రతికే ఉన్నావు.

"ఒరే రావణా! దుష్టుడా! డాబు కట్టిపెట్టు. నన్ను మరొకమారు కొట్టిచూడు. ఎందుకంటే, ఆ తరువాత ఎలాగూ ఉండవు. నేను పిడికిలి బిగించగానే, నువ్వు ముక్కూ నోరు బిగించేస్తావు;" అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలు రావణునిలోని పౌరుషాన్ని రెచ్చగొట్టాయి. క్రుద్ధుడైన రావణుని కళ్ళు ఎర్రబడ్డాయి. కుడిచేతి పిడికిలితో హనుమంతుని వక్షస్థలముపై కొట్టాడు.

ఆ దెబ్బకు పవనసుతుడు తూలిపోయాడు. హనుమంతుడు ఆవిధంగా సొమ్మసిల్లి పోవడం చూసి రావణుడు నీలుని మీది కురికాడు. నారాచబాణాల్ని ప్రయోగించి నీలుణ్ణి తీవ్రంగా బాధించాడు రావణుడు. నీలుడు పర్వతశిఖరాన్ని పెకలించి రావణుని మీదికి విసిరాడు.

ఈలోగా హనుమంతుడు మూర్ఛనుండి లేచాడు. యుద్ధాసక్తితో అటూ ఇటూ చూశాడు. రావణుణ్ణి వెదికాడు. రావణుడు హనుమంతునికి వెన్ను చూపుతూ యుద్ధం చేస్తున్నాడు. హనుమంతుడు నిశ్చయించుకుంటే ఒక్క క్షణంలో రావణుణ్ణి వెనుకనుండి కొట్టి వధించవచ్చు. కానీ హనుమంతుని మనస్సు దానికి అనుకూలం కాదు.

అన్యేన యుధ్యమానస్య న యుక్త మభిధావనమ్

"ఇతరులతో పోరాడుతున్న వానిపై యుద్ధానికి వెళ్ళడం ధర్మం కాదు" అని భావించాడు.

ఇలాంటి క్లిష్ట సమయాల్లోనే సంస్కారాలు బయట పడతాయి. చేతి కందుతున్నా అధర్మాన్ని అంటని వారు, అన్యాయాన్ని ముట్టనివారు మహాత్ములు. అందక పోయినా ఎగిరి అధర్మాన్ని అందుకునేవారు, అన్యాయాన్ని ఆలింగనం చేసుకొనేవారు దురాత్ములు.

హనుమంతునికి, ఇంద్రజిత్తుకు ఎంత తేడా ఉందో చూశారా! అదృశ్యంగా ఉండి ధర్మాత్ములైన రామలక్ష్మణుల్ని నాగపాశంతో ఇంద్రజిత్తు బంధిస్తే, నీలునితో యుద్ధం చేస్తున్న దురాత్ముడైన రావణుణ్ణి కొట్టడం అధర్మం అని హనుమంతుడు తనను తాను నిగ్రహించు కున్నాడు. ఆవేశాలకు ఆకృతి నిచ్చేవాళ్ళు గాక ఆవేశాలను అంతరింప చేసుకొనేవారే మహాత్ములు. వాళ్ళే నిజమైన ధైర్యవంతులు. స్థైర్యవంతులు.

స్వధర్మే స్థిరతా స్థైర్యం ధైర్య మిన్ద్రియ నిగ్రహః

"తన ధర్మము నుండి చలించకుండా ఉండుట స్థైర్యము. ఇంద్రియముల ఆవేశమును నిగ్రహించుట ధైర్యము" అని ధర్మరాజు మహాభారతంలో తెలుపుతాడు.

నీలుడు పెద్దదైన పర్వతశిఖరాన్ని రావణునిపై విసిరాడు. ఏడు బాణాలతో రావణుడు దానిని ఛేదించాడు. అది ముక్కలై పడిపోయింది. నీలుడు ప్రళయకాలాగ్నిలా విజృంభించాడు. మద్దిచెట్లను, సాలవృక్షాల్ని, పుష్పించిన చూతవృక్షాల్ని రావణునిపై విసిరాడు. వాటి నన్నిటిని ముక్కలుగా ఖండించిన రావణుడు నీలునిపై బాణవర్షం కురిపించాడు.

నీలుడు తన దేహాన్ని చాలా చిన్నదిగా చేసేసి రావణుని ధ్వజముపై వాలాడు. నీలుడు పెద్దగా అరచాడు. ధ్వజాగ్రమునందు కూర్చున్న నీలుని చూచి రావణుడు క్రుద్ధుడయ్యాడు.

ధ్వజము చివర ఉన్న నీలుడు రావణుని ధనుస్సుపై వాలాడు. చూస్తుండగనే రావణుని కిరీటముపై వాలాడు. హనుమద్రామలక్ష్మణులు నీలుని విన్యాసాలను ఆశ్చర్యంగా చూశారు. నీలుని పనులతో రావణునికి చికాకు కలిగింది. ఆశ్చర్యమూ కలిగింది. కంగారు పడుతున్న రావణుని చూచి వానరవీరు లందరూ హేళన చేస్తూ అరిచారు.

ధ్వజాగ్రముపై కూర్చుని యున్న నీలుని చూచి రావణుడు ఇలా పలికాడు. "ఓయ్ విచిత్ర వానరా! మాయలన్నీ చేస్తున్నావే! మాయమై పోతావు. జాగ్రత్త. మాయలు బాగున్నాయి గాని ఇక ప్రాణాలు రక్షించుకో!" అని పలికి ఆగ్నేయాస్త్రమును సంధించాడు.

ఆగ్నేయాస్త్రము తగిలి నీలుడు క్రిందపడ్డాడు. కానీ తేజోవంతుడైన నీలుడు మరణించ లేదు. నీలుడు క్రిందపడగానే యుద్ధాసక్తితో రావణుడు లక్ష్మణుని వైపు వెళ్ళాడు రథములో.

లక్ష్మణుని ఎదురుగా నిలబడి ధనుష్టంకారము చేశాడు రావణుడు. అది చూచి లక్ష్మణుడు ఇలా పలికాడు. "నిశాచరేంద్రా! గొప్పగా చేశావులే వానరులతో యుద్ధము! రా! నాతో చేస్తువుగాని!" అన్నాడు లక్ష్మణుడు ధనుష్టంకారము చేస్తూ.

రావణుడు లక్ష్మణునితో ఇలా పలికాడు. "లక్ష్మణా! దుర్బుద్ధీ! నీకు కాలం చేరువైంది. లేకపోతే నా కంటపడవు. నా బాణాలు నిన్ను యమలోకానికి మోసుకొని పోతాయి;" అన్నాడు రావణుడు.

"ఓరీ రావణా! పాపీ! బడాయి చాల్లే! పరాక్రమవంతులు పలవరించరు. వీరులు నీలా వాగరు. నీ బలపరాక్రమాలు నాకు తెలుసు. రా! వృథా మాటలు దేనికి?" అని లక్ష్మణుడు పలకగానే మంచి పొన్నులు గల ఏడు బాణాల్ని వదిలాడు రావణుడు. వాటిని సునాయాసంగా ఛేదించాడు సౌమిత్రి. రావణుని బాణాలు పడగలు తెగిన పాముల్లా క్రిందపడ్డాయి. మరికొన్ని బాణాల్ని ప్రయోగించాడు రావణుడు క్రుద్ధుడై. ఏమాత్రం కంగారు లేకుండా రావణుని బాణాల్ని ఛేదించాడు లక్ష్మణుడు.

వృథా అవుతున్న తన బాణాల్ని చూసి లక్ష్మణుని పరాక్రమానికి ఆశ్చర్యపడ్డాడు రావణుడు. మరికొన్ని తీక్షణమైన బాణాల్ని రావణుడు ప్రయోగించాడు. వాటిని ఛేదించి, రావణుని సంహరించడానికి పిడుగుల్లాంటి బాణాల్ని సంధించాడు లక్ష్మణుడు.

రావణుడు లక్ష్మణుని బాణాల్ని ఖండించి, బ్రహ్మ ప్రసాదించిన కాలాగ్ని వంటి శరముతో లక్ష్మణుని నొసటను కొట్టాడు. ఆ దెబ్బకు లక్ష్మణుడు కంపించిపోయాడు. ఎలాగో తేరుకొని, వాడియైన బాణంతో రావణుని ధనుస్సును ఖండించాడు లక్ష్మణుడు.

ధనుస్సును ఖండించిన లక్ష్మణుడు రావణుని మూడు బాణాలతో కొట్టాడు. ఆ దెబ్బలకు రావణుడు చలించిపోయాడు. స్పృహ తప్పి, మళ్ళీ కోలుకున్నాడు.

బ్రహ్మదేవుడు ఇచ్చిన శక్తిని చేత్తో ధరించాడు. పొగలు గ్రక్కుతున్న నిప్పులా ఉంది ఆ శక్తి. దానిని లక్ష్మణునిపై ప్రయోగించాడు రావణుడు. వానరు లందరూ అది చూచి భీతి చెందారు. లక్ష్మణు డా అస్త్రాలతో దానిని తీవ్రంగా ఎదుర్కొన్నాడు. అయినా అది ముందుకు వచ్చి లక్ష్మణుని వక్షస్థలములో గ్రుచ్చుకుంది. శక్తికి లొంగి నేలపై పడ్డాడు శక్తిమంతుడైన లక్ష్మణుడు.

రావణుడు ముందుకు పరుగెత్తి లక్ష్మణుని భుజాలు పట్టుకొని లేపబోయాడు. పర్వతాల్ని ఎత్తిన రావణుడు లక్ష్మణుని ఎత్తలేక పోయాడు. ఆత్మశక్తి చేత సౌమిత్రి రక్షింపబడ్డాడు.

హనుమంతుడు తీవ్రమైన కోపంతో పిడికిలి బిగించి రావణుని గుండెపై కొట్టాడు. ఆ దెబ్బకు కళ్ళు తిరిగి మోకాళ్ళపై కూలబడ్డాడు రావణుడు. రావణుని నేత్రాలనుండి, చెవులనుండి, ముఖంనుండి రక్తం స్రవించింది. కదలలేక రథంలో చతికిల పడ్డాడు లంకాధిపతి.

రావణుడు స్పృహ లేకుండా పడిపోవడం చూచి వానరులు అధికోత్సాహంతో అరచారు. పెద్దపెద్ద శబ్దాలు చేశారు. మూర్ఛపడిన లక్ష్మణుని భుజాలపై కెత్తుకొని రాముని వద్దకు తీసికొని వచ్చాడు హనుమంతుడు. గొప్ప బలవంతుడైన రావణుడు ఎత్తలేని లక్ష్మణుని, భక్తుడైనందున హనుమంతుడు ఎత్తుకోగలిగాడు అంటాడు వాల్మీకిమహర్షి. లక్ష్మణునికి తగిలిన ఆ శక్తి తిరిగి రావణుని వద్దకు చేరింది.

రావణునికి స్పృహ వచ్చింది. ధనుస్సును చేత పట్టుకొని నిలబడ్డాడు. లక్ష్మణుడు కూడా తేరుకున్నాడు. పరమాత్మ ధ్యానం చేయగానే లక్ష్మణుని దేహంలో గుచ్చుకున్న బాణాలన్నీ తొలగిపోయాయి.

రావణుడు బాణప్రయోగం చేసి చాలామంది వానరుల్ని నేల కూల్చేశాడు. అది చూసి రాముడు రావణుని వైపు నడిచాడు. అది చూచి హనుమంతుడు రాముని వద్దకు శీఘ్రంగా వెళ్ళి, "విష్ణుమూర్తి గరుడునిపై ఎక్కి దేవతల శత్రువును వధించునట్లు, నువ్వు నా వీపుమీద ఎక్కి రావణుణ్ణి వధించు" అన్నాడు.

రాముడు తొందరగా హనుమంతుని వీపుపై ఎక్కాడు. హనుమంతుడు ఆనందంతో పరవశించిపోయాడు.



రాముడు రావణుణ్ణి చూశాడు. ధనుష్టంకారము చేసి ఇలా పలికాడు. "రావణా! నిలువు. నిలువు. నాకు కీడు చేసిన నీకు ఎక్కడికి వెళ్తే మేలు జరుగుతుంది? బ్రహ్మాది దేవతలు కూడా నిన్ను రక్షించ లేరు. ఇంద్రాది లోకాలు కూడా నిన్ను దాచి కాపాడలేవు.

"లక్ష్మణుని మీద శక్తిని విడిచావు కదూ! నీ కుటుంబాన్నంతా సర్వనాశనం చేసేది ఆ లక్ష్మణుడే. అతడు నీ పాలిటి యముడై వస్తున్నాడు;" అన్నాడు రాముడు.

రాముని మాటలు విని కోపించిన రావణుడు, రాముని మోయుచున్న హనుమంతుని బాణాలతో కొట్టాడు. హనుమంతుడు చలించలేదు. హనుమంతుని తేజస్సు ఇంకా అధికమైంది.

భక్తుల మనసు సదా భగవంతుని మోస్తూ ఉంటుంది. భక్తుల మనసులలో భగవంతుడే ఉంటాడు. దుష్టులైనవారు భక్తుల్ని ఎంతగా హింసించినా, భక్తుల మనసులలో భగవంతుడే ఉండడం చేత వారు బాధల మధ్య పొంగుతారే గాని క్రుంగిపోరు.

నిరాయుధుడై రాముని మోస్తున్న హనుమంతుని కొట్టాడు దుష్టుడైన రావణుడు. గాయపడిన హనుమంతుని చూడగానే రామప్రభువు క్రుద్ధుడయ్యాడు.

రాముడు తీక్షణమైన బాణాలతో రావణుని రథాన్ని విరగగొట్టేశాడు. ఇంద్రుడు మేరుపర్వతాన్ని వజ్రాయుధంతో కొట్టినట్లు వాడియైన బాణాలతో రావణుని వక్షస్థలాన్ని కొట్టాడు.

పిడుగులు పడినా, వజ్రాయుధంతో కొట్టినా క్షోభకు గురికాని రావణుడు రాముని దెబ్బను భరించలేక పోయాడు. దుఃఖంతో చలించిపోయాడు. బాణాల్ని కూడా పడేశాడు.

అర్ధచంద్ర బాణంతో, ప్రకాశిస్తున్న రావణుని కిరీటాన్ని పడగొట్టేశాడు రాముడు.

రావణుడు కాంతిహీను డయ్యాడు. కోరలు తీసిన పాములా చప్పబడ్డాడు. కిరణాలు లేని సూర్యునిలా చల్లబడ్డాడు. పౌరుషమంతా పారిపోయింది. దర్పం జారిపోయింది. ముఖమే మారిపోయింది. అలా తేజోహీనుడై యున్న రావణుని చూచి రాముడు అద్భుతమైన మాటలు పలికాడు.

"రావణా! దారుణంగా పోరాడావు. వానరవీరులను చాలామందిని కూల్చేశావు. అలసిపోయినట్లున్నావు. కనుకనే నిన్ను యమసదనానికి చేర్చే బాణాన్ని ఎక్కుపెట్టడం లేదు.

**ప్రయాహి జానామి రణార్ది తస్త్వం
ప్రవిశ్య రాత్రిం చర రాజ లంకామ్
ఆశ్వస్య నిర్యాహి రథీ చ ధన్వీ
తదా బలం ద్రక్ష్యసి మే రథస్థః**

"రాక్షసరాజా! పో. వెళ్ళు. నువ్వు యుద్ధంలో బాగా అలసి ఉన్నావు. లంకకు వెళ్ళి, శ్రమ తీర్చుకొని, కొత్త ధనుస్సును చేతపట్టుకొని రా. రథస్థుడవై నా బలమేపాటిదో చూస్తువు గాని" అని పలికాడు రాముడు.

రథం కూలిపోయింది. ధనుస్సు విరిగిపోయింది. సారథి మరణించాడు. కిరీటము తొలగించబడింది. బాణము గ్రుచ్చుకొని బాధించింది. రాముని మాటలు అభిమానవంతుడైన రావణుణ్ణి క్రుంగదీశాయి. దర్పము అణగి, సంతోషం సడలి సిగ్గుతో వెనుదిరిగి లంకను చేరాడు రావణుడు.

రాముని హస్తస్పర్శతో వానరవీరులు, లక్ష్మణుడు పున: తేజోవంతు లయ్యారు. రావణుని దీనావస్థను గాంచి సంతోషించారు.

లేచాడు

రావణుడు లంకలో ప్రవేశించాడు. మనసంతా మూగబోయింది. హృదయం కల్లోలంగా ఉంది. అహంకారం అణగారింది. పౌరుషం పలాయనమైంది. సిగ లేవనంటుంది సిగ్గుతో. అంత:కరణ కుంచుకుపోయింది అవమానంతో. సింహం చేతిలో క్రుంగిన ఏనుగు లాగా, గరుడుని చేతిలో నలిగిన సర్పం లాగా రావణుడు దీనుడయ్యాడు. మెరుస్తూ వచ్చి మేనును ఛేదించిన రామబాణాలే మదిలో మెదుల్తున్నాయి. మరచి ఉండలేక, స్మరించి బ్రతకలేక బేజారెత్తి పోతున్నాడు బంధువుల మధ్య బంగారు ఆసనంలో కూర్చుని. చెడిన బ్రతుకు బంగారంలో ఉన్నా, దానికి మిగిలేది కంగారే. మెల్లగా నోరు విప్పాడు.

"మహేంద్రునితో సమానుణ్ణి. మానవుడికి తలవంచాల్సి వచ్చింది. ఏమైంది నా తపస్సు! ఏమీ కాకుండా పోయిందా? ఏదీ మిగల్చకుండా పోయిందా!

"రావణా! నరుల వల్లే నీకు నాశనం"

"అన్నాడు ఆనాడు భాషాపతి. వచ్చే లాగే ఉంది ఆ పరిస్థితి.

"దేవతల వల్లా, దానవుల వల్లా, గంధర్వుల వల్లా, యక్షుల వల్లా, రాక్షసుల వల్లా, పన్నగుల వల్లా నాకు మరణము రాకూడదని వరాలు పొందాను. నరుల వల్ల రాకూడదని అడగలేదు.

"దుష్టుడా! రాక్షసుడా! నిన్ను, నీ సంతానాన్ని, నీ మంత్రుల్ని, నీ సైన్యాన్ని, నీ గుఱ్ఱాల్ని, సారథిని రణంలో కూల్చేసే మహాపురుషుడు నా వంశములోనే పుడుతాడు రా!" అని అన్నాడు ఆనాడు ఇక్ష్వాకు వంశాధీశుడు అనరణ్యుడు. అనరణ్యుడు చెప్పినవాడు ఈ రాముడేనా?

"పూర్వము వేదవతిని అవమానించి ఆమె శాపానికి గురయ్యాను. ఆ వేదవతే సీతగా పుట్టిందా? అప్పుడు పార్వతి శపించింది. ఒకసారి నందీశ్వరుడు కూడా. అవును. రంభ కూడా

పెట్టింది శాపం. నిజమే. వరుణుని శాపం జ్ఞాపకమొస్తోంది. అవన్నీ ఏకమవుతున్నాయా, ఈనాడు.

న మిథ్యా ఋషి భాషితమ్

"ఋషుల మాటలు ఎప్పుడూ అసత్యం కావు."

"రాక్షసులారా! ఈ శాపాలన్నీ గుర్తుపెట్టుకోండి. శత్రువు విషయంలో మెలుకువగా ఉండండి. ముందుగా ఇప్పుడు మీరు వెళ్ళి కుంభకర్ణుణ్ణి నిద్ర లేపండి. అతడు మీకు తెలుసుగదా! పడుకుంటే తొమ్మిది, ఏడు, పది, ఎనిమిది మాసాలన్నా హాయిగా నిద్రపోతాడు.

"నాతో మాట్లాడి, తొమ్మిది రోజుల క్రితమే కుంభకర్ణుడు నిద్రపోయాడు. ఎలాగైనా, అతణ్ణి తొందరగా నిద్ర లేపండి. శత్రువుల్ని ఇట్టే చంపేస్తాడు. కుంభకర్ణుడు లేస్తే చాలు. రాముని చేతిలో ఈనాడు కలిగిన పరాభవాన్ని నేను మరచిపోతాను." అన్నాడు రావణుడు. రాక్షసు లందరు రావణుని మాటలు విని శీఘ్రంగా వెళ్ళారు కుంభకర్ణుని ఇంటికి.

కుంభకర్ణుడి గృహం నాలుగు వైపులా ఒక యోజనం విస్తీర్ణముంది. పెద్ద ద్వారంతో శోభిస్తోంది. ఆ ద్వారం ద్వారా లోపలికి చేరడం చాలా కష్టమైంది రాక్షసులకి. కుంభకర్ణుడు వదిలే నిశ్వాసగాలి సుడిగాలిలా వస్తూ లోపలికి వెళ్ళేవారిని బయటికి కొట్టేస్తోంది.

రాక్షసు లందరూ పరస్పరం సహాయం చేసుకుంటూ అతికష్టం మీద లోనికి వెళ్ళ గలిగారు. భయంకరమైన దేహం గల కుంభకర్ణుణ్ణి చూశారు. అడ్డానికి పడివున్న పర్వతంలా కనిపిస్తున్నాడు కుంభకర్ణుడు. అతణ్ణి లేపే ప్రయత్నం చేశారు.

అతని దేహంపై రోమాలు పడగ విప్పిన పాముల్లా లేచి ఉన్నాయి. అతని శ్వాసలు పాము బుసల్లా ఉన్నాయి. అతనికి దగ్గరగా వెళ్తువుంటే, అతని నిట్టూర్పు గాలికి రాక్షసులు గాలిపటల్లా ఎగిరి, ఆకాశంలో బొంగరాల్లా తిరుగుతున్నారు. తెరవబడి యున్న అతని నోరు పాతాళ గుహలా ఉంది. కిరీటంతోనే నిద్రిస్తున్నాడు, సుషుప్తి ప్రపంచానికి చక్రవర్తి లాగా.

అన్నం తెచ్చి గుట్టలు పోశారు. లేళ్ళ మాంసము, పంది మాంసము, దున్నపోతు మాంసము పర్వతం లాగా కుప్పలు పోశారు. పెద్దపెద్ద బిందెలలో రక్తాన్ని నింపి ఉంచారు.

అతని దేహానికి మంచిగంధం రాశారు. మల్లెపూల మాలలు వేశారు. సుగంధద్రవ్యాల్ని ఒంటికి రాశారు. ధూపం పట్టారు. పిలిచారు. అరిచారు. పొగిడారు. పాడారు.

గుఱ్ఱాల్లాగా సకిలించారు. మేఘాల్లాగా గర్జించారు. పులుల్లాగా గాండ్రించారు. గాడిద ల్లాగా ఓండ్రపెట్టారు. శంఖాలు పూరించారు. అందరూ కలిసి ఒకేసారి అరిచారు. లేవలేదు. లేస్తాడనే నమ్మకం కూడా నిద్రపోయింది.

కొట్టారు. చేతులు అతికష్టం మీద ఎత్తిఎత్తి పడేశారు. పైన ఎక్కి తొక్కారు. ముద్గరాలతో, ముసలాలతో, గదలతో కొట్టారు. బండ లెత్తి గుండెల మీద పడేశారు. సమాధానమే లేదు. పైగా దగ్గరికి చేరాలంటే శ్వాసల బెడద ఎక్కువగా ఉంది.

మృదంగాలు వాయించారు. భేరీలు మ్రోగించారు. పదివేల మంది రాక్షసులు కలిసి చేసిన ప్రయత్నా లేవీ ఫలించలేదు.

గుఱ్ఱాలను, ఒంటెలను, ఏనుగులను కొరడాలతో కొడుతూ, కట్టెలతో బాదుతూ, అంకుశాలతో పొడుస్తూ అతని దేహం మీద నడిపించారు. అన్ని అంగాలమీదా కొట్టారు. ఈ అరుపులకి, శబ్దాలకి లంకాపట్టణ మంతా కల్లోలంగా ఉంది. అయినా వారు లేవలేదు.

ఎంత చేసినా లేవకపోయేసరికి రాక్షసులకు కోపం వచ్చింది. కొన్నివేల మంది భేరీలు మ్రోగించారు. జుట్టుపీకే పని కొందరు చేపట్టారు. చెవులు కొరకడమే కొందరి కార్యము. వేలాది కుండలతో నీళ్ళు తెచ్చి చెవుల్లో పోయడమే కొందరి నిర్వాకము. అన్నీ సవ్యంగా జరుగుతున్నాయి, ఒక్క లేవడం తప్ప.

ఇక లాభం లేదు అని నిర్ణయించుకొని వెయ్యి ఏనుగుల్ని ఒకేసారి దేహంపైకి ఎక్కించారు. అవి పరిగెత్తేలా చేశారు. అప్పుడు వారిలో కొద్ది చలనం ఏర్పడింది. మెల్లగా కళ్ళు తెరిచాడు. ఆవులిస్తూ లేచాడు. అదొక కొండగాలిలా వీచింది.

కుప్పతిప్పలుగా పడిఉన్న మాంసాలను తిన్నాడు. రక్తాన్ని, మద్యమును తాగేశాడు. తృప్తిపడ్డట్లు కనిపించాడు.

రాక్షసులందరూ భయపడుతూ భయపడుతూ ముందుకు వచ్చారు. దండాలు పెట్టే వాళ్ళు, సాష్టాంగ దండప్రణామం చేసేవాళ్ళు, రెండు చేతులు పైకెత్తి నమస్కరించే వాళ్ళు - అలా అందరూ సాగలబడ్డారు.

"లేవగొట్టారు ఎందుకని? ఏమొచ్చింది? రాజుగారు క్షేమమేనా? భయమేమీ లేదుకదా! శత్రువు లెవరైనా దాడి చేశారా! అదే ఉంటుంది.

"నేనుండగా లంకాధిపతికి ఏ ప్రమాదమూ రాదు. ఇంద్రుణ్ణి కావాలంటే ఇప్పుడే తరిమిగొట్టేస్తాను. అగ్ని ముందుకొచ్చాడా! ఆర్పేస్తాను. ఏదో పెద్ద కారణం లేనిదే నన్ను నిద్రలేపరు. చెప్పండి. కారణ మేమిటో భయపడకుండా చెప్పండి." అన్నాడు కుంభకర్ణుడు. రావణుని మంత్రియైన యూపాక్షుడు కుంభకర్ణునితో ఇలా పలికాడు.

"రాజా! మాకు మానవుని వలన భయం పట్టుకొంది. ఈవిధమైన భయం మాకు గతంలో దేవతల వల్లగాని, దానవుల వల్లగాని సంభవించలేదు.

"పర్వతాకారులైన వానరులు లంకను ముట్టడించి ఉన్నారు. సీతను అపహరించడం వల్ల క్రుద్ధుడైన రాముని వలన లంక భయసాగరంలో మునిగిపోయింది.

"ఒక వానరుడు ఇటీవలే వచ్చి అశోకవనాన్నంతా నాశనం చేశాడు. లంకను కాల్చేశాడు. అక్షకుమారుణ్ణి కూల్చేశాడు. దేవతలను ఓడించిన లంకాధిపతిని యుద్ధంలో పరాభవించి, "బ్రతికిపో" అని విడిచిపెట్టాడు రాముడు;" అన్నాడు యూపాక్షుడు.

యూపాక్షుని మాటలు వినిన కుంభకర్ణుడు కళ్ళు త్రిప్పుతూ, "యూపాక్షా! వానర సైన్యాన్ని, రామలక్ష్మణుల్ని ముందుగా తుడిచేస్తా. ఆ తరువాత రాజును చూస్తా. వానరుల రక్తమాంసాలతో రాక్షసులు తృప్తి చెందుతారు. రామలక్ష్మణుల రక్తాన్ని నేనే త్రాగేస్తా" అన్నాడు కుంభకర్ణుడు.

"రాజా! రావణునితో మాట్లాడి, మంచిచెడులు ఆలోచించి, తరువాత మీరు యుద్ధానికి వెళ్తే బాగుంటుంది;" అన్నాడు మహోదరుడు. కుంభకర్ణుడు అంగీకరించాడు.

రాక్షసులు రావణుని వద్దకు వెళ్ళి కుంభకర్ణుడు లేచాడని చెప్పారు. రావణుడు సంతోషించాడు. కుంభకర్ణుని మర్యాదలతో తీసికొని రమ్మని చెప్పాడు.

కుంభకర్ణుడు లేచాడు. ముఖప్రక్షాళనం చేసికొని, స్నానం చేసి, చక్కగా అలంకరించుకొని, రాక్షసులవైపు తిరిగి, "ఏదీ?" అన్నాడు. రెండువేల కుండలతో మద్యాన్ని, పర్వతమంత మాంసాన్ని తెచ్చారు. తిన్నాడు. తేపేశాడు. అన్న దగ్గరకి బయలుదేరాడు. కుంభకర్ణుడు అడుగులు వేస్తూ ఉంటే భూమి కంపించింది.

లంకలో పర్వతం కదలినట్లు నడుస్తున్న కుంభకర్ణుని లంక బయట వున్న వానరులు చూశారు. వానరులు వణకిపోయారు. కొందరు రాముని వద్దకు పరిగెత్తారు. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. కొందరు పారిపోయారు దూరంగా. కొందరు నేలమీద పడుకున్నారు.

కుంభకర్ణుని కథ

పర్వతాకారుడై, జలపూర్ణమేఘంలా గోచరిస్తూ, కిరీటము ధరించి నడుస్తున్న కుంభకర్ణుని చూశాడు రాముడు. "పరుగే-పరుగు" అంటున్న వానరుల్ని కూడా చూశాడు. ఆశ్చర్యంతో రాముడు ఇలా ప్రశ్నించాడు.

"విభీషణా! ఈ పర్వతకాయుడు ఎవరు? మెరుపుమేఘంలా ప్రకాశిస్తున్న ఇతణ్ణి చూచి వానరులందరూ పారిపోతున్నారు. ఇంతకీ, ఎవరితడు? ఇలాంటివాణ్ణి ఇంతవరకు నేను చూడలేదు."

"వీడే కుంభకర్ణుడు. మా చిన్నన్న. కానీ యుద్ధంలో చిన్నోడు కాదు. దేహం లాగా పెద్దోడే. యముణ్ణి అటు, ఇంద్రుణ్ణి ఇటు గెలిచేశాడు యుద్ధంలో. యక్షుల్ని, నాగుల్ని, రాక్షసుల్ని, గంధర్వుల్ని, పన్నగుల్ని చిత్తుచిత్తుగా ఓడించేశాడు. వీణ్ణి చూచిన తరువాత యముడికే సందేహం కలిగింది యముడెవరని?

"రామా! రావణాదులకీ, వీడికి తేడా ఉంది. వరాల కారణంగా రావణాదులు వీరుల య్యారు. వీడు అలా కాదు. పుట్టుకతోనే శూరుడు. పుట్టగానే తినడం ప్రారంభించాడు. వల్లమాలిన ఆకలి. వేలవేల జంతువుల్ని వ్రేళ్ళతో ఆడుకుంటూ తినేశాడు.

"అది చూచి భీతిచెందిన ప్రాణులు ఇంద్రుణ్ణి ఆశ్రయించాయి. ఇంద్రుడు క్రుద్ధుడై వజ్రాయుధంతో కొట్టాడు కుంభకర్ణుణ్ణి. ఆ దెబ్బకు దిక్కులు చలించిపోయేలా బిగ్గరగా అరచి, ఐరావతము యొక్క దంతాన్ని ఊడబెరికి ఇంద్రుని వక్షస్థలము మీద కొట్టాడు. ఆ దెబ్బకు దేవేంద్రునికి కళ్ళు కనిపించలేదు.

"దేవేంద్రుని దుస్థితిని చూచి దేవతలు, ఋషులు, దానవులు కంగారు పడ్డారు. ఇంద్రునితో కలిసి అందరూ బ్రహ్మలోకానికి వెళ్ళారు. కుంభకర్ణుడు ప్రాణుల్ని తినేస్తున్నాడని, దేవతల్ని ఎదిరిస్తున్నాడని, ఆశ్రమాల్ని ధ్వంసం చేస్తున్నాడని, స్త్రీలను మానభంగం చేస్తున్నాడని బ్రహ్మదేవునికి చెప్పారు. కుంభకర్ణుడు ఇలాగే ప్రాణుల్ని తినేస్తుంటే ఇక ప్రపంచం ఖాళీ అయిపోతుందని చెప్పారు.

"బ్రహ్మదేవుడు కుంభకర్ణుణ్ణి చూశాడు. కొన్ని క్షణాలు బ్రహ్మ కూడా వీణ్ణి చూచి భయపడ్డాడు. ఇలా పలికాడు.

"కుంభకర్ణా! లోకాన్ని నాశనం చేయడానికే విశ్రవసుడు నిన్ను కన్నట్లుంది. ఈ క్షణం నుండి చచ్చినవాడిలా పడి ఉండు" అన్నాడు. బ్రహ్మదేవుడు అలా పలకగానే కుంభకర్ణుడు నేలపై పడ్డాడు. కుంభకర్ణుడు అలా పడిపోవడం చూచి కంగారుపడిన రావణుడు బ్రహ్మదేవుని ఇలా ప్రార్థించాడు.

"భగవంతా! ఏమిటిదంతా! పంటకొచ్చిన పసిడి చెట్టును పడగొట్టేస్తారా! నీ ముని మనవడే కదా! నువ్వే శాపం పెడితే ఎలా? ప్రభూ! నీ మాట వ్యర్థం కాకూడదు. అలాగని వాడి మనుగడ వృథా పోకూడదు. నీవు చెప్పినట్లే చచ్చినట్లు పడి ఉంటాడు. కానీ నిద్రకు, మెలుకువకు కాలాన్ని నిర్ణయించి చెప్పు".

"రావణా! వీడు ఆరునెలలు నిద్రపోతాడు. ఒక్కరోజు మేలుకుంటాడు. ఆ ఒక్కరోజు తినవలసిందంతా తినేస్తాడు." అని పలికాడు బ్రహ్మదేవుడు.

"రామా! రావణుడు తనకు నీవల్ల ఆపద వచ్చినట్లు గ్రహించాడు. అందుకే కుంభకర్ణుణ్ణి నిద్రనుండి లేపించాడు. వీడు ఇక యుద్ధానికి రాబోతాడు.

"కుంభకర్ణుణ్ణి చూడగానే వానరవీరులు దౌడు తీస్తున్నారే! మరి ఇలా అయితే యుద్ధంలో కుంభకర్ణుణ్ణి ఎలా ఎదుర్కొంటారు? పోనీ, ఒక పని చేస్తే ఎలా ఉంటుంది? ఇతడు పైకి లేపిన యంత్రమే గాని ప్రాణి కాదు అని చెప్తాం. దానితో వానరుల భయం పారిపోవచ్చు. వీళ్ళు పారిపోకుండా ఉంటారు;" అన్నాడు విభీషణుడు. నవ్వాడు రాముడు.

రాముడు నీలుణ్ణి పిలిచాడు. సైన్యాన్ని సిద్ధం చేయమన్నాడు. నీలుడు శీఘ్రంగా వ్యూహాన్ని నిర్మించాడు. బండలు, వృక్షాలు చేరవేసుకున్నారు వానరులు. గవాక్షుడు, శరభుడు, హనుమంతుడు, అంగదుడు లంక ద్వారాల్ని చేరారు. వానరు లందరూ, రాళ్ళు, రప్పలూ, చెట్లు, కొమ్మలు చేతపుచ్చుకొని నిలబడ్డారు.

తమ్ముా! పొమ్ము! శత్రువుని కుమ్ము!

లంకాపట్టణ వీధుల్లో కుంభకర్ణుడు నడుస్తూ ఉంటే, ఇళ్ళ నుండి, మేడల మీద నుండి అతనిపై పూలు చల్లారు రాక్షసులు. సూర్యుడు మేఘాల్లోకి వెళ్ళినట్లు కుంభకర్ణుడు రావణుని భవనంలో ప్రవేశించాడు.

స తత్తదా సూర్య ఇవాభ్రజాలం
ప్రవిశ్య రక్షోధి పతే ర్నివేశనమ్
దదర్శ దూరేఽగ్రజమాసనస్థం
స్వయంభువం శక్ర ఇవాసనస్థమ్ ॥

"అప్పుడు ఆ కుంభకర్ణుడు సూర్యుడు మేఘమండలములో ప్రవేశించినట్లు రావణుని భవనంలో ప్రవేశించి, ఇంద్రుని ఆసనముపై కూర్చుని ఉన్న బ్రహ్మదేవుని చూచినట్లు, ఆసనముపై కూర్చునియున్న అన్నను దూరం నుండి చూశాడు;" అన్నాడు వాల్మీకిమహర్షి.

ఈ శ్లోకంలో మహర్షి తన హృదయకవాటాన్ని తెరిచి ఏదో చెప్తున్నట్లు తెలుస్తోంది.

మేఘమండలంలో సూర్యుడు ప్రవేశించినట్లు కుంభకర్ణుడు రావణుని భవనంలోకి ప్రవేశించాడు. మబ్బుల్లోకి వెళ్ళగానే సూర్యుని ప్రకాశం క్షీణిస్తుంది. రావణుని గృహంలో ఇప్పుడు అడుగుపెట్టిన కుంభకర్ణుడు కూడా నశిస్తాడు అని భావము.

బ్రహ్మదేవుడు ఇంద్రుని సింహాసనముపై కూర్చుని ఉన్నట్లున్నాడు రావణుడు అనడం చాలా విచిత్రంగా ఉంది. వ్యక్తి ఒకరు. ఆసనం ఒకరిది.

బ్రహ్మదేవుడు సృష్టికార్యమును నిర్వహిస్తాడు. రావణుడుకూడా బ్రహ్మ లాగా ఈ యుద్ధాన్ని సృష్టించాడు.

ఇంద్రియాలకు ప్రభువు ఇంద్రుడు. ఇంద్రుని సింహాసనముపై బ్రహ్మదేవుని లాగా అంటే ఇంద్రియభోగాలపై మనసును నిలిపి, భోగాసక్తితో బ్రహ్మ సృష్టిని చేసినట్లు రావణుడు ఈ యుద్ధాన్ని తయారు చేశాడు అని భావము.

కుంభకర్ణుడు రావణుణ్ణి దూరం నుండి చూశాడట. ఇది దేశంలో తెలిసే దూరము కాదు. కాలము సృష్టించబోయే దూరము అనికూడా ధ్వనిస్తోంది. దగ్గరవాళ్ళు దూరమయ్యే కాలం చేరువైందని భావము.

కుంభకర్ణుణ్ణి చూడగానే రావణుడు సంతోషంతో చివుక్కున లేచాడు. కుంభకర్ణుడు అన్నగారికి పాదాభివందనం చేశాడు. "అన్నా! చెప్పు. ఏం చెయ్యాలి?" అని అడిగాడు.

రావణుడు లేచి కౌగలించుకున్నాడు కుంభకర్ణుణ్ణి. కుంభకర్ణుడు కోపముతో ఎఱ్ఱబడిన కళ్ళను త్రిప్పుతూ ఇలా పలికాడు.

"మహారాజా! నన్ను నిద్ర లేపించావు. ఎందుకని? నీకు ఎవరి వలన భయం కలిగింది? ఎవణ్ణి మట్టుపెట్టాలి? చెప్పేయ్" అన్నాడు కుంభకర్ణుడు.

రావణుని స్వభావం ఎలాంటిదో ఇక్కడ కూడా మనం గమనించవచ్చు. ఏ ఆపద వచ్చిందని నిద్రలేపావు? ఎవర్ని చంపాలి? అని తమ్ముడైన కుంభకర్ణుడు అన్నగారైన రావణుని ప్రశ్నిస్తున్నాడు.

లేపడానికి ఆపదే ఎందుకు కారణం కావాలి? సంతోషవార్త ఎందుకు కాకూడదు? కాదు. అలా కావడానికి వీల్లేదు. రావణుడికి తన భోగాసక్తే ప్రధాన విషయం. తనకు అనుగుణంగా అన్యుల్ని ఉపయోగించుకోవడం తెలుసే గాని, ఇతరుల్ని సుఖపెట్టడం తన జాతకంలో లేదు.

నిద్రలేపాడు అంటే, ఏదో ప్రమాదమొచ్చి ఉంటుంది అని భావించాడు కుంభకర్ణుడు. అన్న విషయం తమ్ముడి కన్నా బాగా తెలిసిన వారెవరుంటారు? శూర్పణఖ కూడా అరణ్యకాండములో ఇలాగే ఆలోచించింది. తన ముక్కు చెవులు పోయినా రావణుడు పట్టించుకోడేమో! సీతమ్మ అందాన్ని ముందుంచితే మురిసిపోతాడని, దానివల్ల తన కార్యం కూడా పూర్తి అవుతుందని భావించినట్లు మనం చెప్పుకున్నాం. *

రావణుడు కుంభకర్ణుని చూచి, "తమ్ముడూ! నీవేమో నిద్రలోకి జారిపోయావు. నా పరిస్థితి ఇక్కడ దిగజారిపోయింది. రాముడివల్ల నాకు కలిగిన ఆపద నీకు తెలియదు.

*చైతన్య రామాయణము.... ప్రథమ భాగము ... 438 పుట.

"రాముడు సముద్రాన్ని దాటి వచ్చి మన రాక్షసుల్ని వధిస్తున్నాడు. వానరులు విశేష సంఖ్యలో వచ్చారు. వనాల్లో వాళ్ళే. కొండల్లో వాళ్ళే. లంకనంతా బేజారెత్తించేస్తున్నారు.

"యుద్ధం భయంకరంగా సాగింది. రాక్షసులు చాలామంది మరణించారు. వానరులు కూడా తక్కువగా మరణించలేదు. ఎటొచ్చీ, రాక్షసులవైపు మరణించినవారు పేరున్నవారు. వానరులవైపు పోయినవారు ఊరుపేరూ లేని మూక. అంతే తేడా.

"తమ్ముడూ! ఇక నువ్వే దిక్కు. వాళ్ళందరినీ నీవే మట్టుపెట్టాలి. అందుకే నిన్ను లేపాను. నువ్వు వాళ్ళను లేపేయ్. నా సంపద అంతా బుగ్గిపోయింది. స్వజను లందరూ హతులయ్యారు. వయస్సు రానివాళ్ళు, వయస్సు పోయినవాళ్ళు మాత్రమే ఉన్నారు లంకలో.

"అన్న కొరకు ఈ పని చేసిపెట్టు. నాయనా! ఇంతవరకు నేను ఎప్పుడూ ఇలా అడగలేదు. ఎవ్వరినీ అడగలేదు. నువ్వంటే నాకిష్టం. అది నీకు తెలుసు. నీ పరాక్రమ మెలాంటిదో నాకు తెలుసు. దేవతలు నీకు దాసోహమన్నారు. చూపేయ్! కుంభకర్ణా! నీ పరాక్రమ మంతా చూపేయ్.

"యుద్ధమంటే నీకు ఎంతో ప్రియం. బంధువులంటే ప్రాణం. తమ్ముా! చూస్తావేం! తొందరగా పో! వాయువు శరత్కాల మేఘాన్ని చెదరగొట్టునట్లు శత్రుసైన్యాన్ని జాడిం చేయి;" అన్నాడు రావణుడు.

హితోపదేశం

రావణుని దైన్యాన్ని చూశాడు కుంభకర్ణుడు. దుఃఖవదనుడై కనిపిస్తున్న రావణుణ్ణి చూచి ఇలా పలికాడు కుంభకర్ణుడు.

"రాజా! ఈనాడు మనకు వచ్చిన ఆపద మనం ఊహించిందే. మంచి మాటను విని జీర్ణించుకోలేక పోయావు. హిత మెరుగని వానికి స్థిమితము దొరకదు. పాపాత్ముడు నరకానికి పోకుండా తప్పించుకోగలడా! నీవు చేసిన పాపకర్మలకు ఫలితం వస్తూ ఉంది.

"గర్వంతో విర్రవీగావు. అహంకారంతో చిందులేశావు. బలమున్నదని గర్వించేవాడు నీతిని విస్మరించి ముందు పనిని వెనుక, వెనుక పనిని ముందూ చేస్తాడు.

"దేశకాలాలను దృష్టిలో ఉంచుకొని, ధర్మార్థ కామాలను అనుసరించి, ఆచరించ వలసిన ధర్మాలను తెలిసికొని జీవించు వానికి అపాయము సంభవించదు. రాజైనవాడు కార్యారంభానికి ముందే బుద్ధిమంతులైన మంత్రుల్ని సంప్రదించి కార్యాన్ని నిర్ణయించుకోవాలి.

"పండితుల్ని సంప్రదించాలి, అదికూడా. పశువుల్ని కాదు. పామరుల్ని కాదు. పామరులు ఇచ్చిన సలహాల్ని పాటిస్తే ఎవరైనా పాడైపోతారు. పతనమై పోతారు.

"రాజైనవాడు శత్రువుని తక్కువగా అంచనా వేయకూడదు. అలాంటివాడు అనర్థాన్ని పొందుతాడు. పదవిని కోల్పోతాడు. అన్నా! తమ్ముడు విభీషణుడు చెప్పిందే మంచిమాట. దానిని ఆచరించు. బాగుపడతావు. లేదా, నీ ఇష్టం;" అన్నాడు కుంభకర్ణుడు.

"ఉపదేశాలు చేస్తున్నావా, గురువు లాగా! ఎందుకొచ్చిన అలసట! చెయ్యదగింది చెయ్యి చాలు. ఊక కబుర్లు ఉంటాయిలే! జరిగింది జరిగిపోయింది. అది అజ్ఞానమే కావచ్చు.

మోహమే కావచ్చు. బలపరాక్రమాల వల్ల ఏర్పడిన గర్వమే కావచ్చు. అది ఇప్పుడు చర్చించి ఏమి సాధించాలని?

"ఇప్పుడు ఏది అవసరమో దాన్ని ఆలోచించు. గడిచిన దానిని గూర్చి ఆలోచించేవారు బుద్ధిమంతులని నేను వినలేదు. పోయింది తిరిగి రాదు అనే నేను విన్నాను. నువ్వు ఇంతకీ చెప్పేదేమిటి? నేను తప్పు చేశానంటావు. అంతేనా! నా పొరపాటు వల్లే జరిగిందనుకుంటాం. నీ పరాక్రమంతో సరిచేస్తే పోదా!

స సుహృద్యో విపన్నార్థం దీనమభ్యుప పద్యతే
స బన్ధు ర్యోఽపనీతేషు సాహాయ్యా యోప కల్పతే

"ఆపదలో ఆదుకొనేవాడే మిత్రుడు. హితుడు. దీనుడైన వాణ్ణి త్యజించని వాడే బంధువు. అక్కరకు రానివాడు ఏమి చుట్టం?" అని పలికి గంభీరంగా ఉండిపోయాడు రావణుడు.

రావణుడికి కోపం వచ్చిందని కుంభకర్ణుడు గ్రహించాడు. మనసులో చాలా క్రుంగిపోతున్నాడని తెలుసుకున్నాడు. రావణునికి ధైర్యం చెబుతూ ఇలా మాట్లాడాడు కుంభకర్ణుడు.

"మహారాజా! బాధపడకు. దేనికి విచారం! శాంతించు. కోపాన్ని విడిచిపెట్టు. నేనింకా బ్రతికే ఉన్నాను. నీకెందుకు భయం! నీకెందుకు బాధ! నీ బాధకు కారణమైన వాడు భూమిపై ఉండడు.

"నేను నీకు తమ్ముణ్ణి. నీ మేలు కోరేవాణ్ణి. అలాగని చెప్తానే గాని నీకు బోధించాలని కాదు. ఆపద సమయంలో ఆప్తుడైన వాడు ఏది చెయ్యాలో అది నేను చెప్పను. చేసి చూపిస్తా.

"అన్నా! చూస్తువుగాని. యుద్ధంలో రామలక్ష్మణులు బతికి బట్టగట్టలేరు. రామలక్ష్మణులు కళ్ళు మూయగానే కపులందరూ ఉచ్చులు త్రెంచుకొని ఉడాయిస్తారు.

"రాముడి తలను త్రుంచేసి, చేతపట్టుకొని వచ్చి, నీకు చూపిస్తాను. నీవు సంతోషిస్తావు. సీత గోలపెట్టేస్తుంది. బంధువుల్ని పోగొట్టుకొని శోకసముద్రంలో మునిగియున్న రాక్షస కుటుంబాలన్నీ సంతోషిస్తాయి. వాళ్ళందరి కన్నీళ్ళను మాయం చేస్తాను.

"పర్వతంలా ప్రకాశించే ఆ సుగ్రీవుణ్ణి నరికేస్తాను. నువ్వెందుకు భయపడతావు? రాముణ్ణి గూర్చి ఎందుకు ఆలోచిస్తావు? నన్ను చంపికదా రాముడు నీవద్దకు రావాలి.

"నేను పోతున్నా పోరుకి. నాతోపాటు ఎవరినీ పంపనక్కరలేదు. నీ శత్రువు లందరినీ నశింప చేస్తా. రానీ ఇంద్రుణ్ణి. కుబేరుణ్ణి కూడా రానీ. అగ్ని వరుణాదుల్ని కూడా రానీ. అందరినీ నేనొక్కణ్ణే మట్టుపెట్టేస్తా. మట్టి కరిపిస్తా.

"అన్నా! ఆయుధా లుపయోగిస్తే ఎవరైనా చంపగలరు. నాకు ఆయుధాలు అవసరం లేదు. నా చేతులే నాకు ఆయుధాలు. బాణాలు నాకెందుకు? నా పిడికిలిపోటు పడిన తరువాత రాముడు బ్రతికుంటే అప్పుడు చూద్దాం.

"భ్రాతా! భ్రాంతిని, భయాన్ని త్యజించు. నేను వెళ్తున్నాను. రాముణ్ణి కూల్చేస్తాను. లక్ష్మణుణ్ణి పుడ్చేస్తాను. వానరుల్ని ఊదేస్తాను. సుగ్రీవుణ్ణి చంపేస్తాను. హనుమంతుణ్ణి కాల్చేస్తాను. నువ్వు భయపడకు. దేవతలు ఎదురొచ్చినా వారుకూడా భూమిమీద పడుకోవలసిందే.

"యముణ్ణి కట్టేస్తాను. అగ్నిని కొట్టేస్తాను. ఇంద్రుణ్ణి పడగొట్టేస్తాను. సూర్యుణ్ణి మ్రింగేస్తాను. సముద్రాన్ని తాగేస్తాను. పర్వతాల్ని పిండి చేస్తాను. భూమిని చీల్చేస్తాను. చంద్రుణ్ణి చరిచేస్తాను. చుక్కల్ని రాల్చేస్తాను. కుంభకర్ణుని ప్రతాప మేమిటో ఇప్పుడు తెలుస్తుంది.

"నేను పోతున్నా. ఇక నువ్వు కానీ. ఆడుకో. పాడుకో. ఆనందంగా జీవించు. మద్యాన్ని మ్రింగేయి. నీ ఇష్టమొచ్చినట్లు చరించు. రాముడు యమునికి వశమవుతాడు. సీత నీకు వశపడుతుంది. అంతా ఈరోజే జరిగిపోతుంది" అని పలికాడు కుంభకర్ణుడు.

కుంభకర్ణుని మాటలు వాడిపోయిన రావణుని ముఖాన్ని మందహాసంతో వికసించేలా చేశాయి. "తమ్ముడా! బలపరాక్రమాలలో నీతో సమానుడు లేడు. శత్రువుల్ని సంహరించు. జయాన్ని సాధించిపెట్టు. అందుకే నిన్ను నిద్రలేపించాను.

తద్గచ్ఛ శూలమాదాయ పాశహస్త ఇవాంతకః
వానరాన్ రాజపుత్రౌ చ భక్షయాదిత్య తేజసౌ ॥

"అందుచేత పాశమును పట్టుకున్న యమునిలాగా శూలమును ధరించి వెళ్ళు. వానరులను, ఆదిత్యుని వంటి ప్రకాశముగల ఆ రాజపుత్రులను భక్షించు" అన్నాడు రావణుడు. మొత్తానికి ఎంతో తేలికపడ్డాడు.

కుంభకర్ణుడు బంగారుకాంతితో ప్రజ్వలించుచున్న శూలాన్ని గ్రహించాడు. అది సహజంగానే మండుతూ ఉంది. అది శత్రువుల రక్తంతో మరీ శోభిస్తుంది. శూలాన్ని పట్టుకొని కుంభకర్ణుడు ఒంటరిగా యుద్ధానికి బయలుదేరాడు. సైనికులను వెంటబెట్టుకొని వెళ్ళమని రావణుడు సలహా ఇచ్చాడు.

మధ్యమధ్య మణులు పొదగిన గొప్ప హారాన్ని కుంభకర్ణుని మెడలో వేశాడు రావణుడు. ఉంగరాలతో, చంద్రహారంతో తమ్ముని అలంకరించాడు. కుంభకర్ణుడు హోమాగ్నిలా వెలిగిపోతున్నాడు. క్షీరసాగరమథనంలో వాసుకిచేత చుట్టబడిన మందరపర్వతం లాగా గోచరించాడు కుంభకర్ణుడు.

బంగారు కవచాన్ని ధరించాడు. అన్న యైన రావణునకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి, ఆలింగనం చేసుకున్నాడు. రావణుడు తమ్ముని ఆశీర్వదించాడు.

కుంభకర్ణుడు బయలుదేరాడు రణరంగానికి. శంఖముల ధ్వనులు, దుందుభుల శబ్దాలు, మృదంగ రవములు మిన్నుముట్టాయి. గొప్ప గొప్ప ఏనుగులు, గుఱ్ఱాలు, మేఘశబ్దం గల రథాలు కుంభకర్ణుణ్ణి అనుసరించి వెళ్ళాయి. శూలాలు, గండ్రగొడ్డళ్ళు, భిందుపాలాలు, పరిఘలు, గదలు పుచ్చుకొని పదాతులు కదం తొక్కారు.

కుంభకర్ణుడు ఒక అద్భుతమైన రూపాన్ని ధరించాడు. అతని దేహము చుట్టుకొలత 180 మీటర్లు. ఎత్తు వెయ్యిన్నీ ఎనభై మీటర్లు. నేత్రాలు బండి చక్రాల్లా ఉన్నాయి. ఒక పర్వతం లాగా గోచరిస్తున్నాడు. కుంభకర్ణుడు రాక్షసుల్ని చూసి ఇలా పలికాడు.

"రాక్షసులారా! అగ్ని మిడతల్ని కాల్చేసినట్లు వానరసేననంతా దగ్ధం చేసేస్తాను. వానరులతో నాకు విరోధ మేముంది? మనవంటి గొప్పవాళ్ళ సుందర ఉద్యానవనాల్లో ఒకవిధంగా చెప్పాలంటే అలంకారం కూడా.

"లంకను ముట్టడించడానికి రామలక్ష్మణులే కారణము. రాముణ్ణి వధిస్తే అందరినీ చంపినట్లే. ముందు రాముణ్ణే తెగటార్చేస్తాను." అని కుంభకర్ణుడు పలుకుతుండగా రాక్షసులు భయంకరంగా అరచారు.

సైన్యం బయలుదేరింది. ఆకాశంలో గాడిద రంగు మబ్బు లేర్పడ్డాయి. సముద్రం కల్లోలమైంది. పక్షులు గుండ్రంగా అప్రదక్షిణం చేశాయి. కుంభకర్ణుని శూలం మీద గ్రద్ద వాలింది. వాటిని కుంభకర్ణుడు గమనించాడు. అయినా లెక్క చేయకుండా ముందుకెళ్ళాడు. వానరసేనను చూశాడు. కుంభకర్ణుణ్ణి చూడగానే వానరులు దిక్కులు అర్థంగాక అటూ ఇటూ పరిగెత్తారు. వారిని చూచి మేఘగర్జనం చేశాడు కుంభకర్ణుడు. ఆ శబ్దానికి కళ్ళు తిరిగి పడిపోయారు కొందరు వానరులు.

రణరంగంలో కుంభకర్ణుడు

శూలాన్ని చేతపట్టుకొని ప్రళయకాల యమునివలె విజృంభించిన కుంభకర్ణుని చూచి నలుడు, నీలుడు, కుముదుడు, గవాక్షుడు మొదలైన వీరులందరూ పరుగుపందెంలో లాగా పారిపోతున్నారు.

అంగదుడు వారిని చూశాడు. "ఆగండి. మీదెలాంటి వంశం! ఎలాంటి పరాక్రమం! పరుగు తప్ప అన్నిటినీ మరచినట్లున్నారే. ఎందుకు పారిపోతున్నారు. మీ ప్రాణాలకు ముప్పేమీ రాలేదు. ఇతడు రాక్షసుడు కాడు. బొమ్మ. మనల్ని భయపెట్టడానికి తయారుచేసి వదిలారు. ఈ బొమ్మను చితకగొట్టి రాక్షసుల్ని బేజారెత్తిస్తాం. పదండి;" అన్నాడు.

అతికష్టం మీద గుండెల్ని పట్టుకొని వృక్షాలను చేతిలో ధరించి ఒకచోట గుమిగూడారు వానరులు. బొమ్మేకదా అనుకొని, తిరిగివచ్చి కుంభకర్ణుణ్ణి వృక్షాలతో కొట్టారు వానరులు.

పెద్దపెద్ద పర్వతశిఖరాలను విసిరినా, పెద్ద వృక్షాలతో కొట్టినా కుంభకర్ణుడు ఏ మాత్రమూ చలించలేదు. అతని దేహం మీద పడిన బండలు ముక్కలై దుమ్ములా లేస్తున్నాయి. చెట్లు విరిగి నేలపై పడుతున్నాయి.

కుంభకర్ణుడు విజృంభించి వానరుల్ని వధించేశాడు. అగ్ని వనాన్ని దహించినట్లు వానరుల్ని కాల్చిపడేశాడు. ఇది చూచి కొందరు వానరులు పరుగెత్తి సముద్రంలో పడిపోయారు. కొందరు ఆకాశంలోకి ఎగిరిపోయారు. కొందరు వచ్చిన సేతువునే వేగంగా దాటి వెళ్ళారు. భల్లూకవీరులు పర్వతాల మీదికి పారిపోయారు. కొందరు గుహల్లో దూరారు. కొందరు మరణించినట్లు నటిస్తూ నేలపై పడుకున్నారు.

భయపడి పారిపోతున్న వానరుల్ని చూచి అంగదుడు ఇలా పలికాడు. "ఆగండి. వానర వీరులారా! వెనక్కి రండి. పారిపోకండి. భయపడిన వారికి బ్రతుకులో సుఖముండదు. యుద్ధములో వెన్ను చూపి పారిపోయిన పిరికివాళ్ళని ఎవ్వరూ గౌరవించరు.

దారా హ్యుప హసిష్యన్తి స వై ఘాతః సు జీవతామ్

"మిమ్మల్ని చూచి మీ భార్యలు కూడా అపహాస్యం చేస్తారు. బాగా బ్రతికిన వాళ్ళకి దానికన్నా చావే నయం కదా!

"సామాన్యమైన కోతులలాగా మనం ప్రవర్తించ కూడదు. మన వంశగౌరవాన్ని, మన నాగరికతని మనం కాపాడుకోవాలి. యుద్ధానికి వచ్చేటప్పుడు "కొట్టేస్తాం - కొరికేస్తాం" అంటూ డాబులు చెప్పారే! ఏమైనాయి అవన్నీ.

"పిరికిపందలకు లోకంలో మిగిలేవి నిందలే. మంచివాళ్ళు పూర్వం ఎలా నడిచారో అలా నడవడమే మనకు శ్రేయస్కరం. మన ఆయుర్దాయము తీరిపోతే ఎక్కడున్నా మరణిస్తాము. అలాంటిది యుద్ధంలో వీరుడిలా మరణిద్దాము. దానివల్ల మనకు స్వర్గప్రాప్తి కల్గుతుంది.

అవాప్న యామః కీర్తిం వా నిహత్వా శత్రుమాహవే
నిహతా వీరలోకస్య భోక్ష్యామో వసు వానరాః

"వానరవీరులారా! యుద్ధంలో శత్రువుని వధించామా! కీర్తిని పొందుతాము. మరణించామా! వీరస్వర్గాన్ని చేజిక్కించుకుంటాం.*

"వీరులారా! రాముడి కళ్ళల్లో పడ్డంత వరకే ఉంటాడు కుంభకర్ణుడు. మనం యుద్ధం చేద్దాం పదండి" అన్నాడు అంగదుడు. అంగదుని మాటలను విన్న వానరవీరులు విచిత్రంగా సమాధాన మిచ్చారు అంగదునికి.

"చాలు చాలు. కుంభకర్ణుడు చంపేస్తున్నాడు. నిలబడే సమయం ఇదికాదు. ప్రాణంమీద తీపి లేనిది ఎవరికి?" అని ఇంకా ఏదో చెప్పబోయి సమీపిస్తున్న కుంభకర్ణుణ్ణి చూచి కాలికి చేతనైనంత బుద్ధి చెప్పారు.

అంగదుడూ మళ్ళీ ప్రయత్నించి వాళ్ళని ఆపాడు. రాముని శౌర్యాన్ని వివరించాడు. ఈలోగా హనుమంతుడు వచ్చాడు. ఋషభుడు, శరభుడు, మైందుడు, ధూమ్రుడు, నీలుడు, కుముదుడు, సుషేణుడు, గవాక్షుడు, ద్వివిదుడు, పనసుడు వచ్చారు. అందరూ కలిసి కుంభకర్ణుని మీదికి వెళ్ళారు.

కుంభకర్ణుడు కూలిపోయాడు

పెద్దపెద్ద వృక్షాలను, పర్వతశిఖరాలను చేతపుచ్చుకొని కుంభకర్ణునిపై పడ్డారు వానర వీరులు. కోపించిన కుంభకర్ణుడు గదను చేతపట్టుకొని వానరులను భయంకరంగా హింసించాడు. గదతో కొడుతూవుంటే ఒకొక్క దెబ్బకు ఏడువందలు, ఎనిమిది వందలు, వెయ్యి చొప్పున వానరులు రాలిపోయేవారు.

కుంభకర్ణుడు ఒకొక్కసారి ఎనిమిది మందిని, పదిమందిని, ఇరవైమందిని, ముప్పైమందిని పిడికిటితో పట్టుకొని నోట్లో వేసుకొని శెనగల్ని నమిలినట్లు నమిలేస్తున్నాడు. సర్పాలను తినేసే గరుత్మంతుని లాగా యుద్ధభూమిలో తిరిగాడు.

వానరులు అతికష్టంతో యుద్ధం చేయసాగారు. ద్వివిదుడు పర్వతశిఖరాన్ని పెకలించి కుంభకర్ణుని మీదికి పరుగెత్తాడు. ఆ పర్వతశిఖరాన్ని కుంభకర్ణుని పైకి విసిరాడు. అది కుంభకర్ణుని చేరకుండానే మధ్యలో సైన్యం మీద పడిపోయింది. గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు దాని క్రిందపడి శిథిలము లయ్యాయి. రాక్షసులు అనేకమంది వానరులను వధించారు.

*భగవద్గీత - సాంఖ్యయోగము - 37వ శ్లోకాన్ని పోల్చుకోండి.

హనుమంతుడు గగనాన నిలిచి కుంభకర్ణునిపై బండలను, పర్వతశిఖరాలను వది లాడు. వృక్షాలను వర్షింపచేశాడు. వాటి నన్నిటిని శూలముతో భగ్నం చేశాడు కుంభకర్ణుడు. అంతటితో ఆగలేదు. శూలమును చేతపుచ్చుకొని ప్రళయకాలాగ్ని లాగా వానరవీరులపై పడ్డాడు.

హనుమంతుడు అది చూచి, పర్వతశిఖరాన్ని చేతపట్టుకొని వానరసైన్యము మీదికి వస్తున్న కుంభకర్ణుని అడ్డగించాడు. ప్రజ్వలిస్తున్న శూలముతో హనుమంతుని వక్షస్థలము మీద కొట్టాడు కుంభకర్ణుడు. ఆ దెబ్బకు చలించిన హనుమంతుడు ప్రళయకాల మేఘంలా గర్జించాడు. కుంభకర్ణుడు హనుమంతుని కొట్టడం చూసి సంతోషించిన రాక్షసులు పెద్దగా ధ్వని చేశారు. వానరులు మాత్రము భీతిచెంది కుంభకర్ణునికి దూరంగా పారిపోయారు. నీలుడు వారికి ధైర్యం చెప్పి ఆపాడు.

క్రుద్ధుడైన నీలుడు కుంభకర్ణునిపై ఒక పర్వతశిఖరాన్ని విసిరాడు: దానిని కుంభకర్ణుడు పిడికిలితో కొట్టగానే అది చూర్ణమై నేలపై పడింది. ఋషభుడు, శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాదనుడు ఒక్కసారిగా ఉరికారు కుంభకర్ణుని పైకి. వృక్షాలతో, రాళ్ళతో, పిడికిళ్ళతో, చేతులతో, పాదాలతో అన్నివైపుల నుండి పీడించారు. అవన్నీ కుంభకర్ణునికి స్పర్శమాత్రంగానే ఉండిపోయాయి. ఏమాత్రము చలించలేదు ఆ పర్వతకాయుడు.

కుంభకర్ణుడు ఋషభుణ్ణి చేతులతో పట్టుకున్నాడు. నలిపేసి క్రిందపడేశాడు. ముఖము నుండి రక్తము కారుతూ ఉండగా ఋషభుడు నేలపై పడ్డాడు.

కుంభకర్ణుడు విజృంభించి శరభుణ్ణి పిడికిలితో కొట్టాడు. నీలుణ్ణి మోకాలితో కుమ్మాడు. గవాక్షుణ్ణి అరచేతితో చరిచాడు. గంధమాదనుణ్ణి పాదంతో తొక్కాడు. ఆ దెబ్బలకు వానరు లందరూ ఖండించిన వృక్షాలలాగా క్రిందపడి కింశుక వృక్షాలా అన్నట్లు కనిపించారు. అదిచూచి వేలాదిమంది వానరులు కోపంతో కుంభకర్ణుని మీదికి వెళ్ళారు.

కొందరు అతని మీదికి ఎక్కారు. కొందరు క్రిందనుండే హింసించ సాగారు. గోళ్ళతో గీకారు. దంతాలతో కొరికారు. కోరలతో కరిచారు. చేతుల్తో బరికారు. పిడికిళ్ళతో పొడుస్తూ కొట్టారు.

రరాజ రాక్షస వ్యాఘ్రో గిరిరాత్మ రుహైరివ

వానరులు కుంభకర్ణుని మీదికి ఎక్కగానే చెట్లతో కూడిన కొండలాగా శోభించాడు కుంభకర్ణుడు.

వానరుల్ని పిడికిలితో బంధించి కుంభకర్ణుడు నోట్లో వేసుకోగానే, అతని ముక్కు రంధ్రాల నుండి, చెవులనుండి వానరులు చాలామంది దేహాలు దులుపుకుంటూ బైటికి వచ్చేశారు.

వజ్రాయుధం ధరించిన ఇంద్రుని లాగా, పాశమును హస్తమునందు ధరించిన యముని లాగా, శూలమును పట్టుకొని వానరసైన్యాల్ని నాశనం చేశాడు కుంభకర్ణుడు. భీతిచెందిన వానరు లందరూ రాముని శరణుజొచ్చారు.

అంగదుడు వానరుల దుఃఖాన్ని చూచి కుంభకర్ణుని మీదికి పరుగెత్తాడు. ఒక పర్వత శిఖరాన్ని కుంభకర్ణుని పైకి విసురుతూ అడ్డం వచ్చిన రాక్షసుల నందరినీ సంహరించాడు.

కుంభకర్ణుడు అంగదుని మీదికి ఉరికాడు. శూలాన్ని అంగదుని పైకి విసిరాడు. అది తన మీద పడకుండా అంగదుడు తప్పించుకున్నాడు. వెంటనే ఎగిరి కుంభకర్ణుని గుండెలపై బలంగా కొట్టాడు అంగదుడు. ఆ దెబ్బకు కొన్ని క్షణాలు అటూ ఇటూ తూలాడు కుంభకర్ణుడు.

కుంభకర్ణుడు తేరుకొని అంగదుని పిడికిలితో కొట్టగా అంగదుడు క్రిందపడి మూర్ఛిల్లాడు. అంగదుడు పడిపోగానే, సుగ్రీవుడు పర్వతశిఖరాన్ని చేతపట్టుకొని కుంభకర్ణుని మీదికి వెళ్ళాడు.

"కుంభకర్ణా! వానరులను చాలా మందిని వధించావు. భక్షించావు. గొప్ప వీరుడనే పేరొస్తుందిలే. పాపం! సామాన్యులైన ఆ వానరుల విషయ మెందుకు? ఇదిగో నేను విసురుతున్న పర్వతశిఖరాన్ని తట్టుకో" అంటూ పర్వతశిఖరాన్ని కుంభకర్ణుని గుండెలపై విసిరాడు. అది పొడిపొడిగా రాలిపోయింది. అది చూచి వానరు లందరూ భీతి చెందారు. రాక్షసులు సంతోషంతో కేకలు వేశారు.

"సుగ్రీవా! నువ్వు బ్రహ్మకు పౌత్రుడివి. ఋక్షరజస్సు కుమారుడివి. శక్తిమంతుడివి. ఎందుకు అలా వాగుతున్నావు. కాచుకో" అంటూ మెరుపు వంటి శూలాన్ని సుగ్రీవునిపై విసిరాడు. ఆ శూలాన్ని పట్టుకొని, మోకాలుపై ఉంచి, దాన్ని విరిచేశాడు సుగ్రీవుడు.* అది చూచి వానరవీరు లందరు ఆనందంతో ఊగిపోయారు. కుంభకర్ణుడు కొద్దిగా భీతిచెందాడు. కుంభకర్ణుడు రణరంగంలో ప్రవేశించిన తరువాత ప్రథమంగా భయపడిన సన్నివేశ మిదే.

శూలము విరిగిపోగానే భయకంపితుడైన కుంభకర్ణుడు కంగారుపడుతూ ఒక పర్వత శిఖరమును పెకలించి, సుగ్రీవుని కొట్టాడు. సుగ్రీవుడు స్పృహతప్పి పడిపోయాడు.

కుంభకర్ణుడు సుగ్రీవుని ఎత్తుకొని లంకవైపు వెళ్తున్నాడు. మహామేఘంలా శోభించే సుగ్రీవుని కుంభకర్ణుడు ఎత్తుకొని పోతూవుంటే, మేఘాలు కమ్మిన మేరుపర్వతం లాగా ప్రకాశించాడు. "ఇతడ్ని చంపేస్తే రాముడుతో సహా అతని సైన్యం కూడా నశిస్తుంది" అని భావిస్తూ కుంభకర్ణుడు సుగ్రీవుని తీసుకొనిపోయాడు. అది చూచి వానరసైన్య మంతా భయంతో వణకిపోయింది.

హనుమంతుడు ఇలా ఆలోచించాడు: "రాజైన సుగ్రీవుని కుంభకర్ణుడు తీసుకొని పోతున్నాడు. ఇప్పుడు నేను ఏం చెయ్యాలి? పర్వతమంత రూపాన్ని ధరించి కుంభకర్ణుని వధించేస్తాను. సుగ్రీవుని విడిపిస్తాను. అలా చేయడం వల్ల వానరుల్లో ఈ క్షణాన చోటు చేసుకొనియున్న భయము అంతరిస్తుంది.

"కానీ, సుగ్రీవుడు గొప్ప బలశాలి. దేవతలు కూడా అతణ్ణి బంధించలేరు. సుగ్రీవుడు బహుశ స్పృహతప్పి ఉండొచ్చు. కనుకనే కుంభకర్ణుడు సులభంగా ఎత్తుకొని పోతున్నాడు. స్పృహ రాగానే సుగ్రీవుడు తనను తానే విడిపించుకోగలడు.

మయా తు మోక్షిత స్యాస్య సుగ్రీవస్య మహాత్మనః
అప్రీతిశ్చ భవేత్కష్టా కీర్తినా శ్చ శాశ్వతః

*కుంభకర్ణుడు విసిరిన శూలాన్ని మధ్యలో హనుమంతుడు అందుకొని విరిచినట్లు పాఠాంతరముంది. కొన్ని ప్రతులలో అలా ఉన్నా, సుగ్రీవుడు విరిచినట్లు చెప్పినదే సత్యములా కనిపిస్తోంది - రచయిత.

"మహాత్ముడైన ఈ సుగ్రీవుని నేను విడిపించగలను కానీ అది సుగ్రీవునికి ఇష్టం కాకపోవచ్చు. అలా చేయడం వల్ల శాశ్వత అపకీర్తి కూడా కలుగుతుంది.

"కొంతకాలము వేచి చూస్తాను. సుగ్రీవునికి స్పృహరాని పక్షంలో అప్పుడు వెళ్ళి విడిపిస్తాను. ఈలోగా భయాందోళనలకు గురైన వానరులకు ధైర్యం చెబుతాను" అని ఆలోచించాడు. వానరుల హృదయాలలో భయతిమిరాలను పారద్రోలి ధైర్యదీపాలు వెలిగించాడు.

సుగ్రీవునికి స్పృహ వచ్చింది. కుంభకర్ణుడు తనను ఎత్తుకొని రాజవీధిలో పోతున్నట్లు గ్రహించాడు సుగ్రీవుడు. ఇపుడు ఎలా ప్రవర్తిస్తే వానరు లందరికీ అంగీకారం గాను, సంతోషం గాను ఉంటుందో అది చేయాలని ఆలోచించుకున్నాడు.

సుగ్రీవుడు చివుక్కున లేచి వాడియైన గోళ్ళతో కుంభకర్ణుని చెవుల్ని, దంతాలతో ముక్కుని, పాదాలతో పక్కల్ని, డొక్కల్ని చీల్చేశాడు. కుంభకర్ణుని దేహమంతా రక్తసిక్తమైంది. క్రుద్ధుడైన కుంభకర్ణుడు సుగ్రీవుణ్ణి నేలమీద విసిరికొట్టాడు. సుగ్రీవుడు బంతిలాగా ఎగిరి రాముని వద్దకు వచ్చాడు.

ముక్కు, చెవులు పోగానే కుంభకర్ణుని దేహం నుండి రక్తం సెలయేళ్ళ లాగా ప్రవహించింది. శరీరమంతా రక్తసిక్తం కావడం వల్ల కాటుకకొండ లాంటి కుంభకర్ణుడు సంధ్యారుణ మేఘం లాగా ప్రకాశించాడు.

కుంభకర్ణుడు కోపంతో కంపించిపోయాడు. మళ్ళీ యుద్ధానికే వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. ఆయుధము చేతిలో లేనందున ఒక ముద్గరాన్ని ఆయుధంగా ధరించాడు. ప్రళయకాలాగ్ని వలె వానరుల్ని పీడించేశాడు. పట్టిపట్టి నమిలి మ్రింగేశాడు. క్రోధంతో, బాధతో, ఆకలితో దిక్కుతోచని ఆ రాక్షసుడు వానరులతోపాటు రాక్షసుల్ని కూడా మ్రింగేశాడు. వానరులు రాముని శరణుజొచ్చారు.

కుంభకర్ణుని చూచి క్రుద్ధుడైన లక్ష్మణుడు యుద్ధానికి బయలుదేరాడు. కుంభకర్ణునిపై శరపరంపరలు కుప్పించాడు. లక్ష్మణుడు ప్రయోగించిన ఏడు బాణాలు కుంభకర్ణుని గుండెపై లోతుగా దిగాయి. వాటిని పీకి పారేశాడు కుంభకర్ణుడు.

లక్ష్మణుడు వాయువేగంతో మరికొన్ని బాణాలు విడిచాడు. లక్ష్మణుని బాణసముదాయము చేత కప్పబడిన కాటుకకొండ లాంటి ఆ రాక్షసుడు సూర్యుడు మేఘములతో, కిరణములతో ప్రకాశించునట్లు కనిపించాడు. మబ్బు ఉరిమినట్లు కుంభకర్ణుడు లక్ష్మణునితో ఇలా పలికాడు.

"యుద్ధములో నన్ను ఎదుర్కోవడానికి యముడు కూడా భయపడతాడు. అట్టి నాతో తలపడి నీ వీరత్వాన్ని ప్రదర్శించావు. దేవేంద్రుడు కూడా మునుపెన్నడూ ఇలాంటి ధైర్యము చేయలేదు. నీ పరాక్రమాన్ని, పౌరుషాన్ని చూసి సంతోషించాను. కనుక నిన్ను విడిచి పెడ్తున్నాను. రాముణ్ణి వధిస్తాను. అతణ్ణి చంపేస్తే సేననంతా చంపేసినట్లే అవుతుంది;" అన్నాడు కుంభకర్ణుడు. అది విని లక్ష్మణుడు ఇలా పలికాడు.

"బాగుంది. ఆత్మస్తుతికి కొరతే లేదు నీ దగ్గర. చూచాను నీ పరాక్రమ మంతా. అక్కడ చూడు. అతడే రాముడు" అని లక్ష్మణుడు రాముని చూపించగనే కుంభకర్ణుడు రాముని మీదికి పరుగెత్తాడు.

రాముడు రౌద్రాస్త్రముతో కుంభకర్ణుని వక్షస్థలముపై కొట్టాడు. ఆ దెబ్బకు కుంభకర్ణుని ముఖము నుండి అగ్నిజ్వాలలు బయల్వెడలినాయి. గొప్పగా గర్జించి, పెద్దగా కేకలేస్తూ రాముని వైపునకు పరుగెత్తాడు కుంభకర్ణుడు. ఒక పెద్ద పర్వతశిఖరాన్ని రామునిపైకి విసిరాడు. ఏడు బాణాలతో రాముడు దానిని కూల్చేశాడు.

క్రుద్ధుడైన కుంభకర్ణుడు మదగజము వలె విజృంభించి వానరుల్ని పట్టుకొని భక్షించడం ప్రారంభించాడు. అది చూచి రాముడు వానరసేనలోకి వెళ్ళాడు. ధనుష్టంకారము చేశాడు. ఆ శబ్దానికి కంగారుపడిన కుంభకర్ణుడు కోపంతో రాముని మీదికి లగెత్తాడు.

"కుంభకర్ణా! రా! నేనే రాముణ్ణి. క్షణంలో నీ ప్రాణాల్ని తీయడానికి సిద్దంగా ఉన్నాను. రా!" అన్నాడు రాముడు. మహాకోపంతో మేఘగర్జనం చేసి,

"ఓయ్! రామా! నన్నెవరనుకుంటున్నావు? విరాధు డనుకున్నావా? కబంధు డనుకున్నావా! వాలి అని భ్రమించావా! మారీచుడని కలగంటున్నావా? బాగా చూడు. నీ ముందున్నది కుంభకర్ణుడు. ఈ ముద్గరముతో పూర్వము చాలామంది దేవతలు, దానవులు రాలిపోయారు. ముక్కు చెవులు పోయాయని నన్ను తక్కువగా అంచనా వేయకు. ముక్కు చెవులు తొలగించడమే మీకు* తెలుసు. ప్రాణాల్ని ఎలా తోడేయాలో నాకు తెలుసు;" అన్నాడు కుంభకర్ణుడు.

పదునైన పొన్నులు గల బాణాల్ని కుంభకర్ణునిపై ప్రయోగించాడు రాముడు. అయినా ఆ రాక్షసుడు చలించలేదు. వాలిని వధించిన శరాల్ని ప్రయోగించాడు రాముడు. అవి కూడా కుంభకర్ణుని కదలించలేక పోయాయి. తన చేతిలోని ముద్గరాన్ని చక్రంలా త్రిప్పుతూ రాముని బాణాలను అడ్డగించాడు కుంభకర్ణుడు.

రాముడు వాయవ్యాస్త్రాన్ని సంధించాడు. ముద్గరమును పట్టుకొనిన అతని చేతిని వాయవ్యాస్త్రము ఖండించింది. చెయ్యి తెగిపోగానే పెద్దగా అరచాడు కుంభకర్ణుడు.

పెద్ద వృక్షాన్ని పెకలించి రామునిపై విసరబోయాడు కుంభకర్ణుడు. రాముడు ఐంద్రాస్త్రమును ప్రయోగించి తాళవృక్షముతో సహా కుంభకర్ణుని రెండవ బాహువును ఖండించాడు.

రెండు చేతులు ఖండించబడిన తరువాత రక్తసిక్తమైన దేహముతో పెద్దగా అరుస్తూ రాముని మీదికి వస్తున్న కుంభకర్ణునిపై రెండు అర్ధచంద్ర బాణాలను ప్రయోగించి, కుంభకర్ణుని పాదాలను ఛేదించాడు రాముడు.

చేతులు, కాళ్ళు ఖండించబడ్డాయి. తొడల సహాయంతో ప్రాకుతూ రాహువులా నోరు తెరుచుకొని రాముని మీదికి వస్తున్నాడు కుంభకర్ణుడు. రాముడు పదునైన బాణాలతో కుంభకర్ణుని ముఖాన్ని నింపేశాడు. పెద్దగా అరుస్తూ, క్రిందపడి మూర్ఛిల్లాడు కుంభకర్ణుడు.

రాముడు ఈసారి ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అది వెళ్ళి కుంభకర్ణుని తలను క్రింద పడగొట్టింది. ఐంద్రాస్త్రముచే పైకెగిరిన కుంభకర్ణుని శిరస్సు క్రింద పడునపుడు ప్రాకారాలపై పడగా అవన్నీ చూర్ణమైపోయాయి.

*లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను ఖండిస్తే, సుగ్రీవుడు కుంభకర్ణుని ముక్కు చెవుల్ని తొలగించాడు.

కుంభకర్ణుని మరణాన్ని చూచి రాక్షసు లందరూ పెద్దగా అరచారు. ఏడ్చారు. సింహాన్ని చూచి మృగాలు కంపించినట్లు రాముణ్ణి చూచి వణకిపోయారు. వానరు లందరూ రాముని పూజించారు.

కుంభకర్ణుడు కూలిపోయాడు. విధి బలీయమైంది. నిద్రాదేవి ఒడిలో మైమరచి నిద్రిస్తున్న భాగ్యవంతుణ్ణి, శ్రమించి నిద్రలేపారు రాక్షసులు. సందేశమనే శ్మశాన సంగీతాన్ని ఆలపించాడు రావణుడు. మృత్యు ఒడిలోకి భయంకరంగా ఒరిగిపోయాడు కుంభకర్ణుడు.

దశకంఠుని దైన్యస్థితి

కుంభకర్ణుడు మరణించాడని రాక్షసులు రావణునితో చెప్పారు. యుద్ధభూమిలో గొప్ప ప్రతాపాన్ని చూపించి, అనేకమంది వానరవీరుల్ని సంహరించి, భక్షించి, చివరికి రాముని బాణాలకు గురియై మాంసపు ముద్దలా రణభూమిలో మిగిలిపోయాడని రాక్షసులు చెప్పగానే రావణుడు దు:ఖితుడై మూర్ఛిల్లాడు.

పినతండ్రి మరణించాడని తెలిసి దేవాంతకుడు, నరాంతకుడు, త్రిశిరస్సు, అతికాయుడు దుఃఖంతో విలపించారు. సవతితల్లి పుత్రులైన సహోదరులు మహోదరుడు, మహాపార్శ్వుడు కూడా దుఃఖించారు.

రావణుడు మూర్ఛనుండి తేరుకొని "అయ్యో! మహావీరా! శత్రుసంహారకా! మహాబలా! కుంభకర్ణా! నన్ను విడిచిపెట్టి వెళ్ళావా నాయనా!

"నా మనోక్లేశాన్ని తొలగించకుండానే వెళ్ళిపోయావా! బంధువుల కన్నీటిని తుడుస్తానన్నావే! నువ్వే నిన్ను తుడిపేసుకున్నావా! చెడిపేసుకున్నావా! నన్ను ఒంటరివాణ్ణి చేశావా, తమ్ముడూ!

ఇదానీం ఖల్వహం నాస్మి యస్య మే దక్షిణో భుజః
పతితో యం సమాశ్రిత్య న బిభేమి సురాసురాత్ ॥

"దేనిని ఆశ్రయించుకొని నేను సురాసురుల నుండి భీతిచెందడం లేదో అట్టి నా కుడిభుజం పోయింది. ఇక నేను ఉన్నా లేనట్లే.

"ఆహా! కుంభకర్ణుడు అసమాన పరాక్రమవంతుడే! దేవతలు ప్రక్కన నిలవలేరు. దానవులు ముందు నిలవలేరు. అలాంటి మహాబలుణ్ణి రాముడు సంహరించాడా? వజ్రాయుధం కూడా ఎవరిముందు నిర్వీర్య మవుతుందో అట్టి కుంభకర్ణునికి రాముని చేతిలో మరణమా!

"ఇది తెలిస్తే దేవతలంతా నవ్వుతారు. 'ఇంకేముంది?' అని వానరులు లంకలో ప్రవేశిస్తారు. నా తమ్ముణ్ణి చంపిన రాముణ్ణి వధించకుండా జీవించడం కంటే మరణించడమే ఉత్తమము.

రాజ్యేన నాస్తి మే కార్యం కిం కరిష్యామి సీతయా
కుంభకర్ణ విహీనస్య జీవితే నాస్తి మే మతిః

"నాకు రాజ్యంతో పనిలేదు. సీతతో పనిలేదు. కుంభకర్ణుడు లేడు అనగానే నాకు బ్రతుకుపై ఆశ పోయింది.*

"నా తమ్ముడు ఎక్కడికి వెళ్ళాడో నేనూ అక్కడికే వెళ్తాను. సోదరుల్ని విడిచి నేను బ్రతుకలేను. విభీషణుడు చెప్పిన హితవచనాలు నా మనసుకు పట్టలేదు. దాని ఫలితంగా ఈనాడు నాకు దుర్గతి ప్రాప్తించింది.

తస్యాయం కర్మణః ప్రాప్తో విపాకో మమ శోకదః
యన్మయా ధార్మికః శ్రీమాన్ స నిరస్తో విభీషణః

"విభీషణుడు ధార్మికుడు. శ్రీమంతుడు. అట్టి మహాత్ముని నేను అవమానించాను. దాని ఫలితముగా నేను దుఃఖిస్తున్నాను." అని ఏడుస్తూ, మళ్ళీ నేలమీద పడి మూర్ఛిల్లాడు రావణుడు.

రావణుని పశ్చాత్తాపం పవిత్ర మైనదేనా? ధర్మాత్ముడైన విభీషణుని విమలవచనాలను ఆలకించకపోవుట చేతనే తనకు ఈ దుర్గతి వాటిల్లిందని రావణుడు అంగీకరిస్తున్నాడు. తన దుఃఖానికి అదే కారణమని పశ్చాత్తాప వచనాలు పలుకుతున్నాడు.

విభీషణుడు చెప్పింది వినకపోగా విభీషణుని పరుషంగా నిందించి రావణుడు బాధించాడు. విభీషణుడు కట్టుబట్టలతో వెళ్ళినా, భార్యాబిడ్డల్ని విడిచి ఒంటరిగా వెళ్ళినా, ఏ మాత్రము సానుభూతి చూపని కఠినాత్ముడు రావణుడు.

విభీషణుని దూరం చేసుకున్నాడు. బావుంది. విభీషణుడు చెప్పిన విషయాన్ని కుంభకర్ణుడు కూడా చెప్పాడు. విభీషణుని మాటను వినడం కన్నా మరో మార్గం లేదని చెప్పాడు కదా! రావణుడు విన్నాడా? విని, రాముని శరణు కోరివుంటే కుంభకర్ణుడు ఖాళీ అయ్యేవాడు కాదుకదా!

ఇప్పటికైనా మించిపోయింది లేదు. మంత్రులు పోయారు. సేనానాయకులు పోయారు. తమ్ముడైన కుంభకర్ణుడూ అస్తమించాడు. తానుకూడా స్వయంగా రాముని చేతిలో పరాభవాన్ని రుచిచూశాడు.

రావణుని పశ్చాత్తాపము పవిత్రమైనదైతే ఇప్పుడైనా వెళ్ళి రాముని శరణు కోరవచ్చు. అలాంటి ఆలోచన మనసులో లేనేలేదు రావణునికి. తన కారణంగా కుంభకర్ణుడు మరణించాడని తాత్కాలిక ఆవేశంలో పశ్చాత్తాప వాక్కుల్ని వినిపిస్తూ మొసలి కన్నీళ్ళని కార్చుతున్నాడే కాని అతని పశ్చాత్తాపంలో స్వచ్ఛత లేదు. పవిత్రత లేదు.

వినాశకాలంలో మంచిమాటను వినేవారు అరుదు. చెడ్డపనులు చేయనివారు అరుదు. ఈ విషయాన్ని ఆంధ్రమహాభారతంలో అందంగా చెప్పాడు కవిబ్రహ్మ తిక్కనామాత్యుడు.

---

* నాగపాశబంధంతో లక్ష్మణుడు మూర్ఛిల్లినపుడు రాముడు కూడా తమ్ముని విషయంలో ఇలాగే మాట్లాడుతాడు. (చైతన్య రామాయణము - ద్వితీయ భాగము - పుట 337) తమ్ముళ్ళ విషయంలో ఇద్దరూ ఒకేలాగ మాట్లాడినా ఇద్దరిలో ఎంతో వ్యత్యాసముంది. రామునికి లక్ష్మణునిపై నున్నది స్వచ్ఛమైన ప్రేమ. రావణునికి కుంభకర్ణునిపై ఉన్నది స్వార్థపూరితమైన ప్రేమ.

చేటుకాలమైన జెట్టమాటలు నెఱి
గాని తెరువు వటు కర్జములును
దగినయట్ల తోచు దగియెదునవి యవి
నీతులని మనంబు నిశ్చయించు.

రణరంగంలో రావణుని పుత్రులు

కుంభకర్ణుని మరణానికి తీవ్రంగా కలత చెంది విలపిస్తున్న రావణునితో త్రిశిరస్సు ఇలా పలికాడు.

"రాజా! పరాక్రమవంతుడైన మా పినతండ్రి గతించిన మాట నిజమే. కానీ మీరు దుఃఖించడం నిజమని మేము నమ్మలేక పోతున్నాము. ముల్లోకాలను జయించగలిగిన నీవు సామాన్యునిలా దుఃఖించడం బాగలేదు.

"బ్రహ్మదేవుడు నీకు ప్రసాదించిన శక్తి, కవచము, బాణము, ధనుస్సు, వేయి గాడిదలు కట్టిన మేఘధ్వని చేయు రథము ఉన్నాయి. దేవదానవుల్ని ఎందరినో వధించిన నీవు ఈ రాముణ్ణి సులభంగా మట్టుపెట్టగలవు.

"రాజా! అంత అవసరం లేదు. నీవు ఇక్కడే ఉండు. నేను వెళ్తున్నా యుద్ధానికి. శత్రువుల్ని వధించి తిరిగి వస్తాను. శంబరాసురుడు ఇంద్రుని చేతిలో హతుడైనట్లు రాముడు నా చేతిలో మరణిస్తాడు;" అన్నాడు.

ప్రాణం పోయే వానికి అమృతము లభించినట్లు త్రిశిరస్సు మాటలు రావణునికి అధికోత్సాహాన్ని, ధైర్యాన్ని కల్గించాయి. రావణుని పుత్రులందరూ యుద్ధవిశారదులే. మాయా యుద్ధంలో నేర్పరులే.

రావణుడు కుమారుణ్ణి కౌగలించుకొని, అలంకారాలతో అలంకరించి, ఆశీర్వదించి యుద్ధానికి పంపాడు. తండ్రులనేవారు బిడ్డల ప్రగతిని వాంఛిస్తారు. అవసరమైతే బిడ్డల కొరకు ఎలాంటి త్యాగాలైనా చేస్తారు. బిడ్డల్ని అలంకరించి రణరంగానికి పంపేవాళ్ళు ఎక్కడా కనిపించరు, రావణుడు తప్ప. వివాహ మంటపములో పూలదండను ధరించిన బిడ్డను చూచి సంతోషించిన తండ్రులను చూశామే గాని, బిడ్డ శవాన్ని అలంకరించి ఆనందించే కర్కోటకుల్ని ఎక్కడా చూసి ఉండము. అది రావణునిలో ప్రత్యేకత.

త్రిశిరునితో కూడి యుద్ధానికి పోవడానికి సోదరులైన దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు "నేనంటే నేను" అంటూ ఉత్సాహంతో ముందుకు వచ్చారు. తన పుత్రులకు సహాయంగా తమ్ములైన మహోదర మహాపార్శ్వులను కూడా వెళ్ళమన్నాడు రావణుడు. ఆరుమంది రాక్షసులు రావణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి బయలుదేరారు.

ఆయుధముల దెబ్బలు బాధించకుండా సుగంధభరితమైన ఓషధులను, తైలములను దేహాలకు పూసుకున్నారు. రాసుకున్నారు. యుద్ధరంగానికి బయలుదేరి వెళ్ళారు. రథారూఢులై, అశ్వారూఢులై, గజారూఢులై, వేలాది రాక్షసులు వెంటరాగా వానరసేనను వధించుటకు పెద్ద శబ్దంతో బయలుదేరారు. శత్రువులనైనా వధించాలి లేదా యుద్ధములోనైనా మరణించాలి అని నిర్ణయించుకొని వెళ్ళారు. సింహనాదాలు చేస్తూ యుద్ధభూమిలో కాలుపెట్టారు.

రాక్షససేనను చూచి వానరులు సంతోషముతో ఎగిరి గంతేశారు. మళ్ళీ అవకాశము వచ్చిందని భావించి పెద్దపెద్ద శబ్దాలు చేశారు. మేఘగర్జనం చేశారు.

వృక్షములను, పెద్దపెద్ద రాళ్ళను, పర్వతశిఖరాలను చేతపట్టుకొని రాక్షసుల్ని పీడించారు వానరులు. కొందరు వానరులు ఆకాశంలో నిలిచి రాక్షసుల్ని వృక్షాలతో కొట్టి బాధించారు. కొందరు పైనుండి రథాశ్వములపై పర్వతశిఖరాలను పడేసి సంహరించారు.

రాక్షసవీరులు కూడా విజృంభించి వానరులను చాలా మందిని వధించారు. రణరంగమంతా రక్తపుటేరులు ప్రవహించాయి. ఎక్కడ చూచినా మృతకళేబరాలే. తెగిపడిన శరీరాల ద్వారా రక్తం కారుతూ ఉంటే, కత్తితో కొమ్మను ఖండిస్తే చెట్టునుండి పాలు కారినట్లు కనిపిస్తోంది.

రాక్షసులు ఎక్కువగా మరణించారు. వానరులు సంతోషంతో గంతులేస్తూ విజృంభించి, రాక్షసుల చేతిలోని ఆయుధములను లాగికొని వారిని ఆ ఆయుధాలతో చిత్రహింస చేశారు.

నరాంతకుడు క్రుద్ధుడై వానరసైన్యముపై విరచుక పడ్డాడు. మహాసముద్రంలో పెద్ద తిమింగలము ప్రవేశించినట్లు వానరసైన్యం లోకి ప్రవేశించాడు. వందలాది వానరులను తరిగేశాడు. కొన్ని నిముషాల్లో నరాంతకుడు వానరవీరుల్ని భయంకరంగా పీడించాడు. వానరుల దేహాల్ని వధించి కుప్పపోశాడు. ప్రాసని చేతపట్టుకొని ఏడువందల మంది వానరుల్ని శీఘ్రంగా వధించాడు.

కుంభకర్ణుని దెబ్బలచేత స్పృహ తప్పి పడియున్న వానరవీరులు లేచారు. సుగ్రీవుని సమీపించారు. నరాంతకుని ఎదిరించలేక జడిసిపోయిన వానరసేనను చూశాడు సుగ్రీవుడు.

అంగదుని పిలిచి, "అతణ్ణి చూడు. గుఱ్ఱం మీద స్వైరవిహారం చేస్తూ మన సేనల్ని మట్టుపెడుతున్నాడు. నువ్వు వెళ్ళి అతణ్ణి వధించు." అన్నాడు సుగ్రీవుడు.

మేఘముల మధ్య సూర్యుడు వెడలునట్లు వానరసేన మధ్యనుండి వాయువేగంతో నరాంతకుని సమీపించాడు అంగదుడు. "ఆగు. వజ్రతుల్యమైన నీ ప్రాసతో బలహీనులైన ఆ కపివీరులను ఎందుకు హింసిస్తావు? ధైర్యముంటే నామీద ప్రయోగించు;" అన్నాడు అంగదుడు.

అంగదుని మాటలు విని కుపితుడైన నరాంతకుడు కృష్ణసర్పంలాగా బుసలుకొడుతూ, మండుచున్న ప్రాసను అంగదుని పైకి విసిరాడు. వజ్రసమానమైన అంగదుని వక్షస్థలమును తాకిన ఆ ప్రాసము విరిగి రెండు ముక్కలై క్రిందపడింది. గరుత్మంతునిచే తెగిపడిన సర్పంలాగా కనిపించింది.

అంగదుడు అరచేతితో నరాంతకుని అశ్వాన్ని చరిచాడు. ఆ దెబ్బకు గుఱ్ఱానికి తల పగిలింది. దవడలు లోనికెళ్ళాయి. కళ్ళు పగిలిపోయాయి. నాలుక వేరై నేలమీద పడింది.

తన గుఱ్ఱము అలా మృతి చెందగానే కోపించిన నరాంతకుడు పిడికిలి బిగించి అంగదుని తలమీద కొట్టాడు. ఆ దెబ్బకు అంగదుని తల పగిలి రక్తము కారింది. కొన్ని క్షణాలు అంగదునికి ఏమీ కనిపించలేదు. నరాంతకుని శక్తికి అంగదుడు ఆశ్చర్యపడ్డాడు.

అంగదుడు తేరుకొని తన పిడికిలితో నరాంతకుని కొట్టాడు, రొమ్ముపై. గుండె పగిలి నేలకొరిగాడు నరాంతకుడు. నరాంతకుడు వధింపబడగానే వానరవీరులు సింహనాదాలు చేస్తూ అనవసరంగా అన్ని దిక్కులూ పరుగులెత్తారు.

నరాంతకుడు నేలరాలడం చూసి దేవాంతకుడు, త్రిశిరుడు, మహోదరుడు చాలా దుఃఖించారు. నరాంతకుని వధించిన అంగదుని వధించడానికి ముగ్గురూ బయలుదేరారు. దేవాంతకుడు పరిఘను పుచ్చుకున్నాడు. త్రిశిరుడు రథము నెక్కాడు. మహోదరుడు మేఘసదృశమైన గజాన్నెక్కాడు.

ఒకేసారి ముగ్గురు రాక్షసులు అంగదుని ఎదుర్కొన్నారు. అంగదుడు పెద్ద వృక్షాలతో, పర్వతశిఖరాలతో వారి నెదుర్కొని పోరాడాడు. ఒక పెద్ద వృక్షాన్ని మహోదరుని పైకి విసిరాడు అంగదుడు. దానిని మధ్యలోనే ఖండించాడు త్రిశిరుడు.

త్రిశిరుడు బాణాలను సంధిస్తూ అంగదుని తీవ్రంగా బాధించాడు. మహోదరుడు ఏనుగును అంగదుని మీదికి తరిమి వజ్రతుల్యమైన తోమరాలతో అంగదుని గుండెపై కొట్టాడు. దేవాంతకుడు వెంటనే పరిఘతో అంగదుని తీవ్రంగా కొట్టాడు. ఇలా ముగ్గురు రాక్షసులు బాధిస్తున్నా అంగదుడు వ్యథ చెందలేదు.

అంగదుడు పైకెగిరి మహోదరు డెక్కియున్న పెద్ద ఏనుగును అరచేతితో చరచాడు. దాని రెండు కళ్ళు దేహం నుండి విడిపోయాయి. పెద్దగా ఘీంకరించింది ఆ గజము. క్రిందపడిన ఏనుగు దంతమును పెరికి ఆ దంతముతో దేవాంతకుని కొట్టాడు అంగదుడు.

పెనుగాలికి వాలిపోయే వృక్షము లాగా దేవాంతకుడు నేలకొరిగాడు. ఎలాగో తేరుకొని పరిఘతో అంగదుణ్ణి బలంగా కొట్టాడు దేవాంతకుడు. అంగదుడు మోకాళ్ళపై కూర్చుని వెంటనే బంతిలాగా పైకి లేచాడు. అలా లేస్తున్న అంగదుని నొసటను మూడు బాణాలతో కొట్టాడు త్రిశిరుడు.

ముగ్గురు రాక్షసులు ఏకమై అంగదుణ్ణి బాధించడం చూశాడు హనుమంతుడు. నీలుడు కూడా చూశాడు. నీలుడు ఒక పర్వతశిఖరాన్ని త్రిశిరునిపై విడిచాడు. దానిని బాణాలతో చూర్ణం చేశాడు త్రిశిరుడు.

దేవాంతకుడు పరిఘను చేతపట్టుకొని హనుమంతుని పైకి ఉరికాడు. హనుమంతుడు పైకెగిరి దేవాంతకుని తలపై పిడికిటితో కొట్టాడు. అంతటితో ఆగకుండా రాక్షససైన్యం భీతి చెందేలాగా పెద్దగా సింహనాదం చేశాడు.

హనుమంతుని పిడికిటిపోటుకు దేవాంతకుని పళ్ళు రాలిపోయాయి..కళ్ళు ఊడిపోయాయి. నాలుక ఎగిరిపోయింది. పెద్దగా అరుస్తూ క్రిందపడి ప్రాణాలు విడిచాడు దేవాంతకుడు.

దేవాంతకుడు నరాంతకుని అనుసరించగానే క్రుద్ధుడైన త్రిశిరుడు నీలుని గుండెలపై బాణవర్షం కురిపించాడు. మరొకవైపు నుండి మహోదరుడు ఏనుగుపై వచ్చి నీలుని మరికొన్ని బాణాలతో బాధించాడు. బాణవర్షానికి నీలుని అంగములన్నీ పీడింపబడ్డాయి. దేహమంతా రక్తసిక్తమైంది.

నీలుడు తేరుకొని ఒక పర్వతాన్నే పెకలించి మహోదరుని తలపై వేశాడు. ఆ దెబ్బకు మహోదరుడు ఏనుగుతో కూడా నేలపడ్డాడు. కళ్ళు మూసేశాడు.

పినతండ్రియైన మహోదరుడు మరణించగానే కుపితుడైన త్రిశిరుడు ధనుస్సును గ్రహించి వాడియైన బాణాలతో హనుమంతుని కొట్టాడు. పర్వతాన్ని విసిరి త్రిశిరుని బాణాలను పడగొట్టాడు హనుమ.

హనుమంతుడు ఎగిరి సింహము ఏనుగుయొక్క కుంభస్థలమును కొట్టునట్లు త్రిశిరుని అశ్వాన్ని కొట్టి, గోళ్ళతో దానిని చీల్చేశాడు.

త్రిశిరుడు శక్తి అనే ఆయుధాన్ని చేతపట్టుకొని, గురిచూచి హనుమంతునిపై విసిరాడు. హనుమంతుడు దానిని విరిచేసి సింహనాదం చేశాడు. త్రిశిరుడు ఖడ్గాన్ని తీసి హనుమంతుని గుండెలపై కొట్టాడు. హనుమంతుడు తన అరచేతితో త్రిశిరుని వక్షస్థలంపై కొట్టాడు. కిరీటాన్ని పట్టుకొని త్రిశిరుని మూడు తలలను త్రుంచేశాడు. త్రిశిరుడు క్రిందపడి మరణించాడు.

నరాంతకుడు, దేవాంతకుడు, మహోదరుడు, త్రిశిరుడు మరణించగానే మహాపార్శ్వుడు క్రోధావేశంతో ఊగిపోయాడు. గదను చేతిలో ధరించాడు. వానరుల మీదికి విజృంభించాడు. అదిచూచి ఋషభుడు మహాపార్శ్వుని ఎదిరించాడు.

మహాపార్శ్వుడు గదతో ఋషభుని రొమ్ముపై కొట్టాడు. ఋషభుని దేహం నుండి రక్తం స్రవించింది. ఋషభుడు మహాపార్శ్వుని పైకి ఉరికి అతని గదను లాక్కున్నాడు. దానిని గిరగిర తిప్పి దానితో మహాపార్శ్వుని దారుణంగా కొట్టాడు.

శత్రువులను సంహరించడానికి ఏ గదను మహాపార్శ్వుడు తీసికొని వచ్చాడో దానితోనే తాను హతుడయ్యాడు. పరులను హింసించాలని చాలామంది అభిప్రాయ పడతారే కాని అది తమ వినాశానికి దారి తీస్తుందని గ్రహించలేరు.

రావణుని తమ్ముడైన మహాపార్శ్వుడు నేలకొరిగాడు. కళ్ళు ఊడి దూరంగా పడ్డాయి. అదిచూచి భీతిచెందిన రాక్షసులు కట్టతెగిన సముద్రం లాగా పారిపోయారు.

వచ్చిన ఆరుమంది రాక్షసవీరులలో ఐదుగురు మరణించారు. అతికాయుడు ఒక్కడే మిగిలాడు. సోదరులు మరణించారు. పినతండ్రులు పరలోకం చేరారు. రాక్షసు లెందరో మరణించారు. వారి రక్తం కాలువలై ప్రవహించింది. ఇదంతా చూసిన అతికాయుని మనసు ఆవేదనతో, ఆక్రోశంతో ఊగిపోయింది.

అతికాయుడు వానరులపై పడ్డాడు. ధనుష్టంకారము చేశాడు. పెద్దగా సింహనాదం చేశాడు. అది విని కపివీరు లందరూ కంగారెత్తి పారిపోయారు. కుంభకర్ణుడే మళ్ళీ బ్రతికి వచ్చినట్లు భావించారు. భయకంపితులై వానరు లందరూ రాముని శరణుజొచ్చారు.

అతికాయుని వైభవాన్ని చూచి ఆశ్చర్యపడిన రాముడు అతడెవరో చెప్పమని విభీషణుని అడిగాడు. ఇతడు ధాన్యమాలిని రావణుల కుమారుడగు అతికాయుడు అని చెప్పాడు విభీషణుడు. మహాబలవంతుడైన అతికాయుని తొందరగా సంహరించడం సముచితమని కూడా సూచించాడు విభీషణుడు.

అతికాయుడు వానరసేనలో ప్రవేశించి సింహనాదం చేశాడు. వానరశ్రేష్ఠులు అతికాయుని ఎదుర్కొన్నారు. కుముదుడు, ద్వివిదుడు, మైందుడు, నీలుడు, శరభుడు వృక్షములను చేతపట్టుకొని అతికాయుని ఎదుర్కున్నారు. తన బాణాలతో వాటిని ఛేదించుటే గాక ఉక్కుబాణాలతో వానరవీరులను దారుణంగా కొట్టాడు అతికాయుడు. వానరవీరులు అతికాయుని ఎదిరించలేక పోయారు.

అతికాయుడు రాముని ఎదుట నిలిచి ఇలా పలికాడు. "నేను అతికాయుణ్ణి. ధనుర్బాణాలు ధరించి ఉన్నాను. సామాన్యులతో నేను యుద్ధం చేయను. శక్తివంతులై, సమరోత్సాహము కలవారు నన్ను ఎదుర్కోవచ్చు. నా ముందు నిలబడి నాతో యుద్ధము చెయ్యవచ్చు;" అన్నాడు.

ఆ మాటలకు క్రుద్ధుడైన లక్ష్మణుడు ధనుస్సును చేతపట్టుకొని నవ్వుతూ ముందుకు వచ్చాడు. ధనుష్టంకారము చేశాడు. లక్ష్మణుని ధనుష్టంకారమును విని అతికాయుడు ఆశ్చర్యపోయాడు.

"లక్ష్మణా! నువ్వు పిల్లవాడివి. యుద్ధప్రావీణ్యము లేనివాడివి. యముని లాంటి వానితో యుద్ధానికి తలపడతావా! వెళ్ళు. వెళ్ళు. నేను విడిచిన బాణాలను సహించే శక్తి భూమికి లేదు. హిమాలయానికి లేదు. ఆకాశానికీ లేదు. వెళ్ళు. ఆవేశానికి పోయి ఆయువుకు ముప్పు తెచ్చుకోకు. శాంతించిన ప్రళయకాలాగ్నిని రెచ్చగొట్టకు. సింహము ఏనుగు రక్తాన్ని జుర్రినట్లు నా బాణము సర్పమై నీ రక్తాన్ని పీల్చేస్తుంది;" అని పలికి ధనుస్సుపై బాణాన్ని సంధించాడు.

"దుష్టుడా! ఆత్మస్తుతితో అధికుడ వనిపించుకోలేవు. ఎందుకొచ్చిన డాబులు, బడాయిలు. ధనుర్బాణాలతో నేను నిలిచియున్నాను. నీ బలాన్ని నాపై చూపు. పౌరుషం లేనివాడు శూరు డనిపించుకోడు. ఇంకా చూస్తావేమి? చూపించు నీ పరాక్రమం. కాలం తాటికాయను రాల్చేసినట్లు నా బాణము నీ తలకాయను కొట్టి పడేస్తుంది.

బాలోఽయ మితి విజ్ఞాయ న మావజ్ఞాతు మర్హసి
బాలో వా యదివా వృద్ధో మృత్యుం జానీహి సంయుగే ॥

"నన్ను బాలుడని తక్కువగా చూడకు. నేను బాలుణ్ణి గాను. వృద్ధుణ్ణి గాను. నీ పాలిటి మృత్యువును;" అన్నాడు లక్ష్మణుడు.

ఆ మాటలకు కుపితుడైన అతికాయుడు శ్రేష్ఠమైన ధనుస్సుపై బాణమును సంధించాడు. లక్ష్మణునిపై విడిచాడు. లక్ష్మణుడు ఆ బాణాన్ని మధ్యలోనే ఖండించాడు.

అతికాయుడు ఐదు బాణాల్ని ధనుస్సుపై తొడిగి లక్ష్మణునిపై వదిలాడు. ఆ కరుకు బాణాల్ని కూడా మధ్యలోనే ఖండించాడు లక్ష్మణుడు. లక్ష్మణుడు ఒక బాణాన్ని తొడిగి చెవి వరకు లాగి అతికాయునిపై విడిచాడు. అది అతికాయుని లలాటముపై తగిలింది.

లక్ష్మణుని బాణపు దెబ్బకు చలించిపోయిన అతికాయుడు లక్ష్మణుని శ్లాఘించాడు. అతికాయుడు లక్ష్మణునిపై అనేక బాణాలను విడిచాడు. వాటి నన్నిటిని లక్ష్మణుడు ఖండించాడు. అతికాయుడు విడిచిన ఒక బాణము లక్ష్మణుని వక్షస్థలముపై నిలిచింది. రక్తము ప్రవహించసాగింది.

తన దేహంలో గుచ్చుకున్న బాణాన్ని లక్ష్మణుడు పెరికివేశాడు. కాస్త తెప్పరిల్లి, ఒక బాణమును తీసి, ఆగ్నేయాస్త్రమును అభిమంత్రించి వదిలాడు. అతికాయుడు సౌర్యాస్త్రం ప్రయోగించాడు. అవి రెండూ ఆకాశాన పరస్పరం నశింప చేసుకున్నాయి.

అతికాయుడు ఐషీకాస్త్రాన్ని ప్రయోగించగా లక్ష్మణుడు ఐంద్రాస్త్రముతో దానిని ఛేదించాడు. అది గాంచి కుపితుడైన అతికాయుడు యామ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. వాయవ్యాస్త్రంతో లక్ష్మణుడు దానిని కొట్టేశాడు. ఆ తరువాత లక్ష్మణుడు వెయ్యి బాణాలు

వదిలాడు అతికాయునిపై. అతని వక్షస్థలానికి తగిలి విరిగి నేలపై పడ్డాయే గాని అతికాయుని ఏమీ చేయలేక పోయాయి.

వాయుదేవుడు లక్ష్మణుని సమీపించాడు. "లక్ష్మణా! బ్రహ్మదేవుని వరప్రసాదంగా ఇతడు దుర్భేద్యమైన కవచాన్ని ధరించియున్నాడు. ఈవిధంగా నీవు అతణ్ణి వధించలేవు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించు. అదొక్కటే అతణ్ణి సంహరిస్తుంది" అన్నాడు.

లక్ష్మణుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. లక్ష్మణుడు బ్రహ్మాస్త్రాన్ని సంధించగనే దిక్కులన్నీ కంపించి పోయాయి. సూర్యచంద్రులు చలించిపోయారు. సాగరాలు క్షోభించాయి.

లక్ష్మణుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని అనేకమైన అస్త్రాలతో ఎదుర్కొన్నాడు. ఆయుధాలతో ఢీకున్నాడు. బ్రహ్మాస్త్రము అవరోధాల్ని ఛేదించుకుంటూ ముందుకెళ్ళి అతికాయుని తలను ఖండించింది.

అది చూచి రాక్షసు లందరూ బిగ్గరగా అరుస్తూ రోదించారు. భయపడి లంకాభిముఖులై పారిపోయారు. వానరు లందరూ సంతుష్టాంతరంగ చిత్తులై ఒకర్ని మరొకరు పట్టుకొని విచిత్రంగా మాట్లాడుతూ నృత్యం చేశారు.

లంకలో శంకలు

అతికాయుడు మరణించినట్లు రావణునికి తెలిసింది. భయాందోళనలతో రావణుని హృదయం కంపించి పోయింది. సందేహాలతో మనసు కలవరపడి పోతోంది.

ధూమ్రాక్షుడు ధూళిలో కలిసిపోయాడు. అకంపనుని ప్రాణాలు ఆకాశం లోకి ఎగిరిపోయాయి. మహాబలశాలి యైన ప్రహస్తుడు మట్టిలో కలిసిపోయాడు. కుంభకర్ణుడు కూలిపోయాడు. మహోదర మహాపార్శ్వులు మాయమయ్యారు. అక్షకుమారుడు అదృశ్య మయ్యాడు. త్రిశిరుని కాలం తీరిపోయింది. అతికాయుని ఆయుర్దాయం అంతరించింది. దేవాంతకుడు దీనంగా చచ్చాడు. నరాంతకుడు నేలరాలాడు. ఎందరో, మరెందరో రాక్షసవీరులు రాలిపోయారు.

ఇంద్రజిత్తు నాగపాశంతో రామలక్ష్మణుల్ని బంధించాడు. దానిని ఎవ్వరూ విడిపించుకోలేరు. దానినుండి కూడా రామలక్ష్మణులు విడుదలయ్యారు. ఇది మాయా! లేక మోసమా! సైన్యమంతా వానరుల చేతిలో వధించబడింది.

రామలక్ష్మణ సుగ్రీవాదులను జయించేవాడు రాక్షసులలో ఒక్కడు కూడా కనిపించడం లేదు. రాముడు అంతటి బలవంతుడా! అతని అస్త్రబలము అలాంటిదా?

ఈవిధంగా ఆలోచనలు సాగించిన లంకాధిపతి రాక్షసులతో ఇలా పలికాడు. "రాక్షసులారా! ఏమరిపాటు లేకుండా మిమ్మల్ని మీరు రక్షించుకుంటూ, లంకను రక్షించండి. అశోకవనాన్ని అశ్రద్ధ చేయకండి. లంకలోకి ఎవరు వస్తున్నారో, లంకనుండి ఎవరు వెళ్తున్నారో జాగ్రత్తగా పరిశీలించండి. వానర సంచారమును గమనిస్తూ ఉండండి. అన్ని వేళలందునూ అప్రమత్తులై ఉండండి. శత్రుసైన్యము ఎలా ఉందో, ఎక్కడ ఉందో, ఏం చేస్తూ ఉందో పరిశీలిస్తూ ఉండండి;" అని పలికి దుఃఖవదనుడై అంతఃపురంలోకి వెళ్ళాడు రావణుడు.

రావణుని మనసు కుదట పడలేదు. మరణించిన వీరులే అతని మనసులో నిలిచిపోయారు. గతించిన వారి కొరకు కన్నీళ్ళు కారుస్తూ తన మందిరములో విలపిస్తున్నాడు రావణుడు. దుఃఖసాగరంలో మునిగియున్న తండ్రిని చూచి ఇంద్రజిత్తు ఇలా పలికాడు.

"తండ్రీ! ఇంద్రజిత్తు మరణించలేదు. నీవు ఇలా దుఃఖించడ మెందుకు? నా బాణములు తగిలిన వాడెవ్వడూ ఇంతవరకు బతికి బట్టగట్టలేదు. ఈరోజు నా బాణాలతో రామలక్ష్మణుల్ని కూల్చేస్తాను. వాళ్ళిద్దరూ నేలపై పడి ఉండడము నీవు చూస్తావు. ఇంద్ర, యమ, విష్ణు, రుద్ర సాధ్యులు, అగ్ని, సూర్యచంద్రులు ఈరోజు రణరంగంలో నా పరాక్రమం చూస్తారు;" అని పలికి తండ్రి అనుమతిని తీసికొని వాయువేగంతో గాడిదలు పూన్చిన రథాన్ని ఎక్కాడు. ఆకాశంలో ఎగిరే ఆ రథాన్నెక్కి రణరంగానికి బయలుదేరాడు ఇంద్రజిత్తు.

ఇంద్రజిత్తు వెంట పరాక్రమవంతులైన అనేకమంది రాక్షసులు వెళ్ళారు. ధనుస్సులను, ప్రాసలను, ముద్గరాలను, గండ్రగొడ్డళ్ళను, పరిఘలను ధరించి కొందరు ఏనుగుల మీద, కొందరు గుఱ్ఱాల మీద, పులులు, ఏనుగుల ఎత్తున్న లేళ్ళమీద కొందరు, అడవి పందుల మీద, క్రూరమృగాల మీద కొందరు ఎక్కి బయలుదేరారు.

ఇంద్రజిత్తు రణరంగంలో ప్రవేశించాడు. రాక్షసులను తన రథం చుట్టూ నిలబడమని చెప్పాడు. యుద్ధభూమిని తాత్కాలికంగా యజ్ఞభూమిగా మార్చాడు ఇంద్రజిత్తు.

ఇంద్రజిత్తు భీకర సమరం

అగ్ని రగిల్చి, హవిస్సును, పేలాలను, పుష్పమాలల్ని, సుగంధద్రవ్యాల్ని అగ్నిలో వేసి మంత్రాలతో హోమం చేశాడు ఇంద్రజిత్తు. ఆ హోమంలో శస్త్రాలనే దర్భలుగా చేసుకున్నాడు. ఎర్రని బట్టలు ధరించాడు. అగ్ని చుట్టూ రెల్లుగడ్డిని, తోమరాలను పరచాడు. నల్లని మేకను తెప్పించి వధించాడు. అగ్ని ఒక్కసారి ఆకాశాన్ని అంటేలాగా లేచింది. ధూమము లేని అగ్ని విజయసూచకముగా కనిపించింది. బంగారు కాంతిగల అగ్నిశిఖలు ప్రదక్షిణంగా జ్వలించి హవిస్సును గ్రహించాయి.

తన రథాన్ని, ధనుస్సును, బ్రహ్మాస్త్రమును హోమంలో ఆవాహనము చేసి అభిమంత్రించాడు. ఇంద్రజిత్తు అలా పూజిస్తూ ఉంటే గ్రహ నక్షత్రాదులతో కూడిన ఆకాశం కంపించి పోయింది.

రాక్షససైన్యము సింహనాదాలు చేస్తూ యుద్ధానికి బయలుదేరింది. బాణాలతో, తోమరాలతో, అంకుశాలతో రాక్షసులు వానరుల్ని తీవ్రంగా వధించారు. ఉత్సాహంతో యుద్ధం చేసి వానరులను సంహరించమని ఇంద్రజిత్తు ప్రోత్సహించాడు. దానితో రాక్షసులు భయంకరంగా విజృంభించారు. నారాచబాణాలను ప్రయోగించి అనేకమంది వానరులను సంహరించాడు ఇంద్రజిత్తు.

వానరులు వృక్షాలను, పర్వతశిఖరాలను ఇంద్రజిత్తుపై వర్షించారు. ఇంద్రజిత్తు క్రుద్ధుడై వాడియైన బాణాలతో వానరుల్ని చీల్చేశాడు. ఒకొక్క బాణానికి తొమ్మిదిమంది, ఏడుమంది, ఐదుమంది చొప్పున వానరవీరులు ప్రాణాలు విడుస్తున్నారు. సూర్యుని కిరణాలవలె ఇంద్రజిత్తు నుండి కదులుతున్న బాణాలను లెక్కచేయకుండా వానరవీరులు పోరాడారు.

వానరుల దేహాలు భయంకరంగా బ్రద్దలు కొట్టబడ్డాయి. వారి దేహాలు రక్తసిక్తమయ్యాయి. అయినా రాముని కొరకు పోరాడి ప్రాణాలు విడిచారు చాలామంది వానరవీరులు.

ధన్యజీవులు ఆ వానరవీరులు. దేహాలు శాశ్వతాలు కావు. ఈ ప్రపంచంలో ఏ జీవికైనా మనుగడ మూణ్ణాళ్ళే. స్వల్పమైన ఆయువును అల్పసుఖాలకు ఖర్చుపెట్టకుండా రామకార్యానికి వినియోగించువారు ధన్యాత్ములు. అసువులుబాసిన వానరవీరుల జన్మ ధన్యమైంది.

ఇంద్రజిత్తు అగ్ని లాంటి బాణాలను ప్రయోగించి వానరవీరులను హింసించాడు. భయంకరమైన పద్దెనిమిది బాణాలతో గంధమాదనుని కొట్టాడు. తొమ్మిది బాణాలతో నలుణ్ణి, ఏడు బాణాలతో మైందుణ్ణి, ఐదు బాణాలతో గజుణ్ణి కొట్టాడు.

పది బాణాలతో జాంబవంతుణ్ణి, ముప్పై బాణాలతో నీలుణ్ణి, వరములచే పొందిన భయంకర బాణాలతో సుగ్రీవుణ్ణి, ఋషభుణ్ణి, అంగదుణ్ణి, ద్వివిదుణ్ణి కొట్టి, వారికి ఊపిరి ఆడకుండా చేశాడు. దారుణమైన శరవర్షమును, ఆయుధవర్షమును కురిపించి వానర సైన్యాన్ని తీవ్రంగా మర్దించాడు ఇంద్రజిత్తు.

బంగారు కాంతితో మెరుస్తూ, తమ దేహాలను బాధిస్తున్న బాణాలు కనిపిస్తున్నాయే గాని వాటిని ప్రయోగిస్తున్న ఇంద్రజిత్తు వానరులకు కనిపించలేదు. తాను అదృశ్యంగా ఉండి, కురిపిస్తున్న ఆయుధవర్షంతో వానరులను రక్తసిక్తం చేశాడు ఇంద్రజిత్తు. అరుస్తూ, ఏడుస్తూ నేలమీద పడి మరణించారు చాలామంది వానరులు.

బాణాలు పైనుండి ఎలా పడుతున్నాయా? అని వానరవీరులు తలలను పైకెత్తి చూడగనే ఇంద్రజిత్తు బాణాలు వానరవీరుల నేత్రాలలో గుచ్చుకున్నాయి. వానరులు రోదిస్తూ ఒకరి నొకరు పట్టుకొని, కౌగలించుకొని నేలపైబడి ప్రాణాలు విడిచారు. బ్రహ్మాస్త్రము అభిమంత్రించిన ప్రాసలతో, శూలాలతో, బాణాలతో హనుమంతుణ్ణి, సుగ్రీవుణ్ణి, అంగదుణ్ణి, మైందుణ్ణి, గంధమాదనుణ్ణి, జాంబవంతుణ్ణి ఇంద్రజిత్తు తీవ్రంగా కొట్టాడు.

అంతటితో ఆగకుండా రామలక్ష్మణులను కూడా తీవ్రమైన బాణాలతో హింసించాడు ఇంద్రజిత్తు.

"లక్ష్మణా! బ్రహ్మాస్త్రము యొక్క బలము చేత మనల్ని తీవ్రంగా హింసిస్తున్నాడు ఇంద్రజిత్తు. యుద్ధంలో అదృశ్యంగా ఉండి బాణాల్ని ప్రయోగిస్తున్న అతనిని ఇప్పుడు ఎలా ఎదుర్కోవాలి? పూజ్యుడైన బ్రహ్మదేవునికి సంబంధించిన అస్త్రము ఇంద్రజిత్తు వద్ద ఉంది. అది ఊహింప శక్యము కానిది. లక్ష్మణా! ఈ శరఘాతాల్ని మనం భరించక తప్పదు. సహించక తప్పదు;" అన్నాడు రాముడు.

పరిస్థితులు మన అధీనంలో ఉండవు. కాని ప్రవర్తన మన అధీనమే. రామలక్ష్మణులంతటివారు పరిస్థితులకు తలవంచి సహనంతో బాధల్ని అనుభవిస్తున్నారు. విధి వక్రించిన వేళ లేచే తలల కన్నా వంగే శిరాలే ఉత్తమమైనవి.

"లక్ష్మణా! ఇది పౌరుషానికి సమయం కాదు. శక్తిని ప్రదర్శించే కాలము కాదు! యుక్తితో జీవించాల్సిన సమయము. మనమిద్దరము కూడా వానరవీరుల లాగా స్పృహ కోల్పోయినట్లు పడిపోతాము. అది చూచి తనకు విజయము చేకూరినట్లు భావించి ఇంద్రజిత్తు లంకాభిముఖుడవుతాడు. కర్తవ్యాన్ని తరువాత ఆలోచిద్దాము" అన్నాడు రాముడు.

రామలక్ష్మణులు స్పృహ లేనట్లు క్రిందపడ్డారు. అదిచూచి సంతోషించిన ఇంద్రజిత్తు లంకకు వెళ్ళి ఆనందంతో జరిగినదంతా తండ్రికి వివరించి చెప్పాడు.

వానరసేనతో పాటు రామలక్ష్మణులు కూడా ఇంద్రజిత్తు అభిమంత్రించి విడిచిన తీక్షణమైన అస్త్రాలతో తీవ్రంగా పీడింపబడ్డారు. తక్షణకర్తవ్య మేమిటో సుగ్రీవ, నీల, అంగద జాంబవంతులకు బోధపడలేదు. దిగులు చెందియున్న వానరవీరులను చూచి విభీషణుడు ఇలా పలికాడు.

"బ్రహ్మాస్త్రానికి విధేయులై రామలక్ష్మణులు స్పృహతప్పి యున్నారు. మీరు భీతి చెందకండి. భయానికి ఇది సమయం కాదు. బ్రహ్మ ప్రసాదించిన అస్త్రము వృథా కాదు. అది తెలిసిన రామలక్ష్మణులు బ్రహ్మదేవుని గౌరవిస్తూ మూర్ఛిల్లినారు;" అని విభీషణుడు పలుకుతుండగా అంతవరకు తాను కూడా బ్రహ్మాస్త్రానికి తలవంచి పడియున్న హనుమంతుడు దానిని విడిపించుకుని వచ్చి ఇలా పలికాడు.

"బ్రహ్మాస్త్రప్రయోగము వలన వానరు లందరూ భయంకరంగా హింసింపబడ్డారు. ప్రాణాలతో బ్రతికియున్న వారిని మనం ఓదార్చాలి;" అన్నాడు. హనుమంతుడు, విభీషణుడు ఆ రాత్రివేళ వెలుగుతున్న కాగడాలను చేతపట్టుకొని యుద్ధభూమిలో సంచరించారు.

చేతులు తెగి, తొడలు తొలగించబడి, తోకలు ఖండించబడి, తలలు పగిలి పడియున్న వానరవీరుల్ని చూశారు. కొందరి దేహాలనుండి రక్తం స్రవిస్తూ ఉంది. కొందరు మూత్రవిసర్జనము చేసుకుంటున్నారు. రణరంగమంతా రక్తసిక్తమై పడియున్న వానరసేనతో నిండిపోయింది. బ్రహ్మ ప్రసాదించిన అస్త్రాలతో సాయంకాల సమయాన సుమారు అరవైఆరు కోట్ల వానరులను తన బాణాలతో పడగొట్టాడు ఇంద్రజిత్తు.

హనుమద్విభీషణులు పడియున్న ఆ వానరవీరులలో జాంబవంతుని కొరకు అన్వేషణ ప్రారంభించారు. వయోవృద్ధుడైన జాంబవంతుడు వందలకొలది బాణాలచేత కొట్టబడి శాంతించుచున్న అగ్ని లాగా పడియున్నాడు. జాంబవంతుని చూచి విభీషణుడు సమీపించాడు. కుశల మడిగాడు. జాంబవంతుడు విభీషణునితో ఇలా పలికాడు.

"విభీషణా! నీ గొంతు విని నిన్ను గుర్తు పడుతున్నాను. నాకు ఏమీ కనిపించడం లేదు. బాణాలు నన్ను పీడిస్తున్నాయి. కళ్ళు తెరచి చూడలేక పోతున్నాను. నాయనా! ఆంజనేయుడు బ్రతికి ఉన్నాడా?" అని అడిగాడు జాంబవంతుడు.

పునర్జన్మ నిచ్చిన దివ్యౌషధములు

"ఆర్యా! అదేమిటి? రామలక్ష్మణులను గురించి అడగకుండా హనుమంతుని గూర్చి మాత్రమే అడుగుతున్నావేమి?" అన్నాడు విభీషణుడు.

జాంబవంతుడు మాట్లాడలేక పోతున్నాడు. "జాంబవంతా! మహాత్మా! రాముని యందు గాని, రాజైన సుగ్రీవుని యందు గాని, యువరాజైన అంగదుని యందు గాని ఆసక్తిని కనబరచకుండా ఆంజనేయుని యందే అభిలాషను కలిగియుండుటకు కారణమేమి?" అని ప్రశ్నించాడు విభీషణుడు.

"విభీషణా! అవును. దానికి కారణముంది. విను చెబుతా. నాయనా! హనుమంతుడు గొప్ప వీరుడు. అతడొక్కడు బ్రతికి ఉంటే మనమందరము బ్రతికి ఉన్నట్లే. మన వీరులందరూ చంపబడినా బ్రతికియున్నట్లే. హనుమంతుడు మరణిస్తే మనమందరము జీవించియున్నా మరణించినట్లే.

"హనుమంతుడు వాయుదేవు నంతటివాడు. అతడు చల్లగా ఉంటేనే మనం హాయిగా ఉండగలం. విభీషణా! హనుమంతుడు అగ్నిదేవుని వంటివాడు. అతడు లేకపోతే మన దేహాలు చల్లబడినట్లే. నాయనా! హనుమంతుడు ఉంటే, మనకు జీవితంపై ఆశ ఉండడంలో తప్పులేదు."

జాంబవంతుడు అలా మాట్లాడుతూనే ఉన్నాడు. అదంతా ప్రక్కనే ఉండి వింటున్న హనుమంతుడు వినయవంతుడై, శీఘ్రంగా వెళ్ళి జాంబవంతుని పాదాలను గట్టిగా పట్టుకొని గుండెకు హత్తుకుంటూ, కళ్ళకద్దుకుంటూ, "తండ్రీ! - నేను హనుమను" అన్నాడు.

హనుమంతుని పలుకు వినగానే పునర్జన్మ లభించినట్లు భావించాడు జాంబవంతుడు. హనుమంతుని దగ్గరగా తీసికొని ఇలా పలికాడు.

"నాయనా! హనుమంతా! ఇక నీదే అంతా! వానరులకి నీవే సర్వము ఇక. ఆప్తుడవైన నీవే వారిని ఆదుకోని రక్షించాలి.

త్వ త్పరాక్రమ కాలోఽయం నాన్యం పశ్యామి కంచన

"నీ పరాక్రమాన్ని ప్రదర్శించే కాలము వచ్చింది. అన్యు లెవ్వరూ నాకు అగుపించడం లేదు.

"హనుమంతా! సముద్రముపై ప్రయాణం చేసి నీవు హిమాలయానికి వెళ్ళాలి. అక్కడ సువర్ణమయమైన ఋషభపర్వతాన్ని ఎక్కితే నీకు కైలాసశిఖరం కనిపిస్తుంది.

"ఆ రెండు శిఖరాల నడుమ దేదీప్యమానంగా వెలిగిపోతూ ఓషధులతో నిండిన మందుల పర్వతం ఒకటి కనిపిస్తుంది. దాని శిఖరంపై గొప్ప కాంతి గల నాలుగు ఓషధులు ఉంటాయి. అవియే 1. మృతసంజీవిని. 2. విశల్యకరణి. 3. సువర్ణకరణి. 4. సంధానకరణి.

"నాయనా! ఆ నాలుగు ఓషధులను తొందరగా తీసికొని రావాలి. వానరులకు ప్రాణదాతవు నీవే కావాలి;" అన్నాడు జాంబవంతుడు. జాంబవంతుని మాటలు వినగానే హనుమంతుడు ఉత్సాహవంతుడై, ఉప్పొంగుతూ వెంటనే పర్వతశిఖరాన్ని ఎక్కాడు.

అతని పాదాల తాకిడికి పర్వతము చలించింది. పాదాలను అదిమిపట్టి ఎగరడానికి ప్రయత్నించడముతో ఆ పర్వతము అణగిపోయింది. హనుమంతుడు సాగరునికి నమస్కరించాడు. రాముని కొరకు గొప్ప కార్యాన్ని చేయుటకు ఉద్యుక్తుడయ్యాడు.

హనుమంతుడు పాము లాగా తోకను పైకెత్తాడు. నడుము ముందుకు వంచాడు. చెవులు ముడుచుకున్నాడు. నోరు తెరిచాడు. భయంకరమైన వేగంతో ఆకాశానికి ఎగిరాడు. ఆ వేగానికి పర్వతము పైనున్న శిలలు, వృక్షాలు, తీగలు కూడా ఎగిరి, కొంతదూరము పోయి సముద్రములో పడిపోయాయి. వాయువేగంతో సూర్యమార్గంలో పయనించాడు పవనసుతుడు. హిమవత్పర్వతాన్ని చేరాడు.

భయంకరమైన కైలాసపర్వతాన్ని, హిమవచ్ఛిలను, ఋషభపర్వతాన్ని, శ్రేష్ఠమైన మేరు పర్వతాన్ని, ఓషధులతో ప్రకాశిస్తున్న మందులకొండను చూశాడు హనుమంతుడు.

ఓషధిపర్వతముపై దిగి అక్కడ జాంబవంతుడు చెప్పిన మందుల్ని వెతికాడు వాయుపుత్రుడు. హనుమంతుడు తమకొరకే వస్తున్నాడని భావించి ఆ ఓషధులన్నీ కనిపించకుండా అదృశ్య మయ్యాయి.

హనుమంతునికి కోపం వచ్చింది. బిగ్గరగా సింహనాదం చేశాడు. కళ్ళెర్ర చేసి మందులకొండతో మాట్లాడాడు.

"ఓ ఓషధిపర్వతమా! రాముడి మీద నీకు ఆమాత్రం జాలి కూడా లేకుండా పోయింది. నా కంటికి కనిపించకుండా మందులను దాచేశావు. అదే నీ నిర్ణయమైతే కాచుకో. క్షణాల్లో నిన్ను బ్రద్దలు కొట్టేస్తాను;" అంటూనే ముందుకు వంగి, వృక్షాలతో, ఏనుగులతో నిండియున్న కొండను కుదిపి, పెకలించి, దానిని పట్టుకొని ఆకాశంలోకి ఎగిరాడు. గరుత్మంతుని వలె వేగాన్ని పుంజుకున్నాడు. ఆకాశంలో రెండవ సూర్యుని లాగా శోభించాడు ఆంజనేయుడు.



పర్వతాన్ని వానరసేన మధ్యము నుంచి, వానరవీరులకు నమస్కరించి, విభీషణుని కౌగలించుకున్నాడు హనుమంతుడు. ఓషధి పర్వతము యొక్క సుగంధానికే వానరు లందరూ ఆరోగ్యవంతు లయ్యారు.

మందుల వాసనను ఆఘ్రాణించగనే పునరారోగ్యంతో శోభించారు రామలక్ష్మణులు. గాయాలన్నీ క్షణంలో మాయమైనాయి. వానరవీరు లందరూ నిద్రనుండి లేచినట్లు లేచారు. ఓషధుల ప్రభావం వల్ల చచ్చిపోయిన వానరులు కూడా తిరిగి జీవించారు.

రాక్షసులు మాత్రం బ్రతికే అవకాశం లేకుండా పోయింది. కారణ మేమిటంటే, యుద్ధారంభం జరిగిన నాటినుండి ఏరోజు చచ్చిన రాక్షసుల శవాలను ఆ రాత్రే లంకలోని రాక్షసుల చేత వెతికించి సముద్రంలో తోయించేవాడు రావణుడు. ఎక్కువమంది రాక్షసులు వధించబడ్డారని తెలిస్తే అది తనకు, తన ప్రతిష్ఠకు అవమానమని భావించి అలా చేసేవాడు. లేకపోతే, ఓషధిపర్వతము యొక్క మహిమ చేత రాక్షసులు కూడా బ్రతికి ఉండేవారు. వానర వీరులందరూ పునర్జీవితులై ఆరోగ్యవంతులు కాగానే హనుమంతుడు ఆ ఓషధిపర్వతాన్ని తీసికెళ్ళి హిమాలయాలలో యథాస్థానంలో ఉంచి వచ్చాడు.

లంకలో మారణహోమం

వానరసేనను ఉద్దేశించి సుగ్రీవుడు ఇలా పలికాడు: "కుంభకర్ణుడు కూలిపోయాడు. రావణుని నలుగురు పుత్రులు వధించబడ్డారు. ఇక మనకు సమరవిందు సమకూర్చడానికి రావణుడు బైటికి రాక తప్పదు.

"వానరవీరు లందరూ సిద్ధంకండి. కొరవులు చేత పట్టుకొని లంకలో ప్రవేశించాలి. లంకను కాల్చేయాలి;" అన్నాడు సుగ్రీవుడు. వానరులు ఉల్కలను చేత పుచ్చుకొని నలువైపుల నుండి లంకలో ప్రవేశించారు. అది చూచి రాక్షసులు పరుగులు తీశారు.

వేలాది గృహాలను వానరులు దగ్ధం చేసేశారు. పర్వతము వంటి ప్రాసాదాన్ని పడగొట్టేశారు. కూలిపోతున్న మేడల క్రింద పడి చాలామంది రాక్షసులు మరణించారు.

రాక్షసాంగనలు దిక్కుతోచక పరిగెత్తుచున్నారు. రాక్షసు లందరూ పెద్దగా అరుస్తూ వీధిన పడ్డారు. బాగా త్రాగి మత్తులో ఉన్న రాక్షసులు ఎలా వెళ్ళాలో తెలియక మంటల్లోకి వెళ్తున్నారు. గుఱ్ఱాలు, ఏనుగులు కట్లు త్రెంచుకొని వీధిన పడ్డాయి. క్షణకాలంలో లంకంతా అగ్నిమయ మైంది. రాక్షసుల, రాక్షసాంగనల హాహాకారాలు నూరు యోజనాలు వినిపించాయి.

శరీరములు కాలిపోయి పారిపోతున్న రాక్షసులను వానరులు అడ్డుకొని, తొడలు తడుతూ యుద్ధానికి రమ్మని పిలుస్తున్నారు. రామలక్ష్మణులు ధనుస్సులు ధరించి నిలబడ్డారు. రాముడు ధనుష్టంకారము చేశాడు. ఆ శబ్దానికి లంక వ్యాకులము చెందింది.

లంకానగర గోపురముపై రాముడు బాణాన్ని ప్రయోగించాడు. ఆ శిఖరము ముక్కలై క్రిందపడింది. రాక్షసులు ఆ రాత్రిని కాళరాత్రిగా భావించారు.

రావణునికి క్రోధావేశము ఊహించని విధంగా పెరిగిపోయింది. కుంభ నికుంభాదులతో సహా అనేకమంది రాక్షసుల్ని యుద్ధానికి పంపాడు రావణుడు. గొప్ప గొప్ప ఆయుధాలు చేపట్టి యుద్ధానికి బయలుదేరారు రాక్షసులు.

రాక్షససైన్యాన్ని చూచి వానరులు సింహనాదం చేశారు. సమరోత్సాహంతో ఉన్న వానర వీరులు వృక్షాలను, పర్వతశిఖరాలను, బండలను చేత పుచ్చుకొని రాక్షసులను తీవ్రంగా హింసించారు.

వానర రాక్షస వీరులు కలియబడ్డారు. ఒకర్ని మరొకరు చంపుకున్నారు. పరస్పరము తోసుకున్నారు. నిందించుకున్నారు. చరచుకుంటూ, కరచుకుంటూ లంకను యుద్ధభూమిగా మార్చేశారు.

దేహీత్యన్యో దదాత్యన్యో దదామీత్య పురః పునః
కిం క్లేశయసి తిష్ఠేతి తత్రాన్యోన్యం బభాషిరే ॥

"ఏదీ! కొట్టు చూద్దాం!" అని ఒకడు, "ఇదిగో. ఇప్పుడే కొడుతా" అని ఒకడు, "కొట్టాను - ఏంచేస్తావు" అని ఇంకొకడు, "కొట్టేస్తా - జాగర్త" అని మరొకడు, "బడాయికేమిలే! కొడ్తే కదా తెలిసేది?" అని వేరొకడు - ఇలా వానర రాక్షసులు పరస్పరం కలియబడ్డారు.

కొందరికి కవచా లూడిపోయాయి. కొందరికి బట్ట లూడిపోయాయి. ఊడిపోవడానికి వానరులకు ఏమీ లేనందున తోకల్నే విపరీతంగా ఊపేస్తున్నారు. రాక్షసులను చుట్టుముట్టి మరీ చంపేస్తున్నారు.

కుంభుడు - నికుంభుడు

సంకుల సమరం ప్రారంభమైంది. అంగదుడు వీరుడైన కంపనుని ఎదుర్కున్నాడు."రారా! నా చేతిలో పోతావులే! రారా!" అంటూ కంపనుడు అంగదుణ్ణి గదతో కొట్టాడు. ఆ దెబ్బకు చలించిపోయాడు అంగదుడు.

అంగదుడు తేరుకుని ఒక పర్వతశిఖరాన్ని చేత పుచ్చుకొని కంపనునిపై విసిరాడు. కంపనుని కపాలము ముక్కలై పోయింది. కంపనుడు నేల రాలిపోయాడు.

కంపనుడు కూలిపోగానే శోణితాక్షుడు రథమెక్కి అంగదుని పైకి వెళ్ళాడు. శరీరాన్ని చీల్చివేసే కాలాగ్ని వంటి బాణాలతో అంగదుని కొట్టాడు. అంగదుడు విజృంభించి శోణితాక్షుని రథాన్ని, ధనుర్బాణాల్ని ముక్కలు చేసేశాడు. సింహనాదం చేశాడు అంగదుడు.

శోణితాక్షుడు ఖడ్గమును చేత పట్టుకొని ఆకాశానికి ఎగిరాడు. అంగదుడు అంతకన్నా ఎత్తుగా ఎగిరి శోణితాక్షుని చేతిలోని ఖడ్గాన్ని పుచ్చుకొని, దానిని ఆ రాక్షసుని భుజం మీద లోతుగా నాటి జందెమువేటుగా నరికాడు. ఆ ఖడ్గాన్ని చేతబూని బిగ్గరగా సింహనాదం చేస్తూ శత్రువులపైకి ఉరికాడు అంగదుడు.

బలశాలియైన యూపాక్షుడు క్రుద్ధుడై, ప్రజంఘునితో కలిసి అంగదుని వధించుటకు వచ్చాడు. యూపాక్ష ప్రజంఘుల మధ్య అంగదుడు విశాఖనక్షత్రం మధ్య ఉన్న పూర్ణ చంద్రునిలా భాసించాడు. మైంద ద్వివిదులు అంగదునికి సమీపమునందే ఉండి అంగదుని కనిపెట్టుకొని యున్నారు.

ప్రజంఘుడు గదను చేతపట్టుకొని అంగదుని పైకి వెళ్ళాడు. ప్రజంఘుని వెంబడించి యూపాక్షుడు, శోణితాక్షుడు కూడా వచ్చారు. వారిని జూచి మైందద్వివిదులు అంగదుని ప్రక్కన నిలిచారు. ప్రజంఘయూపాక్ష శోణితాక్షులకు, అంగదమైంద ద్వివిదులకు ఘోరంగా యుద్ధం జరిగింది.

అంగదుడు విజృంభించి ఖడ్గముతో ప్రజంఘుని తలను నరికేశాడు. పినతండ్రి ప్రజంఘుడు చనిపోవడం చూచిన యూపాక్షుడు కన్నీళ్ళు కార్చుతూ, ఖడ్గమును చేత పట్టుకొని రథం దిగాడు.

అంగదుని మీదికి పరుగెత్తి వస్తున్న యూపాక్షుని ద్వివిదుడు ఎదుర్కొని గుండెలపై బాదాడు. తన సోదరుడైన యూపాక్షుని ద్వివిదుడు కొట్టడం చూసిన శోణితాక్షుడు క్రుద్ధుడై ద్వివిదుని గుండెలపై కొట్టాడు. అది చూచి మైందుడు పరుగెత్తుకుంటూ వచ్చి యూపాక్షుని గుండెలపై బాదాడు. యూపాక్ష శోణితాక్షులు మైందద్వివిదులతో చాలాసేపు పోరాడారు.

ద్వివిదుడు శోణితాక్షుని ముఖాన్ని గోళ్ళతో చీల్చాడు. నేలమీద పడేసి పిండి కొట్టేశాడు. మైందుడు యూపాక్షుని పైకి ఉరికి అతనిని క్రింద పడేసి వధించాడు. ద్వివిదమైందుల చేతులలో శోణితాక్ష యూపాక్షులు చంపబడ్డారు.

ప్రజంఘుడు, శోణితాక్ష యూపాక్షులు మరణించగానే దిగులు చెందిన రాక్షససైన్యము కుంభకర్ణుని కుమారుడు కుంభుని వద్దకు పరుగెత్తారు. కుంభుడు రాక్షసవీరులను ఓదార్చి ధైర్యం చెప్పాడు.

కుంభుడు బాణంతో ద్వివిదుణ్ణి కొట్టాడు. ఊహించని ఆ దెబ్బకు చలించిపోయిన ద్వివిదుడు తూలిపోయి క్రింద పడ్డాడు. మైందుడు ఒక పెద్ద బండను చేత పట్టుకొని కుంభుని మీదికి వెళ్ళాడు. కుంభుడు బాణంతో కొట్టగానే మైందుడు క్రిందపడి మూర్ఛిల్లాడు.

తన మేనమామ లిద్దరూ పడిపోవడం చూచిన అంగదుడు కుంభుని పైకి దుమికాడు. కుంభుడు అంగదునిపై ఐదు బాణాలను ప్రయోగించాడు. ఇనుపబాణాల చేత తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలకు చలించకుండా కుంభునిపై వృక్షములను వర్షింపచేశాడు అంగదుడు. కుంభుడు వాటి నన్నిటిని ఖండించి, వాడియైన బాణంతో అంగదుని కనుబొమ్మల మీద కొట్టాడు. అంగదుని ముఖం నుండి రక్తం సెలయేరులా స్రవించింది. అంగదుడు అలసి మూర్ఛిల్లాడు. అంగదుడు అలా మూర్ఛిల్లినాడని వానరనాయకులు రామునికి చెప్పారు.

రాముని ఆజ్ఞతో జాంబవదాదులు కుంభుని పైకి వెళ్ళారు. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి క్రుద్ధులై కుంభుని ఎదిరించుటకు వెళ్ళారు. కుంభుడు ఆ ముగ్గురిని బాణాలతో కప్పేశాడు. వానరవీరులు ముందుకు వెళ్ళలేక పోయారు. అది చూచిన సుగ్రీవుడు పరుగెత్తుకుంటూ కుంభుని మీదికి వెళ్ళాడు.

మద్దిచెట్టును పెకలించి కుంభునిపై విసిరాడు సుగ్రీవుడు. ఆ వృక్షాన్ని బాణంతో ఖండించాడు కుంభుడు. సుగ్రీవునిపై వెంట వెంటనే బాణాలను గుప్పిస్తూ తీవ్రంగా బాధించాడు కుంభుడు. సుగ్రీవుడు కుంభుని దెబ్బలకు చలించలేదు. ఎగిరి ధనుస్సును లాగికొని దానిని ముక్కలుగా విరిచేశాడు సుగ్రీవుడు.

"కుంభుడా! రాక్షసుడా! భలే! నీ పరాక్రమం అద్భుతంగా ఉంది. ప్రహ్లాద, బలి, ఇంద్ర, కుబేరులతో నీవు సమానుడివి. నీవు నీ తండ్రి కుంభకర్ణునితో సమానుడివి. జితేంద్రియుని వ్యథలు,. వ్యాధులు చలింప జేయనట్లు, నిన్ను ఇంద్రాది దేవతలు కూడా ఎదుర్కోలేరు.

నీ బలపరాక్రమాల్ని అద్భుతంగా ప్రదర్శించావు. చాలామంది వానరవీరుల్ని వధించావు. చాలామందితో పోరాడి అలసియున్న నిన్ను చంపితే అపవాదానికి గురికావలసి వస్తుందని భయపడి నిన్ను నేను వధించలేదు. కాస్త విశ్రాంతి తీసికొని నా ముందు నీ బలాన్ని ప్రదర్శించు" అన్నాడు సుగ్రీవుడు.

ఆదరిస్తున్నట్లే మాట్లాడుతూ అవమానిస్తున్న సుగ్రీవుని మాటలకు క్రుద్ధుడైన కుంభుడు అగ్నిహోత్రము లాగా మండిపడ్డాడు. అమాంతంగా ఉరికి సుగ్రీవునితో చేతులు కలిపాడు కుంభుడు. మదించిన ఏనుగుల్లాగా కుంభ సుగ్రీవులు చాలాసేపు పోరాడారు.

సుగ్రీవుడు కుంభుని ఎత్తి సముద్రపు పూడికను చూపుటకా అన్నట్లు సముద్రంలో పడేశాడు. మునిగిన కుంభుడు లేచివచ్చి, తీవ్ర కోపంతో సుగ్రీవుని వక్షస్థలముపై కొట్టాడు.

ఆ దెబ్బకు క్రుద్ధుడైన సుగ్రీవుడు పిడికిలి బిగించి బలంగా కుంభుని గుండెలపై కొట్టాడు. ఆ దెబ్బతో కుంభుని కళ్ళు తిరిగిపోయాయి. అవయవాలు పట్టు తప్పాయి. చల్లారిన నిప్పు లాగా ప్రాణచేష్ట లుడిగి క్రిందపడ్డాడు. కన్ను మూశాడు.

సోదరుడైన కుంభుడు సుగ్రీవుని చేతిలో నేలకూలడం చూచిన నికుంభుడు సుగ్రీవుని తన కళ్ళతోనే కాల్చివేయుచున్నట్లు చూశాడు. మహేంద్రపర్వతం లాంటి పరిఘను పుచ్చుకున్నాడు నికుంభుడు. అది యమదండం లాగా ఉంది. ఆ పరిఘను చేతపట్టుకొని మేఘం లాగా గర్జించాడు నికుంభుడు. ఎదురైన హనుమంతుని వక్షఃస్థలముపై ఆ పరిఘను పడవేశాడు నికుంభుడు.

హనుమంతుని వక్షఃస్థలముపై పడిన పరిఘ ముక్కలై, ఆకాశమున నక్షత్రాలవలె విరజిమ్మబడింది. నికుంభుని దెబ్బకు గురియైన పవనసుతుడు పిడికిలివి బిగించాడు. నికుంభుని గుండెలపై బలంగా కొట్టాడు హనుమంతుడు.

నికుంభుని కవచము బ్రద్దలైంది. రక్తము స్రవించింది. హనుమంతువి దెబ్బకు చలించిపోయిన నికుంభుడు కొంతసేపటికి తేరుకొని మళ్ళీ హనుమంతుని పట్టుకున్నాడు. పైకి ఎత్తాడు. నికుంభుడు హనుమంతుని పైకి ఎత్తగానే రాక్షసులందరూ సంతోషించి బిగ్గరగా అరచారు.

నికుంభుడు హనుమంతుని ఎత్తుకొని పోతూవుండగా హనుమంతుడు నికుంభుని పిడికిలితో కొట్టాడు. అతని పట్టునుండి విడిపించుకొని క్రిందికి దిగి నికుంభుని పీడించాడు.

హనుమంతుడు వాయువేగంతో ఎగిరి నికుంభుని వక్షస్థలముమీద పడ్డాడు. రెండు చేతులతో నికుంభుని కంఠాన్ని మెలిపెట్టి త్రిప్పేశాడు. బిగ్గరగా సింహనాదం చేసి తల ఊడతీసి పారేశాడు.

నికుంభుడు మరణించగానే వానరులు పరమోత్సాహంతో గంతులు వేశారు. రాక్షసులు భీతిచెంది లంకకు పరుగెత్తి పోయారు.

మకరాక్షుని మరణం

కుంభుడు, నికుంభుడు యుద్ధంలో మరణించారని తెలియగానే రావణుడు అగ్నిలా మండిపడ్డాడు. క్రోధంతో ఊగిపోతూ ఖరుని కుమారుడైన మకరాక్షుని పిలిచాడు.

"కుమారా! మనకు శత్రువులు ఆ రామలక్ష్మణులు. మన రాక్షసవీరులను అందరినీ సంహరించారు. నువ్వు వెళ్ళు. రాక్షససైన్యాన్ని వెంటబెట్టుకొని వెళ్ళి రామలక్ష్మణులను వధించి రా" అన్నాడు రావణుడు.

రావణుడు తనకు అలా చెప్పగానే అహంకారంతో వెలిగిపోతూ, "ఓ, అదెంతసేపు" అంటూ బయలుదేరాడు. రావణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు.

రథానికి నమస్కరించి, రథాన్నెక్కి, "తొందరగా పోనీ!" అన్నాడు సారథిని. అహంకారము చావును కూడా లెక్కచేయదు అనడానికి ఇదొక తార్కాణము.

మకరాక్షునితో పాటు పెద్ద సైన్యం కదిలింది. "మీరంతా నాకు కనిపిస్తూ యుద్ధం చెయ్యాలి" అని కొత్త ఆజ్ఞను విధించాడు సైన్యానికి మకరాక్షుడు. "యుద్ధములో రామలక్ష్మణులను వధించి రమ్మని మా పెదనాన్న నన్ను ఆజ్ఞాపించాడు.

"వీరులారా! రామలక్ష్మణ సుగ్రీవుల్ని ఈరోజే నేను వధించేస్తాను. చిన్నచిన్న వీరుల విషయం మీరు చూసుకోండి. ఈ వానరసైన్యాన్నంతా శూలాలతో పొడిచేసి కట్టెలతో కాల్చేస్తాను. ఎవరెవరి మీద మకరాక్షుని కన్ను పడుతుందో వారంతా మరణం వాత పడినట్లే;" అన్నాడు మకరాక్షుడు.

మకరాక్షుని పరాక్రమాన్ని చూచి పొంగిపోయారు రాక్షసులు. భేరీలు మ్రోగించారు. తప్పెటలు వాయించారు. రణధ్వనులు వినిపించారు. పెద్దగా సింహనాదాలు చేశారు.

మకరాక్షుని రథం ముందుకు పోబోతోంది. ఈలోగా సారథి చేతినుండి కొరడా జారి క్రిందపడింది. ఉన్నపళంగా రథముపైనుండి ధ్వజము క్రిందపడింది. గుఱ్ఱాలు తొట్రుపాటుతో నడుస్తూ కన్నీళ్ళు కార్చాయి. ఈలోగా గాలి ప్రచండంగా వీచింది. దుమ్ము ఆకాశాన్ని అలుముకుంది. దుశ్శకునాలు కనిపిస్తున్నా లెక్క చేయకుండా ముందుకు దూసుకుపోయారు రాక్షసులు. "నేను ముందు - నేను ముందు" అంటూ యుద్ధభూమిలోకి దూరిపోయారు.

రాక్షసుల్ని చూడగానే యుద్ధోన్మాదంతో వానరులు కూడా ఎగురుతూ ముందుకు వచ్చారు. వానర రాక్షస వీరుల మధ్య యుద్ధము భయంకరంగా సాగింది. ఒకరినొకరు దారుణంగా పీడించుకున్నారు.

మకరాక్షుని శరఘాతములను తట్టుకోలేక వానరవీరు లందరూ అటూ ఇటూ పారిపోసాగారు. పారిపోతున్న వానరుల్ని చూచి జయము తమదే నన్నట్లు సింహనాదాలు చేశారు రాక్షసులు. రాక్షసులు ముందుకు రాకుండా రాముడు బాణవర్షాన్ని కురిపించాడు. రాముడు రాక్షసుల్ని అలా నివారించడం చూచి మకరాక్షుడు పౌరుషంతో ఇలా మాట్లాడాడు.

"రామా! ఆగు. ఇప్పుడు జరుగబోయే యుద్ధం మనిద్దరి మధ్యే. నా ధనుస్సు విడిచే బాణాలు నీ ప్రాణాల్ని గుట్టు చప్పుడు కాకుండా పట్టుకు పోతాయి.

"ఆనాడు జనస్థానంలో పిరికిపందవై నా తండ్రి ఖరుణ్ణి వధించావు. అలాంటి చెడ్డపనులకు అలవాటు పడిన నిన్ను చూడగానే నా ఒళ్ళు మండిపోతోంది.

"ఆనాడు నేను అక్కడ ఉండి వుంటే, ఈనాడు నువ్వు ఇక్కడ ఉండేవాడివేనా? ఆనాడు నీవు కంటపడి వుంటే ఈరోజు నువ్వు నా కంటపడే వాడివేనా? నీకు అప్పటికి ఆయుర్దాయము పూర్తి కాలేదు. అందుకే నేను ఆనాడు అక్కడ లేకుండా పోయాను.

"పోనీలే. ఈనాడన్నా కనిపించావు. ఆకలిగొన్న సింహము మృగాలకై అన్వేషించునట్లు, నా తండ్రి వధకు కారణమైన నిన్ను కళ్ళల్లో వత్తులేసుకొని ఇంతకాలంగా వెతుకుతున్నాను. ఈరోజు నా కంటపడ్డావు.

"ఇప్పుడే నా బాణాలు నీపై వాలుతాయి. నిన్ను నేను చంపను. నీ ప్రాణాల్ని నీవు చంపిన మావారు ఉండే చోటికి చేర్చుతాను. వారు అక్కడ చంపుతారు నిన్ను. మా నాన్నను వధించావు. మా నాన్న అక్కడ నిన్ను ముక్కలు ముక్కలుగా చీరేస్తాడు;" అంటూ పేలుతున్నాడు మకరాక్షుడు.

"ఓరీ రాక్షసాధమా! వాగుడుకాయలా ఉన్నావు. ఎందుకొచ్చిన డాబులు! రణరంగంలో ఎవరైనా యుద్ధం చేసి జయిస్తారు. అంతేగాని మాటలు పలికి జయించలేరు. మాటలతో జయించగల మనుకొనే మందబుద్ధిని ఇప్పుడే, ఇక్కడే చూస్తున్నాను.

"జనస్థానంలో నా బాణాలకు నేలకూలింది అల్పుడైన నీ తండ్రి ఒక్కడే కాదు. దూషణుడు, త్రిశిరస్సు, పద్నాలుగు వేలమంది రాక్షసులు రాలిపోయారు. పాపీ! నోటికొచ్చినట్లు పలవరిస్తున్నావు. ఇప్పుడు వాడియైన గోళ్ళు గల గ్రద్దలు, కాకులు నీ దేహాన్ని పొడిచి పొడిచి తింటాయి;" అన్నాడు రాముడు.

రాముని మాటలకు క్రుద్ధుడైన మకరాక్షుడు రామునిపై శరవర్షం కురిపించాడు. వాటిని మధ్యలోనే ఖండించాడు రాముడు. పరస్పరము బాణాలు సంధించుకుంటూ దారుణంగా యుద్ధం చేశారు రామ మకరాక్షులు. ఇరువురు విడిచిన బాణముల శబ్దము ఆకాశంలో మబ్బులు ఉరిమినట్లు ఉండింది.

రాముడు కోపించి, మకరాక్షుని ధనుస్సును ఛేదించాడు. ఎనిమిది నారాచబాణాలతో సారథిని కొట్టి చంపాడు. వాడియైన బాణాన్ని రథంపై ప్రయోగించగా రథము బ్రద్దలైంది. రాముని శరఘాతానికి అశ్వములు నేలకూలాయి. మకరాక్షుడు ఒంటరిగా నేలమీద నిలిచాడు.

మకరాక్షుడు భయంకరమైన శూలాన్ని చేతిలో ధరించాడు. మండుచున్న ఆ శూలాన్ని గిరగిర త్రిప్పి రామునిపైకి విసిరాడు మకరాక్షుడు. దానిని ఆకాశంలోనే ముక్కలు చేసేశాడు రాముడు.

శూలము ముక్కలై క్రింద పడగానే మకరాక్షుడు పిడికిలి బిగించి "ఆగు-ఆగు" అంటూ రాముని మీదికి వచ్చాడు. రాముడు ఆగ్నేయాస్త్రం తొడిగి మకరాక్షుని గుండెలపై ప్రయోగించాడు. హృదయం చీలి క్రిందపడ్డాడు మకరాక్షుడు. ప్రాణాలు పైకి ఎగిరిపోయాయి. మకరాక్షుడు మరణించగనే రాక్షసు లందరూ తమకు లేకపోయినా కాలికి బుద్ధి చెప్పారు. లంకలో ప్రవేశించినంత వరకు పొరపాటున కూడా వెనుదిరిగి చూడలేదు. మకరాక్షుని మృత కళేబరాన్ని చూచి ఎంతగానో సంతోషించారు వానరులు.

ఈసారి ఇంద్రజిత్తే

మకరాక్షుడు మరణించినట్లు రావణునికి తెలిసింది. పళ్ళు పటపటమని కొరికి "ఏమి చేయాలి?" అని ఆలోచించి, కుమారుడైన ఇంద్రజిత్తుని పిలిచి ఇలా పలికాడు.

"కుమారా! వీరా! నీవు బలశాలివి. బుద్ధిశాలివి. కంటబడి గాని, కనిపించకుండా గానీ నీవు రామలక్ష్మణుల్ని సంహరించాలి. ఇంద్రుణ్ణే జయించిన నీకు ఈ మానవమాత్రులు సరియైన వారని నేను అనుకోను;" అన్నాడు.

ఇంద్రజిత్తు తండ్రి అనుమతి తీసికొని యజ్ఞభూమి యందు శాస్త్రవిధి ననుసరించి యజ్ఞము చేశాడు. అగ్నిహోత్రము చుట్టూ దర్భలు, తోమారాలు పరచాడు. నల్లని మేకను బలి కూడా ఇచ్చాడు. ధూమము లేకుండా అగ్నిహోత్రము లేవగా దానిని విజయచిహ్నంగా భావించాడు ఇంద్రజిత్తు.

యజ్ఞము ద్వారా దేవ, దానవ, రాక్షసులకు తృప్తిని కలిగించాడు. ఇతరులకు అగుపించని రథాన్ని ఎక్కాడు. సూర్యతేజము వంటి బ్రహ్మాస్త్రముచే రక్షింపబడుచున్న ఇంద్రజిత్తు అసమాన పరాక్రమవంతుడుగా శోభించాడు. దురాధర్షుడై ప్రకాశించాడు.

"రాక్షసవీరులారా! వినండి. తాపసులైన ఆ రామలక్ష్మణులకు ఈ ప్రపంచంతో ఉన్న బంధం ఈనాటితో తీరిపోయింది. రామలక్ష్మణులను యుద్ధంలో వధించి, నా తండ్రికి నేడే విజయాన్ని తెచ్చిపెడతాను.

"అంతేకాదు. ఈ కోతిమూకల్ని ప్రపంచంలోనే లేకుండా చేసేస్తాను;" అని పలికి ఇంద్రజిత్తు అదృశ్య మయ్యాడు.

రణరంగంలో రామలక్ష్మణుల్ని చూశాడు. వారిపై దారుణంగా బాణవర్షం కురిపించాడు. ఇంద్రజిత్తు మాత్రము కనిపించడం లేదు. బాణాలు మాత్రం కప్పేస్తున్నాయి రామలక్ష్మణుల్ని. రామలక్ష్మణులు కూడా ధనుస్సును చేపట్టి, బాణాలను సంధించి, ఇంద్రజిత్తుపై ఊహతో బాణాల్ని విడిచారు.

ఇంద్రజిత్తు ఆకాశంలో అదృశ్యంగా ఉన్నందున రామలక్ష్మణులు వేసే బాణాలను చాక చక్యంతో తప్పించుకుంటున్నాడు. ఇంద్రజిత్తు పొగపుట్టించి, ఆకాశాన్నంతా ధూమంతో నింపేశాడు. పొగమంచుతో దిక్కులు తెలియకుండా చేశాడు.

ఇంద్రజిత్తు గగనవిహారం చేస్తున్నాడే గాని అతని రూపం కనిపించదు. రథం యొక్క శబ్దం వినిపించదు. ధనుష్టంకార ధ్వని ఉండదు. రథచక్రాల మోత ఉండదు. గుఱ్ఱపు డెక్కల చప్పుడు తెలియదు.

దిక్కులు తెలియని ఆ చీకటిలో నారాచబాణాలను శిలావర్షంలా కురిపించాడు ఇంద్రజిత్తు. రామలక్ష్మణులను సర్వాంగముల మీద కొట్టాడు ఇంద్రజిత్తు. రామలక్ష్మణులు ఆ బాణాలు వచ్చే దిక్కు ననుసరిస్తూ దివ్యమైన అస్త్రాలను ప్రయోగించారు. అవి ఇంద్రజిత్తుకు తగిలి రక్తంతో తడిసి క్రింద పడుతున్నాయి. ఇంద్రజిత్తు విరామం లేకుండా రామలక్ష్మణులను బాణాలతో కొడుతూనే ఉన్నాడు. ఆ దెబ్బలకు రామలక్ష్మణులు పుష్పించిన కింశుక వృక్షాలవలె కనిపించారు.

ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణవర్షానికి గురియై అనేకమంది వానరులు మరణించారు. అదంతా చూసి కలతచెంది క్రుద్ధుడైన లక్ష్మణుడు రామునితో ఇలా పలికాడు.

"అన్నా! సర్వరాక్షస సంహారాన్ని కాంక్షిస్తూ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాను;" అన్నాడు. "లక్ష్మణా! దుష్టుడైన ఒక్క రాక్షసుని కారణంగా లోకంలో ఉన్న రాక్షసుల నందరినీ సంహరించడం పాడి కాదు. లక్ష్మణా! గుర్తుపెట్టుకో! యుద్ధము చేయుటకు అంగీకరించని వానిని, దాగిన వానిని, నమస్కరించిన వానిని, శరణన్న వానిని, పారిపోవు వానిని, పిచ్చివానిని ఎప్పుడూ చంపకూడదు.

"తమ్ముడూ! ఎలాగైనా మనం ఇంద్రజిత్తును వధించడానికే ప్రయత్నించాలి. సర్పరూపబాణాల్ని ప్రయోగిస్తాము. నీచుడు, మాయావి యైన ఆ రాక్షసుడు కంటబడితే క్షణం మిగలడు.

"లక్ష్మణా! దుష్టుడైన ఈ ఇంద్రజిత్తు భూమిలో దూరనీ గాక, స్వర్గంలో చేరనీ గాక, పాతాళంలో ప్రవేశించనీ గాక, ఆకాశంలో సంచరించనీ గాక, నా అస్త్రము చేత చంపబడి నేలకూలిపోతాడు;" అని పలికి ఇంద్రజిత్తును శీఘ్రంగా వధించడానికి వానరశ్రేష్ఠులను రాముడు సంప్రదించాడు.

రాముని ఉద్దేశం ఇంద్రజిత్తుకు అర్థమైంది. యుద్ధభూమి నుండి మరలి లంకలో ప్రవేశించాడు.

మాయ సీత*

ఈసారి ఇంద్రజిత్తు మరోవిధంగా ఆలోచించాడు. యుద్ధానికి సన్నద్ధులై యున్న రామలక్ష్మణుల్ని మాయతో మోసం చేసి చంపాలని కుట్ర పన్నాడు.

ఇంద్రజిత్తు రథమెక్కాడు. మాయసీతను ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. యుద్ధరంగంలో అందరూ చూస్తూ ఉండగా ఆమెను వధించాలని నిర్ణయించుకున్నాడు. వానరులు చూస్తారనే దురుద్దేశ్యంతో రథాన్ని వానరుల వైపు నడిపించాడు.

ఇంద్రజిత్తు రథం రావడం చూచిన వానరులు శిలలను, వృక్షాలను చేతపట్టుకొని యుద్ధానికి సిద్ధపడ్డారు. హనుమంతుడు పెద్ద పర్వతశిఖరాన్ని చేతపట్టుకొని ముందు నడిచాడు.

ఇంద్రజిత్తు రథంలో సీత కనిపించింది హనుమంతునికి. ఒకే జడతో శోభిస్తూ, వాడిన ముఖంతో, ఉపవాసాలతో కృశించిన శరీరియై, దీనవదనయై, మాసిన వస్త్రాన్ని కట్టుకొని, ధూళితో నిండిన దేహంతో సీత కన్పించింది.

చూడగానే ఆమె సీత అని తెలిసిపోయింది ఆంజనేయునికి. తీవ్రదుఃఖానికి గురయ్యాడు హనుమంతుడు. దీనురాలైన సీతను చూచి హనుమంతుడు తనలో తాను ఇలా ఆలోచించాడు. "ఇతడు సీతను ఇక్కడికి ఎందుకు తీసికొని వచ్చాడు? ఏమి చేయాలని తీసికొని వచ్చాడు?" అని ఆలోచిస్తూ, వానరశ్రేష్ఠులకు కూడా ఆమె సీత అని తెలిపి, వానర వీరులతో కలిసి ముందుకు ఉరికాడు. ఇంద్రజిత్తు వైపు నడిచాడు.

ఇంద్రజిత్తు వానరసైన్యాన్ని చూశాడు. ఒర నుండి కత్తిని దూసి, సీతను జుట్టుపట్టి లాగాడు. "రామా - రామా" అని విలపిస్తున్న సీతను కొట్టాడు. ఇంద్రజిత్తు సీత జుట్టు పట్టుకొని కొట్టడం చూచిన వాయుపుత్రుడు దీనుడై, శోకంతో కదలిపోతూ కన్నీళ్ళు కార్చాడు. ఇంద్రజిత్తుతో ఇలా పలికాడు.

"ఓరీ దురాత్ముడా! నీకు వినాశకాలము దాపురించింది. అందుకే ఆమె కేశపాశాన్ని పట్టుకున్నావు. గుర్తుంచుకో. అది కేశపాశము కాదు. నీ పాలిటి మృత్యుపాశము.

"నీచుడా! పాపీ! దయాహీనుడా! ఎంత చెడ్డపని చేశావు! పవిత్రురాలైన సీతను కొడుతున్నావే! ఆమె నీకు ఏం అపకారం చేసిందిరా! సీతను చంపిన తరువాత నీవు ఎంతకాలం జీవించగలవురా పాపీ! నీవు వధార్హుడివి. అది కూడా నా చేతిలోనే.

"నీవు చచ్చిన తరువాత కూడా సుఖించలేవు. స్త్రీవధ వల్ల ప్రాప్తించే నీచపు లోకాల ద్వారాలు నీకోసం తెరుచుకొని ఉంటాయి;" అని పలికి వానరులతో కలిసి ఇంద్రజిత్తు మీదికి వెళ్ళాడు. ముందుకొస్తున్న వానరసైన్యాన్ని రాక్షససైన్యం నివారించింది.

సీతను ఇకమీదట "సీతమ్మ"గానే చైతన్య రామాయణము వ్యాఖ్యాత ఉచ్చరిస్తాడు అని సుందరకాండ -170 పుటలో స్వామీజీ చెప్పిన మాటను ఇక్కడ విస్మరించినట్లు అగుపిస్తుంది. కానీ అది సత్యం కాదు. 'మాయసీత'ను సీతమ్మగా వ్యాఖ్యాత గుర్తించక పోవడమే అలా వ్రాయడానికి కారణము - ప్రకాశకులు.

"వానరుడా! చెబుతున్నా. విను. ఈ సీత కోసమే కదూ నువ్వు లంకలో కాలుపెట్టింది! రాముడు, సుగ్రీవుడు ఇక్కడికి వచ్చింది ఈ సీత కొరకే కదూ! చూస్తూవుండు నీ కళ్ళముందే ఈ సీతను ముక్కలు ముక్కలుగా నరికేస్తాను.

"అంతటితో సీత పీడ విరగడైపోతుంది. కానీ నా నీడ మిమ్మల్ని వెంటాడడం మాత్రం ఉండనే ఉంటుంది. సీత చావగానే, రాముణ్ణి, తరువాత లక్ష్మణుణ్ణి, వాడి వెనుకాలే నిన్ను, నీవెనుకాలే సుగ్రీవుణ్ణి పొట్లకాయలు తరిగినట్లు తరిగేస్తాను.

"స్త్రీలను చంపకూడదా?" అయితే నీ ప్రశ్నకు సమాధానం చెబుతాను. విని తెలుసుకో.

పీడాకర మమిత్రాణాం యత్స్యా త్కర్తవ్య మేవ తత్

"శత్రువులకు బాధ కలిగించేది ఏదయినా చేయవచ్చు."

ఈవిధంగా పలికి, మాయ ఏడ్పులు వినిపిస్తున్న ఆ మాయసీతను పట్టుకొని తీక్షణమైన ఖడ్గాన్ని చేబూని సీతను నరికేశాడు ఇంద్రజిత్తు.

"ఏయ్! వానరుడా! చూశావా! రాముడి భార్యను కత్తితో నరికేశాను. చచ్చి పడివుంది. చూడు. ఇక దేనికి మీ శ్రమంతా! పాపం! ఇంతవరకు చేసిన శ్రమంతా బుగ్గిపాలైంది కదూ!" అని పలుకుతూ సింహనాదం చేశాడు ఇంద్రజిత్తు. వానరు లందరూ దుఃఖంతో దీనులయ్యారు. దిక్కులు పట్టి పారిపోయారు.

పారిపోతున్న వానరుల్ని అడ్డగించి హనుమంతుడు ఇలా పలికాడు. "వానరవీరులారా! సమరోత్సాహాన్ని విస్మరించి, దీనులై ఎందుకు అలా పారిపోతున్నారు? మీ వీరత్వ మేమైంది? మీ శూరత్వ మెక్కడికి పోయింది . శూరులైన వారు యుద్ధానికి వెన్ను చూపి పారిపోకూడదు. నేను ముందు ఉంటాను. నా వెనుక మీరు ఉండండి;" అని హనుమంతుడు చెప్పిన మాటలను ఆలకించి, ఉత్సాహంతో పర్వతశిఖరాలను, వృక్షాలను పెకలించి చేతపట్టుకున్నారు వానరులు. గర్జిస్తూ రాక్షసుల మీదికి వెళ్ళారు.

హనుమంతుడు బాధతో, కోపంతో కూడియున్న కారణంగా ఒక్కసారి విజృంభించి రాక్షససేనను కాల్చిపారేశాడు. ఆ సమయంలో కాలాంతకుడై కనిపించాడు. ఒక పెద్ద పర్వత శిఖరాన్ని పెకలించి ఇంద్రజిత్తు రథంపై విసిరాడు హనుమంతుడు. కానీ రథాన్ని చాకచక్యంతో సారథి ప్రక్కకు తప్పించాడు. ఇంద్రజిత్తు రథంపై పడకుండా అది క్రిందపడింది. దాని క్రింద రాక్షసులు నలిగిపోయారు.

వేలమంది వానరులు వృక్షాలను, పర్వతశిలలను పట్టుకొని ఇంద్రజిత్తు పైకి ఉరికారు. సింహనాదాలు చేశారు. రాక్షసుల్ని చితకబాది చంపేశారు. అది చూచి ఇంద్రజిత్తు శత్రువులకు అభిముఖుడై వచ్చి, బాణవర్షం కురిపించి అనేకమంది వానరులను సంహరించాడు. వానరులు కూడా శిలలతో, చెట్లతో రాక్షసుల్ని వధిస్తున్నారు.

హనుమంతుడు శత్రుసైన్యాన్ని నివారించి, వానరసైన్యాన్ని వెనుకకు మరలించాడు. "ఈ రాక్షసుల్ని వధించి ఏమి ప్రయోజనం?" అని తనను తాను ప్రశ్నించుకున్నాడు.

"వానరులారా! రామునికి సంతోషాన్ని కలిగించాలని ప్రాణాలను ఒడ్డి పోరాడాము. ఏ సీత కోసము యుద్ధం చేశామో ఆమె మరణించింది. ఎందరిని చంపితే మాత్రం ఏం లాభం?

రామునికి సీతను సమర్పించగలమా? రాముని దుఃఖాన్ని పోగొట్టి, సుఖాన్ని కలిగించే అవకాశం ఇక మనకు ఎక్కడిది. అయిపోయింది. అంతా అయిపోయింది. ఏది జరుగకూడదో అదే జరిగిపోయింది.

"జరిగిన విషయాన్ని రామసుగ్రీవులకు ముందుగా చెప్పాలి. ఇదే మన తక్షణకర్తవ్యం. వారు ఏమి చేయమంటే అది చేస్తాము;" అని పలికి వానరసేనతో కలిసి వెనుకకు మరలాడు హనుమంతుడు. హనుమంతుడు రాముని వద్దకు వెళ్ళుటను గాంచిన ఇంద్రజిత్తు హోమం చేయడానికి నికుంభిలా చైత్యానికి వెళ్ళాడు.

ఇంద్రజిత్తు విధి ననుసరిస్తూ హోమం ప్రారంభించాడు. మాంసాన్ని, రక్తాన్ని అగ్నిలో హోమం చేశాడు. సంధ్యాకాల సూర్యునిలా ప్రకాశించాడు అగ్నిహోత్రుడు. దానిని కాపాడుతూ చాలామంది రాక్షసులు అక్కడే కాపలా ఉండినారు.

ఎక్కడ ధర్మం! ధనమే ఎక్కడైనా!

వానర రాక్షసుల సమరధ్వనులు మిన్నుముట్టుతున్నాయి. "జాంబవంతా! సమరధ్వనులు గొప్పగా వినిపిస్తున్నాయి. హనుమంతుడు ఏదో గొప్ప పని చేసి ఉంటాడు. నీవు కూడా వెళ్ళు. భల్లూకవీరుల్ని వెంటపెట్టుకొని వెళ్ళి హనుమంతునికి సాయం చెయ్యి" అన్నాడు రాముడు.

"అలాగే" నని పలికి జాంబవంతుడు బయలుదేరాడు. పశ్చిమద్వారం వైపుకు వెళ్తూ ఉండగా, వానరవీరులతో కలిసి దిగులుతో వస్తున్న హనుమంతుని చూశాడు జాంబవంతుడు. భల్లూకసైన్యాన్ని కూడా వెనుదిరగమని చెప్పి హనుమంతుడు రాముని వద్దకు వచ్చాడు.

రాముని చూడగానే హనుమంతునికి దుఃఖం ఆగలేదు. కన్నీళ్ళు కారుస్తూ "యుద్ధరంగంలో మేమందరము చూస్తూ ఉండగానే ఇంద్రజిత్తు, 'రామా-రామా' అని రోదిస్తున్న సీతను చంపేశాడు. అది చూచి నా మనసు క్రుంగిపోయింది. ఈ విషయాన్ని మీకు తెలుపాలని వచ్చాను" అని హనుమంతుడు చెప్పగానే రాముడు దుఃఖాక్రాంతుడై మొదలు నరికిన వృక్షం లాగా క్రిందపడి మూర్ఛిల్లాడు. వానరవీరు లందరూ దుఃఖిస్తూ రాముని చుట్టూ చేరారు. పద్మముల, కలువల సువాసనతో కూడిన చల్లని ఉదకాన్ని ముఖంపై చల్లారు.

లక్ష్మణుడు దుఃఖిస్తూ రాముణ్ణి కౌగిలించుకొని పసిబిడ్డలా విలపించాడు.

"అన్నా! నీవు ఉత్తముడివి. జితేంద్రియుడివి. ధర్మాత్ముడివి. కానీ ధర్మము నిన్ను ఆపదల నుండి ఉద్ధరించలేక పోయింది. ఇక ఎందుకు ఈ ధర్మం? ఎవరి కొరకు ఈ ధర్మం! దేనికొరకు ధర్మాచరణము?

"చరాచర భూతజాలములు మనకు కనిపిస్తున్నాయి. ధర్మాధర్మములు అలా కనిపించడం లేదు. కనుక ధర్మాధర్మములు లేవనే నా అభిప్రాయం. ధర్మమే ఉంటే నీకు, నీలాంటి వానికి ఈ ఆపద సంభవిస్తుందా?

"అధర్మ మనేది ఉంటే రావణుడికి నరకం ప్రాప్తించి ఉండాలి. కానీ అలా జరుగలేదు. అతడు సుఖంగానే ఉన్నాడు. ధర్మ మనేది ఉంటే నీవు సుఖించి ఉండాలి. ఇదీ జరుగలేదు. నువ్వు ఆపదలనే ఆహారంగా స్వీకరిస్తున్నావు. దీనినిబట్టి ధర్మాధర్మములు రెండూ లేనివియే అని నేను భావిస్తున్నాను.

"ధర్మ మనేది ఆలోచనకు అందదు. కంటికి కనిపించదు. అసలు ఉందో లేదో కూడా అనుమానమే. అలాంటి ధర్మము మనలను ఎలా ఉద్ధరిస్తుంది?

"సత్యపరిపాలనమే ధర్మ మంటావా? అదే నిజమైతే నీకు రాజ్యాన్నిస్తానని చెప్పి, నిన్ను అడవుల పాల్జేసిన రాజుగారి విషయంలో ఎందుకు మౌనం పట్టావు? రాజ్యాన్ని పోగొట్టుకున్నావు ధర్మం ధర్మం అంటూ.

ధనమే సమస్తానికీ మూలం. ధనం పని చేసినట్లు ధర్మం చేయదు. ధనం ఉంటే అన్నీ సమకూరుతాయి. ధనం లేనిచో ధర్మం నిరుపయోగం. కొండలుంటేనే జలం ప్రవహిస్తుంది. ధనముంటేనే సమస్తకార్యాలు జరుగుతాయి. ధనం లేకపోతే వేసవికాలంలో సెలయేళ్ళు ఇంకిపోయినట్లు అన్ని కార్యాలూ అడుగంటుతాయి.

యస్యార్థా స్తస్య మిత్రాణి యస్యార్థా స్తస్య బాంధవాః
యస్యార్థా స్స పుమాన్లోకే యస్యార్థా స్స చ పణ్డితః

"ధనమున్న వానికే స్నేహితు లుంటారు. ధనమున్న వానికే బంధువు లుంటారు. ధనమున్నవాడే మగవాడు. ధనమున్నవాడే పండితుడు.

"రామా! ఇంద్రజిత్తు నీకు ఘోరమైన అన్యాయం చేశాడు. దానికి ఇప్పుడే నేను ప్రతిక్రియ చేస్తాను. నువ్వు లే. నరశార్దూలా! దీర్ఘబాహో! దృఢవ్రతుడా! సీతను హత్య చేసిన ఆ రాక్షసుణ్ణి హతమారుస్తాను. లంకను బూడిద చేసేస్తాను;" అన్నాడు లక్ష్మణుడు.

అంతా మాయ

లక్ష్మణుడు రాముని ఓదార్చుతుండగా, సేనలను సముచిత స్థానాల్లో నిలిపి శీఘ్రంగా వచ్చాడు విభీషణుడు. రాముడు లక్ష్మణుని ఒడిలో పడుకొని యున్నాడు. అది చూచిన విభీషణుడు "ఇదేమిటి?" అని దీనంగా ప్రశ్నించాడు.

లక్ష్మణుడు దుఃఖిస్తూ, "విభీషణా! ఇంద్రజిత్తు సీతను యుద్ధభూమిలో చంపేసినాడట. అది చూచిన హనుమంతుడు చెప్పగానే రాముడు మూర్ఛిల్లాడు" అని విలపించాడు లక్ష్మణుడు.

ఇక ఆపమని లక్ష్మణుని నివారించి విభీషణుడు రామునితో ఇలా పలికాడు: "రామా! సముద్రం ఎండిపోయింది అనే మాట ఎంత సత్యమో హనుమంతుడు చెప్పింది కూడా అంతే సత్యము.

"దుష్టుడైన రావణుడి మనసు నాకు తెలుసు. సీతను చంపడానికి వాడు అంగీకరించడు. ఇంద్రజిత్తు మాయ చేశాడు. మాయసీతను వధించాడు. ఇదంతా మోసం!

"ఇంద్రజిత్తు నికుంభిల చైత్యానికి వెళ్ళి హోమం చేస్తున్నాడు. అది పూర్తయిందా! ఇక ఇంద్రుడు కూడా ఇంద్రజిత్తుని ఓడించలేడు. ఆ హోమము పూర్తయ్యే లోగా మనం సైన్యంతో అక్కడికి వెళ్ళాలి. రామా! అకారణంగా దుఃఖించకు. అదంతా మోసం!

"నీవు శోకిస్తే సైన్యమంతా శోకిస్తుంది. నీవు ఇక్కడే ప్రశాంతంగా ఉండు. మేము సైన్యాన్ని తీసికొని వెళ్తాము. మా కూడా లక్ష్మణుని పంపు. చాలు. వాడియైన బాణాలను

ప్రయోగించి హోమాన్ని నిరోధిస్తాడు లక్ష్మణుడు. హోమం భగ్నమైతే చాలు. ఇంద్రజిత్తుని సులభంగా వధించవచ్చు.

"రామా! ఇక ఆలస్యము చేయడం ప్రమాదకరము. శత్రువును సంహరించుటకు అనుజ్ఞ నిమ్ము. లక్ష్మణుని మావెంట పంపు;" అన్నాడు విభీషణుడు. శోకపీడితుడై ఉన్న రామునికి విభీషణుడు చెబుతున్నది ఏమిటో అర్థం కాలేదు.

రాముడు విభీషణుని తన సమీపమున కూర్చుండ బెట్టుకొని, మళ్ళీ చెప్పమని అడిగాడు. విభీషణుడు చెప్పిందంతా విన్నాడు. వధించబడింది మాయసీతే నని గ్రహించాడు. ఇంద్రజిత్తు హోమాన్ని భగ్నం చేయాలని తెలుసుకున్నాడు.

"రామా! ఇక్కడ ఒక రహస్యమైన విషయముంది. పూర్వము బ్రహ్మదేవుడు వరప్రదానం చేసే సమయంలో ఇంద్రజిత్తుతో ఒక మాట చెప్పాడు. "నువ్వు ఆయుధాలు పట్టుకొని హోమం చెయ్యడానికి నికుంభిల దేవాలయానికి వెళ్ళేటప్పుడు ఎవ్వడైతే నిన్ను అడ్డగిస్తాడో వాడి చేతిలో నువ్వు మరణిస్తావు" అని చెప్పాడు బ్రహ్మదేవుడు. వాణ్ణి వధించడానికి ఇదే ఏకైక మార్గం.

"రామా! కనుక వెంటనే ఇంద్రజిత్తు వధకి ఏర్పాట్లు చేయాలి. ఇంద్రజిత్తు కన్ను మూశాడా! ఇక రావణుడు సబాంధవంగా మరణించాడనే నిశ్చయించుకోవచ్చు;" అని విభీషణుడు పలికాడు.

"విభీషణా! ఇంద్రజిత్తు మాయావి అని నాకు తెలుసు. బ్రహ్మాస్త్రము నెరిగినవాడు. వాడు గగనవిహారం చేస్తూ ఎవ్వరికీ కనిపించడు.

"తమ్ముడూ! లక్ష్మణా! వెళ్ళు నాయనా! వానరసైన్యాన్నంతా వెంట పెట్టుకో. హనుమంతుణ్ణి, జాంబవంతుణ్ణి ప్రక్కనే ఉంచుకో. విభీషణుని ముందుంచుకో. అక్కడ విషయాలన్నీ విభీషణునికి తెలుసు. అతడెలా చెబితే అలా చేయండి. దుష్టుడైన ఆ ఇంద్రజిత్తును సంహరించి రండి;" అన్నాడు రాముడు.

లక్ష్మణుడు ధనుస్సును ధరించాడు. కవచమును ధరించాడు. ఖడ్గము, బాణాలు గ్రహించాడు. రాముని పాదాలకు నమస్కరించాడు.

"అన్నా! హంసలు తామరకొలనులో పడ్డట్లు నా బాణాలు ఈనాడు ఇంద్రజిత్తుపై పడతాయి. వాడి శరీరాన్ని చీల్చేస్తాయి. వాడి ప్రాణాల్ని గాలిలో తేల్చేస్తాయి;" అని పలికి నికుంభిలాచైత్యానికి బయలుదేరాడు లక్ష్మణుడు.

నికుంభిలపై ముట్టడి

విభీషణ హనుమదంగదాదులతో కలిసి వానర భల్లూక సైన్యాలను వెంటబెట్టుకొని ఇంద్రజిత్తు నికుంభిల హోమాన్ని భగ్నం చేయడానికి బయలు దేరాడు వీరుడైన లక్ష్మణుడు.

"లక్ష్మణా! అదిగో నీలమేఘం లాగా నల్లగా ఉంది రాక్షససేన. ఆ సైన్యముపై వానరులు కాలుదువ్వాలి. ముందు కురికిన రాక్షససైన్యాన్ని నీవు వధించాలి. అప్పుడు ఇంద్రజిత్తు బయటికి వస్తాడు. హోమము ఆగిపోతుంది. నువ్వు వాణ్ణి సంహరించవచ్చు.

"మహావీరా! లక్ష్మణా! ఇంద్రజిత్తు దురాత్ముడు. మాయాలోలుడు. మాయావి. అధర్మపరుడు. క్రూరకర్ముడు. వాణ్ణి నీవు సంహరించాలి;" అన్నాడు విభీషణుడు.

లక్ష్మణుడు సిద్ధమయ్యాడు. వానరులు, భల్లూకాలు రాక్షససైన్యము మీదికి పరుగెత్తారు. రాక్షసులు ఆయుధాలను ధరించి వానరుల్ని ఎదుర్కున్నారు. వానర రాక్షసుల మధ్య భయంకరంగా యుద్ధం జరిగింది. వానర రాక్షసులు పరస్పరము వధించుకుంటున్నారు. వానర భల్లూక నాయకుల వీరత్వానికి రాక్షసులు భీతి చెందారు.

నికుంభిలలో హోమం చేస్తున్న ఇంద్రజిత్తుకు తన సైన్యం దిగులుతో ఉందని తెలిసింది. ఇంద్రజిత్తు హోమం నుండి లేచాడు. కుపితుడై, ధనుర్బాణాలు ధరించి రథమెక్కాడు: ఎఱ్ఱబడిన కళ్ళతో మృత్యుదేవత లాగా కనిపించాడు.

భయపడి వెనుదిరిగిన రాక్షసులు ఇంద్రజిత్తు రథంలో రావడం చూచి మళ్ళీ యుద్ధానికి తలపడ్డారు. లక్ష్మణుని మీదికి ఉరికారు. హనుమంతుడు ఒక పెద్ద వృక్షాన్ని చేతపట్టుకొని రాక్షససైన్యాన్ని నాశనం చేశాడు.

రాక్షసులు వేల సంఖ్యలో వచ్చి హనుమంతునిపై పడ్డారు. ఆయుధాలతో ఆంజనేయుని ఎదుర్కున్నారు. శూలాలతో, ఖడ్గాలతో, పట్టిసములతో, కుంతలముతో హనుమంతుని తీవ్రంగా బాధించారు. అయినా వెనుకాడని వీరహనుమంతుడు పెద్దపెద్ద వృక్షాల్ని పెకలించి రాక్షససైన్యాన్ని నాశనం చేయడం ఇంద్రజిత్తు చూశాడు.

"సారథీ! అడుగో. ఆ వానరుడున్న చోటికి రథాన్ని తీసికొనిపో. అతణ్ణి ఉపేక్షిస్తే మన సైన్యం మిగిలేలా లేదు;" అన్నాడు ఇంద్రజిత్తు. వెంటనే హనుమంతుడున్న చోటికి రథాన్ని నడిపాడు సారథి.

హనుమంతునిపై బాణవర్షం కురిపించాడు ఇంద్రజిత్తు. ఇంద్రజిత్తును ఎదుర్కొంటూ హనుమంతుడు ఇలా పలికాడు.

"దుష్టుడా! ఇంద్రజిత్తూ! శూరుడవైతే యుద్ధం చెయ్యి. హనుమంతుని సమీపించిన తరువాత ఇక ప్రాణాలతో వెనక్కి వెళ్ళలేవు. ఓరీ! నీచుడా! నువ్వు రాక్షసులలో వీరుడివా! అయితే నాతో ద్వంద్వపోరాటానికి నిలువు. నీ శ్రేష్ఠత్వాన్ని నిరూపించుకో;" అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని మీదికి ఉద్యమిస్తున్న ఇంద్రజిత్తును చూశాడు విభీషణుడు. "లక్ష్మణా! హనుమంతుని చంపాలని ముందుకు వస్తున్నాడు ఇంద్రజిత్తు. నువ్వు సిద్ధంకా! అసమాన, అమోఘ శరాలతో ఆ నీచుణ్ణి కూల్చేయి;" అన్నాడు విభీషణుడు.

ఇంద్రజిత్తు హోమం చేసే ప్రదేశాన్ని లక్ష్మణునికి చూపాడు విభీషణుడు. నల్లగా, భయంకరంగా ఉన్న ఒక మఱ్ఱిచెట్టును చూపాడు. ఆ ప్రదేశంలోనే ఇంద్రజిత్తు భూతబలి చేసి సమరానికి ఆయత్త మవుతాడని తెలిపాడు. ఆ తరువాత ఇంద్రజిత్తు ఎవరికీ కనిపించడని, యుద్ధంలో శత్రువుని సంహరిస్తూ ఉంటాడని తెలిపాడు. ఇంద్రజిత్తు ఆ మఱ్ఱిచెట్టుము సమీపించకుండా నిరోధించమని చెప్పాడు విభీషణుడు. "అలాగే" ననిపలికి లక్ష్మణుడు అక్కడ నిలబడ్డాడు.

లక్ష్మణుడు ఇంద్రజిత్తును కవ్వించి యుద్ధానికి ఆహ్వానించాడు. ఇంద్రజిత్తు లక్ష్మణుని చూశాడు. లక్ష్మణుని ప్రక్కనే విభీషణుడు కనిపించాడు ఇంద్రజిత్తుకి. అతణ్ణి చూడగానే మండిపడ్డాడు ఇంద్రజిత్తు. విభీషణునితో ఇలా పలికాడు.

ఇహ త్వం జాత సంవృద్ధః సాక్షాద్భ్రాతా పితుర్మమ
కథం ద్రుహ్యసి పుత్రస్య పితృవ్యో మమ రాక్షస

"ఓ రాక్షసుడా! నువ్వు ఇక్కడ పుట్టావు. ఇక్కడే పెరిగావు. నా తండ్రికి సాక్షాత్తు తమ్ముడివి. నాకు పినతండ్రివి. అట్టి నీవు పుత్రుడనైన నాకు ఎలా ద్రోహం చేయగలుగుతున్నావు?

"దుష్టుడా! అధర్మాత్మా! నీకు జాతి గిట్టదు. స్నేహం పట్టదు. సోదరత్వం వచ్చదు. ధర్మం నీకు అక్కరలేదు. నీచుడా! బంధువుల్ని విడిచి శత్రువులతో సఖ్యం చేశావు. నువ్వు ఏనాడైనా నిందార్హుడివే. సాధుపురుషులు కూడా నిన్ను నిందిస్తారు.* నీచుడా! స్వజనులకు, పరులకు మధ్య ఉండే తారతమ్యం కూడా నీకు తెలియడం లేదు.

గుణావా న్వా పరజనః స్వజనో నిర్గుణోఽపి వా
నిర్గుణ స్స్వజన శ్శ్రేయా న్యః పరః పర ఏవ సః

"పరులు గుణవంతులే కావచ్చు. స్వజనులు గుణహీనులే కావచ్చు. గుణాలు లేకపోయినా స్వజనమే మేలు. పరులు ఏనాడైనా పరులే కదా!

"దురాత్మా! చెప్తున్నాను విను. స్వజనులను విడిచి పరుల పంచన నిలిచిన వానిని పరులు ఉపయోగించుకుంటారు. పని పూర్తి కాగానే తన్ని తగలేస్తారు.

"రావణానుజా! ఎంత నీచానికి దిగజారావు? జాలి లేని కఠినాత్ముడా! లక్ష్మణుని ఇక్కడికి తీసుకొని వస్తావా! దుర్బుద్ధీ! ఈ క్రూరకార్యమును నీలాంటి దాయాదులు తప్ప మరెవ్వరూ చేయరు;" అంటూ ఆక్రోశంతో పలికాడు ఇంద్రజిత్తు. ఇంద్రజిత్తు మాటలు విని విభీషణుడు ఇలా సమాధాన మిచ్చాడు.

"ఇంద్రజిత్తూ! దుష్టరాక్షసా! నా స్వభావము ఎలాంటిదో నీకు తెలియదా! ఎందుకు అలా పేలుతున్నావు? నేను నీకు పినతండ్రినా! అది తెలిసే మాట్లాడుతున్నావు ఇంత దారుణంగా!

"దురాత్మా! విను. క్రూరకర్మలు చేయు రాక్షసకులము నందు నేను పుట్టిన మాట వాస్తవమే. నా స్వభావము మాత్రము రాక్షసత్వానికి ఎప్పుడూ ప్రతికూలమే. బాల్యము నుండి నేను సాత్త్విక ప్రవృత్తినే ఆశ్రయించి జీవించాను. రాక్షసునిగా పుట్టి ఉండవచ్చు. రాక్షసునిలా బ్రతకలేదు.

"చెడ్డపనులు నాకు గిట్టవు. అధర్మం నాకు పట్టదు. లేకపోతే దుష్టుడైన నీ తండ్రి నన్నెందుకు త్యజించాడు? నేను అధర్మము నందు ఆసక్తి ఉన్నవాడనైతే మీ తండ్రివద్దే సుఖంగా ఉండేవాణ్ణి. మీ బ్రతుకే బ్రతికుండే వాణ్ణి. అది నాకు ఇష్టం లేదు కనుకనే మీ తండ్రిని విడిచి వెళ్ళాను.

*నిందనీయశ్చ సాధుభిః అని ఇంద్రజిత్తు పలికిన మాటను ప్రమాణంగా తీసికొని విభీషణుని ద్రోహిగా అభివర్ణించి చాలామంది సంతోషపడుతుంటారు. అదికూడా చర్చిద్దాం.

"చేతిని చుట్టుకున్న సర్పాన్ని విదిలించుకొని మనిషి సుఖపడునట్లు, ధర్మభ్రష్టులైన వాణ్ణి వదలిపెట్టి సుఖించాలి.

"కాలిపోయే గృహాన్ని ఎలాగైతే విడిచిపెడతామో, పరుల ధనాన్ని హరించే వానిని, పరుల భార్యలను అపహరించే వారిని అలాగే విడిచిపెట్టాలని పెద్దలు చెబుతారు.

పరస్వానాం చ హరణం పరదారాభి మర్శనమ్
సుహృదా మతి శంకాచ త్రయో దోషాః క్షయావహాః

"పరుల ధనాన్ని హరించడము, పరసతులను స్పృశించడము, సహృదయులను శంకించడము - ఈ మూడు దోషాలు వినాశాన్ని కల్గిస్తాయి.

"నీ తండ్రి విషయం నీకు తెలియదా! ఏ కీడు చేశారని మహర్షుల్ని క్రూరంగా వధించాడు, మీ నాన్న! చెప్పరా! దుష్టుడా! దేవతలపైకి దండయాత్ర చేయాల్సిన అవసరమేమిటిరా, కుంకా! గర్వం లేని క్షణముందా, నీ అబ్బ జీవితంలో! కోపం లేని కాలముందా, ఆ నీచుడి బ్రతుకులో! బద్ధ శత్రుత్వమూ-ప్రతికూల జీవనము ఈ రెండేకదట్రా రెక్కలు, ఆ దుష్టపక్షికి!

"ఇన్ని దుర్గుణా లుండేవాడు సుఖపడడం, విషం జీర్ణమైనవాడు బ్రతకడం రెండూ అసాధ్యమే. అనూహ్యమే. దుర్గుణాల పుట్టయైన నీ తండ్రి రావణుడు పాముపుట్ట లాంటి వాడని భావించి నేను విడిచిపెట్టేశాను.

"ఇక పామూ మిగలదు. పుట్టా నిలవదు. బుద్ధిహీనుడా! నిజానిజాలు గ్రహించలేక, గర్వంతో అనరాని మాటలు అంటున్నావు. అన్నదానికి ఫలితాన్ని ఇప్పుడే ఆరగించ బోతున్నావు.

"నీ ప్రతాప మేమిటో ఇప్పుడు చూపించు. లక్ష్మణునితో యుద్ధం చెయ్యి. ఎవరి మాటనూ లక్ష్యపెట్టని పొగరుబోతువి కదా! చచ్చిన తరువాత యమలోకంలో దేవతలు చెప్పినట్లు ఏడుస్తూ చేస్తువుగాని! నీ బాణసంపద ఎంతో ఇప్పుడు బయటపెట్టు. ఖర్చు చెయ్యి. లక్ష్మణుని తప్పించుకొని ప్రాణాలతో తిరిగిపోలేవు" అన్నాడు విభీషణుడు.

విభీషణస్తు ధరాత్మా

ఉత్తములు, ఉదారులు, ధర్మాత్ములు అయిన ఇద్దరి వ్యక్తుల చరిత్రలు రామాయణంలో స్వచ్ఛంగా కన్పిస్తున్నా, కొందరికి అవి వివాదాస్పదంగా గోచరిస్తాయి. అవి 1.సుగ్రీవుడు. 2.విభీషణుడు.

రాముడు సుగ్రీవుని శరణు పొందగా, విభీషణుడు రాముని శరణు బొందినాడు. సుగ్రీవుని వెతుక్కుంటూ రాముడు ఋష్యమూకానికి వస్తే, రాముని వెతుక్కుంటూ విభీషణుడు సాగరతీరానికి చేరాడు. స్నేహితుడై, దాసుడైన వాడు సుగ్రీవుడు. దాసుడై, దాసుడుగా మిగిలినవాడు విభీషణుడు. ఇద్దరూ రామునికి దాసులే. ఇద్దరూ స్నేహితులే.

ఇద్దరికీ రాముడు రాజ్యాన్ని అనుగ్రహించాడు. ఇద్దరి అన్నలను రాముడు వధించాడు. అన్న లిద్దరూ అధర్మపరులే. అసమాన పరాక్రమవంతులే. అన్నల మరణానికి తమ్ముళ్ళు కారణ మయ్యారు. అన్నలు మరణించాలని తమ్ముళ్ళు కోరుకున్నారు కూడా.

సుగ్రీవ విభీషణు లిద్దరూ రామునికి శరణాగతులే. స్నేహితులే. దాసులే. స్నేహం చేసిన తరువాత గాని రాముడెవరో తెలియలేదు సుగ్రీవునికి. రాముడు ధర్మాత్ముడని చూడకముందే తెలుసు విభీషణునికి. అన్నల మరణానికి కారణం కావడం వల్ల, అన్నలు మరణించగనే రాజ్య భారాన్ని స్వీకరించడం వల్ల తమ్ముళ్ళైన విభీషణ సుగ్రీవులు వివాదాస్పదులుగా వాసికెక్కారు. దేశద్రోహులుగా, కులనాశకులుగా అర్థం గాని వారి మనసులలో నిలిచిపోయారు.

సూక్ష్మమైన విషయాల్ని సునిశితంగా పరిశీలించి అర్థం చేసుకోవలసిన బాధ్యత మేధావుల మీద ఉంది. తొందరపాటు వల్ల గాని, ఆవేశంచేత గాని, అవగాహనాలోపం వల్ల గాని, ముందే మనసులో నాటుకున్న భావపరంపరల ఒత్తిడి వల్ల గాని విషయాన్ని సక్రమంగా గ్రహించలేక, మేధావు లైనవారు దురభిప్రాయాన్ని వెల్లడి చేస్తే దాని ప్రభావం సమాజం మీద విపరీతంగా పడుతుంది.

విభీషణుని దేశద్రోహిగా, కులనాశకుడుగా చిత్రించి మాట్లాడాడు ఇంద్రజిత్తు. అదే వాదం కొందరు మేధావుల నుండి కూడా వినపడినపుడు ఆశ్చర్యంగా ఉంటుంది. అధర్మపరుడైన ఇంద్రజిత్తు వాదాన్ని భుజాలపై కెత్తుకొని మోయడం, దానిని సమర్థిస్తూ, సనాతన భావ వైశిష్ట్యాన్ని మరొక వికృత మలుపులో చూపాలని ప్రయత్నించడం శోచనీయం. దురదృష్టకరం. విభీషణునిపై ఇంద్రజిత్తు మోపిన అభియోగాలు సమంజస మైనవేనా?

విభీషణుడు దేశద్రోహియేనా? ఎవరిని దేశద్రోహి అంటారు. దేశబంధువని ఎవర్ని పిలుస్తారు? దేశానికి కీడు చేసేవాడు దేశద్రోహి అవుతాడే గాని దేశానికి మేలు చేసేవాణ్ణి దేశద్రోహి అనరు. లంకనాశనం కావడానికి కారకుడైన రావణుడు దేశద్రోహి అవుతాడేమో గాని విభీషణుడు మాత్రం కాదు.

ఒక దేశపు రాజు మరొక దేశం మీద దండయాత్ర చేసినపుడు, స్వలాభాపేక్షతో స్వజనులను వీడి, పరులతో చేతులు కలిపిన వాణ్ణి దేశద్రోహి అంటారు. రాముడు రాజ్యం కొరకు దండెత్తి వచ్చినవాడూ కాడు. విభీషణుడు రాజ్యాన్ని ఆశించి రాముణ్ణి ఆశ్రయించిన వాడూ కాడు.

విభీషణుడు ధర్మాత్ముడు. ఈ విషయాన్ని అరణ్యకాండములో రామలక్ష్మణులతో శూర్పణఖే చెప్పింది.*దానిని కుంభకర్ణుడూ అంగీకరించాడు కూడా. చివరికి రావణుడు కూడా సమ్మతించాడు. విభీషణుని ధర్మవచనాలు వినకపోవడం వల్లనే తనకు దుర్గతి ప్రాప్తించిందని అంగీకరించాడు.

విభీషణునికి లంక మీద మోజుంది. సింహాసనం మీద లేదు. లంకకు వినాశము రాకూడదని శక్తివంచన లేకుండా తాను కృషి చేశాడు. రావణుని సన్మార్గం లోకి తిప్పాలని అనేక సార్లు ప్రయత్నించి విఫల మయ్యాడు.

ఒక్కవిషయం మన మిక్కడ అర్థం చేసుకోవాలి. విభీషణునికి రాజ్యం మీద గాని, సింహాసనం మీద గాని ఆసక్తి ఉన్నట్లయితే రావణునికి సదుపదేశం చేయడు. రావణుణ్ణి బాగు చేయాలని ఆశించడు. రావణుడు సన్మార్గంలో చరిస్తూ ఉంటే విభీషణునికి రాజ్యమెలా

*చైతన్య రామాయణము - ప్రథమ భాగము 418 పుట

సంక్రమిస్తుంది? సాధువైన రాజును ప్రజలు ఎందుకు పోగొట్టుకుంటారు? పరులెందుకు పగబూనుతారు అలాంటి రాజుపై?

విభీషణునికి రాజ్యకాంక్ష ఉందనడం నిరాధారమైన విషయం. రాముడు గొప్పవాడని, అందగాడని విభీషణుడు ప్రేమించలేదు. రావణుడు స్వార్థపరుడని, దుష్టుడని గర్హించలేదు. అతని ఘర్షణ అంతా ధర్మాధర్మాల మధ్యే గాని, వ్యక్తుల మధ్య కాదు. రాజ్యాల మధ్య కాదు.

రాముడు ధర్మాత్ముడని విభీషణునికి తెలుసు. అలాగే రావణుడు అధర్మపరుడని కూడా తెలుసు. అధర్మాన్ని అసహ్యించుకొని రావణుణ్ణి త్యజించాడు. ధర్మాన్ని ప్రేమించి రాముని సమీపించాడు.

తన ఒక్కడి సుఖం కోసం రాజ్యాన్నంతా దుఃఖకూపంలో తోయడానికి రావణుడు వెనుకాడ లేదు. రాజ్యక్షేమం కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసినవాడు విభీషణుడు.

విభీషణుడు రావణునికి బుద్ధి చెప్పడం సీతాపహరణం జరిగినప్పుడే కాదు. నూతనంగా స్త్రీలను లంకకు తెచ్చినప్పుడల్లా అది ధర్మం కాదని విభీషణుడు హెచ్చరిస్తూనే ఉండేవాడు. ఈ విషయం ఉత్తరకాండలో స్పష్టంగా తెలుస్తుంది.

ఈ దృశైస్త్వం సమాచారైః యశోర్థ కులనాశనైః
ధర్మణం ప్రాణినాం జ్ఞాత్వా స్వమతేవ విచేష్టసే ॥

రావణుని వికృతచేష్టల వల్ల ధర్మానికి గ్లాని ఏర్పడుతూ ఉందని, అది కేవలం వ్యక్తి వినాశంతో పోదని, కులనాశానికి కూడా దారి తీస్తుందని అనేక సార్లు విభీషణుడు హెచ్చరించాడు. అయినా రావణుడు వినలేదు.

పరమసాధ్వి, మహాపతివ్రత అయిన సీతమ్మను రావణుడు అపహరించాడు. ఇక అది సహించలేక పోయాడు విభీషణుడు. అనేకసార్లు చెప్పి చూశాడు. సీతమ్మను రామునికి ఇచ్చెయ్యమని చెప్పాడు. అయినా రావణుడు వినలేదు. పాపపంకిలంలో తానిక ఉండడం కూడా అధర్మమే నని భావించాడు.

దుష్టుడైన రావణుని నుండి స్వదేశాన్ని రక్షించాలంటే రాముని ఆశ్రయించడమే ఏకైక మార్గమని భావించాడు. ఒకవేళ రాముని అనుగ్రహంతో తానే రాజై స్వచ్ఛమైన పరిపాలనను విభీషణుడు లంకావాసులకు అందించాలని అభిలషించాడా? అలా అభిలషించినా తప్పేమీ లేదు. దేశశ్రేయమే ఆ విషయంలో కూడా ప్రధానంగా తెలుస్తూ వుంది.

నిజమే. తీరా రావణుడు మరణించిన తరువాత రాజ్యాన్ని లంకావాసులకు గాని, విభీషణునకు గాని ఇవ్వకుండా రాముడే ఉంచేసుకుంటే ఏమయ్యేది? రాముడు అలాంటివాడు కాడని మనకన్నా విభీషణునికి బాగా తెలుసు.

తనదైన అయోధ్యను త్యజించాడు రాముడు. వాలి వధానంతరము లభించిన కిష్కింధను సుగ్రీవునికి త్యాగం చేసిన ధర్మాత్ముడు రాముడు. లంకను రాముడు అభిలషించడు. అంగీకరించడు. ఈవిధమైన సంకుచిత భావాలతో కుంచుకుపోయే వ్యక్తుల మనసులలో కూడా అనుమానం తలెత్తకుండా రావణవధకు ముందే సాగరతీరంలో విభీషణుని పట్టాభిషిక్తుణ్ణి చేశాడు ధర్మాత్ముడైన శ్రీరాముడు.

అధర్మపరుడైన రావణుని ఇతర రాక్షసుల లాగా తానూ సమర్థించి ఉన్నట్లయితే రావణుని చేత అవమానింప బడేవాడు కాడు విభీషణుడు. విభీషణుడు ధర్మపరాయణుడు. ధర్మాశ్రయుడు. ధర్మాసక్తుడు. ఆ మహాత్ముడు బాల్యము నుండి భావకుడే. సాత్వికుడే. ధార్మికుడే. ఈ విషయాలన్నీ ఉత్తరకాండలో చక్కగా తెలుపబడ్డాయి. విభీషణుని గూర్చి మహర్షి వాల్మీకి ఇలా అంటారు:

విభీషణస్తు ధర్మాత్మా నిత్యం ధర్మ వ్యవస్థితః
స్వాధ్యాయ నియతాహార ఉవాస విజితేన్ద్రియః

"విభీషణుడు ధర్మాత్ముడు. ధర్మము నందే నిత్యమూ ప్రవర్తించేవాడు. నియమితమైన ఆహారమును గ్రహిస్తూ, ఇంద్రియనిగ్రహము కలిగి జీవించేవాడు" అని విభీషణుని పవిత్ర జీవితాన్ని గూర్చి చెబుతాడు మహర్షి.

రామునితో వైరము మంచిది కాదు, కోపాన్ని విసర్జించు, అంటూ రావణునికి విభీషణుడు బోధించిన విషయం సాధకులకు ప్రాతః స్మరణీయమని నా అభిప్రాయము.

త్యజాశుకోపం సుఖ ధర్మ నాశనం
భజస్వ ధర్మం రతికీర్తి వర్ధనమ్

"అన్నా! సుఖాన్ని, ధర్మాన్ని నాశనం చేసే కోపాన్ని త్యజించు. సుఖాన్ని, కీర్తిని పెంపొందించే ధర్మాన్ని అనుష్ఠించు" అని బోధించిన పావనమూర్తి విభీషణుడు.

ధర్మజీవనానికి అలవాటు పడిన పవిత్రాత్ముల్ని కేవలం లౌకిక కోణం నుండి చూసి అర్థం చేసుకోవాలని ప్రయత్నించకూడదు. ధర్మం సూక్ష్మమైంది. సూక్ష్మబుద్ధి గల విమల చరితులే ధర్మాత్ముల్ని, ధర్మరహస్యాల్ని అర్థం చేసుకోగలరు.

రావణుడు దురాత్ముడే అధర్మపరుడే. విభీషణునికి అది నచ్చలేదు. బాగానే ఉంది. రావణుణ్ణి విభీషణుడు విడిచిపెట్టాడు. తటస్థంగా ఉండిపోవచ్చు కదా? రావణునికి శత్రువైన రాముని ఎందుకు ఆశ్రయించాలి? అది రాజ్యాసక్తితో చేసిన పని కాదా? ఇలా కూడా కొందరు విభీషణుని విమర్శిస్తూ ఉంటారు.

ఇదొక విచిత్రమైన విమర్శ. విమర్శే సిగ్గుతో తలవంచుకొనే విమర్శ యిది. రాముని లోని సుగుణాలు, రాముని యందు ప్రకాశించే ధర్మమే విభీషణుని రాముని వైపుకు ఆకర్షించిందని మనం గ్రహించాము.

తటస్థంగా ఉండవచ్చు కదా! రామునితో ఎందుకు కలవాలి? కలిశాడు పో, రహస్యాలెందుకు చెప్పాలి? ఇంద్రజిత్తు, రావణుల వధలకు ఎందుకు కారణం కావాలి?

తటస్థంగా ఉండాలి అని ఆశించడం తలలేని వాళ్ళు, తల చెడినవాళ్ళు చేసే ఆలోచన. "తటస్థం" అనే పదానికి అర్థం తెలియని వాళ్ళు ప్రతిపాదించే వాదం అది. ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియనపుడు వ్యక్తి తటస్థంగా ఉంటాడు. లేదా, ధర్మాధర్మాలు సమతూకంలో ఉన్నప్పుడు వ్యక్తి తటస్థంగా ఉంటాడు. అంతేకానీ భూమ్యాకాశాల లాగా రావణరాములు తెలుస్తూ ఉంటే ఇక తటస్థ విధానం ఎందుకు? తమస్సు నిండితే తప్పు.

రావణునిది అధర్మంగా నిర్ణయించి రావణుని త్యజించి ధర్మమూర్తి యైన రాముని ఆశ్రయించినపుడు తన పక్షమే మారిపోయింది? అలాంటప్పుడు రాముని వద్ద రహస్యాలు

విభీషణుడు ఎందుకు దాచిపెడతాడు? రావణ ఇంద్రజిత్తులు లంక నాశనానికి కారకులని గ్రహించినపుడు వారి వధను విభీషణుడు ఎందుకు గర్హిస్తాడు?

విభీషణుడు ధర్మమూర్తి. ధర్మాన్నే ఆశ్రయించి ఉంటాడు. ధర్మము నందే తనకు అకుంఠిత విశ్వాసము. రాముడు ధర్మస్వరూపుడు. అందుచేత ధర్మమూర్తి యైన విభీషణుడు ధర్మాత్ముడైన రాముని ఆశ్రయించాడు. విభీషణునిపై ఈ విశ్లేషణమును సమాప్తి చేసే ముందు విభీషణుని ధర్మాసక్తి బాల్యంలోనే ఎలా ఉండేదో, ధర్మజీవన విషయంలో విభీషణుని అవగాహన ఎలాంటిదో చెప్పడం సముచితమని భావిస్తున్నాను.

బాల్యంలో విభీషణుడు గొప్ప తపస్సు నాచరించాడు. విభీషణుని దీర్ఘకాల తపస్సుకు బ్రహ్మదేవుడు మెచ్చి, వరమును కోరుకోమని చెప్పాడు. విభీషణుడు బ్రహ్మదేవుని ఈ క్రింది విధమైన వరాన్ని ప్రసాదించమని ప్రార్థించాడు.

పరమాపదతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్
నహి ధర్మోభి రక్తానాం లోకే కించి న దుర్లభమ్ ॥

"బ్రహ్మదేవా! పెద్ద ఆపదలొచ్చి పడినపుడు కూడా నా మనసు ధర్మమును విడిచిపెట్ట కుండును గాక! ధర్మము నందు ఆసక్తి కలవారికి ఈ ప్రపంచంలో దుర్లభ మంటూ ఉండదు." అని ఆశించాడు. బ్రహ్మదేవుడు అనుగ్రహించాడు.

తన భావాలు ధర్మానికి భిన్నంగా నడువ కూడదని, తనకెప్పుడూ ధర్మము నందే ఆసక్తి ఉండాలని బ్రహ్మదేవుని నుండి వరములను పొందిన ధన్యాత్ముడు, ధర్మాత్ముడు విభీషణుడు.

ఇప్పుడు అర్థం చేసుకోండి. పావనాత్ముడైన విభీషణు డెక్కడ? పాపి యైన రావణు డెక్కడ? విభీషణుడు మానససరోవర మైతే రావణుడు బురదగుంట లాంటివాడు.

విభీషణస్తు ధర్మాత్మా నతు రాక్షస చేష్టితః

"విభీషణుడు ధర్మాత్ముడు. రాక్షసుడైనా రాక్షసప్రవృత్తి లేనివాడు". ఈ మాట పలికింది ఎవరో కాదు. శూర్పణఖ. బండరాళ్ళు కూడా విభీషణుని ధర్మరశ్మికి కరిగిపోయాయి.

రామచరితమానసంలో విభీషణుడు హనుమంతునితో సంభాషించే సందర్భములో విభీషణుని హృదయాన్ని విభీషణుని మాటల్లోనే మనకు వినిపిస్తాడు సంత్ తులసీదాసు.

సునహు పవన సుత రహని హమారీ
జమి దస్నన్హి మహు జీభి బిచారీ
తాత కబహుఀ మోహి జాని అనాథా
కరిహహిఀ కృపా భానుకుల నాథా!

"వాయుపుత్రా! రెండు దంతపు వరుసల మధ్య నాలుక లాగా నేను ఈ లంకలో వసిస్తున్నాను. నేను దిక్కులేని వాణ్ణి. అనాథుణ్ణి. భానుకుల నాథుడైన రఘురాముడు నన్ను అనుగ్రహించునా?" అని విభీషణుడు హనుమంతుని అడిగినట్లు రామచరితమానసము. ఈ చౌపాయి లంకలో విభీషణుని స్థితిని, ధర్మాత్ముడైన రాముని యందు విభీషణుని కున్న ఆసక్తిని స్పష్టం చేస్తూవుంది.

ముప్పైరెండు దంతముల మధ్య నాలుక లాగా విభీషణుడు లంకలో ఉన్నాడట. ఇది చాలా చక్కని ఉపమానము. తరచుగా సాధువులు ప్రవచనాల్లో ప్రవచించే సద్విషయము. సాధకులకు చాలా ఉపయుక్తమైన సాధనాంశములను అందించే ఈ ఉపమానాన్ని విశదంగా తెలుసుకుంటాము.

లంకలో దంతాలవంటి రాక్షసులు అనేకు లున్నారు. విభీషణుడు లాంటి ధర్మాత్ములు అరుదు. నాలుకలా విభీషణుడొక్కడు కన్పిస్తున్నాడు. దురాత్ముల మధ్య సాధువులు జీవించడం చాలా కష్టం. దంతముల మధ్య నాలుక తిరిగినట్లే ఉంటుంది.

నోటిలోని నాలుకను ముందుకు రానివ్వకుండా దంతాలు నిరోధిస్తుంటాయి. ముందుకొస్తే కొరికివేస్తా మంటూ బెదిరిస్తూ ఉంటాయి. కర్కశమైన దంతాల వలె, సాధకుని ప్రగతిని సమాజంలో దురాత్ములు నిరోధిస్తూ ఉంటారు. దంతాల మధ్య పడకుండా నాలుక ఎలా మెలుగుతుందో, దురాత్ములకు చిక్కకుండా సాధువులు ప్రగతిపథంలో సాగిపోతుంటారు.

దంతాలు నిరోధిస్తున్నాయని భయపడి మంచి చేయడం మానదు. అవకాశం దొరికినపుడల్లా దంతాల మధ్య పడకుండా ముందుకొచ్చి ఎండిన పెదవుల్ని తడిపిపోతూ ఉంటుంది. అలాగే దుష్టులు ప్రగతిని చూసి సహించలేక నిరోధిస్తున్నా, మహాత్ములు నాలుకలాగా ముందుకొచ్చి తాపత్రయాలతో ఎండిపోయిన సమాజాన్ని తమ ప్రేమామృతంతో తడుపుతూ ఉంటారు.

దంతాలవలె కర్కశంగా, కఠినంగా దురాత్ములు సమాజంలో జీవిస్తూ వుంటే నాలుక లాగా మహాత్ములు రామనామామృత పానం చేస్తూ ఆనందిస్తూ ఉంటారు.

మనిషి ఎప్పుడూ నాలుక లాగే ఉండాలి. దంతాలలాగా ఉండకూడదు. గట్టితనము గల దంతాలు ఊడిపోతాయి. మెత్తని నాలుక ఊడదు. వాడదు. దుష్టులు రాలిపోతారు. మట్టిలో కలిసిపోతారు. మహాత్ములు నాలుక లాగా చల్లగా ఉంటారు. శాశ్వతకీర్తితో శోభిస్తారు.

ఖండించడం దంతాలకు తెలుసు. ఏకం చేయడం నాలుకకు తెలుసు. దంతాలదంతా విరసమే. నాలుక దెప్పుడూ సమరసమే. కొరికి పడేస్తాయి దంతాలు. బుజ్జగించి జోకొడుతుంది నాలుక. సమాజంలో దుష్టులు గాయాలు చేస్తూ పోతారు దంతాలలాగా. సాధువులు ఓదార్చుతూ ఉంటారు నాలుకలాగా.

నాలుక పుట్టుకతోనే ఉంటుంది. దంతాలు మధ్యలో వస్తాయి. ముందు వచ్చిన నాలుక అలాగే ఉంటుంది. మధ్యలో వచ్చిన దంతాలే మాయ మౌతాయి. జ్ఞానము ప్రతి మనిషికీ స్వభావము. అజ్ఞానము మధ్యలో వస్తుంది. మధ్యలో వచ్చిన అజ్ఞానము మధ్యలోనే పోతుంది. ముందున్న జ్ఞానము చివరలో కూడా ఉంటుంది.

ఒక్క నాలుక ముప్పైరెండు దంతాల మధ్య మెల్లగా చరిస్తూ ఉంటుంది. ప్రతిక్షణము "నిన్ను కొరికి వేస్తాం" అనేటట్లుంటాయి దంతాలు. పాపం! నాలుక మాత్రం ఏమీ మాట్లాడదు. అది నాలుక యొక్క బలహీనతగా భావిస్తాయి దంతాలు.

నాలుక తనలో తాను, "దంతములారా! చాలా పొరబడుతున్నారు మీరు. మాట్లాడక పోవడం నా బలహీనత కాదు. నేను మాట్లాడకుండా ఉండడం చేతనే మీరు హాయిగా ఉన్నారు. నేను ఏదేదో మాట్లాడగలను. ఆ తరువాత బాధంతా మీకే. నేను ముందువెనుకలు

చూడకుండా పరుషంగా మాట్లాడితే చాలు. ముప్పు ముందున్న మీకే. కోపమొచ్చినవారు మిమ్మల్ని రాలగొట్టేస్తారు కాని నన్ను ముట్టుకోరు. ముచ్చటగా లోపల ఉండే దాన్ని నేను. బయటపడి రాలిపోయేవారు మీరు."

దుష్టులను రక్షించడానికే ఒకొక్కసారి సజ్జనులు మౌనం వహిస్తూ ఉంటారు నాలుకలాగా. కాలు జారితే తిరిగి తీసికోవచ్చు. నోరు జారితే తిరిగినా తీసికోలేము.

A slip of the foot you may soon recover.

But a slip of the tongue you may never get over

అంటాడు ఫ్రాంక్లిడీ.

లక్ష్మణ ఇంద్రజిత్తులు

విభీషణుని మాటలకు క్రుద్ధుడైన ఇంద్రజిత్తు ధనుర్బాణాలు చేత పట్టుకొని వేగంగా ముందుకు వచ్చాడు. హనుమంతుని భుజాలపై కూర్చుని యున్న లక్ష్మణుని చూచి క్రుద్ధుడై ఇలా పలికాడు.

"లక్ష్మణా! ఇక చూడు, నా ప్రతాపం! మేఘం జలధారల్ని వర్షించునట్లు, నా ధనుస్సు వర్షించే బాణవర్షాన్ని తట్టుకొని నిలబడు. దూదిరాశిని అగ్ని భస్మం చేయునట్లు నా బాణాలు నిన్ను భస్మం చేసేస్తాయి.

"లక్ష్మణా! అప్పుడే మరిచిపోయావా! ఆనాటి రాత్రి నిన్ను, నీ అన్నని పిడుగులాంటి బాణాల్తో కొట్టి,కట్టి పడేశాను. దిక్కులేని పక్షుల్లాగా నేల పడ్డారు. జ్ఞాపకం రావడం లేదా!

"అవును. నీవు మరిచిపోయైనా ఉండాలి. లేదా నీకు ఈ లోకంతో ఋణమైనా తీరిపోయి ఉండాలి;" అని ఇంద్రజిత్తు పౌరుషంగా మాట్లాడాడు. అది విని లక్ష్మణుడు ఇలా పలికాడు.

"ఓరీ రాక్షసా! నీవి కూతలే గాని చేతలుగా కనిపించడం లేదు. ఎవ్వరైనా కార్యేయగలరు జొల్లుకూతలు. చేసి చూపినవాడే గొప్పవాడు. మాటలు చెప్పేసి పనులు చేసేసినట్లు తృప్తిపడుతున్నావు.

"ఆకాశంలో అదృశ్యంగా ఉండి బంధించింది చెప్పుకుంటున్నావా! సిగ్గులేదూ! అది వీరులు చేసే పనేనా! దొంగలు చేసే పని చేసి వీరునిలా గప్పాలు కొడుతున్నావు. ఎందుకొచ్చిన మాటలు! ఎదురుగా నిలబడి ఇప్పుడు చూపించు, నీ పరాక్రమ మేమిటో!" అని లక్ష్మణుడు పలకగానే కోపించిన ఇంద్రజిత్తు లక్ష్మణునిపై బాణాలు సంధించాడు.

ఇంద్రజిత్తు విడిచిన సర్పరూపబాణాలు లక్ష్మణుని శరీరంలో గుచ్చుకున్నాయి. బాణములు గుచ్చుకొని రక్తంతో నిండిన దేహముతో నున్న లక్ష్మణుడు పొగ లేని అగ్నిలా కనిపించాడు.

"లక్ష్మణా! కాచుకో! నా బాణాలు నీపై వాలడం- నీ ప్రాణాలు నేలపై రాలడం, రెండూ ఒకేసారి జరిగిపోతాయి. నేల కూలిన నీపై కాకులు, గ్రద్దలు, డేగలు వాలుతాయి.

"నీచుడా! నువ్వు ఆ దుష్టుడు రాముడికి భక్తుడవట కదరా! ప్రియ తమ్ముడివట కదా! కవచము ఊడి, తల గుడ్లప్పగించుకొని నేల రాలిన నిన్ను ఆ దుష్టుడు రాముడు చూస్తాడు.

నీడి మట్టిలో దొర్లే నిన్ను చూచి ఆ దురాత్ముడు తల కొట్టుకుంటాడు" అని ఇంద్రజిత్తు పలికాడు.

"ఒరేయ్! రాక్షసా! క్రూరాత్మా! మాటలు ఇక కట్టిపెట్టు. వాగుడు ఆపేయ్. రాక్షసాధమా! మాటలే గాని చేతలు లేని నిన్ను మాట్లాడకుండా చంపేస్తాను. కాచుకో!" అని పలికి ఐదు నారాచబాణాలను ఇంద్రజిత్తుపై ప్రయోగించాడు లక్ష్మణుడు.

కోపించిన ఇంద్రజిత్తు లక్ష్మణునిపై మూడు బాణాలు ప్రయోగించాడు. పరస్పరము లక్ష్మణేంద్రజిత్తులు బాణవర్షం కురిపించారు. ఉభయులూ అసమాన పరాక్రమవంతులే. ఇద్దరూ దుర్జయులే. ఇద్దరూ బలసంపన్నులే. ఒకరితో మరొకరు సింహాల్లాగా పోరాడారు.

పగపట్టిన త్రాచుపాము లాగా బుసలు కొడుతూ, పళ్ళు పటపట కొరుకుతూ, కళ్ళు పెద్దవి చేసి బాణాల్ని ప్రయోగించాడు లక్ష్మణుడు. ఇంద్రజిత్తులో ఏదో మార్పు కన్పించింది. లక్ష్మణుని ధనుష్టంకార ధ్వనిని విని పాలిపోయిన ముఖం పెట్టాడు ఇంద్రజిత్తు. అది చూచి విభీషణుడు లక్ష్మణునితో ఇలా పలికాడు.

"లక్ష్మణా! ఇంద్రజిత్తు దుర్బలుడైనట్లు కనిపిస్తున్నాడు. ఇది నిజం. నువ్వు ఆలస్యం చెయ్యకు. కొట్టేయ్ వాణ్ణి."

లక్ష్మణుడు విషపూరిత బాణాలను సంధించి ఇంద్రజిత్తుపై ప్రయోగించాడు. వజ్రాల వంటి బాణాలతో లక్ష్మణుడు కొట్టగా ఇంద్రజిత్తు మూర్ఛిల్లాడు. కొంతసేపటికి తేరుకొని వాడియైన ఏడు బాణాలతో లక్ష్మణుని, పది బాణాలతో హనుమంతుని కొట్టాడు. మూరు బాణాలతో విభీషణుని కొట్టాడు. మహాబలవంతుడైన లక్ష్మణుడు ఇంద్రజిత్తును చూచి నవ్వుతూ ఇలా పలికాడు.

"ఒరేయ్ రాక్షసుడా! నువ్వొక వీరుడివా! ఇవెక్కడి నాటుబాణాలు! వీటితోనా మమ్మల్ని నువ్వు చంపాలనుకొన్నది! శూరులైనవాళ్ళు ఇలాంటి చచ్చు బాణాలు వేయరు;" అంటూ ఇంద్రజిత్తుపై బాణవర్షం కురిపించాడు లక్ష్మణుడు.

ఇంద్రజిత్తు కవచాన్ని పగుల గొట్టాడు. ముక్కలైన ఆ బంగారు కవచము ఆకాశమునుండి వెలుగు చుక్కలు రాలినట్లు రథముపై రాలింది. కవచము రాలిపోగా, గుండెలకు బాణాలు గుచ్చుకోగా, స్రవిస్తున్న రక్తంతో ఉదయభానునిలా ఎర్రగా కనిపించాడు ఇంద్రజిత్తు.

క్రుద్ధుడైన ఇంద్రజిత్తు లక్ష్మణునిపై వెయ్యి బాణాలను ప్రయోగించాడు. లక్ష్మణుని కవచము బ్రద్దలైంది. ఇద్దరి దేహాలు రక్తసిక్తమై ఉన్నాయి. పరస్పరం భయంకరంగా కొట్టేసుకున్నారు. దారుణంగా చెక్కేసుకున్నారు. ధ్వజాలు విరిగిపోయాయి. వాడి బాణాలు రువ్వుకుంటూ వేడి నెత్తురు కార్చుకుంటున్నారు. కరుకైన బాణాలు శరీరాల్లో దూరిపోతున్నాయి. ఇద్దరూ జంకడం లేదు. ధనుష్టంకారాలు పిడుగుపడ్డట్లు వినిపిస్తున్నాయి. భయంకరమైన అస్త్రాలు శరీరాల్లో దూరి, రక్తం త్రాగి బయటికి వచ్చి భూమిలోకి జారబడి పోతున్నాయి. ఆకాశంలో శరవర్షం కురిపిస్తున్నారు. ఆ బాణాలు వేలువేలు ఆకాశంలో ఢీకుంటూ ఒక పెద్ద పంజరంలా కనిపిస్తున్నాయి. భూమిపై రాలిన బాణాలు కుప్పలా పడి ఉన్నాయి. యజ్ఞవాటికలో

సమిధలు ఉన్నట్లు, ఈ రణయజ్ఞంలో బాణాలు దర్భలవలె పడి ఉన్నాయి. లక్ష్మణ, ఇంద్రజిత్తు శరీరాలపై ప్రయోగింపబడిన బాణాలు అలాగే నిలిచి ఉన్నాయి. పర్వతరూపులైన ఈ ఉభయ వీరుల దేహాలపై నిలిచిన బాణాలు కొండపై చెట్లు మొలచినట్లున్నాయి. రక్తంతో తడిసి, బాణాలతో కప్పబడిన వారి కాయాలు మండుచున్న అగ్నుల్లా ప్రకాశించాయి. లక్ష్మణుడికి మేలు చేయాలని భావించి విభీషణుడు యుద్ధానికి సిద్ధపడ్డాడు.

భయంకర సమరం

లక్ష్మణేంద్రజిత్తులు జయమును కాంక్షించి "నేనంటే నేను" అని మదగజాల్లా పోరాడుతున్నారు. విభీషణుడు యుద్ధభూమిలో ప్రవేశించి ధనుష్టంకారం చేశాడు. వాడియైన బాణాలను రాక్షసులపై ప్రయోగించి వారి శరీరాల్ని దుళ్ళగొట్టేశాడు. విభీషణుని నలుగురు అనుచరులు కూడా శూలాలతో, ఖడ్గాలతో, పట్టిసాలతో రాక్షసులను ఛేదించారు. రాక్షసవధకు అనువైన సమయం ఆసన్నమైందని గ్రహించిన విభీషణుడు వానరవీరులను యుద్ధానికి పురికొల్పాడు. వారిలో నూతనోత్సాహాన్ని దింపాడు.

"వానరులారా! రావణునికి వీడొక్కడే గతి ఇక. ఇంకా అలా చూస్తారేం? ఈ పాపాత్ముణ్ణి చంపారా! రావణుని సైన్యాన్నంతా చంపేసినట్లే. వెనుకాడకండి.

"ప్రహస్తుణ్ణి ప్రయాణం చేయించేశారా! నికుంభుణ్ణి నింగికిచ్చేశారా! కుంభకర్ణుణ్ణి కూలదోశారా! ధూమ్రాక్షుని దూరం చేసేశారా! జంబుమాలిని జారేశారా! అశనిప్రభుని అంతరింప జేశారా! వజ్రదంష్ట్రుణ్ణి వధించారా! వికట్టుణ్ణి విరిచేశారా! తపనుణ్ణి తరలించేశారా! అగ్నికేతువుని ఆర్పేశారా! పార్శ్వుణ్ణి పారద్రోలారా! చక్రమాలికి వక్రగతిని పట్టించారా! నరాంతకుణ్ణి నాశనం చేశారా! కంపనుణ్ణి ఖండించారా!

"ఇంతమందిని చంపారు మీరు. కష్టించి సాగరాన్ని లంఘించారు. ఈ గోష్పదము ఏ పాటిది? ఇది కూడా దాటేయండి. ఊఁ...... కానివ్వండి. జమాయించండి. వీణ్ణి, ఇంద్రజిత్తును కూడా కడతేర్చేయండి.

"వాడు నాకు కుమారు డవుతాడు. పుత్రుణ్ణి చంపకూడదు. అయినా రాముని కోసం వాణ్ణి రాల్చేస్తాను.

హన్తు కామస్య మే బాష్పం చక్షుష్షైవ నిరుధ్యతి

"ఇతణ్ణి వధించాలి అనే భావం రాగానే నా కళ్ళల్లో నీళ్ళు నిలుస్తున్నాయి.

"వానరులారా! ఇతనిని లక్ష్మణుడు వధిస్తాడు. మీరందరూ రాక్షసులపై బడి వాళ్ళను లాగేయండి. తోసేయండి. పైకి పంపించేయండి;" అని విభీషణుడు ప్రేరేపించాడు. ఉత్సాహంతో వానరులు విజృంభించారు.

వానర భల్లూక వీరులలో తమను ఎక్కువగా బాధిస్తున్న జాంబవంతుణ్ణి రాక్షసులందరూ చుట్టుముట్టారు. బాణాలతో, గండ్రగొడ్డళ్ళతో, పట్టిసాలతో, తోమరములతో కొట్టారు.

హనుమంతుడు అది చూచి కుపితుడై, లక్ష్మణుని వీపు మీదనుండి క్రిందికి దింపి ఒక పర్వతశిఖరాన్ని పెకలించి, అనేకమంది రాక్షసుల్ని సంహరించాడు. ఇంద్రజిత్తు విభీషణునితో

పోరాడి మళ్ళీ లక్ష్మణుని మీదికి వెళ్ళాడు. లక్ష్మణ ఇంద్రజిత్తుల మధ్య భయంకరంగా యుద్ధము సాగింది.

ఈలోగా చీకటి పడ్డట్లయింది. చూచేవారికి చాలా భయం కలిగింది. వానర రాక్షస సైన్యము పరస్పరము హింసించుకొనుట వలన ఏర్పడిన రక్తప్రవాహము నదియై ప్రవహించింది. ఎక్కడ చూచినా జంతువుల భయంకర శబ్దాలే వినిపిస్తున్నాయి. వాయువు వీచడం లేదు.

లక్ష్మణుడు నాలుగు బాణాలను ప్రయోగించి ఇంద్రజిత్తు రథానికి పూన్చిన గుఱ్ఱాలను కొట్టాడు. మరొక పిడుగు లాంటి బాణాన్ని ప్రయోగించి సారథిని కూల్చేశాడు. సారథి మరణించగానే రథసారథ్యము, రణసారథ్యము రెండూ ఇంద్రజిత్తే వహించాడు. లక్ష్మణుడు వాడియైన బాణాలతో ఇంద్రజిత్తును త్రీవంగా కొట్టాడు. ఇంద్రజిత్తు ధనుస్సును చేతపట్టి బాణప్రయోగము చేసేలోగా లక్ష్మణుడు గుఱ్ఱాలను బాణాలతో కొట్టాడు. అశ్వములు బెదిరిపోయాయి. ఇంద్రజిత్తు బాణప్రయోగం చేయలేక పోయాడు. లక్ష్మణుడు ఇదే సమయమని వాడియైన బాణాలతో ఇంద్రజిత్తును దారుణంగా దుళ్ళగొట్టాడు.

అధికోత్సాహంతో శరభుడు, గంధమాదనుడు, ప్రమాథి, రభసుడు అనే నలుగురు వీరులు వేగాన్ని పుంజుకొని గుఱ్ఱములపై వాలారు. గుఱ్ఱాలు ఆ భారాన్ని భరించలేక నోళ్ళగుండా, ముక్కులగుండా రక్తాన్ని స్రవించాయి. నలిగిపోయాయి. ఎముకలు విరిగిపోయాయి. గుఱ్ఱాలు క్రిందపడ్డాయి. ప్రాణాలు పైకి లేచాయి. ఈవిధంగా నలుగురు వానరశ్రేష్ఠులు అశ్వాలను సంహరించి మళ్ళీ లక్ష్మణునివైపు వచ్చి నిలిచారు.

సారథి మరణించాడు. గుఱ్ఱాలు కూలిపోయాయి. మరోమార్గం కనిపించక ఇంద్రజిత్తు రథం దిగి భూమిమీద నిలబడ్డాడు. లక్ష్మణుని మీదికి బాణవర్షం కురిపించాడు. ఇంద్రజిత్తును లక్ష్మణుడు తన బాణప్రయోగంతో ముందుకు రానీకుండా నిరోధించాడు.

ఇంద్రజిత్తు వధ

నేలమీద నిలబడి, కుపితుడై యున్న ఇంద్రజిత్తు అగ్నిహోత్రం లాగా ప్రకాశించాడు. లక్ష్మణేంద్రజిత్తులు పరస్పరం వధించుకొనుటకు ఉద్యుక్తు లయ్యారు. వానరులు లక్ష్మణుని, రాక్షసులు ఇంద్రజిత్తుని రక్షించుకొనే కార్యంలో నిమగ్న మయ్యారు.

"దిక్కులన్నీ చీకట్లు ముసురుకొని ఉన్నాయి. ఎవరెవరో తెలియడం లేదు. వానరులను మోసగించుటకు ఇది చాలా అనుకూలమైన సమయము. మీరు ధైర్యంతో పోరాడండి. నేను లంకకు వెళ్ళి రథము తెచ్చుకుంటాను;" అని పలికి ఇంద్రజిత్తు లంకకు వెళ్ళిపోయాడు.

ఇంద్రజిత్తు పదాతియై పోరాడుతున్నాడని లక్ష్మణ విభీషణులు భావించారు. బాణవర్షం కురిపిస్తూనే ఉన్నారు. వానర రాక్షసవీరులు పరస్పరం బాధించుకుంటూ భయంకరంగా పోరాడుతున్నారు.

ఇంద్రజిత్తు లంకలో ప్రవేశించాడు. బంగారు అలంకరణములతో కూడిన రథాన్నెక్కాడు ఇంద్రజిత్తు. రథమును చాకచక్యముతో నడపడమే గాక, చక్కని ఉపాయాలు కూడా సూచించగల సారథిని సమకూర్చుకున్నాడు. వీరులైన రాక్షసుల్ని కూడా వెంటబెట్టుకొని రణరంగంలో ప్రవేశించాడు. ఇంద్రజిత్తుని రథంపై చూచి లక్ష్మణ విభీషణులు ఆశ్చర్యపోయారు.

ఇంద్రజిత్తు కోపావేశంతో రెచ్చిపోయాడు. బాణవర్షం కురిపించి వేలాది వానరుల్ని కూల్చేశాడు. ధనుస్సును మండలాకారంగాచేసి గొప్ప పౌరుషంతో వానరుల్ని వధిస్తున్నాడు. ఇంద్రజిత్తు బాణవర్షాన్ని తట్టుకోలేక వానరులు భయంతో లక్ష్మణుని ఆశ్రయించారు.

లక్ష్మణుడు మండిపడ్డాడు. వాడియైన బాణాన్ని ప్రయోగించి ఇంద్రజిత్తు ధనుస్సును విరిచేశాడు. ఇంద్రజిత్తు మరొక ధనుస్సును చేబూనాడు. లక్ష్మణుడు దానిని కూడా విరిచేశాడు. సర్పము వంటి ఐదు బాణాలను ధనుస్సుపై తొడిగి ఇంద్రజిత్తు వక్షఃస్థలమును కొట్టాడు లక్ష్మణుడు.

ఆ ఐదు బాణాలు ఇంద్రజిత్తు శరీరంలోకి దిగి రక్తాన్ని త్రాగి, ఎర్రత్రాచులవలె భూమి మీద పడ్డాయి. ధనుస్సును పోగొట్టుకొని, రక్తసిక్తమై వున్న ఇంద్రజిత్తు మరొక ధనుస్సును చేబూనాడు. దేవేంద్రుడు వర్షాన్ని కురిపించినట్లు లక్ష్మణునిపై శరవర్షం కురిపించాడు. లక్ష్మణుడు ఆ బాణవర్షాన్ని నివారించాడు. లక్ష్మణుని పరాక్రమం చూచి వానరవీరు లందరూ ఆశ్చర్యపడ్డారు.

రుష్టుడై విజృంభించిన లక్ష్మణుడు వాడియైన తన బాణాలతో రాక్షసుల్ని సంహరించడమే గాక ఇంద్రజిత్తును కూడా తీవ్రంగా కొట్టి బాధించాడు. నిశితమైన శరాన్ని ప్రయోగించి నిపుణుడైన సారథి తలను ఖండించాడు లక్ష్మణుడు. సారథి లేకపోయినా శ్రేష్ఠమైన గుఱ్ఱాలు మండలాకారంగా తిరుగుతూ రథాన్ని లాగుతూ ఉంటే, చాలా ఆశ్చర్య మనిపించింది అందరికీ.

గుఱ్ఱాలను భయపెడుతూ లక్ష్మణుడు వాడియైన బాణాలతో ఆ గుఱ్ఱాలను కొట్టాడు. ఇంద్రజిత్తు లక్ష్మణుని పదిబాణాలతో కొట్టాడు. సర్పవిషంతో నిండి, వజ్రతుల్యములైన బాణాలతో లక్ష్మణుని వక్షస్థలాన్ని కొట్టాడు ఇంద్రజిత్తు. ఆ ప్రచండ బాణాలు లక్ష్మణుని బంగారుకాంతి గల కవచానికి తగిలి ముక్కలై క్రిందపడ్డాయి.

లక్ష్మణుని కవచము అభేద్యమని గ్రహించాడు ఇంద్రజిత్తు. వెంటనే మూడు బాణాలను ప్రయోగించి లక్ష్మణుని లలాటంపై కొట్టాడు. అవి లక్ష్మణుని లలాటంపై నాటుకొనిపోగా మూడు శిఖరాలు గల పర్వతంలా శోభించాడు లక్ష్మణుడు.

ఇంద్రజిత్తు చేత తీవ్రంగా కొట్టబడిన లక్ష్మణుడు కోపించి ఐదు బాణాలతో ఇంద్రజిత్తు ముఖాన్ని కొట్టాడు. ఇంద్రజిత్తుకు విభీషణుడు కనిపించాడు. వెంటనే మూడు బాణాలను సంధించి విభీషణుని ముఖాన కొట్టాడు ఇంద్రజిత్తు. దానికి కుపితుడైన విభీషణుడు గదను చేతపట్టుకొని ఇంద్రజిత్తు రథానికి పూన్చిన గుఱ్ఱాలను చావకొట్టేశాడు.

గుఱ్ఱాలు చనిపోగానే ఇంద్రజిత్తు రథంపై నుండి క్రిందికి దుమికాడు. పినతండ్రి యైన విభీషణునిపై శక్తిని ప్రయోగించాడు. అది చూచిన లక్ష్మణుడు తన బాణంతో ఇంద్రజిత్తు ప్రయోగించిన శక్తిని మధ్యలోనే ఖండించాడు. విభీషణుడు వజ్రసమానమైన ఐదు బాణాలతో ఇంద్రజిత్తును కొట్టాడు. బంగారు పొన్నులు గల ఆ బాణాలు ఇంద్రజిత్తు శరీరాన్ని చీల్చి రక్తంతో తడిశాయి.

లక్ష్మణ ఇంద్రజిత్తులు ఒకరిపై నొకరు బాణాలు రువ్వుకుంటూ వుంటే క్రౌంచపక్షుల శబ్దాల్లా వినిపించాయి. వారి బాణ సంఘర్షణానికి పొగ లేచింది. అగ్నికణాలు చెలరేగాయి. పరస్పరం కోపావేశాలతో ప్రాణాలను లెక్క చెయ్యకుండా పోరాడుతున్నారు లక్ష్మణేంద్రజిత్తులు.

లక్ష్మణుడు వారుణాస్త్రాన్ని ప్రయోగించగా, ఇంద్రజిత్తు రౌద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. వారుణాస్త్రాన్ని ఛేదించింది రౌద్రాస్త్రము.

ఇంద్రజిత్తు ఆగ్నేయాస్త్రాన్ని లక్ష్మణునిపై ప్రయోగించాడు. లక్ష్మణుడు సూర్యాస్త్రము చేత ఆగ్నేయాస్త్రాన్ని భగ్నం చేశాడు.

అది చూచి భయంతో, కోపంతో ఊగిపోతూ అతి భయంకరమైన ఆసుర శరాన్ని లక్ష్మణునిపై ప్రయోగించాడు ఇంద్రజిత్తు. ఆ శరము నుండి కూటాలు, ముద్గరాలు శూలాలు, భుశుండులు, గదలు, ఖడ్గాలు, గండ్రగొడ్డళ్ళు ఉద్భవించి పైకి దూకుతున్నాయి. లక్ష్మణుడు దారుణమైన ఆ ఆసురాస్త్రాన్ని మహేశ్వరాస్త్రంతో ఛేదించాడు.

లక్ష్మణుడు తదేకంగా ఆకాశంలో చూశాడు. దేవ, గంధర్వ, గరుడ, ఉరగ, ఋష్యాదులు గగనాన నిలిచి లక్ష్మణుని ఆశీర్వదించారు. అగ్నితుల్యమైన బాణాన్ని తీసి, శిరమువంచి నమస్కరించి, ధనుస్సుకు తొడిగాడు లక్ష్మణుడు. కణుపులున్న ఆ బాణము బంగారులా మెరిసిపోతోంది. శత్రుసంహారకమైన ఆ బాణము దేవతలచే పూజ లందుకున్నది. పూర్వము దేవదానవ సంగ్రామములో దేవేంద్రుడు దానవుల్ని సంహరించింది ఈ బాణం తోనే. ఇదే ఐంద్రాస్త్రము. ఐంద్రాస్త్రాన్ని తొడిగి లక్ష్మణుడు ఇలా పలికాడు.

ధర్మాత్మా సత్య సన్ధశ్చ రామో దాశరథిర్యది
పౌరుషే చా ప్రతి ద్వంద్వః శరైనం జహి రావణిమ్ ॥

"శ్రేష్ఠమైన ఓ ఐంద్రాస్త్రమా! రాముడు ధర్మాత్ముడైతే, సత్యసంధుడైతే, పౌరుషవంతుడే అయితే, ఓ బాణమా! నువ్వు ఇంద్రజిత్తును చంపు" అని పలికి ఐంద్రాస్త్రాన్ని అభిమంత్రించి, బాణాన్ని చెవి వరకు లాగి విడిచిపెట్టాడు. ఆ బాణము సూటిగా వెళ్ళి కుండలాలతో, కిరీటంతో శోభిస్తున్న ఇంద్రజిత్తు తలను నరికేసింది. ఎదురు లేకుండా కంఠంపై ఇంతవరకు నిలిచియున్న శిరస్సు ఎవరికీ కాకుండా, ఏదీ కాకుండా, మట్టిలో మట్టిగా కలిసి పోవడానికి నేల రాలింది. ఆవేశంతో ఊగి ఊగి అలసిపోయిన శిరము విరామాన్ని కోరి నేల ఒరిగింది. మొండెము, మొదలు నరికిన తాటి చెట్టులా క్రింద పడింది.



ఇంద్రజిత్తు మరణించడం చూసిన రాక్షసులు ఆయుధములను యుద్ధభూమి యందే పడేసి లంకవైపు పరుగులు తీశారు. కొందరు పర్వతము నెక్కి పారిపోయారు. కొందరు భయంతో సముద్రంలో దూకేశారు. సూర్యుడు అస్త మించగానే కిరణాలు ఎలా కనిపించవో, ఇంద్రజిత్తు మరణంతో రాక్షసులు కూడా అలా అదృశ్యమయ్యారు. ఆరిపోయిన అగ్ని లాగా కనిపించాడు చచ్చిపడియున్న ఇంద్రజిత్తు.

దుష్టుడైన ఇంద్రజిత్తు మరణానికి శాంతించిన దేవతలు లక్ష్మణునిపై పుష్పవర్షం కురిపించారు.

వానరులు ఆనందంతో ఊగిపోయారు. **"లక్ష్మణో జయతి"**- లక్ష్మణుడు జయిస్తున్నాడు అని అరుస్తూ జబ్బలు చరచారు. సంతోషంతో వానరు లందరూ తోకల్ని విచిత్రంగా ఆడించారు. లాంగూలవిన్యాసాలు ప్రదర్శించారు.

వానరులు ఒకరి నొకరు కౌగిలించుకున్నారు. లక్ష్మణుని గూర్చి గొప్పగా పలుకుతూ చర్చించుకున్నారు. శరీరం దారుణంగా గాయపడినా ఇంద్రజిత్తును వధించినందుకు లక్ష్మణుడు ఎంతగానో సంతోషించాడు.

విభీషణ హనుమంతుల భుజాలపై చేతులు వేసుకొని లక్ష్మణుడు వానరసైన్యముతో రాముని వద్దకు వచ్చాడు. ఇప్పుడే రక్తంలో స్నానం చేసినట్లు కనిపిస్తున్నాడు లక్ష్మణుడు.

రాముని పాదాలకు నమస్కారం చేశాడు. ఇంద్రజిత్తు మరణించాడని మెల్లగా చెప్పి, దేవేంద్రుని ప్రక్కన ఉపేంద్రుని లాగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు వినయశీలుడు కనుక ఇంద్రజిత్తు మరణించాడని మెల్లగా, అస్పష్టంగా చెప్పాడు. ఆ విషయాన్నే విభీషణుడు మళ్ళీ ధ్రువపరచాడు రామునికి. "ఇంద్రజిత్తును లక్ష్మణుడు చంపేశాడు. ఇక రావణుడు కూడా వధించబడ్డట్లే;" అన్నాడు విభీషణుడు.

రాముడు లక్ష్మణుని చూచి, "లక్ష్మణా! మంచిపని చేశావు. నాకు చాలా ఆనందంగా ఉంది. ఇంద్రజిత్తు మరణంతో మనకు జయం లభించినట్లే;" అంటూ లక్ష్మణుని కౌగిలించుకొని తలను ముద్దాడాడు.

"లక్ష్మణా! రావణుని కుడిభుజాన్ని నరికేశావు. హనుమద్విభీషణులు కూడా ఘోరంగా పోరాడారు. మూడు రాత్రుళ్ళు, మూడు పగళ్ళూ యుద్ధం చేశారు. ఇంద్రజిత్తును వధించి రావణుని మరణానికి బాటను సుగమం చేశారు. రానీ! ఆ రావణుణ్ణి వధించేస్తాను. ఇక విజయం మనదే.

"సుషేణా! ఇలా రా నాయనా! చూడు! లక్ష్మణుని శరీరమంతా గాయాలే. వెంటనే చికిత్స చేసి బాగుచేయాలి. హనుమద్విభీషణులు, వానర భల్లూక వీరులు కూడా స్వస్థతను పొందేలా చూడు" అన్నాడు రాముడు.

రాముడు అలా చెప్పగానే వానరనాయకుడైన సుషేణుడు ఒక ఓషధిని తెచ్చి లక్ష్మణుని ఆఘ్రాణించమన్నాడు. లక్ష్మణుడు వాసన పీల్చగానే శరీరంలోని బాణాలన్నీ తొలగిపోయాయి. బాధ తగ్గిపోయింది. గాయము లన్నీ మానిపోయాయి.

గాయపడిన వీరులందరికీ చికిత్స చేశాడు సుషేణుడు. లక్ష్మణుడు స్వస్థతను పొందాడు. చాలా సంతోషంగా కనిపించాడు.

వినాశకాలం - విపరీత ధోరణి

ఇంద్రజిత్తు మరణించినట్లు రావణునికి చెప్పారు రాక్షసులు. "లక్ష్మణుని తీవ్రంగా గాయపరచి మూడు రాత్రింబవళ్ళు భయంకరంగా యుద్ధం చేసి ఇంద్రజిత్తు మరణించాడు. విభీషణుని సహాయంతో లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించాడు" అని రాక్షసులు రావణునితో చెప్పారు. అది విని రావణుడు మూర్ఛిల్లాడు.

కొంతసేపటికి రావణుడు తేరుకొని, "పుత్రా! ఇంద్రుణ్ణి కూడా జయించావా! ఈ లక్ష్మణుడి చేతిలో రాలిపోయావా! కాలపురుషుణ్ణి కాల్చేసే శక్తిపరుడివే. మందరపర్వత శిఖరాలను విరిచేసిన వాడివే! లక్ష్మణుడి తలను త్రుంచలేక పోయావా! నీవు మరణించిన తరువాత ఇప్పుడు నాకనిపిస్తోంది యముడు గొప్పవాడేనని.

"కుమారా! నువ్వు లేవని తెలిస్తే దేవతలు ఇక హాయిగా నిద్రపోతారు. నువ్వు లేని ప్రపంచం నాకు శూన్యంలా కన్పిస్తోంది. నన్ను విడిచి, మీ అమ్మను మరచి ఒంటరిగా ఎలా వెళ్ళావు పుత్రా! నాకు ప్రేతకార్యాలు చెయ్యాల్సిన వాడివి. నీకు నన్ను చెయ్యమనడం ధర్మమా నాయనా!" అంటూ దుఃఖిస్తున్న రావణుడు ఇంద్రజిత్తు మరణాన్ని పదేపదే తలుచుకొని క్రోధావేశపరు డయ్యాడు. సహజంగానే కోపిష్టి అయిన రావణుడు పుత్రశోకంతో మరీ మండి పడ్డాడు.

సీతమ్మను వధించాలని నిర్ణయించుకున్నాడు. "మాయసీతను నా కుమారుడు వధించాడు. అసలు సీత నాచేతిలో చస్తుంది." అంటూ ఖడ్గాన్ని తీసికొని ప్రళయాగ్ని లాగా అశోకవనానికి బయలుదేరాడు రావణుడు. సైనికులు, అంతఃపురస్త్రీలు అనుసరించారు. రాక్షసులు విజయఘోషలు పలుకుతూ సింహనాదాలు చేశారు.

ఖడ్గమును చేతపట్టుకొని రుష్టుడై వస్తున్న రావణుని చూచి సీతమ్మ వణికిపోయింది. తనను వధించడానికే వస్తున్నాడని భావించింది. పుత్రశోకంతో వ్యథ చెందిన రావణుడు స్త్రీ హత్యకు పాల్పడుతున్నాడని ఊహించింది. రాముణ్ణే పదేపదే స్మరించింది.

క్రుద్ధుడై వస్తున్న రావణునితో సుపార్శ్వుడు ఇలా పలికాడు: "వీరాధివీరా! నువ్వు కుబేరుని తమ్ముడివి. క్రోధానికి లోనై స్త్రీవధకు పాల్పడుతున్నావు. కాస్త ఆలోచించు. నీ క్రోధాన్ని ఇటు కాదు. అటు త్రిప్పు. నిన్ను మేమందరమూ అనుసరిస్తాము. రామలక్ష్మణులపై క్రోధాన్ని త్రిప్పి వారిని వధించు. ఈనాడు కృష్ణచతుర్దశి. రేపు అమావాస్య. యుద్ధరంగంలో నిలబడి విజయలక్ష్మిని వాటేసుకో. రథమెక్కు. రాముణ్ణి చంపేయ్. సీత ఈనాడు కాకపోయినా, రేపయినా నిన్ను చేరవలసిందే. నువ్వు ఆమెను చంపేస్తే మళ్ళీ పరలోకంలో ఆమె రాముణ్ణే చేరుతుంది. ఆమె బ్రతికి ఉంటేనే ఏనాడైనా నీదవుతుంది" అన్నాడు.

సుపార్శ్వుని మాటలు రావణునికి నచ్చాయి. అశోకవనం నుండి వెనుదిరిగాడు. కొలువుకూటానికి వెళ్ళాడు. సింహాసనంపై కూర్చున్నాడు.

"రాక్షసవీరులారా! గజబలాన్ని, అశ్వబలాన్ని, రథబలాన్ని వెంటబెట్టుకొని మీరందరూ రాముణ్ణి ఎదుర్కోండి. ఎంతవరకు పీడించగలరో రాముణ్ణి అంతవరకు పీడించండి. వధించేయండి. ఒకవేళ చావకపోయినా, మీ పీడనం వల్ల అలసిపోతాడు. అలసిన రాముణ్ణి రేపు నేను సునాయాసంగా చంపేస్తాను" అన్నాడు రావణుడు. రాముడు అలసిపోతే గాని చంపలేమని రావణుడు ఒక నిర్ణయానికి వచ్చినట్లున్నాడు.

సూర్యోదయమైంది. వానర రాక్షసుల మధ్య సంకులసమరం ప్రారంభమైంది. పరస్పరము తీవ్రంగా హింసించుకున్నారు. ఒకవైపు వానరవీరులు వధించబడుతున్నారు. మరొకవైపు రాక్షసవీరులు రాలిపోతున్నారు. ఫలభరితమైన వృక్షాలపై పడ్డట్లు రాక్షససైన్యం మీదికి దుముకుతున్నారు వానరులు.

పర్వతాకారులైన రాక్షసులు ప్రాసలతో, గొడ్డళ్ళతో, గదలతో వానరుల్ని భయంకరంగా కొట్టేశారు. వానరులు భయపడి రాముణ్ణి శరణుజొచ్చారు. వానరుల దుఃఖాన్ని చూడగానే భక్తవత్సలుడైన రాముడు కరిగిపోయాడు. ధనుస్సును ధరించి రాక్షసులపై బాణవర్షం కురిపించాడు. మేఘము సూర్యుని చేరలేని విధంగా రాక్షససైన్యము రాముణ్ణి చేరలేకపోయింది.

రాముని బాణాలు వాయువేగంతో నడుస్తున్నాయి. రాక్షసులు కుప్పలు కుప్పలుగా కూలిపోతున్నారు. రాముడు ప్రయోగించే బాణాల మధ్య రాముణ్ణి చూడలేక పోతున్నారు రాక్షసులు. వాయువు కారణంగా వనంలో ఊగిపోతున్న చెట్ల మధ్య వాయువు కనిపించనట్లు బాణవర్షం మధ్య రాముడు కనిపించలేదు.

ప్రహరన్తం శరీరేషు నతే పశ్యన్తి రాఘవమ్
ఇంద్రియార్థేషు తిష్ఠన్తం భూతాత్మాన మివప్రజాః

"ఇంద్రియాలు విషయసుఖాలలో రమిస్తున్నా, వాటికి ఆధారమైన ఆత్మ అదృశ్యంగా ఉన్నట్లు, రామబాణాలతో హింసింప బడుతున్న రాక్షసులు రాముణ్ణి చూడలేక పోతున్నారు" అన్నాడు వాల్మీకి.

ఆత్మబంధువులారా!

మేఘము సూర్యుణ్ణి సమీపించ లేనట్లు రాక్షసులు రాముణ్ణి చేరలేక పోతున్నారు. చెట్లు ఊగడం కనిపిస్తున్నట్లు, గాలి కన్పించనట్లు, రాముని కార్యాలు కనిపిస్తున్నాయి, రాముడు కనిపించడం లేదు. ఇంద్రియాలు ఇంద్రియవిషయాలలో రమిస్తుండగా ఆధారమై, సాక్షియైన ఆత్మ తెలియనట్లు రాముడు తెలియడం లేదు.

ఇలా వాల్మీకి ఒక ప్రవాహంలా చెప్పుకుపోతుంటే నేను పిచ్చివాణ్ణయిపోతున్నాను. నిస్సహాయుడనై నిలబడిపోతున్నాను. కలం పెట్టేసి కళ్ళు మూసుకుంటున్నాను.

పై వాక్యాలపై వేదాంత వివరణను ఇవ్వమంటోంది, ఆ రుచికి బాల్యము నుండి అలవాటు పడిన నా పిచ్చి మనసు. ఇంతవరకు నడిచిన అన్ని కాండలలోను మూలకథకు భంగం కలుగకుండా, ముసుగులో దాగివున్న సౌందర్యాన్ని, మహర్షి మడతేసి ఉంచిన దివ్యత్వాన్ని సున్నితంగా తొలగిస్తూ, సుకుమారంగా విప్పుతూ మీముందు పరుస్తూ వచ్చాను.

ఈ సందర్భంలో కళ్ళముందు కనిపిస్తున్న సౌందర్యాన్ని గూర్చి మాట్లాడకుండా ఉండలేక, మాట్లాడి రసవత్తరమైన కథాగమనానికి అవరోధం కలిగించలేక నలిగిపోతున్నాను.

ఇలాంటి సందర్భాలు ఇప్పటివరకు కథలో అనేకచోట్ల నాకు ఎదురయ్యాయి. ఎదురైనప్పుడల్లా బదులు చెప్పలేక పోయాను. నా పైత్యం కథకు కళ్ళెంలా మిగుల్తుందేమో నని భీతి చెందాను.

ఇక్కడ కూడా వివరణ నివ్వకుండా, పొంగే మనసును పట్టి ఆపుకుంటూ ముందుకు సాగిపోతున్నాను.

వాల్మీకిమహర్షి ఊహల్ని కదిలించేవాడే కాని ఊహల కందేవాడు కాడు. అతడొక క్షీరసాగరము. ఆపోశనం పట్టుటకు ఎవ్వరికీ సాధ్యపడని జ్ఞానామృత సాగరము.

ఈ రచనాకాలంలో నేను అందించింది కొంతే నని, అందుకున్నది ఎంతో నని నా మనసుకు స్పష్టంగా తెలుసు. రామకథ వ్రాయాలనేది నా ప్రధాన విషయం; ముఖ్య సంకల్పం.

ఆ పని చేస్తూ పోతుంటే మధ్యలో ఏవేవో దొరికాయి. ఎన్నెన్నో కన్పించాయి. వాటిని కూడా కలబోసి, కలిపేసి అమ్మేద్దామంటే సందర్భాలు అవరోధా లయ్యాయి. సమయాలు అడ్డు గోడలుగా నిలిచాయి.

అయితే ఒక్కమాట. రవి గాంచని దానిని కవి గాంచవచ్చు. కవి గాంచని, గాంచలేని దానిని గాంచగలిగే కవికోకిలే వాల్మీకి మహాకవి. ఆదికవి. ఆద్యంతా లెరిగిన కవి. అవధులు లేని కవి.

కవితా సింహాసనంపై దొరలా ఊరేగుతున్న ఆ మహాకవిని చూచి, సంతసించి వందనంతో సరిపెట్టుకోలేదు నేను. ఆ ఊరేగింపు వెంట ఓపిగ్గా నడిచి, అవకాశం దొరికినప్పుడల్లా ఊరేగే దొరగారి అలంకారాల్ని దోచేసుకుంటూ నడిచాను. అవన్నీ నేను పారేసుకోలేదు. దాచేసుకున్నాను. నా కొరకు కాదు. మీ కొరకే.

కాలంలో వాటిని మీకు వితరణ చేస్తూనే ఉంటాను. ఋషిఋణాన్ని అలా తీర్చుకోవడానికి ప్రయత్నిస్తాను. నా ఊపిరి ఉన్నంత వరకు వాల్మీకిపై, వాల్మీకంపై వ్రాస్తూనే ఉంటాను. కవికోకిలను అర్చిస్తూ, ఆ ప్రసాదాన్ని మీ కరకమలములలో ఉంచుతూనే ఉంటాను. క్షమించండి. మనసులో మాటను చెప్పాలని మిమ్మల్ని కొద్దిగా విసిగించాను. యుద్ధరంగానికి పోదాం పదండి.

యుద్ధంలో మెరుపులా విజృంభించి రాక్షసుల్ని కూల్చేస్తున్నాడు రాముడు. కోదండాన్ని ధరించి భయంకరంగా మారాడు. "ఇదిగో రాముడు గజసేనల్ని వధిస్తున్నాడు"- "ఇదిగో....ఇక్కడ అశ్వసైన్యాల్ని అంతం చేస్తున్నాడు." "అడుగడుగో... కాల్బంట్లను కూల్చేస్తున్నాడు." అని అరుస్తూ బెంబేలెత్తి పరుగులు తీస్తున్నారు రాక్షసులు. రాముడు గాంధర్వాస్త్రాన్ని ప్రయోగించి రాక్షసుల్ని బేజారెత్తించాడు.

తేతు రామ సహస్రాణి రణే పశ్యన్తి రాక్షసాః
పునః పశ్యన్తి కాకుత్థ్సమేక మేవ మహాహవే

"ఆ మహాయుద్ధంలో రాక్షసులకు వేలవేల మంది రాముళ్ళు కనిపిస్తున్నారు. మరు క్షణంలో ఒకే రాముడు కనిపిస్తున్నాడు".

కొరివి తిప్పినట్లు, చక్రం తిరిగినట్లు రాముని కోదండం గుండ్రని అగ్నిలా కనిపిస్తోంది చూచేవారికి. అలాతచక్రంలా కనిపించే ఆ కోదండము రాక్షసుల ఆయువును హరించే కాలచక్రంగా మారింది.

రథాలను, అశ్వాలను, గజాలను వేల సంఖ్యలో కూల్చేశాడు రాముడు. పదాతులను లక్షల సంఖ్యలో రాల్చేశాడు. ఇదంతా మూడు గంటల కాలములో జరిగిపోయింది.

లంకంతా బీభత్సం, భయానకం

యుద్ధంలో ఇప్పటివరకు లెక్కకు అందని విధంగా రాక్షసులు హతులయ్యారు. మిగిలినవారు గృహోన్ముఖులై, గృహాసక్తిని వీడలేక భార్యాపుత్రుల్ని కౌగిలించుకొని విలపించారు. భర్తలను పోగొట్టుకున్న రాక్షసస్త్రీలు, భర్తలు ఏ క్షణాన దూరమై పోతారో అని దిగులు చెందియున్న రాక్షసస్త్రీలు ఒక చోట చేరి కాకుల్లా అరుస్తూ రోదించారు.

"అయినా ఆ సుప్పనాతి తనలో ఏముందని రాముణ్ణి ప్రేమించింది? అదీ, దాని డొల్లుపొట్ట. మన్మథులలో మన్మథుడైన రాముడు తనకు తగినవాడని ఆ శూర్పణఖ ఎలా భావించిందో".

"సుకుమారుడు, ధర్మమూర్తి, వ్రతభంగము లేని వాడు అయిన రాముడెక్కడ? ఈ ముసలి పీనుగ, పిశాచ ముఖంతో రాముణ్ణి ఎలా కోరగలిగింది? ముడతల ముఖం, మడతల పొట్ట, తెల్లజుట్టు, ఛీ, పగలు చూస్తే చాలు, రాత్రి ఇక నిద్రుండదు. ఇది రాముణ్ణి వరించడమేమిటని?

"దాని ముఖం, అదెలా వెళ్తుందే, రాముడి దగ్గరికి? దానికెన్ని గుండెలు? దాన్ని తోలుకొని పోయేందుకు మన దురదృష్టం ఉంది కదా! అందుకే పోయి వుంటుంది. ఏది ఏమైనా, ఈ శూర్పణఖ కారణంగానే రావణుడికి ఆపద సంభవించింది. రావణుడు సీతను తెచ్చింది సుఖించడానికి కాదు. చావడానికి.

"అయినా, చెడ్డకాలం కాకపోతే, విరాధుడు విరిగిపోయాడా! ఖరుడు కరిగిపోయాడా! దూషణుడు దూరమయ్యాడా! కబంధుడు కదలిపోయాడా! వాలి రాలిపోయాడా! ఇంక ఏ నిదర్శనాలు కావాలి, రాముని పరాక్రమానికి.

"నిజమే నువ్వు చెప్పింది. వినే వాళ్ళేరి! విభీషణుడు నెత్తి నోరు మొత్తుకుంటూ మొరపెట్టుకున్నాడు. పదిబుర్రల్లో ఒక్క బుర్రకన్నా వంటపడితేనా! విభీషణుడు చెప్పింది వినుంటే ఈ దుర్గతి పట్టేదే కాదు.

"ఇంకేముంది? ఇంద్రజిత్తుని కూడా చిత్తుచిత్తుగా మొత్తేశారు. అయినా రావణుడు తెలుసుకోవడం లేదు. మృత్యుదేవత మన రాజుని వరించింది. పిలుపు మీద పిలుపు, వల్లమాలిన వలపుతో ఊపేస్తుంది. మనం మాత్రం ఏంచేద్దాం?

"అయ్యో! నా బిడ్డ పోయాడు. మా అన్న కూడా పోయాడు. నా దైవం పోయాడు. మా నాన్న తిరిగి రాలేదు" అని ఏడుస్తున్నారు రాక్షసస్త్రీలు. లంకంతా బీభత్సంగా ఉంది. ఎక్కడ విన్నా శ్మశానసంగీతమే.

ఆర్తనాదా లన్నీ రావణుని చెవికి అందుతూనే ఉన్నాయి. మనసు భయంకరంగా మారిపోయింది. క్రోధంతో కళ్ళు ఎరుపెక్కాయి. పెదవుల్ని దంతాలతో గట్టిగా కొరుక్కున్నాడు. ప్రళయకాలాగ్నిలా తయారయ్యాడు.

మహోదర, మహాపార్శ్వ,* విరూపాక్షులని పిలిచి తడబడుతున్న మాటలతో ఇలా పలికాడు.

"ప్రళయకాల సూర్యుడెలా ఉంటాడో మీరెప్పుడైనా చూశారా! ఈరోజు చూద్దురుగాని. రామలక్ష్మణుల్ని యమలోకానికి పంపే నా వీరత్వాన్ని కళ్ళారా చూద్దురుగాని.

"ఖరుడు, కుంభకర్ణుడు, ప్రహస్తుడు, ఇంద్రజిత్తు పరలోకంలో ఆనందించే పని చేస్తాను. నా బాణాలు దిక్కుల్ని కమ్మేస్తాయి. లోకాలన్నీ అంధకార బంధుర మవుతాయి. నా ధనుస్సనే సాగరం నుండి పుట్టిన బాణ కెరటాలు వానరసైన్యాన్ని ముంచేస్తాయి.

*చైతన్య రామాయణము - ద్వితీయభాగము - పుటలు 381,382లో కనిపించిన మహోదర మహాపార్శ్వులు వీరుకారు.

"ఎఱ్ఱని ముఖాలు గల వానరసైన్యం చచ్చిపడి భూమిని కన్పించనీకుండా కప్పేస్తుంది. ఎఱ్ఱతామరలు మొలిచిన జలాశయంలా గోచరిస్తుంది రణరంగ మంతా.

"వానరసైన్యాన్ని ముక్కలు ముక్కలుగా చీరేసి, వారి రక్తంతో రాక్షసవీరులకు తర్పణం పెడతాను. భర్తలను, సోదరులను, బిడ్డలను పోగొట్టుకున్న రాక్షసస్త్రీల కన్నీళ్ళను తుడుస్తాను. శత్రువుల కళేబరాలతో కాకులకు, గ్రద్దలకు, డేగలకు విందు చేస్తాను. కుక్కలు, నక్కలు పండుగ చేసుకుంటాయి.

"ఏర్పాటు చేయండి రథాన్ని. తీసుకురండి ధనుస్సును. నడవండి మీరంతా నా వెంట;" అన్నాడు రావణుడు. ఇతని వెంట అలా పోవడమే గాని తిరిగి వచ్చి భార్యాబిడ్డల్ని చూసేది ఉండదు అని నిర్ణయించుకున్నారు రాక్షసవీరు లందరూ.

రావణుడు రథమెక్కాడు. భూమిని చీల్చివేయునట్లు కదలింది రథం రణరంగానికి. మృదంగ, పటహ, శంఖ, తూర్య ధ్వనులతో ఆకాశం పిక్కటిల్లింది. భూమి దద్దరిల్లింది. దిక్కులు వణికాయి. చెట్లు ఊగాయి. సాగరకెరటాలు లేచాయి. పగలే పైనుండి ఉల్కలు రాలాయి. సూర్యుడు కాంతిహీను డయ్యాడు. పక్షులు రోదించాయి. జంతువులు భయంకరంగా అరచాయి. గుఱ్ఱాలు తడబడి నడుస్తున్నాయి. ధ్వజంపై గ్రద్దలు వాలాయి. నక్కలు అమంగళంగా కూసాయి. రావణుని ఎడమ కన్ను అదిరింది. ఎడమ చెయ్యి కదలింది. ముఖం పాలిపోయింది. కంఠం గద్గదమైంది. కనిపించాయి దుశ్శకునాలు ఎన్నో. లెక్కచేయలేదు రావణుడు అవి ఎన్నైనా.

రాక్షసుల రథధ్వని వినిపించింది. వానరులు కూడా సిద్ధమయ్యారు యుద్ధానికి. సంకుల సమరం ప్రారంభమైంది. క్రుద్ధుడైన రావణుడు రణరంగాన్నంతా తిలకించాడు. భూమి కనిపించకుండా వానరసైన్యం నిండిపోయింది రణరంగ మంతా. మృత్యువు తాను పడుకోవడానికి చాపను ఎక్కడ పరచిందో రావణునికి కనిపించలేదు.

రణరంగంలో రావణుడు

వానరులపై బాణవర్షం కురిపిస్తున్నాడు రావణుడు. కొందరి తలలు తెగిపడ్డాయి. కొందరి గుండెలు పగిలిపోయాయి. చెవులు తెగి కొందరు, తోకలు తెగి కొందరు, కాళ్ళు తెగి కొందరు చెల్లాచెదరై పడిపోయారు. కొందరి తలలు బ్రద్దలయ్యాయి. కొందరి కళ్ళు ఎగిరి పడ్డాయి. ఈవిధంగా తెగిపడిన వానరుల కళేబరాలతో భూమి కప్పబడింది. అగ్నిలో పడ్డ మిడతల్లాగా వానరులు నశించి పోతున్నారు. భీతి చెందినవారై పారిపోతున్నారు.

రావణుడు రథాన్ని రాముని వైపుకు పోనిచ్చాడు. వానరులు పారిపోవడం చూచి వారిని మళ్ళించమని సుషేణునికి చెప్పి సుగ్రీవుడు రాక్షససేనపై విరుచుక పడ్డాడు. వానరవీరు లందరూ వృక్షాలు, బండలు చేత్తో పుచ్చుకొని సుగ్రీవునికి అటూ, ఇటూ నిలబడ్డారు.

రాక్షసమూకల్ని వధిస్తూ రణరంగంలో స్వైరవిహారం చేశాడు సుగ్రీవుడు. రాక్షసుల మీద వడగళ్ళ వాన కురిసినట్లు రాళ్ళవర్షాన్ని కురిపించారు వానరులు. సుగ్రీవుని ప్రతాపానికి తట్టుకోలేక రాక్షసులు కుప్పలు, కుప్పలుగా కూలిపోతూ పర్వతాల్లా పోగులు పడ్డారు.

అది చూచి రాక్షసవీరుడైన విరూపాక్షుడు సుగ్రీవుని మీదికి ఉరికాడు. విరూపాక్షుడు కొట్టిన బాణపు దెబ్బలకి సుగ్రీవుడు చలించిపోయాడు. ఒక పెద్ద చెట్టును పెకలించి విరూపాక్షుని గజాన్ని కొట్టాడు సుగ్రీవుడు. ఆ ఏనుగు క్రిందపడి బిగ్గరగా అరచి మరణించింది.

విరూపాక్షుడు కత్తి, డాలు పట్టుకొని సుగ్రీవునిపై విజృంభించాడు. విరూపాక్షుని వక్షస్థలముపై పిడికిలితో కొట్టాడు సుగ్రీవుడు. విరూపాక్షుడు ఖడ్గమును చేబూని సుగ్రీవుని కవచాన్ని ఖండించి గాయపరచాడు. కొన్ని క్షణాలు తూలిపోయాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడు అరచేతితో విరూపాక్షుని కణతపై పెద్దగా కొట్టాడు. ఆ దెబ్బకు విరూపాక్షుని నోటి నుండి, ముక్కు నుండి రక్తం కారింది. నురుగు కక్కుతూ నేలరాలాడు విరూపాక్షుడు. కాళ్ళు, చేతులు కొట్టుకుంటూ రక్తపు మడుగులో పడి, గుడ్లు పైకి నిలిపి, నాలుకను ముందుకు తోసి, చేతులు బారచాచి, కాళ్ళు పంగచాచి, ప్రాణాలు వదిలేశాడు.

వానరు లందరూ ఉత్సాహంతో జబ్బలు చరచారు. పెద్దపెద్దగా అరుస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. విరూపాక్షుని మరణాన్ని చూచి, తమ క్షణ మెప్పుడో అన్నట్లు రాక్షసవీరు లందరూ పాలిపోయిన ముఖాలతో కనిపించారు.

వానర రాక్షస సేనలు పరస్పరం బాధించుకుంటూ గ్రీష్మఋతువులో సరస్సుల వలె క్షీణించి పోయాయి. రాక్షససైన్యము విపరీతంగా నశించడం వల్లా, విరూపాక్షుడు వధించబడడం వల్లా రావణుని క్రోధము రెట్టింపు అయింది.

"మహోదరా! ఈ క్షణంలో నా ఆశారథం నీవైపు తిరిగింది. వెళ్ళు. శత్రువుల్ని వధించు. నీ పరాక్రమాన్ని ప్రదర్శించు.

భర్తృ పిండస్య కాలోఽయం నిర్వేష్టుం సాధు యుధ్యతామ్

"ప్రభువు నైన నా అన్నము తిన్నందుకు ఋణం తీర్చుకొనే సమయము ఇదే. బాగా యుద్ధం చెయ్యి" అన్నాడు.

మహోదరుడు "అలాగే" అని పలికి మిడుత అగ్నిలో ప్రవేశించినట్లు శత్రుసైన్యములో ప్రవేశించాడు. అనేకమంది వానరుల్ని సంహరించాడు. వానరుల చేతులు, పాదాలు, తొడలు విరిచి సింహనాదం చేశాడు. చాలా మంది వానరులు మహోదరుణ్ణి ఎదుర్కోలేక పారిపోతే, మరికొందరు సుగ్రీవుణ్ణి ఆశ్రయించారు.

సుగ్రీవుడు మహోదరుణ్ణి ఎదుర్కొన్నాడు. పర్వతము వంటి బండను మహోదరునిపై విసిరాడు సుగ్రీవుడు. దానిని బాణాలతో ఛేదించాడు మహోదరుడు. అది గ్రద్దల సమూహము వలె నేలమీద పడింది.

సుగ్రీవుడు మరొక సాలవృక్షమును పెకలించి మహోదరునిపై విసిరాడు. దానిని కూడా ముక్కలుగా ఖండించాడు మహోదరుడు. నేలపడి వున్న పరిఘ కన్పించింది సుగ్రీవునికి. పరిఘను పుచ్చుకొని మహోదరుని గుఱ్ఱాలను చంపేశాడు. మహోదరుడు క్రిందికి దిగి గదను పుచ్చుకున్నాడు. పరిఘను, గదను హస్తములలో ధరించి సుగ్రీవ మహోదరులు ఆబోతుల వలె, మెరుపు మేఘాల వలె పోరాడారు.

మహోదరుడు సుగ్రీవుని పైకి గదను విసిరాడు. దానిని పరిఘతో సుగ్రీవుడు కొట్టగా పరిఘ విరిగిపోయింది. నేలపై పడియున్న ఇనుప రోకలిని గ్రహించాడు సుగ్రీవుడు. మహోదరుడు మరొక గదను గ్రహించాడు. కొద్దిసేపు పోరాడిన తరువాత రెండూ విరిగి పోయాయి. ఆ తరువాత ఇద్దరూ ముష్టియుద్ధానికి దిగారు.

ఒకరి నొకరు భయంకరంగా కొట్టుకున్నారు. గుద్దుకున్నారు. భుజాలతో గెంటుకున్నారు. తన్నుకున్నారు. మోకాళ్ళతో పొడుచుకున్నారు. అలసిపోయి కొన్ని క్షణాలు చూస్తూ నిలిచి పోయారు. విజయాన్ని సాధించాలని భయంకరంగా పోరాడారు. చివరికి సుగ్రీవుడు మహోదరుణ్ణి చంపేశాడు. అది చూచి రావణుని సైన్యము దిక్కులు పట్టి పారిపోయారు.

మహోదరుని మరణం చూచి రావణునికి క్రోధము అధికమైంది. రామునికి సంతోషము వృద్ధి చెందింది.

మహోదరుని మరణాన్ని చూచి నిప్పులు గక్కుతూ అంగదునిపై పడ్డాడు మహాపార్శ్వుడు. ముఖ్యులైన వానరుల శిరస్సులను ఖండించాడు. గాలి ఫలాలను రాల్చునట్లు మహాపార్శ్వుడు వానరుల తలకాయలను రాల్చేశాడు. కొందరి బాహువుల్ని ఖండించాడు. కొందరి డొక్కలు చీల్చేశాడు. అది చూచి పున్నమినాడు సాగరము వృద్ధి బొందినట్లు అంగదుడు విజృంభించాడు.

ఇనుప పరిఘతో అంగదుడు మహాపార్శ్వుని కొట్టాడు. ఆ దెబ్బకు మహాపార్శ్వుడు సారథితో కూడా క్రిందపడ్డాడు. జాంబవంతుడు ముందుకు దుమికి గుఱ్ఱాలను చంపేశాడు. మూర్ఛిల్లిన మహాపార్శ్వుడు తేరుకొని బాణాలతో అంగదుని కొట్టాడు. మూడు బాణాలతో భల్లూకరాజైన జాంబవంతుణ్ణి కొట్టాడు.

అంగదుడు వజ్రము వంటి పిడికిలిని బలంగా బిగించాడు. మహాపార్శ్వుని గుండెలపై బలంగా కొట్టాడు. అంగదుని పిడికిలిదెబ్బకు మహాపార్శ్వుని గుండె పగిలిపోయింది. నేలపై బడి మహాపార్శ్వుడు మరణించాడు.

మహాపార్శ్వుని మరణాన్ని చూచి రావణసైన్యము దిగ్భ్రాంతి చెందింది. రావణుడు పట్టరాని క్రోధావేశముతో ఊగిపోయాడు.

వానరులు సంతోషంతో జబ్బలు చరుస్తూ సింహనాదం చేశారు. ఆ శబ్దాలను వినిన రావణుడు క్రుద్ధుడై యుద్ధానికి సిద్ధపడ్డాడు.

రావణుని సైన్యంలో వీరులందరూ శాశ్వతంగా దూరమయ్యారు. దురదృష్ట మొక్కటే దగ్గరుంది. దుర్మరణం ఇక రావాలి. రావణుడు ఆలోచించాడు. ఎవ్వరూ చేయని, చేయలేని కార్యాన్ని తాను చెయ్యాలని సంకల్పించాడు. యుద్ధానికి సిద్ధపడ్డాడు.

రామ రావణ యుద్ధము

విరూపాక్షుడు, మహోదర మహాపార్శ్వులు మరణించడం చూచిన రావణునికి క్రోధము కట్టలు త్రెంచుకుంది. రథాన్ని నడిపించమన్నాడు సారథిని. అమాత్యుల మరణం వల్ల, లంకను వానరసేనలు ముట్టడించడం వల్ల కలిగిన దుఃఖాన్ని తొలగిస్తానని శపథం చేశాడు.

రావణుని రథం రామునికి అభిముఖంగా పరుగెత్తింది. భయంకరమైన తామసాస్త్రమును ప్రయోగించి వానరుల నందరినీ కాల్చేశాడు రావణుడు. భయపడిన వానరు లందరూ పరుగులు తీశారు. రావణుడు వానరుల్ని హింసించడం చూచిన రాముడు యుద్ధసన్నద్ధు డయ్యాడు.

రావణుడు రాముని చూశాడు. ధనుస్సును ఆనుకొని ఆకాశాన్ని ఒరయుచున్నాడా అన్నట్లు కనిపిస్తున్నాడు. దేవేంద్రుని ప్రక్కన ఉపేంద్రు డున్నట్లు రాముని ప్రక్కన లక్ష్మణు డున్నాడు. వానరుల్ని విశేషంగా సంహరించిన రావణుడు రథంలో రాముని వైపుకు వస్తున్నాడు. రాముడు సంతోషించి ధనుస్సు మధ్యభాగాన్ని పట్టుకున్నాడు. ధనుష్టంకారము చేశాడు రాముడు. ఆ ధ్వనికి దిక్కులు పిక్కటిల్లాయి. పిడుగులు పడ్డట్లు వినిపించి రాక్షసు లందరూ చెల్లాచెదరయ్యారు. రామలక్ష్మణులకు ఎదురుగా ఉన్న రావణుడు సూర్యచంద్రుల మధ్య రాహువులా కనిపిస్తున్నాడు.

రావణునితో ముందుగా తానే యుద్ధం చేయాలని భావించిన లక్ష్మణుడు అగ్నిశిఖల వంటి బాణాలను విడిచాడు. లక్ష్మణుడు ప్రయోగించిన బాణాల్ని ఆకాశం లోనే ఖండించాడు రావణుడు. లక్ష్మణుడు ఎన్ని బాణాలు విడుస్తాడో అన్ని బాణాలతోనే వాటిని ఖండిస్తూ తన హస్తలాఘవాన్ని ప్రదర్శించాడు రావణుడు.

లక్ష్మణునితో యుద్ధం చేయడం ఇష్టం లేక రాముని సమీపించాడు రావణుడు. రామునిపై శరవర్షం కురిపించాడు. దారుణ సర్పరూప బాణాలను రామునిపై ప్రయోగించాడు. రాముడు భల్ల బాణాల్ని గ్రహించి వాటిని మధ్యలోనే ఖండించాడు. రాముడు రావణుణ్ణి, రావణుడు రాముని పరస్పరం బాణాలతో బాధించుకున్నారు. ఒకరిపై ఒకరు బాణాలు సంధించుకుంటూ సవ్యాపసవ్యంగా, మండలాకారంగా తిరిగారు.

రామరావణులు ఏ వైపుకు వెళ్తావుంటే సముద్రకెరటాల వలె బాణసమూహాలు ఆ వైపు కనిపిస్తున్నాయి. రావణుడు అసురాస్త్రమును ప్రయోగించాడు. దాని నుండి పెద్దపులి, కాకులు, డేగలు, నక్కలు, అయిదు తలల సర్పాలూ, గాడిదలూ, తోడేళ్ళు మొదలగు జంతువుల ముఖాలు గల బాణాలు విశేషంగా బయలు దేరాయి.

అది చూచి రాముడు పావకాస్త్రాన్ని ప్రయోగించాడు. రావణుని బాణాలన్నీ ఆకాశంలోనే కొట్టబడి ముక్కలు ముక్కలుగా ఎగిరి భూమి మీద పడ్డాయి. వానరు లందరూ సంతోషంతో సింహనాదాలు చేశారు.

రావణుడు కుపితుడై రౌద్రాస్త్రం ప్రయోగించాడు. దాని నుండి దివ్యమైన శూలాలు, గదలు, ముసలములు, అన్నివైపులా బయలుదేరాయి. రావణుడు ప్రయోగించిన రౌద్రాస్త్రాన్ని రాముడు గాంధర్వాస్త్రంతో ఛేదించాడు.

రౌద్రాస్త్రము భగ్నమైంది. కానీ రావణుని రౌద్రము రెట్టింపయింది. నేత్రాలు ఎఱ్ఱబడ్డాయి. రావణుడు సౌరాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని నుండి భయంకరమైన పెద్ద పెద్ద చక్రాలు బయటపడ్డాయి. రాముని మీదికి బయలు దేరాయి. రాముడు దివ్యమైన బాణాలు ప్రయోగించి వాటిని కూడా ఖండించి పడేశాడు.

రావణుడు క్రుద్ధుడై పది బాణాలను ప్రయోగించి రాముడి మర్మస్థానాల్లో కొట్టాడు. రాముడు ఇసుమంతైనా చలించలేదు. రాముడు విజృంభించాడు. బాణాలను చిత్ర విచిత్రంగా ప్రయోగిస్తూ రావణుని సర్వాంగములను కొట్టాడు.

లక్ష్మణుడు కోపించి ఏడు బాణాల్ని గ్రహించాడు. మనిషి తల చిహ్నముగా గల రావణుని ధ్వజాన్ని ఛేదించాడు. సారథి శిరస్సును ఖండించాడు. వాడియైన ఐదు బాణాలు ప్రయోగించి రావణుని ధనుస్సును విరిచేశాడు.

విభీషణుడు లగెత్తి రావణుని శ్రేష్ఠమైన గుఱ్ఱాలను గదతో బాది చంపేశాడు.

రావణుడు క్రిందికి దూకి, విభీషణునిపై కోపించి వజ్రాయుధం వంటి శక్తిని విభీషణునిపై ప్రయోగించాడు. అది విభీషణుని సమీపించక ముందే మూడు బాణాలతో దానిని ఛేదించాడు లక్ష్మణుడు. ఆ శక్తి మూడు ముక్కలుగా ఖండించబడి, అగ్నులను విరజిమ్ముతూ ఉల్కల వలె భూమి మీద పడింది.

రావణుడు భయంకరమైన శక్తిని చేబూనాడు. విభీషణుని రక్షించే ప్రయత్నములో లక్ష్మణుడు రావణునిపై శరపరంపరలను కురిపించాడు.

"లక్ష్మణా! ఈ శక్తిని దేవతలు కూడా ఎదిరించలేరు. విభీషణుని వధించే సమయంలో నువ్వు అడ్డు నిలిచి అతణ్ణి రక్షించావు. ఇది నీ మీదికే ప్రయోగిస్తున్నా. ఇది నీ రక్తాన్ని జుర్రేసి ప్రాణాల్ని తోడేస్తుంది" అని పలికి భయంకరమైన ఆ శక్తిని లక్ష్మణునిపై ప్రయోగించి, పెద్దగా సింహనాదం చేశాడు.

వజ్రాయుధంతో సమానమైన పిడుగు లాంటి ఆ శక్తి లక్ష్మణుని వక్షస్థలము మీద పడింది. అది అలా పడబోతూ ఉందని గ్రహించిన రాముడు, "లక్ష్మణునకు శుభము కలుగు గాక! శక్తి వ్యర్థమగును గాక!" అని పలికాడు.

రావణుడు ప్రయోగించిన శక్తి లక్ష్మణుని వక్షఃస్థలంలో గ్రుచ్చుకోగా లక్ష్మణుడు క్రిందపడ్డాడు. లక్ష్మణుని చూచి రాముడు చింతాక్రాంతు డయ్యాడు. వెంటనే అది దుఃఖించుటకు సమయం కాదని గ్రహించి ప్రళయకాలాగ్ని వలె క్రోధావేశంతో రావణుణ్ణి చూశాడు.

"వానరవీరులారా! తమ్ముణ్ణి కాపాడండి. చాతకపక్షికి వేసవికాలం పోగానే వానమేఘం కనిపించినట్లు ఇంతకాలానికి ఈ పాపాత్ముడు నా కంట పడ్డాడు.

అస్మిన్ ముహూర్తే న చిరాత్సత్యం ప్రతిశృణోమి వః
అరావణ మరామం వా జగద్రక్ష్యథ వానరాః

"వానర వీరులారా! మీ ముందు నిజం చెబుతున్నాను. వినండి. త్వరలో రావణుణ్ణో, రాముణ్ణో ఎవరినో ఒకరినే చూస్తారు మీరు.

"నాకు రాజ్యం పోయింది. వనవాసము కలిగింది. దండకవన సంచారము ప్రాప్తించింది. సీత అవమానాల పాలైంది. ఎంతో దుఃఖాన్ని అనుభవించాను. ఇప్పుడు రావణుణ్ణి సంహరించి ఆ దుఃఖాన్నంతా మరచిపోతాను.

"వానరవీరులారా! పర్వతాల మీద హాయిగా కూర్చుని నేను రావణునితో చేసే యుద్ధాన్ని వీక్షించండి. రాముని పరాక్రమం ఎలాంటిదో ఈనాడు ముల్లోకాలు దర్శిస్తాయి;" అని పలికి బంగారు పొన్నులు గల బాణాలతో రావణుని కొట్టాడు రాముడు.

రావణుడు భయంకరమైన బాణాల్ని రామునిపై ప్రయోగించాడు. రాముడు ప్రయోగించే దారుణ శరాలను రావణుడు తట్టుకోలేక గాలికి ఎగిరిపోయిన మేఘం లాగా లంకలోకి పారిపోయాడు.

లక్ష్మణ మూర్ఛ

రావణుడు ప్రయోగించిన శక్తితో తీవ్రంగా గాయపడి యుద్ధభూమిలో పడియున్న లక్ష్మణుని చూచి రాముడు దుఃఖించాడు.

"సుషేణా! చూడు! నా తమ్ముడు మెలికలు తిరిగిపోతున్నాడు. నాకు లక్ష్మణుడు ప్రాణతుల్యుడు. రక్తముతో తడిసి అతడు బాధపడుతూ వుంటే నేను యుద్ధం ఎలా చేసేది? లక్ష్మణుడు మరణిస్తే నాకు యుద్ధ మెందుకు? సుఖ మెందుకు?

"నా చేతి నుండి కోదండం జారిపోతోంది. బాణాలు పట్టు తప్పుతున్నాయి. కన్నీటితో చూపు మందగిస్తోంది. బాధ గుండెను పిండేస్తోంది. మరణించాలనే కోరిక కూడా కలుగుతోంది.

"సుషేణా! నా తమ్ముడు చచ్చిపోతున్నాడు. నాకు యుద్ధ మెందుకు? ప్రాణాలెందుకు? లక్ష్మణునితో పాటు నేనూ మరణిస్తాను. లక్ష్మణుణ్ణి విడిచి నేను జీవించలేను.


"నాయనా! భార్యలు కావాలంటే దొరుకుతారు. బంధుజనులు కావాలంటే దొరుకుతారు. ఇలాంటి సోదరుడు దొరకడం కష్టం. లక్ష్మణుణ్ణి ఈ పరిస్థితిలో చూడడానికి పూర్వం నేను ఏ పాపం చేశానో! నాయనా! లక్ష్మణా! నన్ను విడిచిపెట్టి వెళ్తావా! అన్నను క్షణం విడిచి జీవించలేవే! ఇప్పుడు ఒంటరిగా ఎలా వెళ్తావు? నాయనా! నేను ఇంతగా ఏడుస్తున్నా నువ్వు లేవవు ఎందుకని? ఒక్కసారి కళ్ళు తెరచి చూడు;" అని ఏడుస్తున్న రామునితో సుషేణుడు ఇలా పలికాడు.

"రామా! లక్ష్మణుడు మరణస్థితిలో లేడు. అతని ముఖంలో వికారము లేదు. శరీరము నలుపు రాలేదు. ప్రసన్నంగా ఉన్నాడు. ప్రకాశిస్తూ ఉన్నాడు. అరచేతులు కమలము వలె ఎఱ్ఱగా ఉన్నాయి. నువ్వు దిగులు చెందకు;" అని పలికి, హనుమంతుడితో ఇలా చెప్పాడు.

"హనుమా! పూర్వము జాంబవంతుడు చెప్పినపుడు నువ్వు తెచ్చావు చూడు. ఆ ఔషధములు ఇప్పుడు కావాలి. ఆ మందులకొండ నందు దక్షిణశిఖరాన విశల్యకరణి, సావర్ణ్యకరణి, సంజీవ కరణి, సంధాని అను మహౌషధాలను ఇక్కడికి తీసికొని రావాలి;" అన్నాడు.

హనుమంతుడు వెంటనే ఎగిరి వెళ్ళాడు. ఓషధిపర్వతాన్ని చేరాడు. సుషేణుడు చెప్పిన ఓషధుల విషయంలో సందేహం కలిగి, పర్వతాన్నే పెకలించుకొని తెచ్చాడు హనుమంతుడు.

సుషేణుడు ఓషధులను తీశాడు. వాటిని బాగా నలిపి లక్ష్మణుడు వాటిని ఆఘ్రాణించేలా చేశాడు. లక్ష్మణుడు వెంటనే పైకి లేచాడు. బాణాల వలన, శక్తి వలన ఏర్పడిన గాయాలన్నీ మాయ మయ్యాయి. వానరు లందరూ అధికోత్సాహంతో గంతు లేశారు.



రాముడు లక్ష్మణుని ప్రేమతో చూశాడు. కన్నీరు కార్చుతూ కౌగిలించుకున్నాడు. "నాయనా! లక్ష్మణా! పునర్జన్మ నెత్తావు. నా భాగ్యం కొద్దీ నిన్ను మళ్ళీ చూస్తున్నాను. నువ్వు జీవించి ఉంటేనే నాకు జీవితము. నీవు లేని ప్రపంచము నాకు అవసరం లేదు;" అని పలుకుచుండగా లక్ష్మణుడు మధ్యలో కల్పించుకొని ఇలా పలికాడు.

"అన్నా! నువ్వు ఏం చెప్పావు! ఏం చేస్తున్నావు! రావణుణ్ణి వధిస్తానని శపథం చేశావు. ఇప్పుడేమో సామాన్యుని లాగా దుఃఖిస్తున్నావు. నువ్వు సత్యసంధుడివి. శపథాన్ని తప్పవచ్చా! నన్ను గూర్చి నువ్వు విలపించడం మంచిది కాదు. ముందు రావణుణ్ణి వధించు. నీవు సంకల్పిస్తే నీ ముందు నిలిచిన శత్రువు ప్రాణాలతో ఉండగలడా? సూర్యుడు అస్తాద్రిని చేరే లోగా రావణుడు శ్మశానాన్ని చేరాలి. ఇదే నా అభీష్టం" అన్నాడు లక్ష్మణుడు.

ఇంద్రరథంలో రాముడు

రావణుడు ఎదురుగా వస్తున్నాడు. రాముడు కోదండాన్ని ధరించాడు. రావణునిపై బాణవర్షం కురిపించాడు. రావణుడు కూడా వాడియైన బాణాలతో పర్వతాన్ని కొట్టినట్లు రాముణ్ణి కొట్టాడు. రాముడు అగ్నిశిఖల్లాంటి బాణాలను రావణునిపై ప్రయోగించాడు.

యుద్ధము భయంకరంగా సాగుతోంది. ఈలోగా ఆకాశము నుండి ఒక దివ్యమైన రథము క్రిందికి దిగుతూ ఉండడం కన్పించింది. ఆ రథము యొక్క చక్రాలు బంగారుతో అందముగా చేయబడి ఉన్నాయి. వందల కొలది చిరుగంటలతో ప్రకాశిస్తోంది. సారథి రథము లోనే కూర్చుని నమస్కరిస్తూ రామునితో ఇలా పలికాడు.



"రామా! నీవు పరాక్రమవంతుడివి. దివ్యమైన వాడివి. ఈ రథాన్ని నీ విజయం కొరకు ఇంద్రుడు పంపాడు. అగ్ని తుల్యమైన కవచమూ, ఐంద్ర ధనుస్సూ, సూర్యుని తేజముతో సమానమైన బాణాలూ, తీక్షణమైన శక్తి కూడా పంపాడు. నేను సారథిని. నా పేరు మాతలి. నేను ఈ రథాన్ని నడుపుతాను. నువ్వు ఈ రథము నెక్కి, ఇంద్రుడు దానవులను సంహరించినట్లు రావణుని వధించు;" అన్నాడు.

రాముడు రథమునకు ప్రదక్షిణము చేసి రథమె నెక్కాడు. దివ్యశోభతో ప్రకాశించాడు. రామరావణ యుద్ధము భయంకరంగా, గగుర్పాటు కలిగించే విధంగా సాగింది.

రావణుడు ప్రయోగించిన గాంధర్వాస్త్రాన్ని, దైవాస్త్రాన్ని రాముడు ఛేదించాడు. క్రుద్ధుడైన రావణుడు మళ్లీ ఆసురాస్త్రాన్ని ప్రయోగించాడు.

రావణుడు ప్రయోగించిన ఆసురాస్త్రం భయంకరమైన కాలసర్పాలుగా మారి రాముని మీదికి వచ్చింది. ఆకాశమంతా సర్పాలతో నిండిన సరస్సులా కనిపించింది. రాముడు గరుడాస్త్రాన్ని ప్రయోగించాడు. అది గరుడపక్షులుగా మారి సర్పాలను వధించింది.

రావణుడు వేయి బాణాలను రామునిపై ప్రయోగించాడు. సారథియైన మాతలిని కూడా బాణాలతో కొట్టాడు. ఒక బాణంతో ఇంద్రరథము యొక్క ధ్వజాన్ని పడగొట్టాడు. తీవ్రమైన బాణాలతో గుఱ్ఱాలను కూడా కొట్టాడు. అది చూచి దేవ, దానవ, గంధర్వ, సిద్ధ చారణాదులు నిర్విణ్ణు లయ్యారు. విభీషణుడు కూడా బాధపడ్డాడు. వానరులు తీవ్రంగా వ్యథ చెందారు.

ధనుస్సును చేత పట్టుకొని పది ముఖాలతో, ఇరవై చేతులతో నిలిచి ఉన్న ఆ రావణుడు మైనాకపర్వతంలా గోచరిస్తున్నాడు. రావణుడు ఉత్సాహంతో వడివడిగా బాణాలు రువ్వేస్తుంటే రాముడు తట్టుకోలేక పోయాడు.

రాముడు క్రుద్ధుడయ్యాడు. రాముడు కోపించగనే సర్వప్రాణులు భీతి చెందాయి. భూమి కంపించింది. పర్వతాలు చలించాయి. సముద్రము క్షోభించింది. మేఘాలు గర్జించాయి. ఎటు చూచినా దుశ్శకునాలు కనిపించాయి. రావణుడు భీతి చెందాడు.

రావణుడు శత్రుసంహారకమైన, భయంకరమైన శూలాన్ని గ్రహించాడు. అది ప్రళయాగ్ని లాగా ప్రకాశించింది. రావణుడు సింహనాదం చేశాడు. ఆ శబ్దానికి లోకాలు కంపించిపోయాయి.

“రామా! నా కోపానికి మీరు గురయ్యారు. వజ్రతుల్యమైన ఈ శూలము నిన్ను, లక్ష్మణుణ్ణి దారుణంగా వధించి, ప్రాణాల్ని తోడేస్తుంది. ఈ రణభూమిలో రాక్షసుల్ని వధించిన నిన్ను వారి ప్రక్కనే శయనించేలా చేస్తాను;” అని పలికి రాముడిపై శూలాన్ని విసిరాడు రావణుడు.

ఎనిమిది గంటలతో మెరుపు లాగా ప్రకాశిస్తూ ఆ శూలము ఆకాశంలో వస్తోంది. దానిని ఛేదించడానికి రాముడు వాడియైన బాణాల్ని ప్రయోగించాడు. అవన్నీ రావణుడు ప్రయోగించిన శూలాగ్నిలో పడి మండిపోయాయి.

మాతలి ద్వారా దేవేంద్రుడు పంపిన శక్తిని ప్రయోగించాడు రాముడు. అది గంటల గణగణ శబ్దములతో కదిలి, జ్వాలలతో ప్రకాశించింది. రావణుడు ప్రయోగించిన శూలముపై బడి దానిని ఖండించింది. కాంతిహీనమైన రావణుని శూలము నేలపై బడింది.

వాడియైన బాణాలతో రావణుని గుఱ్ఱాలను కొట్టాడు రాముడు. మరికొన్ని వాడియైన బాణాలను ప్రయోగించి రావణుని వక్షస్థలమును కొట్టాడు. కొన్ని బాణాలతో లలాటంపై కొట్టాడు. వివిధ అంగాలపై రాముని బాణాలు పడగా రావణుడు రక్తసిక్త మయ్యాడు. వికసించిన అశోకవృక్షం లాగా కన్పించాడు.

క్రుద్ధుడైన రావణుడు రామునిపై వేల కొలది బాణాలను ప్రయోగించాడు. రావణుని బాణాలు శరీరంపై పడుతున్నా రాముడు చలించలేదు. మహాపర్వతంలా కనిపించాడు.

రాముడు వాడియైన వేలాది బాణాలతో రావణుని వక్షస్థలాన్ని కొట్టాడు. రావణుడు రుధిరసిక్తమైన దేహంతో పుష్పించిన కింశుకవృక్షంలా కనిపించాడు.

రామరావణుల మధ్య నడుస్తున్న బాణముల వలన ఏర్పడిన చీకటిలో రాముడు రావణునికి కనిపించలేదు. రావణుడు రామునికి కనిపించలేదు.

“రావణా! రాక్షసాధమా! నా భార్య సీత ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెను అపహరించావు. పిరికిపంద! నువ్వు చేసిన పనికి సిగ్గులేక వీరుడిలా ఊరేగుతున్నావు. నీచమైన పని చేసి శూరుడైనట్లు గర్విస్తున్నావు. నువ్వు చేసిన దుష్టకార్యానికి ఫలితాన్ని అనుభవించు.

“నేనుండగా నువ్వు సీతను అపహరించి ఉన్నట్లయితే, ఆరోజే నీ తమ్ముడైన ఖరుని చేరుండే వాడివి. దైవవశాత్తు ఈనాడు నువ్వు నా కంట బడ్డావు. ఇప్పుడు నా బాణాలతో రాలిపోయి ధూళిలో పొర్లాడతావు. కుక్కలు, నక్కలు పీక్కుతింటాయి నీ మాంసాన్ని. పెల్లుబుకుతున్న నీ రక్తాన్ని గుటగుట తాగేస్తాయి. నీ ప్రేగుల్ని పక్షులు లాగి లాగి తింటాయి;” అని పలుకుతూ బాణవర్షాన్ని కురిపించాడు మహావీరుడైన రాముడు.

రాముని బాణాలచే కొట్టబడి భీతి చెందాడు రావణుడు. విషణ్ణు డయ్యాడు. తిరిగి రామునిపై బాణాలను ప్రయోగించలేక పోయాడు. చూస్తూ ఉండిపోయాడు.

రావణుని దీనావస్థను చూచి సారథి కంగారు పడ్డాడు. రథాన్ని దూరంగా తీసికొని పోయాడు. పరాక్రమము ఉడిగి, పరాభవమునకు గురియవుతున్న రావణునికి పలాయనమే పరమావధిగా సారథి గుర్తించాడు.

సారథి రథాన్ని దూరంగా తీసికొని వెళ్ళగానే రావణుడు క్రుద్ధుడయ్యాడు. సారథిని దూషించాడు.

“ఓరీ! దుర్బుద్ధీ! నన్ను అసమర్థుడిగా, పౌరుషహీనుడిగా, పిరికివానిగా, హీనునిగా, బల హీనునిగా భావించావా! నీచుడా! నా తేజస్సు నశించిందని భ్రమపడ్డావా! నా మాయాశక్తు లడుగంటాయని కలకన్నావా! నన్ను సామాన్యునిగా భావించి నీ నిర్ణయాలతో ప్రవర్తిస్తావా! నన్ను అవమానిస్తావా! ఎందుకు తీసుకు వచ్చావు రథాన్ని దూరంగా. చిరకాలంగా నేను సాధించిన కీర్తిని, పరాక్రమాన్ని క్షణంలో మంటగలిపావు. నన్ను పురుగులా మార్చేశావు.

“అజ్ఞానంతో నువ్వు రథాన్ని మళ్ళించి ఉండాలి. అలా కానిచో నువ్వు శత్రువుతో రహస్యంగా చేతులు కలిపి ఉండాలి. శత్రువు నుండి నీకు ఏదో ముట్టి ఉండాలి. చెప్పు. ఇప్పుడు నువ్వు చేసిన పని శత్రువు చేయదగిందే గాని మిత్రుడు చేయదగింది కాదు. త్రిప్పు రథాన్ని. శత్రువు చెయ్యిజారిపోకుండా చూడు;” అన్నాడు సారథితో రావణుడు.

“మహారాజా! నన్ను క్షమించు. నేను భయపడలేదు. నాకు ఏ చెడు సంకల్పమూ లేదు. పొరపాటు నాలో ఏదీ లేదు. నువ్వు చేసిన శత్రువుతో నాకు ఏవిధమైన సంబంధాలూ లేవు. మేలు నేను మరువలేదు. నీకు మంచి జరగాలని నీ మేలు కోరి అలా ప్రవర్తించానే గాని మరో భావంతో అలా చేయలేదు. దయచేసి నాలో దోషం చూడవద్దు. నేను నిర్దోషిని. మీ హితైషిని.

“యుద్ధంలో మీరు బాగా అలసినట్లు కనిపించారు. పరాక్రమమును ప్రదర్శించాలనే, ఉత్సాహము మీలో కనిపించలేదు. మీ ముఖంలో నైరాశ్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. శత్రువు మీకన్నా ఉచ్చదశలో కనిపించాడు.

"దానికి తోడు ఎందుకో తెలియదు. గుఱ్ఱాలు కూడా రథాన్ని సరిగా లాగలేక పోతున్నాయి. వానలో తడిసిన గోవుల్లాగా చెమటతో తడిసి శక్తిహీనంగా కన్పించాయి.

"పైగా, దుశ్శకునాలు గోచరించాయి. కాలం మనకు ప్రతికూలంగా ఉన్నట్లు కనిపించింది. సారథి యైనవాడు దేశకాలాలను పరిశీలించే వాడై ఉండాలి. రథికుని స్థితిగతులను బేరీజు వేసుకొంటూ ఉండాలి. సమయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ప్రదేశాలను పరిశీలించుకుంటూ ఉండాలి. శత్రువుని కనిపెడుతూ ఉండాలి. దగ్గర చేరడం - దూరంగా తొలగడం ఇవన్నీ సారథికి తెలిసి ఉండాలి.

"ప్రభూ! నీకు అలసట తీరాలని, అశ్వములకు విశ్రాంతి కలగాలని భావించి సందర్భోచితముగ నేను ఈ పని చేశాను. ఇది ప్రభుభక్తితో చేసిన కార్యమే గాని అహంకారంతో, స్వార్థంతో చేసింది కాదు. రాజా! చెప్పు. నువ్వు ఎలా చెయ్యమంటే అలా చేస్తాను;" అన్నాడు సారథి.

"సారథీ! పద. రథాన్ని తీసికెళ్లి రాముడికి ఎదురుగా నిలబెట్టు. శత్రువును సంహరించకుండా ఈ రావణుడు రణరంగము నుండి నిష్క్రమించడు;" అన్నాడు రావణుడు.

సారథి రథాన్ని వెనక్కి తిప్పాడు. క్షణకాలంలో రావణుని రథము రాముని ఎదుట నిలిచింది.

యుద్ధాన్ని వీక్షించడానికి వచ్చి ఆకాశంలో నిలిచియున్న దేవ, దానవ, యక్ష, గంధర్వ, ఋషి గణాలలో మహాత్ముడైన అగస్త్యమహర్షి కూడా ఉన్నాడు. రాముడు కూడా అలసి యున్నట్లు అగస్త్యుడు గ్రహించాడు. రావణుణ్ణి జయించడానికి రామునికి ఒక ఉపాయం చెప్పాడు. అదొక దివ్యమైన మంత్రం. అద్భుతమైన స్తోత్రం. అక్షయమైన ఐశ్వర్యాన్ని ప్రసాదించే ఆదిత్య స్తవము. అదే ప్రశస్తమైన ప్రాచుర్యం గల ఆదిత్యహృదయం.

ఆదిత్య హృదయం

శ్లో॥ తతో యుద్ధ పరిశ్రాన్తం సమరే చిన్తయా స్థితమ్
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్ 1

శ్లో॥ దైవతైశ్చ సమాగమ్య ద్రష్టు మభ్యాగతో రణమ్
ఉపగ మ్యాబ్రవీ ద్రామ మగస్త్యో భగవాన్ ఋషిః 2

యుద్ధమును చూచుటకు దేవతలతో కలిసివచ్చిన భగవంతుడైన అగస్త్యమహర్షి, యుద్ధమున అలసి, మరల తనతో యుద్ధము చేయుటకు ముందు నిలబడి యున్న రావణుని చూచి రణరంగంలో చింతాక్రాంతుడై ఉన్న రాముని చూచి ఇలా పలికాడు:

Beholding Sri Rama, standing absorbed in thought on the battle-field, exhausted by the fight, and Ravana facing him, duly prepared for an encounter, and approaching Sri Rama, the glorious sage Agastya, who had come in the company of gods to witness the encounter now spoke as follows:



శ్లో॥ రామ! రామ! మహాబాహో! శ్రుణు గుహ్యం సనాతనమ్
యేన సర్వా నరీ న్వత్స! సమరే విజయిష్యసే 3

శ్లో॥ ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్
జయావహం జపే న్నిత్య మక్షయ్యం పరమం శివమ్ 4

శ్లో॥ సర్వమంగల మంగల్యం సర్వపాప ప్రణాశనమ్
చింతా శోక ప్రశమన మాయు ర్వర్ధన ముత్తమమ్ 5

గొప్ప బాహువులు గల నాయనా! రామా! ఓ రామా! నిత్యమైన, రహస్యమైన స్తోత్రాన్ని ఆలకించు. దానివల్ల రణరంగంలో శత్రువులను జయించగలవు.

ఈ స్తోత్రము శత్రువు లందరినీ నశింపచేస్తుంది. జయము నిస్తుంది. అక్షయ ఫలాన్నిస్తుంది. పవిత్రమైనది. శుభకరమైన స్తోత్రాలన్నిటికంటే ఇది శుభప్రద మైనది. సర్వపాపములను హరిస్తుంది. చింతను తొలగిస్తుంది. శోకాన్ని పారద్రోలు తుంది. ఆయుర్దాయమును వృద్ధి చేస్తుంది.

"Rama! O mighty-armed Sri Rama, hearken to the following eternal secret - in the form of a holy, eternal, immortal and supremely blessed and excellent encomium, entitled "Aditya Hrdayam", the blessing of all blessings, by means of which, my child, you will conquer once for all your adversaries on the battle-field, and which

is calculated to bring victory, root out all sins, allay all anxiety and grief once for all and prolong life.

శ్లో॥ రశ్మిమంతం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్ 6

ఆదిత్యుడు ప్రశస్తకిరణ శోభితుడు. నిత్యము ఉదయిస్తాడు. దేవాసురుల చేత పూజనీయుడు. తన వెలుగు చేత అన్ని వెలుగులను ఆర్పివేయువాడు. కాంతి నిచ్చు వాడు. జగత్ప్రభువు. అట్టి సూర్యదేవుని ఆరాధించు.

Worship the Sun-god, the ruler of the worlds, who is crowned with rays, who appears at the horizon, who is greeted by gods and demons and brings light to the world.

శ్లో॥ సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావన:
ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభి: 7

అతడు సర్వదేవతా స్వరూపుడు. తేజోమయుడు. తన కిరణముల చేత ప్రపంచానికి సత్తా స్ఫురణలను కలిగించువాడు. దేవాసురులను రక్షించువాడు ఇతడే.

Indeed, he is the embodiment of all gods and full of glory and creates and sustains the gods and the demons as well as the world by his rays.

శ్లో॥ ఏష బ్రహ్మా చ విష్ణు శ్చ శివ: స్కన్ద: ప్రజాపతి:
మహేంద్రో ధనద: కాలో యమ స్సోమో హ్యాపాంపతి: 8

శ్లో॥ పితరో వసవ స్సాధ్యా హ్యశ్వినౌ మరుతో మను:
వాయు ర్వహ్ని: ప్రజా ప్రాణ ఋతుకర్తా ప్రభాకర: 9

శ్లో॥ ఆదిత్య స్సవితా సూర్య: ఖగ: పూషా గభస్తిమాన్
సువర్ణ సదృశో భాను: హిరణ్యరేతా దివాకర: 10

ఈ సూర్యుడే బ్రహ్మ. విష్ణువు. శివుడు. కుమారస్వామి. తొమ్మిది మంది ప్రజాపతులు. ఇంద్రుడు. కుబేరుడు. కాలపురుషుడు. యముడు. సోముడు. వరుణుడు.

పితృదేవతలు, వసువులు, సాధ్యులు, అశ్వినీదేవతలు, మరుత్తులు, మనువు, వాయువు, అగ్ని, ప్రజలు, ప్రాణవాయువు-ఇవన్నీ సూర్యుడే. ఋతుకర్త, కాంతిదాత ఇతడే.

అదితి పుత్రుడు, ప్రపంచాన్ని సృష్టించువాడు, జీవులను కర్మలలో నియమించువాడు, 'గగనవిహారి, ప్రపంచాన్ని వర్షముతో తడుపువాడు, కిరణ్మయుడు, సువర్ణకాంతి యుతుడు, ప్రకాశవంతుడు, బంగారము రేతస్సుగా గలవాడు, దివాకరుడు.

Indeed he is the same as Brahma as well as Vishnu, Lord Siva, Kumara, Prajapatis, the mighty Indra, Kubera, Kala, Yama, Soma, Varuna, —

The Pitrus, the Vasus, the Saadhyas, the Aswinis, the Maruts, Manu, Vayu, Agni. He constitutes created beings, he is the life-breath, the source of the seasons, the store house of light, —

An offspring of Aditi, the progenitor of all, the Sun-god, the courser in the heavens, the nourisher of all, the possessor of rays, the golden, the brilliant, the one whose energy constitutes the seed of the universe and the maker of day.

శ్లో॥ హరిదశ్వ స్సహస్రార్చి: సప్తసప్తి ర్మరీచిమాన్
తిమిరోన్మథన శ్శంభు: త్వష్టా మార్తాండకోఽంశుమాన్ 11

శ్లో॥ హిరణ్యగర్భ శ్శిశిర: తపనో భాస్కరో రవి:
అగ్నిగర్భోఽదితే: పుత్ర: శంఖ శ్శిశిరనాశన: 12

శ్లో॥ వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుస్సామపారగ:
ఘనవృష్టి రపాం మిత్ర: వింధ్యవీథీ ప్లవంగమ: 13

శ్లో॥ ఆతపీ మండలీ మృత్యు: పింగల స్సర్వతాపన:
కవి ర్విశ్వో మహాతేజా రక్త స్సర్వభవోద్భవ: 14

శ్లో॥ నక్షత్ర గ్రహ తారాణాం అధిపో విశ్వభావన:
తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మ న్నమోఽస్తుతే 15

వేయి కిరణములు కలవాడు, చీకటిని
ఆకుపచ్చని గుఱ్ఱములు కలవాడు, కిరణ్మయుడు, తిమిరహరుడు, సుఖమును
పోగొట్టువాడు, సప్తాశ్వములు కలవాడు, బ్రహ్మాండమును మరల సృష్టించు వాడు,
పెంపొందించువాడు, సర్వరూప సంహారకుడు,
కిరణములు గలవాడు, -

హిరణ్యగర్భుడు, తాపత్రయములను పోగొట్టువాడు, వేడి పుట్టించువాడు, పగటిని
కల్పించువాడు, గర్భమునందు అగ్ని గలవాడు, అదితి కుమారుడు, సాయంకాలము
శాంతించువాడు, మంచును కరగించువాడు, -

ఆకాశమునకు ప్రభువైనవాడు, రాహువును భేదించువాడు, త్రైవేద్య పారంగతుడు,
గొప్పవర్షము కలవాడు, జలములకు మిత్రుడు, గగనమున శీఘ్రంగా పయ నించువాడు, -

ఎండ గలవాడు, మండలము గలవాడు, శత్రువులకు మృత్యుసమానుడు, ఎఱ్ఱని
వర్ణము గలవాడు, సర్వమును, సర్వులను తపింప చేయువాడు, కవి, ప్రపంచమును

నడుపువాడు, గొప్ప ప్రకాశవంతుడు, అందరియందు అనురాగము గలవాడు, సర్వ సంసారములకు పుట్టుకస్థాన మైనవాడు, -

నక్షత్ర, గ్రహ, తారలకు అధిపతి, గొప్ప తేజస్సు కలవాడు, విశ్వభావనుడు, వెలుగులకు వెలుగైనవాడు, పన్నెండు రూపములు గలవాడు అగు సూర్యదేవా! నీకు నమస్కారము.

He has seven green horses, is myriad-rayed, full of rays, the destroyer of darkness, the source of happiness, the mitigator of the suffering of his devotees, the infuser of life in the lifeless cosmic egg, all-pervading and the cause of the creation, preservation and destruction of the universe. He is blissful by nature, the ruler of all, the bringer of day and the teacher. A son of Aditi, he bears the fire of dissolution in his womb, is bliss personified and all-enveloping like space, the destroyer of cold, the Lord of the heavens, the disperser of darkness, a master of the three vedas, the sender of thick showers and the friend of water. He courses swiftly along his own orbit, carries in him the resolve to evolve the universe and is adorned with a circle of rays. He is death, tawny and the destroyer of all. He is Omniscient, all-formed endowed with extraordinary brilliance, coppery, the source of all evolutes, the controller of all lunar mansions, planets and stars, the creator of all, the resplendent among the splendid. O God appearing in twelve forms, hail to you.

శ్లో॥ నమః పూర్వాయ గిరయే పశ్చిమా యాద్రయే నమః
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః 16

పూర్వగిరి రూపునకు నమస్కారము. పశ్చిమగిరి రూపునకు నమస్కారము. జ్యోతిర్గణముల అధిపతికి నమస్కారము. దినాధిపతికి నమస్కారము.

Hail to the eastern-mountain God and hail to the western-mountain God. Hail to the Lord of hosts of luminaries, the Lord of the day.

శ్లో॥ జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః
నమో నమ స్సహస్రాంశో! ఆదిత్యాయ నమో నమః 17

జయము నిచ్చువానికి, జయమును వృద్ధి చేయువానికి, ఆకుపచ్చని గుఱ్ఱములు గలవానికి నమస్కారము. వేయి కిరణములు కలవాడా! పదేపదే నమస్కారము. ఆదిత్యునకు నమస్కారము.

Hail to the giver of victory, hail to the joy born of victory! Hail to the God having green horses. Hail, hail to you with thousands of rays.

శ్లో॥ నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః
నమః పద్మప్రబోధాయ ప్రచండాయ నమోఽస్తుతే 18

శత్రువులకు ఉగ్రుడైన వానికి, వీరుడైన వానికి, శీఘ్రముగా పయనించు వానికి, పద్మములను వికసింప చేయువానికి, తీక్షణమైన వానికి నమస్కారము.

Hail to the slayer of enemies, the valiant one! Hail to the awakener of the lotus! Hail to you, the fierce one!

శ్లో॥ బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్య వర్చసే
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః 19

త్రిమూర్త్యాత్మకునకు, సూర్యునకు, ఆదిత్యరూపమైన ప్రకాశము గలవానికి, సర్వ సంహారకునకు, రౌద్రరూపునకు నమస్కారము.

Hail to the personification of Trinity! Hail to the Sun-god, the light indwelling the solar orb, the resplendent one, the devourer of all, appearing in the form of Rudra!

శ్లో॥ తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నా యామితాత్మనే
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః 20

తిమిరహరునకు, మంచును కరిగించు వానికి, శత్రువులను హరించు వానికి, అవధి లేని వానికి, కృతఘ్నులను సంహరించు వానికి, ప్రకాశించు వానికి, సమస్త జ్యోతులకు ప్రభువైన వానికి నమస్కారము.

Hail to the dispeller of darkness, the destroyer of cold, the exterminator of foes, the one whose extent is immeasurable, the destroyer of the ungrateful, the God who is the ruler of all lights.

శ్లో॥ తప్తచామీకరాభాయ హరయే విశ్వకర్మణే
నమస్తమోఽభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే 21

కరిగిన బంగారు ఛాయ గలవానికి, హరునకు, ప్రపంచమును సృష్టించు వానికి, చీకటిని తొలగించు వానికి, ప్రకాశస్వరూపునకు, లోకములకు సాక్షి యైన వానికి నమస్కారము.

Hail to you, possessing the lustre of refined gold, the dispeller of ignorance, the architect of the universe, the up rooter of darkness, splendour incarnate, the onlooker of the world!

శ్లో॥ నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః
పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః 22

జగత్తును నశింపచేయు ప్రభువు ఇతడే. సృజించునది కూడా ఇతడే. కిరణముల చేత తపింప చేసేది కూడా ఇతడే. వర్షించునది కూడా ఇతడే.

He alone actually destroys, brings into existence and sustains all that has come into being. He alone radiates heat by his rays and sends showers.

శ్లో॥ ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠిత:
ఏష చై వాగ్నిహోత్రం చ ఫలం చై వాగ్నిహోత్రిణామ్ 23

అందరూ నిద్రించువేళ ఇతడు మేల్కొని ఉంటాడు. ఇతడే అగ్నిహోత్రము. అగ్నిహోత్రము చేయు వారికి ఫలదాత కూడా అతడే.

He remains awake when all beings have fallen asleep. Nay, he himself is the act of pouring oblations into the sacred fire as well as the fruit attained by those who pour such oblations.

శ్లో॥ దేవాశ్చ క్రతవ శ్చైవ క్రతూనాం ఫలమేవ చ
యాని కృత్యాని లోకేషు సర్వేషు పరమప్రభు: 24

దేవతలు, క్రతువులు, క్రతువుల ఫలము కూడా ఇతడే. లోకముల యందలి సర్వకృత్యముల విషయమున ఇతడే సమర్థుడు.

He comprises the gods as well as the sacrifices and also the fruit of sacrifices. Again, he is the supreme controller of all activities which are found in all living beings.

శ్లో॥ ఏన మాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ
కీర్తయన్ పురుష: కశ్చిత్ నావసీదతి రాఘవ 25

రామా! ఆపదలలో, కష్టాలలో, దుర్గమ మార్గాలలో, భయసమయాలలో ఎవడు సూర్యుని స్తుతిస్తాడో అతడు నశించడు.

No individual celebrating the Sun-god in straits, in difficulties, in the woods as well as in times of peril comes to grief, O scion of Raghu!

శ్లో॥ పూజయ స్వైన మేకాగ్రో దేవదేవం జగత్పతిమ్
ఏతత్త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి 26

శ్లో॥ అస్మిన్ క్షణే మహాబాహో! రావణం త్వం వధిష్యసి
ఏవముక్త్వా తదాఽగస్త్యో జగామ చ యథాగతమ్ 27

జగత్తునకు ప్రభువైన ఆ దేవదేవుని స్థిరచిత్తముతో పూజించు. ఈ ఆదిత్య హృదయాన్ని మూడు పర్యాయములు పఠిస్తే యుద్ధములో విజయాన్ని పొందగలవు.

ఓ మహాబాహో! నీవు రావణుణ్ణి ఈ క్షణమునందే వధించగలవు; అని పలికి అగస్త్యుడు అంతర్హితు డయ్యాడు.

Worship the Sun-god with a concentrated mind. Muttering this praise three times, one will come out victorious in combats. You will make short of Ravana this very moment, O mighty-armed one!

శ్లో॥ ఏతచ్ఛ్రుత్వా మహాతేజా నష్ట శోకోఽభవ త్తదా
ధారయామాస సుప్రీతో రాఘవ: ప్రయతాత్మవాన్ 28

గొప్ప మనసు గల రాముడు దీనిని ఆలకించి దు:ఖాన్ని త్యజించాడు. సంతసించిన రాముడు నిశ్చలమైన చిత్తముతో ఆ స్తోత్రాన్ని మనసులో నిలుపుకున్నాడు.

Hearing this, Sri Rama who was endowed with extraordinary energy and had a subdued mind found his grief immediately dissipated. Nay, feeling greatly delighted, he retained the stotra in his memory.

శ్లో॥ ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వా తు పరం హర్ష మవాప్తవాన్
త్రిరాచమ్య శుచి ర్భూత్వా ధనురాదాయ వీర్యవాన్ 29

శ్లో॥ రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధార్థం సముపాగమత్
సర్వయత్నేన మహతా వధే తస్య ధృతోఽభవత్ 30

పరాక్రమవంతుడైన రాముడు మూడు సార్లు పవిత్రంగా ఆచమనం చేసి, సూర్యుణ్ణి చూసి, ఆదిత్యహృదయాన్ని జపించి, గొప్ప సంతోషాన్ని పొందాడు. ధనుస్సును గ్రహించి, రావణుని చూస్తూ, తృప్తి చెందిన మనస్సుతో యుద్ధానికి వచ్చాడు. సర్వ విధాల రావణుని చంపుటకు నిర్ణయించుకున్నాడు.

Sipping water three times, getting purified, looking intently on the Sun and repeating this prayer, the valiant one experienced supreme felicity. Seizing hold of his bow and fixing his eyes on Ravana, the hero advanced with a view to attaining victory. He stood vowed to kill Ravana with an intense and all-sided effort.

శ్లో॥ అథ రవిరవద న్నిరీక్ష్య రామం ముదితమనా: పరమం ప్రహృష్యమాణ:
నిశిచరపతి సంక్షయం విదిత్వా సురగణమధ్యగతో వచస్త్వరేతి 31

అప్పుడు సంతోషించిన సూర్యదేవుడు రోమాంచమైన దేహముతో దేవతల మధ్య నిలబడి రావణుని అంత్యకాలాన్ని తెలిసి, రాముని వైపు చూచి "త్వరపడు" అని పలికాడు.

Delighted in mind to gaze on Sri Rama, feeling supremely exhilarated on perceiving the destruction of Ravana at hand, the Sun-god, standing in the midst of a host of gods, exclaimed: "Make haste".

రావణ సంహారము

రావణుని రథము గొప్ప ధ్వనితో వస్తూ ఉంది. అది చూచి ధనుస్సును నెలవంక లాగా ఎక్కుపెట్టాడు రాముడు. ఇంద్రుని సారథియైన మాతలితో ఇలా పలికాడు.

"మాతలీ! అదిగో శత్రువు రథము వస్తూ ఉంది. చూశావా! ఆ రథము అపసవ్యంగా వస్తోంది. దీనిని బట్టి వాడు మరణించడం తథ్య మనిపిస్తోంది.

"జాగ్రత్తగా ముందుకు వెళ్ళు. భయపడకు. తొందరపడకు. దృష్టిని స్థిరంగా నిలుపు. నువ్వు ఇంద్రుని సారథివి. నీకు చెప్పాల్సిన పనిలేదు. అయినా ఎందుకు చెప్తున్నానంటే, నేను ఏకాగ్రచిత్తంతో పోరాడా లనుకుంటున్నాను;" అని రాముడు అనగానే మాతలి సంతోషించి రథాన్ని నడిపాడు. రథచక్రాల వలన రేగిన దుమ్ము రావణుని కప్పునట్లు చేశాడు.

రావణుడు రాముని బాణాలతో కొట్టాడు. కోపించిన రాముడు మాతలి ద్వారా ఇంద్రుడు పంపిన ధనుస్సును గ్రహించాడు. రామరావణుల మధ్య భయంకర సంగ్రామము సాగింది. ఈ పోరును చూస్తూ యుద్ధము చేయకుండా నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు వానర రాక్షస సైన్యములు.

రావణుడు ఇంద్రరథము యొక్క ధ్వజాన్ని ఛేదించాలని బాణాల్ని విడిచాడు. అవి మధ్యలోనే రాలిపోయాయి. క్రుద్ధుడైన రాముడు రావణుని రథధ్వజాన్ని విరచాలని సంకల్పించాడు. బాణాన్ని వదిలాడు. ధ్వజం విరిగి నేలమీద పడింది.

రావణుడు వాడియైన బాణాలతో రాముని గుఱ్ఱాలను కొట్టాడు. ఇంద్రుని అశ్వములు ఏమాత్రమూ చలించలేదు. తామరతూడులతో కొట్టినట్లు ఉండిపోయాయి. రావణుడు బాణములను సంధిస్తూ ఆయుధవర్షాన్ని కురిపించాడు. ఆకాశాన్ని బాణాలతో నింపేశాడు. రాముడు వేల వేల బాణాలను రావణునిపై ప్రయోగించాడు.

రావణుడు పిడుగులాంటి బాణంతో మాతలిని కొట్టాడు. మాతలి ఆ బాణాలకు ఏమాత్రము చలించలేదు. రావణుడు తనను బాణాలతో విశేషంగా కొట్టినా, కోపించని, రాముడు, మాతలిని రావణుడు కొట్టగానే క్రుద్ధుడయ్యాడు. రావణునిపై భయంకరంగా బాణవర్షం కురిపించాడు.

ఈ భయంకర పోరాటమునకు భూమి కంపించింది. సూర్యుడు కాంతిహీనుడయ్యాడు. గాలి వీచడం మానేసింది. త్రాచుపాము వంటి భయంకరమైన బాణాన్ని తొడిగాడు రాముడు. రావణుని తీక్షణముగా చూసి బాణాన్ని విడిచాడు. రావణుని శిరస్సు ఖండింపబడి నేలపై పడింది.

ఆశ్చర్యం! చూస్తూ వుండగనే రావణుని కంఠముపై మరొక శిరస్సు మొలిచింది. రాముడు దానిని కూడా ఛేదించాడు. మళ్ళీ శిరస్సు కనిపించింది. రాముడు ఆ మూడవ శిరస్సును కూడా ఛేదించాడు. ఈవిధంగా రాముడు రావణుని వంద శిరస్సులను ఖండించాడు.

ఇన్ని శిరస్సులను ఖండించినా రావణుడు మరణించడం లేదు. "ఏ బాణాలతో ఖర దూషణులు మరణించారో, ఏ బాణాలు మారీచుని హతమార్చాయో, ఏ బాణాలు వాలిని కూల్చేశాయో, ఏ బాణాలు విరాధ కబంధాదులను సంహరించాయో ఆ బాణాలు రావణుని సంహరించలేక పోతున్నాయి;" అని ఆలోచించి రావణుని వక్షస్థలముపై బాణవర్షం కురిపించాడు రాముడు.

రామరావణయుద్ధము ఏడు రోజులు ఘోరంగా సాగింది. రాముని విజయము ఆలస్యమవుతున్నదని భావించిన మాతలి రామునితో ఇలా పలికాడు.

"రామా! ఎందుకు ఆలస్యం చేస్తున్నావు. సామాన్యుని వలె, ఏమియు తెలియని వాని వలె ఎందుకు ప్రవర్తిస్తున్నావు. ఇతనిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించు. ఇతనికి వినాశకాలము ప్రాప్తించింది."

మాతలి అలా చెప్పగానే రాముడు పూర్వము అగస్త్యమహర్షి ప్రసాదించిన బ్రహ్మాస్త్రాన్ని తీశాడు. దానిని వేదోక్త విధిపూర్వకముగా అభిమంత్రించి ధనుస్సు మీద సంధించాడు. ఏకాగ్రచిత్తముతో, సావధానంతో ధనుస్సును బాగా లాగి, మర్మస్థానాల్ని చీల్చివేసే ఆ బాణాన్ని రావణునిపై విడిచాడు రాముడు. ఆ బాణము రావణుని వక్షఃస్థలాన్ని బ్రద్దలు కొట్టింది. రావణుని ప్రాణాల్ని హరించింది. రక్తసిక్తమై నేలలో దూరింది. రావణుడు క్రిందపడ్డాడు. ప్రాణాలు విడిచాడు.

రాముడు విడిచిన బాణము తిరిగి వచ్చి తాను ఉండవలసిన అంబుల పొదిలో దూరింది.

రావణుడు మరణించి క్రిందపడగానే, రాక్షసులు భీతి చెంది దిక్కులు పట్టి పారిపోయారు. వానరు లందరూ విజయోత్సాహంతో గంతులు వేశారు. దేవదుందుభులు మ్రోగాయి. సుమవర్షం కురిసింది. దివ్యమైన సుగంధముతో గాలి వీచింది. దేవతలు రాముని స్తుతించారు. రాముడు సంతసించాడు.

దిక్కులన్నీ ప్రసన్నము లయ్యాయి. ఆకాశము నిర్మలమైంది. గాలి హాయిగా వీచింది. నదులు ప్రశాంతంగా ప్రవహించాయి. లోకము వెలుగుల తోరణాలతో అలంకరించబడింది. సుగ్రీవాంగద విభీషణులు రాముణ్ణి పూజించారు. సంతోషముతో చలించిపోతున్న వానర భల్లూక శ్రేష్ఠుల మధ్య శ్రీరాముడు దేవతలచే పరివేష్టితుడైన ఇంద్రుని లాగా శోభించాడు.

రావణుడు రాలిపోయాడు. ఉత్కృష్టమైన రావణుడు ఉత్తముడు కాలేక రాలిపోయాడు. నీచత్వాన్ని వదలలేక ఘోరమరణానికి గురయ్యాడు. మానసిక క్షోభకు గురియై మరణించాడు.

మరణ మనేది అందరికీ నేస్తమే. మరణాన్ని ఎవ్వరూ దాటలేరు. కానీ మరణం మనిషికి ముగింపు కాకూడదు. అదొక నూతన జీవన విధానానికి అంకురార్పణం కావాలి.

ఉన్నప్పుడు చేసిన దానికన్నా పోయిన తరువాత ఎక్కువగా పనిచేసేవారే మహాత్ములు. బోధల ద్వారా, ఉత్కృష్టమైన కర్మల ద్వారా, ఆదర్శజీవనము ద్వారా మానవాళికి స్ఫూర్తిని, దీప్తిని ప్రసాదించే దివ్యాత్ములే మహాత్ములు.

ఈ భూమిపై కాలూనిన వారంతా మహాత్ములు కావాలి. కాక తప్పదు. ఈనాడు కాకపోయినా ఒకనాడు అయి తీరాలి. జీవి ఈ ప్రపంచానికి రావడం లోని ముఖ్య విషయం అదే. పరమపురుషార్థం అదే.

అందరూ మహాత్ములు కాగలరు. అందరిలోనూ ఒక శక్తి ఉంది. వివేకానంద, రామతీర్థ, రమణమహర్షుల వంటివారు సాధించింది మీరు, నేను సాధించగలం. అయితే, అవగాహన కావాలి. ఆచరణ కావాలి. కర్తవ్యనిష్ఠ కావాలి.

రావణుడు పరాక్రమవంతుడు. ధైర్యవంతుడు. శౌర్యవంతుడు. తపశ్శాలి. పండితుడు. యుద్ధరంగంలో అతణ్ణి చూసి రాముడే ఆశ్చర్యపోయాడు. దుర్గుణాలు లేనట్లయితే దేవుడే నని హనుమంతుడు ప్రథమంగా చూసినపుడు భావించాడు.

గొప్పతనం వేరు. మంచితనం వేరు. మంచితనం లేని గొప్పతనం రావణునిలో ఉంది. గొప్పతనంతో కూడిన మంచితనం రామునిలో ఉంది. ఈ కారణంగానే రాముడు కథానాయకుడైతే, రావణుడు ప్రతినాయకునిగా మిగిలిపోయాడు.

రావణుని విశిష్టత్వం విశుద్ధం కాలేక వినాశమైంది. రావణు డంతటి వాడే ఘోరమరణం పాలయ్యాడు. రావణుడు పోయాడు. రావణుని గుణాలు ప్రపంచంలో నిలిచిపోయాయి. వ్యక్తుల్లో బాగా బలిసిపోయాయి. వాటిని బలి చేయాలి.

రాముడు రావణుని వధించినట్లు గొప్పతనం గల మంచివారంతా రావణగుణాల్ని, రాక్షసగుణాల్ని ప్రపంచం నుండి, వ్యక్తుల నుండి దూరం చేసే ప్రయత్నం చేయాలి.

రక్తసంబంధం

నేలకూలి, రక్తపుమడుగులో పడియున్న రావణుణ్ణి చూచి విభీషణుడు కదలిపోయాడు. కన్నీరు కార్చుతూ విలపించాడు. రావణుని మృతదేహాన్ని సమీపించి రోదించాడు.

"మహావీరా! నీతికోవిదా! బంగారు శయనాలపై నిద్రించే నువ్వు మట్టిలో పడియున్నావా! చూశావా! నేను చెప్పిందే జరిగింది.

"నీ మరణముతో ఒక మహాశక్తిని కోల్పోయింది ప్రపంచము. ధైర్యం మూర్తీభవించిన మహావ్యక్తి మరణించాడు. సర్వశాస్త్ర కోవిదుడు గతించాడు. అసమాన పరాక్రమవంతుడు అస్తమించాడు.

"సూర్యుడు నేలరాలినట్లుంది. చంద్రుడు చల్లబడ్డట్లుంది. ఉత్సాహం క్షీణించినట్లైంది. అగ్ని చల్లారినట్లైంది. రావణుడే మట్టిలో పడి ఉంటే, ఇక ఈ ప్రపంచంలో ఎవరికి ఏమి మిగిలుంది?

ధృతి ప్రవాళః ప్రసహాగ్ర్య పుష్పః తపోబల శ్శౌర్య నిబద్ధమూలః
రణే మహాన్ రాక్షస రాజవృక్షః సమ్మర్దితో రాఘవ మారుతేన ॥

"ధైర్యమే చిగురుగా, సహనమే పుష్పంగా, తపస్సే దార్ఢ్యంగా, శౌర్యమే చెట్టు మొదలుగా గల రాక్షసరాజు అనే ఈ మహావృక్షమును రామమారుతము పడగొట్టింది.

"రావణుడనే మదగజాన్ని రాఘవసింహము చంపేసింది. భయంకరమైన రావణాగ్నిని రామమేఘము ఆర్పేసింది;" అంటూ విభీషణుడు రోదించాడు.


"విభీషణా! మహావీరుడు మరణించాడు. యుద్ధంలో ఇంద్రుని కూడా భయపెట్టిన శూరుడు మరణించినపుడు విచారించకూడదు. ఇది విచారానికి అనుకూలమైన సమయం కాదు.

"యుద్ధములో విజయమే లభిస్తుందని చెప్పలేము. వీరుడు శత్రువులను వధించవచ్చు. లేదా తానే వధింపబడవచ్చు. యుద్ధములో మరణించిన శూరుణ్ణి గూర్చి విచారించ కూడదు. దుఃఖించడం మానేయి. తక్షణ కర్తవ్యాన్ని ఆలోచించు" అన్నాడు రాముడు.

"రామా! రావణుడు ఇంతవరకు ఓటమి నెరుగడు. దేవతలు అతణ్ణి ఓడించలేక పోయారు. ఇంద్రుడు ఎదుర్కోలేక పోయాడు. నిన్ను ఎదిరించి, తీరము దాటిన సాగరంలా భగ్నమయ్యాడు రణంలో.

"ఎన్నో దానాలు చేశాడు. ఎన్నో భోగాలు అనుభవించాడు. సేవకుల్ని ఎంతగానో పోషించి తృప్తిపరచేవాడు. మిత్రులను అపారంగా ఆదుకునేవాడు. శత్రువుల్ని ఏరి పారేసేవాడు.

"ఇతడు అహితాగ్ని. నిత్యాగ్నిహోత్రం చేసేవాడు. తపోధనుడు. వేదాధ్యయన తత్పరుడు. కర్మనిష్ఠుడు. కాని అధర్మాచరణంతో ఇలా సామాన్యుని లాగా కూలిపోయాడు" అన్నాడు విభీషణుడు.



రావణుని మరణవార్త విని రావణుని భార్య లందరూ ఏడుస్తూ వచ్చారు. కేశములు వ్రేలాడుతుండగా, నేలమీద పడి దొర్లుతూ విలపించారు.

ఒకతె రావణునిపై పడి రోదించింది. ఒకతె కాళ్ళమీద పడింది. ఒకతె తలపోయిన కంఠాన్ని నిమురుతూ దుఃఖించింది. ఒకతె రావణుని చేతిని తన తొడపై పెట్టుకొని బిగ్గరగా ఏడ్చింది.

"ఇంద్రుణ్ణి గెలిచాడు. కుబేరుణ్ణి ఓడించాడు. యముణ్ణి భయపెట్టాడు. పుష్పకాన్ని సాధించాడు. దేవతల్ని వణికించాడు. ఇదంతా చేసింది ఇలా మట్టిలో పడి దొర్లడానికా?" అంటూ ఏడ్చారు.

"నాథా! ఎందుకు కొనితెచ్చుకున్నావు ఈ ఆపదను? హితులు చెప్పినా, స్నేహితులు చెప్పినా, ఉదారులైన సోదరులు చెప్పినా వినకుండా విజృంభించింది ఇందుకేనా!

"మరణించా లనుకున్నవాడు విషాన్ని తెచ్చుకున్నట్లు సీతను తెచ్చుకున్నావు. ఈ దుర్మరణాన్ని పొందావు. రాక్షసు లందరూ గతించిపోయారు. మేమందరమూ నిన్ను పోగొట్టుకొని విధవలమయ్యాం.

"మహాప్రాజ్ఞుడివే. ఇలా ఎందుకు చేశావు? ఇది నువ్వు చేసిన పని కాదు. విధి నీచేత అలా చేయించింది. విధిని ఎవరూ ఎదుర్కోలేరు;" అంటూ క్రౌంచపక్షుల్లా విలపించారు రావణుని భార్యలు.

మండోదరి విలాపం

రావణుని పెద్దభార్య, ఇష్టురాలు అయిన మండోదరి దీనురాలై భర్తను సమీపించింది. మరణించిన రావణుని పైబడి బిగ్గరగా రోదించింది.

"రాజా! కుబేరుని సోదరా! ఏమిటిదంతా! నిన్ను ఎదుర్కోవడానికి ఇంద్రుడే భయపడేవాడు కదా! రాముని చేతిలో నీవు ఎలా మరణించావు? నేను నమ్మలేక పోతున్నాను.

"రాముడు ఖరుణ్ణి వధించాడు. హనుమంతుడో నిర్భయంగా లంకలో ప్రవేశించాడు. వానరులు సముద్రముపై సేతువు నిర్మించారు. ఇలాంటి మాటలు వినగానే మా మనసు క్రుంగిపోయేది. రాముడు మానవ మాత్రుడు కాదని అనిపించేది. అతడు మహాయోగి అని, ఆది మధ్యాంత రహితుడని భావన కలిగింది. లేకపోతే రాముడు నిన్ను వధించలేడు. నిన్ను వధించడం మానవమాత్రునకు సాధ్యం కాదు.

"రామునితో స్నేహం చేసుకో - అని నేను ఎన్నిసార్లు చెప్పాను. విన్నావా! నీ మేలు కోరే నా మాట విని వుంటే ఈ కీడు జరిగేదేనా?

"అరుంధతి కంటె, రోహిణి కంటె ఉత్తమురాలైన సీతను అవమానించావు. ఆమె భూమికి భూమి లాంటిది **(వసుధాహి వసుధాం)**. లక్ష్మికి లక్ష్మి వంటిది **(శ్రియః శ్రీం)**. ఆమె తపస్సే నిన్ను కాల్చేసింది.

అవశ్యమేవ లభతే ఫలం పాపస్య కర్మణః
ఘోరం పర్యాగతే కాలే కర్తా నాస్త్యత్ర సంశయః

"పాపకార్యం చేసినవాడు సమయం వచ్చినపుడు దానికి తగిన ఫలితాన్ని అనుభవిస్తాడు. సందేహం లేదు.

"సీత నాకన్నా రూపవంతురాలా! జ్ఞానవంతురాలా! నాకన్నా గొప్పది కాదు. సమానమైనది కూడా కాదు. మోహపొరలు కప్పిన నీ కళ్ళకు ఈ సత్యం కనిపించలేదు.

"మిష లేకుండా మరణ ముండదు. నీ మరణానికి సీత నిమిత్తమని నేను భావిస్తున్నాను. నా తండ్రి దానవరాజు. నా భర్త రాక్షసరాజు. నా కుమారుడు దేవరాజును ఓడించిన ఇంద్రజిత్తు అనే నా గర్వం నేటితో అంతరించి పోయింది.

"నాథా! మృత్యువుకి మృత్యువైన నువ్వు మృత్యువు కెలా లొంగిపోయావు? నువ్వు మరణించిన తరువాత కూడా నేను బ్రతికే యున్నాను. నేను ఇంత మొండిదాననని నువ్వు ఊహించావా?

"ఇంద్రజిత్తు లక్ష్మణుని చేతిలో మరణించినపుడు నా హృదయానికి మానని గాయమైంది. రాముడు నిన్ను వధించగనే నా హృదయం పగిలిపోయింది. నాథా! ఒంటరిగా వెళ్ళావా! నన్నెందుకు తీసుకపోలేదు?

"ప్రభూ! నేను పాదచారిణినై వచ్చాను ఈ యుద్ధభూమికి. మేలిముసుగు లేకుండా వచ్చాను. నువ్వు కోప్పడడం లేదు ఎందుకని?[1]

"ఎందరో స్త్రీలను హింసించావు. మరెందరో స్త్రీలను విధవల్ని చేశావు. వారి శాపమే నిన్ను ఈరోజు మట్టిలో పండబెట్టింది. ఆ పాపాలన్నిటికీ ఈనాడు ఫలితం ముట్టింది.

పతివ్రతానాం నాకస్మాత్పతన్త్యశ్రూణి భూతలే

"నేలపై పడిన పతివ్రతల కన్నీళ్ళు ఊరకే పోవు.

"నా మరది విభీషణుడు చెప్పినట్లు వినుంటే ఈ దుర్గతి ప్రాప్తించేదేనా! చూడు! ఇంతవరకు భయపడుతూ భయపడుతూ లంకలో ప్రవేశించే సూర్యకిరణాలు ఈనాడు నీవు లేవని తెలిసి నిర్భయంగా దూరిపోతున్నాయి.

"నా మాటలు నీకు వినిపించడం లేదా! ఏమి? భూమిని వదలకుండా ఉన్నావు. ఆమెను ప్రేమించావా! మమ్మల్ని మరచిపోయావా!" అని దుఃఖిస్తూ క్రిందపడి మూర్ఛిల్లింది మండోదరి.

పతివ్రతకు, పాతివ్రత్యానికి ప్రతిరూపాలుగా గుర్తించబడిన పంచకన్యలలో మండోదరి ఒకతె అని మనం గ్రహించాము.[2] హేమకు జనించిన మయుని కుమార్తెయే మండోదరి అని కిష్కింధాకాండములో స్వయంప్రభ వృత్తాంతములో చూశాము.

మండోదరి శ్రీమద్రామాయణంలో రెండేరెండు చోట్ల కనిపిస్తుంది. హనుమంతుడు అంతఃపురంలో సీతమ్మను అన్వేషించినపుడు నిద్రిస్తూ కన్పిస్తుంది. మళ్ళీ, యుద్ధభూమిలో కళ్ళుమూసికొని పడియున్న భర్త దగ్గర కన్పిస్తుంది. మరెక్కడా కన్పించదు. అవాల్మీకాలు ఆమె పాత్రను అనేక విధాలుగా మలిచాయి. మాట్లాడించాయి. అయోమయంగా గోచరిస్తున్న ఆ విషయాలను నేను స్పృశించ దలచుకోలేదు.

వాల్మీకం ప్రకారం మండోదరి మనకు దర్శన మిచ్చిన రెండుచోట్ల కూడా రావణుడు కళ్ళుమూసికొని పడియుండడము విశేషాంశం. హనుమంతుడు చూసినపుడు ఆవుల మధ్య ఆబోతు లాగా రావణుడు పడుకొని ఉన్నాడు. మండోదరి రావణుని చూచినపుడు రావణుడు చచ్చిపడి యున్నాడు.

హనుమంతుడు రావణుని పడకగదిలో వేలాది మంది అందమైన స్త్రీల మధ్య రావణుని, దూరంగా ఒంటరిగా శయనిస్తున్న మండోదరిని చూచినపుడు వాల్మీకి ఒక అద్భుతమైన చిత్రకారునిలా కన్పిస్తాడు.

---

[1] రావణుని స్వభావం భార్యల విషయంలో ఎలా వుందో గ్రహించండి. తన భార్యలు ముసుగు లేకుండా చరించకూడదు. పరపురుషుల కంట పడకూడదు. తాను మాత్రం పరుల భార్యల్ని అపహరించవచ్చు. పరభార్యల నాశించే స్వభావం కలవాడు సాధారణంగా తమ భార్యలను పూర్ణంగా విశ్వసించలేరు అని మనస్తత్వ శాస్త్ర రీత్యా అంగీకరించక తప్పదు.

[2] చైతన్య రామాయణము - ద్వితీయ భాగము - పుట 36

కదలక మెదలక పడియున్న రావణ మండోదరీలను వెంటవెంటనే రంగుచిత్రాల లాగా, రేఖాచిత్రాల లాగా మన కళ్ళముందు ప్రత్యక్షం చేస్తాడు. మాటలు లేని సమయంలో, పాటలు రాని సందర్భంలో నిశ్శబ్దంగా "గ్రాఫిక్స్" ద్వారా మనసును దృశ్యకావ్యం పరుగులెత్తించినట్లు మన ఊహల్ని తరుముతాడు వాల్మీకి.

వేలాది మంది స్త్రీల మధ్య రావణుడు పడియున్నా, ప్రియురాలు, జ్యేష్ఠభార్య యైన సౌందర్యవతి మండోదరి అదే గదిలో దూరంగా శయనించి ఉండడము సూక్ష్మంగా ఆలోచించాల్సిన విషయం. ఆమె పవిత్రతకు, పాతివ్రత్యానికి అద్దంపట్టే సన్నివేశమది.

అందుకే హనుమ ఆకర్షితు డయ్యాడు. ఈమె సీతమ్మేనేమో అని భ్రమించాడు ప్రథమ దర్శనంలో హనుమంతుడు. మండోదరి పవిత్రత హనుమను అలా ఆకర్షించింది.

ఆమె అందాన్ని, దర్శనంతోనే ఆకర్షిస్తున్న పవిత్రతను గాంచి మండోదరిని సీతమ్మగా భావించాడు. సీతమ్మకు మండోదరి తీసిపోదు. కానీ రావణుడికి అర్ధాంగి కావడం వల్ల ఆమె మరుగున పడిపోయింది.

న కులేన న రూపేణ న దాక్షిణ్యేన మైథిలీ
మయాఽధికా వా తుల్యా వా తత్త్వం మోహాన్న బుధ్యసే ॥

"కులం చేత గాని, రూపం చేత గాని, చాతుర్యము నందు గాని సీత నాకన్నా అధికురాలు కాదు. సమానురాలు కాదు. మోహంలో కూరుకుపోయిన నీకు ఆ విషయం అర్థం కాలేదు" అని యుద్ధభూమిలో భర్త శవంపై పడి ఏడ్చింది మండోదరి. తనను గూర్చి తాను సగర్వంగా, ధర్మబద్ధంగా చెప్పుకున్న మాట ఇది.

సీతమ్మను రామునికి ఇచ్చెయ్యమని మండోదరి చెప్పింది. అంతేకాదు. రామునితో సఖ్యం చెయ్యమని కూడా చెప్పింది. ఆమె మాటను రావణుడు వినలేదు. కళ్ళు మూసుకున్నాడు ఆమె చూపే నిజాన్ని చూడలేక. ఎంత చెప్పినా వినకపోయేసరికి చేయగలిగింది లేక, రావణుని పాపకర్మలను చూడలేక తానూ కళ్ళు మూసుకుంది. మనసును కూడా మూసేసుకుంది. ఈ ఆంతరంగిక ఘర్షణలను దర్శింపచేస్తూ నేత్రాలు మూసి నిద్రిస్తున్న రావణ మండోదరీలను మన కళ్ళముందు నిలుపుతాడు వాల్మీకి.

రామునితో సఖ్యం చెయ్యమని మండోదరి రావణునికి ఎలా చెప్పిందో, తార కూడా వాలికి అలాగే చెప్పింది. తార మాట వాలి వినలేదు. మండోదరి మాట రావణుడూ వినలేదు. వాలి, రావణుడు ఇద్దరూ రాముని చేతిలో హతులయ్యారు.

తారకు, మండోదరికి అనేక విషయాల్లో పోలిక ఉన్నాయి. ఇద్దరూ మహోన్నత వ్యక్తిత్వం కలవారే. ఇద్దరూ జీవితంలో అంతర్మథనానికి లోనైన వారే. భర్తల వికృత ప్రవర్తనకు, విషమ జీవితానికి సరిపడలేక, సరిచేయలేక, సరిపెట్టుకుంటూ జీవనయాత్రను సాగించిన వారే.

అయితే, తార తన హృదయాన్ని తారాపథంలా ప్రదర్శించింది. మండోదరి కుక్షిలో దాచుకొని సార్థక నామధేయురాలైంది.

'మడి భూషాయాం' అను ధాతువునకు **బచాద్యచ్** ప్రత్యయము చేయగా మండోదరి అనే రూపం స్పష్టమైంది. అందమైన ఉదరము కలది అగుటచేత మండోదరి అని పేరు వచ్చింది.

తార, మండోదరి ఇద్దరు కూడా భర్తలకు ఎలా సలహాలిచ్చారో, అలాగే భర్తలకు శత్రువైన రాముణ్ణి కూడా ఇద్దరూ చక్కగా బేరీజు వేయ కలిగారు.

రాముణ్ణి భగవత్స్వరూపంగా, ధర్మమూర్తిగా తార ఎలా భావించిందో మండోదరి కూడా అలాగే భావించింది. రాముడి మీద ఈ సాధ్వీమతల్లు లిద్దరికీ సరియైన అవగాహన ఉంది. వారి ఆంతర్యాన్ని గ్రహించిన రాముడు కూడా వారి పట్ల గౌరవభావాన్నే చూపాడు.

తారను రాముడు ఓదార్చాడు. మండోదరిని ఓదార్చమని విభీషణునితో చెప్పాడు. తార నోరువిప్పి మాట్లాడింది. రాముని సమాధానాన్ని అందుకొని తృప్తి చెందింది. మండోదరి తన హృదయావేదనను మూగబాధగా రామునికి సమర్పించింది. ఆమెను మౌనంగానే సముదాయించాడు రాముడు. ఆమె మండోదరి కదూ! అలాగే ఉండాలి.

తారకు భర్త పోయాడు. కానీ కుమారుడైన అంగదుడు మిగిలాడు. మండోదరికి భర్తా పోయాడు. బిడ్డలూ పోయారు.

తన భార్యాబిడ్డల్ని చల్లగా చూసే బాధ్యతను రామునిపై పెట్టి నమస్కరిస్తూ ప్రాణం విడిచాడు వాలి. అలాంటి విషయాలేవీ ప్రస్తావించకుండా నేలరాలాడు రావణుడు.

వాలివధకు సుగ్రీవుడు ఎలా కారకు డయ్యాడో, రావణుని వధకు విభీషణుడు అలా కారకుడయ్యాడు. తమ్ముళ్ళ వల్ల అన్నలు అంతమయ్యారు. కానీ సుగ్రీవుని విషయంలో తార ఎలా ఉదాత్తంగా ప్రవర్తించిందో, విభీషణుని విషయంలో మండోదరి కూడా అలాగే ప్రవర్తించింది.

ధర్మాత్ముడైన సుగ్రీవుని దూరం చేసుకోవద్దని తార చెప్పింది. విభీషణుని మాటను మన్నించమని మండోదరి చెప్పింది.

భర్తలకు రాబోయే ప్రమాదాలను కూడా ఇద్దరూ ఒకేవిధంగా ఊహించ గలిగారు. రెండవసారి సుగ్రీవుడు వచ్చాడంటే వెనుక ఏదో ఉంటుందని పసిగట్టి అనుమానించింది తార. రామునితో స్నేహం చేసి ప్రగతిపథంలో పయనించమని వాలికి సలహా ఇచ్చింది.

హనుమంతుడు లంకాదహనం చేయడం, సముద్రంపై వానరులు సేతువును నిర్మించడం చూసి రాముణ్ణి దివ్యాత్మునిగా గ్రహించ గలిగింది మండోదరి. రామునితో స్నేహం చెయ్యమని రావణుని కోరింది. ఈ విషయంలో కూడా తార మాట వాలి వినలేదు. మండోదరి మాట రావణుడూ వినలేదు.

వాలి నేలకొరిగినపుడు సుగ్రీవుని ధర్మాత్ముడుగా శ్లాఘించింది తార. రావణుడు నేల రాలినపుడు సత్పురుషుడైన విభీషణునికి సత్ఫలితాలు లభించాయని ప్రవచించింది మండోదరి.

స్త్రీకి సహజంగా ఉండవలసిన అసూయ ఏ మాత్రమూ లేనిదై మహనీయమూర్తిగా, మాననీయురాలిగా జాజ్వల్యమైంది మండోదరి. సీతమ్మను అరుంధతి కంటె, రోహిణికంటె ఉత్తమురాలిగా అభివర్ణించిన మండోదరి శీలము అనుపమానం.

రాముణ్ణి పరమాత్మగా వర్ణించిన మండోదరి సీతమ్మను పరమాత్మ స్వరూపిణిగా వర్ణించడం విశేషం. సీతమ్మను వసుధకు వసుధగా వర్ణించింది. సహనంలో భూమికన్నా గొప్పదని సూచించుటే గాక, 'భూర్భువః'- భూమికి భూమిగా వర్ణించి బహిర్ముఖమయ్యే ఆలోచనల్ని అంతర్ముఖం చేసింది.

"నేలపై పడిన పతివ్రత కన్నీళ్ళు వృథా పోవు" అని భర్త శవం దగ్గర పలికి మనందరి మనసుల్ని కదిలించి, హృదయాల్ని ప్లావితం చేసిన అసమాన పావనమూర్తి మండోదరి. సీతమ్మ పవిత్ర పాతివ్రత్యానికి నీరాజనా లిచ్చిన మహాసాధ్వి మండోదరి మనందరి హారతుల్ని అందుకుంటోంది.

ఇంద్రియాణి పురా జిత్వా జితం త్రిభువనం త్వయా
స్మరద్భిరివ తద్వైర మిన్ద్రియై రేవ నిర్జితః

"నాథా! పూర్వం నీవు ఇంద్రియాలను జయించి త్రిభువనములను జయించావు. ఆ శత్రుత్వంతో నీచేత ఓడిపోయిన ఇంద్రియాలు ఈనాడు నిన్ను ఓడించాయి" అని పలికిన మండోదరి వాక్కుల ద్వారా నిగూఢంగా ఉన్న ఆమె ఆధ్యాత్మిక హృదయాన్ని మన ముందు పెడతాడు వాల్మీకి.

ఆనాడు రావణుడు ఇంద్రియాలను జయించాడు. ఆ కారణంగా లోకాల్నే జయించాడు. ఈనాడు ఇంద్రియాలకు దాసుడయ్యాడు. లోకం నుండే జారిపోయాడు.

ఇంద్రియాలను తాత్కాలికంగా జయించడం వల్ల తాత్కాలిక ఫలితాల్ని పొందవచ్చు. ఇంద్రియ మనోబుద్ధుల్ని లయింప చేయడం కాకుండా వాటిని ఎవరైతే నశింప చేస్తారో అట్టివారే నిత్యశాంతిని పొందుతారు.

రావణుడు ఎంతో తపస్సు చేశాడు. ఏం లాభం? విషయాలు సౌందర్యంతో ప్రకాశిస్తూ ముందు నిలవగానే ఇంద్రియాలు చలించిపోతున్నాయి. అలా ఎవరు చలించరో వారే నిగ్రహవంతులు.

వికార హేతౌ సతి విక్రియన్తే
యేషాం న చేతాంసి త ఏవ ధీరాః

"వికారమును పొందించే కారణాలు ఉండినా, వాటి మధ్య ఎవరు వికారమును పొందరో వారే ధీరపురుషులు" అని కాళిదాసమహాకవి కుమారసంభవంలో చెబుతాడు.

ఇక్కడ మరొక విషయం సున్నితంగా నా హృదయాన్ని స్పృశిస్తోంది. మండోదరి ఒక చోట నిద్రిస్తూ కనిపించింది. ఒకచోట దుఃఖిస్తూ తన మూగ హృదయాన్ని మనకు వినిపించింది. ఈ రెండు చోట్ల తప్ప మరెక్కడా వాల్మీకిరామాయణంలో మండోదరి కనిపించదు.

భర్త శవం దగ్గర కూర్చుని ఆమె మాట్లాడిన మాటలే ఆమె జీవితానికి, ప్రవర్తనకు ప్రతిబింబాలు. సీతమ్మను రామునికి ఇచ్చెయ్యమని సలహా ఇచ్చినట్లు చెప్తుంది. రామునితో స్నేహం చెయ్యమని చెప్పినట్లు చెప్తుంది. ఈ విషయాలన్నీ ఇప్పుడే ఇక్కడే వింటున్నాం.

భర్తకు సలహా లివ్వడమైతే చేసింది కాని, ఎక్కడ ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో మండోదరికే తెలుసు. నియమాలు తెలిసి, సమయాలు ఎరిగి, భర్త విషయంలో మరొకరికి తెలియకుండా

(వాల్మీకికి కూడా), సలహాలిచ్చే బరువైన బాధ్యతను తేలికగా మోసిన సున్నిత సుకుమార హృదయురాలు మండోదరి.

అగాధమై, కెరటాలతో కల్లోలమైన కడలిలో ఆణిముత్యాలు లభించునట్లు, రాక్షస రాజ్యంలో విజ్ఞానమణి మండోదరీ మహాదేవి దర్శన మిచ్చింది. విషమపరిస్థితులలో విమల చిత్తంతో మెలిగి, విశ్వానికి వెలుగు అందించే ఆదర్శజ్యోతిగా నిలిచిపోయింది.

అంత్యక్రియలు

మండోదరి భర్త శవం మీద పడి ఏడుస్తోంది. శోకమూర్తియై రావణుని వక్షస్థలము మీద పడియున్న మండోదరి సంధ్యారుణ మేఘంపై భాసించే మెరుపులా ఉంది.

సవతులు మండోదరిని సమీపించారు. ఏడుస్తున్న రాణులందరూ ఆమెను పట్టుకున్నారు. గాఢంగా పెనవేసుకున్నారు. కన్నీరు కార్చుతూ ఓదార్చారు.

కిం తేన విదితా దేవి లోకానాం స్థితి రధ్రువా!
దశా విభాగ పర్యాయే రాజ్ఞాం చఞ్చలయా శ్రియా!

"దేవీ! లోకస్థితి అస్థిరమని నీకు తెలియదా! దశ మారినపుడు ప్రభువుల ఐశ్వర్యం జారిపోతుంది" అని ఓదార్చారు సవతులు.

మండోదరికి ఓదార్పు దేనికి? ఆమెకు కలిగిన నష్టాన్ని ఏ ఊరడింపులూ తొలగించలేవు. భర్తను, పుత్రుల్ని, సర్వాన్ని పోగొట్టుకొని ఏకాకిగా నిలిచిపోయింది మండోదరి.

"విభీషణా! నీ అన్నకు సంస్కారం చెయ్యి. ఈ స్త్రీల నందరినీ ఓదార్చు" అన్నాడు రాముడు.

"రామా! ఈ రాక్షసరాజు ధర్మాన్ని, వ్రతాన్ని విస్మరించినవాడు. క్రూరుడు. నరహింసకుడు. అసత్యవాది. పరభార్యాగమనుడు. ఇలాంటి వానికి సంస్కారం నేను చేయలేను.

"ఈ రావణుడు నాకన్నా పెద్దవాడే. గౌరవింప దగినవాడే. అందరికీ అపకారం తలపెట్టేవాడు గనుక పూజార్హుడు కాడు. సోదరుని రూపంలో గోచరిస్తున్న శత్రువు.

"రామా! అన్నకు సంస్కారం చేయని నన్ను లోకం దూషిస్తుంది. కానీ ఇతని దుష్ట గుణాలు తెలిసిన తరువాత లోకం హర్షిస్తుంది;" అని విభీషణుడు పలికాడు. విభీషణుని మాటలను ఆలకించిన ధర్మాత్ముడైన రాముడు ఇలా పలికాడు.

"విభీషణా! నీ సహాయం వల్లనే నేను రావణుణ్ణి వధించగలిగాను. కనుక నేను నీకు మేలు చెయ్యాలి. అది నా ధర్మం. చెబుతున్నాను. విను.

"రావణుడు అధర్మపరుడు కావచ్చు. అసత్యవాది కావచ్చు. కానీ అతడు గొప్ప వీరుడు. బలవంతుడు. శూరుడు. ఇంద్రాది దేవతల్ని కూడా ఓడించిన వాడని వింటున్నాము. అలాంటి వీరుని నువ్వు విస్మరించ కూడదు.

"రావణుడు గొప్పగా జీవించాడు. గొప్ప యుద్ధం చేశాడు. గొప్పగా మరణించాడు. నా చేతుల్లో మరణించాడు. నా మాట విని రావణునకు అగ్నిసంస్కారం చెయ్యి. నీకు కీర్తి కూడా వస్తుంది" అన్నాడు రాముడు.

రాముని ఔదార్యాన్ని, ఆదర్శాన్ని ఇక్కడ మనం అర్థం చేసుకోవచ్చు. రావణుడు చేసిన పనికి రాముని స్థానంలో మరెవరైనా ఉంటే ఎలా ఉండేవారు. అగ్నిసంస్కారము చేయనని విభీషణుడు పలకగానే "భేష్. మనిషి అంటే ఇలా ఉండాలి. మంచిది. ఆ నీచుడికి అగ్ని సంస్కారం కావాలా! పీనుగ అలా పడేయండి. పక్షులు తింటాయి" అనుండేవారు. అక్కడే రాముడు ఆదర్శపురుషుడుగా శోభిస్తాడు.

రాముడు అలా చెప్పగానే విభీషణుడు లంక నుండి రావణుని అగ్నిహోత్రాన్ని తెప్పించాడు. గంధపుచెక్కలు సిద్ధం చేశారు. చందనము, అగరు, వట్టివేళ్ళు, పద్మకము మొదలైన సుగంధ ద్రవ్యాలను, మణులు, ముత్యాలు, వస్త్రాలు, పగడాలు పట్టుకొచ్చారు.

రావణుడికి పట్టుబట్టలు కట్టారు. బంగారు పల్లకీలో పడుకోబెట్టారు. అనేక వాద్య ధ్వనులు మోగించారు. రాక్షసు లందరూ కన్నీరు కార్చుతూ రోదించారు. వందిమాగధులు స్తోత్రాలు పఠించారు. కట్టెలను తీసికొని, విభీషణుని ముందు పెట్టుకొని దక్షిణాభిముఖులై వెళ్ళారు. అంతఃపుర స్త్రీలు కూడా ఏడుస్తూ అనుసరించారు.

అధ్వర్యులు అగ్నులను వెలిగించారు. ఆ అగ్నులు కుండలో ఉంచబడి రావణుని కన్నా ముందుగా వెళ్ళాయి. రావణుని శరీరాన్ని ఋత్విక్కులు చితిమీద ఉంచారు.

రావణుడి పాదాలమీద బండి, కాళ్ళ మధ్య రోకలి ఉంచారు. నెయ్యితోను, పెరుగుతోను నిండిన స్రువం ఉంచారు. శాస్త్రవిధి ననుసరించి మేకను వధించి, చితి దగ్గర హోమం చేశారు. ఆ చర్మం నేతిలో తడిపి రావణుడి మీద కప్పారు.

దుఃఖిస్తూ రాక్షసులు, విభీషణుడు గంధం చల్లారు. వస్త్రాలు కప్పారు. రకరకాల పూలదండలతో అలంకరించారు. పేలాలు చల్లారు. విభీషణుడు ఏడుస్తూ అగ్ని అంటించాడు.

విభీషణుడు స్నానం చేసి, తడిబట్టలతో ఉండగానే దర్భలు, ఉదకము కలిపిన తిలలను విడిచి నమస్కరించాడు. దుఃఖిస్తున్న వదినలను మళ్ళీ ఓదార్చాడు. అందరినీ నగరంలోకి పంపి విభీషణుడు రాముని సమీపించి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

విభీషణ రాజ్యాభిషేకం

రామరావణ సంగ్రామాన్ని వీక్షించిన దేవ, దానవ, గంధర్వాదులు యుద్ధాన్ని గూర్చి ముచ్చటించుకుంటూ తిరిగి వెళ్ళిపోయారు. మాతలిని గౌరవించి, దేవేంద్రుని రథాన్ని తీసికొని వెళ్ళమని రాముడు చెప్పాడు. దేదీప్యమానంగా వెలుగుతున్న రథాన్ని తీసికొని దేవలోకానికి వెళ్ళాడు దేవేంద్ర సారథి మాతలి.

రాముడు సుగ్రీవుణ్ణి కౌగిలించుకున్నాడు. లక్ష్మణుని చూచి ఇలా పలికాడు. "లక్ష్మణా! విభీషణుడు ఉత్తముడు. మనమంటే ప్రాణం. భక్తుడు. విభీషణునికి లంకలో రాజ్యాభిషేకము జరిపించు. అది చూడాలని నాకెంతో కుతూహలంగా ఉంది" అన్నాడు.

లక్ష్మణుడు తక్షణమే ఆ కార్యంలో నిమగ్నుడయ్యాడు. బంగారు కుండలు తెప్పించారు. వానరులు సముద్రజలాలను తీసికొని వచ్చారు. లక్ష్మణుడు విభీషణుని సింహాసనముపై కూర్చోబెట్టాడు. వేదోక్తవిధి ననుసరించి అభిషేకించాడు. రాక్షసు లందరూ రామలక్ష్మణుల్ని స్తుతించారు. రామలక్ష్మణులతో పాటు విభీషణుడు కూడా సంతోషించాడు.

మంగళద్రవ్యాలను తెచ్చి రామునికి కానుకగా సమర్పించాడు విభీషణుడు. విభీషణుని తృప్తిపరచుటకు వాటిని స్పృశించాడు రాముడు.

రాముడు హనుమంతుని చూచి, "హనుమా! మహారాజైన విభీషణుని అనుమతితో లంకలోకి వెళ్ళి సీతకు మా క్షేమాన్ని చెప్పు. నేను, లక్ష్మణుడు, సుగ్రీవుడు క్షేమమని చెప్పు. ఆమె ఏమి చెబుతుందో తిరిగి వచ్చి చెప్పు" అన్నాడు.

హనుమంతుడు లంకలో ప్రవేశించాడు. విభీషణుని అనుమతి తీసికొని అశోకవనంలో ప్రవేశించాడు. చెట్టు క్రింద కూర్చొని యున్న సీతమ్మను చూశాడు. స్నానాది సంస్కార శూన్యమై, సంతోష శూన్యురాలై కనిపించింది సీతమ్మ. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు ఉన్నారు. హనుమంతుడు వంగి సీతమ్మకు నమస్కరించి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

ఏకైక వాంఛ

"అమ్మా! లక్ష్మణ సుగ్రీవులతో కలిసి క్షేమంగా ఉన్నట్లు రాముడు నీకు చెప్పమన్నాడు. సముద్రముపై సేతువును నిర్మించి రావణుని వధించింది నీకొరకే అని రాముడు చెప్పమన్నాడు.

"తల్లీ! దుష్టుడైన రావణుడు రాముని చేతిలో మరణించాడు. నువ్వు ఇక సంతోషంగా ఉండవచ్చు. ఈ రాజ్యానికి విభీషణుడు రాజయ్యాడు. ఆయన కూడా నీ దర్శనానికి వస్తున్నాడు అని రాముడు చెప్పమన్నాడు" అని పలికి హనుమ మాట్లాడకుండా ఉండిపోయాడు.

సీతమ్మ మారు పలుకలేదు. హనుమకు మ్రింగుడు పడలేదు. ఒకవేళ సీతమ్మ తనను మరచిందేమో అని భావించాడు. "అమ్మా! నాతో మాట్లాడ వెందుకని?" అని అడిగాడు.

"నాయనా! రాముని విజయవార్త వినగానే ఆనందంతో గొంతు మూసుకుపోయింది. అందుకే మాట్లాడలేక పోతున్నాను. హనుమా! ఎంత సంతోషకరమైన వార్త చెప్పావు. నీవు పలికిన మాటకు ఎలా జవాబు చెప్పాలో తెలియడం లేదు. నీ మాటకు సరిపోల్చ దగిన ప్రతివచనం నాకు భాషలో దొరకడం లేదు.

"హనుమా! ఇంత సంతోషకరమైన వార్త నందించిన నిన్ను ఎలా సత్కరించాలో నాకు తెలియడం లేదు. నా దగ్గర ఏమీ లేవు. ఉండినా ఏమి లాభం? బంగారిచ్చినా, రత్నాలిచ్చినా, చివరికి త్రిలోకాధిపత్య మిచ్చినా నువ్వు చెప్పిన వార్తకు సరిపోవు" అన్నది సీతమ్మ.

"అమ్మా! ఇలా అందరూ మాట్లాడలేరు. రామజయాన్ని కాంక్షించే నీవే మాట్లాడగలవు. తల్లీ! నీవు పలికిన మాట రత్నరాశుల కన్నా, ఇంద్రపదవి కన్నా మిన్నగా ఉంది. సమర విజయుడైన రాముణ్ణి చూస్తూ ఉంటే సర్వలోక సంపదలన్నీ నాకు సిద్ధించినట్లే అనిపిస్తోంది" అన్నాడు హనుమ.

"హనుమా! మధురభాషివి. మృదుభాషివి. నీలో అన్నీ సుగుణాలే. కాదుకాదు. నిన్ను చేరి అవి శోభిస్తున్నాయి" అన్నది సీతమ్మతల్లి.

"తల్లీ! ఈ రాక్షసస్త్రీలు రావణుని అండ చూసుకొని నిన్ను ఎంతగానో బాధించారు. పీడించారు. వీళ్ళు నిన్ను బాధిస్తుంటే ఆనాడు నేను ప్రత్యక్షంగా చూశాను కూడా. అమ్మా! ఇప్పుడు నాకు అనుమతి నివ్వు. క్షణంలో వీళ్ళ అంతు చూసేస్తాను" అన్నాడు హనుమంతుడు.

"హనుమా! ఈ రాక్షసస్త్రీ లందరూ రాజసేవకులు. స్వతంత్రులు కారు. ప్రభువు చెప్పినట్లు పనిచేసేవారు. అలాంటివారి విషయంలో ఎవరైనా కోపగించుకుంటారా?

"నా కష్టాలకి వాళ్ళు బాధ్యులు కారు. అది పూర్వము నేను ఆచరించిన పాపానికి ప్రతిఫలం. కర్మఫలాలు అనుభవించిక తప్పదు కదా!

"హనుమా! ఒక్కమాట చెప్పనా! పూర్వం ఒక వేటగాణ్ణి పెద్దపులి తరిమింది. వాడు పరుగెత్తాడు. ఆ వ్యాఘ్రము వెంటబడి తరిమింది. ఇక పరుగెత్తలేక వేటగాడు చెట్టెక్కాడు.

"పులి వదలిపెట్టలేదు. ఎంతసేపు ఉంటాడు చెట్టుమీద. దిగకపోతాడా! అని ఆ పులి చెట్టుక్రిందనే ఉండింది. వేటగాడు ఎక్కిన చెట్టు పైభాగాన ఒక ఎలుగుబంటు ఉంది.

"ఓ ఎలుగుబంటూ! ఈ మానవుణ్ణి నేను తరుముకుంటూ వచ్చాను. ఇతడు నాకు ఆహారము. ఇతణ్ణి క్రిందపడేయ్. ఆరగించి వెళ్ళిపోతాను" అంది పెద్దపులి.

"ఎలుగుబంటు చెప్పింది కదా! నేను అలా చేయను. ఈ వృక్షం నా గృహం. ఇతడు నాకు అతిథి. అతిథి సత్కరించదగిన వాడే గాని సంహరించదగిన వాడు కాడు" అన్నది.

"వేటగాడు బ్రతికాను బాబూ! అనుకున్నాడు. తరువాత ఏమి జరిగిందో తెలుసా! పులి అక్కడే కాచుకొని ఉంది. వేటగాడు భయంతో పులిని చూస్తున్నాడు. ఈలోగా ఎలుగుబంటు నిద్రపోయింది.

"పులి అన్నది కదా, ఓయ్! మానవుడా! నాకు కావలసింది ఆహారం కాని, నువ్వే కావాలని లేదు. అదిగో చూడు. ఎలుగుబంటు ఆదమరచి నిద్రపోతోంది. దానిని క్రిందికి తోసేయ్. తినేసి నేను వెళ్తాను. నీవు సుఖంగా వెళ్ళవచ్చు అంది.

"వేటగాడు మెల్లగా పై కొమ్మను పట్టుకొని లేచి, నిద్రిస్తున్న, ఎలుగుబంటును క్రిందికి తోసేశాడు. ఆ ఎలుగుబంటు పడిపోతూ, దైవవశాత్తు క్రింది కొమ్మను పట్టుకొని నిలిచి వ్రేలాడింది. క్రిందపడకుండా మళ్ళీ చెట్టెక్కింది.

"అది చూచి వేటగాడు భయంతో వణికిపోయాడు. అప్పుడు పులి ఎలుగుబంటుతో అంది కదా! చూశావా! ఎలుగుబంటా! ఇలాంటి కృతఘ్నుడికా నీవు మేలు చేసేది? ఇప్పుడు తెలిసింది కదూ వీడి స్వభావం ఎలాంటిదో! వీడు వధార్హుడే. ఇంకా చూస్తున్నావేమి? తోసేయ్ వాణ్ణి అంది పెద్దపులి.

"ఎలుగుబంటు అందుకు ఒప్పుకోలేదు. నా ధర్మం నేను చేస్తాను. వాడి పాపం వాడు అనుభవిస్తాడు. పుణ్యజీవనానికి అలవాటు పడ్డవారు పాపం చెయ్యలేరు.

న పరః పాపమాదత్తే పరేషాం పాపకర్మణాం
సమయో రక్షితవ్యస్తు సన్తశ్చారిత్ర భూషణాః

"ప్రాజ్ఞులు తమకు అపకారం చేసిన వానికి కూడా తిరిగి అపకారం చెయ్యరు. ఎవరు పాపం చేస్తారో ఆ ఫలితాన్ని వారే అనుభవిస్తారు. కనుక ప్రత్యపకారం చేయవలసిన పనిలేదు.

"హనుమా! దయనే ప్రధానధర్మంగా పెట్టుకోవాలి. లోకంలో ఏ తప్పు చెయ్యని వాడు ఉండడు కదా! **(న కశ్చిన్నాపరాధ్యతి)**. చెడ్డవానికి కూడా చెడు చేయాల్సిన పనిలేదు;" అంది సీతమ్మ.

సీతమ్మ మాతృహృదయం, ప్రేమహృదయం ఇక్కడ స్పష్టంగా తెలుస్తోంది. ఆమె ఎంతటి కరుణామూర్తియో ఇక్కడ మనం తెలుసుకోవచ్చు.

సీతమ్మలో మరొక ప్రత్యేకత ఉంది. క్లిష్టసమయాలలో, విషయాన్ని వివరించేటప్పుడు చిన్న చిన్న కథలు చెప్తూ వివరించడం ఆమె ప్రత్యేకత. ఆయుధాలు ధరించి రాక్షసుల్ని వధించడం మంచిది గాదని రామునితో చెప్పిన సన్నివేశంలో కూడా ఆమె ఒక ముని ఉదంతాన్ని ఉపాఖ్యానంగా చెప్పింది.*

అక్కడ రాముడికి చెప్పింది. ఇక్కడ హనుమంతునికీ చెప్పింది. సీతమ్మను చూసి తల్లులు ఈ విషయాన్ని గ్రహించాలి. భర్తను, బిడ్డను తీర్చిదిద్దే బాధ్యత కూడా స్త్రీమూర్తి మీదనే ఉంది.

ఆ చెప్పడం కూడా ఎలా ఉండాలో సీతమ్మను చూసి నేర్చుకోవాలి. విషయం సున్నితంగా ఉండాలి. ధర్మబద్ధంగా ఉండాలి. ప్రేమపూరితంగా చెప్పాలి. చిన్న చిన్న ఉదాహరణలనిస్తూ, కథలు చెప్తూ బోధిస్తే ఇంకా బాగా వంటబడుతుంది.

సీతమ్మ చెప్పిన మాటలు విసిన హనుమంతుడు, "అమ్మా! నువ్వు ధర్మాత్మురాలైన రామునికి తగిన సతివి. నాకు సందేశమివ్వు. నేను రాముని వద్దకు వెళ్తాను." అన్నాడు హనుమ.

సాబ్రవీద్ద్రష్టు మిచ్ఛామి భర్తారం వానరోత్తమ

"నాయనా! నేను నా భర్తను చూడాలని కోరుకుంటున్నాను" అని తన ఏకైక వాంఛను వినిపించింది సీతమ్మ.

"అమ్మా! శచీదేవి దేవేంద్రుని చూచినట్లు నువ్వు రాముణ్ణి చూస్తావు" అని పలికి హనుమంతుడు రాముని వద్దకు వచ్చి సీతమ్మ సందేశాన్ని వినిపించాడు.

అయోనిజకు అగ్నిపరీక్ష

"రామా! అమోఘమైన, అద్భుతమైన ఈ కార్యాలన్నీ ఎవరికొరకు మనం చేశామో అట్టి సీతమ్మను ఇక నీవు చూడాలి. కన్నీళ్ళతో కుమిలిపోతున్న ఆ తల్లి నీ విజయవార్త విని సంతోషించింది. నిన్ను, లక్ష్మణుణ్ణి చూడాలని కోరింది. పూర్వము నన్ను చూసి ఉండడం చేత గుర్తు పట్టింది" అన్నాడు హనుమ.

హనుమంతుడు అలా చెప్పగానే రామునికి కన్నీళ్ళు తిరిగాయి. విభీషణుని వైపు తిరిగి రాముడు ఇలా పలికాడు.

దివ్యాంగరాగాః వైదేహీం దివ్యాభరణ భూషితామ్
ఇహ సీతాం శిరః స్నాతా ముపస్థాపయ మాచిరమ్

---

*చైతన్య రామాయణము - ప్రథమ భాగము - పుట 400

"తలస్నానం చేసి, అంగరాగాలు పూసుకొని, ఆభరణాలను అలంకరించుకున్న సీతను ఇక్కడికి తీసుకురా!" అన్నాడు రాముడు.

విభీషణుడు తెల్లబోయాడు. రాముని మనసులో ఏదో బాధ గూడుకట్టుకొని యున్నదని గ్రహించాడు. కంగారు పడుతూ తొందరగా వెళ్ళాడు.

విభీషణుడు రాముడు చెప్పిన విషయాన్ని ముందుగా అంతఃపుర స్త్రీల ద్వారా సీతమ్మకు చెప్పించాడు. తరువాత తానే వెళ్ళి, సీతమ్మను దర్శించి, నమస్కరించి, వినయవంతుడై పలికాడు.

"అమ్మా! వైదేహీ! తలస్నానం చేసి, అంగరాగాలు పూసుకొని, ఆభరణాలు, దివ్యమైన వస్త్రాలు ధరించి, వాహనాన్ని ఎక్కు. నీ భర్త నిన్ను చూడాలని అభిలషించాడు. అలా చూడాలని ఆశిస్తున్నాడు. నీకు శుభం కలుగుగాక!" అన్నాడు విభీషణుడు.

రాముని మనసులో ఏదో ఉన్నట్లు విభీషణుడు గ్రహించాడు. ఈ విషయంలో సందేహం లేదు. అందుచేతనే **"భద్రం తే"** - "నీకు శుభము కలుగుగాక" అన్నాడు.

"రాక్షసేశ్వరా! నేను ఈ స్థితి లోనే నా భర్తను చూడాలని అనుకున్నాను;" అంది సీతమ్మ.

"తల్లీ! నీ భర్త చెప్పినట్లే చెయ్యడం మంచిది అని నా అభిప్రాయం" అన్నాడు విభీషణుడు.

సీతమ్మ మంగళస్నానం చేసింది. శ్రేష్ఠమైన పట్టు వస్త్రాలు ధరించింది. దివ్యమైన ఆభరణాలు అలంకరించుకుంది. పల్లకీ ఎక్కింది. పల్లకీ వచ్చినా రాముడు గుర్తించలేదు. ఏదో ఆలోచనల్లో ఉన్నాడు. విభీషణుడు వచ్చి రామునికి నమస్కరించాడు. సీతమ్మ వచ్చిందని చెప్పాడు. ఆ మాట వినగానే సీతమ్మ రావణుని ఇంట్లో సంవత్సరం ఉండింది అనే ఆలోచన వచ్చింది. మనసు బాధతోను, సంతోషంతోను, కోపంతోను నిండిపోయింది. సీతమ్మను దగ్గరికి తీసికొని రమ్మని విభీషణునితో చెప్పాడు రాముడు.

సీతమ్మను చూడడానికి వానరులందరూ తోసుకుంటున్నారు. పల్లకీని రామునికి దగ్గరగా తీసికొని రావడం కష్టంగా ఉంది. అడ్డున్న వారిని తొలగించమన్నాడు విభీషణుడు. రాజభటులు ముందుకు వచ్చి వానర భల్లూక వీరులను వెనక్కి నెట్టారు. వాళ్ళంతా గోలచేయగా సముద్రఘోషలా వినిపించింది. రాముడు వానరులను చూచి, క్రుద్ధుడై విభీషణునితో ఇలా పలికాడు.

"విభీషణా! వాళ్ళందరూ నా వాళ్ళు. వాళ్ళను ఎవ్వరూ ఏమీ అనకూడదు. నామాటను కాదని ఎందుకు వాళ్ళని బాధపెట్టడం?

"ఇళ్ళు, వస్త్రాలు, ప్రాకారాలు, తెరలు - ఇవి కావు స్త్రీలకి ఆభరణాలు. సదాచారమే ఆభరణము. ఈ సీత యుద్ధరంగంలో కష్టదశలో ఉంది. పైగా నా దగ్గరుంది. అందుచేత ఆమెను ఎవరు చూచినా దోషం లేదు. పల్లకీలు అవసరం లేదు. ఆమె నడిచే రావచ్చు. వానరులందరూ ఆమెను చూడవచ్చు;" అన్నాడు రాముడు.

విభీషణుడు ఆలోచనలో పడ్డాడు. సుగ్రీవుడు, లక్ష్మణుడు, హనుమంతుడూ బాధపడ్డారు రాముని మాటలను ఆలకించి. రాముని ముఖం చూసి సీతమ్మమీద రామునికి ఇష్టం లేదని

భావించారు. సీతమ్మ సిగ్గుపడుతూ, తనలో తాను ఒదిగిపోతూ రాముణ్ణి సమీపించింది. మెల్లగా ముఖమెత్తి రాముణ్ణి చూచింది. రాముడు మరోవైపు చూస్తున్నట్లుంది. వినయంగా ప్రక్కన నిలబడింది సీతమ్మ. రాముడు ఇలా పలికాడు.

"సీతా! శత్రువును వధించాను. నిన్ను జయించాను. పౌరుష మున్నవాడు చెయ్యవలసిందంతా చేశాను. నా కోపం తీరిపోయింది. జరిగిన అవమానం తుడిచి పెట్టుకపోయింది. జరిగిన అవమానాన్ని, అవమానించిన శత్రువును ఏకకాలంలో తుడిచేశాను.

"నా పౌరుష మేమిటో అందరూ చూశారు. నా కష్టం ఫలించింది. నా ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాను. నేను స్వేచ్ఛాజీవి నిపుడు. నేను లేనపుడు రావణుడు నిన్ను అపహరించాడు. అది దైవికం. దాన్ని నేను పురుషప్రయత్నంతో జయించాను.

"సముద్రాన్ని దాటడం - లంకను కాల్చేయడం అనే రెండు పనులు హనుమంతుడు చేశాడు. ప్రశంసించదగిన ఆ రెండు కార్యాలు సఫల మయ్యాయి. యుద్ధంలో సైన్యంతో కలిసి చక్కని వ్యూహమును పొందిన సుగ్రీవుడు చేసిన శ్రమ కూడా ఫలించింది. దుష్టుడైన రావణుణ్ణి త్యజించి నన్ను ఆశ్రయించిన విభీషణుని శ్రమ కూడా ఫలించింది;" అన్నాడు రాముడు. సీతమ్మ కళ్ళు వర్షించాయి ఆ మాటలకు.

"అవమానం జరిగినపుడు మనిషి అనేవాడు ఏదయితే చేయాలో అదంతా చేశాను. స్నేహితుల సహాయంతో నేను చేసిన ఈ యుద్ధకార్యమంతా నీ కోసం కాదని మాత్రం తెలుసుకో. నా చరిత్రను రక్షించుకోవాలని చేశాను. అపకీర్తిని, అపవాదుని పోగొట్టుకోవడానికి చేశాను. నా వంశప్రతిష్ఠకు కళంకం రాకూడదని చేశాను.

"అర్థం చేసుకో. నీ చరిత్ర లోకందృష్టిలో సందేహాస్పదంగా తయారైంది. కంటిజబ్బువాడు దీపాన్ని చూడలేనట్లు నేను నిన్ను చూడలేక పోతున్నాను.

"సీతా! నీకు అనుమతి నిస్తున్నాను. పది దిక్కులు నీకు తెరిచే ఉన్నాయి. నీ ఇష్టము వచ్చిన చోటికి వెళ్ళవచ్చు.

కార్యమస్తి న మే త్వయా

"నీతో నాకు పనిలేదు.

"పౌరుషవంతుడైన సద్వంశీయుడు పరుల గృహంలో ఉండిన భార్యను సంతోషంగా స్వీకరించలేడు.

"నువ్వు రావణుడి ఒడిలో నలిగావు. రావణుడి చెడ్డ చూపుతో తడిసావు. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన నేను నిన్ను ఇముడ్చుకోలేను.

"కులగౌరవాన్ని కాపాడడానికి, వంశప్రతిష్ఠను ఇనుమడింప చేయడానికి నిన్ను గెలుచుకున్నాను. నీయందు నాకు ఆసక్తి లేదు. నీ ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళవచ్చు.

"అన్నీ ఆలోచించే చెబుతున్నాను. ఇక నీ ఇష్టము. లక్ష్మణుని దగ్గర గాని, భరతుని దగ్గరగాని, శత్రుఘ్నుని దగ్గర గాని, సుగ్రీవుని దగ్గరగాని, విభీషణుని దగ్గరగాని - నీ ఇష్టమొచ్చిన చోట ఉండవచ్చు.

"నువ్వు అందమైన దానివి. ఇంతకాలం తన ఇంట్లో ఉన్న నిన్ను రావణుడు చూస్తూ ఊరకుంటాడా?" అని ముఖాన్ని ప్రక్కకు తిప్పేసుకున్నాడు రాముడు.

తొండముతో ఏనుగు పీకేసిన లత లాగా వణికిపోయింది సీతమ్మతల్లి. కన్నీరు ఆగకుండా కారిపోతోంది. తీవ్రమైన బాధతో చలించిపోయింది. అంతమందిలో భర్త పూర్వమెన్నడూ అనని విధంగా అనేటప్పటికి ఆ మాటలకు క్రుంగిపోయింది. రాముని మాటలు ఆమె గుండెల్లో గునపాలలాగా, బాణాలలాగా దిగిపోయాయి. కన్నీటిని తుడుచుకుంటూ, గద్గదమైన వాక్కుతో రామునికి సమాధాన మిచ్చింది సీతమ్మతల్లి.

"వీరాధివీరా! నీవు అనకూడని, నేను వినకూడని భయంకరమైన మాటలు మాట్లాడుతున్నావు. ఒక పామరుడు పామరస్త్రీతో మాట్లాడుతున్నట్లు పలుకుతున్నావు.

"నువ్వు భావించినట్లు నేను అలాంటిదానను కాను. నన్ను నమ్ము. నా శీలం మీద ఒట్టుపెట్టుకొని చెబుతున్నాను.

"ఒక దుష్టస్త్రీని ఎవతెనో భావించుకొని స్త్రీజాతి నంతా నువ్వు అనుమానిస్తున్నావు. నా విషయం నీకు తెలియదూ! రావణుడు నా శరీరాన్ని తాకాడు. విరాధుడు కూడా తాకాడు గదా! అది నిజమే. అక్కడ నా ప్రమేయ మేమీ లేదు. ఆ దోషం నాది కాదు. దైవానిది.

"నా హృదయం నా అధీనంలోనే ఉండింది. నా మనసు నీ మీదే నిలిచి ఉండింది. నా మనస్సును ఎవ్వరూ ముట్టుకోలేరు. నా శరీరాన్ని రాక్షసుడు ఎత్తుకపోతుంటే నేను ఏమి చేసేది? దిక్కులేని దాననయ్యాను. దీనురాలి నయ్యాను.

"ఇంతకాలం కలిసి పెరిగాం. కలిసి మెలిగాం. కలిసి తిరిగాం. నేనెలాంటి దాననో నీకు తెలియలేదంటే నేను గతించినట్లే.

"రాజా! నీ మనసు ఇలా ఉండేటప్పుడు హనుమంతుని లంకకు ఎందుకు పంపావు? అప్పుడే ఈ మాట చెప్పి నన్ను వదిలేసి ఉండొచ్చు కదా! అలా చేసుంటే ఈనాడు నేను ఉండేదాననే కాను. మనసులో ఇన్ని సందేహాలు పెట్టుకొని ఇంతగా శ్రమించడ మెందుకు? నువ్వు, నీ స్నేహితులు పడిన శ్రమంతా నిష్ఫలమైనట్లే కదూ!

"క్రోధావేశముతో అల్పబుద్ధి గల వానిలాగా నాలోని స్త్రీత్వమే చూశావు. నా శీలం, నా చరిత్ర చూడలేక పోయావు. నన్ను జనకమహారాజు కూతురుగా లోకం గుర్తించినా నేను భూమి నుండి పుట్టినదాన్ని. అది కూడా నీకు జ్ఞాపకం రాలేదు. చిన్నప్పుడే నువ్వు నా పాణిగ్రహణం చేసిన విషయం కూడా మరచావు. నా జన్మను, నా కర్మను అన్నిటిని తుడిచేశావు;" అంటూ వెక్కివెక్కి రోదించింది.

చింతాక్రాంతుడై నిల్చునియున్న లక్ష్మణుణ్ణి చూచి, "లక్ష్మణా! నాకు చితిని తయారు చెయ్యి. ఈ ఆపద అన్నిటికి అదే ఔషధము. మిథ్యాపవాదాన్ని మోస్తూ నేను జీవించలేను. నా పాతివ్రత్యానికి తృప్తి చెందలేక, పదుగురిలో నన్ను అనరాని మాటలు అని భర్త విడిచేసిన తరువాత నేను సహించి జీవించలేను. అగ్నిలో దూకుతాను;" అంది.

సీతమ్మ మాటలను ఆలకించిన లక్ష్మణుడు కోపావేశంతో రాముని చూశాడు. రాముని ఆకారం చూడగానే అది రాముని అంగీకారమని లక్ష్మణునికి అర్థమైంది.

చితిమంటలు లేచాయి.

ప్రళయకాల యమునివలె గోచరిస్తున్న రాముణ్ణి పలకరించే ధైర్యం ఆ సమయంలో ఎవ్వరికీ లేకుండా పోయింది.

తల వంచుకొని నిలుచుని యున్న రామునకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి, ప్రజ్వలిస్తున్న అగ్నిని సమీపించింది. దేవ బ్రాహ్మణులకు నమస్కరించి అంజలి ఘటించి ఇలా పలికింది.

యథా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్
తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః

"నా మనసు ఎప్పుడూ రాముని విడిచి ఉండని మాట వాస్తవమే అయితే లోకసాక్షియైన అగ్ని నన్ను రక్షించుగాక!



"రాముడు భావించినట్లు నేను దుష్టచరిత్ర కలదానిని కానిచో లోకసాక్షియైన అగ్ని నన్ను రక్షించుగాక!

"మనసుచేత గాని, వాక్కుచేత గాని, కర్మచేత గాని, ధర్మవేత్త అయిన రాముణ్ణి నేను అతిక్రమించనిచో లోకసాక్షియైన అగ్నిదేవుడు నన్ను రక్షించుగాక!

"సూర్యుడు, వాయువు, దిక్కులు, చంద్రుడు, పగలు, సంధ్యలు, రాత్రి, భూమి, దేవతలు నన్ను సచ్చరిత్ర గల దానినిగా తెలిసికొని యున్నచో అగ్నిభట్టారకుడు నన్ను రక్షించుగాక!" అని పలికి అగ్నికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, ఏ మాత్రము సంకోచించని మనసుతో అగ్నిలో ప్రవేశించింది.

ఆ భయంకర సన్నివేశాన్ని చూసి ఆబాల గోపాలము అల్లాడిపోయారు. స్త్రీలందరూ పెద్దగా ఏడ్చారు. వానరు లందరూ గోలపెట్టేశారు. సీతమ్మ అగ్నిలో ప్రవేశిస్తూ ఉండగా "అయ్యో - అయ్యో" అని గుండెలు బాదుకుంటూ బిగ్గరగా అందరూ ఏడ్చారు.

రాముని మనస్సు దుఃఖంతో కుమిలిపోతోంది. కళ్ళు అశ్రువుల్ని రాల్చుతున్నాయి. అప్పుడు యముడు, కుబేరుడు, మహేంద్రుడు, వరుణుడు, మహేశ్వరుడు, బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి రాముని సమీపించారు. రాముడు వారికి చేతులెత్తి నమస్కరించాడు.

"రామా! నీవు దేవతలలో శ్రేష్ఠుడివి. నిన్ను నీవు ఎందుకు గ్రహించడం లేదు. నీవు ఆది దేవుడవు. ఆదిలక్ష్మియైన సీతను ఎందుకు ఉపేక్షిస్తావు?" అన్నారు. దానికి రాముడు ఈ విధంగా సమాధానమిచ్చాడు.

ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్
యోఽహం యస్య యతశ్చాహం భగవాం స్తద్బ్రవీతుమే ॥

"నేను మానవమాత్రుడననీ, దశరథమహారాజు కుమారుడననీ భావిస్తున్నాను. కాకపోతే, నేనెవరిని? ఇలా ఎందుకున్నాను? బ్రహ్మదేవుడా! నీవే చెప్పు" అన్నాడు.

"రామా! నీవు స్వప్రకాశుడవు. లక్ష్మీసమేతుడవు. చక్రధారివి. వరాహమూర్తివి. పురుషోత్తముడివి. మధుసూదనుడవు.

"నువ్వు పరబ్రహ్మనివి. అక్షర రూపుడవు. సత్యరూపుడవు. సర్వగతుడవు. ఆది మధ్యాంత రహితుడవు. శ్రీమన్నారాయణుడవు.

త్వం యజ్ఞ స్త్వం వషట్కారస్త్వ మోంకారః పరాత్పరః
ప్రభవం నిధనం వా తే నో విదుః కో భవానితి ॥

"నీవే యజ్ఞము. నీవే వషట్కారము. నీవే ఓంకారము. నీవే పరాత్పరుడవు. నీ పుట్టుకను గాని, నాశమును గాని, నీవెవ్వరనే విషయాన్ని గాని ఎవ్వరూ ఎరుగరు.

"రామా! నేను నీ హృదయము. సరస్వతి నీ వాక్కు. నీ సర్వాంగముల యందు దేవతలు రోమములై యున్నారు.

"నీ రెప్పపాటు రాత్రి. కన్ను తెరిస్తే పగలు. ఈ జగత్తంతా నీ శరీరమే. నీ స్థిరత్వమే భూమి. నీ కోపమే అగ్ని. నీ ప్రసాదమే చంద్రుడు. నీవు సాక్షాత్తు విష్ణుదేవుడవు.

"రావణుని వధించుటకై నీవు మనుష్యాకారమును ధరించి ఈ ప్రపంచానికి వచ్చావు. సీత లక్ష్మీదేవి. నీవు శ్రీమహావిష్ణువు. రామా! రావణుణ్ణి వధించావు కదా! ఇక వైకుంఠానికి తిరిగిరా!

అమోఘం దేవ వీర్యం తే నతే మోఘాః పరాక్రమాః
అమోఘం దర్శనం రామ అమోఘ స్తవ సంస్తవః

"రామా! నీ వీర్యతేజాలు అమోఘాలు. నీ దర్శనం అమోఘము. నీ కీర్తనమూ అమోఘము.

అమోఘాస్తే భవిష్యన్తి భక్తి మంతో నరాభువి
యే త్వాం దేవం ధ్రువం భక్తాః పురాణం పురుషోత్తమమ్
ప్రాప్నువన్తి సదా కామానిహ లోకే పరత్ర చ

"ఈ భూలోకంలో నీయందు భక్తి కలవారందరు అమోఘ శక్తివంతు లవుతారు. ప్రభువు, పురాణపురుషుడు, పురుషోత్తముడు అయిన నీయందు భక్తి కలవారికి ఇహలోకమునందు, పరలోకమునందు కూడా సమస్తకోరికలు నెరవేరుతాయి;" అన్నాడు బ్రహ్మదేవుడు.

సీతమ్మ పరమ పవిత్రురాలు

బ్రహ్మదేవుడు అలా పలికిన వెంటనే సీతమ్మను ఒడిలో కూర్చుండబెట్టుకొని అగ్నిదేవుడు మంటల్లో నుండి పైకి లేచాడు. సీతమ్మ ఉదయభానునిలా వెలిగిపోతోంది. అగ్నిలో ప్రవేశించినపుడు సీతమ్మ అలంకరణాలు, వస్త్రాలు, పూలదండలు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి.

"రామా! ఇదిగో నీ సీత. ఏ పాపమూ ఎరుగని పవిత్రురాలు. వాక్కుచేత గాని, మనస్సుచేత గాని, బుద్ధిచేత గాని, దృష్టిచేత గాని నిన్ను తప్ప అన్యమెరుగని స్త్రీ ఈమె.

"రావణుడు ఎంతగా ప్రలోభపెట్టినా, బెదిరించినా ఆమె లెక్కచేయలేదు. మనసును నీ యందే నిలుపుకొని జీవించింది. పరమపవిత్రురాలైన ఈ సీతను స్వీకరించు. అడ్డుచెప్పకు. నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను" అన్నాడు అగ్నిదేవుడు.

రాముడు కొన్ని క్షణాలు నిశ్చేష్టుడయ్యాడు. ఆయన నేత్రాల్లో బాష్పాలు గూడుకట్టుకున్నాయి. మనసు ప్రసన్నమైంది.

"సీత పవిత్రురాలని, ఏ పాపమూ ఎరుగదని ముల్లోకాలకు తెలుసు. కానీ ఇంతకాలం రావణుడి అంతఃపురంలో ఉండింది సీత. ఏ పరీక్ష లేకుండా ఆమెను నేను గ్రహిస్తే లోకం నిందిస్తుంది. దశరథపుత్రుడైన రాముడు మూర్ఖుడై, కామవశుడై సీతను గ్రహించాడు అని లోకం పరిహసిస్తుంది.

"సీత మనస్సు నాయందే ఉంటుందని నాకు తెలుసు. ఆమె హృదయం సదా నన్నే ధ్యానిస్తూ ఉంటుందని కూడా నాకు తెలుసు. ఈ సత్యము ముల్లోకాలలో కూడా రూఢి కావాలని నేను భావించాను. అందుకే ఆమె అగ్నిలో ప్రవేశిస్తున్నా చూస్తూ ఉండిపోయాను.

"సముద్రము చెలియలికట్టను దాటలేదు. తన తేజస్సు చేతనే తాను రక్షింపబడే సీతను దుష్టుడైన రావణుడు ఏమీ చెయ్యలేడు. ప్రకాశము సూర్యుని విడిచి ఉంటుందా! నా సీత కూడా అంతే.

"రావణుడి అంతఃపురం ఆమెకు తుచ్ఛం. ఆమె వాడి ఐశ్వర్యం వైపు కన్నెత్తి కూడా చూడదు. అగ్నిశిఖ లాంటిది నా సీత. రావణుడు ఆమెను మనసులో కూడా అవమానించలేడు.

"మీరందరూ లోకపూజ్యులు. స్నిగ్ధహృదయులు. మీరు చెప్పినట్లే వింటాను. బుద్ధిమంతుడు కీర్తిని వదలనట్లు నేను సీతను విడువను;" అని పలికి సీతమ్మను పరిగ్రహించాడు శ్రీరాముడు.

"రామా! అమోఘమైన కార్యాన్ని సాధించావు. ఇదంతా మా అదృష్టం. ఇక మామాట విని త్వరగా అయోధ్యకి వెళ్ళు. భరతుని సంతోషపెట్టు. తల్లుల్ని తృప్తిపరచు. ప్రజల్ని సుఖపెట్టు. పట్టాభిషేకం చేసుకొని, అశ్వమేధయాగం చేసి అసాధారణమైన కీర్తిని సంపాదించు. సర్వులను తృప్తి పరచి వైకుంఠాన్ని చేరుకో.

"నీవల్ల నీ తండ్రి దశరథుడు తరించి స్వర్గంలో ఉంటున్నాడు. అటు చూడు. మీ తండ్రి దేవతలతో కూడా ఆ విమానంలో ఉన్నాడు. చూడు. నువ్వు, లక్ష్మణుడూ దశరథునికి నమస్కరించండి" అన్నాడు పరమశివుడు.

రామలక్ష్మణులు దశరథునికి నమస్కరించారు. దశరథుడు రామలక్ష్మణులను కౌగలించుకున్నాడు.

"రామా! నీకు దూరమైన నాకు స్వర్గం కూడా రుచించడం లేదు. దేవతలు, మహర్షుల సన్మానాలు కూడా నాకు తృప్తి నివ్వలేదు. రాక్షసుల్ని వధించిన నిన్ను ఈరోజు చూడగానే నా మనసు ఎంతగానో తృప్తి చెందింది.

"నిన్ను అరణ్యాలకు పంపమనిన కైకేయి మాటలు ఇంకా నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి. నిన్ను, లక్ష్మణుని, సీతను చూసిన తరువాత నా మనసు శాంతించింది. అష్టావక్రుడు తండ్రిని ఉద్ధరించినట్లు నువ్వు నన్ను ఉద్ధరించావు.

"రామా! రావణుణ్ణి సంహరించడానికి ఇదంతా దేవతలే సృష్టించారని నాకు తరువాత తెలిసింది. నాయనా! వనవాసం పూర్తిచేసుకొని అయోధ్యకు తిరిగివెళ్ళిన నిన్ను కౌసల్య చూస్తుంది. అయోధ్యావాసు లందరూ చూస్తారు. వాళ్ళందరూ అదృష్టవంతులు.

"భరతుడు నీ యందే అనురక్తి కలవాడు. పవిత్రుడు. ధర్మాచారి. నువ్వు భరతుణ్ణి కలిస్తే చూడాలని నా మనసు ఉరకలేస్తోంది. కుమారా! వనవాసాన్ని పూర్తిచేశావు. రాక్షసుల్ని సంహరించావు. గొప్ప కీర్తిని పొందావు. అయోధ్యను పాలిస్తూ, దీర్ఘాయుర్దాయముతో జీవించు" అని ఆశీర్వదించాడు దశరథుడు.

"తండ్రీ! భరతుని, కైకేయిని నువ్వు అనుగ్రహించాలి. "నిన్నూ, నీ కుమారుడు భరతుణ్ణి నేను విడిచిపెట్టేస్తున్నాను" అని నీవు పలికిన శాపం వారి౧ స్పృశించకుండా ఉండాలి." అని రాముడు తండ్రిని ప్రార్థించాడు.

దశరథుడు "అలాగే" నని రాముని ఆశీర్వదించాడు. అన్న సేవను విస్మరించకుండా తరించమని లక్ష్మణునికి చెప్పాడు.

"అమ్మా సీతా! నిన్ను విడిచిపెట్టేశాను అని రాముడన్న మాటల్ని మనసులో ఉంచుకోకు. నీ శీలవైభవాన్ని ప్రపంచానికి చాటడానికే రాముడు ఇదంతా చేశాడు. నీకు రాముడే దైవం. రాముడే సర్వం. నీకు చెప్పాల్సిన అవసరం లేదు" అని పలికి విమానం ఎక్కి వెళ్ళిపోయాడు దశరథుడు.

దశరథుడు వెళ్ళిపోగానే ఇంద్రుడు సమీపించాడు. మనసులోని కోరికను తెలుపమని కోరాడు. మృతిచెందిన వానర భల్లూక వీరుల్ని బ్రతికించమని, వారు చరించే ప్రదేశాలలో పరిశుద్ధమైన నీరు, మధురమైన ఫలాలు పూర్ణంగా ఉండేలా చూడమని రాముడు కోరాడు. ఇంద్రుడు అంగీకరించాడు. వానరవీరులు, భల్లూకవీరులు, గోలాంగూలవీరు లెవ్వరయితే మరణించారో వారందరు తిరిగి సజీవులయ్యారు.

పుష్పకంలో పుణ్యశ్లోకుడు

ఆ రాత్రి ఆనందంగా గడిచిపోయింది. తెల్లవారింది. విభీషణుడు వచ్చాడు. "రామా! అంగరాగాలు, దివ్యమైన వస్త్రాలు, ఆభరణాలు సిద్ధంగా ఉన్నాయి. స్వీకరించి మమ్మల్ని తృప్తిపరచు" అని రాముని ప్రార్థించాడు.

"విభీషణా! నీవు చేసిన మేలు నేను మరువను. మరువలేను. కానీ, నేను తొందరగా వెళ్ళాలి. నా తమ్ముడు భరతుణ్ణి చూడాలి. భరతుడు లేని స్నానాంగరాగాదులు నాకు సుఖాన్నివ్వవు. పైగా అయోధ్య సుదూరప్రాంతము" అన్నాడు రాముడు.

"రామా! ఆ విషయంలో నీకు ఆలోచన అవసరం లేదు. లంకలో పుష్పకం అనే విమాన మొకటుంది. అది కుబేరునిది. రావణుడు కుబేరుని సంహరించి దానిని వశపరచుకున్నాడు.

"అది కామగం. కామదం. సంకల్పిస్తే చాలు. దూరాలను, కాలాలను అధిగమించి పయనిస్తుంది. దానిని మీకొరకు సిద్ధం చేసి ఉంచాను. కానీ నా ఆతిథ్యాన్ని స్వీకరించి, నా కానుకల్ని స్వీకరిస్తే నేను చాలా తృప్తి చెందుతాను" అన్నాడు విభీషణుడు.

"విభీషణా! నీ మాట కాదంటున్నానని భావించకు. బాధపడకు. నువ్వు నన్ను ఎన్నో విధాలుగా తృప్తి పరచావు. నా తల్లుల్ని, నా తమ్ముడు భరతుణ్ణి చూడాలని నా మనసు ఎంతో ఆదుర్దా పడుతోంది. నన్ను త్వరగా అయోధ్యకి పంపించు. చాలు" అన్నాడు రాముడు.



విభీషణుడు పుష్పక విమానం తెప్పించాడు. అది చాలా వింతగాను, విచిత్రంగాను, విస్మానత్నంగామూ ఉంది. బంగారుతో, మణులతో, రత్నాలతో అలంకరించబడి ఉంది. మేరుపర్వత శిఖరంలా శోభిస్తోంది. విశ్వకర్మ నిర్మించిన ఆ పుష్పకం వచ్చింది.

"రామా! ఇంకేమి ఆజ్ఞ?" అని అడిగాడు విభీషణుడు. ఉదారచరితుడు, భక్తవత్సలుడు అయిన రాముడు ఇలా పలికాడు.

"విభీషణా! లంక నీకు లభించింది. జయించుటకు సాధ్యం కాని ఈ లంకను నీవు పొందడానికి వానరవీరులే కారణము. వారు ప్రాణాల్ని త్యజించి పోరాడారు. నీకు విజయాన్ని సాధించి పెట్టారు. వారిని విలువైన కానుకలతో నీవు సన్మానించాలని నా కోరిక. అలా చేయడం వల్ల వాళ్ళూ సంతోషిస్తారు. నీవూ కీర్తిని పొందుతావు. ఇది న్యాసలహా. బలవంతమేమీ లేదు. నీకు తోచినట్లు చెయ్యొచ్చు;" అన్నాడు రాముడు.

విభీషణుడు సంతోషించి వానరవీరులను, భల్లూకవీరులను గొప్పగా సన్మానించాడు. సన్మాన కార్యక్రమము సంపూర్తికాగానే రాముడు పుష్పకం ఎక్కాడు. లక్ష్మణుడు, సీతమ్మ కూడా ఎక్కారు.

"వానరవీరులారా! నా కోసం మీరు ఎంతగానో శ్రమించారు. ఇక మీరు హాయిగా మీ మీ ఇళ్ళకు వెళ్ళండి.

"సుగ్రీవా! నన్ను ఎంతగానో ఆదరించి, ఆదర్శమిత్రు డనిపించుకున్నావు. నీ సైన్యంతో కలసి కిష్కింధకు వెళ్ళు నాయనా!

"విభీషణా! ఇక నీవు లంకను పరిపాలిస్తూ హాయిగా, సుఖంగా జీవించు. నేను మీ అందరి నుండి అనుజ్ఞను ఆశిస్తున్నాను. సెలవు కోరుతున్నాను" అన్నాడు రాముడు.

రాముడు అలా చెప్పగానే అందరి హృదయాలు ద్రవించాయి. సుగ్రీవ విభీషణాదులు రామునికి నమస్కరించి "రామా! మమ్మల్ని అనుగ్రహించు. ఆశీర్వదించు. నీతోపాటు అయోధ్యకు రావాలని మాకు చాలా సంబరంగా ఉంది. నీ పట్టాభిషేకాన్ని కళ్ళారా చూసి, కౌసల్యాదేవి పాదాలను స్పృశించి రావాలని అభిలషిస్తున్నాము" అన్నారు.

"ఎంత సంతోషకరమైన వార్తను చెప్పారు! నా కంతకన్నా ప్రియమైనది ఏముంటుంది? సుగ్రీవా! నీ మంత్రుల్ని తీసికొని పుష్పకంలో ప్రవేశించు. విభీషణా! నీ అమాత్యులతో కూడి విమానాన్ని అధిరోహించు" అన్నాడు రాముడు.

ముఖ్యులైన వానరశ్రేష్ఠులతో కలిసి సుగ్రీవుడు, రాక్షసవీరులతో కలిసి విభీషణుడు పుష్పకవిమానం ఎక్కారు.

పుష్పకవిమానం ఆకాశంలో ఎగిరింది. రాముడు సీతమ్మకు లంకనంతా చూపిస్తూ, విశేషాలను వివరించాడు. వానరవీరులు ఎవరెవర్ని చంపారో, వానరుల చేతుల్లో రాక్షస వీరులు ఎవరెవరు మరణించారో అవన్నీ వివరించాడు.



విమానం కిష్కింధ మీదికి వచ్చింది. సుగ్రీవుని భార్యలను చూడాలని, వారిని కూడా అయోధ్యకు తీసికొని వెళ్ళాలని సీతమ్మ కోరింది. రాముడు విమానాన్ని కిష్కింధలో నిలిపాడు.

రాముని ఆజ్ఞపై సుగ్రీవుడు భార్యలను వెంటపెట్టుకొని వచ్చి విమానం ఎక్కాడు. మళ్ళీ పుష్పక విమానం ఆకాశంలో ఎగిరింది. ఋష్యమూకాన్ని సీతమ్మకు చూపించి, వాలి వధను గూర్చి చెప్పాడు రాముడు. కొంత దూరం ప్రయాణం చేసిన తరువాత తాము నివసించిన ఆశ్రమాన్ని చూపించాడు రాముడు.

గోదావరి నదిని, అగస్త్యాశ్రమాన్ని, సుతీక్ష్ణుని ఆశ్రమాన్ని, శరభంగాశ్రమాన్ని చూపించాడు పైనుంచే.

అత్రి ఆశ్రమాన్ని, చిత్రకూటపర్వతాన్ని చూపాడు. అక్కడ చలించిపోతూ భరతుణ్ణి గూర్చి ప్రస్తావించాడు రాముడు. విరాధుణ్ణి వధించిన స్థలాన్ని చూపాడు. గంగానదిని చూపాడు.

అయోధ్య సమీపిస్తోంది. ఈలోగా భరద్వాజాశ్రమం వచ్చింది. రాముడు విమానాన్ని ఆపాడు. భరద్వాజునికి నమస్కరించాడు. అయోధ్య క్షేమసమాచారాలు ప్రశ్నించి తెలుసుకున్నాడు.

"రామా! అందరూ క్షేమంగా ఉన్నారు. భరతుడు జడధారియై, నీ పాదుకలను అర్చిస్తూ రాజ్యపాలనం చేస్తున్నాడు.

"రాఘవా! పూర్వం రాజ్యభ్రష్టుడవై నీవు నా ఆశ్రమానికి వచ్చినపుడు నిన్ను చూసి నా మనసు చాలా దు:ఖించింది. ఈరోజు బంధుమిత్ర సమేతంగా నువ్వు అయోధ్యకు వెళ్తున్నావు. నాకు చాలా సంతోషంగా ఉంది.

"నీవు అరణ్యంలో ప్రవేశించింది మొదలు, రావణుని సంహరించినంత వరకు జరిగిన విషయాలన్నీ నాకు తెలుసు. రామా! అంతా శుభమే జరిగింది.

"ఈరోజు మా ఆశ్రమంలో ఉండు. మా ఆతిథ్యాన్ని గ్రహించు. రేపు అయోధ్యకు వెళ్దువుగాని" అన్నాడు భరద్వాజమహర్షి. రాముడు అంగీకరించాడు. మధురఫలాలను ఆనందంగా అనుభవించారు వానరవీరులు.

రాముడు హనుమంతుణ్ణి పిలిచి, "హనుమా! నువ్వొక పని చేయాలి. ఇక్కడ నుండి శృంగబేరపురం వెళ్ళు. అక్కడ గుహుడనే నిషాదరాజు ఉన్నాడు. అతనికి నా కుశలాన్ని వివరించి చెప్పు. నా రాక తెలియ చెయ్యి.

"హనుమా! అక్కడ నుండి అయోధ్యకి వెళ్ళు. భరతుణ్ణి కలుసుకో. ఎలా ఉన్నాడో తెలుసుకో. నా రాకను వివరించు. భరతుడు నన్ను కలుసుకొని వెళ్ళిన తరువాత ఈనాటి వరకు జరిగిన చరిత్ర నంతా వివరించి చెప్పు" అన్నాడు.

హనుమంతుడు బయలుదేరి, శృంగబేరపురంలో గుహునికి వర్తమానాన్ని అందించి, అయోధ్యకి వెళ్తూ మధ్యలో నందిగ్రామంలోని భరతుని ఆశ్రమాన్ని చూసి ఆగాడు.

భరతుడు కృశించి ఉన్నాడు. కందమూల ఫలాలు తింటూ జడధారియై, రాముని గూర్చి దు:ఖిస్తూ, రామునే స్మరిస్తూ దీనంగా ఉన్నాడు. హనుమంతుడు భరతుని కలిసికొని రాముని వర్తమానాన్ని అందించాడు.

హనుమంతుని ద్వారా అత్యంత మంగళకరమైన, ప్రియమైన వార్తను ఆలకించిన భరతుడు పరవశించి మూర్ఛిల్లాడు. తేరుకొని లేచిన భరతుడు ఆంజనేయుని అమాంతం కౌగలించుకున్నాడు. ఆనందాశ్రువులతో ఆంజనేయుని శిరస్సుని తడిపేసాడు.

"సౌమ్యుడా! నీవు నరుడవో, వానరుడవో, దేవుడవో నాకు తెలియదు. నా హృదయాన్ని పూర్ణం చేశావు. ఏమిచ్చినా తీరనిది నా నీ ఋణం.

కళ్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతిమే
ఏతి జీవన్త మానన్దో నరం వర్ష శతాదపి ॥

"మనిషి బ్రతికి ఉండాలేగాని నూరు సంవత్సరాలకైనా ఆనందాన్ని పొందుతాడు అనే లోకోక్తి సత్యమని నాకనిపిస్తోంది." అని పలికి రామునకు, వానరులకు స్నేహం ఎలా కలిగిందో చెప్పవలసిందిగా భరతుడు హనుమంతుని కోరాడు. జనస్థానంలో రాముడు ప్రవేశించింది మొదలు రావణసంహారము వరకు జరిగిన విషయాన్నంతా కళ్ళముందు ప్రదర్శించినట్లు వివరించాడు హనుమంతుడు.

అదంతా విని భరతుడు ఆశ్చర్యాన్ని, బాధని, చివరకి ఆనందాన్ని పొందాడు. **"చిరస్యపూర్ణః ఖలు మే మనోరథః"** "నా చిరకాల వాంఛ నెరవేరింది" అన్నాడు భరతుడు.

భరతుడు శత్రుఘ్నుని పిలిచి ఏర్పాట్లు చూడమన్నాడు. నందిగ్రామం మొదలు అయోధ్య దాకా రహదారులు చక్కగా అలంకరించారు. ధ్వజాలు కట్టించారు. దారులన్నీ ముగ్గులతో, తోరణాలతో శోభించాయి.

దశరథుని ముగ్గురు భార్యలు కూడా నందిగ్రామం చేరారు. అంతేకాదు. అయోధ్య మొత్తానికి నందిగ్రామం చేరిందా! అన్నట్లుంది నందిగ్రామంలో కోలాహలం.

తెల్లవారింది. భరతుడు రామపాదుకల్ని శిరస్సుపై ధరించాడు. ఆ పాదుకలకు శ్వేతచ్ఛత్రం పట్టారు. వింజామరలు చేత పట్టుకున్నారు. రామ పాదుకల్ని ఊరేగిస్తూ

నందిగ్రామం పొలిమేరల్లోకి వచ్చి రాముని కోసం నిరీక్షిస్తూ నిలబడ్డారు. భేరీమృదంగాలు మ్రోగుతున్నాయి.

ఈలోగా దూరంగా నిర్మల చంద్రబింబంలా కనిపించింది పుష్పకవిమానం. హనుమంతుడు చెప్పిన సమయానికే పుష్పకం వచ్చి వాలింది. రాముడు పుష్పకవిమానంలో మహేంద్రునిలా వెలిగిపోతున్నాడు. భరతుడు రామునికి నమస్కరించాడు. రాముడు భరతుణ్ణి కౌగలించుకున్నాడు. భరతలక్ష్మణులు కౌగలించుకున్నారు. భరతుడు సీతమ్మకు నమస్కరించాడు. వానర, రాక్షస శ్రేష్ఠుల్ని కూడా భరతుడు ఆలింగనం చేసుకున్నాడు. భరతుడు ఆనందబాష్పాలు కార్చుతూ సుగ్రీవునితో ఇలా పలికాడు.

త్వమస్మాకం చతుర్ణాం వై భ్రాతా సుగ్రీవ పంచమః
సౌహృదా జ్జాయ తే మిత్ర మపకారోరి లక్షణమ్ ॥

"సుగ్రీవా! మాకు నువ్వు ఐదవ సోదరుడివి. స్నేహాన్ని బట్టి మిత్రుడు, అపకారాన్ని బట్టి శత్రువు కలుగుతూ ఉంటారు." అన్నాడు.

శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు, సీతమ్మకు పాదాభివందనం చేశాడు.

రాముడు కౌసల్య, సుమిత్ర, కైకేయి పాదాలకు నమస్కరించాడు. ప్రజలందరూ రామునికి స్వాగతం పలుకుతూ విజయఘోషలు వినిపించారు.

భరత్ఉడు పాదుకల్ని తీసుకొని వెళ్ళి రాముని పాదాలకు తొడిగాడు. రామునికి నమస్కరించి ఇలా పలికాడు.

"రామా! ఇదిగో నీ రాజ్యం. స్వీకరించు. నీ అనుగ్రహంతో ఈ రాజ్యాన్ని పదిరెట్లు వృద్ధి చేశాను" అన్నాడు. భరతుని భక్తికి వానరవీరులు కూడా కన్నీళ్ళు విడిచారు.

రాముడు భరతుని ఆశ్రమం చేరాడు. పుష్పకవిమానాన్ని తిరిగి పంపేశాడు. వెంటనే పుష్పకవిమానం ఆకాశమార్గాన వెళ్ళింది.

పట్టాభిషేకము

గొప్ప వేడుకతో రాముడు అయోధ్యలో ప్రవేశించాడు. రాముడు వసిష్ఠుని పాదాలకు నమస్కరించి, ఆ మహాత్ముడు ఆసీనుడైన తర్వాత తాను భద్రాసనంపై కూర్చున్నాడు.

భరతుడు రాముని సమీపించి, "అన్నా! నీవు రాజ్యాన్ని నాకు ఎలా ఇచ్చావో అలాగే నీకు తిరిగి సమర్పించుకుంటున్నాను. గొప్ప వృషభం మోయాల్సిన భారాన్ని చిన్న దూడ ఎలా మోయలేదో, నీవు వహించవలసిన రాజ్యభారాన్ని నేను వహించలేను. గుఱ్ఱంలా గాడిద లగెత్తలేదు. హంసలా కాకి చరించలేదు. నీవు పట్టాభిషిక్తుడవై మమ్మల్ని అనుగ్రహించు" అన్నాడు.

రాముడు సరే నన్నాడు. మాంగలిక కర్మలు పూర్తయ్యాయి. ముందుగా భరతుడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు స్నానం చేశారు. తరువాత రాముడు స్నానం చేశాడు. పట్టు వస్త్రాలు ధరించారు. ఆభరణాలు ధరించారు.

ముగ్గురత్తమ్మలు సీతమ్మను అలంకరించారు. సుగ్రీవుని సతులకు కూడా ఆభరణాలను బహూకరించి అలంకరించింది కౌసల్య.

రాముడు సర్వాంగసుందరంగా శోభిస్తున్న రథాన్ని అధిరోహించాడు. రాముడి రథాన్ని భరతుడు నడిపాడు. శత్రుఘ్నుడు తెల్లని గొడుగును పట్టుకున్నాడు. లక్ష్మణుడు, విభీషణుడు వింజామరలు పట్టుకున్నారు.

సుగ్రీవుడు శత్రుంజయమనే ఏనుగు నెక్కాడు. చుక్కల్లో చంద్రునిలాగా రాముడు రథంలో ఊరేగుతున్నాడు.

జాంబవంతుడు, వేగదర్శి, ఋషభుడు, హనుమంతుడు నాలుగు బంగారు కుండలను తీసికొని వెళ్ళి ఐదువందల నదుల నుండి జలాలను సేకరించి తెచ్చారు. పట్టాభిషేకానికి అందరూ సిద్ధమయ్యారు.

పట్టాభిషేక మహోత్సవము అత్యంత వైభవముగా సాగుతోంది. పురోహితుడైన వసిష్ఠుడు పురోహితులతో కలిసి సీతారాముల్ని రత్నపీఠము మీద కూర్చోబెట్టాడు.

వసిష్ఠుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు మొదలైనవారు సహస్రాక్షుడైన ఇంద్రుని అభిషేకించినట్లు రాముని అభిషేకించారు. నదీజలాలతోనే గాక ఓషధీరసాలతో కూడా అభిషేకించారు.

పూర్వము బ్రహ్మదేవునిచే నిర్మించబడినదియు, మనువు మొదలు ఆ వంశానికి చెందిన ప్రభువు లందరూ ధరించిన రత్నమయమైన బంగారు కిరీటాన్ని సభామధ్యమున ఉంచారు. నానారత్నములతో చిత్రవర్ణమై విచిత్రంగా గోచరిస్తున్న ఆ కిరీటమును తీసి వసిష్ఠుడు రాముని శిరస్సుపై ఉంచాడు.

శత్రుఘ్నుడు రామునకు తెల్లని ఛత్రమును పట్టగా సుగ్రీవుడు, విభీషణుడు వింజామరలు పట్టారు. దేవేంద్రుడు పంపగా వచ్చిన వాయుదేవుడు నూరు బంగారు పూలతో తయారైన దండను రామునకు వేశాడు. వివిధ మణులతో అలంకరించబడిన ముత్యాల హారాన్ని కూడా ప్రసాదించాడు.

అభిషేక సమయాన దేవతలు, గంధర్వులు గానము చేశారు. అప్సరస్త్రీలు నాట్యం చేశారు. ఆ సమయాన భూమి సస్యములతో శోభించింది. ఫలపుష్పాదులు, వృక్షాలు కళకళలాడాయి.

రాముడు ముందుగా లక్ష గుఱ్ఱాలను, క్రొత్తగా ఈనిన లక్ష గోవులను, వంద ఆబోతులను విప్రులకిచ్చాడు. తరువాత ముప్పైకోట్ల బంగారు నాణెములను, విలువైన ఆభరణాలను, వస్త్రాలను పండితులకు ఇచ్చాడు.

సూర్యతేజముతో భాసించే మాణిక్యఖచిత స్వర్ణమాలను రాముడు సుగ్రీవునికి బహూకరించాడు. వైడూర్యమణులతో, రత్నములతో కూడిన బాహుపురులను అంగదునకు బహూకరించాడు.

దివ్యమైన మణులు పొదిగిన ఒక ముత్యాల హారమును, రెండు శ్రేష్ఠమైన వస్త్రములను రాముడు సీతమ్మకు ఇచ్చాడు.

సీతమ్మ తన కంఠమునుండి హారమును తీసి రామునివైపు చూచి హనుమంతుని కిచ్చింది.

దివ్యమైన ముత్యాల హారమును చేతిలో పట్టుకొని అటూ ఇటూ రాముణ్ణి, వానరుల్ని చూచింది సీతమ్మ.

"సీతా! బలము, ధైర్యము, యశస్సు, నేర్పు, సామర్థ్యము ఎవరిలో సంపూర్ణంగా ఉన్నాయో, నీకు అధికానందమును కలిగించిన వారు ఎవరో వారికి ఆ హారమును ఇవ్వు" అన్నాడు రాముడు. వెంటనే సీతమ్మ ఆ హారమును హనుమంతున కిచ్చింది.

వానరశ్రేష్ఠు లందరూ కూడా విలువైన బహుమానాలు అందుకున్నారు. విభీషణుణ్ణి, సుగ్రీవుణ్ణి, హనుమంతుణ్ణి, జాంబవంతుణ్ణి, రాముడు గొప్పగా సన్మానించాడు. వాళ్ళందరూ రామునికి నమస్కరించి వారివారి స్థానాలకు వెళ్ళిపోయారు. వానరశ్రేష్ఠు లందరూ రామునకు నమస్కరించి కిష్కింధకు వెళ్ళారు. విభీషణుడు, రాక్షసశ్రేష్ఠులు లంకకు వెళ్ళారు.

రాముడు శత్రువులను జయించి రాజ్యాన్ని చక్కగా పరిపాలించాడు. ధర్మమూర్తి యైన రాముడు ఒకనాడు లక్ష్మణుని పిలిచి, "లక్ష్మణా! మన పూర్వీకులు ప్రసాదించిన ఈ రాజ్యాన్ని నాతో పాటు నువ్వు కూడా అనుభవించు. యౌవరాజ్యాభిషిక్తుడవై శోభిల్లు;" అన్నాడు.

లక్ష్మణుడు అందులకు అంగీకరించలేదు. రాముడు భరతుణ్ణి యువరాజుగా అభిషేకించాడు.

రాముడు అనేకసార్లు పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము, ఇంకా అనేక విధములైన యజ్ఞాలు చేశాడు.

రాముడు పదివేల సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు.

రామరాజ్యం - రామాయణం

రాముడు అనేక యజ్ఞాలను వైభవోపేతంగా నిర్వహించాడు. రామరాజ్యంలో స్త్రీలందరూ సుమంగళులే. క్రూరజంతువుల వలన బాధ కలిగేది కాదు. వ్యాధులు గోచరించేవి కావు.

చోరభయం లేకుండా ప్రజలు హాయిగా జీవించేవారు. పెద్దవాళ్ళు ఉండగా పిల్లలు మరణించేవారు కారు.

ప్రజలందరూ ధర్మమునందు ఆసక్తి కలిగి, ధర్మమును శ్రద్ధతో ఆచరించేవారు. రాముని తమ ధర్మజీవనముతో సంతృప్తి పరచాలని ప్రజలు భావించేవారు.

రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాః
రామ భూతం జగద భూ ద్రామే రాజ్యం ప్రశాసతి

"ఎక్కడ చూచినా, ఎప్పుడు చూచినా, రాముడు, రాముడు, రాముడు అంటూ ప్రజలు రాముని కథలే చెప్పుకుంటూ ఉండేవారు. ఆ కాలంలో జగత్తంతా రామమయంగా శోభించింది."

వృక్షములు ఫలపూర్ణములై, రోగరహితములై శోభించేవి. మేఘములు సకాలానికి వర్షించేవి. వాయువు సుఖస్పర్శ నందించేది. అసత్యము, అధర్మము కాగడాలతో వెతికినా అగుపించేవి కావు.

ఆదికావ్య మీదం చార్షం పురా వాల్మీకినా కృతమ్
పఠేద్యః శ్రుణుయాల్లోకే నరః పాపా త్ప్రముచ్యతే

"వాల్మీకి రచించిన ఈ రామాయణము ఆదికావ్యము. ధర్మసమ్మతము. కీర్తిని, ఆయుర్దాయమును, విజయమును ప్రసాదించే ఈ కావ్యమును ఎవరు పఠిస్తారో, ఎవ్వరు వింటారో వారు సర్వపాపముల నుండి విముక్తు లవుతున్నారు.

సంతానహీనులు సంతానవంతు లవుతారు. ధనహీనులు ధనవంతు లవుతారు. శత్రు భయం నశిస్తుంది. రామాయణమును గూర్చి, రాముని గూర్చి తెలిసికొనిన వారు దీర్ఘాయుర్దాయమును పొందుతారు.

రామాయణమును శ్రద్ధతో ఆలకించువారు కష్టాల్ని సుఖంగా దాటుతారు. రామాయణమును రచించువారు పుణ్యలోకాలను పొందుతారు.

ఆయుష్య మారోగ్యకరం యశస్యం
సౌభ్రాతృకం బుద్ధికరం శుభం చ
శ్రోతవ్య మేత న్నియమేన సద్భి
రాఖ్యాన మోజస్కర మృద్ధి కామైః

"ఓజస్కరమైన ఈ ఆఖ్యానము ఆయుర్దాయమును వృద్ధిచేస్తుంది. ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. కీర్తినిస్తుంది. సోదరప్రేమను పెంచుతుంది. సద్బుద్ధిని కల్గిస్తుంది. మంగళకరమైన గొప్ప తేజస్సును వృద్ధి చేస్తుంది. సమృద్ధిని కోరు వారందరూ ఈ రామాయణాన్ని వినాలి. చదవాలి. వ్రాయాలి. వ్రాయించాలి."

ఓం శ్రీరామార్పణమస్తు



నివేదన

శ్రీమద్రామాయణం

ఎందరో వ్రాశారు. మరెందరో వ్యాఖ్యానించారు. రామాయణంపై ఎంతో వ్రాసిన వారు కూడా రచన పూర్తికాగానే, వ్రాయాలనుకున్న దేదో వ్రాయలేక పోయినట్లు వెలితిని వాటేసుకుంటారు. రామాయణ వైభవాన్ని పూర్ణంగా వివరించ గలిగినట్లు గతంలో ఎవ్వరూ భావించలేదు. భవిష్యత్తులో భావించరు కూడా.

ఎందరు చెప్పినా, ఎంతగా చెప్పినా వింతలూరే విచిత్ర కావ్యం రామాయణం.

రుచి పుట్టేలాగ ఎందరో చెప్పారు. అభిరుచి కదిలేలాగ మరెందరో వ్రాశారు. కానీ సంతృప్తి కలిగేలా చెప్పలేక పోయినట్లు అందరూ భావించారు.

రామాయణ రచయితల కందరికీ సాధ్యపడింది, సాధ్యమైనది ఒకటే. పదికాలాలకు పనికొచ్చే ప్రసాదాన్ని పదిమందికి పంచగలిగామనే తృప్తి. జీవితంలో ఒక మంచిపని చేశామనే సంతృప్తి.

రామాయణ ప్రాశస్త్యాన్ని

రాముని ప్రాభవాన్ని

వాల్మీకి వైభవాన్ని

నా బుద్ధికి దొరికినంత వరకు లోకానికి అందించాలని ఆరాటపడి ఈ రచన చేశాను.

రాముడు రాయించాడు. శ్యాముడు పలికించాడు. పుణ్యఫల విశేషంతో పనిముట్టుగా మిగిలాను. ఉడుతను కావాలని శ్రమించాను.

ఈ రచన ఐదు మాసాలు సాగింది. అది కూడా మధ్య మధ్య ప్రయాణాలు, ప్రసంగాలు వదుస్తూ. సుమారు ఏడువందల ఏనభై గంటలు కూర్చుని వ్రాశాను.

చాలా కష్టమే పడ్డాను. కానీ, అది కష్ట మనిపించలేదు. అదే రామకథలోని విశేషం. రచనాకాలంలో నా హృదయంలో చెప్పలేని ప్రశాంతత గూడు కట్టుకుంది.

విరమించబోయే ముందు మీకు ఒక్క విషయాన్ని విన్నవించా లనుకుంది నా కలం.

ఇది రామ కథ

వాల్మీకి రచన

రామానుగ్రహంతో ఈ అదృష్టం నాకు లభించింది. దేశకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సామాజికస్పృహతో కూడిన తత్త్వావగాహనతో ఈ గ్రంథాన్ని రచించాను.

మధ్యమధ్య ఎన్నో గ్రంథాలను ఉటంకిస్తూ సాగాను. ఎందరి భావాలనో స్పృశిస్తూ, స్తుతిస్తూ, వ్యాఖ్యానిస్తూ, విభేదిస్తూ నడిచాను.

వీటన్నిటి వెనుక సద్భావనే గాని మరొకటి లేదని సవినయంగా విన్నవించు కుంటున్నాను.

'రామ' అన్నవారందరూ నాకు స్మరణీయులు.

రామాయణాన్ని వ్రాసిన వారందరూ నాకు ప్రాతఃస్మరణీయులు. చైతన్య రామాయణంలో విమర్శలు లేవు. అన్నీ పరామర్శలే.

ఈ రచనకు గతంలో నేను పఠించిన గ్రంథాలు, బాల్యము నుండి పోగించిన ఊహలు నాకు తోడుగా ఉండి సహకరించాయి.

నన్ను ప్రభావితం చేసిన గ్రంథాలకు వందన మంటున్నాను. నాపై ప్రభావాన్ని చూపిన గ్రంథకర్తలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

అంతేకాదు.

ఈ గ్రంథం ప్రారంభించినది మొదలు నేటివరకు ఈ మహాగ్రంథ ముద్రణలో ఎవరు ఏవిధంగా సహకరించినా వారందరికీ శతవిధాల కృతజ్ఞుణ్ణి.

ఆత్మబంధువులారా!

గ్రంథాన్ని చదివారు, ఇక చెయ్యవలసింది మననం.

నా విషయ మంటారా!

నాకు కావలసింది రాముని అనుగ్రహం.

రామభక్తుల ఆశీర్వాదం. అంతే. త్వరలో "ఉత్తర"* తీరాన కలుస్తాం.

అంతవరకు సెలవు.

వాల్మీకి కుటీరం	బుధజన విధేయుడు
సుందర చైతన్యాశ్రమం	మీ
21-12-'94	స్వామి సుందర చైతన్యానంద
ఉదయం: 5 గం॥	

*'ఉత్తరకాండ' ను త్వరలో భక్తులకు అందించాలి అనే అభిలాష ఉంది పూజ్యస్వామీజీకి- ప్రకాశకులు.



శ్రీరామాష్టకమ్



రచన : వ్యాస భగవానుడు

దశరథునికి ఆదర్శ పుత్రుడుగా, సీతాదేవికి ఆదర్శభర్తగా, లక్ష్మణునికి ఆదర్శ సోదరుడుగా, సుగ్రీవునికి ఆదర్శ స్నేహితుడుగా వసిష్ఠుని చెంత ఆదర్శ శిష్యుడుగా, పవనసుతుని చెంత ఆదర్శ గురువుగా, దశకంఠునికి ఆదర్శ శత్రువుగా, విభీషణునికి ఆదర్శ రక్షకుడుగా నిలచిన ధర్మమూర్తి శ్రీరామచంద్రమూర్తి. కళ్యాణగుణ సంపన్నుడైన రామభద్రుని ఆశ్రయించి, అర్చించిన భక్తులు గుణవంతులై, తదుపరి గుణాతీతులై మనగలరు. సంసార దుఃఖములను పోగొట్టి ఆధ్యాత్మికానుభూతిని పొంది తరించేందుకై శ్రీ వ్యాసభగవానుడు ఈ అష్టకములో శ్రీరాముని భజించుచున్నాడు. మనమూ స్మరించి, కీర్తించి, తరించెదము గాక!

భజే విశేష సుందరం సమస్త పాప ఖండనం
స్వభక్త చిత్తరంజనం సదైవ రామ మద్వయమ్ 1

మిక్కిలి సౌందర్యరూపుడు, సర్వ పాపములను నశింప చేయువాడు, తన భక్తుల మానసములను రంజింప చేయువాడు, అద్వయ సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజించుచున్నాను.

జటాకలాప శోభితం సమస్త పాపనాశకం
స్వభక్త భీతి భంజనం భజేహ రామ మద్వయమ్ 2

జటాజూటముచే ప్రకాశించువాడు, సర్వపాపములను నశింపచేయువాడు, తన భక్తులలోని భీతిని నశింపచేయువాడు అగు అద్వయ సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజించుచున్నాను.

నిజస్వరూప బోధకమ్ కృపాకరం భవాపహం
సమం శివం నిరంజనం భజేహ రామ మద్వయమ్ 3

ఆత్మస్వరూపమును బోధించువాడు, దయాస్వరూపుడు, సంసారబంధమును తొలగించువాడు, పరబ్రహ్మ స్వరూపుడు, శుభకరుడు, నిరంజనుడు అగు సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజించుచున్నాను.

అసత్ప్రపంచ కల్పిత హ్యనామ రూప వాస్తవం
నిరాకృతిం నిరామయం భజేహ రామ మద్వయమ్ 4

అసత్య ప్రపంచములో అవాస్తవమైన నామరూపములను కల్పించుకొనిన వాడు, ఆకృతి లేనివాడు, నిరామయుడు అగు సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజించుచున్నాను.

నిష్ప్రపంచ నిర్వికల్ప నిర్మలం నిరామయం
చిదేకరూప సంతతం భజేహ రామ మద్వయమ్ 5

ప్రపంచాతీతుడు, వికల్పము లేనివాడు, మలదోషము లంటనివాడు, నిరామయుడు, సదా చిత్స్వరూపుడై వెల్గొందువాడు అగు సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజించుచున్నాను.

భవాబ్ధిపోతరూపకం హ్యశేష దేహకల్పితం
గుణాకరం కృపాకరం భజేహ రామ మద్వయమ్ 6

భవసాగరమును దాటించుటకు నావ వంటివాడు, కల్పిత దేహధారుడు, సుగుణాల రాముడు, దయాస్వరూపుడు అగు సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజించుచున్నాను.

మహావాక్య బోధకై ర్విరాజ మానాశాక్పదై:
పరబ్రహ్మ వ్యాపకం భజేహ రామ మద్వయమ్ 7

మహావాక్యములచే తెలియబడువాడు, వేదవాక్కుల ద్వారా వర్ణింపబడినవాడు, పరబ్రహ్మస్వరూపుడు, సర్వవ్యాపకుడు అగు సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజింతును.

శివప్రదం సుఖప్రదం భవిచ్ఛిదం భ్రమాపహం
విరాజమాన దైశికం భజేహ రామ మద్వయమ్ 8

మంగళదాయకుడు, సుఖదాయకుడు, సంసారమును నశింప చేయువాడు, భ్రమజీవనము నంతమొందించువాడు, ప్రకాశమాను డైనవాడు అగు సత్తాస్వరూపుడైన శ్రీరాముని భజింతును.

ఫలశ్రుతి

రామాష్టకం పఠంతి యస్సుకరం సుపుణ్యం
వ్యాసేన భాషిత మిదం శృణుతే మనుష్య:
విద్యాం శ్రియం విపుల సౌఖ్య మనంత కీర్తిం
సంప్రావ్య దేహావిలయే లభతే చ మోక్షమ్

సులభమైనది, పుణ్యప్రదమైనది, వ్యాసప్రోక్తమైనది అగు ఈ రామాష్టకమును ఎవడు శ్రద్ధతో పఠించునో, శ్రవణము చేయునో అట్టి మనుష్యుడు విద్యను, సంపదను, మహదానందమును, అనంతకీర్తిని పొంది, దేహము నశించిన పిదప మోక్షమును పొందుచున్నాడు.

శ్రీరామ భుజంగ ప్రయాత స్తోత్రమ్

రచన : ఆదిశంకరులు

విశుద్ధం పరం సచ్చిదానంద రూపం
గుణాధార మాధార హీనం వరేణ్యమ్
మహాన్తం విభాన్తం గుహాన్తం గుణాన్తం
సుఖాన్తం స్వయంధామ రామం ప్రపద్యే ॥ 1

పరిశుద్ధ మైనవాడు, ఉత్కృష్టుడు, సచ్చిదానంద రూపుడు, గుణాధారుడు,తన కంటూ ఏ ఆధారము లేనివాడు, విశిష్టుడు, శ్రేష్ఠుడు, ప్రకాశైక రూపుడు, హృదయాంతర్వాసి, గుణాంతర్వాసి, సుఖాంతుడు, స్వయంజ్యోతి రూపుడగు శ్రీరామచంద్రుని సేవింతును.

శివం నిత్యమేకం విభుం తారకాఖ్యం
సుఖాకార మాకార శూన్యం సుమాన్యమ్
మహేశం కలేశం సురేశం పరేశం
వరేశం నిరీశం మహీశం ప్రపద్యే ॥ 2

శివుడు, నిత్యుడు, అద్వయుడు, ఈశుడు, తారకనాముడు, సుఖరూపుడు, నిరాకారుడు, మాన్యుడు, మహేశుడు, కళేశుడు, సురేశుడు, పరేశుడు, నరేశుడు, నిరీశ్వరుడు, మహీశుడు వగు శ్రీరామభద్రుని సేవింతును.

యదావర్ణ యత్కర్ణ మూలేఽన్తకాలే
శివో రామ రామేతి రామేతి కాశ్యామ్
తదేకం పరం తారక బ్రహ్మరూపం
భజేహం భజేహం భజేహం భజేహమ్ ॥ 3

ప్రాణోత్క్రమణ సమయాన కాశీక్షేత్రమునందు జనుల చెవులలో మహేశ్వరుడు "రామ, రామ, రామ" అని ఉపదేశించును. అదియే శ్రేష్ఠమైన తారకబ్రహ్మ మంత్రము. ఆ శ్రీరామునే నేను మాటిమాటికి భజింతును.

మహారత్నపీఠే శుభే కల్పమూలే
సుఖాసీన మాదిత్యకోటి ప్రకాశమ్
సదా జానకీ లక్ష్మణోపేత మేకం
సదా రామచన్ద్రం భజేహం భజేహమ్ ॥ 4

కల్పవృక్షమూలమున రత్న సింహాసనముపై సుఖముగా ఆసీన మైనవాడు, కోటిసూర్యసమ ప్రభావుడు, సదా సీతాలక్ష్మణులతో కూడియున్నవాడు అగు శ్రీరామచంద్రుని భజింతును.

క్వణద్రత్న మంజీర పాదారవిన్దం
లసన్మేఖలా చారు పీతామ్బరాఢ్యమ్
మహారత్నహారోల్లస త్కౌస్తుభాంగ
నదచ్చ ఞ్చరీ మఞ్జరీలోల మాలమ్ ॥ 5

శబ్దములో గూడిన రత్నమంజీరములతో కూడిన పాదపద్మములు కలవాడు, మెరయుచున్న మేఖల తోడి పీతాంబరము కలవాడు, గొప్పవి యగు రత్నహారములు, కౌస్తుభ మాణిక్యము ధరించినవాడు, తుమ్మెదల ధ్వనులతో కూడిన పుష్పహారములు కలవాడునగు శ్రీరాముని భజింతును.

లసచ్చన్ద్రి కాస్మేర శోణా ధరాభం
సముద్యత్పతం గేన్దు కోటి ప్రకాశమ్
నమద్బ్రహ్మ రుద్రాది కోటీర రత్న
స్ఫురత్కాన్తి నీరాజ నారాధి తాంఘ్రిమ్ ॥ 6

వెన్నెల వంటి చిరునవ్వుతో పాటు ఎఱ్ఱని పెదవులు కలవాడు, కోటి శశి సూర్యుల కాంతి గలవాడు, ప్రణమిల్లు బ్రహ్మరుద్రాదుల కిరీట రత్న కాంతులచే నీరాజన మీయబడు చరణ కమలములు గలవాడు నగు శ్రీరాముని సేవింతును.

పురః ప్రాంజలీ నాంజనేయాది భక్తా
న్స్వచిన్ముద్రయా భద్రయా బోధయన్తమ్
భజేఽహం భజేఽహం సదా రామచన్ద్రం
త్వదన్యం న మన్యే నమన్యే నమన్యే ॥ 7

ఆంజనేయాది భక్తులు ముకుళితహస్తులై ఎదుట నిలువగా, శుభమగు చిన్ముద్రతో వారికి బోధ చేయుచున్న శ్రీరాముని సేవింతును. ఓ రామా! నీకంటె అన్యులైన దేవతలను నేను ముమ్మాటికి భావించనే భావించను.

యదా మత్సమీపం కృతాన్తః సమేత్య
ప్రచణ్డ ప్రకోపై ర్భటై ర్భీషయే న్మామ్
తదావిష్కరోషి త్వదీయం స్వరూపం
సదాపత్ప్రణాశం స కోదణ్డ బాణమ్ 8

రామా! యముడు నన్ను సమీపించి, భయంకరమైన తన భటులచే భయపెట్టునపుడు నీవు కోదండధారివియై నీదివ్యరూపమును చూపుచు ప్రత్యక్షమై నా ఆపదను తొలగించుము.

నిజే మానసే మన్దిరే సన్నిధేహి
ప్రసీద ప్రసీద ప్రభో రామచన్ద్ర
న సౌమిత్రాణాకైకయీ నన్దనేన
స్వశక్త్యాను భక్త్యా చ సంసేవ్యమాన ॥ 9

హే ప్రభూ! రామచంద్రా! భక్తులు, భరతలక్ష్మణులు నిన్ను సేవించు రూపముతో నీవు నా హృదయమందిరమున నిలిచి, నన్ను అనుగ్రహింపుము.

స్వభక్తాగ్రగణ్యైః కపీశై ర్మహీశై
రనీకై రనేకైశ్చ రామ ప్రసీద
నమస్తే నమో స్త్వీశ రామ ప్రసీద
ప్రశాధి ప్రశాధి ప్రకాశం ప్రభోమామ్ ॥ 10

ఓ రామభద్రా! భక్తశ్రేష్ఠులగు కపీశ్వరులతో, మహేశులతో కూడి నన్ను అనుగ్రహింపుము. నాకు సేవలను ప్రసాదింపుము. రామచంద్రా! నన్ననుగ్రహించి శాసింపుము.

త్వమేవాసి దైవం పరం మే యదేకం
సు చైతన్యమే తత్త్వదన్యం న మన్యే
యతో భూదమేయం వియద్వాయు తేజో
జలో వ్యాదికార్యం చరం చాచరం చ ॥ 11

పంచభూతములు మరియు ఈ చరాచర జగత్తు ఎవని నుండి ఆవిర్భవించినదో, ఏకమును, అమేయమును అగు దైవము నీవే. చైతన్య రూపుడవు నీవే. నీకంటె అన్యమును నేనెరుగను.

నమః సచ్చిదానంద రూపాయ తస్మై
నమో దేవదేవాయ రామాయ తుభ్యమ్
నమో జానకీ జీవితేశాయ తుభ్యం
నమః పుణ్డరీకాయ తాక్షాయ తుభ్యమ్ ॥ 12

రామా! నీవు సచ్చిదానందరూపుడవు. నీకు నమస్కృతులు. నీవు దేవదేవుడవు. జానకీ ప్రాణేశుడవు. పద్మముల వంటి విశాలమైన నేత్రములు గలవాడవు. నీకు నమస్కారము.

నమో భక్తియుక్తానురక్తాయ తుభ్యం
నమః పుణ్య పుంజైక లభ్యాయ తుభ్యమ్
నమో వేదవేద్యాయ చాద్యాయ పుంసే
నమః సున్దరా యేన్దిరా వల్లభాయ ॥ 13

భక్తుల యందు అనురాగముగల ఓ రామా! నీకు వందనములు. కేవలము పుణ్యముల చేతనే లభ్యము గాని నీవు దేవదేవుడవు. వేదవేద్యుడవు. ఆద్యపురుషుడవు. సుందరుడవు. ఇందిరావల్లభుడవు. నీకు నమస్కృతులు.

నమో విశ్వకర్త్రే నమో విశ్వహర్త్రే
నమో విశ్వభోక్త్రే నమో విశ్వ మాత్రే
నమో విశ్వనేత్రే నమో విశ్వజేత్రే
నమో విశ్వ పిత్రే నమో విశ్వమాత్రే ॥ 14

నీవు విశ్వకర్తవు. విశ్వహర్తవు. విశ్వభోక్తవు. విశ్వమాతవు. విశ్వనేత్రుడవు. విశ్వజేతవు. విశ్వపితవు. నీకు నమస్కృతులు.

నమస్తే నమస్తే సమస్త ప్రపంచ
ప్రభోగ ప్రయోగ ప్రమాణ ప్రవీణ
మదీయం మనస్త్వత్పదద్వన్ద్వ సేవాం
విధాతుం ప్రవృత్తం సు చైతన్య సిద్ధ్యై ॥ 15

సమస్త ప్రపంచ ప్రభోగ ప్రయోగ ప్రమాణముల ప్రవీణుడగు ఓ రామా! నీకు నమస్కారము. చైతన్యసిద్ధికై నా చిత్తము నీ పాదపద్మయుగ్మములను సదా సేవించుచున్నది.

శిలాపిత్వదంఘ్రి క్షమా సంగిరేణు
ప్రసాదాద్ధి చైతన్య మాధత్తరామ
నర స్త్వత్పదద్వన్ద్వ సేవా విధానా
త్సు చైతన్య మే తీతికిం చిత్రమత్ర ॥ 16

ఓ రామా! నీ పాదరజోలేశము వలన స్థాణువు కూడ చైతన్యవంత మైనది. నీ పాదపద్మములను సేవించిన మానవునకు విశిష్ట చైతన్యము లభించుటలో ఆశ్చర్య మేమున్నది?

పవిత్రం చరిత్రం విచిత్రం త్వదీయం
నరాయేస్మరన్త్య న్వహం రామచన్ద్ర
భవన్తం భవాన్తం భరన్తం భజన్తో
లభన్తే కృతాన్తం న పశ్యన్త్యతోన్తే ॥ 17

ఓ రామచంద్రా! నీ చరిత్ర పవిత్రమైనది. విచిత్ర మైనది. నిరంతరము నిన్ను స్మరించు మానవులు సంసారము నుండి విముక్తులు కాగలరు. వారికి యమదర్శనము ఉండదు.

సపుణ్యః సగణ్యః శరణ్యో మమాయం
నరో వేదయో దేవ చూడామణిం త్వామ్
సదాకార మేకం చిదానన్ద రూపం
మనో వాగగమ్యం పరంధామ రామ ॥ 18

దేవచూడామణివియు, సదాకారుడవును, చిదానందైక రూపుడవును, మనోవాగాతీతుడవు, పరంధాముడవు అగు ఓ రామా! నిన్ను ఎవడు తెలుసుకొనునో వాడే పుణ్యాత్ముడు. వాడే గణనీయుడు. నాకు శరణ్యుడు.

ప్రచణ్డ ప్రతాప ప్రభావాభి భూత
ప్రభూతారి వీర ప్రభో రామచన్ద్ర
బలంతే కథం వర్ణ్యతే తీవ బాల్యే
యతో ఖణ్డి చణ్డీశ కోదణ్డ దణ్డః ॥ 19

ఓ రామచంద్రా! నీవు బాల్యముననే గొప్పదైన శివధనుస్సును భగ్నము చేసిన పరాక్రమవంతుడవు. నీ ప్రచండ ప్రతాప ప్రభావమున గొప్ప వీరులను జయించుట అసాధ్యమా? నీ ప్రతాపము నేను వర్ణింపగలనా?

దశగ్రీవ ముగ్రం స పుత్రం స మిత్రం
సరిద్దుర్గ మధ్యస్థ రక్షో గణేశమ్
భవన్తం వినా రామవీరో నరో వా
సురోవా మరో వాజయే త్కస్త్రిలోక్యామ్ ॥ 20

ఓ రామా! నిన్ను విడిచి మానవులలో గాని, రాక్షసులలో గాని, దేవతలలో గాని, ఏ వీరుడైననూ పుత్రమిత్రాదులతో కూడ, సరిద్దుర్గ మధ్యమున వున్న రాక్షసనాయకుడగు రావణుని జయింపగలడా? ఈ కార్యము నీకు తప్ప ముల్లోకముల యందు మరొకరికి సాధ్యము కాదు.

సదా రామ రామేతి రామామృతం తే
సదా రామ మానన్ద నిష్యన్ద కన్దమ్
పిబన్తం నమన్తం సుదన్తం హసన్తం
హనూమన్త మన్తర్భజేతం నితాన్తమ్ ॥ 21

రామా! ఆనంద పూర్ణమైన "రామ-రామ" అనెడి నీ నామామృతమును సదా పానము చేయుచూ, వినమ్రుడై, చక్కని దంతములు గలిగి మందస్మితుడైన ఆంజనేయుని నా చిత్తమున మిక్కిలి సేవింతును.

సదారామ రామేతి రామామృతం తే
సదారామ మానన్ద నిష్యన్ద కన్దమ్
పిబన్న న్వహం నన్వహం నైవ మృత్యో
ర్బిభేమి ప్రసాదా దసాదాత్త వైవ॥ 22

నిరంతరమూ ఆనందరసమును స్రవింపచేయు "రామ-రామ-రామ" అనెడి నామసుధా రసమును నిత్యము పానము చేయుచున్న నేను చావునకు భయపడను. నీ అనుగ్రహము వలన నేను నిర్భయుడ నైతిని.

లసీతా సమేతైర కోదణ్డ భూషై
రసౌమిత్రి వన్ద్యై రచణ్డ ప్రతాపైః
అలంకేశకాలైర సుగ్రీవ మిత్రై
రరామాభిధే యైరలం దైవ తైర్న ॥ 23

సీతా సమేతులు కానివారు, కోదండము లేనివారు, లక్ష్మణునిచే పూజింపబడనివారు, చండప్రతాపము లేనివారు, రావణాసురునికి మృత్యురూపము కానివారు, సుగ్రీవునికి మిత్రులు కానివారు, రామాభిధానము లేనివారైన దేవతల వలన ఉపయోగ మేమున్నది?

అవీరాసన స్థైర చిన్ముద్రికాడ్యై
రభక్తాంజనేయాది తత్వప్రకాశైః
అమన్దార మూలై రమన్దార మాలై
రరామాభిధేయై రలం దైవతైర్నః 24

వీరాసనము నందు ఆసీనులు కానివారు, చిన్ముద్ర లేనివారు, ఆంజనేయాది భక్తులవలె తత్వప్రకాశులు కానివారు, కల్పవృక్షమూలమున నివసింపనివారు, మందారమాలను ధరింపని వారు, రామాఖ్య లేనివారు అగు దేవతల వలన ఏమి ఉపయోగము?

అసిన్ధు ప్రకోపై రవన్ద్య ప్రతాపై
రబన్ధు ప్రయాణైర మన్దస్మితాఢ్యైః
అదణ్డ ప్రవాసై రఖణ్డ ప్రబోధై
రరామాభిధేయై రలం దైవతైర్నః ॥ 25

సాగరుని పై కోపమును ప్రకటించనివారు, గొప్ప ప్రతాపము లేనివారు, బంధువులతో ప్రయాణము చేయనివారు, చిరునవ్వుకు నోచుకోనివారు, దండప్రవాసము చేయనివారు, రామాఖ్య లేనివారు, అఖండ ప్రబోధము లేని దేవతల వలన ఏమి ప్రయోజనము?

హరేరామ సీతాపతే రావణారే
ఖరారే మురారే సురారే పరేతి
లపన్తం నయన్తం సదా కాలమేవం
సమాలోకయా లోకయా శేషబన్ధో ॥ 26

ఓ హరీ! సీతాపతే! రావణసూదనా! ఖరారీ, మురారీ, అసురారీ, పరమాత్మా అని సదా పిలుచుచున్న నన్ను వీక్షింపుము. అశేష ప్రాణులకు బంధువైన రామప్రభూ! నన్ను కరుణింపుము.

నమస్తే సుమిత్రా సుపుత్రాభివన్ద్య
నమస్తే సదా కైకయీ నన్దనేడ్య
నమస్తే సదా వానరాధీశ వన్ద్య
నమస్తే నమస్తే సదా రామచంద్రా ॥ 27

సుమిత్రా స్తుతులచే స్తుతింపబడు దేవా! నమస్కారము. భరతునిచే స్మరింపబడు స్వామీ! వందనము. ఆంజనేయునిచే ఆరాధింపబడు తండ్రీ! నమస్కారము. రామచంద్రా! నీకు సదా నమస్కృతులు.

ప్రసీద ప్రసీద ప్రచణ్డ ప్రతాప
ప్రసీద ప్రసీద ప్రచణ్డారికాల
ప్రసీద ప్రసీద ప్రపన్నాను కమ్పిన్
ప్రసీద ప్రసీద ప్రభో రామచంద్రా ॥ 28

ప్రచండ ప్రతాపుడవగు ఓ రామభద్రా! కరుణింపుము. భయంకర శత్రువులకు యముడా! అనుగ్రహింపుము. ప్రపన్నుల ఎడ దయగల దేవా! రక్షింపుము. రామచంద్రప్రభూ! మమ్మనుగ్రహింపుము.

భుజంగ ప్రయాతం పరం వేదసారం
ముదా రామచన్ద్రస్య భక్త్యా చ నిత్యమ్
పఠన్సన్తతం చిన్తయ న్స్వాన్తరంగే
స ఏవ స్వయం రామచన్ద్రః స ధన్యః ॥ 29

ఉత్కృష్టమైన ఈ భుజంగ ప్రయాత వృత్తములు సారభూత మైనవి. రామభక్తి గలిగి, నిత్యము దీనిని పఠించుచూ అంతరంగమున ధ్యానమగ్నుడై ఉండు వాడు స్వయముగా రామచంద్రుడే యగును. అట్టివాడే ధన్యుడు.

శ్రీమచ్ఛంకర భగవత్పూజ్యపాద విరచిత
శ్రీరామ భుజంగ ప్రయాత స్తోత్రమ్
సంపూర్ణమ్





శ్రీరామరక్షా స్తోత్రము

ధ్యాయే దాజానుబాహుం ధృతశరధనుషం బద్ధ పద్మాసనస్థం
పీతం వాసోవసానం నవకమలదళస్పర్ధినేత్రం ప్రసన్నమ్
వామాంకారూఢ సీతాముఖకమల మిలల్లోచనం నీరదాభం
నానాలంకార దీప్తం దధతమురు జటామండలం రామచంద్రమ్

ఆజానుబాహువు, ధనుర్బాణములు ధరించినవాడు, పద్మాసనస్థుడు, పీతాంబరధారి, నవకమలదళముల బోలిన నేత్రములవాడు, ప్రసన్నరూపుడు, వామభాగమున కూర్చొనియున్న సీతాదేవి ముఖకమలమును వీక్షించువాడు, నీలమేఘశ్యాముడు, వివిధ అలంకారములచే శోభించువాడు, విశాలమైన జటాజూటమును ధరించిన శ్రీరామచంద్రుని ధ్యానించవలెను.

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్ ।
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్ ॥

శ్రీ రఘునాథ చరితము నూరుకోట్లుగ విస్తరించి యున్నది. అందలి ప్రతి అక్షరము నరుల ఘోరపాపములను నశింపచేయగలదు.

ధ్యాత్వా నీలోత్పలశ్యామం రామం రాజీవలోచనమ్ ।
జానకీ లక్ష్మణోపేతం జటాముకుట మండితమ్ ॥
సాసితూణ ధనుర్బాణ పాణిం నక్తం చరాంతకమ్ ।
స్వలీలయా జగత్త్రాతు మావిర్భూత మజం విభుమ్ ॥

నల్లకలువను పోలిన శ్యామవర్ణము కలవాడు, పద్మలోచనుడు, సీతాలక్ష్మణసమేతుడు, జటనే కిరీటముగ కలిగి శోభించువాడు, ఖడ్గము, ధనుర్బాణములు, అంబులపొది చేతులయందు కలవాడు, నిశాచరులను సంహరించువాడు, తన లీలలచే జగత్తును రక్షించుటకు అవతరించిన పుట్టుక లేని, సర్వాంతర్యామి యగు శ్రీరాముని ధ్యానించి,

రామరక్షాం పఠేత్ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదామ్ ।
శిరో మే రాఘవః పాతు భాలం దశరథాత్మజః ॥

ప్రాజ్ఞుడగువాడు పాపములను నశింపజేయునది, సమస్త కోరికలను ఈడేర్చునది అయిన రామరక్షా స్తోత్రమును పఠించవలెను. నా శిరస్సును శ్రీరాముడు రక్షించుగాక! నా నుదురుభాగమును దాశరథి కాపాడుగాక!

కౌసల్యేయో దృశౌ పాతు విశ్వామిత్ర ప్రియః శ్రుతీ ।
ఘ్రాణం పాతు మఖ త్రాతా ముఖం సౌమిత్రి వత్సలః ॥

కౌసల్యాతనయుడైన శ్రీరాముడు నా నేత్రములను రక్షించుగాక! ఆ విశ్వామిత్ర ప్రియుడు నా చెవులను కాపాడుగాక! యాగసంరక్షకుడైన రాఘవుడు నా నాసికమును రక్షించుగాక! ఆ లక్ష్మణవత్సలుడు నా ముఖమును కాపాడుగాక!

జిహ్వాం విద్యానిధిః పాతు కంఠం భరతవందితః ।
స్కంధౌ దివ్యాయుధః పాతు భుజౌ భగ్నేశకార్ముకః ॥

సర్వవిద్యాసంపన్నుడైన రఘురాముడు నా నాలుకను రక్షించుగాక! భరతునిచే నమస్కరింపబడు రాఘవుడు కంఠమును కాపాడుగాక! మూపులను దివ్యాస్త్రములను కలిగిన శ్రీరాముడు రక్షించుగాక! శివధనుర్భంగము గావించిన రామచంద్రుడు భుజములను కాపాడుగాక!

కరౌ సీతాపతిః పాతు హృదయం జామదగ్న్యజిత్ ।
మధ్యం పాతు ఖరధ్వంసీ నాభిం జాంబవదాశ్రయః ॥

జానకీపతియైన శ్రీరాముడు హస్తములను రక్షించుగాక! జమదగ్ని తనయుడైన పరశురాముని జయించిన రాఘవేంద్రుడు హృదయమును కాపాడుగాక! ఖరుని హరించిన రామప్రభువు మధ్యభాగమును రక్షించుగాక! నాభిప్రదేశమును, జాంబవంతునకు ఆశ్రయస్థానమైన రామచంద్రుడు కాపాడుగాక!

సుగ్రీవేశః కటీ పాతు సక్థినీ హనుమత్ప్రభుః ।
ఊరూ రఘూత్తమః పాతు రక్షః కుల వినాశకృత్ ॥

సుగ్రీవునికి అధిపతియైన శ్రీరాముడు కటిప్రదేశమును, హనుమంతునికి ప్రభువైన సీతారాముడు పాదమూలములను రక్షించుగాక! రాక్షస కులాంతకుడైన, రఘుకులశ్రేష్ఠుడు తొడలను రక్షించుగాక!.

జానునీ సేతుకృత్పాతు జఙ్ఘే దశముఖాంతకః ।
పాదౌ విభీషణ శ్రీదః పాతు రామోఽఖిలం వపుః ॥

ఉదధిపై వారధిని నిర్మించిన రఘురాముడు మోకాళ్ళను, రావణసంహారకుడైన శ్రీరాముడు పిక్కలను రక్షించుగాక! విభీషణునికి సంపదలను ప్రసాదించిన రామచంద్రుడు, పాదములను కాపాడుగాక! శరీర మంతటిని రాఘవుడు రక్షించుగాక!

ఏతాం రామబలోపేతాం రక్షాం యః సుకృతీ పఠేత్ ।
స చిరాయుః సుఖీ పుత్రీ విజయీ వినయీ భవేత్ ॥

రామశక్తి ప్రపూర్ణమైన ఈ రామరక్షాస్తోత్రమును ఏ సుకృతాత్ముడు పఠించునో అతడు దీర్ఘాయుష్మంతుడై, సంతానవంతుడు, విజయుడు, వినయశీలుడు అయి సుఖించగలడు.

పాతాళ భూతల వ్యోమ చారిణ శ్చద్మ చారిణః ।
న ద్రష్టుమపి శక్తా స్తే రక్షితం రామనామభిః ॥

భూ, భువన, పాతాళ లోకములలో చరించే భూత ప్రేతాదు లేవియును రామనామముల స్మరణచే రక్షింపబడు వారిని చూచుటకు కూడ శక్తులు కావు.

రామేతి రామభద్రేతి రామచంద్రేతి వా స్మరన్ ।
నరో న లిప్యతే పాపై ర్భుక్తిం ముక్తిం చ విందతి ॥

రామా! రామభద్రా! రామచంద్రా! అని స్మరించు నరుడు పాపములచే అంటబడకుండుటయే గాక, భుక్తిని, ముక్తిని కూడ పొందును.

జగజ్జైత్రైక మంత్రేణ రామనామ్నాభి రక్షితమ్ ।
యః కంఠే ధారయేత్తస్య కరస్థాః సర్వ సిద్ధయః ॥

జగత్తు నంతటిని జయించగల రామనామములను కంఠమున ధరించి, వానిచే రక్షింప బడువానికి సర్వసిద్ధులు చేతియందే కలవు.

వజ్రపఞ్జర నామేదం యో రామకవచం స్మరేత్ ।
అవ్యాహతాజ్ఞః సర్వత్ర లభతే జయమంగలమ్ ॥

వజ్రపంజరము వంటి ఈ రామకవచమును ఎవరు స్మరింతురో వారి ఆజ్ఞకు తిరుగుండదు. అన్ని చోట్ల వారు విజయమును, శుభమును పొందెదరు.

ఆదిష్టవాన్యథా స్వప్నే రామరక్షా మిమాం హరః ।
తథా లిఖితవాన్ప్రాతః ప్రబుద్ధో బుధకౌశికః ॥

ఈ రామరక్షా స్తోత్రమును శివుడు స్వప్నములో ఏవిధముగ ఉపదేశించెనో అదే విధముగ బుద్ధిమంతుడైన బుధకౌశికుడు ఉదయము వ్రాసెను.

ఆరామః కల్పవృక్షాణాం విరామః సకలాపదామ్ ।
అభిరామ స్త్రిలోకానాం రామః శ్రీమా న్స నః ప్రభుః ॥

కోరినవానిని కల్పించు కల్పతరువుల వనము వంటివాడు, సర్వ ఆపదలను హరించువాడు, ముల్లోకములకు ముదమొనగూర్చువాడు అయిన శ్రీమంతుడగు రాముడు మా ప్రభువు.

తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ ।
పుండరీక విశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ ॥

యువకులు, రూపసంపన్నులు, సుకుమారులు, గొప్ప శక్తిమంతులు, కమలముల వంటి విశాలనేత్రములు గలవారు, నారవస్త్రములను, కృష్ణాజినమును ధరించిన వారు,

ఫల మూలాశినౌ దాంతౌ తాపసౌ బ్రహ్మచారిణౌ ।
పుత్రౌ దశరథస్యైతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ ॥

ఫలమూలములను భుజించువారు, దమముతో భాసించువారు, తాపసులు, బ్రహ్మచారులు, దశరథతనయులు, సోదరులు, రామలక్ష్మణు లనబడువారు,

శరణ్యౌ సర్వ సత్త్వానాం శ్రేష్ఠౌ సర్వ ధనుష్మతామ్ ।
రక్షఃకుల నిహంతారౌ త్రాయేతాం నో రఘూత్తమౌ ॥

సర్వులకు శరణ్యులు, అందరు ధనుర్ధారులలోకి శ్రేష్ఠులు, రాక్షసకులాంతకులు అగు రఘుకులశ్రేష్ఠులు మమ్ము రక్షించుగాక!

అత్త సజ్జ ధనుషా విషుస్పృశావక్షయాశుగనిషఙ్గ సఙ్గినౌ ।
రక్షణాయ మమ రామలక్ష్మణా వగ్రతః పథి సదైవ గచ్ఛతామ్ ॥

ధనుస్సును, అక్షయములగు బాణములను కలిగిన అంబులపొదియు, ధరించిన రామలక్ష్మణులు, రక్షణార్థం, మార్గమున సదా నాకు ముందు గమించెదరు గాక!

సంనద్ధః కవచీ ఖడ్గీ చాపబాణధరో యువా ।
గచ్ఛన్మనోరథాన్నశ్చ రామః పాతు సలక్ష్మణః ॥

కవచమును, ఖడ్గమును, ధనుర్బాణములను ధరించి సదా సన్నద్ధుడై ఉండెడి శ్రీరాముడు లక్ష్మణసహితుడై ముందు పోవుచు నా కోరికను తీర్చెదరు గాక!

రామో దాశరథి శ్శూరో లక్ష్మణానుచరో బలీ ।
కాకుత్స్థః పురుషః పూర్ణః కౌసల్యేయో రఘూత్తమః ॥

సర్వులయందు రమించు రాముడు, దశరథనందనుడు, శూరుడు, లక్ష్మణునకు అనుచరుడు, బలవంతుడు, కాకుత్స్థుని వంశజుడు, పరమ పురుషుడు, పూర్ణరూపుడు, కౌసల్యాతనయుడు, రఘూత్తముడు,

వేదాంత వేద్యో యజ్ఞేశః పురాణ పురుషోత్తమః ।
జానకీవల్లభః శ్రీమానప్రమేయ పరాక్రమః ॥

వేదాంతవేద్యుడు, యజ్ఞేశుడు, సనాతనుడు, పురాణపురుషుడు, సీతాపతి, సంపన్నుడు, అప్రమేయుడు, పరాక్రమవంతుడు

ఇత్యేతాని జపన్నిత్యం మద్భక్తః శ్రద్ధయాన్వితః ।
అశ్వమేధాధికం పుణ్యం సంప్రాప్నోతి న సంశయః ॥

ఈవిధంగా అనునిత్యము, శ్రద్ధతో కూడి జపించు నా భక్తుడు, అశ్వమేధ యజ్ఞము కంటె అధికపుణ్యమును పొందుననుటలో సందేహము లేదు.

రామం దూర్వాదల శ్యామం పద్మాక్షం పీతవాసనమ్ ।
స్తువంతి నామభిర్దివ్యై ర్న తే సంసారిణో నరాః ॥

రాముడు, దూర్వాపత్రము వలె శ్యామవర్ణదేహుడు, కమలములవంటి కన్నులు గలవాడు, పీతాంబరధారి - ఇటువంటి దివ్యమైన నామములలో నన్ను స్తుతించువారు సంసార కూపమున బడరు.

రామం లక్ష్మణ పూర్వజం రఘువరం సీతాపతిం సుందరం ।
కాకుత్స్థం కరుణార్ణవం గుణనిధిం విప్రప్రియం ధార్మికమ్ ॥
రాజేంద్రం సత్యసంధం దశరథ తనయం శ్యామలం శాంతమూర్తిం
వందే లోకాభిరామం రఘుకుల తిలకం రాఘవం రావణారిమ్ ॥

లక్ష్మణుని సోదరుడు, రఘుశ్రేష్ఠుడు, జానకీపతి, సుందర స్వరూపుడు, కాకుత్స్థ వంశజుడు, కృపాసాగరుడు, సద్గుణ సంపన్నుడు, జ్ఞానులకు ప్రియుడు, ధర్మస్వరూపుడు, రాజాధిరాజు, సత్యవ్రతుడు, దాశరథి, నీలివర్ణము కలవాడు, శాంతమూర్తి, లోకాభిరాముడు, రఘువంశోత్తముడు, రఘునందనుడు, రావణాంతకుడు అయిన శ్రీరామునకు వందనములు.

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥

శుభకరుడు, చంద్రునివలె చల్లని దృష్టి గలవాడు, సృష్టికర్త, రఘునాథుడు, జగత్ప్రభువు, సీతాపతి యైన శ్రీరామచంద్రునకు నమస్కారము.

శ్రీరామ రామ రఘునందన రామ రామ
శ్రీరామ రామ భరతాగ్రజ రామ రామ ।
శ్రీరామ రామ రణకర్కశ రామ రామ
శ్రీరామ రామ శరణం భవ రామ రామ ॥

శ్రీరామా! రఘునందనా! శ్రీరామా! భరతాగ్రజా! శ్రీరామా! రణరంగమున తీక్ష్ణమైన వాడా! రామా! కరుణించు!

శ్రీరామచంద్ర చరణౌ మనసా స్మరామి
శ్రీరామచంద్ర చరణౌ వచసా గృణామి ।
శ్రీరామచంద్ర చరణౌ శిరసా నమామి
శ్రీరామచంద్ర చరణౌ శరణం ప్రపద్యే ॥

శ్రీరామచంద్రుని చరణములను మనసుతో స్మరిస్తున్నాను. శ్రీరామచంద్రుని చరణములను వాక్కుతో వర్ణిస్తున్నాను. శ్రీరామచంద్రుని చరణములను శిరస్సుతో నమస్కరిస్తున్నాను. శ్రీరామచంద్రుని చరణములను శరణు పొందుచున్నాను.

మాతా రామో మత్పితా రామచంద్రః
స్వామీ రామో మత్సఖా రామచంద్రః ।
సర్వస్వం మే రామచంద్రో దయాళుః
నాన్యం జానే నైవ జానే న జానే ॥

నా తల్లి రాముడే. నా తండ్రియు రామచంద్రుడే. రాముడే నాకు ప్రభువు. నా సఖుడు కూడ రాముడే. నాకు సర్వస్వము రామచంద్రుడే. ఇతరమైన దేదియు నాకు తెలియదు. తెలియదు. ముమ్మాటికీ తెలియదు.

దక్షిణే లక్ష్మణో యస్య వామే చ జనకాత్మజా ।
పురతో మారుతి ర్యస్య తం వందే రఘునందనమ్ ॥

కుడివైపున లక్ష్మణునితోను, వామభాగమున జానకీతోను, ఎదుట గల ఆంజనేయునితోను భాసించుచున్న రఘునందనునకు నమస్కారము.

లోకాభిరామం రణరఙ్గధీరం
రాజీవనేత్రం రఘువంశనాథమ్ ।
కారుణ్యరూపం కరుణాకరం తం
శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే ॥

లోకమునకు ఆనందదాయకుడు, రణరంగ ధీరుడు, పద్మనేత్రుడు, రఘువంశమునకు ప్రభువు, దయాస్వరూపుడు, కరుణాకరుడు అయిన శ్రీరామచంద్రుని శరణు వేడుచున్నాను.

మనోజవం మారుత తుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శరణం ప్రపద్యే ॥

మనస్సువలె చురుకైనవాడు, వాయువును బోలిన వేగవంతుడు, ఇంద్రియజయుడు, బుద్ధిమంతులలో గొప్పవాడు, పవనసుతుడు, వానర సమూహమున ప్రముఖుడు, శ్రీరాముని దూతయైన హనుమంతుని శరణు వేడుచున్నాను.

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్ ।
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥

కవితాశాఖల పైనెక్కి 'రామ', 'రామ' అని తియ్యని పలుకులను పలుకుచున్న వాల్మీకి కవికోకిలకు వందనములు.

ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥

ఆపదలను అంతమొందించువాడు, సకల సంపదలను అనుగ్రహించువాడు, లోకమునకు ఆనందము నందించు శ్రీరామునకు పదే పదే నమస్కరించుచున్నాను.

భర్జనం భవబీజానా మర్జనం సుఖసంపదామ్ ।
తర్జనం యమదూతానాం రామరామేతి గర్జనమ్ ॥

'రామ' 'రామ' అను గర్జనము సంసారకారణమైన బీజములను వేయించి నిర్వీర్యమొనర్చునది, సుఖ సంపదలను అనుగ్రహించునది, యమదూతలను తరిమిగొట్టునది అయి ఉన్నది.

రామో రాజమణి స్సదా విజయతే రామం రమేశం భజే
రామేణాభిహతా నిశాచర చమూః రామాయ తస్మై నమః ।
రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య దాసోఽస్మ్యహం
రామే చిత్తలయః సదా భవతు మే భో రామ మా ముద్ధర ॥

రాజులలో ఉన్నతుడైన శ్రీరాముడు సదా జయించును. అట్టి రమాప్రభువైన శ్రీరాముని భజింతును. శ్రీరాముని కారణముగ నిశాచర సమూహములు నశించినవి. అట్టి రాముని నమస్కరింతును. శ్రీరాముని కంటె పరమమైన దేదియును లేదు. అట్టి రామునకు నేను దాసుడను. రాముని యందే నా చిత్తము లీనమగు గాక! ఓ రామా! నన్ను ఉద్ధరించు.

రామ రామేతి రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥

పరమశివుడు పలుకుచున్నాడు: సుందర వదనముగల ఓ పార్వతీ! నేను 'రామ' 'రామ' 'రామ' అని సదా మనోహరమైన రామనామము నందే రమించుచున్నాను. ఆ రామనామము వేయి భగవన్నామములతో సమానము.

గాయత్రీ రామాయణము

సంస్కృత భాషలో మొదటి అక్షరము 'అ' కాగా, చివరి అక్షరము 'హ' అగుటవలన ఈ రెండు అక్షరములను పలికి, పెదవిమూయగనే "మ్" అను శబ్దము కదిలి "అహమ్" పదము స్ఫురిస్తుంది. "అహమ్" అనగా నేను. మన దేహముతో సహా తెలియబడు సర్వస్వము "ఇదం" పదార్థము కాగా, ద్రష్టయైన ఆత్మ "అహం" అని పిలువబడినది. సర్వ అక్షర సంపుటి ద్వారా తెలియ వచ్చునది, తెలియదగినది అక్షర పరబ్రహ్మయైన ఆత్మయే నని అవగత మవుతోంది.

ఆత్మయే భగవానుడు. **"రసోవైసః"** భగవానుడు రసస్వరూపుడు. భగవానుడు రసస్వరూపుడైనపుడు ఆయన చరితము కూడా రసభరితమే అయి యుండాలి. అందుచేత భగవానుడైన శ్రీరామచంద్రుని దివ్యగాథను రమణీయముగా తెలిపే రామాయణకావ్యము రసస్వరూపమై రంజిల్లుతోంది.

శ్రీమద్రామాయణ రచన భగవత్కృపచే అప్రయత్నముగా వాల్మీకి మునిపుంగవుని హృదయశిఖరము నుండి జాలువారినది. రామాయణ ఆరంభము **"తపః"** అను పదముచే కదులుచున్నది. తపశ్శాలు రైనవారే రామాయణ రహస్యములను దర్శించి అనుభవించగలరు.

శ్రీమద్రామాయణము గాయత్రీ మంత్రరూపమై ఉంది. గాయత్రీ దివ్యమంత్రమునకు నడిచిన విపుల వ్యాఖ్యానమే రామాయణ దివ్యగాథ అని మహాత్ములు అభిప్రాయపడ్డారు.

శ్రీ మద్రామాయణములో ఇరవై నాలుగువేల శ్లోకము లున్నాయి. వీటిని ఇరవై నాలుగు భాగములుగా విభజిస్తే ఒక్కొక్కభాగము సహస్ర శ్లోకములను కల్గియుంటుంది. ప్రతిసహస్రము మొదలిడునపుడు ప్రథమ శ్లోకము వరుసక్రమముగా గాయత్రీ మంత్ర అక్షరములతో కదులుతుంది. ఇరవై నాలుగువేల శ్లోకములకు గాయత్రీమంత్రము లోని ఇరవై నాలుగు అక్షరములు వరుస క్రమముగా గోచరించి హృదయములను స్పందింప జేస్తాయి.

'తత్సవితు ర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్'

గాయత్రీ మంత్రములోని ఒక్కొక్క అక్షరానికి శ్రీమద్రామాయణంలోని వేయి శ్లోకాలు వ్యాఖ్యాన రూపములో వెలువడి వున్నాయి. గాయత్రీ మంత్రములోని ఇరవై నాలుగు అక్షరములు ఆరంభముగా కదిలే శ్లోకములే "గాయత్రీ రామాయణ" మని ప్రసిద్ధిగాంచి యున్నది.

గాయత్రీ రామాయణము

1. తపః స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరం
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్ (1-1-1)

సదా తపస్స్వాధ్యాయముల యందు రమించువాడు, వాక్చతురత గలవారిలో శ్రేష్ఠుడు, మునిశ్రేష్ఠుడు అయిన నారదమహర్షిని వాల్మీకిమహర్షి ప్రశ్నించాడు.

2. స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందన:
ఋషిభి: పూజిత స్తత్ర యథేన్ద్రో విజయే పురా (1-30-24)

యజ్ఞ వినాశకారులైన రాక్షసుల నందరిని రఘునందనుడు సంహరించిన పిదప, రాక్షసులను సంహరించిన ఇంద్రుని గతములో పూజించిన విధముగ ఋషులు శ్రీరామచంద్రుని పూజించారు.

3. విశ్వామిత్ర: స ధర్మాత్మా శ్రుత్వా జనక భాషితమ్
వత్స రామ ధను: పశ్య ఇతి రాఘవ మబ్రవీత్ (1-67-12)

జనకమహారాజు పలుకులను విని విశ్వామిత్రమహర్షి శ్రీరామునితో "నాయనా! రామచంద్రా! ఈ ధనుస్సును వీక్షించు" అన్నాడు.

4. తుష్టా వాస్య తథా వంశం సుమన్త్ర: స విశాంపతే:
శయనీయం నరేంద్రస్య తదా సాద్య వ్యతిష్ఠత (2-15-19)

మహారాజుగారి శయనాగారం వరకు సుమంత్రుడు వెళ్ళి, అతని వంశాన్ని గూర్చి అక్కడ శ్లాఘించాడు.

5. వనవాసం హి సంఖ్యాయ వాసాంస్యా భరణాని చ
భర్తార మనుగచ్ఛం త్యై సీతాయై శ్వశురో దదౌ (2-40-14)

వనవాస రోజులను లెక్కించుకొంటూ పతి వెంట నడుస్తున్న జానకికి మామగారు వస్త్రములను, ఆభరణములను ఇచ్చారు.

6. రాజా సత్యం చ ధర్మ శ్చ రాజా కులవతాం కులమ్
రాజా మాతా పితాచైవ రాజాహిత కరో నృణామ్ (2-67-34)

రాజు సత్యధర్మములు మూర్తీభవించిన అవతారము. మానవులలో ఉన్నత ప్రమాణ వర్ణయుతుడు. జననీజనక సమానుడు. సర్వులకు హితమొనరించువాడు.

7. నిరీక్ష్య సుముహూర్తం తు దదర్శ భరతో మునిమ్
ఉటజే రామమాసీనం జటామణ్డల ధారిణమ్ (2-99-55)

నిరీక్షిస్తున్న ఆ శుభఘడియలో మునిపుంగవుని లాగా గోచరించే భరతుడు జటాధారి యైన శ్రీరామచంద్రుని పర్ణశాలలో దర్శించాడు.

8. యది బుద్ధి: కృతాద్రష్టు మగస్త్యం తం మహామునిమ్
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహామతే (3-11-43)

ఓ మహితాత్మా! మహాముని యైన అగస్త్యమహర్షిని దర్శించు అభిప్రాయముంటే నేడే పయనించుటకు సిద్ధపడు.

9. భరత స్యార్య పుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో
మృగరూప మిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి (3-43-18)

ప్రభూ! దివ్యమై గోచరించే ఈ మృగము భరతునికి, మీకు, అత్తలకు మరియు నాకు ఆశ్చర్యమును కల్గించేదియై ఉన్నది.

10. గచ్ఛ శీఘ్రమితో వీర సుగ్రీవం తం మహాబలమ్
వయస్యం తం కురు క్షిప్రమితో గత్వాద్య రాఘవ (3-72-17)

ఓ రాఘవా! నీవు వెంటనే మహాబల సంపన్నుడైన సుగ్రీవుని వద్దకు వెళ్ళి, అతనితో సఖ్యము చేసుకో.

11. దేశకాలౌ భజస్వాద్య క్షమమాణ: ప్రియాప్రియే
సుఖదు:ఖ సహ: కాలే సుగ్రీవ వశగో భవ (4-22-20)

దేశకాలాదులను దృష్టిలో ఉంచుకొని, ప్రియాప్రియములను సమముగ వీక్షిస్తూ, సుఖదు:ఖములను సహిస్తూ సుగ్రీవుని అధీనములో ఉండు.

12. వన్ద్యా స్తే చ తపస్సిద్ధా స్తపసా వీతకల్మషా:
ప్రష్టవ్యా చైవ సీతాయా: ప్రవృత్తిర్వినయాన్వితై: (4-43-32&33)

కల్మషరహితులు, సిద్ధపురుషులు, తపశ్శాలురు ఐన మహితాత్ములకు వందన మొనరించి ఆ తరువాత సీత సమాచారమును గూర్చి నమ్రతతో అడగాలి.

13. స నిర్జిత్య పురీం లంకాం శ్రేష్ఠాం తాం కామరూపిణీమ్
విక్రమేణ మహాతేజా హనుమాన్ మారుతాత్మజ: (5-4-1)

మారుతాత్మజుడు, కపివర్యుడు, మహాతేజస్సంపన్నుడును అయిన హనుమంతుడు కామరూపిణి యైన లంకను జయించాడు.

14. ధన్యా: దేవా: స గంధర్వా: సిద్ధాశ్చ పరమర్షయ:
మమ పశ్యన్తి యే నాథం రామం రాజీవ లోచనమ్ (5-26-39)

నా నాథుడు, రాజీవలోచనుడు అయిన శ్రీరామచంద్రుని ఎవ్వరయితే దర్శిస్తున్నారో అట్టి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ధన్యజీవులు.

15. మంగళాభి ముఖీ తస్య సా తదాఽఽసీ న్మహాకపే:
ఉపతస్థే విశాలాక్షీ ప్రయత హవ్యవాహనమ్ (5-53-26&27)

కపివర్యుడైన వాయునందనునికి శుభము కలగాలని విశాలాక్షియైన జానకీదేవి అగ్నిదేవుని ప్రార్థించింది.

16. హితం మహార్థం మృదుహేతు సంహితం
అతీతకాలా యతి సంప్రతి క్షమమ్
నిశమ్య తద్వాక్య ముపస్థిత జ్వర:
ప్రసంగవా నుత్తర మేత దబ్రవీత్ (6-10-27)

సర్వకాలములకు మేలు నొనగూర్చునది, గొప్ప భావయుక్త మైనది, కోమలతర్క యుక్తులతో గుబాళిస్తున్న విభీషణుని దివ్యవచనాలను ఆలకించిన రావణుడు క్రోధ జ్వర పీడితుడై ఇలా సమాధాన మిచ్చాడు.

17. ధర్మాత్మా రాక్షసశ్రేష్ఠ: సంప్రాప్తోఽయం విభీషణ:
లంకైశ్వర్య మిదం శ్రీమాన్ ధ్రువం ప్రాప్నో త్యకంటకమ్ (6-41-68)

రాక్షస శ్రేష్ఠుడు, ధర్మాత్ముడు అయిన విభీషణుడు అరుదెంచాడు. దివ్యమైన శత్రు రహితమైన లంకారాజ్యాన్ని నిస్సందేహముగ అతడు పాలించగలడు.

18. యోవజ్ర పాతాశాని సన్నిపాతాన్న
చక్షుభేనాపి చచాలరాజా
సరామ బాణాభిహతో భృశార్తశ్చ
చాలా చాపం చ ముమో చ వీర: (6-59-139)

ఇంద్రుని యొక్క వజ్రాయుధానికి గాని, అగ్ని ప్రహారానికి గాని చలించని మహావీరుడైన రావణాసురుడు రామబాణముల తాకిడికి తట్టుకోలేక దు:ఖిస్తూ మూర్ఛపోయాడు.

19. యస్య విక్రమ మాసాద్య రాక్షసా నిధనం గతా:
తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయమ్ (6-72-11)

ఎవని అద్భుత పరాక్రముతో రాక్షసులు గతించారో అటువంటి నిష్కల్మష వీరుడైన శ్రీరాముడు సాక్షాత్తు నారాయణుడే.

20. వ తే దదృశిరే రామం దహన్త మరి వాహినీమ్
మోహితా: పరమాస్త్రేణ గాంధర్వేణ మహాత్మనా (6-93-26)

రాముడు ప్రయోగించిన దివ్యమైన గాంధర్వాస్త్రముతో మోహితులైన రాక్షసులు తమ సైన్యాన్ని నాశనము చేసే శ్రీరామచంద్రుని గాంచలేక పోయారు.

21. ప్రణమ్య దేవతాభ్యశ్య బ్రాహ్మణేభ్యశ్చ మైథిలీ
బద్ధాంజలి పుటాచేద మువాచాగ్ని సమీపత: (6-116-24)

దేవతలకు, ద్విజులకు నమస్కరించి, అగ్నిని సమీపించి, చేతులు జోడించి సీత ఇలా పలికింది.

22. చలనా త్పర్వత స్యైవ గణాదేవస్య కమ్పితా:
చ చాల పార్వతీ చాపి తదా శ్లిష్టా మహేశ్వరమ్ (7-16-26)

పర్వతము చలించగనే దేవగణమంతా కంపించింది. పార్వతి కూడా తడబడినదియై మహేశ్వరుని కౌగలించుకొన్నది.

23. దారా: పుత్రా: పురం రాష్ట్రం భోగాచ్ఛాదన భోజనమ్
సర్వమే వావిభక్తం నౌ భవిష్యతి హరీశ్వర (7-34-41)

ఓ కపినాథా! స్త్రీ, పుత్ర, నగర, రాష్ట్ర, భోగ, వస్త్ర, భోజనాదులన్నీ మన ఇరువురి సంపత్తి కాగలవు.

24. యామేవ రాత్రిం శత్రుఘ్ను: పర్ణశాలాం సమావిశత్
తామేవ రాత్రిం సీతాపి ప్రసూతా దారకద్వయమ్ (7-65-1)

వాల్మీకిమహర్షి ఆశ్రమంలో శత్రుఘ్నుడు ప్రవేశించిన నాటి రాత్రియే సీత ఇరువురు పుత్రులను ప్రసవించినది.

శ్రీరామ గాయత్రి

ఓం దాశరథాయ విద్మహే ।
సీతా వల్లభాయ ధీమహి ।
త న్నో రామచంద్ర: ప్రచోదయాత్ ।

దశరథనందనుని ఉపాసించుచున్నాము.
జానకీపతిని ధ్యానించుచున్నాము.
ఆ రామచంద్రుడు మమ్ము సన్మార్గమున ప్రేరేపించుగాక.

శ్రీరామ అష్టోత్తరశత నామావళి

1. ఓం శ్రీరామాయ నమః - సర్వులలో రమించు దివ్య చైతన్యమునకు నమస్కారము
2. ఓం రామభద్రాయ నమః - శుభకరుడైన శ్రీరామచంద్రునకు నమస్కారము
3. ఓం రామచంద్రాయ నమః - చంద్రునివలె మనోహరుడైన శ్రీరామునకు నమస్కారము
4. ఓం శాశ్వతాయ నమః - అనంతుడైన వానికి నమస్కారము
5. ఓం రాజీవలోచనాయ నమః - కమలముల వంటి కన్నులు గలిగిన వానికి నమస్కారము
6. ఓం శ్రీమాన్ రాజేంద్రాయ నమః - లక్ష్మీసమేతుడైన రాజేంద్రునకు నమస్కారము
7. ఓం రఘుపుంగవాయ నమః - రఘుకులశ్రేష్ఠునకు నమస్కారము
8. ఓం జానకీ వల్లభాయ నమః - సీతాదేవికి ప్రియమైన వానికి నమస్కారము
9. ఓం జైత్రాయ నమః - విజయునకు నమస్కారము
10. ఓం జితామిత్రాయ నమః - శత్రువులను జయించువానికి నమస్కారము
11. ఓం జనార్దనాయ నమః - సర్వులకు ఆనందము నందించువానికి నమస్కారము
12. ఓం విశ్వామిత్రప్రియాయ నమః - విశ్వామిత్రునకు ప్రియుడైన వానికి నమస్కారము
13. ఓం దాంతాయ నమః - ఇంద్రియములను జయించిన వానికి నమస్కారము
14. ఓం శరణ్యత్రాణ తత్పరాయ నమః - శరణుకోరిన వారిని రక్షించుట యందు ఉత్సాహము గలవానికి నమస్కారము
15. ఓం వాలి ప్రమథనాయ నమః - వాలిని వధించినవానికి నమస్కారము
16. ఓం వాగ్మినే నమః - గొప్ప వాక్చాతుర్యము గలిగిన వానికి నమస్కారము
17. ఓం సత్యవాచే నమః - సత్యమునే పలుకువానికి నమస్కారము
18. ఓం సత్యవిక్రమాయ నమః - సత్యభాషణములో పరాక్రమవంతుడైన వానికి నమస్కారము
19. ఓం సత్యవ్రతాయ నమః - సత్యమునే పాలించువానికి నమస్కారము
20. ఓం వ్రతఫలాయ నమః - సర్వవ్రతములకు ఫలమైన వానికి నమస్కారము
21. ఓం సదా హనుమదాశ్రితాయ నమః - హనుమంతునిచే నిరంతరము ఆశ్రయింపబడిన వానికి నమస్కారము

22. ఓం కౌసల్యేయాయ నమః - కౌసల్యానందనునకు నమస్కారము
23. ఓం ఖరధ్వంసినే నమః - ఖరుని హరించిన వానికి నమస్కారము
24. ఓం విరాధవధ పండితాయ నమః - విరాధుని వధించుటలో చాతుర్యమును చూపిన వానికి నమస్కారము
25. ఓం విభీషణ పరిత్రాత్రే నమః - విభీషణుని ఉద్ధరించిన వానికి నమస్కారము
26. ఓం దశగ్రీవ శిరోహరాయ నమః - దశకంఠుని వధించిన వానికి నమస్కారము
27. ఓం సప్తతాళ ప్రభేత్రే నమః - ఒకే బాణముతో ఏడు సాలవృక్షములను ఖండించిన వానికి నమస్కారము
28. ఓం హరకోదండ ఖండనాయ నమః - శివధనుస్సును విరిచిన వానికి నమస్కారము
29. ఓం జామదగ్న్య మహాదర్ప దలనాయ నమః - పరశురాముని గర్వము అణచిన వానికి నమస్కారము
30. ఓం తాటకాంతకాయ నమః - తాటకను వధించిన వానికి నమస్కారము
31. ఓం వేదాంతపారాయ నమః - వేదాంతవేద్యునకు నమస్కారము
32. ఓం వేదాత్మనే నమః - వేదస్వరూపునకు నమస్కారము
33. ఓం భవబంధైక భేషజాయ నమః - సంసారవ్యాధిని నిర్మూలించు వైద్యునకు నమస్కారము
34. ఓం దూషణత్రిశిరో హంత్రే నమః - దూషణుని, త్రిశిరుని చంపిన వానికి నమస్కారము
35. ఓం త్రిమూర్తయే నమః - బ్రహ్మవిష్ణు మహేశ్వర స్వరూపునకు నమస్కారము
36. ఓం త్రిగుణాత్మకాయ నమః - త్రిగుణములకు ఆధారభూతుడైన వానికి నమస్కారము
37. ఓం త్రయీ నమః - ముల్లోకములకు ఆశ్రయమైన వానికి నమస్కారము
38. ఓం త్రివిక్రమాయ నమః - మూడడుగులలో ముల్లోకములు నిండిన వానికి నమస్కారము
39. ఓం త్రిలోకాత్మనే నమః - ముల్లోకములకు ఆత్మయైన వానికి నమస్కారము
40. ఓం పుణ్యచారిత్ర కీర్తనాయ నమః - పుణ్యచరితుడని కీర్తింపబడిన వానికి నమస్కారము
41. ఓం త్రిలోక రక్షకాయ నమః - ముల్లోకములను సంరక్షించు వానికి నమస్కారము
42. ఓం ధన్వినే నమః - ధనుర్ధారికి నమస్కారము
43. ఓం దండకారణ్య వర్తనాయ నమః - దండకారణ్యమున చరించు వానికి నమస్కారము
44. ఓం అహల్యాశాప శమనాయ నమః - అహల్యను శాపవిముక్తురాలిని గావించిన వానికి నమస్కారము

45. ఓం పితృభక్తాయ నమః - పితృభక్తి పరాయణునకు నమస్కారము
46. ఓం వరప్రదాయ నమః - ఆశ్రితులకు వరముల ననుగ్రహించు వానికి నమస్కారము
47. ఓం జితేంద్రియాయ నమః - ఇంద్రియములను జయించిన వానికి నమస్కారము
48. ఓం జితక్రోధాయ నమః - క్రోధమును జయించిన వానికి నమస్కారము
49. ఓం జితలోభాయ నమః - లోభమును జయించిన వానికి నమస్కారము
50. ఓం జగద్గురవే నమః - జగత్తులోని అంధకారమును నిరోధించు వానికి నమస్కారము
51. ఓం ఋక్షవానర సంఘాతినే నమః - వానర భల్లూకములను సంఘటితపరచిన వానికి నమస్కారము
52. ఓం చిత్రకూట సమాశ్రయాయ నమః - చిత్రకూటమున వసించువానికి నమస్కారము
53. ఓం జయంతత్రాణ వరదాయ నమః - జయంతుని రక్షించుటకు వరములొసగిన వానికి నమస్కారము
54. ఓం సుమిత్రాపుత్ర సేవితాయ నమః - లక్ష్మణునిచే సేవింపబడు వానికి నమస్కారము
55. ఓం సర్వదేవాధిదేవాయ నమః - అందరు దేవతలకు అధిదేవుడైన వానికి నమస్కారము
56. ఓం మృత వానర జీవితాయ నమః - చనిపోయిన వానరులను పునర్జీవితులను చేసిన వానికి నమస్కారము
57. ఓం మయామారీచ హంత్రే నమః - మాయారూపుడైన మారీచుని వధించినవానికి నమస్కారము
58. ఓం మహాభాగాయ నమః - గొప్ప సంపన్నవంతునికి నమస్కారము
59. ఓం మహాభుజాయ నమః - శక్తివంతమైన భుజములు గలవానికి నమస్కారము
60. ఓం సర్వదేవ స్తుతాయ నమః - సర్వదేవతల చేత ప్రస్తుతింపబడు వానికి నమస్కారము
61. ఓం సౌమ్యాయ నమః - ప్రసన్నుడైన వానికి నమస్కారము
62. ఓం బ్రహ్మణ్యాయ నమః - బ్రహ్మనిష్ఠులను రంజింపజేయు వానికి నమస్కారము
63. ఓం మునిసత్తమాయ నమః - శ్రేష్ఠుడైన మునికి నమస్కారము
64. ఓం మహాయోగినే నమః - యోగస్వరూపుడు తానేయైన వానికి నమస్కారము
65. ఓం మహోదరాయ నమః - పరమ ఉదారస్వభావము గలవానికి నమస్కారము
66. ఓం సుగ్రీవస్థిర రాజ్యదాయ నమః - సుగ్రీవునకు శాశ్వతముగ రాజ్యమును అనుగ్రహించిన వానికి నమస్కారము

67. ఓం సర్వపుణ్యాధిక ఫలాయ నమః - సర్వపుణ్యములిచ్చు ఫలముకంటె అత్యధిక ఫలమైన వానికి నమస్కారము
68. ఓం స్మృత సర్వాఘ నాశనాయ నమః - స్మరించిన మాత్రముననే సర్వపాపములను హరించు వానికి నమస్కారము
69. ఓం ఆదిపురుషాయ నమః - సృష్టికి మూలకారణమైన వానికి నమస్కారము
70. ఓం మహా పురుషాయ నమః - ఉత్కృష్ట స్థానమును కలవానికి నమస్కారము
71. ఓం పరమ పురుషాయ నమః - ఉత్తమమైన పురుషునకు నమస్కారము
72. ఓం పుణ్యోదయాయ నమః - పుణ్యముచే లభించు వానికి నమస్కారము
73. ఓం మహాసారాయ నమః - గొప్ప శక్తిమంతునకు నమస్కారము
74. ఓం పురాణపురుషోత్తమాయ నమః - సనాతనుడైన ఉత్తమ పురుషునకు నమస్కారము
75. ఓం స్మిత వక్త్రాయ నమః - నగుమోము గలవానికి నమస్కారము
76. ఓం మితభాషిణే నమః - మితముగ మాట్లాడువానికి నమస్కారము
77. ఓం పూర్వభాషిణే నమః - మొదట తానే పలకరించువానికి నమస్కారము
78. ఓం రాఘవాయ నమః - రఘువంశీయునకు నమస్కారము
79. ఓం అనంతగుణ గంభీరాయ నమః - అనంత కళ్యాణగుణములతో సదా గంభీరముగ గోచరించు వానికి నమస్కారము
80. ఓం ధీరోదాత్త గుణోత్తమాయ నమః - ధీరోదాత్తుడై లోకోత్తర గుణములు గల్గిన వానికి నమస్కారము
81. ఓం మాయామానుష చరిత్రాయ నమః - తన అధీనంలోని మాయను ఆశ్రయించి మానవునిగ జీవించిన వానికి నమస్కారము
82. ఓం మహాదేవాది పూజితాయ నమః - ఈశ్వరాది దేవతలచే సదా పూజింపబడు వానికి నమస్కారము
83. ఓం సేతుకృతే నమః - జలధిపై వారధిని నిర్మించిన వానికి నమస్కారము
84. ఓం జితవారీశయే నమః - సముద్రుని జయించినవానికి నమస్కారము
85. ఓం సర్వతీర్థమయాయ నమః - సకల పుణ్యతీర్థ స్వరూపునకు నమస్కారము
86. ఓం హరయే నమః - పాపములను హరించు వానికి నమస్కారము
87. ఓం శ్యామాంగాయ నమః - నీలివర్ణముతో ప్రకాశించువానికి నమస్కారము
88. ఓం సుందరాయ నమః - సర్వ సౌందర్య సారభూతునకు నమస్కారము
89. ఓం శూరాయ నమః - మహా పరాక్రమవంతుడైన వానికి నమస్కారము
90. ఓం పీతవాససే నమః - పీతాంబరములు ధరించియుండువానికి నమస్కారము
91. ఓం ధనుర్ధరాయ నమః - సదా చేతియందు ధనుస్సును ధరించిన వానికి నమస్కారము

92. ఓం సర్వయజ్ఞాధిపాయ నమః - సర్వయజ్ఞములకు అధిపతియైన వానికి నమస్కారము
93. ఓం యజ్వనే నమః - యజ్ఞ స్వరూపునకు నమస్కారము
94. ఓం జరామరణ వర్జితాయ నమః - ముసలితనము, మరణము విడిచిన వానికి నమస్కారము
95. ఓం శివలింగ ప్రతిష్ఠాత్రే నమః - మంగళకరమైన శివలింగమును ప్రతిష్ఠించిన వానికి నమస్కారము
96. ఓం సర్వాపగుణ వర్జితాయ నమః - సమస్త పాపములనుండి విడిపడినవానికి నమస్కారము
97. ఓం పరమాత్మనే నమః - పరమాత్మ తానేయైన వానికి నమస్కారము
98. ఓం పరస్మైబ్రహ్మణే నమః - పరబ్రహ్మస్వరూపునికి నమస్కారము
99. ఓం సచ్చిదానంద విగ్రహాయ నమః - సత్స్వరూపము, చిత్స్వరూపము, ఆనంద స్వరూపము ఐనవానికి నమస్కారము
100. ఓం పరస్మై జ్యోతిషే నమః - పరంజ్యోతి యైనవానికి నమస్కారము
101. ఓం పరస్మై ధామ్నే నమః - మహోన్నత ధామమైన వానికి నమస్కారము
102. ఓం పరాకాశాయ నమః - చిదాకాశ రూపునకు నమస్కారము
103. ఓం పరాత్పరాయ నమః - పరమమునకు పరమైన వానికి నమస్కారము
104. ఓం పరేశాయ నమః - పరమేశ్వరుడు తానేయైన వానికి నమస్కారము
105. ఓం పారగాయ నమః - సర్వులకు పరమగతియైన వానికి నమస్కారము
106. ఓం పారాయ నమః - భవసాగరమును దాటించువానికి నమస్కారము
107. ఓం సర్వభూతాత్మకాయ నమః - సర్వభూతములయందు ప్రకాశించు వానికి నమస్కారము
108. ఓం శివాయ నమః - మంగళ స్వరూపుడైన శ్రీరామునకు నమస్కారము

సంక్షిప్త రామాయణము

జన్మాదౌ క్రతురక్షణం మునిపతే స్సాణో ర్ధనుర్భంజనం
వైదేహీ గ్రహణం పితుశ్చవచనా ద్ఘోరాటవీ గాహనమ్ ।
కోదండ గ్రహణం ఖరాది మథనం మాయామృగచ్ఛేదనం
బద్ధాబ్ధిక్రమణం దశాస్య నిధనం చైతద్ధి రామాయణమ్ ॥

శ్రీరామ జననము, విశ్వామిత్రుని యాగ సంరక్షణము, అహల్యా శాప విమోచనము, శివధనుర్భంగము, జానకీ కళ్యాణము, పితృవచనానుసారము అరణ్యవాసము, ధనుర్ధారియై ఖరాది అసురుల సంహారము, మాయలేడి నిధనము, అంభోధిపై వారధి నిర్మాణము, సముద్ర తరణము, రావణుని ప్రాణ హరణము - ఇదియే రామాయణము.

ఆదిత్యహృదయ నామావళి

1. ఓం రశ్మిమతే నమః - కిరణములు గలవానికి నమస్కారము
2. ఓం సముద్యతే నమః - ఉదయించు వానికి నమస్కారము
3. ఓం దేవాసుర నమస్కృతాయ నమః - దేవతలు, రాక్షసులచే నమస్కరింపబడు వానికి వందనము
4. ఓం వివస్వతే నమః - అన్య కాంతులను కప్పివేయు వానికి నమస్కారము
5. ఓం భాస్కరాయ నమః - ప్రకాశము నందించు వానికి నమస్కారము
6. ఓం భువనేశ్వరాయ నమః - లోకనాథునకు నమస్కారము
7. ఓం సర్వదేవాత్మకాయ నమః - సకల దేవతాస్వరూపునకు నమస్కారము
8. ఓం తేజస్వినే నమః - తేజోవంతునకు నమస్కారము.
9. ఓం రశ్మిభావనాయ నమః - కిరణప్రసారముచే లోకవ్యవహారములకు కారణమైన వానికి నమస్కారము
10. ఓం దేవాసురగణ లోకపాలాయ నమః - సుర, అసుర గణములను రక్షించు వానికి నమస్కారము
11. ఓం బ్రహ్మణే నమః - బ్రహ్మదేవుడైన వానికి నమస్కారము
12. ఓం విష్ణవే నమః - విష్ణురూపుడైన వానికి నమస్కారము
13. ఓం శివాయ నమః - మంగళకరుడైన వానికి నమస్కారము
14. ఓం స్కన్దాయ నమః - కుమారస్వామి యైనవానికి నమస్కారము
15. ఓం ప్రజాపతయే నమః - విశ్వనాథునకు నమస్కారము
16. ఓం మహేన్ద్రాయ నమః - మహేంద్రుడైన వానికి నమస్కారము
17. ఓం ధనదాయ నమః - కుబేరుడైన వానికి నమస్కారము
18. ఓం కాలాయ నమః - కాలస్వరూపుడైన వానికి నమస్కారము
19. ఓం యమాయ నమః - మృత్యుదేవుడైన వానికి నమస్కారము
20. ఓం సోమాయ నమః - చంద్రుడైన వానికి నమస్కారము
21. ఓం అపాంపతయే నమః - వరుణదేవుడైన వానికి నమస్కారము
22. ఓం పితృదేవతాయై నమః - పితృదేవతలు తానేయైన వానికి నమస్కారము
23. ఓం వసుమూర్తయే నమః - అష్టవసువులు తానేయైన వానికి నమస్కారము
24. ఓం సాధ్యమూర్తయే నమః - సాధ్యులు తానేయైన వానికి నమస్కారము
25. ఓం అశ్విమూర్తయే నమః - అశ్వినీదేవతలు తానేయైన వానికి నమస్కారము
26. ఓం మరున్మూర్తయే నమః - మరుత్తులు తానేయైన వానికి నమస్కారము
27. ఓం మనవే నమః - మనువు యైనవానికి నమస్కారము

28. ఓం వాయుమూర్తయే నమః - వాయురూపునకు నమస్కారము
29. ఓం వహ్నయే నమః - అగ్నిమూర్తికి నమస్కారము
30. ఓం ప్రజారూపాయ నమః - సర్వజనులు తానేయైన వానికి నమస్కారము
31. ఓం ప్రాణాయ నమః - ప్రాణరూపునకు నమస్కారము
32. ఓం ఋతుకర్త్రే నమః - షడృతువులకు కారకుడైన వానికి నమస్కారము
33. ఓం ప్రభాకరాయ నమః - ప్రకాశమును ప్రసాదించు వానికి నమస్కారము
34. ఓం ఆదిత్యాయ నమః - అదితి తనయునకు నమస్కారము
35. ఓం సవిత్రే నమః - సృష్టికర్తకు నమస్కారము
36. ఓం సూర్యాయ నమః - సర్వజీవులను కర్మలయందు ప్రేరేపించు వానికి నమస్కారము
37. ఓం ఖగాయ నమః - గగనసంచారకునకు నమస్కారము
38. ఓం పూష్ణే నమః - జగత్పోషకునకు నమస్కారము
39. ఓం గభస్తిమతే నమః - కిరణములు గలవానికి నమస్కారము
40. ఓం సువర్ణసదృశాయ నమః - బంగారు వర్ణముతో శోభించువానికి నమస్కారము
41. ఓం భానవే నమః - ప్రకాశించు వానికి నమస్కారము
42. ఓం హిరణ్యరేతసే నమః - బంగారమును రేతస్సుగా కలిగిన వానికి నమస్కారము
43. ఓం దివాకరాయ నమః - పగటికి కారణమైన వానికి నమస్కారము
44. ఓం హరిదశ్వాయ నమః - ఆకుపచ్చని అశ్వములు వాహనములుగ గలిగిన వానికి నమస్కారము
45. ఓం సహస్రార్చిషే నమః - అనంతమైన కిరణములు గలవానికి నమస్కారము
46. ఓం సప్తసప్తయే నమః - ఏడు అశ్వములను గలవానికి నమస్కారము
47. ఓం మరీచిమతే నమః - కిరణములు గలవానికి నమస్కారము
48. ఓం తిమిరోన్మథనాయ నమః - అంధకారమును అంతరింపజేయువానికి నమస్కారము
49. ఓం శంభవే నమః - సుఖకారకునకు నమస్కారము
50. ఓం త్వష్ట్రే నమః - స్వరూప సంహారకునకు నమస్కారము
51. ఓం మార్తాండకాయ నమః - ప్రళయానంతరము మరల జగత్తును సృజించు వానికి నమస్కారము
52. ఓం అంశుమతే నమః - కిరణములతో నిండిన వానికి నమస్కారము
53. ఓం హిరణ్యగర్భాయ నమః - త్రిమూర్త్యాత్మక స్వరూపునకు నమస్కారము
54. ఓం శిశిరాయ నమః - త్రివిధ తాపములను హరించి చల్లదనము నందించు వానికి నమస్కారము

55. ఓం తపనాయ నమః - వేడిని కలిగించు వానికి నమస్కారము
56. ఓం అహస్కరాయ నమః - దినకరునకు నమస్కారము
57. ఓం రవయే నమః - స్తవనీయునికి నమస్కారము
58. ఓం అగ్నిగర్భాయ నమః - అగ్నిని గర్భమున ధరించిన వానికి నమస్కారము
59. ఓం అదితేః పుత్రాయ నమః - అదితి పుత్రునకు నమస్కారము
60. ఓం శఙ్ఖాయ నమః - సాయం సమయమున శమించువానికి నమస్కారము
61. ఓం శిశిరనాశనాయ నమః - మంచును హరించు వానికి నమస్కారము
62. ఓం వ్యోమనాథాయ నమః - గగనమునకు ప్రభువైన వానికి నమస్కారము
63. ఓం తమోభేదినే నమః - చీకటిని ఛేదించు వానికి నమస్కారము
64. ఓం ఋగ్యజుః సామ పారగాయయ నమః - ఋగ్యజుస్సామ వేదములను గ్రహించిన వానికి నమస్కారము
65. ఓం ఘనవృష్టయే నమః - గొప్పగ వర్షించువానికి నమస్కారము
66. ఓం అపాం మిత్రాయ నమః - జలమునకు మిత్రుడైన వానికి నమస్కారము
67. ఓం విన్ధ్య వీథీ ప్లవంగమాయ నమః - గగనమార్గమున త్వరితముగ పయనించువానికి నమస్కారము
68. ఓం ఆతపినే నమః - తాపము గలవానికి నమస్కారము
69. ఓం మణ్డలినే నమః - మండలము గలవానికి నమస్కారము
70. ఓం మృత్యవే నమః - శత్రువుల పాలిటి మృత్యువునకు నమస్కారము
71. ఓం పిఙ్గలాయ నమః - ఎర్రని రంగు గలవానికి నమస్కారము
72. ఓం సర్వతాపనాయ నమః - సర్వులను తపింపజేయువానికి నమస్కారము
73. ఓం కవయే నమః - కవియైన వానికి నమస్కారము
74. ఓం విశ్వస్మై నమః - ప్రపంచమును నడుపువానికి నమస్కారము
75. ఓం మహాతేజసే నమః - గొప్ప ప్రకాశము గలవానికి నమస్కారము
76. ఓం రక్తాయ నమః - సర్వులయందు అనురక్తి గలవానికి నమస్కారము
77. ఓం సర్వభవోద్భవాయ నమః - అందరి పుట్టుకకు కారణమైన వానికి నమస్కారము
78. ఓం నక్షత్రగ్రహ తారాధిపాయ నమః - నక్షత్రములకు, గ్రహములకు, తారలకు ప్రభువైన వానికి నమస్కారము
79. ఓం విశ్వభావనాయ నమః - లోకములకు సృష్టికారణమైన వానికి నమస్కారము

80. ఓం తేజసామపి తేజస్వీ నమః - తేజస్సు లన్నింటిలోకి అత్యధిక తేజస్సు గలవానికి నమస్కారము

81. ఓం ద్వాదశాత్మనే నమః - పన్నెండు రూపములు గలవానికి నమస్కారము

82. ఓం పూర్వాయ గిరయే నమః - పూర్వగిరి రూపునకు నమస్కారము

83. ఓం పశ్చిమాద్రయే నమః - పశ్చిమగిరి స్వరూపునకు నమస్కారము

84. ఓం జ్యోగిర్గణానాం పతయే నమః - తారాగణములకు అధిపతికి నమస్కారము

85. ఓం దినాధిపతయే నమః - పగటికి ప్రభువునకు నమస్కారము

86. ఓం జయాయ నమః - జయము నసుగ్రహించువానికి నమస్కారము

87. ఓం జయభద్రాయ నమః - జయమును వృద్ధి చేయువానికి నమస్కారము

88. ఓం హర్యశ్వాయ నమః - ఆకుపచ్చని అశ్వములు గలవానికి నమస్కారము

89. ఓం సహస్రాంశయే నమః - వెయ్యి కిరణములు గల వానికి నమస్కారము

90. ఓం ఆదిత్యాయ నమః - ఆదిత్యునకు నమస్కారము

91. ఓం ఉగ్రాయ నమః - భయంకరరూపునకు నమస్కారము

92. ఓం వీరాయ నమః - వీరునకు నమస్కారము

93. ఓం సారంగాయ నమః - శీఘ్రముగ పయనించు వానికి నమస్కారము

94. ఓం పద్మప్రబోధాయ నమః - పద్మములను వికసింపజేయు వానికి నమస్కారము

95. ఓం ప్రచణ్డాయ నమః - తీక్షణమైన వానికి నమస్కారము

96. ఓం బ్రహ్మేశానాచ్యుతేశాయ నమః - బ్రహ్మ, మహేశ్వర, విష్ణు రూపునకు నమస్కారము

97. ఓం సూర్యాయ నమః - సూర్యదేవునకు నమస్కారము

98. ఓం ఆదిత్యవర్చసే నమః - ఆదిత్యరూపమైన ప్రకాశము గలవానికి నమస్కారము

99. ఓం భాస్వతే నమః - ప్రకాశస్వరూపునకు నమస్కారము

100. ఓం సర్వభక్షాయ నమః - సర్వమును హరించువానికి నమస్కారము

101. ఓం రౌద్ర వపుషే నమః - ప్రచండరూపునకు నమస్కారము

102. ఓం తమోఘ్నాయ నమః - అంధకారమును సంహరించు వానికి నమస్కారము

103. ఓం హిమఘ్నాయ నమః - మంచును నశింపజేయువానికి నమస్కారము

104. ఓం శత్రుఘ్నాయ నమః - శత్రు సంహారకునకు నమస్కారము

105. ఓం అమితాత్మనే నమః - పరిమితి లేనివానికి నమస్కారము

106. ఓం కృతఘ్నఘ్నాయ నమః - కృతఘ్నులను చంపువానికి నమస్కారము

107. ఓం దేవాయ నమః - ప్రకాశించు వానికి నమస్కారము

108. ఓం జ్యోతిషాం పతయే నమః - జ్యోతిస్సులకు ప్రభువైన వానికి నమస్కారము

109. ఓం తప్తచామీకరాభాయ నమః - కరిగిన బంగారము వలె వెలుగు వానికి నమస్కారము

110. ఓం హరయే నమః - లయకారకునకు నమస్కారము

111. ఓం విశ్వకర్మణే నమః - లోకములను సృజించిన వానికి నమస్కారము

112. ఓం తమోభినిఘ్నాయ నమః - చీకటిని అధిగమించిన వానికి నమస్కారము

113. ఓం రుచయే నమః - వెలుగు తానేయైన వానికి నమస్కారము

114. ఓం లోకసాక్షిణే నమః - లౌకిక వ్యవహారములకు సాక్షియైన వానికి నమస్కారము

115. ఓం భూతనాశాయ నమః - లోకములను నశింపజేయు వానికి నమస్కారము

116. ఓం భూతస్రష్టే నమః - లోకములను సృష్టించువానికి నమస్కారము

117. ఓం ప్రభవే నమః - విశ్వనాథునకు నమస్కారము

118. ఓం పాయతే నమః - తపింపజేయు వానికి నమస్కారము

119. ఓం తపతే నమః - ఎండింప చేయు వానికి నమస్కారము

120. ఓం వర్షతే నమః - వర్షించు వానికి నమస్కారము

121. ఓం సుప్తేషు జాగ్రతే నమః - నిద్రించువారిలోను మేలుకొనియుండు వానికి నమస్కారము

122. ఓం భూతేషు పరినిష్ఠితాయ నమః - సకల జీవులలో స్థితుడై ఉన్న వానికి నమస్కారము

123. ఓం అగ్నిహోత్రాయ నమః - అగ్నిహోత్రుడైన వానికి నమస్కారము

124. ఓం అగ్నిహోత్రి ఫలప్రదాయ నమః - అగ్నిహోత్ర మొనరించు వారికి ఫలమైన వానికి నమస్కారము

125. ఓం పరమ సమర్థాయ భగవతే బ్రహ్మణే నమః - పరమ సమర్థుడై, బ్రహ్మదేవుడైన సూర్యదేవునకు నమస్కారము



మంగళము

రామచంద్రాయ జనకరాజజా మనోహరాయ
మా మకాభీష్టదాయ మహిత మంగళం ॥
కోసలేంద్రాయమందహాస దాస పోషకాయ
వానవాది వినుత సద్వరద మంగళం ॥
లలితరత్నకుండ లాయ తులసీ వనమాలికాయ
జలజసదృశదేహాయ చారు మంగళం ॥
దేవకీ సుపుత్రాయ దేవదేవోత్తమాయ
భావజా గురువరాయ భవ్యమంగళం ॥
పుండరీకాక్షాయ పూర్ణచంద్ర వదనాయ
అండజ వాహనాయ అతులమంగళం ॥
విమలరూపాయ వివిధ వేదాంతవేద్యాయ
సుముఖచిత్త కామితాయ శుభదమంగళమ్ ॥